Rs. 20

గులాబి: దైవము కొరకు ప్రేమ

అఖిల భారత ఫత్రిక


జనవరి 2007



ఓ ప్రభూ! నీ కొరకు నా ఆకాంక్ష సువికసిత
సుపరిమళభరిత సుమధుర గులాబి రూపము
తాల్చినది. అర్పణభావముతో చేతులు జోడించి
వేడుకుంటున్నాను. పరిమితమైన నా అవగాహ
ననపరిమితము కావించుము. అస్పష్టజ్ఞానము
సుస్పష్టము కావింపుము. సూన్యమైన జడహృ
దయాన్ని ఉత్తేజపర్చుము. నా ప్రేమ వ్యర్థమై
నచో అర్థవంతము కావించు. అహంకార అజ్ఞా
నాంధకార భావములను దివ్యసత్యస్ఫూర్తితో
చైతన్యవంతము కావింపుమోయీ! దీని నభి
లషించే ఈ 'నేను' అసంఖ్యాక వ్యక్తులలో
మరుగుపడి ఉన్న అల్పుడను కాను సుమా!
ప్రభూ! తీవ్ర పరిపూర్ణప్రేరణతో ఈ పృధ్వీ
తలమంతా నిన్నే ఆకాంక్షిస్తున్నది, స్వామీ!

నా పరిపూర్ణ ధ్యానసమాధిలో అంతా
నిరవధికంగా సువిశాలమౌతున్నదయా! ఆహా!
ఎంతటి దేదీప్యమాన దివ్యప్రభావైభవంగా
సాక్షాత్కరిస్తున్నావు!

శ్రీమాత





గులాబీల ఆధ్యాత్మిక ప్రాముఖ్యత

దైవము కొరకు ప్రేమ

మొక్కల రాజ్యాధిపత్యంలో భగవదర్పణకై ఎన్నెన్ని సుందర సంభావ్యతల సమాహార తోరణాలు !

(గులాబీలు అన్ని రకాలు)

దైవము కొరకు సమగ్రప్రేమ

స్వచ్ఛ, పరిపూర్ణ, నిరంతర ప్రేమ – తిరుగు లేని ప్రేమార్పణ.

(ఏకాంత స్వచ్ఛధవళ గులాబీలు)

దైవము కొరకు ప్రేమగా పరివర్తన కాబడిన గాఢావేశములు

అవి వాస్తవమగు గాక! వాటి సమృద్ధితో (abundance) లోకము సంరక్షింపబడగలదు.

(మధ్యరకం నుంచి పెద్ద రక్తారుణ గులాబీల వరకు)

శ్రీమాత





చైత్యపురుషసాక్షాత్కారానికి ప్రాధమిక మూల సూత్రం వృక్షజీవితంలోనే నేను గమనించాను. నిజం చెప్పాలంటే చైత్యపురుష అభివ్యక్తీకరణే వికసిత పుష్పం.

ఉదాహరణకి గులాబీనే తీసుకోండి. దాని యొక్క గొప్ప, పరిపూర్ణ, రూప, వర్ణ, పరిమళ లావణ్యాలు చైత్యపురుష అనుగ్రహ ఆకాంక్ష లను వ్యక్తం చేస్తాయి. ఉషోదయాన వికసించే గులాబీని చూడండి. అది తన దివ్యమైన ఆత్మా ర్పణను ఆకాంక్షిస్తుంది.

శ్రీమాత





అర్పణ

దైవము ఇచ్చగించిన దానినే ఇచ్చగించుట అత్యున్నత వివేకము.

(మధ్యస్థపరిమాణం కలిగి గొప్ప పరిమళంతో కూడిన కెంపువన్నె గులాబిజత)

సమ్యక్ సమర్పణ:

దేనినీ విస్మరించని సర్వసమర్పణ.

(చిన్ని కెంపువన్నె గులాబీలు)



పరిపూర్ణ అర్పణ:

తాదాత్మ్యతకు అత్యావశ్యకమైన షరతు.

(మంచి సువాసనతో కూడిన పెద్ద గాఢ కెంపువన్నె గులాబిజత)



రాధ ప్రార్థన

తొలిచూపులోనే నిన్ను నా ప్రభువని, దైవమని తెలుసుకున్నాను. నా నివేదనను స్వీకరింపుమో స్వామీ!

నా ఆలోచనలు, ఆవేశములు, మనోహృదయభావనలు, సంవేదనలు, జీవన సర్వచలితచాలనములు, శరీరములో ప్రతిజీవకణము, ప్రతిరక్తబిందువు – సర్వస్వము – ఏమీ మినహాయింపులేక – అంతయు నీదే స్వామీ! నా నుంచి నీవేమి అభిలషిస్తావో అదే నేను కాగలను. జీవన్మరణములు, సుఖదుఃఖములు, ఖేదమోదములు – ఏది నా కొరకు నీవు నిర్ణయించినా దానిని నేను స్వాగతీకరిస్తాను. నీ వందించిన ఏ పురస్కారమైనా, అది నాకు దైవపురస్కారమే; బ్రహ్మానందదాయకమే –

శ్రీమాత



...గులాబి పుష్పించినపుడు అది తనకు తానుగా సహజసుందరంగా, సౌందర్యోల్లా సంగా సుగంధాలతో వికసిస్తుంది. తన మను గడయే తనకు ఆనందం. తన వ్యక్తీకరణలో అది లాభనష్టాలు బేరీజు వేయదు. తన ఉనికి, మనుగడలోనే తనకు స్వతస్సిద్ధమైన ఆనందం. మరి ఇక మనిషి విషయానికి వస్తే – ఏ కొద్దిమందో మినహా – మనసులో కద లికలు మెదలటం మొదలు – తన సౌందర్య, చతురతల నాధారంగా లబ్ధిపొందాలని ప్రాకు లాడతాడు. తుచ్ఛమైన ప్రతిఫలాల నాశిస్తాడు. అందువల్లనే చైత్యపురుష దృక్పథంలో మని షికంటే రోజా పువ్వు శ్రేష్ఠతరము.

...ఒక్క మెట్టు రోజా పుష్పంకన్న పైన ఉండి తెలివిగా, పువ్వు తనకు తానుగా ఏ ప్రేరణా లేకుండా ఎలా బ్రతుకుతుందో, నీవూ అలా బ్రతుకుతే, ఆ బ్రతుకు ఎంతో సౌందర్య వంతంగా ఉంటుంది. బ్రతుకు బ్రతకటం కోసమే – సహజంగా, ఆనందంగా, పువ్వులా – బ్రతకాలి.

శ్రీమాత





...గులాబీనే చూడండి. అది ఒక కేంద్రీకృత నిర తిశయ రూపసౌందర్యం. మానవసృష్టి కాదది. తనకు తానుగా ఏ ప్రేరణ లేకుండా వికసి స్తుంది. దర్శించగలగాలి కాని అందుకాక నిస్సందేహంగా దైవం ఎక్కడ ఉంది! రూపు దాల్చిన – 'తత్వమసి' 'That' అది. 'తత్.' – పేరుతో పిలువలేనిది. వర్ణనాతీతమైనది. సూత్రబద్ధం కానిది. అనుభవైక వేద్యమైనది. Something we can feel and can more and more become. అది శూన్యంలో వ్రేలా డుతూన్నది కాదు. There is nothing but That. ఉన్నది – 'అదే'.

శ్రీమాత



దివ్యగులాబీ

నీలాల నింగిపై సిందూరపురేక, దివ్యగులాబి,
సప్తపారవశ్యవర్ణాల మధురదీప్తి దివ్యానందగులాబి,
మానవ హృదయాకాశంలో ఎగసే అలౌకిక జ్వాల
నామరహిత ఉద్వేగ కుసుమం, మొగ్గతొడిగిన మార్మిక నామము

సత్యశిఖరాలపై పూచిన జ్ఞానప్రసూనం, దివ్యగులాబి,
పరమమైన స్వచ్ఛ అంతరంగ క్రాంతి దర్శనం, దివ్యగులాబి
ఓ నిగూఢరహశ్య స్వర్ణప్రసూనమా! మా భౌతికమానసము నీకు ఆవాసమగు గాక!
అనంతుని శీర్షాన భానుతేజమీవు, లోకాద్భుత దివ్యముహూర్తపు టతిథివి.

దివ్యగులాబీ, వింతకాంతులీనే అనంతుని మహనీయ శక్త్యారుణ ప్రతిమవు.
చీకటిని చొచ్చుకునిపోయే వజ్రకాంతి పరివేషంతో కూడిన, ఓ దివ్యశక్తీ!
మానవేచ్ఛను ప్రభాపూరం కావించు, చూపించు నీ అద్భుత రచనా విన్యాసం,
అమృతత్వానికి ప్రతిరూపం (నీవు) మానవులోని దివ్యవిస్ఫోటనం.

ఓ దివ్యగులాబీ! ఆకృతి దాల్చిన దివ్యకామన నీకు నీల లోహితం అమర్చింది,
ఓ దివ్యజీవన గులాబీ! వర్ణకాంతులీనే పూరేకులతో నిండిన రంగుల సితారువై
మధుర మంజుల మనోహరాకృతి కల్పించు ఈ దేహానికి.
భూ, నాక లోకాల వారధివై మమ్మ కడతేర్చు అమరులుగా.

అనంతుని బుగ్గలపై తారట్లాడే ఆనందపారవశ్య అరుణిమవు, దివ్యగులాబీ,
ప్రేమగులాబీ! చిక్కటి కెంపువు; రగిల్చే గాఢావేశమై
దుఃఖించే పరితాప ప్రకృతి హృదయపు లోతుల్లో నుంచి లేచిరా:
పృథ్వి, అద్భుతునికి (the wonderful) నిలయమై జీవితం ఆనందసమ్మోహనం కావించు.

శ్రీఅరవిందులు

ప్రేమ, అర్పణలకు ప్రతీకగా గులాబీ స్వీకరించబడుతుంది. ఇక్కడ మాత్రం ఆ భావంలో ఉపయోగించలేదు. పుష్పాలలోకల్లా తీవ్రతమమైనదిగా, దివ్యతీవ్రతలు – ప్రేమ, ఆనందకాంతులకు ప్రతీకగా ప్రయోగింపబడినది.

శ్రీఅరవిందులు

Registered: TN/PMG(CCR)/39/06-08
Licensed to post without prepayment:
WPP No. 35/06-08
Date of Publication: 1st day of every month. RNI: No. 23593/72

దైవాన్ని ఇతోధికంగా,
పరిపూర్ణంగా, సమగ్రంగా, నిరవధికంగా
ప్రేమించటమే సాధన.
ఆ ప్రేమ, తాదాత్మ్యత దరికి చేరుస్తుంది.


శ్రీమాత



References: Page 2: CWM 1: 264. Pages 5&8-9: The Spr. Sig. Of Flowers: 375-77, CWM 15: 224. Page 7: CWM 4: 166-67. Page 11: CWM 5: 242-43. Page 13: CWM 16: 342-43. Pages 14-15: SABCL 5: 584, FN: CWSA 27: 256. Page 16: Bulletin, Nov. 04: 35.
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society, Pondicherry - 605001; Editor: Karra Venkateswarlu, Printed by Amiyo Ranjan Ganguli at Sri Aurobindo Ashram Press, Pondicherry - 605001
 Pages 16+2 (supplement)

Rs. 15

1/2/07



అఖిల

అఖిల భారత పత్రిక, ఫిబ్రవరి 2007

విషయసూచిక

నేనేదైనా 'ఆలా చేయి లేదా ఇలా చేయి' అని చెబితే మీ మానవమనస్సు దానినొక సూత్రంగా తీసుకొని ప్రతి దానికీ దానినే తూ.చ తప్పకుండ వర్తింపచేస్తుంది. నాకు ఆలా కాదు. నాకేమీ నియమాలు లేవు. నిబంధనలు లేవు, సూత్రాలు లేవు. నాకు ప్రతీదీ దేనికదే ప్రత్యేకమైనది. దానిని అలాగే ప్రత్యేకంగానే చూస్తాను. ఏ రెండు సందర్భాలూ ఒకేలా వుండవు.

– శ్రీమాత

శ్రీమాత – అవతారతత్త్వము

శ్రీమాత దివ్యచైతన్యశక్తి, దైవము, చిత్‌శక్తిస్వరూపిణి కూడా.

*

ప్రశ్న: మాతృశ్రీ మానవరూపమే అయినా పరాశక్తికి ప్రతిరూప మని జనశ్రుతి. ఆమె, 'ప్రార్థనలు – ధ్యానములు' ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నదని అంటారు. పరాశక్తియే జీవులను ఉద్ధరించుటకు, వారిని జ్ఞానానందస్వరూపులను కావించుటలో మార్గదర్శకత్వం వహించుటకు ఆవిర్భవించిన మహనీయమూర్తి అని నా భావన, ఆత్మవిశ్వాసము (psychic feeling) కూడా.

నీ వన్నది సత్యమే. దైవము మానవరూపంలో మానవాళికి మార్గదర్శకత్వం వహించటం ఆశ్చర్యం కాదు. మానుషరూపంలో ఉన్నంత మాత్రాన దైవత్వమునకు లోటు ఏమీ రాదు. ఈ స్వరూపమే దివ్యచైతన్యంగా భాసిస్తుంది కాని, మానవరూపం దైవత్వంగా పరిణామం చెంది ప్రకాసిస్తుందని తలచటం సరి కాదు. బాల్యంలోనే మాతృశ్రీ అంతరంగంలో మానసాతీతురాలు. ఇందుకు విరుద్ధమైన భావన నిజం కాదు.

*

సృష్టిలోను, జీవునిలోను, ఈ రెంటికీ అతీతంగానూ, ఉన్నది ఒకే దివ్యచైతన్యశక్తి. అయితే ఆమె ఈ శరీరమునే కార్యరంగం కావించుకొని, ప్రాపంచిక జీవనాన్ని రూపాంతరీకరించుటకు కృషి చేయుచున్నారు. అందుచేత ఆమెను, మనుష్యరూపం ధరించిన దివ్యశక్తిగా భావించాలి. ఏ దృష్టితో చూచినా ఆమె సర్వతోముఖ దివ్యచైతన్య స్వరూపం.

*

సృష్టిలో కార్యకలాపాలన్నింటినీ మాతృశ్రీ నియమబద్ధంగా నిర్వహిస్తారు. ఆమె నిరంతర దివ్యకృపావ్యక్తీకరణకు అవకాశమిచ్చేవి ఇవియే.

ఇందుకే కదా ఆమె దేహధారిగా అభివ్యక్తమైనది.

*

ప్రశ్న: భౌతిక వ్యక్తిత్వం దివ్యకృపాపూరకంగా ఉండి కూడా, శ్రీమాత ప్రపంచ వ్యావహారిక కార్యకలాపాలలో వాటికి సంబంధిత నియమాల నెందుకు పాటిస్తారు?

ఈ మహా విశ్వపరిపాలనను ఒక నిగూఢ విశ్వశక్తి క్రమబద్ధీకరిస్తున్నది. సృష్టికి అతీతమైన పరాయణతత్వమే దివ్యరూపాంతరీకరణకు మూలము. మాతృశ్రీయొక్క కరుణాపూరిత ప్రక్రియలు ఇందుకు దోహదము చేయగలవు.

*

ప్రశ్న: శ్రీమాత దివ్యశక్తులన్నిటినీ అభివ్యక్తం కావించుకొని, దేహధారియై, దివ్యకృపను భౌతికభూమికలకు క్రమక్రమంగా అవరోహింపచేస్తూ సర్వభౌతిక చైతన్యాన్ని రూపాంతరీకరించే అవకాశం కల్పిస్తారు అనుకోవటం సమంజసమే కదా?

అవును. భూచైతన్యం అధిమానసాన్ని అందుకునేటందులకు ఆమె వ్యక్తీకరణ ఒక అవకాశం. అందుకు ముందు రూపాంతరీకరణం ఆవశ్యకం. అతిమానసం వలననే రూపాంతరీకరణ ఉంటుంది. కాని భూభౌతిక చైతన్యం అంతా ఒకేసారి రూపాంతరీకరింపబడదు. మనిషి మనసుకి ప్రతినిధి. కాబట్టి, ముందుగా ఒక క్రొత్త అతిమానసజాతి ఆవిర్భావము అవుతుంది.

*

ప్రశ్న: శ్రీమాత అభివ్యక్తీకరణలోను, అతిమానస అవరోహణ (the descent of Supramental) లోను వ్యత్యాసం ఏమైనా ఉన్నదా?

శ్రీమాత ఆగమనము అతిమానసమును అవరోహింపచేయుట కొరకే. ఆ అవరోహణ ద్వారానే ఆమె పరిపూర్ణ అభివ్యక్తీకరణ సాధ్యపడుతుంది.

*

ప్రశ్న: పూర్ణయోగం (Integral Yoga) లో అహం బ్రహ్మాస్మి అనే దృక్పథం అవసరం కాదా?

స్వభావం పూర్తిగా రూపాంతరీకరింపబడినంత మాత్రాన సరిపోదు. అలాగే అయితే శ్రీమాతయొక్క అస్తిత్వము, శక్తి – వీటి అవసరమే ఉండదు. నేనే బ్రహ్మాన్ అనుకుంటే సరిపోతుంది.

ఇది మాత్రం నిజం. విశ్వశక్తి సర్వమూ నిర్వహిస్తుంది. the Cosmic Force works out everything and the Cosmic Spirit (Virat Purusha) supports her action. విశ్వశక్తి అజ్ఞానస్థితిలో పనిచేసే (power) సామర్థ్యము. ఇది నిమ్నప్రకృతి. ఇది అజ్ఞాన పరిస్థితిలోనే పనిచేస్తుంది; నీవింతకంటే ఉన్నతంగా ఉండవలె నని అపేక్షించేవరకు. నీవే కనుక సాధకుడవు అయినపుడు నిమ్నప్రకృతి వ్యవహారసరళిని అంగీకరించవు. ప్రత్యామ్నాయంగా శ్రీమాత వైపు మరలుతావు. ఆమెని నీ ద్వారా ప్రవర్తింప చేస్తావు. నిమ్నస్వభావానికి బదులు నీవు పరిపూర్ణంగా శ్రీమాతకే అంకితమై. (‘*సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ*’) అన్నట్లుగా – ఉంటే – దైవమే, సర్వమూ నీ ద్వారా నిర్వహిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శరణ్

నీతోనే ఉన్నానంటే నేనే నీవు, నీవే నేను అన్న మాట.

నీతోనే నేను అనటంలో అది సమస్త విషయాలనూ సూచిస్తుంది. అంటే నేను అన్ని స్థాయిల్లోనూ, అన్ని భూమికల్లోనూ పరమమైన చైతన్యం నుంచీ నా అత్యంత భౌతికచైతన్యందాకా నీతోనే ఉంటాను.

– శ్రీమాత

శ్రీమాత సర్వాంతర్యామి

ప్రశ్న: "శ్రీమాత యెల్లప్పుడూ నిన్ను వీక్షించుచున్నట్లుగానే మసులుకో; ఎందుకంటే నిజంగా ఆ తల్లి ఉనికి సర్వదా నీతోనే వుంటుంది" అని మీరు వ్రాశారు. దీని అర్థం ఆమె భౌతికంగా అంతటా వ్యాపించి వున్నారని కాదు, కారణం, అది అసాధ్యం కనుక, అని మీరు వివరించారు. కాని, దీనిని గురించి నేను శ్రీమాతను అడిగినప్పుడు, తాను స్వయంగా సర్వత్రా వున్నానని అన్నారు. ఈ పరస్పర విరుద్ధమైన వివరణలను యెలా సమన్వయపర్చుకోవాలి?

భౌతికంగా అంటే, స్ఫుటమైన శరీరంతో అని అనుకుంటే, అది అసాధ్యమే. శ్రీమాతను ఆ ప్రశ్న అడిగినప్పుడు నీ వుద్దేశం అట్టిదని ఆమె అనుకోలేదు – తాను సర్వత్రా వుండగలనని ఆమె అనటంలో చైతన్యంలో వుంటానని. శారీరకంగాకాక, చైతన్యపరంగానే ఆమె ఉనికి. శరీరం ఆధారం; ఉపకరణం మాత్రమే. కార్యాచరణకి చైతన్యస్థాయిలో ఆమె సమక్షము (presence) సర్వత్రా ఉంటుంది. ఆమె ఉనికి వ్యక్తిగతమే కాకుండా విశ్వజనీనము కూడా.

ప్రశ్న: శ్రీమాత ఏ భావంలో సర్వవ్యాపి? భౌతకిస్థాయిలో జరిగేవన్నీ ఆమెకు తెలుస్తాయా?

లాయిడ్ జార్జి ఉదయం తిన్న ఉపాహారమేమిటో లేక రూజ్‌వెల్ట్ తన భార్యతో ఏం ముచ్చటించాడో – వగైరా కూడానా? భౌతిక మానవస్థాయిలో జరిగే సామాన్యవిషయాల గురించి కూడా శ్రీమాత తెలుసుకొనవలయునా? విశ్వగతశక్తుల కార్యాచరణను గమనిస్తూ తన కార్యనిర్వహణకు వాటిని ఏ విధంగా వాడుకోవాలో తెలుసుకొనుట ఆమె అవతార కర్తవ్యం. మిగతా విషయాలు తెలుసుకోవలసిననంత మేరకు తెలుసుకుంటారు. ఒక్కొక్కప్పుడు భౌతికమనస్సుతో, మరొకప్పుడు అంతరంగస్థాయిలో తెలుసుకుంటారు. ఆమెది విశ్వాత్మ. తనకంతా విదితమే. అవసరమైనదానిని తన కార్యనిర్వహణకు అవసరమైనంత బహిర్గతం చేస్తారు.

ప్రశ్న: శ్రీమాత సాన్నిధ్యానికి మరియు దివ్యచైతన్యానికి మధ్య వ్యత్యాసమేమయినా కలదా?

దివ్యచైతన్యాన్ని కర్తృత్వభావరహితమైన నవ్యచైతన్యంగా అనుభవించవచ్చు. కాని శ్రీమాత సాన్నిధ్యం అంతకు మిన్న అయినది – ఆమె వునికి బాహ్యాంతరంగాల నంతటా ఆవరించి యున్నట్టి అనుభూతినీ పొందవచ్చు.

*

శ్రీమాతయొక్క శాశ్వత సాన్నిధ్యం అభ్యాసంవల్ల సిద్ధిస్తుంది. సాధనాసాఫల్యతకు దైవకృప ఆవశ్యకమే కాని, ఆ దైవకృప లబ్ధి అభ్యాసం ఆయత్తపరుస్తుంది. కేవలం బాహ్యావిషయాలలోనే నిమగ్నమగుట మానివేసి, అంతర్ముఖుడవగుట నేర్చుకోవాలి. మనసును నిశ్చలపర్చాలి. శ్రీమాత నీలో చేయుచున్న పనిని గురించి తెలుసుకోవాలనే ఆకాంక్షను పెంచుకోవాలి. ఆమె దర్శనానికై తపించుట, ఆమె సాన్నిధ్యానికై వుబలాటపడుట, నీ హృదయాంతరాళంలో ఆమె వైపు ఆకర్షితభావము కలుగుట – ఇవన్నీ సాధనకి అవసరమైన చైతన్యస్థితిని పెంపొందించుకునేందుకు కావలసినవి. ఈ భావనలో యెలాంటి అలజడి పనికిరాదు. భావన గాఢమై నిశ్చలంగా ఉండాలి. అప్పుడే సాన్నిధ్యభావన నీలో కలుగుట, పెంపొందుట సులభమౌతుంది.

*

శ్రీమాత సాన్నిధ్యాన్ని సంభావించిన పిమ్మటే ఆమెను ఆవహించుకోవాలనేదేమీ లేదు. ఈ భావన తీవ్రమైనప్పుడే అమ్మ సాన్నిధ్యం సాధ్యపడుతుంది. చైత్యపురుష సంసర్గంతో భావోద్రిక్తత కలుగుతుంది. చైత్యపురుష సత్వము అమ్మ వునికిని నిరంతరం కొనసాగేలా చేస్తుంది. ఆ భావన నీలో పెంపొందేకొలదీ దీని ప్రభావం నీ సత్వమంతా ప్రసారితమౌతుంది. ఈ అంతరంగ భావన బాహ్యాచైతన్యాన్ని ప్రభావితం చేస్తుంది – రూపాంతరీకరిస్తుంది. యోగంలో నిరంతరం జరిగే ప్రక్రియ ఇది. అంతరంగ సత్యము, మనో, హృదయ, ఇచ్ఛ – లను స్వాధీనపర్చుకుని అజ్ఞానాన్ని పారద్రోలి బాహ్యంగా కూడా ప్రకటితమవుతుంది.

ప్రశ్న: నేను ఫ్రెంచి భాషలో ఒక ప్రార్థనను వ్రాసి శ్రీమాతకు పంపించాను. దానికి ఆమె సమాధానం "నీ హృదయకవాటాన్ని తెరు. అందు నన్ను దర్శించు" అని వ్రాశారు. యిది ఏమి సూచిస్తుంది?

హృదయోన్మీలనం నిశ్చయంగా ఉన్నప్పుడు, అక్కడ శాశ్వతమైన ఏకత్వభావన ఉంటుంది. అదే శ్రీమాత అభిప్రాయము. (పైన పరమాత్మలో కూడా నీకిది అనుభవైక వేద్యమవుతుంది.)

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అందుగుటపాటి కైలాసపతి, జానకి

దివ్యజనని

ప్రశ్న: నువ్వు దైవానివా అమ్మా?

నేనే కాదు. ప్రతి ఒక్కరికి వర్తించే ప్రశ్న యిది. అంతర్నిహితంగా (potentially) 'అవును' అని చెప్పవచ్చు. చెప్పడమే కాదు. అది యదార్థం చెయ్యడం తమ కర్తవ్యంగా భావించి పని చెయ్యాలి.

'నేను' అనేదాని వునికి సందిగ్ధం. కనుక 'నేను' శక్తిమంతమో కాదో నాకు తెలియదు. కాని, పరమాత్మ మాత్రం సర్వశక్తిమంతుడు. పదార్థం ద్వారా పరమాత్మ చూస్తున్నాడన్న దృఢ నమ్మకం అన్ని సంశయాలను అధిగమిస్తుంది.

*

ప్రశ్న: అమ్మా: మాలాగే నువ్వెందుకు వచ్చావు? నీ స్వస్వరూపంలోనే ఎందుకు రాలేదు?

మీలాగే నేను రాకపోతే, నేనెప్పటికీ మీకు చేరువ కాలేను; నాలా మీరు కావాలని మీకు చెప్పలేను కూడా కదా!

*

ప్రశ్న: సర్వేశ్వరుడు ప్రపంచ సృష్టికార్యక్రమం మీ కప్ప గించినపుడు యేం చెయ్యాలో మీకెలా తెలిసింది?

నేను ప్రత్యేకంగా నేర్చుకున్నదేమీ లేదు. ఎందుకంటే పరమాత్మలోనే సర్వం ఉన్నాయి. ప్రపంచం అనేది ఒకటి వుండాలని, దాని కవసరమయిన సృజనాత్మకశక్తి వుండాలని నిశ్చయించబడినది. అందుచేత ఆ శక్తులతోనే నేను వచ్చాను. అప్పుడు సృష్టి చెయ్యమని నాకాదేశ మివ్వడం జరిగింది.

*

(ఒక జాబుకి శ్రీమాత క్లుప్తంగా యిచ్చిన సమాధానం.)

దివ్యచైతన్యమే స్వయంవ్యక్తమై మానవరూపం ధరించిన ట్టయిన, ఈ ప్రపంచంలో వ్యతిరేకశక్తులన్నీ యేకమయినా, అది జరగకుండా ఆపలేవు.

అలా కానట్టయితే, నా భౌతికమైన వునికిని దృఢంగా యెవరు విశ్వసిస్తారో, వారికి నా ద్వారా, ఆ దివ్యచైతన్యంతో అను బంధం యేర్పడుతుంది.

అటువంటి వారికే ప్రాధాన్యత యివ్వబడుతుంది. కాని యితరులకి దానితో ప్రమేయం వుండదు. అనుకూల, ప్రతికూల ప్రచారాలలో నిమిత్తంలేని అచంచల చిత్తశుద్ధితో కూడిన విశ్వాసం కావాలి. ఆ విశ్వాసం అసంకల్పితంగా, స్వచ్ఛందంగా జనిస్తుంది. అది వొకరి బలవంతంవల్లగాని, వ్యతిరేకఖండనవల్లగాని యేర్ప డదు.

నమ్మకానికి దృఢవిశ్వాసానికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరా డాలని సంకల్పించినవారి విషయంలో ఒక నిజం నిరూపితమౌ తుంది. వాళ్ల సత్వం ఒక భాగం – ఎంత అల్పమైనదేనా కానీ – దృఢవిశ్వాసంతో ఉంటుంది. కాకపోతే సత్వంలో మరొక భాగం – ముఖ్యంగా బాహ్యమైనది, మనోవికారాలకి లోనై (more sensitive) నమ్మకాలు అంగీకరించటానికి ఇష్టపడదు. ఏదో అంతా ప్రమాదంగా కనిపిస్తుంది వాళ్లకి. మితిమీరిన ఆత్మవిశ్వాసం అలా అనిపిస్తుంది.

నా మట్టుకు నాకు నేనెవరో తెలుసు. నేనీ యెరుకతో చిత్త శుద్ధిగా బ్రతికినపుడే దాని విలువ. ఈ చిత్తశుద్ధిని విచారణ చేయ గలిగేది ఆ సర్వేశ్వరుడే.

*

'నేను యెవరు?' అనేది ఖచ్చితంగా నాకు తెలుసు. శ్రీఅరవిందు లకు కూడా తెలుసు. అది ఆయన ప్రకటించారు కూడా. మాన వాళి మొత్తం సంశయించినా సరే – ఈ వాస్తవంలో మార్పు వుండదు.

*

21 ఫిబ్రవరి 1969 శ్రీమాత 90 వ జన్మదిన స్మృతులు (సంక్షి ప్తంగా)

శ్రీఅరవిందుల్ని కలుసుకోవడం కోసమే, నేను భారతదేశం వచ్చాను. ఆయనతో కలిసి జీవించడానికే, భారతదేశంలో వుండి పోయాను. ఆయన భౌతికదేహం త్యజించినప్పుడు, వారు నిర్వ ర్తించవలసిన విధిని నేను కొనసాగించాను. అదే, సత్యాన్ని పాలించడం, మానవాళిని జాగృతం చేయడం, యీ భూమిపై దివ్యప్రేమ పాలన వేగవంతం చెయ్యడం.

*

యీ భూమి మీద నిర్వహించవలసిన నా కర్తవ్యం నా కెపుడు, ఎలా తెలిసివచ్చింది? యెప్పుడు, యెలా శ్రీఅరవిందుల్ని కలుసు కున్నాను? అనే రెండు ప్రశ్నలకు క్లుప్తంగా జవాబు చెప్తున్నాను.

నాకు ఆధ్యాత్మికంగా కర్తవ్యజ్ఞానం యెప్పుడు కలిగింద నేది ఖచ్చితంగా చెప్పలేను. బహుశా నాకిది పుట్టుకతోనే వచ్చిం దేమో. బుద్ధి పెరిగినకొద్దీ ఈ చైతన్యం నిర్దిష్టంగా పరిపూర్ణతను సంతరించుకుంటూ అభివృద్ధి పొందుతూ వచ్చింది.

11, 13 సం॥ల ప్రాయంలో చైత్య, ఆధ్యాత్మిక అనుభ వాలు పరమాత్మ అస్తిత్వాన్ని మాత్రమేకాక, ఆ దివ్యశక్తితో అద్వైతస్థితి మానవసాధ్యమేనన్నది తెలియజేసాయి. పరమాత్మని సంపూర్ణంగా సమగ్రంగా గుర్తించగలిగిన దివ్యచైతన్యం, ప్రక్రియ విశదపరిచాయి. దివ్యజీవనవిధానంలో భూమిమీదే భగవంతుణ్ణి

ప్రత్యక్షం చేసుకోగలమన్నది అనుభావ్యమయింది. ఈ అనుభవాలతోపాటు, వాటిని సాఫల్యం చేసుకోగల ఆచరణాత్మక క్రమశిక్షణ, నేను నిద్రించే సమయంలో కలలోకి వచ్చిన అజ్ఞాతగురువులు చాలామంది నాకు బోధించేరు. ఆ తరువాత కాలంలో వారిలో కొంతమందిని నేను యీ భౌతికప్రపంచంలోనే కలుసుకునే అదృష్టం కలిగింది.

తరువాత కొంతకాలానికి క్రమంగా అంతర్గతంగాను, బాహ్యంగాను నేను అభివృద్ధి సాధిస్తున్నప్పుడు, నాకు బోధ చేసిన గురువులు ఒకరితో నా చైత్య, ఆధ్యాత్మిక అనుబంధం స్పష్టమై, దినదినాభివృద్ధి చెందసాగింది. భారతీయ వేదాంత, మత తత్వాల గురించి అప్పట్లో నాకు తెలిసింది అతిస్వల్పం. అయినా 'కృష్ణ' అనే పేరు నాకు మార్గదర్శి అయింది. అప్పటినించి అతడు నాతోనే వున్నట్టు (యేదో వొక రోజు యీ భూమ్మీదే ఆయన నాకు తారసడతారని నాకు తెలుసు) నేను నిర్వహించవలసిన దైవకార్యం అతడితో కలిసే నిర్వహించవలసి వుంటుందనే యెరుక నాకు కలిగింది.

1910 సం॥లో నా భర్త పాండిచ్చేరి వచ్చారు. అతివిచిత్ర పరిస్థితిలో శ్రీఅరవిందులతో వారికి పరిచయం కలిగింది. అప్పటినించి మాలో మళ్ళీ యెలాగైనా భారతదేశం రావాలనే తపన తీవ్రమయింది. 1914 సం॥లో మాకు ఆ అదృష్టం దక్కింది. భారతదేశం నా మాతృదేశం అనుకుంటే నాకు చాలా సంతోషంగా వుండేది.

శ్రీఅరవిందుల్ని దర్శించిన మరుక్షణమే నాకు చిరపరిచితమైన నా ఆరాధ్యదైవం కృష్ణుడే యితడని గుర్తించేను. నా కర్తవ్యం, అది నిర్వహించవలసిన స్థలం భారతదేశమే అన్న ప్రగాఢవిశ్వాసం నాకు కుదిరిందన్నది వేరే చెప్పనక్కర లేదు.

పాండిచ్చేరి *1920*

*

ఈ భూమి అవతరించిననాటి నుంచీ యెప్పుడెప్పుడు, యెక్కడె క్కడ యేకాస్త చైతన్యకిరణ ప్రసారానికి అవకాశం వున్నా అక్కడ నేనున్నాను.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

ఆకాంక్ష కనుగుణంగా మనతో దైవం

ప్రశ్న: "నేను మీతోనే ఉన్నాను" అంటే దాని భావం ఏమిటి?

మేము ప్రార్థించినా, ఏదైనా సమస్యతో బాధపడుతున్నా నిజంగా పట్టించుకుంటారా? మాలో సంకల్పశక్తి లోపభూయిష్ఠంగా, అపరిపూర్ణంగా, వికృతంగా ఉన్నా మీకు మేము వినిపిస్తామా? మీరు పరమోన్నత చైతన్యమా, నిరాకారదివ్యశక్తియా, యోగశక్తియా లేక శరీరధారియై భౌతికచేతనతో ఉన్న శ్రీమాతయా? మా ప్రతి సంకల్పము, కర్మ తెలిసిన అజ్ఞాతశక్తి, కాక మూర్తిమంతమైన శక్తియా? ఎవరు? మీరు మాతో ఎలా ఉంటారో తెలుపగలరా?

శ్రీఅరవిందులు, మీరు కలిసి ఒకే చైతన్యమంటారు కదా? వ్యక్తిగతంగా మీరిరివురూ వేర్వేరుగా ఒక్కొక్క భూమిక పోషిస్తూ సాక్షత్కరిస్తారా?

నీతోనే ఉన్నానంటే నేనే నీవు, నీవే నేను అన్నమాట.

నీతోనే నేను అనటంలో అది సమస్త విషయాలనూ సూచిస్తుంది. అంటే నేను అన్ని స్థాయిల్లోనూ, అన్ని భూమికల్లోనూ పరమమైన చైతన్యం నుంచీ నా అత్యంత భౌతికచైతన్యం దాకా నీతోనే ఉంటాను. ఈ పాండిచ్చేరిలో నా చైతన్యంలేని గాలిని నీవు పీల్చలేవు. ఇక్కడకు పది కిలోమీటర్ల దూరంలో సరస్సు (lake) దాకా ఉన్న సూక్ష్మభౌతిక వాతావరణమంతా నా చైతన్యంతోనే నిండిపోయి ఉంటుంది. ఇంకా మానసికపరిధిలోనూ,

తదితర భూమికల్లోనూ, ఇతర ఉన్నతస్థాయిల్లోనూ అంతటా వ్యాపించి ఉండటం తెలుసుకోవచ్చు. నేను తొలిసారిగా ఇక్కడికి వచ్చినప్పుడు పది కిలోమీటర్లే కాక సముద్రంపై పదిమైళ్ల దూరం లోనే శ్రీఅరవిందుల చైతన్యాన్ని అనుభవపూర్వకంగా గ్రహించాను. అది ఉన్నట్లుండి, నిర్దిష్టంగా స్పృశించినట్లై, ప్రకాశవంతంగా ఉండి నన్ను తేలిపోయేటట్లు చేసింది.

ఆ తర్వాత శ్రీఅరవిందులవారు స్వయంగా ఆశ్రమంలో అన్ని దిక్కులా ఒక సూచికను ఏర్పాటుచేసిన విషయం మీకు తెలిసినదే. "శ్రీమాత ఎప్పుడూ నిన్నే గమనిస్తున్నట్లుగానే నడుచుకో. నిజం కూడా అదే. ఆమె సదా అంతటా ఉంటుంది." ఇది కేవలం మాటవరసకు అన్నది కాదు. ఇది పూర్తి వాస్తవము. సూక్ష్మదృష్టికలవారంతా నన్ను దర్శించగలరు.

సాధారణంగా నా శక్తి నీలో ఒక పద్ధతిగా నిరంతరం పని చేస్తూ ఉంటుంది; నీ మానసికప్రవృత్తులు, చలితచాలనాలు క్రమ బద్ధీకరింపబడుతూనే ఉంటవి.

అది కాకుండా, నాకూ నీకూ, ఒక అనుబంధం ఉంది. అదే శ్రీఅరవిందుల, నా బోధనల ననుసరించేవారికీ, మాకూ మధ్యన ఉండే అనుబంధం. మీరెక్కడైనా ఉండవచ్చు; ఫ్రాంసు లోగానీ, పాండిచ్చేరీలోగానీ, ప్రపంచంలో మరి ఎక్కడున్నప్పటికీ దూరాలతో సంబంధం లేని బంధం అది. సర్వదా సజీవసంబంధం. ఎక్కడినించైనా సరే నా అవసరం వచ్చి, నన్ను తలుచుకున్న వారికి పిలుపు తక్షణమే నాకు వినిపిస్తుంది. వెనువెంటనే వారికి కావలసిన శక్తి, ఉత్తేజం, రక్షణ – ఏది అవసరమైతే అది వారికి అందిస్తాను. ఒక్కొక్కసారి రాస్తూ, రాస్తూ ఆపేయడం, చేసే పని నిలిపివేయడం మీరు చూస్తుంటారు. అటువంటప్పుడు నేను పని ఆపి ఏకాగ్రత నిలిపి, సందేశానికి సమాధానంగా చేయవలసి నది చేయటం జరుగుతుందన్న మాట.

ఎవరినైతే నేను నా శిష్యులుగా అంగీకరించి వారికి, నా అంగీకృతి తెలుపుతానో వారితో నా కేర్పడేది కేవలం అనుబంధమేకాక, నా అంశ సదా వారితో ఉంటుంది. వారికేదైనా జరిగి

నప్పుడు ఆ అంశ నాకు తెలియచేస్తుంది. నిజం చెప్పాలంటే అటు వంటి సమాచారాలు నాకు నిరంతరం వెల్లువలా వస్తూనే ఉంటాయి. అయితే అవన్నీ తలలో దూరకుండా నా బాహ్యాచైతన్యం కొంత జల్లెడపట్టి సూక్ష్మభౌతికంలో నమోదుచేసి ఉంచుతుంది. కేసెట్‌లో రికార్డు చేసి ఉంచిన సంగీతంలా. అవసరమనిపించినప్పుడు దాన్ని నా బాహ్యాచైతన్యంలోకి తెచ్చుకొని విషయం తెలుసుకొని ఆ కాలవ్యవధిలో ఎలా పరిణమించాయో ఏమైనాయో చూస్తాను.

ఎప్పుడైనా ఏదైనా కారణం ఉండి నీవు నాకు రాస్తావనుకో, దానికి నేను, '*నీతోనే ఉన్నాను*' అని బదులిస్తాను. అంటే నీతో నా సంసర్గం చురుగ్గా ఉందనీ, అవసరం తీరేవరకూ నీవు నా చైతన్యంలోనే ఉంటావనీ అర్థము.

ఈ విధంగా ఒక్కసారి నాతో ఏర్పడిన బంధం ఎన్నటికీ విడిపోదు. కొంతమంది ఆశ్రమంలో ఉండి, ఆ తర్వాత విముఖత్వంతో బయటకు వెళ్లిపోయినా, అది ఎంత కాలమైనప్పటికీ వారితో నా సంసర్గం కొనసాగుతూనే ఉంటుంది; వారిని ఆదుకుంటూనే ఉంటాను. మిమ్మల్ని నేనెన్నెటికీ విడనాడను. నిజం చెప్పాలంటే నేను ప్రతి ఒక్కరి బాధ్యతనూ స్వీకరిస్తాను; జీవితంలో ఒక్క క్షణంసేపు చూసినవారినైనా సరే.

ఒక విషయం చెప్పాలి: శ్రీఅరవిందులవారూ, నేనూ ఒక్కటే; ఇద్దరిదీ ఒకే చైతన్యము. అయితే మీ చైతన్యంలోనికి వచ్చినప్పుడు అది ఆకృతి తాలుస్తుంది. నీ ఆకాంక్ష, నీ అవసరం, నీ ప్రవృత్తి, నీ తత్కాలవైఖరిని బట్టి వేరు వేరుగా తోస్తుంది. నీ వ్యక్తిగతచైతన్యం ఒక సూచిక వంటిది. దైవానికుండే అసంఖ్యాక సంభావ్యతలలో నుంచి ఒక్కదాన్ని ఎంచుకొని దానిపైనే కేంద్రీకృతం కావించుకొంటుంది. ఆ దైవం కూడా వ్యక్తి దేనిని అభిలషిస్తాడో, అదే ఇస్తాడు. భగవంతుడు నిర్దయుడు, నీకు అందడు అని నీవు అనుకుంటే, ఆయన ఆ విధంగా క్రూరంగా, దూరంగా ఉంటాడు; ఆ విధంగా ఉంటేనే నీకు మంచి జరుగుతుంది కాబట్టి, నీవాయన ఆగ్రహాన్నే చవిచూస్తావు. కాళీరూపాన్ని

ఆరాధిస్తే కాళీమాతగానే దర్శనమిస్తాడు; భక్తజనులకు మోక్షప్రదాతగానే ఉంటాడు. జ్ఞానమార్గమనుసరించేవారికి సర్వజ్ఞునిగానూ, శూన్యవాదులకు భావాతీత నిర్గుణతత్వంగానూ ఉంటాడు. నాస్తికుని నాస్తికత్వమూ, ప్రేమికుని ప్రేమస్వరూపమూ కూడా అతడే. నీవు కోరినట్లు నీ తప్పిదాలన్నిటినీ సైరించి వేస్తూ నీ ఆంతరంగికునిగా నిర్విరామంగా కృషి చేస్తాడు; ప్రతిక్షణం తన కృపాసారాన్ని కురిపిస్తాడు. నీ అంతరాంతరాల్లో దేని కోసం ఆకాంక్షించి నిరీక్షిస్తావో అదే ఆ పరదైవము.

సమ్యక్‌దృష్టితో సర్వాన్నీ అవలోకించగలిగి, దైవానికీ మానవులకీ మధ్యనుండే అనంతకోటి సంబంధాలను చూసే చైతన్యంలో నీవు ప్రవేశిస్తే అదంతా ఎంత అద్భుతమో నీకు తెలుస్తుంది. అప్పుడు మానవజాతి చరిత్రను కూడా చూస్తావు: దైవం మానవుల కోరిక ప్రకారంగా, అర్థం చేసుకున్న పద్ధతిలో, ఆశించిన రీతిలో, కలలు కన్నట్లుగా ఎన్నిసార్లు ప్రత్యక్షమైనదీ గమనిస్తావు. వారి వారి ఇచ్ఛానుసారం కోరుకునే స్వేచ్ఛ ప్రతివారికీ ఉంది. మానవచైతన్యం విస్తృతమైన కొద్దీ మరింత తేజోమయుడుగా అయి దర్శనమిస్తాడు. భగవంతునితో ఈ విధంగా వైవిధ్యభరితమైన అనంతకోటి సంబంధాలు ప్రపంచచరిత్రలో పరిపూర్ణత పొంది ఉండటమనేది వర్ణనాతీతమైన అద్భుతం.

భగవంతుడు నీతో ఉండటమనేది నీ ఆకాంక్షకు అనుగుణంగా ఉంటుంది. ఇక్కడ నేను చెప్తున్నది చాంచల్యమానమైన బాహ్యానైజానికి సంబంధించి కాకుండా నీ అంతర్గతతత్వాన్ని గురించి మాత్రమే. అయినప్పటికీ ఆ దైవం ఒక్కొక్కసారి నీ బాహ్య ఆకాంక్షకు అనుగుణంగా రూపుదాలుస్తాడు. భక్తుడు భగవంతునితో తనకున్న సంయోగ, వియోగాల కనుగుణంగా, పారవశ్య, నిరాశలతో కూడి వశిస్తాడు. నీ విశ్వాసానికనుగుణంగా భగవంతుడు నీతో వ్యవహరిస్తాడు. అందువల్ల నీ వైఖరే (attitude) ముఖ్యము. నమ్మకము ఎంత ప్రధానమో మీకు తెలియదు. విశ్వాసం అద్భుతాలను సృష్టించకలదు. దైవం వచ్చి నిన్ను పైకి

లేవనెత్తి తన దరికి చేర్చుకోవాలని నీవు సదా అపేక్షిస్తే అలా ఆయన నీకు సన్నిహితుడు, మరింత సన్నిహితుడు కాగలడు.

*

ప్రశ్న: దివ్యజననీ, నిన్ను నా హృదయంలో బంధించు కుంటాను.

దానికని నీవు ఎక్కడికీ వెళ్లనక్కర్లేదు. నేను ఉన్నదే నీ హృదయంలో. ఎప్పుడైతే నీ అంతర్నేత్రాలు తెరుచుకుంటాయో, అప్పుడు వెంటనే నన్ను చూడగలవు. బాహ్యంగా కాక, అంతరంగంలోనికి నీ భావనాశక్తిని మరల్చు. శీతోష్ణాలు అనుభవించినట్లుగా, నా ఉనికి నీకు అనుభావ్యమవుతుంది.

*

ప్రశ్న: ఓ ప్రియజననీ, ఇవే నా ప్రణామాలు. సదా నీవు నాలో కొలువై కలకాలం అక్కడే ఉండు.

నేను ఎప్పుడూ నీతో ఉంటాను, అయితే నీవు మాత్రం నన్ను పిలవటం మర్చిపోవద్దు. నీ పిలుపునకు అనుగుణంగా నా ఉనికి నీకు సార్థకమవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామశాస్త్రి

భగవంతుడు నిర్దయుడు, నీకు అందడు అని నీవు అనుకుంటే, ఆయన ఆ విధంగా క్రూరంగా, దూరంగా ఉంటాడు; ఆ విధంగా ఉంటేనే నీకు మంచి జరుగుతుంది కాబట్టి, నీవాయన ఆగ్రహాన్నే చవిచూస్తావు. కాళీరూపాన్ని ఆరాధిస్తే కాళీమాతగానే దర్శనమిస్తాడు; భక్తజనులకు మోక్షప్రదాతగానే ఉంటాడు. జ్ఞానమార్గమనుసరించేవారికి సర్వజ్ఞునిగానూ, శూన్యవాదులకు భావాతీత నిర్గుణతత్త్వంగానూ ఉంటాడు. నాస్తికుని నాస్తికత్వమూ, ప్రేమికుని ప్రేమస్వరూపమూ కూడా అతడే.



O Love, Divine Love !

At the inauguration of the first Body Building Gymnasium on 24-4-1952, the Mother watching the balloons rise with childlike joy.

శ్రీమాత పనిచేసే తీరు

నేను పనిచేసే విధానం గురించి నీకు అర్థం కాదు. "మీకు అతి మానసశక్తి వుందికదా! ఆ శక్తిని ఉపయోగించి యీ మాలిన్యాలను కడిగివేయవచ్చును గదా!" అని నీవంటావు. కాని పనిచేయాల్సిన తీరు అది కాదు. అతిమానసశక్తిని భరించే శక్తి యీ ప్రపంచానికి ఇంకా రాలేదు. ఆధారాన్ని సిద్ధం చేయకుండా ఆలా చేస్తే అంతా విచ్ఛిన్నం అవుతుంది. అందుకే ముందుగా ఆధారాన్ని సరిచేసాకనే ఆ శక్తిని నేను క్రిందికి తీసుకురావల్సి వుంటుంది.

మీ మానవదృష్టి అన్ని విషయాలను ఒకేవిధంగా చూస్తుంది. మీకు తెలిసిందల్లా ఇలా చేయాలి, అలా చేయాలి అనే. కానీ నాకు అలా కాదు. నేను విషయాన్నంతటిని కలిపి చేతనలోని కదలికల్ని అన్నివైపుల నుండి చూస్తాను. సత్తా నంతటినీ దృష్టిలో పెట్టుకొని ప్రతి చిన్నకదలికా ఏ విధంగా ప్రతిస్పందిస్తుందో, దాని పర్యవసానం ఎలా వుంటుందనేది చూస్తాను.

నేనేదైనా 'ఆలా చేయి లేదా ఇలా చేయి' అని చెబితే మీ మానవమనస్సు దానినొక సూత్రంగా తీసుకొని ప్రతిదానికీ దానినే తూ.చ తప్పకుండ వర్తింపచేస్తుంది. నాకు ఆలా కాదు. నాకేమీ నియమాలు లేవు. నిబంధనలు లేవు, సూత్రాలు లేవు. నాకు ప్రతీదీ దేనికదే ప్రత్యేకమైనది. దానిని అలాగే ప్రత్యేకంగానే చూస్తాను. ఏ రెండు సందర్భాలూ ఒకేలా వుండవు.

ఈ చేతనారాశి కదలికలో, ఒక అంశం తన లక్ష్యాన్ని హాయిగా చేరుకొనేందుకు ఒక పద్ధతిలో వెళ్లేలా చూస్తాను. అందుకే ఇది ఇలా జరగాలి, ఇలా జరగరాదు అని చెప్తాను. కొన్ని సమయాలలో దాని మార్గంలో ఒక పెద్ద అవరోధం కన్పించిందనుకో. దాన్ని రెండు విధాలుగా ఎదుర్కొనవచ్చును. ఒకటి – విషయంయొక్క గమనాన్ని మార్చివేసి అవరోధాన్ని తాత్కాలికంగా తప్పించటం. రెండవది – అవరోధాన్ని భగ్నం చేయటం. నేను చెప్పినట్లు, ప్రతి చిన్న కదలికకి, మొత్తం చైత

న్యసమూహాంపై ప్రతిస్పందన, ప్రతిక్రియలు ఉంటాయి. అవరోధ నిరోధాలకి కూడా ఒకదానికొకటి ప్రభావితం చేసే ప్రతిక్రియలు విస్తృతస్థాయిలో ఉంటాయి. నాకు వ్యక్తులపట్ల ఎలాంటి వివక్షతా లేదు. కానీ వ్యక్తి లేదా వ్యక్తులు మారినపుడల్లా, మారే పరిస్థితులను, మారుతున్న సమయాన్ని, మారే మార్గాలను చూడాల్సివుంటుంది. నేను ఈ మార్పులన్నింటినీ దృష్టిలో వుంచుకొని అది యావత్తూ సత్తా పురోగమనానికి ఎంత బాగా ఉపయోగపడుతుందీ అనేది చూస్తాను. ఆటంకాలను విచ్ఛిన్నం చేసినందువలన వచ్చే పర్యవసానంగా జరుగబోయే ఫలితాలు బాగుంటాయా లేక ఆ ఆటంకాలను అలాగే అప్పటికి కొనసాగించి మానవ మూర్ఖత్వాన్ని భరించాలా, అనేది అయా సమయానన్నుసరించి వుంటుంది. సత్తా అంతటినీ ఒకేసారి చూడటం అనే దాని మీదనే అది వ్యతిరేకమా కాదా అనేది తెలుస్తుంది. ఒక లక్ష్యాన్ని చేరుకునేందుకు అనేక మార్గాలు వుంటాయి. అందుకే ఆటంకాలను తొలగించడం అనేది అవసరాన్ని మించిందననుకొన్నప్పుడు నీ మార్గంలో, నిన్ను నీ కిష్టమైన రీతిలో వెళ్లనిస్తాను. అంత మాత్రం చేత అవరోధాలను తొలగించడం అనేది తప్పనిసరి అని నేను అనుకున్నప్పుడు అలా చేసేందుకు నన్నేదీ అడ్డుకోలేదు.

ఆలస్యంగానో, త్వరితంగానో ఈ సత్తా యావత్తూ దాని లక్ష్యం వైపుగా పురోగమిస్తూనే వుండాలి. చేతన తన లక్ష్యాన్ని చేరుకునేందుకు వారి వారి రూపాలలో కన్పిస్తూ వారి భాషలో మాట్లాడుతూ, మానవుల్ని నాతోపాటు నడిపిస్తూనే వుంటాను. ఒక్కొక్కసారి నేను చాలా కఠినంగా వారికి కన్పిస్తాను. నేను మాట్లాడేటప్పుడు ఒకింత కాఠిన్యాన్ని చూపించడం, నియమ నిబంధనలను రూపొందించడం. అయితే ఇదంతా మానవులకు నేను కల్పించే వెసులుబాటు మాత్రమే.... అలా కాకపోతే వారికేదీ అర్థం కాదు. వారి భాషలో వారితో మాట్లాడే సమయంలో సైతం నన్ను వారు సరిగ్గా అర్థంచేసుకోకుండా గందరగోళం చేస్తారు. అలాగాక నేను చాలా ప్రకాశమానంగా (పైస్థాయిలో) మాట్లాడితే అది వారికేమాత్రము అర్థము కాదు.

'X' కు చాలా వికసించిన మనస్సే వుంది. అతని మనస్సు వెలుగువైపుగా ఉన్మీలనమై వుంది అని చెప్పగలను. శ్రీఅరవిందులు చెప్పిన జ్యోతిర్మానసంలో అతనితో మాట్లాడేందుకు రెండుసార్లు ప్రయత్నించాను. అయినా అతను దానిని అర్థంచేసుకోలేకపోయాడు. అతను ఏదో కొద్దిగా మాత్రమే పట్టుకోగలిగాడు. మిగిలినదంతా జారిపోయింది.

మిగిలినవారిలో ఐతే అదింకా అన్యాయం. వారు ఏమాత్రం అర్థం చేసుకోలేక అయోమయానికి గురయ్యారు. ఇలాంటి వారితో నేను ఒకింత రాజీపడాల్సిందే. ఫలానాది మూర్ఖమైనది అని చెప్పినా, వారు దాన్ని చేయకుండా వుండలేరు. అందుకే నేను వారిని భరించాల్సిందే. వారి అభివృద్ధి కోసం వారి మూర్ఖత్వాన్ని కొంతవరకు అనుమతించాల్సిందే. మీకున్న ఆసక్తిని, సమస్తచేతన యొక్క అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని నేను చాలా వాటిని అనుమతించాల్సి వస్తున్నది. అలాగని వారి స్వభావాలలోని లోపాలను, కాఠిన్యాన్ని గ్రహించలేని అంధురాలను కాదు. కొన్ని సందర్భాలలో మీ అంతట మీరే అనుభవం ద్వారా కొన్ని విషయాలు తెల్సుకోవాలి కనుక వాటిని అలా వదిలేయాల్సి వస్తుంది. కానీ ఎప్పుడైనా నేను ఖచ్చితంగా 'వద్దు' అని చెప్పానంటే దానిని ఎదుర్కోవడం చాలా అపాయం కనుకనే అలా చెప్తాను. అలాంటి చర్యలకు చాలా దృక్కోణాలుంటాయి. అవన్నీ చెప్పినా మీకర్థం కావు కనుక వాటిని వివరించను.

ఈ ప్రత్యేక విషయంలో నేను 'వద్దు' అని ఖచ్చితంగా చెప్పాను. అపుడు 'Y' కలుగజేసుకొన్నాడు. ఇంక 'Y' విషయానికొస్తే అతడు చాలా మంచివాడు. కొన్ని భాగాలలో మంచి చిత్తశుద్ధి వున్నవాడే. మరి కొన్నింటిలో అతడు చాలా బలహీనుడు. బలవంతంగానైనా సరే తాను అనుకొన్నది సాధించి, స్వాధీనం చేసుకోవాలంటాడు. నేను అలాంటి వాటిని వ్యతిరేకించాల్సిందే. అలా చేస్తే అతనిని అది బాగా కదిలించేస్తుంది. అలాంటి సందర్భాలతో సర్దుకుపోవడం అతనివల్ల కాదు. ఇంతకు ముందే నేను చెప్పాను కదా! అనేక విషయాలను పరిగణనలోకి

తీసుకొని అతడు కొన్ని విషయాలను ఏమాత్రం అనుకొన్న దానికి వ్యతిరేకంగా జరిగినా భరించలేడు గనుక అతనికి అనుమతివ్వక తప్పలేదు. అలాగని అది మంచిది కాదు అని చెప్పకుండా దాచిపెట్టలేదు.

నేను (విషయాలను) చూసే తీరు చాలా భిన్నంగా వుంటుంది. నా చేతనకు సంబంధించినంతవరకు ఈ భూమిపైన జీవితమంతా మానవజీవితంతో సహా, మానసిక క్షేత్రంతో సహా అంతా అసత్య, అజ్ఞానస్పందనల సమాహారం. ఈ స్పందనలలో అసత్ప్రవృత్తులు, అజ్ఞానం, అరాచకం రాజ్యమేలుతూ (పనిచేస్తూ) ఊర్ధ్వస్థరాల నుండి వస్తున్న సత్యం, సామరస్యంవంటి స్పందనలను నిరోధిస్తున్నాయి. ఈ దృష్ట్యా అవి అహంకారతత్వం, వ్యక్తిగత మంకుతనం మరియు వేర్పాటుతనం, అవాస్తవంగా భ్రమలుగా మారిపోతున్నవి.

దీనికి వున్న గందరగోళానికి తోడు మరింత గందరగోళం తోడైనపుడు దానిమీద నేను కొన్ని ప్రత్యేక స్పందనలు పంపి సాధ్యమైనంత మేరకు పటిష్టమైన సామరస్యాన్ని కల్గించే ప్రయత్నం చేస్తూంటాను. వ్యక్తిగతంగా ఆఘాతం ఇక్కడ అనుభవంలోకి రాదు. కాకపోతే వాళ్లు, సామరస్యానికి దూరం అవుతారు. ఈ సందర్భాలలో ఒక పక్షము సవ్యమని, మరో పక్షము అపసవ్యమని ఉండదు. అసత్య గందరగోళాలకి అంటిపెట్టుకున్నంత మేరకు వారంతా నిందితులే.

వాస్తవానికి ఏ క్షణానికి ఆ క్షణం పరమోన్నతమార్గ నిర్దేశకత్వంలో ప్రవర్తిస్తూంటాను. కనుకనే నేను ముందస్తుగా ఏర్పరుచుకున్న ప్రణాళికాబద్ధంగా పనిచేయను. ఆ అవకాశం ఉండదు. మానవమేధస్సుకి ఇది సుఖప్రదంగా ఉండదు. ఎందుకంటే వారంతా ప్రతిదీ ముందుగానే నిర్ణయించుకుని వ్యవహరించే అలవాటుపడినవారు కాబట్టి. కాని ఆధ్యాత్మిక దృక్పథంలో ఇది అనివార్యం.

అలా కాకుండా ఇతర సమస్యలను వేటినీ లెక్కలోకి తీసుకోకుండా ప్రతిసమస్యనూ దేనికదే ప్రత్యేకమైనదిగా తీసు

కొని పరిష్కారాన్ని ముందుగానే నిర్ణయం చేస్తూంటావు. కానీ అలా కాదు; ప్రతి సమస్యా దేనికదే (మరొకదానితో సంబంధం లేకుండా) ప్రత్యేకమైనది కాదు. అందులో ఇంకా చాలా ఇమిడి పోయి వుంటాయి. అందుకే పైకి కన్పించే దానినే సత్యమనుకొని ఇతరమైనవాటిని నిర్లక్ష్యం చేయకూడదు. దీనిని నీవు అర్థంచేసు కుంటే నీకు ఎదురైన ఆటంకం చాలా తేలికగా కనుమరుగౌతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

ఒక మహాశక్తి పనిచేసిందికాని అదెక్కడినుంచి వచ్చిందో తెలియదు[1]

(ఈ క్రింది అంశం ఒక శిష్యుడు వ్రాసిన జీవితచరిత్రలోని ఒక భాగం. కాని శ్రీఅరవిందులు వారే స్వయంగా తిరిగి వ్రాశారా అన్నట్లు దీన్ని సరిచేశారు. కనుక శ్రీఅరవిందుల నుద్దేశించి వాడిన ప్రథమపురుష సర్వనామం యథాతథంగా వుంచారు.)

(శ్రీఅరవిందులు ఏప్రియల్ 4, 1910 సంవత్సరంలో పాండి చేరి చేరుకున్నారు.) పాండిచేరి చేరుకొన్న తరువాత శ్రీఅరవిం దులు యోగసాధనలో మరింతగా నిమగ్నులైనారు. శ్రీఅరవిందుల ముందున్న ఆధ్యాత్మిక మహత్కార్యం ఎంత గొప్పదో మరింత స్పష్టంగా వారికి తెలిసింది. అంతేకాదు ఆ మహత్కార్య నిర్వ హణకు తమ సర్వశక్తులనూ కేంద్రీకరించవలసిన అవసరం వున్న దని కూడా వారు గ్రహించారు. తదనుగుణంగా ఆశ్రమం రూపు దాల్చిన తరువాత, రాజకీయాలతోగానీ, రాజకీయ కార్యక్రమాల తోగానీ ఆశ్రమానికి ఏవిధమైన సంబంధం లేకుండా స్వతం త్రంగా వుండేట్లు చూశారు.... 1910 వ సంవత్సరంలో వారు

---

[1] శ్రీఅరవిందుల 'సావిత్రి' లోని ఒక పంక్తి: పుట 44

పూర్తిగా ఏకాంతవాసానికి ఉపసంహరించుకొన్నట్లే, రాజకీయ కార్యకలాపం నుండి కూడా పూర్తిగా విరమించుకొన్నట్లైంది.

అంటే దాని అర్థం, చాలామంది భావించినట్లు, ప్రపంచంతో లేదా భారతదేశ భవితవ్యంతో ఏమీ సంబంధంలేని, పట్టించుకొనని ఏదో ఆధ్యాత్మిక అనుభవశిఖరంపైకి ఉపసంహరించుకొన్నట్లు కాదు. ఎందుకంటే వారి యోగప్రధానసూత్రం, దైవాన్ని సాక్షాత్కరింపజేసుకొని, సంపూర్ణ ఆధ్యాత్మికచేతనను సముపార్జించుకొనడం మాత్రమేగాక, సమస్త జీవనాన్నీ, ప్రాపంచిక కార్యకలాపాన్నీ ఆధ్యాత్మిక పరిధిలోనికి తీసుకొచ్చి, జీవితాన్ని ఆత్మపీఠం మీద ప్రతిష్ఠించి దానికో ఆధ్యాత్మిక అర్థాన్నివ్వాలనేది. ఏకాంతవాసం గడుపుతున్నప్పటికీ శ్రీఅరవిందులు ప్రపంచంలోనూ, భారతదేశంలోనూ సంభవిస్తున్నదాన్నల్లా నిశితంగా గమనిస్తూ, అవసరమైనపుడల్లా ఆధ్యాత్మికశక్తితో, నిశ్శబ్ద ఆధ్యాత్మికచర్య ద్వారా గట్టిగా జోక్యం చేసుకుంటూనే వున్నారు.

పదార్థంలో పనిచేసే మనఃప్రాణదేహాల సాధారణశక్తులు, వాటి కార్యకలాపాలతోబాటు, వెనుక, పైన ఉండి పనిచేయగల, పనిచేస్తున్న శక్తులు కూడా ఉన్నాయనేవి యోగసాధనలో బాగా అభివృద్ధిసాధించిన వారందరి అనుభవం... అలా అభివృద్ధి సాధించిన వారందరూ [redacted]కు కోరినా, కోరకపోయినా లభించే క్రియాత్మక ఆద్యశక్తి ఉంటుంది. సక్రియాత్మకమైన ఈ ఆధ్యాత్మికశక్తి మిగిలినవాటికన్నా ఉన్నతతరమైనది, గొప్ప ప్రభావం చూపేది కూడా. ఇదిగో, ఈ శక్తిని శ్రీఅరవిందులు వశంచేసుకొని, మొదట్లో వ్యక్తిగతప్రయోజనం కోసం పరిమిత పరిధిలో ప్రయోగించారు. కాని తరువాత ప్రపంచశక్తుల మీద నిరంతరం ప్రయోగించారు. ఆ ప్రయోగ ఫలితాలవల్ల అసంతృప్తి చెందవలసిన కారణంగాని, లేదా మరో విధమైన చర్య తీసుకోవలసిన అవసరంగాని వారికి కన్పించలేదు. దీని కదనంగా ప్రత్యక్షచర్య కూడా తీసుకోవడం మంచిదనే అభిప్రాయం రెండు సందర్భాలలో వారికి కలిగింది. రెండవ ప్రపంచయుద్ధం సందర్భంలో మొదటిసారిగా ఆ ఆవశ్యకత కలిగింది. ప్రారంభంలో వారు దాన్ని గురించి గట్టిగా ఆలో

చించలేదు. కాని హిట్లరు తన ప్రతికూలశక్తుల నన్నింటినీ అణ ~~చించాడో~~, అపుడు వారు జోక్యం చేసుకోవడం ప్రారంభించివేసి, నాజీయిజం ప్రపంచాధిపత్యం వహించేట్లు ఎపుడైతే కన్పిం~~చారు~~. తమ మద్దతు మిత్రపక్షంవైపు బహిరంగంగా ప్రకటించారు. యుద్ధ నిధికై ఆర్థికవిరాళం ఇచ్చారు. వారి సలహాను కోరినవారికి, సైన్యంలో చేరమని లేదా యుద్ధానికి సంబంధించిన కార్యకలాపాల్లో పాలుపంచుకోమనీ ప్రోత్సహించేరు. డంకిర్క్ యుద్ధం ప్రారంభమైనపుడు, ఇంగ్లండు పతనం దగ్గరపడిందనీ, హిట్లరు విజయం ఖాయమనీ అనుకుంటున్న తరుణంలో వారు తమ ఆధ్యాత్మికశక్తిని మిత్రపక్షాని కందించారు. దాదాపు వెన్వెంటనే జర్మన్ల దూకుడు ఆగిపోవడం, యుద్ధం పూర్తి వ్యతిరేకదిశకు మారటం చూసి సంతృప్తి చెందారు. హిట్లరు నాజీయిజం వెనుక, అంధకార, ఆసురీశక్తులున్నాయనీ, వాటి విజయం, మొత్తం మానవజాతిని దుష్టశక్తి, దుష్పరిపాలనా బానిసత్వంలో పడవేయడమేననీ వారు గ్రహించారు. పరిణామ ప్రగతి, ముఖ్యంగా మానవజాతి ఆధ్యాత్మికపరిణామం తిరోగమనం సాగిస్తుంది అని కూడా వారు గ్రహించారు. అది యూరోపును మాత్రమేగాక, ఆసియాను, అందునా భారతదేశాన్ని బానిసత్వంలోనికి నెట్టివేస్తుంది. ఈ దేశం గతంలో ఎన్నడూ కనీవినీ యెరుగని భయంకర బానిసత్వంలోనికి నెట్టబడ్తుంది. అంతేగాక భారతదేశ విముక్తికై ఇంతవరకూ జరిగిన కృషి అంతా వ్యర్థమౌతుంది. ఈ కారణం చేతనే క్రిప్స్ ప్రతిపాదనను వారు బహిరంగంగా బలపర్చడం, కాంగ్రెసు నాయకులమీద, దానిని అంగీకరించమని వత్తిడి కలిగించడం జరిగింది.

జపాను భారతదేశంపై దాడి చేయడానికి, వీలైతే ఆక్రమించాలని కూడా చూస్తున్నదని స్పష్టంగా తెలిసేంతవరకూ, వివిధ కారణాలవల్ల వారు జపాను దురాక్రమణకు వ్యతిరేకంగా తమ ఆధ్యాత్మికశక్తితో జోక్యం చేసుకోలేదు. ఆసురీప్రకృతిని గురించిన తమ అభిప్రాయాలను, హిట్లరిజమ్ అంతిమ అనివార్య పరిణామాన్ని ధృవపరుస్తూ యుద్ధాన్ని బలపరుస్తూ వ్రాసిన లేఖ

లను కొన్నింటిని బహిరంగం చేయడానికి వారు అనుమతిం చారు. క్రిప్స్ ప్రతిపాదనను అంగీకరించడం ద్వారా, భారత దేశం, బ్రిటను రెండూ ఐక్యమై, ఆసురీశక్తులకు వ్యతిరేకంగా నిలుస్తాయనీ, క్రిప్స్ చూపించిన పరిష్కారం, భారతదేశం స్వతంత్రం సాధించే వైపు ఒక ముందడుగు అవుతుందనీ, వారు దాన్ని బలపర్చారు. సంప్రదింపులు విఫలమైనపుడు, దురాక్రమ ణకు వ్యతిరేకంగా కేవలం ఆధ్యాత్మికశక్తి మీదే ఆధారపడి పని చేశారు. అందువల్ల జపానువారి జైత్రయాత్ర, ఆ వెంటనే తీవ్రంగా అణచివేయబడి, చివరకు ఘోరపరాజయంగా మారటం చూసి తృప్తిచెందారు. ఆ తరువాత గూడా భారతదేశాన్ని గురించి, వారి భవిష్యద్దర్శనాలు వాస్తవరూపం దాల్చడం చూచి వారు సంతృప్తి చెందారు. ఆంతరంగిక ఇబ్బందులెన్ని ఉన్నప్పటికీ భారతదేశం స్వతంత్రమైనందుకు ఆమె విషయంలో, భవిష్యద్దర్శనాలు వాస్తవ మైనందుకు కూడా వారు సంతృప్తి చెందారు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కోనేరు వెంకటేశ్వరరావు

శ్రీమాతయొక్క శాశ్వత సాన్నిధ్యం అభ్యాసంవల్ల సిద్ధిస్తుంది. సాధనాసాఫల్యతకు దైవకృప ఆవశ్యకమే కాని, ఆ దైవకృప లబ్ధి అభ్యాసం ఆయత్తపరుస్తుంది. కేవలం బాహ్యవిషయాలలోనే నిమగ్నమగుట మాని వేసి, అంతర్ముఖుడవగుట నేర్చుకోవాలి. మనసును నిశ్చలపర్చాలి. శ్రీమాత నీలో చేయుచున్న పనిని గురించి తెలుసుకోవాలనే ఆకాంక్షను పెంచుకోవాలి. ఆమె దర్శనానికై తపించుట, ఆమె సాన్నిధ్యానికై వుబ లాటపడుట, నీ హృదయాంతరాళంలో ఆమె వైపు ఆకర్షితభావము కలుగుట – ఇవన్నీ సాధనకి అవస రమైన చైతన్యస్థితిని పెంపొందించుకునేందుకు కావ లసినవి.

తమ శక్తి గురించి

నిశ్చయంగా నా శక్తి ఆశ్రమానికి, ఆశ్రమపరిస్థితులకే పరిమితం కాదు. మానవలోక పరిణామానికి యుద్ధప్రగతికి విస్తృతంగా ఇది వినియోగింపబడుతోంది. ఆశ్రమాన్ని అధిగమించిన వ్యక్తుల ప్రయోజనాలకి, యోగానికి కూడా వినియోగింపబడుతోంది. కాక పోతే ఇదంతా ఆధ్యాత్మిక కార్యాచరణ ద్వారా నిశ్శబ్దంగా నిర్వ హింపబడుతోంది.

13-3-1944


*

నేను అతిమానసస్థాయిలో నిలిచివుండి అతిమానససాధన సంపత్తి ద్వారా కార్యనిర్వహణ చేస్తూ ఉండి ఉంటూంటే ప్రపంచం ఇప్పటిలాగాక, మరింత వేగంగా మార్పుచెంది, మరోవిధంగా ఉండి ఉండేది. నా ప్రస్తుత కృషి సుదూరమైన ఉన్నత అతిమానస భూమిక (Supermind level) పై నిలబడి ప్రపంచాన్ని పరిణమిం పచేయటం కాదు. ఆ భూమిక నుంచి తత్సంబంధితమైన దానిని క్రిందికి అవరోహింపజేసి తద్వారా క్రమక్రమంగా అధిమాన సము (Overmind) ను, అతిమానసీకరణం చేయటమే నా తక్షణ కృషి. ఇక రెండవ ప్రయత్నము. తీవ్రనిశ్చైతన్య ప్రతిఘటన, మానవ అజ్ఞానాలకది అందించే ప్రోత్సాహాన్ని నిర్వీర్యం చేయటం. వ్యక్తికాని, లోకంకాని పరిణామం చెందటానికిదే ప్రధాన అవ రోధం. యుద్ధం మొదలైన మానవ వ్యవహారాల నిర్వహణలో అధి మానసశక్తి (Overmind Force) నే వినియోగిస్తూంటానని – అతిమానసం కాదని – నేను ఎప్పుడూ చెప్తూంటాను. ఫలితంగా అది నిమ్నచేతనప్రపంచంతో విడతీయరానంతగా కలిసిపోవటం వల్ల, దానియొక్క ఫలితాలు ఎంత సమగ్రంగాను, అవసరానికి తగినంతగానూ ఉన్నా – తప్పనిసరిగా పాక్షికంగానే ఉంటవి.

07-7-1947

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు



దైవాసురశక్తుల మధ్య సమరం

(ఈ క్రింది ఉత్తరం ఐక్యమిత్రకూటమి చర్యను బలపరుస్తూ, వైస్‌రాయ్ యుద్ధనిధికి కొంత పైకం పంపడంతో పాటు, మద్రాస్ గవర్నర్‌కు వ్రాసిన ఉత్తరం. అవసరమనిపిస్తే దీనిని ప్రకటించుటకు తగిన నిర్ణయాన్ని గవర్నరుకే యివ్వబడినది.)

ఈ యుద్ధం ప్రపంచ ఆధిపత్యం కోసం జర్మన్ నాజీ నియంత చేస్తున్న బెదిరింపునకు వ్యతిరేకంగా, స్వీయరక్షణ కొరకు లేదా పలుజాతుల రక్షణకొరకు మాత్రమే చేస్తున్నది కాదు. ఇది నాగరికత రక్షణ కొరకు, సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువల పరిరక్షణ కొరకు, సకల మానవాళి భవిష్య రక్షణ కొరకు కూడా చేస్తున్న సమరముగా మేము భావిస్తున్నాము. ఏమైనా సరే యీ ఆశయం కొరకు తిరుగులేని మా సహకారసానుభూతులు అందిస్తాము. శాంతియుగము కొరకు, పలుజాతుల ఐక్యత కొరకు, ప్రపంచ ప్రశాంత పరిస్థితులకు దోహదకారియైన సత్ఫలితం కొరకు అవసరమైన బ్రిటిష్‌వారి విజయానికై మేము ఎదురుచూస్తున్నాము.

19-9-1940

*

(ద్వితీయప్రపంచ సంగ్రామ సందర్భంగా బ్రిటిష్ మిత్రమండలికి తమ సంపూర్ణ సహకారాన్ని అందించిన శ్రీఅరవిందులు తమ భక్తుల సందేహాలకు వ్రాసిన ప్రత్యుత్తరాల నుండి కొన్ని భాగాలు.)

ఈ యుద్ధం శ్రీమాత యుద్ధమా అని మీరు సందేహిస్తూ అదే అని మీరు భావించేలా చేయండని వ్రాశారు. ఔను, యీ సంగ్రామం శ్రీమాత సమరమే అని మరల నేను దృఢంగా నొక్కి చెబుతున్నాను. ఇది దేశాల మధ్య లేదా భారతదేశంపై జరుపుతున్న సంగ్రామంగా మీరు భావించరాదు. అద్యతనభావిలో యీ భూమిని, మానవాళిని అంధకార, అసత్యాలు కబళింప చూస్తున్నాయి. వాటికి వ్యతిరేకంగా సత్యం పరిపూర్ణంగా నెలకొనబడ

వలసి ఉన్నది. కనుక పృథ్వీపై, మానవాళి జీవితాన యీ ఆదర్శాన్ని స్థాపించుట కొరకై చేస్తున్న యుద్ధమిది. మనం చూడవలసింది బాహ్యాపరిస్థితులను కాదు. మనం గమనించవవలసింది యీ సంగ్రామం వెనుకనున్న శక్తులను. జాతులయొక్క లోపాల గూర్చి, దోషాల గూర్చి మనం ఆలోచించి ప్రయోజనం లేదు. అందరిలోనూ లోపాలుంటాయి. అందరూ తప్పులు చేస్తారు. కాని యీ సమరంలో యేవైపువారు లేదా యే దేశంవారు అధిక దురాక్రమణకు పూనుకున్నారన్నదే ప్రధానం. ఇది అభివృద్ధి కొరకు, స్వేచ్ఛ కోసం మానవాళి చేస్తున్న పోరాటం. మానవాళి స్వేచ్ఛగా ఆలోచించి, కర్మలాచరించి, సత్యధర్మపరాయణులుగను, ఆత్మోన్నతులుగను ఎదుగుటకు అవసరమైన స్వాతంత్ర్య సమరం. జర్మనులు విజయమందితే, మానవ స్వాతంత్ర్యానికి, సత్యజ్ఞాన వికాసాలకు అంతం తథ్యం అనేది నిర్వివాదాంశం. ఆ పై పృథ్వీపై అసత్యము, అజ్ఞానాంధకారము, క్రూరనిరంకుశత్వము రాజ్యమేలుతాయి. అంతేగాదు ప్రపంచ జనాభా చాలా భాగం నశించిపోతుంది. ఆ దుష్టుల విధ్వంసకాండ యీ దేశప్రజలు కలలో కూడ వూహించుకోలేనంతగా మితిమీరిపోతుంది. అలాగాక భవిష్యత్ మానవాళి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను అభిలషించి ప్రకటించే బ్రిటిష్ మిత్రకూటమి గెలిస్తే యీ భయంకర అపాయము నివారించబడుతుంది. ఆదర్శాల అమలునకు, దైవకార్య నిర్వహణకు, పృథ్వీపై మనం కోరే ఆధ్యాత్మికధర్మానికి, సత్యానికి అవకాశం కలుగుతుంది. ఈ ఆశయం కొరకు పోరాడేవారు దైవం కొరకు పోరాడేవారవుతారు. దీనికి వ్యతిరేకంగా పోరాడేవారు అసురపాలనకు పోరాడే వారవుతారు.

29-7-1942

*

బ్రిటిష్ మిత్రకూటమి తప్పు చేయలేదని మేమనడం లేదు. కాని వారు పరిణామశక్తుల వైపు నిలుస్తారు. ఈ మాటను నేను ఆనాలోచితంగా, నిరాధారంగా అనడం లేదు. తగిన ఆధారాలున్నాయి. మీరు చెప్పేది అంధకారం వైపునకు చెందినది. అన్ని జాతులు,

ప్రభుత్వాలు - కనీసం బలము, అవకాశం వున్నవన్నీ వాళ్ల పరస్పర వ్యవహారాల్లో అలానే వుంటున్నారు. ప్రభుత్వాలు ధర్మ బద్ధంగా, ప్రజలు నిస్వార్ధపరులుగా, పాపరహితులుగ వుంటున్నా రని నేను నమ్ముతున్నట్లు మీరు అనుకోవటం లేదని భావి స్తాను. కాని మనం చూడడానికి మరో పార్శ్వంకూడా లేకపో లేదు. ఆధునిక అంతర్జాతీయ ఆదర్శాలను ప్రమాణంగా తీసికొని చూస్తూ, అందరి ప్రవర్తనా దోషభూయిష్ఠంగా వుందంటూ మీరు మిత్రమండలి పట్ల అసమ్మతిని ప్రదర్శించారు. కాని యీ ఆదర్శా లైన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యము, సమానత్వము, అంతర్జాతీయ న్యాయము మొదలైనవి సృష్టించినదెవరు? మిత్రమండలి సభ్యు లైన అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లాండులు కావా? వారంతా సామ్రా జ్యవాదులే అయినా యీ ఆదర్శాలను, వీటిని అమలుపరచే సంస్థ లను వారు పెంపొందింప చేశారు. ఆచరణలో వాటి విలువ ఎలా వుంటున్నా, పరిణామ ప్రగతిలో అవి అసమగ్రస్థాయివే అయినా - అవొక అంతర్జాతీయ ప్రమాణస్థాయిలో నిలిచిపోయినాయి కదా! ఇతరుల పద్ధతి ఎలా వున్నది? ఉదాహరణకు హిట్లర్ అంటాడు - సంకర జాతీయులకు విద్య నేర్పించడం నేరం. వాళ్లను కార్మికులుగ - కూలీలుగ వుంచాలి అని.

ఈ ప్రపంచసంగ్రామం కేవలం జాతుల మధ్య లేదా మంచివారి, చెడ్డవారి మధ్య జరుగుచున్నదిగా గాక, దైవ- అసు రుల మధ్య జరుగుచున్న యుద్ధంగా మేము భావిస్తున్నట్లు మా ఉత్తరంలో మేము తెలియచేశాం. ప్రపంచంలోని పలు జాతులు, ప్రజలు యెవరివైపు నిలవాలన్నది మనమిప్పుడు విచారించవల సిన విషయం. వాళ్ళు సరైనవైపు నిలిస్తే - ఆ వైపు దేశీయులలో మానవస్వభావంలోని దోషాలు, లోపాలు వుంటున్నాసరే - అలా నిలిచినవారు దైవకార్య. ఉపకరణాలుగ వున్నవాళ్ళవుతారు. మిత్ర మండలి విజయం పరిణామశక్తులకు మార్గం సుగమం చేస్తుంది. అదే అసురశక్తుల విజయం మానవాళిని వెనక్కు లాగి, హీన స్థితికి గొనిపోతుంది. అది మానవజాతి వినాశహేతువవుతుంది. ఇదే అసలు సమస్య. తక్కినవన్నీ పరిగణకు రానట్టివే. మిత్రమం

డలి తమ ఆదర్శాలకు వ్యతిరేకంగా నడచినా, అవి మానవాళి విలువకోసం నిలిచినాయి. హిట్లర్ క్రూరమైన విలువలకు మార్గ దర్శకుడవుతాడు. అట్లని బ్రిటిష్‌వాళ్ళు, అమెరికన్లు మచ్చలేని దేవదూతలని, జర్మన్లు దుష్ట, పాపులు అని కాదు. అది వాళ్ళ స్వభావాలను తెలిపే ప్రాథమిక సూచన మాత్రమే.

మానవులు దోషరహితులుగ, పవిత్రులుగ, ఉత్తములుగా లేనప్పటికీ, వారిని దైవం, వారున్న స్థాయినుండే గ్రహించి తన సాధనాలుగా ఉపయోగించుకొంటాడు. వారు సత్ప్రవర్తనులుగ వుంటే, భగవంతునివైపు వుంటారు. దైవకార్యనిర్వహణకుఅది చాలును. ఐక్యకూటమివారు వారి విజయాన్ని దుర్వినియోగపర చుకొంటారని, శాంతిని కాపాడుకోలేరని, విజయం ద్వారా లభిం చిన అవకాశాలను వారు మానవాళి శ్రేయస్సుకు అనుగుణంగా ఉపయోగించుకోలేరని నాకు తెలిసి కూడ, నేను నా ఆధ్యాత్మి కశక్తిని వారి కొరకే ఉపయోగించి వుండేవాడిని. ఏది యేమైనా హిట్లర్ స్వాధీనంలో వుండి వుంటే పరిస్థితులు యెంత చెడుగా, యెంత దారుణంగా వుండి వుండేవో మిత్రమండలి చేతిలో అవి అంత దారుణంగా వుండవు. దైవపద్ధతులు యింకా మానవాళికి అందుబాటులోనే వుంటున్నవి. కాని మానవులు వాటికి ఎంత వరకు ఉన్మీలునులై వుంటారనేదే సమశ్య. భారతదేశాన్ని, ప్రపం చాన్ని భయపెట్టి బాధలకు, బానిసత్వానికి గురిచేసి ఉపద్రవాన్ని, క్రూరత్వాన్ని తొలగించుకొనే కార్యంలో మనం స్థిరంగా వుందుము గాక!

మూలము శ్రీఅరవిందులు
అనువాదం బి. నరసింహాయ్య

మరుగుజ్జు నెపోలియను

(హిట్లరు – 1939 అక్టోబరు)

(అది 1939 సం.రం. అక్టోబరు నెల. హిట్లరు విజయోత్సాహంతో ఉన్నాడు. యుద్ధనిపుణులు ఈతనిని నెపోలియన్‌తో పోలుస్తున్నారు. అప్పుడే శ్రీఅరవిందులు 'The Dwarf Napolean' కవిత వ్రాశారు. హిట్లరుకు కూడా ఏ గతి పడుతుందో వారు అప్పుడే జోస్యం చెప్పారు. ఆ కవిత నిక్కడ ప్రచురిస్తున్నాం. నవంబరు 1938 లో మ్యూనిచ్ ఒప్పందం తర్వాత శ్రీఅరవిందులు 'The Iron Dictator' అనే కవిత వ్రాశారు. ఆరంభం నుంచి హిట్లరు వలన మానవాళికి ఎలాటి ముప్పు వాటిల్లబోతోందో వారు దర్శించగలిగారు. వారు వ్రాసిన 'The Children of Waton' కవిత ద్వారా మనకది తెలుస్తుంది. (అగస్టు 1940) మరొక కవిత 'In The Battle' (సెప్టెంబరు 1939) కూడా ఆసక్తికరమైనదే. స్థలాభావంవల్ల ఆ కవితలన్నీ ఇక్కడ ప్రచురించలేకపోతున్నాం.)

ఆహ్!. ఏమీ ఈ ఊహాకల్పిత ఆకస్మిక ప్రచండ ప్రభవం...
ఘోరదౌర్జన్య, దారుణాద్భుత మాయాజనిత అక్రమ సంతానమా!
ఐంద్రజాలికుని మంత్రదండ ఆదేశ విన్యాసమా!
వాస్తవం ఊహాతీత సంభ్రమంతో సంగమించినదా!
అల్పమనల్పమును సాధించినదే. హీనముత్కృష్టమై భాసిస్తున్నదే.
అల్పప్రాణి నేలనాల్గు చెరగులా పురాణకాల మానవాతీత
అసురమూర్తివోలె కలయతిరుగుతున్నది.
నెపోలియను! – సాహసోపేతం, వేగవంతం, విశాలం – ఆతని
మానసం
హృదయమో! సంక్షుభిత సాగర గంభీరం
సంకల్పం! పట్టువీడని తీవ్రప్రచండ పరిష్వంగం.
కనుసన్నలలో ప్రపంచాధిపత్యం, లక్ష్యసాధనలో అసాధారణ
గాంభీర్యం
అల్పఘన వస్తురాశిని దర్శించే సమైక్యదృష్టి.

అగాధ, విశాలములలో బ్రహ్మాండసంచలిత చాలనాలు
రగిలే అత్యాశ. ఏ హీనలోకాలజీవుడు ఈ మరుగుజ్జు?
వెలుగెరుగని మందమతి, జిత్తులమారి, దురహంకారి
స్వభామి ఇనుపఖనిజ సమ్మిశ్రితము.
ఈ భావావేశ దురభిమాని, నికృష్ట క్రూరుని
హృదయం, ఏనాడూ మధుర యౌవనాలయం కాదు.
సహజోద్వేగాలు – ఆశ నిరాశాసంచలితాలు,
క్రౌర్యం, దౌర్జన్యం, కన్నీళ్లు, పెడబొబ్బలు.
అతనొక భూతం, శిశువు, పశువు.
పరుషోక్తుల వక్త, భావదారిద్ర్య ప్రవక్త.
తిరోగతి కధినేత. పాలనాబలం మాత్రం
విజయోత్సవ తోరణమే!
ప్రపంచమీతనికి సిద్ధ పక్వభోజ్యఫలం
లండను నుంచి కొరియా దాకా ప్రాకిన వీతని క్రీనడలు,
కాలు పెట్టిన జనపదాలు శ్మశానాలు.
పిడికిట్లో నలిగిపోయే జనం. ప్రపంచభవితను
తీర్చిదిద్దేది, నురగలు గ్రక్కే ఈ మూర్ఛరోగియా!
ఏ అమానుషశక్తీమరుగుజ్జును పైకెత్తి పట్టి ఉంచినదో!
ఇదొక మొరటైన హీనపరికరం. రూపుదాల్చి మానవుని కాల
రాసే రాక్షస నైపుణ్యం
ఉక్కు పరిష్వంగంలో భూమిని చుట్టచుట్టే
ప్రబలవాంఛితార్థము.. దుష్టసంకల్పము.
భీతావహ విశ్వప్రణాళిక
మానవవాంఛితార్థాలను ఒకే మూసలో అణగద్రొక్కే నైజం.
అదంతా చీకటి సామ్రాజ్యం. ఇంకా విస్తరిస్తే అది భూప్రళయం.
నిశ్చైతన్యం తిరిగి విజృంభించి హక్కుపొందే దుర్ముహూర్తం.
తొలినాటి అజ్ఞానసంద్రంలో, పరిణిత దివ్యచైతన్య
మానవుడు సరీసృపాలవలె, అంతర్ధానమయే అపశకునం.
ఈ అసురిని నీడ కంపిత భూమండల పరివ్యాప్తం
ప్రాణాంతక గిరిశృంగాగ్ర దుర్గం నియంతకి ఏకాంతవాసం.

వింటాడక్కడ ఆసురిక అశరీరవాణిని.
ఆపై మరి ఆకస్మిక నిర్ణయాలు, భీకరదాడులే!
అది నైపుణ్యంగా భూతం విప్పిన పులిపంజా.
దుష్టశక్తిని భరించలేని అల్పకాయం
దేహం భరించలేనిది ఆ భయానక అతిధి
ప్రపంచమంతా వశపర్చుకోవాలనే దురాశ,
అరుస్తూ, బెదిరిస్తూ, విలయతాండవం.
(ఎంతవరకిది ఇలా?) అల్లకల్లోల పెనుతుఫాను గమనంలో
మరో పెనుభూతాన్ని – లేక – మరింత భీకరపర్జన్యదేవ
గర్జనాన్ని, ఢీకొనే దాకా –

మూలం: శ్రీఅరవిందులు
భావానువాదం: కె. యజ్ఞన్న

అసత్యాధిపతితో శ్రీమాత భేటీ

(మార్చి 12, 1938 న, హిట్లరు ఆస్ట్రియా నాక్రమించాడు. తర్వాత జెకొస్లోవేకియాపై ఒత్తిడి తెచ్చాడు. సెప్టెంబరు 1938 లో ప్రపంచం ప్రమాదపుటంచుకు చేరుకుని ఉంది. సెప్టెంబరు 29 న మ్యూనిచ్ ఒప్పందంపై హిట్లరు, ముసోలినీ, Daldier, చాంబర్లేనులు సంతకాలు పెట్టారు. అక్టోబరు 22, 1938 న శ్రీమాత తమ కుమారుడు ఆండ్రేకి ఈ ఉత్తరం వ్రాశారు.)

ఈ మధ్య జరిగిన సంఘటనలను ప్రస్తావిస్తూ నీవు నన్ను అడిగావు – ఇది ప్రమాదం కలిగించే డబాయింపా లేక మనం తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నామా – అని. రెండూ సత్యదూరం కావని మనం భావించవచ్చు. నిజంగానే హిట్లరు డబాయిస్తున్నాడు. వీలైనంత ప్రయోజనం పొందటానికి బెదిరిస్తూ, జడిపించేలా అరచి గగ్గోలు పెడుతున్నాడు. వ్యూహాలు, కుతంత్రాలు మరి సరే సరి. అయితే ఇక్కడ మరొక విషయం ఉంది. ప్రతి ఒక్క మానవసంకల్పానికి వెనుక కొన్ని శక్తులు

పనిచేస్తూ ఉంటవి. వాటికి మానవతయే మూలాధారం కానక్క రలేదు. అవి కొన్ని ప్రయోజనాలను ఆశించి, ఆ దిశగా కదు లుతూ ఉంటవి. ఈ శక్తుల తాలూకు లీలావిశేషాలు సంక్లిష్టంగా ఉంటాయి. మానవచైతన్యానికి సాధారణంగా అందవు. సులు వుగా బోధపడేలా చెప్పాలంటే ప్రధానంగా రెండు విరుద్ధమైన – tendencies ఉద్దేశాలతో కూడుకొని ఉంటాయి. దైవకార్యాన్ని ఈ భూమిపై సఫలీకృతం చేయటానికి భావింపబడేవిగా ఉండేవి (సదుద్దేశాలు) ఒకట్రైతే, అందుకు విరుద్ధంగా (దైవకార్యాన్ని) విఫలం కావించేవి, మరొకటి (దురుద్దేశాలు). సదుద్దేశాలను సఫ లీకృతం కావించే చైతన్యవంతమైన ఉపకరణాలు కొద్దిగానే ఉంటాయి. వాసికంటె రాసియే మిన్న. ఆసురికశక్తులు ఎప్పుడూ సాధారణంగా పుష్కలంగానే అందుబాటులో ఉంటాయి. అవె ప్పుడూ వ్యక్తుల ఇచ్ఛాశక్తిని స్వాధీనపర్చుకుని, తమకు విధే యంగా మలుచుకొని, నిశ్చైతన్యవంతం కావించి కీలుబొమ్మ లుగా మార్చివేస్తాయి. హిట్లరు ఆసురికశక్తులచేత ఎన్నుకోబడిన అలాటి ఉపకరణం. వాటికి కావల్సినదల్లా యుద్ధాలు, ఉపద్ర వాలు. దివ్యశక్తులనాటంకపరిచే అవరోధాలు అవి. ఏ మానవ పాలనాయంత్రాంగం అయినా కావాలని కోరకపోయినా విపత్తులు పొంచి ఉండనే ఉంటాయి. కాని ఎట్టి పరిస్థితులలోనూ యుద్ధం రాదు, రానీయకూడదు – ప్రస్తుతానికి for the time being.

(అక్టోబరు 22, 1938)

*

(చాలా సంవత్సరాలు తర్వాత ఆశ్రమ తరగతిగదిలో ఒక విద్యార్థి అడిగిన: ప్రాణికస్థాయి ప్రపంచజీవులు ఆధ్యాత్మిక జీవనానికి ఎందుకు ఆకర్షింపబడతారు? – ప్రశ్నకి –. సమాధానంగా శ్రీమాత వివరణ.)

ఆకర్షితులవుతారు కాని – ఆధ్యాత్మిక జీవనాన్ని త్రికరణ శుద్ధిగా పాటించాలని నిర్ణయించుకుంటారని కాదు. వీళ్ల ప్రత్యేక లక్షణం అసత్యం, కుయుక్తి, మోసపూరితమైన స్వభావం, భ్రమిం పచేసే శక్తి. దివ్యజీవనులుగా పైకి కనిపిస్తారు. కళ్లు మిరుమిట్లు

కొలిపే కాంతితో మెరిసిపోతూ ఉంటారు. త్రికరణశుద్ధి కలిగిన వాళ్లు మాత్రం వాళ్లచేత మోసగింపబడరు. వీళ్లకి వెంటనే ఒక హెచ్చరిక లాంటిది స్ఫురిస్తుంది. కొంతమంది ఊహించని అసహజమైన అద్భుతాలు ఇష్టపడతారు. అలాటివాళ్లు చాలా సులువుగా మోసగింపబడతారు.

మనకి ఇలాటిదే ఈ మధ్యనే జరిగిన చరిత్రాత్మక సంఘటన ఉంది. అదే – హిట్లరుకు సంబంధించినది. ఆతనికి ఒక జీవం (Being) తో అనుబంధం ఉండేది ఆ జీవుని నతను Supreme Being అని భావించేవాడు. ఈతని నుంచి సలహా తీసుకునేవాడు. ఏమి చెయ్యమంటే అది చేసేవాడు. ఏకాంతం లోనికి ఉపసంహరించుకునేవాడు. ఆ మార్గదర్శకుడు తన దరి చేరి ఉత్తేజపరిచేవరకు నిరీక్షించేవాడు. ఇచ్చిన సలహా తు.చ తప్పక పాటించేవాడు. ఆ జీవుని సర్వోన్నతునిగా హిట్లరు భావించేడు. నిజానికది ఒక అసురశక్తి. అతీంద్రియజ్ఞానంలో (occultism) దానిని 'the Lord of Falsehood' అని పిలుస్తారు. ఈ జీవుడు తనను 'the Lord of Naions' గా ప్రకటించుకున్నాడు. ఈతడు ధగద్ధగాయమానంగా కండ్లు మిరుమిట్లు కొలిపేలా వెలిగిపోయే వాడు. ఎవ్వరినైనా తప్పుత్రోవ పట్టించగలిగేవాడు. ఎంతో వైభవోపేతంగా ఉండేవాడు. అతీంద్రియజ్ఞానులను, పైమెరుగులకు మోసపోనివాళ్లను మినహాయించి ఎవ్వరినైనా మోసగించగలిగేవాడు. ఊర్ధ్వాంగకవచం, శిరస్త్రాణం ధరించి హిట్లరికి సాక్షాత్కరించేవాడు. శిరస్సు నుంచి ప్రజ్వలించే ఒక జ్వాలతో మిరుమిట్లుకొలిపే కాంతితో దుర్నిరీక్షంగా ఉండేవాడు. కన్నెత్తి హిట్లరు ఆతనిని చూడలేకపోయేవాడు. హిట్లరు ఏమి చేయవల్సినదీ ఆతనే నిర్దేశించేవాడు. హిట్లర్ని కోతిని ఆడించినట్లు ఆడించేవాడు. అవకాశము ఉన్నంతవరకు హిట్లరుచేత మితిమీరిన దురాగతాలు చేయించాడు – చివరికి హిట్లరుకి శిరశ్ఛేదం జరిగే పర్యంతము కూడా – అల్పస్థాయిలో ఇట్టి సందర్భాలు సర్వసాధారణం.

హిట్లరు ఒక గొప్ప medium మాధ్యమం (దుష్టశక్తులకు) గొప్పగా ఉపయోగపడే సాధనం. తెలివి, వివేకం ఉన్నవాడు

కాదు. This being could tell him anything whatever and he swallowed it all. ఆ (దుష్ట) జీవి ఏది చెప్పినా నమ్మేవాడు. కొంచెం కొంచెం హిట్లరును ముందుకు నెట్టేవాడు. అదొక వినోదం ఆ జీవునికి. వీళ్లకి మనుష్యులు అల్పులు, ఆటవస్తువులు. వీళ్లతో ఆడుకునే వారు. పిల్లికి ఎలుకతో చెలగాటం. చివరికి ఎలుకకి ప్రాణసంకటం.

ప్రశ్న: హిట్లరు మరణానంతరం 'అసత్యాధిపతి' స్టాలిన్ లోనికి చొరబడ్డాడా?

విషయాలు పూర్తిగా అలాగే ఉండవు. కాని కొంత సారూప్యత లేకపోలేదు. ఆ జీవుడు హిట్లరు మరణం కోసం వేచి ఉండలేదు. ఇక్కడ మీరు పొరబడుతున్నారు. ఆ జీవులు ఏ ఒక్క భౌతికజీవుని అంటిపెట్టుకొని ఉండిపోరు. హిట్లరులాటి వానిని ఏ ఒక్కరినో ఆవహించుకొని ఉండకుండా ఎంతోమందిని దుష్ప్రభావితులను చేస్తారు. హిట్లరు వదల్చుకోబడినాడు. ఒక పూర్తి దేశం, భౌతికశక్తి ఆతని వెనుక ఉన్నది. ఆ దుష్టశక్తియే కనుక చివరివరకూ ఉండి నెగ్గి ఉంటే మొత్తం మానవజాతి సర్వనాశనమయేది. ఆ దుష్టశక్తిని వదల్చుకోవటం కూడా అంత సులువు కాదు. వదల్చుకున్నంత మాత్రాన సరిపోదు కూడా..

మీకో ముఖ్య విషయం చెప్పాలి. ఈ శక్తుల పుట్టుపూర్వోత్తరాలు దేవతలకు ముందువి; they are the first emanations – ముందు ఉద్భవించినవి. విశ్వాన్ని ఈ దుష్టశక్తులు అంత సులువుగా వదలవు. ఒక యుద్ధం సరిపోదు.

విశ్వపరిణామ ప్రక్రియకు అవసరమైనంత వరకూ అవి ఉంటాయి. వాటి అవసరం తీరాక అదృశ్యమవటమో లేక మార్పు చెందటమో జరుగుతుంది.

వాటికి అంతిమ ఘడియలు వస్తున్నాయని తెలుసు. అందుకే పోయే ముందు చేయవల్సినంత విధ్వంసమూ చేస్తున్నాయి.

అవి నాలుగు శక్తులు. మొదటిది మార్పు చెందినది. మరొకటి ఎక్కడి నుంచి వచ్చినదో అక్కడికే అదృశ్యమైనది. ఇక

రెండు శక్తులు ఉన్నాయి. పోయిన రెండింటి కంటె ఇవి కౄార మైనవి. ఒకదానిని అతీంద్రియజ్ఞానంలో the Lord of Falsehood 'అసత్యాధిపతి' అని, మరొకదానిని the Lord of Death 'మృత్యు అధిపతి' అని అంటారు. ఈ రెండూ ఉన్నంతకాలం కష్టాలు కూడా ఉంటూనే ఉంటాయి.

*

(మరి రెండు సంవత్సరాలు తర్వాత క్లాసురూములో మరొక ప్రశ్నకి శ్రీమాత, సమాధానంగా ఈ క్రింది వివరణ ఇచ్చారు.)

'అసత్యాధిపతి' అపరిమితమైన హాని కలుగచేస్తాడు. విశ్వంలో సత్యాని కీతను నిరంతర వ్యతిరేకి. అవరోధం. భౌతిక ప్రపంచంలో ఈ శక్తికి గొప్ప పట్టు ఉంది. చూడటానికిది మను ష్యులకి అత్యంత ఆకర్షణీయంగా, అద్భుతంగా కనిపిస్తుంది. 'దేశాలకధిపతి' అనిపించుకునేది కూడా ఇదే. కాంతివంతంగా, ఉత్తేజకరంగా, దుర్నిరీక్షంగా ఉంటుంది. దేశాధిపతిగా పాలించే శక్తి. రెండు ప్రపంచయుద్ధాలకు సర్వోన్నత సాధన కర్తగా వ్యవ హరించినది ఇదే. రాజ్యాధిపతిగా అభివ్యక్తమైనది. తన్నెవ్వరూ మార్చలేరని ప్రకటించుకున్నది కూడా ఆ సందర్భంలో. కాని తనకు తెలుసు – తన అంత్యకాలం సమీపిస్తున్నదని. ఆ సమ యాన్ని వీలైనంత ఆలశ్యమయేలా చూసుకుంటూన్నది. తాను నాశనంకాకముందు, వీలైనంత విధ్వంసం సృష్టిస్తానని ప్రకటిం చింది. ఎన్నో దుర్ఘటనలు వచ్చే అవకాశమున్నది.

ప్రశ్న: ఫిబ్రవరిలో ఒక క్రొత్త వెలుగు ప్రభవిస్తుంది భూమిపై అని మీరు సందేశం ఇచ్చారు. ఆ వెంటనే (మార్చి 5, 1953) స్టాలిన్ మరణించాడు. దానికిది సూచనా?

నిజానికది స్వల్పమైన ఫలితం. స్టాలిన్ మరణం ప్రస్తుత ప్రపంచస్థితిని మార్చలేదు – (హిట్లరు మరణంవల్ల పెద్ద మార్పు లేనట్లే). అంతకంటె కావల్సినదేదో ఉంది. హంతుకుని తల నరి కివేసినా వాని జీవాత్మ మిగిలివుండి, ఛాయారూపాంగా ఉంటుంది. ఒక ప్రాణికరూపంగా ఏ ఒక్కని ప్రేక్షకునిలోనో ఆశ్రయం తీసు కుని ఉంటుంది.

హిట్లరు ఒక సాధారణ మానవుడు. మనోబలంలేనివాడు. విపరీతమైన భావావేశపరుడు. సాధారణ కార్మికుడు. చెప్పులు కుట్టుకునేవాడని కొందరు చిన్న స్కూలు టీచరని, కొందరు అంటారు.

సామాన్యుడే – కాని ఆవహింపబడినవాడు. He was possessed అందుకు తగ్గట్టుగా కూడా (medium) ఉండేవాడు. ఏదో (శక్తి) అతనిని గట్టిగా ఆవహించేది. ఆ సమయాలలో అప స్మారకంగా ఉండేవాడు. గొప్ప ఆవేశంతో ఊగిపోయేవాడు. 'శక్తి' నుంచి తానేదైనా తెలుసుకోగోరినపుడు తన ఏకాంత దుర్గంలోకి వెళ్లిపోయేవాడు. ధ్యానంలో 'శక్తి' ని చాలా గాఢంగా ఆవాహనం చేసేవాడు. అదే అతనికి పరమదైవం. అప్పుడతనికంతా దివ్యంగా అగుపించేది. వెండికవచం, బంగారుకుచ్చుతో ఉన్న శిరస్త్రాణం ధరించి, కళ్లు మిరుమిట్లు కొలిపేటంతగా మెరిసిపోతూ కళ్లతో చూడలేకపోయేలా అవతరించేది. శరీరం కనపడేది కాదు. హిట్లరు ఒక medium కదా! అతనికి కనిపించేది. ఒక రకమైన దివ్య దృష్టి. ఆతనికి ఉండేది. అట్టి సందర్భాలలో అతనికి fits వచ్చేవి. నేలపై పడి దొర్లేవాడు. చొంగలు కార్చేవాడు. కార్పెట్టుని ముక్కలు ముక్కలుగా కొరికేవాడు. భయంకరమైన పరిస్థితి అది. తన చుట్టూ ఉండేవాళ్లకిది తెలుసు. అదొక శక్తివంతమైన భూతశక్తి.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(K.D. Sethna – Amal Kiran – wrote the following in his articles – 'Recollections of Life with the Mother', *Mother India, April 1979)*

రోజు రోజుకీ హిట్లరు రెచ్చిపోతున్నాడని శ్రీమాత తెలు సుకున్నారు. 'అసత్యాధిపతి' the Lord of Falsehood హిట్లరికి బవేరియన్ ఆల్ప్స్‌లోతన రహస్యస్థావరంలో ఎలా కనిపిస్తూ ఉత్తే జపరచి విజయకారకుడు అయినాడో అలానే తాను (శ్రీమాత) కూడా సూక్ష్మశరీరం ధరించి బాహ్యాచైతన్యాన్ని కల్పించుకుని

హిట్లరు దగ్గరికి వెళ్లారు. స్టాలిన్‌రష్యాపై దండెత్తమని ఆదేశిం చారు. ఇది చిత్రవిచిత్రమైన ఆజ్ఞ. స్టాలిను హిట్లరుకి మిత్రపక్షం లోవాడు. బాహాటంగా ఇది అందరికీ తెలిసిన విషయం. ఎప్పటి లానే హిట్లరు ఈ ఆదేశాన్ని ప్రగాఢ విశ్వాసంతో శిరసావహిం చాడు. గతంలో తాను పొందిన ఊహించని బ్రహ్మాండమైన విజ యాలు అతని కెలాటి సందేహం కలగటానికి అవకాశమివ్వ లేదు. సర్వోన్నత శాసనంగా విశ్వసించి, ఒకప్పటి తన భాగస్వా మిపై తిరుగులేని భీకరమైన ఆకస్మిక దాడి ప్రకటించాడు.

శ్రీమాత తిరిగి వస్తూండగా హిట్లరు దరికిపోతూన్న అసలు Lord of Falsehood తారసపడ్డాడు. తన స్వరూపంలో ఉన్న మరొక వ్యక్తిని చూడగానే దిగ్భ్రాంతి చెందాడు. హిట్లరు దగ్గరికి పరుగుతీశాడు .. వద్దని చెప్పటానికి. హిట్లరు నమ్మలేదు. నిజానికి తన అంతరంగంలో స్టాలిన్ రష్యాని ధ్వంసం చేయా లనే కోర్కె ఉంది. తన స్వీయచరిత్ర Mein Kampf లో ఇది వివరించాడు. ఘనంగా ముందుకు సాగేడు. రెండోమారు తన కగుపించిన రూపం నకిలీది అనుకుని మోసపోయాడు.

*

ప్రాసంగికంగా శ్రీమాతను ఎవరో అడిగారు: రష్యా హిట్లరు పక్షాన ఉండి ఉంటే పరిస్థితులు మరింత మెరుగ్గా ఉండేవా.. అని. ఆమె బదులిచ్చారు. "ఓ! కాదు, ప్రపంచం నిరాశావహంగా ఉండేది. మా అద్భుతచర్యవల్ల వారు పరస్పర శత్రుపక్షాలలో ఉన్నారు. This is divine diplomacy. ఇది దివ్యతంత్రం. సఫ లీకృతమైనది."

నిరోద్బరన్

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు



మానవ అనుబంధాలు

శ్రీమాతారవిందుల ప్రవచనములు

అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2007

మానవ అనుబంధాలు

విషయసూచిక

నీకు అతిసన్నిహితంగా ఉండే దివ్యప్రేమానంద పారవశ్యం మానవులలోని మాధవప్రేమ. అక్కడ కూడా అది వైవిధ్యమైన బహుళ ఆనందం.

*

అతినికృష్టమైన క్రిమిని, పరమ ఏహ్యామైన నేరస్థుని నీవు ప్రేమించలేనప్పుడు నీ అంతరంగ దైవాన్ని ఎలా అంగీకరించి ఆమోదింపగలుగుతావు?

శ్రీఅరవిందులు



The Mother in Japan, 1917


దైవం నీతోనే ఉన్నది

నీవు ఏకాంతంగా లేవు అనే విషయం ఎన్నడూ మరువకు. నీకు సహకరిస్తూ, ముందుకు నడిపిస్తూ దైవం నీతోనే ఉన్నది. నిన్నెన్నడూ ఉపేక్షించని చెలికాడు ఆయన. తన ప్రేమతో నిన్ను ఓదార్చి శక్తినిచ్చే స్నేహితుడు ఆయన. విశ్వసించు. ఆయనే అంతా నీకు సమకూరుస్తాడు.

*

దైవానికి మాత్రమే చెంది ఉంటూ, దైవం కోసం పని చేస్తూ అన్నిటికీ మించి, దైవశక్తి, శాంతి, సంతృప్తులనే అపేక్షిస్తూ ఉండటం ఆదర్శవంతమైన దృక్పథం. దయాపూరము దైవము. లక్ష్యాన్ని చేరుటకు మనకు అవసరమైనదంతా ఆయనే సమకూరుస్తాడు.

శ్రీమాత



ఆయన మాత్రమే సమర్థుడు

దైవం నుంచి తప్ప మరెవ్వరి సహకారాన్నీ అన్వేషించకు. మరెక్కడి నుంచి సంతృప్తిని పొందకు. నీ అవసరాల పరితృప్తికి దైవాన్ని తప్ప మరెవ్వరినీ – దేని కోసమూ – అర్థించకు. నీ అవసరాలన్నీ భగవంతుడే తీరుస్తాడు. నీ బలహీనతలన్నీ భగవంతుడు మాత్రమే భరించి నివారిస్తాడు. నీకు కావల్సినదల్లా ఎప్పుడూ ఇవ్వటానికి ఆయన మాత్రమే సమర్థుడు. మరెవ్వరి నుంచైనా సహకారాన్ని, సంతృప్తిని, సంతోషాన్ని – ఏదైనప్పటికీ – పొందాలని ప్రయత్నించావో, ఏదో సమయంలో బోర్లాపడతావు. మరి అదెప్పుడూ నీకు బాధ గలిగిస్తుంది – ఒక్కొక్కప్పుడు మరింతగా.

మూలం: శ్రీమాత

మనం ఒకరికొకరం బాగా దగ్గర అవుతుంటాం. ఇందుక్కారణా లను మనం జాగ్రత్తగా పరిశీలిస్తే, మన అస్తిత్వపులోతుల్లో అనేక స్థాయిల్లో చేసే కార్యాచరణసరళి ఆధారంగా జరుగుతూన్నట్లు గమనిస్తాం.

ఈ బంధుత్వాలను నాలుగు ప్రధాన తరగతులుగా వర్గీక రించవచ్చు. మన కార్యాచరణ అంతా భౌతికం, ప్రాణికం, చైత్య, మానసిక అనే నాలుగు ప్రధాన అంశాల మీద ఆధారపడి జరు గుతుంది. ఆ నాలుగు ప్రధానాంశాలకు సంబంధించిన నాలుగు ప్రధాన తరగతులుగా మన బాంధవ్యాలను వర్గీకరించవచ్చు. ఒకటి లేక అనేక స్థాయిల నుండి ఈ బాంధవ్యాలు ఒకేసారి, లేదా ఒకదాని తర్వాత ఒకటిగా ఏర్పడి కొనసాగుతుంటాయి. మన కార్యచరణ గుణగణాల్నిబట్టి కూడా ఈ బాంధవ్యాల ప్రభావం వుంటుంది.

మనకొక భౌతికదేహం ఉన్నది కనుక, భౌతికసంబంధం తప్పనిసరిగా చెప్పాల్సి వస్తుంది. మనకు ఈ దేహాన్ని ఇచ్చిన వారి తోనూ, వారి మీద భౌతికంగా బాగా ఆధారపడిన వారందరి తోనూ మనకు, కాదనలేని బాంధవ్యం ఏర్పడుతుంది. వీటినే రక్త సంబంధాలంటాము. సన్నిహితత్వం ఇరుగుపొరుగువారితోనూ, ప్రయాణాల్లోనూ, బజార్లోనూ, ఇతరులతో పరిచయా లేర్పడతాయి. (నేనిక్కడో విషయం చెప్పదలచుకొన్నాను – ఈ చెప్పే విషయం మిగతా మూడు రకాల సంబంధాలకు కూడా వర్తిస్తుంది – అదే మిటంటే ఇలా ఏర్పడిన బాంధవ్యం తప్పకుండా భౌతికానికే సంబంధించినదై వుంటుందని చెప్పను, వాస్తవానికి చాలా అరు దుగా అలా అవుతుంది. ఎందుకనంటే మనం మన అస్తిత్వంలో ఒకే స్థాయి నుంచి మాత్రమే ఎప్పుడూ పనిచేస్తూ ఉండం. నా ఉద్దేశ్యం ప్రకారం ఇలాంటి సందర్భాల్లో ఏర్పడే భౌతిక బాంధవ్యం మిగతా మూడింటికన్న ఎక్కువ ప్రభావం కలిగి ఉంటుంది అని.)

ప్రేరణలు, కోరికలు ఒకే రకంగా ఉన్నా, లేక కలబోసుకోడానికి అనువుగా వున్నా ప్రాణికస్థాయిలో బాంధవ్యం ఏర్పడుతుంది.

ఆధ్యాత్మిక ఆకాంక్షలు ఏకోన్ముఖంగా సాగుతుంటే చైత్య సంబంధం ఏర్పడుతుంది.

పరస్పరం ఇష్టపడి గౌరవించుకోగలిగే ఒక రకమైన మనోభావాలు, ఉన్నప్పుడు మానసికబాంధవ్యం ఏర్పడుతుంది. భౌతికంగా భౌతిక కారణాలవల్ల సన్నిహితులైనవారికి, భౌతికపరమైన సహకారం అందించగల్గుతాం, అందించాలి కూడా. మిగిలిన ఏ ఒక్క వర్గం యొక్క ప్రాబల్యం అంత ప్రస్ఫుటంగా వ్యవస్థీకరింపబడకపోయినప్పటికీ, మనయొక్క సత్వపులోతులలో, సంక్లిష్టతలలో క్రమపద్ధతి వ్యవస్థీకరించగల్గినపుడు మాత్రమే ఇది సంభావ్యం కాగల్గుతుంది.

మన కుంటుంబ సభ్యులకు లేదా ప్రయాణాలలో యాదృచ్ఛికంగా కలుసుకొన్నవారికి కొన్ని మినహాయింపులతో, మనం చేయగల భౌతికస్థాయి అత్యుత్తమ సాయం అవుతుంది. అలాగే జబ్బుపడ్డప్పుడు, ప్రమాద సమయాల్లో చేయగల ఆర్థికసాయం కూడా.

కళకు సంబంధించిన ఇతర అభిరుచులు కలిసినందువల్ల మనకు ఆకర్షితులైనవారిలో దిద్దుపాటు చేయవలసి వస్తే సరిదిద్దటం ద్వారా సమతుల్యత నేర్పరచడం ద్వారా, లేదా వారి ఇంద్రియశక్తుల్ని సరైన మార్గంలో నడపడం ద్వారా వారిని ప్రోత్సహిస్తూ సాయపడాలి.

అభివృద్ధి కొరకు ఉమ్మడి ఆకాంక్షవల్ల మనకు సన్నిహితులైనవారికి, మనం ఆదర్శంగా ఉంటూ అనురాగపూర్వకంగా మనం మార్గదర్శకులం కాగలం.

చివరగా, భావసారూప్యతవల్ల మనకు చేరువైనవారిపై మన బుద్ధిప్రకాశాన్ని వారిపై ప్రసరింపచేయడం ద్వారా వారి ఆలోచనాపరిధిని విస్తృతం చేసి, వారిని మరింత వివేకవంతులుగా, ఆదర్శప్రాయులుగా చేయగలం.

...మొత్తం మన అస్తిత్వపు నాలుగు ప్రాకారాలలోనూ మనకు సన్నిహితం కాగలిగినవారు చాలా అరుదు. వీళ్లే ప్రాణ స్నేహితులు కాగలరు. వారి మీదే మన చర్యలు, అత్యంత సమగ్ర, పరిపూర్ణ ప్రయోజనం కలిగించే ప్రభావాన్ని చూపుతాయి.

ఇద్దరు మనుష్యుల మధ్య బాంధవ్యం ఎంతకాలం వుంటుం దనేది అంతస్సత్వాలలో ప్రగాఢంగా, వారిని బంధించే సారూప్య తల మీద ఆధారపడి వుంటుంది.

మన సమస్తంలో ఉన్న శాశ్వత అంతస్తత్వంతో సంపర్కం కలిగి ఉన్నవాళ్లు మాత్రమే, శాశ్వతంగా ఒక్కరై వుండగలరు. ఇక్కడ మరెవ్వరైనా అన్నివేళలా నిరంతరాయంగా సన్నిహిత లేక దూరస్థ మిత్రులుగా ఉండిపోతారు.

మన అస్తిత్వపు తెలియని అంతరంగపు లోతుల్లో, మనకు ఎదురయ్యే అనుభవాలపై మనం ఈ స్నేహితులను కలుసుకో గలమో లేదో ఆధారపడి వుంటుంది. అంతేగాక ఈ కలయిక జరిగినపుడు, మన దృక్పథం మొత్తం పూర్తిగా మారిపోతుంది.

మనలోని దైవత్వంతో మమేకమైనపుడు మన అంతరంగ లోతుల్లో సర్వంతోనూ ఒకటవుతాము. ఆ దైవత్వం ద్వారా, ఆ దైవత్వంవల్ల సమస్తజీవులతోనూ సంసర్గం కలుగుతుంది. అపుడు సమస్త ఇష్టాయిష్టాల నుండి, ఆకర్షణవికర్షణల నుండి స్వేచ్ఛ పొంది, ఆ దైవత్వానికేది సన్నిహితమో దానికి దగ్గరౌతాము, దానికేది దూరమో దానికి దూరమౌతాము.

*

...నీకు జంతుచేతన వుంటే జంతువులా ప్రేమిస్తావు. ఒక సాధా రణ మనిషి చేతన నీకుంటే, సాధారణ మనిషిలా ప్రేమిస్తావు. ఒక మేధావంతుని చేతన నీకుంటే, అతనిలా నీవు ప్రేమిస్తావు. నీకు భగవంతుని చేతన వుంటే భగవంతునిలా ప్రేమిస్తావు. ఇది పిల్లలు కూడా గ్రహించగలిగేంత తేలిక విషయం. అభివృద్ధి చెందాలనే ప్రయత్నంతో, అంతర్గత రూపాంతరీకరణంతో ఆకాంక్ష, వికాసంతో, నీవు ఒక చేతన నుండి మరో చేతనలోనికి పయ నిస్తావు. నీ చేతన అంతకంతకు విశాలమవుతుంటుంది. అలాగే

నీ వనుభవించే ప్రేమ కూడా విశాలమూ, మరింత విశాలమూ అవుతుంది. స్పష్టమైంది కదూ!

పరిశుభ్రమైన నీటిని తీసుకో. స్ఫటికంలా మెరిసే రాళ్లపై నుంచి ప్రవహించే నీటిని, ఒక మోస్తరు పాత్రలో సేకరించు. ఈ పాత్రలో ఎంతో కొంత బురద ఉందనుకో, నీవు సేకరించిన, పైనుంచి ప్రవహిస్తూ వచ్చిన నీరు ఇదేనని చెప్పలేవుగా. ఆ పాత్రలో బురదరూపంలో అనేకం కలిసి ఉన్నందువల్ల, నీవు సేకరించిన నీటికి, దీనికీ పోలిక ఉండదు. అలాగే, ప్రేమ అంత స్సారంలో ఎంతో పరిశుద్ధమైనది, స్ఫటికంలా స్వచ్ఛమైనది, పరి పూర్ణమైనది, అయినా మానవచేతనలో ఎంత ఎక్కువ వుంటే అంత కలుషితమవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కె.వి. రావు

అనుబంధాలు

నీవు చెప్పే విషయం మానవస్వభావానికి సహజం. భావసారూ ప్యత వల్ల ఏకాభిప్రాయం స్వభావంలోని ఏదో ఒక అంశంలో పరస్పర ఆకర్షణవల్ల, ఒకరికొకరు దగ్గరవుతారు. హర్షామోదాలు కలిగించేవి. లేదా తాను మంచి లక్షణాలనుకొన్నవన్నీ బహుశా, నిజాని కతనిలో లేకపోయినా, లేదా ఊహించినంతగా లేకపో యినా, వున్నట్లు భావించడం మొదట్లో జరుగుతుంది. కాని సన్ని హితంగా మెలగడంతో ఆతని స్వభావంలో భావసారూప్యతలేని ఇతర అంశాలు తెలుస్తాయి – స్వభావ వైరుధ్యాలు, అహంకార ఘర్షణలు తెలుస్తాయి. చిరకాలం స్నేహం లేక ప్రగాఢప్రేమ వున్నట్లయితే ఈ సంబంధంలోని యిబ్బందుల్ని అధిగమించి సామరస్యస్థితికి చేరుకొని ఒకరితో ఒకరు సర్దుకుపోవచ్చు. కాని చాలా తరచుగా ఇలా జరగదు, లేదా పరస్పర సర్దుబాటు ధోర ణిని త్రిప్పికొట్టేంత తీవ్రమైన అసమ్మతి చోటు చేసుకోవడం,

లేదా తిరిగి కోలుకోలేని విధంగా అహం దెబ్బతినడం జరుగుతుంది. అలాటప్పుడు వానిలో అన్నీ దోషాలే కన్పించడం, అల్పమైనవి, అనల్పంగా లేనివి ఉన్నట్లుగా చూడటం జరుగుతుంది. మొత్తం దృక్పథమే మారిపోవచ్చు, మంచి చెడుగా మారటం ఒకరికొకరు ఎడమైపోవడం, విరోధభావం పెంచుకోవడం కూడా జరుగుతుంది.

మానవజీవితంలో ఎప్పుడూ జరిగేదిదే. కాని దీనికి విరుద్ధంగా కూడా, అంటే చెడు మంచిగా, వైరుధ్యం సామరస్యంగా మారడం కూడా జరుగుతుంటుంది, కాని అంత తేలిగ్గా మాత్రం కాదు. ఒక వ్యక్తిని గురించి చెడు అభిప్రాయం కలగడం, లేదా చెడ్డవాడు అన్పించడం ఏదో ఒక్క కారణం వల్లే కాకపోవచ్చు అనేది కూడా నిజమే. అనేక కారణాలవల్ల అంటే బాహ్యాకారణం లేకుండా ఏర్పడే సహజ అయిష్టత, ఈర్ష్య, అభిప్రాయ బేధాలు కూడా కారణం కావచ్చు. అవతలి వానిని ప్రశాంతంగా గమనించాలి. గుణదోషాలమీద ఎక్కువ దృష్టి పెట్టి చూడగూడదు. చెడుభావం లేకుండా అపార్థం చేసుకోకుండా, ప్రశాంత మనోదృక్పథంతో దర్శించగలగాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె.వి. రావు

భగవంతుడే ఆచార్యుడుగా శిష్యరికం, తండ్రిగా పుత్రత్వం మాతగా మృదుత్వం, ఇష్టసఖుని కరచాలనం, సహచరుని ఆనందహేల, యజమానిగా సేవానందము, ప్రేమికుని దివ్యప్రేమావేశం – ఇవి సప్తవిధ దివ్యాశీస్సులు – మానవునికి. వీటిని ఒక మహోత్కృష్ట ఇంద్రచాపవర్ణబంధంగా ఏకోన్ముఖం కావించలేవా? అపుడు నీకిక స్వర్గమేల? అద్వైతుని విముక్తినే అధిగమిస్తావు కదా!

– శ్రీఅరవిందులు

మన అత్యుత్తమ స్నేహితుడు

"అత్యుత్తమశ్రేణిలో మనం ఉండాలని అభిలషిస్తూ, మనల్ని ప్రేమిస్తూ, మన స్థాయి నుండి దిగజారకూడదని ఆకాంక్షించేవాడే అత్యుత్తమ స్నేహితుడు."

దీనిపై శ్రీమాత ఇలా వ్యాఖ్యానించారు –

...మనస్సులో ఏదో నిగూఢంగా ఉంచుకుని ఈ సూక్తి రాశారు. సాధారణంగా ఆ విషయాన్ని మరిచిపోతుంటాం. ఎవరి స్థాయిలో వారుండాలని సాధారణంగా ఎవరూ తన మిత్రుల్ని కోరుకోరు. వారు కోరిన విధంగా ఆ మిత్రులు ప్రవర్తించాలని కోరతారు. ఒక వ్యక్తి ఒక ఆదర్శాన్ని రూపొందించి, దానిని ప్రతి వ్యక్తికి వర్తింపచేయాలని చూస్తాడు. కాని... నాకు ఒక విషయం గుర్తుకొస్తున్నది. ప్రఖ్యాత రచయిత టాల్‌స్టాయ్ కుమారుని నేను జపాన్‌లో కలుసుకున్నాను. మానవుల మధ్య సంఘీభావాన్ని సాధించాలన్న ఆశతో అతను ప్రపంచం నలుమూలలా తిరిగాడు. అతని ఉద్దేశ్యం మంచిదే. కాని అతను అనుసరిస్తున్న విధానం సంతోషకరంగా లేదు. ప్రపంచంలో ప్రతి వ్యక్తి ఒకే భాష మాట్లాడితే, ఒకే విధంగా దుస్తులు ధరిస్తే, ఒకే విధంగా భుజించి, ప్రవర్తించినట్లయితే అనివార్యంగా సమైక్యతకు దారితీస్తుందని అతను చాలా సీరియస్‌గా చెప్పారు. దీనిని సాధించటానికి నీ ప్రణాళిక ఏమిటని అడుగగా, ఒక క్రొత్త, విశ్వజనీనభాషను బోధిస్తూ, ఒక కొత్త విశ్వజనీన వేషధారణను, కొంగ్రొత్త విశ్వజనీనమైన అలవాట్లను నేర్పితే చాలు. అంతే. అదే తాను చేయ దలచుకున్నది అని అతను అన్నాడు.

(నవ్వుతూ) ప్రతి ఒక్కరు తన చిన్నవలయంలో అలాగే వుంటారు. ఒక అందమైన, ఉదాత్తమైన, దివ్యమైన భావం, ఆదర్శం అతనికి ఉన్నాయి. ఆ భావాన్ని అందరిపై రుద్దాలని అనుకున్నాడు. భగవంతుని గూర్చి చాలామందికి ఒక నిర్దిష్టభావం ఉంటుంది. తమ శక్తికొలది ఆ భావాన్ని జనం మీద రుద్దాలని ప్రయత్నిస్తారు. తమ ప్రాణం పోయేదాకా వారు నిరుత్సాహం

చెందరు. ఈ స్వతస్సిద్ధమైన, దాదాపు అచేతనమయమైన ధోరణి నా మనస్సులో మెదలాడుతోంది. "అదే, అది నీవు చేయాలను కుంటున్నావు" అని నేను మీతో అంటే – "ఏమిటి? అదా! నా జీవితంలో అది ఎన్నడూ చేయను" అని అంటారు.

తన స్నేహితులైనవారు ఎలా ప్రవర్తించాలో తాను అను కున్న రీతిలో ప్రవర్తించనందుకు కొందరు వారిని నిందిస్తారు. అందువల్ల వారు తమ మిత్రుల జీవనవిధానాన్ని విమర్శిస్తుంటారు. ఈ విశ్వంలో ఏ రెండూ ఒకేలా వుండవు. అనంత అనేకత్వపు సామరస్యం కోసం ఈ విశ్వం నిర్మించబడింది. రెండు కదలి కలు, అంతదాకా ఎందుకు రెండు చైతన్యాలు ఒకేలాగా వుండవు. ఈ విషయం మనం మరిచిపోతాము. మనం జోక్యం చేసుకుని, మనం ఆలోచించినట్లే అవతలి వ్యక్తి ఉండాలని కోరుకునే హక్కు మనకు లేదు. నువ్వు ఒకలాగ ఆలోచిస్తే, అదే విధంగా అవతలి వ్యక్తి ఆలోచించడు. నువ్వు ఒక రకం వ్యక్తివైతే, ఆ రకంగానే మరో వ్యక్తి ఉండడు. ఈ ప్రపంచంలో ప్రతి వస్తు వును దాని స్థానంలో ఉంచి, విభిన్నంగా కనిపించే సమస్త వస్తు వుల్ని, ధోరణులను సమన్వయం చేయాలి, వాటి మధ్య సామ రస్యం సాధించాలి. ఇదీ మనం నేర్చుకోవలసింది. సారూప్యత లోనే సంపూర్ణ సామరస్యం ఉండదు. ప్రతి వస్తువును అది ఉండ వలసిన స్థానంలో ఉంచి సామరస్యం సాధించాలి. తనలాగే తన స్నేహితుడు ఉండాలని కోరుకోకూడదు. అతను అతనిలాగే ఉండాలి. నిజమైన స్నేహితుడు కోరవలసినది ఇదే.

నేను మొదటి వాక్యంలోనే చెప్పాను – "నువ్వు అత్యుత్తమ స్థాయిలో ఉండటాన్నే ప్రేమిస్తాడతను" అధమస్థాయికి దిగజారి, తనతోపాటు తెలివితక్కువ పనులు చేయాలని నిన్ను ప్రోత్సహిం చడం, తనతోపాటు దుష్కార్యాలు చేయాలని కోరడం, నువ్వు చేసే అన్ని నీచకార్యాలను ప్రశంసించడం – ఇది తప్పు. అటు వంటివాడు నిజమైన మిత్రుడు కాడు. నీ అత్యుత్తమస్థాయిలో నిన్ను చూసి ప్రేమించేవాడే నిజమైన మిత్రుడు అని నేను రాసిన సూక్తిలో మొదటి మాటల అర్థం.

ఎవరైనా ఒక స్నేహితుడు దిగువస్థాయికి పతనమైతే, అతనిని చూసి బాధపడని వానితో కొందరు స్నేహం చేస్తారు. తెలివితక్కువ పనులు చేసేందుకు ప్రోత్సహించే వ్యక్తి తన ఉత్తమమిత్రుడని కొందరు భావిస్తారు. స్కూలు ఎగ్గొట్టి, రోడ్లపై బలాదూరుగా తిరగడం, తోటలలో పండ్లు దొంగిలించడం, టీచర్లను ఆటపట్టించడం – అటువంటి తెలివిహీనమైన పనులు. నేను ఎవర్నీ వ్యక్తిపరంగా కించపరచడం లేదు. కాని ఇటువంటి ఉదాహరణలు ఎన్నైనా ఇస్తాను. వారు నీ నిజమైన స్నేహితులు కారు. కాని వారే నీకు అనుకూలమైనవారు. నువ్వు తప్పుచేస్తున్నా నీకా విషయం చెప్పరు. "రోడ్లపై షికార్లు కొట్టడానికి బదులు, నీచమైన పనులు చేయడానికి బదులు, స్కూలుకు హాజరైతే, ఎంత బాగుంటుంది!" అని ఎవరైనా అంటే – "నన్ను విసిగించకు, నువ్వు నా మిత్రుడివి కావు" అని సాధారణంగా జవాబు వస్తుంది. వ్యక్తిగతంగా విమర్శించడం కాదు. దురదృష్టవశాత్తు సర్వసాధారణంగా జరిగేది ఇదే.

అఖండమైన ప్రజ్ఞతో, క్లాసులో ఉత్తమస్థాయికి చేరిన విద్యార్థులు, చిత్తశుద్ధితో చదువుకొనేవారు ఇటువంటి స్నేహంతో పూర్తిగా చెడిపోవడం నేనెరుగుదును. అటువంటివారు స్నేహితులు కారు. శత్రువులు. అంటువ్యాధికి మనం ఎలా దూరంగా ఉంటామో, అటువంటి శత్రుమూకనుండి మనల్ని మనం రక్షించుకోవాలని, ఆ పిల్లలకు నేను హితవు చెప్తున్నాను.

అంటువ్యాధి సోకిన రోగిని ఆరోగ్యవంతులనుండి వేరు చేస్తారు. ఆ అంటువ్యాధి వ్యాపించకుండా చర్యలు తీసుకుంటారు. కాని దుష్ప్రవర్తన, దుర్గుణాలు, అబద్ధాలతో వ్యాధిగ్రస్తులైన వారు అంటువ్యాధికన్న ప్రమాదకరమైనవారు. అటువంటివారికి దూరంగా ఉండాలి. దుష్కార్యాలు చేయవద్దని, నీచప్రవృత్తులను ప్రతిఘటించాలని కోరేవాడే అత్యుత్తమ మిత్రుడు. వాడే అసలు స్నేహితుడు. అటువంటివారితో చేతులు కలుపు. అంతేకాని, నీలోని దుర్గుణాలను పెంచి పోషించి, నీతో దుష్టలీలలను సాగించేవారిని విడిచిపెట్టు. అంతే నేను కోరేది. ఇంతకన్న దీనిని

గురించి శ్రమించవద్దు. నా మనస్సులో వున్నవారు నేను చెప్పిన మాటలు అర్థం చేసుకోగలరని ఆశిస్తాను. నీకన్నా బుద్ధిమంతులైనవారిని నీ మిత్రులుగా ఎంచుకో. నిన్ను ఉదాత్తశిఖరాలకు తీసుకునివెళ్లి, నిన్ను నీవు జయించేటట్లు చేయగలిగినవారిని, మరింత ఉత్తమంగా పనులు చేసి, పురోగమించేటట్లు చేయగలిగినవారితో స్నేహం చెయ్యి. చివరిగా ఒక మాట! అత్యుత్తమ మిత్రుడు దైవం కాదా! అతనితో అన్నీ చెప్పుకోవచ్చు. ప్రతి విషయం వెల్లడించవచ్చును. మనం చేసే తప్పులను రూపుమాపే శక్తి, కారుణ్యం ఆ దైవంలో సాక్షాత్కరిస్తాయి. నిజమైన సిద్ధికి, జీవనసాఫల్యానికి మార్గం తెరుచుకొంటుంది. అతనే నిన్ను పూర్తిగా అర్థం చేసుకోగలడు. అతనే నీలోని అపభ్రంశలను, అవలక్షణాలను తుడిచిపెట్టగలడు. మార్గమధ్యంలో నీకు సాయపడేది అతనే. నవ్వు అపజయం పొందకుండా, పతనం కాకుండా కాపాడేది అతనే. గమ్యం వైపు తిన్నగా నిన్ను నడిపించేది అతనే. అతనే నిజమైన ఆప్తమిత్రుడు. కష్టసుఖాలలో నీతో కలిసి నడచినవాడు అర్థం చేసుకోగలడు. నీ కన్నీటి బ్రతుకుకు, గాయాలకు అమృతస్పర్శ లాంటి చల్లని హృదయం అతనిది. నీకు అవసరమైతే నీ చెంత ఎప్పుడూ నిలబడి వుంటాడు. నువ్వు చిత్తశుద్ధితో పిలిస్తే అతను పలుకుతాడు. నిన్ను సరియైన మార్గంలో నడిపిస్తాడు. నిన్ను సముద్ధరిస్తాడు – ముమ్మాటికీ నిజంగా నిన్ను ప్రేమించేవాడు.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

*

పురుషుడు, స్త్రీ మధ్య కన్నా, ఇద్దరు పురుషుల మధ్య లేదా ఇద్దరు స్త్రీల మధ్య స్నేహం పెంచుకోవడం తేలిక. ఎందువల్ల అంటే అక్కడ కామప్రవృత్తి చొరపడటం ఉండదు స్త్రీకి, పురుషునికి మధ్య స్నేహంలో ఏ క్షణంలోనైనా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కామప్రవృత్తి ప్రవేశించి కల్లోలం రేపుతుంది. స్త్రీపురుషుల మధ్య పవిత్రమైన నిష్కామ అనురాగం అసంభవం కాదు. అటువంటి

స్నేహం మనగలుగుతుంది. గతంలో ఇటువంటి స్నేహం పరిఢవిల్లింది. నిమ్నప్రాణికం (lower vital) ప్రక్కదారిగుండా దొంగలాగ ప్రవేశించనివ్వకూడదు. స్త్రీపురుషుల మధ్య ఒక సామరస్యం, ఒక ఆకర్షణ ఉన్నాయి. రహస్యమైన లేదా బాహాటమైన నిమ్నప్రాణిక (sexual) ప్రాతిపదికకి అతీతంగా అవి ఆధారపడి వుంటాయి. ఆ సామరస్యం ముఖ్యంగా మానసిక, చైత్యపురుష లేదా ఉన్నత ప్రాణిక పునాదులపై లేదా వాటి మిశ్రమంపై ఆధారపడి వుంటుంది. అటువంటివారిలో స్నేహం సహజసిద్ధంగా పెరుగుతుంది. దానిని అధోస్థాయికి పడదోయటానికి కాని, విచ్ఛిన్నం చేయడానికి కాని, నిమ్నశక్తులకు అవకాశమే లేదు.

ప్రాణికస్థాయిలోనే అసురశక్తి ఉంటుందని, చైత్యపురుష ప్రేమ ఉదాసీనంగా ఉజ్వలరహితంగా ఉంటుందనుకోవటం పొరపాటు. చైత్యపురుషప్రేమ అంటే సుహృద్భావం కాదు. విస్పష్టమైన సుహృద్భావం అభిలషణీయమే. ప్రేమ అంటే ప్రేమే. అది కేవలం సుహృద్భావం కాదు. చైత్యపురుషప్రేమ కవోష్ణ లలితం. ప్రాణికజ్వాలకి మించిన జాజ్వల్యమానమైనది. చైత్యప్రేమలోని జ్వాల వినిర్మల దీప్తిశిఖ. అహంకార కామాగ్నిజనిత కాంక్షను తృప్తిపరచడం వల్ల చల్లారేది కాదు. అది ధవళాగ్ని విస్ఫులింగం. ఎర్రని జ్వాల కాదు. ప్రగాఢతలో అరుణారుణజ్వలిత జ్వాలకన్న ఈ శ్వేతాగ్ని తక్కువేమీ గాదు. మానవసంబంధంలో, మానవ ప్రకృతిలో చైత్యప్రేమ పూర్ణసాక్షాత్కారం కాకపోవచ్చు. దానిని భగవంతుని వైపు ఉద్ధరించినప్పుడు, అది అతితేలికగా పూర్ణానందజ్యోతిగా ప్రజ్వరిల్లుతుంది. మానవసంబంధాలలో ఈ చైత్యప్రేమ ఇతర నిమ్నశక్తులతో కలిసిపోతుంది. ఆ శక్తులు దానిని ఉపయోగించుకోవాలని తాపత్రయపడి, వాటి నీలి నీడలు ప్రసరిస్తాయి. చాలా అరుదైన క్షణాలలోనే తన పూర్ణప్రగాఢ సముజ్వల వికాసాన్ని అభివ్యక్తం చేయకలుగుతుంది. లేనిపక్షంలో అది సర్వసాధారణరూపంలోనే వుంటుంది. అయినా మౌలికంగా ప్రాణికమైన ప్రేమలో సైతం ఉన్నత శిఖరాలు అందుకొంటుంది. ఉత్తమ మాధుర్యం, మార్దవం, విశ్వాసం, ఆత్మార్పణం, ఆత్మత్యాగం,

ఆత్మల మధ్య దివ్యస్పర్శానుభవం, మానవప్రేమను సముద్ధరించే సముదాత్త ఆదర్శ పరిస్పందనలు – ఇవన్నీ చైత్యపురుష శిఖ రాలనుండి ప్రసరించే దివ్యకిరణాలు. చైత్యపురుషప్రేమ మానస, ప్రాణిక, భౌతిక, మానవప్రేమను నియంత్రించి, రూపాంతరం చెందిస్తే, దివ్యచైత్యప్రేమ యొక్క ప్రతిబింబంగా సాధారణ ప్రేమ భూమిపై ప్రకాసించగలదు. నిజమైన పూర్ణప్రేమకు సన్నద్ధమవగ లదు. ఆ ప్రేమ ఈ ద్వంద్వ జీవితంలో ఆత్మ, ఆత్మయొక్క ఇతర ఉపకరణాలు సమగ్ర, సంపూర్ణ సాయుజ్యంగా భాసిస్తుంది. అటు వంటి ప్రేమయొక్క అసంపూర్ణ సాక్షాత్కారం సైతం బహు అరుదు.

పూర్ణయోగంలో మానవప్రకృతిలోని జ్వాలను దివ్యంగా మార్చాలి. మిగతాదంతా నిజమైన ప్రాతిపదిక కోసం (for the true basis) నిరీక్షించాలి. సాధారణ మానవచైతన్య సైకత స్థలంలో, బురద నిండిన చైతన్యక్షేత్రంలో ఉన్నత ఆదర్శాలను (ప్రేమ) నిర్మించాలనుకోడం సురక్షితం కాదు. అంతమాత్రాన స్నేహాలను వదులుకోమని అర్థం కాదు. కేంద్రీయమైన దివ్యజ్వాలకు దిగు వన ఉండాలి. భగవంతునితో సంబంధం ఏర్పరుచుకోడం తన ఏకైక ప్రగాఢ లక్ష్యంగా చేసుకున్న సాధకునికి అతని సాధన పూర్ణశక్తిప్రదమై శోభిల్లుతుంది. మన అన్వేషణ దివ్యతరచైతన్య సాధన కోసం. అటువంటి మహనీయ చైతన్యస్థరం నుండి జాలు వారే కిరణప్రసారమే చైత్యప్రేమగా భాసిల్లుతుంది. ఆ వెలుగు లోనే చైత్యప్రేమ తన్నుతాను కనుగొంటుంది. అంతవరకు ప్రకా శవంతమైన పరిపూర్ణ ఆత్మరూపం ఆవిష్కరించడం కష్టం.

P.S: మనస్సు, ప్రాణికం, – ఇవి ఆత్మకి ఉపకరణాలు. అవి తమ కోసం తాము పనిచేస్తే, అజ్ఞాన, అసంపూర్ణ ఫలితాలే వస్తాయి. చైత్యపురుష ఆత్మోపకరణాలుగా వాటిని మలుస్తే, అవి దివ్యసా ఫల్యతను సంతరించుకోగలుగుతాయి. ఇదే ఈ యోగంలో రూపాం తరీకరణం అంటే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

నమ్మతగినది కాదు మానవప్రేమ

మానవ అనురాగం విశ్వసనీయమైనది కాదు. కారణం – అది స్వార్థకామనపై ఆధారపడి ఉంటుంది. అస్పష్ట అస్వచ్ఛతలతో కూడిన అహంభావపూరిత ఉద్వేగమది. అయినా ఒకప్పుడు అది మరింత సుస్పష్ట తేజోమయకాంతులతో కలకల్లాడుతుంది. ఒక్కొక్కప్పుడు తామసిక ప్రచోదనలకు అలవాటుపడి ఉంటుంది. మరొకప్పుడు రాజసికమైన ప్రాణిక ఉద్వేగభరిత పరివర్తనలతో కూడి ఉంటుంది. ఇంకొకప్పుడు నిస్వార్థ సాత్వికభావనలతో కూడి ఉండటానికి ప్రయత్నిస్తుంది. ప్రాధమికంగా ఇది వ్యక్తిగత అవసరం. ఏదో రకమైన బాహ్యాంతర ప్రతిఫలాపేక్షకి నిర్దిష్టమై ఉంటుంది. అవసరం తీరాక, ప్రతిఫలప్రాప్తి పొందాక, దానంతటదే నీరుకారిపోయి, నిస్సార నిరుత్సాహపూరిత అవశేషంగా మిగిలి ఉంటుంది. అవసరార్థం వేరోచోటుకి మరలిపోతుంది. మరింత తీవ్రస్థాయిలో అల్లకల్లోలాలు, ఘర్షణలు, కలహాలు, అహంకారపూరితకలతలు, స్వార్థపరత్వం, బలాత్కారాలు, కోపతాపాలు, పొరపాట్లు, ద్వేషాలు, విరోధాలు – వీటితో మరింత చికాకు కలిగిస్తుంది. ఈ అనురాగాలు పూర్తిగా అంతరించిపోతాయని కాదు. అంతర్బుద్ధిపరమైన తామసిక సహజప్రచోదనలు, కుటుంబసంబంధమైన కొన్ని రాజసిక అనురాగాలు వీటిని నిలిపి ఉంచుతాయి. ఉగ్రమైన విరోధాలే కావచ్చు, కలతలు కావచ్చు, ఒకరికొకరికి పొసగనివే కావచ్చు – అయినా ప్రాణికస్థాయి పరస్పర అవసరాలు తీర్చుకునేటందుకు ఇవి కలిపి, నిలిపి ఉంచుతాయి. కలుస్తూండటం, విడిపోతూండటం, దెబ్బలాడుకుంటూ ఉండటం, మళ్ళీ సమాధానపడుతూండటం, తిరిగి దెబ్బలాడుకుంటూ ఉండటం – ఈ తంతు సమయానుకూలంగా జరుగుతూంటుంది. సాత్వికానురాగాలు, ఒక బాధ్యతగా మాత్రమే కాక, ఆదర్శపూరితాలై, ఒక ఆలంబనంతో, కాఠిన్యత, తీవ్రత తగ్గి అంత ప్రస్ఫుటంగా కాకపోయినా నిలిచి వుంటాయి. మానవానురాగాలు చైత్యపురుష మూలకంతో సంసర్గం కలిగినపుడు మాత్రం పరిపు

ష్టమవుతవి. విశ్వసనీయతను సంతరించుకుంటవి. మనసుకి పట్టి ఉంటాయి. సత్వము నంతటినీ వశం చేసుకుంటాయి. ఆ కారణం గానే మానవానురాగాలలో కెల్లా శాశ్వతత్వము సంతరించుకుని ఉండగలిగేది స్నేహం. కారణం – అక్కడ ప్రాణిక చైతన్యం తాలూకు జోక్యం బహుస్వల్పం. అహంకారపూరిత ఉద్వేగమే అయినప్పటికీ నిశ్చలమై, స్వచ్ఛమై ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని అంది స్తుంది. అలాగైనప్పటికీ కూడా విశ్వసనీయమైన స్నేహం బహు కొద్దిమందికే లభిస్తుంది. నిస్వార్థంగా, విశ్వాసపాత్రంగా ప్రేమించే స్నేహితులు ఎక్కువమంది ఉండటం చాలా అరుదు. అదొక భ్రమయే అని చెప్పవచ్చు. ఏది ఏమైనా, మానవప్రేమకి – దాని విలువ ఎంతటిదయినా కాని – దాని స్థానం దానికి ఉంది. దాని అవసరము కూడా ఉంది. చైత్యపురుష చైతన్య. సంసర్గానికి అవ సరమైన మానసికోద్వేగానికి ప్రేరణ దాని ద్వారానే సమకూడు తుంది. ఇంకా, అంతరంగ సత్యాన్ని కనుగొనగలిగి పరిపూర్ణ స్థాయికి ఎదిగి దివ్యచేతన అందుకునేదానికీ సహకరిస్తుంది. చైతన్యం ఉన్నతస్థరాలకు యెదిగే కొలదీ హృదయకార్యకలా పాలు కూడా మారుతవి. వాటి ఆధారము, ప్రత్యేక లక్షణాలు మారుతవి. జీవిత సర్వస్వానికి ఆధారం యోగం, దివ్యచైతన్యం. అలాగే ప్రేమానురాగాలకు కూడా ఆధ్యాత్మిక చైత్యపురుష ఏకత్వం మూలాధారం కావాలి. పునాది కావాలి. ఈ మార్పుకు రహదారి దైవాన్వేషణ. మిగిలిన వాటికి ప్రాముఖ్యత లేదు. వాటిని ప్రక్కకి నెట్టివేయాలి. దేనికీ అంటిపెట్టుకుని ఉండకూడదు. అలాగని ప్రేమానురాగాలపట్ల నిరూత్సాహం ఉదాసీనత కలిగి ఉండటం కాదు. ఇది నీకై నీవు ప్రయత్నించి సాధించాల్సినదే. విమర్శలు, ఉపన్యాసాలవల్ల సాధ్యం కాదు.

*

ఇతరులతో నీ సంబంధబాంధవ్యాలవల్ల నీకు ఆశించిన సంతృప్తి కలుగకపోవటానికి కారణం నీ స్వభావ లోపం కాదు; నీ దుర దృష్టం అంతకన్నా కాదు. ఈ బాంధవ్యాలు ఎన్నటికీ సంతృప్తి నిచ్చేవి కావు. అలాగే అయితే దైవాన్వేషణకు ఆవశ్యకత ఉండేదే

కాదు. సాధారణ ఐహికజీవనంతోనే సరిపోయేది. దైవాన్ని కను గొని చైతన్యాన్ని ఉన్నతస్థరాలకు ఉద్ధరించుకొనటం ద్వారానే ఇతరులతో సదవగాహన, సద్బాంధవ్యాలు నెలకొనగల్గటం సాధ్యం.

*

దైవానికి చేరువయేందుకు ప్రేమ, సానుభూతి అనవసరం అని కాదు. తద్వ్యతిరేకంగా సాధకునికి దివ్యత్వ చేతన సాధనలో భాగంగా దైవసాన్నిధ్యానికి, ఇతరులతో సన్నిహిత ఏకత్వభావన ఆవశ్యకమే.

అలాకాక, మానవసమాజము, స్నేహసౌభ్రాతృత్వాలు, ప్రేమానురాగాలు సర్వసాధారణంగా – సర్వత్రా కాకపోయినా – ప్రాణికచేతన ఆధారంగా వ్యవస్థీకృతమవుతాయి. ఇవన్నీ అహం కారకేంద్ర పరిధిలోనే ఉంటాయి. వ్యక్తి తనను ఎవరైనా ప్రేమిస్తే ఆనందిస్తాడు. సహవాసంవల్ల అహం పొంగుతుంది. అంతరం గాలు పరస్పరం కలబోసుకుంటాయి. అదో ఆనందం. పరస్పర ప్రాణిక పరిస్పందనల ప్రేరణలు ఆహ్లాదం కలిగిస్తాయి. ఇవన్నీ, తన్ను తాను ప్రేమించుకునే వ్యక్తిత్వాన్ని పరిపోషిస్తాయి. ఈ సారభూతమైన ప్రేరణలు, మరిన్ని స్వార్థపూరిత ప్రేరణలతో కలపోసుకుంటాయి. వీటికి తోడుగా ఉండే ఉన్నతశ్రేణి ఆధ్యా త్మిక, చైత్యపురుష, మానసిక, ప్రాణిక ప్రేరణలు సరే సరి. ఇదంతా ఒక కలగూరగంప. అందుచేతనే ఒక స్థాయిలో కారణం ఉన్నా లేకపోయినా, ప్రపంచం, సమాజం, జీవితం – వీటి అనుబంధాలు, పరోపకారశీలత – ఇవన్నీ మిగిలినవాటివలె అహంకారానికి, స్వార్థానికి విధేయాలుగానే ఉంటాయి. కాబట్టి వెగటు కలిగి స్తాయి (ఎప్పటికైనా)

– శ్రీఅరవిందులు

*

నిజమైన ప్రేమ ఒక్కటే – అదే దివ్యప్రేమ. మిగిలిన ఇతర ప్రేమలన్నీ పరిమితులకు లోబడి ఉండేవే. అంతకంతకు దిగ జారిపోతూ ఉండేవే. ఇవన్నీ దివ్యప్రేమకి వికృతరూపాలే. భక్తుని దివ్యప్రేమ కూడా అహంకారమాలిన్యంతో వన్నె తగ్గినదే. సహ

జంగా తాను దేనినైతే ప్రేమిస్తాడో అదే తాను కాగల్గుతాడు. భక్తుడు, చిత్తశుద్ధితో తాను ఆరాధించే దైవమే తాను కాగల్గుతాడు. ఆ విధంగా ఆతని ప్రేమ అంతకంతకు స్వచ్ఛత సంతరించుకుంటుంది. నీవు ప్రేమించే వ్యక్తిలో ఉన్న దైవాన్ని ఆరాధించటమే నీకు పరిష్కారమార్గం. కాకపోతే మరి, హృదయము, మనసు నిర్మలంగా ఉండాలి. అలా లేకపోతే అది హీనమై, దుఃఖ ప్రదాయినిగా మారుతుంది.

*

సాంఘిక సంబంధాలలో గొప్ప బలహీనత ఉన్నది. ఎంత బలహీనతో అది! అందుకే ఆత్మసంయమనం కోల్పోతూ ఉంటాము. అనకూడని మాటలు అంటూంటాము.

ఆందోళన, హింస, కోపం – ఇవన్నీ బలహీనతలకి సూచికలు. నిజానికి వ్యక్తి కోపంలోనే కదా సహనాన్ని కోల్పోయేది. అప్పుడే అనకూడని మాటలు అంటాడు. ఇది నిజంగా భయంకరమైన మానసిక, ప్రాణిక బలహీనత. అన్యధా వినకూడని అవమానకరమైన విషయాలు వింటావు. తెలివితక్కువ విషయాలన్నీ నీకు ప్రజలు వినిపిస్తారు. నీవు బలహీనుడవు కాకుంటే పైకి హేళనగా నవ్వకపోయినా – అది అమర్యాద కాబట్టి – లోలోపల నవ్వుకుంటావు. పోనీలే అని సర్దుబాటు చేసుకుంటావు. పట్టించుకోవు. మనసు నిశ్చలంగా ఉంచుకోగలిగితే నీకు వాస్తవమైన అవగాహన ఉంటుంది. ఎవరు ఏమి చెప్పినా వింటావు. కాని నీలో ఏలాటి ప్రతిస్పందనలు ఉండవు. అంతా నిశ్చల ప్రశాంతత చోటుచేసుకుని ఉంటుంది. అక్కడ నీవు చూచేదేదైనా నీకు వినోదమే కల్గిస్తుంది. నవ్వుకుంటావు. అంతే.

ఎదుటివాని తాలూకు హింస, కోపం – వీటికి సంబంధిత స్పందనలకు ప్రతిస్పందించి నీవు సంవేదన పొందినపుడు (మొదట ఇది జరుగుతుంది) అప్పుడు, ఆకస్మికంగా నీలో ఒక ప్రతిస్పందన ఉంటుంది. అలాటప్పుడు నీవు సంయమనం పాటించాలి. అలాకాక నిగ్రహం కోల్పోతే నీవు కూడా తప్పనిసరిగా ఆతనిలాటి బలహీనుడవే కాగలవు.

మానవులు సాధారణంగా ఇతరులతో తమ అనుబంధాలు శారీరక, ప్రాణిక, మానసికస్థాయిల ఆధారంగా కలిగి ఉంటారు. అందుచేత అప్పుడు తప్పనిసరిగా వైషమ్యం, దుఃఖం ఉంటుంది. అలాకాక వారి అనుబంధాలు చైత్యపురుష ఆధారంగా ఉంటే చికాకులు కనిపించేవాటి వెనుక స్థిరంగా ఉండే లోతైన సామరస్యం కనుగొంటారు. అది జీవనవ్యాపార కార్యకలాపాలన్నిటా ప్రస్ఫుటమవుతుంది. ఇంకేముంది? బాధ గందరగోళాల స్థానంలో శాంత్యానందాలే వెల్లివిరుస్తాయి.

*

ప్రశ్న: మనలో లోపాలు ఉన్నందువల్ల ఇతరుల లోపాలను సహించలేకపోతున్నామా? మనకు కలిగే ఆకస్మిక వ్యాకులతకు మూలం ఏది?

అవును. నీలో ఉండే లోపాలే ఎదుటివారిలో కూడా కనిపించేసరికి అవి నీకు వ్యాకులతను కల్పిస్తాయి.

తర్వాత నీకు తెలుస్తుంది. ఎదుటివారు నిన్ను ప్రతిబింబించేసే నిలువుటద్దాలని.

*

ప్రశ్న: మీరో మాటు నాతో అన్నారు: "Y నీ సలహా పాటిస్తే నాకది ఆశ్చర్యకరమే" అని. అంటే దాని అర్థం ఇతరుల సలహా మనం అంత సీరియస్సుగా తీసుకోకూడదనా?

మనల నెవరైనా అభ్యర్థిస్తే తప్ప ఉచితసలహా ఇవ్వకూడదనే నియమం పాటించాలి. ఎవరి నుంచి అయినా నీవు సలహా తీసుకున్నప్పుడు దానిని గురించి జాగ్రత్తగా ఆలోచించి లబ్ధి పొందే ప్రయత్నం చేయాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

అపస్మృతికి ఆధారాలు

ఇతరులయందు ఇష్టాయిష్టాలు, విపరీత ధోరణులు మానవప్రకృతిలో సహజం. కొందరు తరతమ విభేదాలన్నీ విస్మరించి క్షీరనీర న్యాయంగా కలసిపోగా, మరికొందరు ఇందుకు భిన్నంగా ప్రవర్తించటం మన మెరుగుదుము. ఈ విపరీత ధోరణులు అహంకార ప్రవృత్తి విజృంభణ వల్లనేనని గమనించవచ్చును. తన అభిరుచులకు విభిన్న స్పందనమే ఈ రీతిగా ప్రతిబింబిస్తుంది.

*

నేను పూర్వమే చెప్పాను నాయనా! ఈ కలహాలు, ఖండనలు సాధనకు ప్రతిబంధకాలు అని. పరస్పర ఘర్షణలు, విభేదాలు, అహంకార విజృంభణమేనని వేరుగా చెప్పవలెనా? విద్వేషాలు, వైషమ్యాలు కామప్రవృత్తివలె సాధనకు ఆమడ దూరంగా ఉండాలి సుమా! పరస్పర సదవగాహన, సమన్వయంతో, సామరస్యంతో సాధకులు మెలగటం అవసరం. అయితే వీరంతా కలసిమెలసి ఉండాలన్న నిబంధన ఏదీ లేదు. తాను, తానుగా సాధన నిరభ్యంతరంగా చేసుకొనవచ్చును. ఈ ఒంటరి సాధన అహంకార పూరిత ఆధిక్యత, తృణీకారభావాలవల్ల మాత్రం ఎన్నటికీ కాకూడదు. మరో విషయం, ఒకరి సాంగత్యంవల్ల, తనలో లౌకిక భావాలు ఉదయిస్తే, అతని నుంచి దూరంగా తొలగిపోవచ్చు. అందుకు ఎట్టి అభ్యంతరం ఉండబోదు. డాబు, దర్పం తగవులకు సాధనలో తావే లేదు. వీటిని సాధకుడు శీఘ్రంగా అధిగమించాలి.

– శ్రీఅరవిందులు

ప్రాణిక ప్రతిచర్యలు

ఒకరి మాటతీరువల్ల సాధకునికి బాధ కలిగితే, అతడు ఇంకా ఎదగలేదని గ్రహించుకోవచ్చు. అంతేకాదు. దైవచింతన యందు మనస్సు సంపూర్ణంగా లగ్నం కాలేదన్న మాట. సదవగాహన, సహనం, ప్రేమాభిమానాలు సాధకులు పెంపొందించుకోవాలి.

అయితే దురదృష్టమేమంటే, తరచు, ఈ అహంకారప్రవృత్తి పడ గెత్తి కాఠిన్యంగా ఇతరులను బాధించగా, సామరస్యం బెడిసికొట్ట గలదు. ఈ అహంకార ప్రవృత్తికి దైవలీలల యొక్క అంతరంగం అంతుబట్టదు. నిత్యజీవితంలో ఎదురయ్యే సంఘటనలను ఆమూ లాగ్రం విశ్లేషించక కేవలం స్వార్థపూరితంగా, అహంస్ఫూర్తితో నిర్ణయించటం అవివేకము. ఆవేశాగ్రహాలతో కూడుకొన్న మన నిర్ణయాలన్నీ భగవత్స్ఫూర్తికి బహుదూరం. ఇందుకు మానసిక ప్రశాంతస్థితియే మూలం.

*

కొందరి మనస్తత్వం బహు విచిత్రమైనది. కయ్యానికి కాలు దువ్వటం, అకారణంగా ఇతరులను వేధించటం, వీరికి వెన్నతో పెట్టిన విద్య. వీరియందు చోటుచేసుకొన్న ఒకానొక అభద్రతా భావనయే ఇందుకు కారణము కావచ్చు. ఈ ప్రవృత్తిని నిర్మూ లించటం కష్టతరమైనది. వీరి మనస్తత్వం సంపూర్ణంగా మార్పు చెందవలసిన అవసరం ఉన్నది.

ఈ తరహా వ్యక్తులు తారసపడినప్పుడు, వీరిని పట్టించు కోకుండా మన పని మనము చేసుకోవటం శ్రేయస్కరము.

*

ఇతరుల మాటతీరు ఎంత కఠినంగా ఉన్నప్పటికీ, నీవు కలత చెందవద్దు. సృష్టి సర్వత్రా ఈ రాజసిక, తామసిక ప్రవృత్తులు కోకొల్లలు. ఈ దౌర్బల్యద్వయాన్ని అరికట్టడమే ప్రథమ కర్త వ్యంగా ఎంచి, అందుకు తీవ్రంగా కృషి చేయాలి.

*

తగాదాలు

నలుగురి మధ్య తగవులు నా కెన్నిటికీ అంగీకారం కాదు. ఉభ యపక్షాలు దోషమలేనని నా ధృఢాభిప్రాయం. ఇష్టాయిష్టాలకు, ఆవే శాలకు స్వాభిమానాలకు ఇక్కడ తావు లేదు.

*

తగవులు, తగాదాలు ఎవరికైనా, ఎన్నటికి తగదు – వాటికి నీవే బాధ్యుడవు కాకపోయినా కూడా.

*

నీవు తగవుకు నాంది పలికితే, దైవత్వాన్ని నిరసించినట్లే.

*

ఈ తగాదాలు దాపురించటం నిజంగా దురదృష్టమే. ఇవి కార్య సాధనకు ఆటంకాలు కల్పించి, లక్ష్యసాధనను దెబ్బతీస్తాయి.

*

ఇతరుల తప్పులపై ఆగ్రహించే ముందు, తన తప్పులపై ఆత్మవి మర్శ చేసుకొనటం అవసరం.

*

తన దోషాలగురించి తాను చింతించటంవల్ల అవసరమైతే వాటిని సవరించుకోవటానికి అవకాశం ఉంటుంది. ఇతరులపై ఆగ్రహిం చటం ఆధ్యాత్మికజీవితానికి అసంబద్ధం. ఈ ప్రవృత్తి కేవలం తన ఆధిక్యం ప్రదర్శించే ప్రయత్నం మాత్రమే.

*

సంకుచిత మనస్తత్వం – పక్షపాతం

నీతో వచ్చిన చిక్కేమిటంటే, నీ అభిప్రాయంతోనూ, నీ అభిరుచు లతోనూ ఏకీభవించేవారితో మాత్రమే సామరస్యంగా వ్యవహరిం చగలవు. నీవు విశాలదృష్టిని అలవరచుకొని, ఎవరికివారు వారి వారి నియమనిబంధనలను పాటిస్తారని గ్రహించాలి. సర్వాంగీకా రయోగ్యమైన అవగాహనకు ప్రయత్నించాలి. తనతో అందరూ అంగీకరించాలని తలచటం భావ్యం కాదు.

*

నిత్యజీవితంలో సామరస్యంగా మెలగటానికి ఒకే ఒక ఆటంకం – మన ప్రత్యర్థిని దోషిగా నిరూపించటానికి అత్యుత్సాహం ప్రద ర్శించటం.

*

తమ, తమ స్వభావాలకు, ఆలోచనలకు అనుగుణంగా ఆలోచిం చేవారు క్రమంగా సంకుచిత స్వభావులవుతారు.

*

ప్రతి సమస్యకు సర్వాంగీకారయోగ్యమైన పరిష్కారము తప్పక లభించగలదు. అయితే ఇందుకు అందరు ఆశించి, సహకరించి కృషిచేయాలిగాని, తమ, తమ అభిప్రాయాలను ఇతరులపై బల వంతంగా రుద్దటం సరిగాదు.

విశాలదృక్పథంలో జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి.

*

నీవు విషయాన్ని ఏకపక్షంగానే గమనిస్తున్నావు. నిష్పాక్షికంగా అన్నికోణాల నుండి పరిశీలిస్తే, నీ విశ్లేషణాదృష్టి మెరుగుపడు తుంది. ఇది సర్వదా లాభదాయకమని మున్ముందు నీవే గ్రహి స్తావు.

– శ్రీమాత

*

రంధ్రాన్వేషణ ప్రవృత్తి

మనము విషయాలను పరిశీలించటంలోను, విశ్లేషించటంలోను తప్పు లేదు. అయితే ఇదంతా హేతుబద్ధంగాను, నిష్పాక్షికంగానూ ఉండటం అవసరం. చీటికిమాటికి విమర్శించటం, తప్పు లెంచటం, అకారణంగా నిందారోపణ చేయటం తగదు. ఈ ప్రవృత్తి, తనకు ఇతరులకు మధ్య అగాధాన్ని సృష్టించి సత్సంబధాలను దెబ్బ తీస్తుంది. ఎందులకీ బాధ కల్గించే నిష్ఠూర అపనింద? లోపాలు ఎవరికి ఉండవు? ఇతరుల తప్పులెంచటం, నిందారోపణ చేయటం, విమర్శించటం – వీటి యందు అంత అత్యుత్సాహాము ఎందుకు? అన్నింటినీ సూక్ష్మంగా జాగ్రత్తగా పరిశీలించి ఒక నిర్ణయానికి రావాలి.

*

కొందరు కర్తవ్యనిర్వహణలో నిమగ్నులైనవారిని విమర్శిస్తూ కార్యనిర్వహణలో తప్పులు ఎంచుతూ సూచనలు ఇవ్వటం పరి

పాటి. విచిత్రమేమంటే వారెంచుతున్న తప్పులు తమ యందే ఉన్నప్పటికీ గ్రహించలేని దౌర్భాగ్యులు. నిజమే. నీవు తెలిపిన వన్నీ సృష్టిలో సకలజీవులయందు నిత్యము గమనించవచ్చును. పైన ఉటంకించినట్లు మానవునికి తన గురించి తనకు తెలియదు. అందువల్లనే యోగములో తనను తాను తెలుసుకొనుటకే ప్రాధాన్యము.

*

అల్పమైన ఈ 'అహమే' ఇతరులందు ఉన్నవి, లేనివి దోషాలను కనుగొని, విమర్శించేది. అవి ఎంతవరకు యదార్ధము అనేది దానికి పట్టదు. అహానికి వీటిని గురించి విచారించే హక్కు లేదు. కారణం – అది సరియైన మనోవైఖరి, వివేకము కలిగి ఉండదు. కరుణాపూరితమైన, ప్రేమాస్పదమైన, నిష్పాక్షికదృష్టితో కూడుకొన్న ప్రశాంతమైన అంతరాత్మ మాత్రమే చక్కగా విచక్షణతో పరిశీలించి తప్పొప్పులను నిర్ణయించి ఉచితమైన నిర్ణయం తీసుకొనగలదు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శరణ్

అంతరంగ ఆత్మానుభవం మాత్రమే వంటరితనాన్ని నివారించగలుగుతుంది. ఏ మానవసాంగత్యము నీ లోని శూన్యాన్ని పూరించదు. అదే విధంగా మానసిక ప్రాణిక బంధుత్వాలు ఆధ్యాత్మిక జీవనానికి అవసరమైన సమరసభావాన్ని ఉద్ధరించలేవు. నీ లోని, ఇతరులలోని దివ్యత్వాన్ని భావించగలిగినప్పుడు మాత్రమే వాస్తవమైన సామరస్యం సిద్ధిస్తుంది. ఈలోగా అందరము శ్రీమాత బిడ్డలమనే సంవేదనలో, ఐక్యత, ఆచరణభావాలతో దివ్యలక్ష్య సాధనను స్థిరపర్చుకోవాలి. చైత్యపురుష లేక ఆధ్యాత్మిక ఆధారాలపైననే సామరస్యం సాధ్యపడుతుంది.

– శ్రీఅరవిందులు

నిజమైన విముక్తి

ఈ లోకం – పోరాటాలు, కష్టాలు, బాధలు, శ్రమలతో కూడుకున్నది. మారటానికి ఇంకా – సమయం పడుతుంది. ప్రతివానికి తాను బయటపడే అవకాశం ఉంది. సర్వోన్నతుని యొక్క కృప నాలంబనంగా చేసుకొని బయటపడాలి. మరి అదొక్కటే మార్గం.

నీవు చేసిన పనికి ఇతరుల నుంచి మెప్పునాశించకు. ఇతరులు చేసినదానిని ప్రశంసించటం మనుష్యులకు చేతకాదు. పైగా తమకంటె కాస్తంత ఉన్నతంగా ఉంటే భరించలేరు.

ప్రశ్న: కాని, ఆ శక్తి ఎక్కడ లభిస్తుంది?

నీలోనే. దివ్యత్వము మరి నీలో లేదా! నీలోనే ఉంచుకుని బయట వెతుకుల్లాడుతావు. దివ్యసమక్షం నీలోనే ఉన్నది. చూచుకో. దీనిని నీలోనే ఉంచుకుని, నీకెన్నడూ లభ్యంకాని అన్యుల ప్రోత్సాహం నీ కెందుకు? ఆకాంక్షించు. అదే నీకు సర్వోన్నత లక్ష్యము, సర్వోన్నత తేజము, ఉన్నతజ్ఞానము, ప్రేమ. అంతా నీలోనే ఉన్నది. అది నీలో లేకుంటే దాని సంసర్గమే నీకు కలుగదు. నీ లోలోపలికి పోగల్గినట్లైన దానిని నీవు కనుగొంటావు. అదొక జ్వాల. ఎప్పుడూ నీలో ప్రకాశవంతంగా వెలుగొందుతూనే ఉంటుంది.

ఇది కష్టమనుకోకు. నీ దృష్టి ఎప్పుడూ బాహ్యంగానే ఉంటుంది. అందుకే నీ అంతరంగ దివ్యసమక్షమును భావించలేకున్నావు. బాహ్యప్రోత్సాహంకోసం చూడకు. ఆరాధనాభావంతో, ఏకాగ్రచిత్తుడవై, పరిపూర్ణ అర్పణాచేతస్కుడవై ఉన్నప్పుడు అంతర్గత సర్వోన్నతజ్ఞానం, మార్గదర్శకత్వంగా కావలసిన ప్రోత్సాహం నీలోనే నీకు లభిస్తుంది. నీకేదైనా అవరోధం కలిగినపుడు దానితో తలపడటానికి బదులు అన్ని దురవగాహనలను, దుర్వ్యాపారాలను, దుస్సంకల్పాలను సర్వోన్నతుని వివేకానికే వదిలిపెట్టు. శరణాగతి పొందు. ఇక నీ ప్రమేయమేమీ ఉండదు. అన్ని ఆయనే చూచుకుంటాడు. ఆ మంచిచెడులన్నీ ఆయనకే వదిలిపెట్టు. మరి ఇదే దారి నాయనా!

ప్రశ్న: ఒక్క విషయం. నేనేది చేసినా మావాళ్ళకది నచ్చదు.
మీవాళ్లంతా అందరివలెనే కలగాపులగం.

ప్రశ్న: నాకు నేనుగా ఏమీ చేయను. ఏదో తెలియని దివ్య శక్తి నాచేత చేయిస్తుంది. అంతే.
ఈ సంగతి అందరికీ తెలియాలా బాబూ...

ప్రశ్న: కాదు. వాళ్లకి అర్థంకాకపోవచ్చు. నేనేమీ గుర్తింపు కోరను. కాని అవరోధాల సంగతి, అమ్మా..

అవునది నేను అర్థం చేసుకోగలను. నీకు నా పూర్తి సహ కారం ఉంటుంది. నీవు పొరపాటు చేస్తున్నావని నీకెన్నడైనా చెప్పానా? ఒక విషయం నీవు తప్పనిసరిగా తెలుసుకోవాలి. సర్వే శ్వరునికి ఆత్మసమర్పణ కావించుకుని, నిరహంకారంగా ఉంటూ, యోగి కాకపోతే ఎవరూ అర్థం చేసుకోలేరు. వారికది సాధ్యం కాదు. బాహ్యాచక్షువులతో, బాహ్యాజ్ఞానంతో బాహ్యాంశాలనే దర్శిం చగలుగుతారు. ఆంతర్యం వారికి కనపడదు. మనుష్యుల నుంచి బాహ్యాప్రశంస అభిలషించకపోతే నీకసలు ఏ గొడవా ఉండదు. వారంతట వారే మెచ్చుకున్నారా – మంచిదే. లేకపోయినా మించి పోయినదేమీ ఉండదు. అది స్వవిషయం. వాళ్లని మెప్పించటా నికి కాదు కదా మనం పనులు చేసేది! మనం చేసే పనులు చేయాలి కాబట్టి చేస్తాం.

ప్రశ్న: నేనెన్నడూ ప్రశంస కోసం చూడలేదమ్మా?

బహుశః నీవా స్థితికి వచ్చి ఉంటావు. అదే మరి నిజమైన విముక్తి.

ప్రశ్న: అహం కాదు కాని – నేను స్వతఃగా సాధువుని. నాకే అవసరము లేదు.

అదంతా సరే. కాని నీ కుటుంబంయొక్క ప్రశంస కూడా నీకు అక్కర్లేదు.

ప్రశ్న: నా బలహీనతలు, ఓటమిలు – వీటితో నాకే అవ సరం లేదు. ఏ ప్రశంసా కూడా వద్దు.

ఇహనేం! నీకే బాధా లేదు. నీకు కావల్సినది దైవబలం. అది నీకున్నది. నీకేమి లోటు!

ప్రశ్న: కాని నేను చాలా బాధపడుతున్నాను.

నీ సత్వములో ఎక్కడో సంఘర్షణ ఉన్నది. నీ చైతన్యములోని ఒక భాగానికిది తెలుసు. మరొక భాగం పరిస్థితులకు బానిస. ఇదంతా నీ పూర్తి విముక్తి కోసమే జరుగుతోంది. దివ్యశక్త్యభివ్యక్తీకరణ ఇది. గ్రహించు. ఫలితం నీకే బోధపడుతుంది. శాంతి, కలతపెట్టని ప్రశాంతత, సమచిత్తం, బలం – వీటికెన్నడూ నీవు దూరం కావు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

స్వస్థతకొక గభీర మార్గము

బాధను ఓర్చుకోవటం ఎలా? ఎప్పుడైనా ఒక ప్రగాఢమైన దుఃఖం, వ్యాకులపర్చే సందేహం, తీవ్రమైన బాధ నిన్ను చుట్టుముట్టి నిరాశతో ముంచేస్తూంటే అందునుంచి బయటపడి తిరిగి ప్రశాంతపడటానికి అమోఘమైన దారి ఒకటుంది.

మన హృదయాంతరాళంలో దేదీప్యమానమైన జ్యోతి ఒకటి సదా ప్రజ్వలిస్తూ ఉంటుంది. దాని స్వచ్ఛతను బట్టి దాని తేజస్సు ప్రకాశిస్తుంది. విశ్వజనీన, దివ్యచేతనయొక్క అంశ అది. ఆ పరంధాముని సజీవ చైతన్యకాంతి రేఖ అది. ఏ అఖిలాండ బ్రహ్మాండనాయకుడైన పరబ్రహ్మ సకల పదార్థానికీ జీవం పోసి పెంచి పోషిస్తున్నాడో తన ఆజ్ఞానువర్తులై నడుచుకునేవారందరికీ దారిచూపే దివ్యబలసంపన్నుడైన మార్గదర్శకుడెవ్వరైతే ఉన్నాడో, తనను దర్శించాలనీ, తనకు బద్ధులై నడుచుకోవాలనీ ఆకాంక్షించేవారందరినీ వాత్సల్యంతో, కరుణతో అక్కున చేర్చుకొని కాపాడే ఆ పరంధాముని అంశయైన వెలుగే అది. మనస్ఫూర్తిగా ఆయనను నమ్మినవారి విశ్వాసం ఎన్నటికీ వమ్ము కాదు; వారి ఆకాంక్షలు వృధా కావు, ఏదైనా ఆపేక్షించినవారు నిరాశకు లోనుకావడం జరగదు.

నా హృదయం వెతచెంది ఆక్రోశించింది, ప్రగాఢతాపంతో విరిగి ముక్కలయేంత పనైంది. బాధతో కృంగి కృశించింది.... అయితే నేను ఆర్తత్రాణపరాయణుడైన నిన్నే ఎలుగెత్తి పిలిచాను. వెంటనే కళ్లు మిరుమిట్లు గొలిపే నీ కాంతి వైభవం వచ్చి నాకు ఉపశాంతి కల్పించింది.

నీ వైభవకాంతి కిరణాలు నన్ను పునీతం చేసి, నన్ను పూర్తిగా దీప్తిమంతం చేశాయి. అప్పుడిక నేననుసరించవలసిన మార్గమేదో, ఆ బాధను నేనేవిధంగా ఉపయోగించుకోవాలో నాకు అవగతమైంది. అయితే నన్ను ఆవరించిన ఆ బాధంతా ఈ భూమి మీద ఉన్న అంతుపట్టని బాధ, వేదనల నీలినీడ మాత్ర మేననే విషయం నాకు అప్పుడర్థమైంది.

బాధలు అనుభవించినవారే ఇతరుల బాధ నర్థం చేసుకో గల్గుతారు. అప్యాయంగా పల్కరించగల్గుతారు. ఉపశమనం కల్గించగల్గుతారు. ఓ దివ్యదుఃఖోపశమన మూర్తీ! మహనీయ మహాబలీ! నాకు అర్థమైంది. మా సర్వదుఃఖాలను ఉపశమింపచేయ టానికీ, మమ్మల్ని ఓదార్చగలగటానికీ ఈ భూమి మీద నుండే ప్రతి కష్టాన్నీ, మనిషికొచ్చే ప్రతి బాధనీ అనుభవించి తెలుసుకున్నావు గదా!

నీ భక్తులమని చెప్పుకుంటూ కొందరు నిన్నొక క్రూరునిగా, కఠినమైన న్యాయాధ్యక్షునిగా చిత్రిస్తున్నారేమిటి! చిత్రహింసలను నీవు చూసీ చూడనట్లుంటావనీ, కొన్నిటిని నీవే సృష్టిస్తున్నావనీ కూడా చెపుతున్నారు.

కానీ నాకిప్పుడు తెలిసిందేమంటే పదార్థమయజగత్తులోని అసమగ్రతలవల్లనే ఈ బాధలు వస్తున్నాయనీ, అక్కడి మొరటు వ్యవస్థవల్ల నీ వ్యక్తీకరణకి అది తగదు గదా అని; దానివల్ల బాధపడినవారిలో నీవే ప్రథముడవు, అక్కడి అస్తవ్యస్తతని సరి దిద్దాలనీ, అక్కడి బాధను ఆనందంగా మార్చాలనీ, అక్కడి వైరుధ్యాలను దిద్ది సమత నెలకొల్పాలనీ తాపత్రయపడి శ్రమించింది కూడా నీవే కదా.

బాధలు తప్పనిసరీ కాదు, అభిలషనీయమూ కాదు. కాని వచ్చినపుడు అవి ఎంత మేలు చేస్తాయి!

గుండెకోత ననుభవించేటప్పుడల్లా లోపలి అంతరంగ ద్వారాలు తెరుచుకుంటవి. క్రొత్త సౌభాగ్యవంతమైన అంతఃప్రేరణలు, అంతరంగనిధులు ఆవిష్కృతమవుతవి. వాటి పసిడి ప్రవాహాలు, మృతత్వజీవనాన్ని ఒక నవ్య తీవ్ర గుణాధిక దివ్యజీవనంగా పర్యవసింపచేస్తవి.

ఈ క్రమానుగత విశేష అవరోహణలు ద్వారా by these successive descents అడ్డుతెరలు వైదొలగుతవి. ఓ ప్రభూ! నిన్ను దర్శిస్తాము. దివ్యజీవన తీవ్రత చొచ్చుకొని పరివ్యాప్తమై దివ్య కాంతులు ముంచెత్తినప్పుడు బ్రతుకంతా మహనీయమైన దివ్య ప్రేమతో రూపాంతరీకరింపబడినప్పుడు – అది వర్ణనాతీతము కదా!

దుఃఖానుభవము – ఒక ప్రయోజనకర సాధనము

జెనీవా, మార్చి 6, 1914

వారంతా బాధలతో ఎంతో వేదన లననుభవించిన తర్వాతే నేను పూనుకొని సర్వశాంతికీ, సకల ఆనందాలకీ మూలమైన నీ దివ్య ప్రేమ సహాయంతో వారికి ఉపశమనం కలిగించాలని నిన్నాశ్రయించాను, ప్రభూ! మనం బాధల నుంచి పారిపోకూడదు, అట్లాగని వాటిని ఆహ్వానించనూ కూడదు. మనం దాన్ని లోతుగా తరచితరచి ఆద్యంతరహితమైన చైతన్యపు ద్వారాలు తెరుచుకొనే శక్తివంతమైన ప్రయోజనకర సాధనంగా దాన్ని మలుచుకొని తద్వారా నీ నిత్యసనాతన – ఏకం పరాయణం – చైతన్యం లోనికి ప్రవేశించగలుగుతాము కదా!

పెంచుకున్న ఈ విధమైన శారీరకరాగానుబంధాలు వదిలి పెట్టవలసి వచ్చినపుడు జరిగే పెనుగులాట ఒక రకంగా చూస్తే పిల్లచేష్టలుగా కనిపించవచ్చు – ముఖ్యంగా ఈ బాహ్యాశరీర అశాశ్వతత్వమూ, మహత్పూర్వకమైనదీ ఏకత్వ శాశ్వతత్వము తలుచుకున్నపుడు – ఇంకో రకంగా చూస్తే మానవులు ఏ ఏకత్వ

సిద్ధి కోసం అయాచితంగా అడుగులేస్తూంటారో దాని బాహ్యాసిద్ధి కోసం చేసే అవిజ్ఞాత ప్రయత్నమే ఈ బంధమూ, వ్యక్తిగతమైన రాగద్వేషాలూ అని చెప్పవచ్చు. నిజంగా అదే కారణమనుకుంటే ఈ బాహ్యచైతన్యాన్ని అధిగమించడానికీ, అల్పమైన ఈ అనురాగాన్ని శాశ్వత సాయుజ్యసిద్ధికోసం, తపనగా మార్చడానికీ వియోగంవల్ల కల్గే బాధ ఒక ప్రయోజనకరమైన ఘనసాధనం కాదంటారా!

ఇదే నేను వారందరికోసం కోరి, ప్రగాఢంగా సంకల్పించాను. నీవు వారి బాధలను తీర్చి, నీ వెలుగునింపగలవనే ధీమాతో, నీ గెలుపుపై విశ్వాసంతో, వారి వెతలను నీ అధీనం చేశాను.

ఓ పరమేశ్వరా! ఈ అనురాగంలోని అందాన్నీ, సున్నితత్వాన్నీ వైభవోపేతమైన విజ్ఞానాంగా మార్చు ప్రభూ!

సర్వోత్కృష్టమైనదానినే సర్వత్రా బహిర్గతం కావించు. పరిపాలించనీ ఈ భూమిని నీ దివ్యానంద ప్రశాంతత.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామశాస్త్రి

(దివ్య) అనుబంధానికి ఒక నూతన ఆధారం

ఈ యోగ నిబంధనలను నీవు సమంగా అవగాహన చేసుకున్నట్లు లేదు. సంప్రదాయయోగం సంపూర్ణ పరిత్యాగం – ప్రాపంచిక జీవనంతో సహా – అవశ్యంగా కావాలంటుంది. కాని మన యోగలక్ష్యం రూపాంతరీకరింపబడిన నవ్యజీవనం. ప్రాణిక, మానసిక, భౌతికబంధాలను, కామనలను నిర్దాక్షిణ్యంగా పరిత్యజించాలని గట్టిగా చెప్తుంది. ఆత్మానుభూతితో కూడి ఉద్దీపనచెందిన పునర్జీవనమే దీని ధ్యేయం. అందుకోసం సమూలంగా మానసిక, ప్రాణిక, భౌతిక కర్మలన్నీ మానసాతీతచేతనలోనికి మార్చాలి. అంటే నవ్యజీవనంలో అనుబంధాలన్నీ ఆధ్యాత్మిక నిబద్ధతకి లోబడి కొనసాగాలి. బంధాలు ఇప్పటిలా ఉండకూడదు. సాధా

రణ సహజానురాగాలకు అతీతంగా ఉన్నత ఆదేశానికి అనుగుణంగా ఉండాలి. వ్యక్తిగతకామనలకు అనుగుణంగా కాక ఉన్నత సత్యమునకే లోబడి యోగీశ్వరేశ్వరునకే వశమై ఉండాలి.

*

సాధకులంతా యెవరికివారే యమునాతీరే అన్నట్లుగా వేర్పాటు ధోరణిలో కొట్లాడుకుంటూ ఉండకూడదు. సామరస్యజీవనమే యోగసూత్రం. పోరాటం కాదు.

అన్ని బంధాలు ప్రాణికస్థాయి నుంచి ఆధ్యాత్మికభూమిక ఆధారంగా కొనసాగాలి. ప్రాణికం ఆధ్యాత్మికానికి ఉపకరణం కావాలి. అంటే – వారి సంబంధబాంధవ్యాలలో ఈర్ష్య, ద్వేషము, అసూయ, పగ – ఇలాటి దుర్మార్గ ప్రాణికభావనలకి చోటు ఇవ్వకూడదు. ఇవి ఆధ్యాత్మిక జీవనానికి ఎంతమాత్రమూ పనికిరావు. వాటిని వదిలివేయాలి. అలాగే అహంభావపూరిత ప్రేమ బంధాలు వైదొలగాలి. అహంభావపూరిత ప్రేమ, అహం దెబ్బ తిన్నప్పుడు జారుకుంటుంది. అప్పుడు అక్కడ ద్వేషం, పగ చోటు చేసుకుంటాయి. సతతము సజీవంగా నిలిచి ఉండే నిజమైన అనురాగపూరిత ఐక్యత తప్పనిసరి. అలాగే కామోపభోగ మాలిన్యానికి కూడా తావు ఉండనీయకూడదు.

*

దైవం వైపు మరలిన నీ ప్రేమోద్వేగం దైవంతో ఇతోధికంగా ఏకీకరణ పొందుతుంది. దైవం నుంచి నీవు అందుకున్నదానిని ఇతరులపై నిరాటంకంగా ప్రసరింపచేస్తావు. నీకీ నిస్వార్థప్రేమ సాధ్యమైతే అదే సర్వోన్నత సంతృప్తికరమైన ప్రేమ కాగలదు.

*

స్నేహానురాగాలు, యోగంలో నిషిద్ధాలు కావు. దివ్య మైత్రీబంధము సాధనలో గుర్తింపబడినదే. సాధకులలో ఉన్న మైత్రి శ్రీమాతచే గుర్తింపబడినదేకాక ప్రోత్సహింపబడినది కూడా. కాకపోతే సాధారణ స్నేహబంధానికి నిర్దిష్టమైన ఆధారము ఉండదు కాబట్టి, మేము దీనిని భద్రమైన ఆధారంతో ఉద్ధరించాలని ప్రయత్నిస్తాము. ప్రేమ, స్నేహసౌభ్రాతృత్వాలు పునీతమైన అంశాలుగా

నిలిపి ఉంచుతాము. సాధారణంగా ఇవి అహంకారపూరిత చలిత చాలనాలవల్ల, అనుక్షణం భగ్నమై, మలినమైపోతవి. ప్రాణికం వీటికి ఉన్ముఖమై ఉంటుంది. ఇలాటి ఉద్వేగాలు ఈర్ష్యాద్వేషా లతో కలుషితమై నశిస్తాయి. అలా కాకుండా ఇవి ఆత్మాశ్రయా లుగా పునీతమై భద్రంగా ఉండాలని అభిలషిస్తాం. మాది సన్యా సయోగం కాదు. దీని లక్ష్యం స్వచ్ఛతే కాని కఠోర నియమం కాదు. మేము ఆకాంక్షించే స్నేహానురాగాలు అత్యావశ్యకమైన సామరస్య మధురస్వరరాగబంధాలు. ఇదంతా ఏమీ వ్యర్థస్వప్నం కాదు. నిబంధనలు అపరిపూర్ణం కావచ్చు. కాని వాటి మూలస్థా నంలో అత్యావశ్యకమైన మూలకపదార్థం (element) ఉన్నప్పుడు ఇది సాధ్యమే. మొండి పట్టుపట్టే అవరోధాలు ఉంటాయి. కష్టమే మరి – అయితే సుదీర్ఘకృషి, లక్ష్యశుద్ధి లేకుండా ఏ విజయం మాత్రం సాధ్యపడుతుంది! పట్టినపట్టు విడువకుండా ఉండటమే ఏకైక మార్గం.

*

యోగంలో స్నేహం మిగిలి ఉండగలదు. కాని, సాధారణ జీవన బంధం వ్యక్తిని ఆకర్షించి విలీనం, చేసే అనురాగ (engrossing affection) బంధం వైదొలగవలసినదే.

– శ్రీఅరవిందులు

*

ఒక వ్యక్తి మరొక వ్యక్తిని ప్రేమించినపుడు చేసే మొదటి పొర పాటు ఎదుటి వ్యక్తిచేత కూడా తాను ప్రేమింపబడాలనుకో వటం. అదీ తన వ్యక్తిత్వమును, వ్యక్తిగత కామనలను సంతృ ప్తిపరిచే రీతిలో, మానవక్లేశాలకి నిరుత్సాహాలకీ బాధలకీ – వీట న్నిటికీ మొదటి కారణం ఇదే.

ప్రేమ అంటే ఏలాటి బేరసారాలులేని ఆత్మార్పణ. అలా కానిది ప్రేమ కాదు. కాని ఇది చాలా అరుదుగా తెలుసుకోబడు తోంది. మరీ అరుదుగా ఆచరింపబడుతోంది. మరి అందుకే పరి ణామాలు వ్యథాపూరితంగా ఉంటున్నాయి.

*

ముందు ముఖ్యంగా కావల్సినది ఆత్మనియంత్రణ. మాట జారక పోవటం. మనుష్యులు నిశ్శబ్దాన్ని పాటించగలుగుతే ఎన్ని బాధలు పరిహరించుకోగలరో కదా!

*

ఎన్నో పనికిమాలిన మాటలు మాట్లాడతాం. వాటివల్ల ఎంతటి దురవగాహన! ఎన్ని అపోహలు! మౌనంవల్ల ఇవి తప్పుతాయి కదా!

అవసరమైనంతవరకే మాట్లాడగల్గితే ప్రపంచం ఎంత నిశ్శబ్దంగా ఉండేదో కదా!

*

ఇతరులలో పనికిమాలిన విషయాలే సాధారణంగా మనకు అగుపిస్తాయి. ఇరుగుపొరుగువాళ్లు దానిపైనే ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు. నిజానికి లోపాలు లేనివాళ్లు ఎవరుంటారు? మనం ఎదుటివానిలోని మంచినే గమనించాలి తప్ప చెడును కాదు. "నీ స్నేహితునికి ఒకే కన్ను ఉన్నప్పుడు ఆ దిశగానే నీ దృష్టి సారించు" అనేది సామెత. ఆ విధంగానే మనం అతనికి సరియైన న్యాయం చేయగల్గినవాళ్లం కాగల్గుతాం.

నీ స్నేహితుడొకడు వికారంగానో, మందగుడిగానో ఉండవచ్చు. కాని ఆతనే క్లాసులో అందరికంటే కష్టించి పనిచేసేవాడు కావచ్చు.

నీ ఉపాధ్యాయుడు నీకు కఠినంగాను, నిష్కర్షగాను కనపడవచ్చు. కాని ఆతనే నీ శ్రేయస్సు కోరేవాడు కావచ్చు.

నీ స్నేహితుడు ఒకడు నీకు ఎంతో విసుగు, చీకాకు కల్గించేవాడే అవచ్చు. కాని వాడే నీకున్న ప్రాణస్నేహితుడేమో...

ఎంతోమంది దుర్మార్గులుగా, బాధ కల్గించేవాళ్లుగా కనిపిస్తారు. కాని వారి హృదయాంతరాళాలలో మనకు తెలియనిది ఏదో ఉంటుంది.

మంచి వడ్రంగి ఎంత పాడైన కొయ్యముక్కనైనా చిత్రిక పట్టి అందు మిగిలి ఉన్న ఏ కొద్దిపాటి కొయ్యబద్దనైనా వెలికి తీసి ఉపయోగిస్తాడు. కాని చేతకానివాడు మొత్తం అంతటినీ

తెలివితక్కువగా పారేస్తాడు. కళాకారుడు కర్రలో అతిమోటైన కణుపుమొక్కనే మనోహర ఆకృతిగా మలుస్తాడు.

– శ్రీమాత

*

సానుభూతి – పరోపకారం

నిస్సంకోచంగా, మనస్ఫూర్తిగా హృదయపూర్వకంగా ఎదటివాని సంక్షేమాన్ని అపేక్షించటం మనం ఆతనికి అందించగలిగే అత్యున్నత సహకారం.

*

దైవానికే వదిలిపెట్టిన వారినెవ్వరినైనా, దేనినైనా పట్టుకుని ఇక వ్రేలాడకూడదు. వారి గురించి లేక దానిని గురించి ఆందోళన అనవసరం. భగవంతునికే వదిలిపెట్టినపుడు చేయవల్సినదేదో ఆయనే చేస్తాడుగా.

*

...నీవు చెప్పిన పరిస్థితి దానంతటదే పరిష్కారమైనది. మంచిదే. ఇది మంచి పురోగతి. ఇక ప్రార్థనల విషయానికొస్తే – ప్రార్థించటం, దాని కనుబంధించి ఉన్న దృక్పథం – ప్రత్యేకించి ఇతరుల కోసం నిస్వార్థంగా చేసే ప్రార్థన – ఇది నిన్ను దివ్యోన్నతశక్తికి ఉన్మీలనం చేస్తుంది – నీవెవరి కొరకైతే ప్రార్థన చేశావో వారిలో తదనుగుణమైన ఫలితం లేకపోయినా కూడా – అనుకూలంగా ఏమీ చెప్పకపోయినా కూడా – ఫలితం ఎప్పుడూ వ్యక్తిగతంగా ఉంటుంది. ప్రార్థనవల్ల దిగివచ్చే దివ్యశక్తికి వారు ఉన్మీలనం చెంది ఉన్నారా, గ్రహణశక్తి కలిగి ఉన్నారా, పరివర్తనకు తగి ఉన్నారా – ఫలితం వీటిన్నిటిపైన ఆధారపడి ఉంటుంది.

– శ్రీఅరవిందులు

*

నిజంగా ప్రేమించటం

ప్రశ్న: శ్రీమాతా! – "నువ్వు నన్ను ప్రేమిస్తే నిన్ను నేను ప్రేమిస్తాను" అనేది ఎలాటి ప్రేమ?

"నువ్వు నన్ను ప్రేమిస్తే నిన్ను నేను ప్రేమిస్తాను" – సరిగ్గా ఇదే మనుష్యులు చెప్పేది. మానవులు తమ ప్రేమను వ్యక్తీకరించే ధోరణే ఇది. మరికాస్త ముందుకు వెళ్లి గమనిస్తే దైవం విషయంలో కూడా మనుష్యుల ధోరణి ఇలాగే ఉంటుంది. "నీవు నా కోర్కెలు తీరుస్తే నీవు నన్ను ప్రేమిస్తున్నావు అనుకుంటాను. నిన్ను కూడా ప్రేమిస్తాను. నాకు కావల్సినది నీవు ఇవ్వకపోతే నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని అనుకోను. నిన్నసలు ప్రేమించనే ప్రేమించను" – ఇది వ్యాపారధోరణితో కూడిన ప్రేమ వ్యవహారం...

ప్రశ్న: కాని, "నీవు నన్ను ప్రేమించకపోయినా నిన్ను నేను ప్రేమిస్తాను" – అంటే?

ఇది కొంత నయం. ఇంకా మెరుగైన విషయం ఏదో తెలుసా? నువ్వు ప్రేమింపబడుతున్నావా లేదా అనే ప్రసక్తే లేకపోవటం. నిజమైన ప్రేమకిది ఆరంభం. ప్రేమించటం ప్రేమించటం కోసమే – ప్రతిస్పందన కోసం ఎదురుచూడకుండా. షరతులతో కూడుకున్నది ప్రేమ కాదు. ప్రేమిస్తున్నావు, అంటే, ప్రేమించకుండా ఉండలేవు – కాబట్టి. One loves because one loves – అంతే. నిస్వార్ధప్రేమ ఇది. మిగిలినదంతా వ్యాపారమే. నిజమైన ప్రేమ కానే కాదు. లెక్కలు కట్టి, పథకం ప్రకారం ప్రేమించే ప్రేమ వ్యాపారంకాక సిసలైన ప్రేమ ఎలా అవుతుంది? మీకిది ఇప్పుడు బోధపడకపోవచ్చు. కాని ఎప్పటికైనా మీకిది తెలియకపోదు.

మనుష్యులు ప్రేమ గురించి చేసేది మిగిలినది ఏదైనా, అది శ్రేష్ఠమైనదిగా ఉండదు. ఎన్నో నీచవిషయాలకు దారితీసేదిగా ఉంటుంది. – అసూయ, ఈర్ష్య, ఇంకా ప్రబలమైన స్వభావాలలో, ద్వేషం – దాకా సాగుతుంది. స్వల్పంగా ప్రారంభమవుతుంది –

ప్రేమించటానికి ఒక కారణం కావాలనిపిస్తుంది. ప్రేమించినవ్యక్తికి తాను ప్రేమింపబడినట్లు తెలియాలి. భగవంతుని విషయంలో కూడా ఇదే పరిస్థితి. తన ప్రేమను భగవంతుడు గుర్తించాలి. ఇదే పతనానికి ఆరంభం. వాస్తవం తెలుసుకోడు. ఆ ఆలోచనే రాదు.

ప్రేమయే. ప్రేమించటమే. మరొక ఆలోచన రానే రాకూడదు. అంతే. సమగ్రమైన ప్రేమతో ప్రేమించినపుడు తీవ్ర ఆనందం కలుగుతుంది.

సాధారణ ప్రేమ నధిగమించి నిజమైన ప్రేమ కలిగి ఉండటానికి చాలా దూరం పయనించాలి. చాలా చాలా దూరం వెళ్లాలి.

సాధారణ మానవచైతన్యంలో ఇది కల్పించే వికృతాల గురించి నేను ప్రస్తావించటం లేదు. ఉత్తమ పరిస్థితులలో ప్రేమ యొక్క స్వరూపస్వభావాలను గురించి మాట్లాడుతున్నాను. పరస్పర ప్రేమ గురించి పట్టించుకోకుండా ఎంతమంది ఉండగలరో నాకు తెలియదు. నన్ను ప్రేమిస్తే నిన్ను ప్రేమిస్తాను – అనేది నిమ్నస్థాయి. అధమమైనది. ఇంకా నికృష్టస్థాయికి చెందిన ప్రేమ – నన్ను ప్రేమించు, తర్వాత నిన్ను ప్రేమించటం సంగతి ఆలోచిస్తాను – అనేది. నేను ప్రస్తావించేది – the need of reciprocity; that is the first step of the descending scale. ఊర్ధ్వగమనమునకు ఇది తొలిమెట్టు.

మీరింకా చిన్నవాళ్లు కదా. ముమ్ముందు తెలుసుకుంటారు.

*

బాహ్యమైన మానవప్రేమస్వరూపాలను చొచ్చుకొనిపో

ప్రశ్న: దివ్య అనురాగ చైతన్యాన్ని పొందటానికి ఇతర ప్రేమలకి స్వస్తి చెప్పాలని అంటారు. సాధారణ అనురాగాలు మనలను గాఢంగా అంటిపెట్టుకొని ఉంటాయి. వాటిని వదుల్చుకునే అత్యుత్తమమార్గం ఏది?

ప్రేమ బాహ్యరూపంతో సంతృప్తిపడకుండా దానికి మౌలికమైన ప్రేరణ ఏమిటో తెలుసుకోవాలి. అప్పుడు బాహ్యరూపం శిథిలమై దానికి వెనుకనున్న దివ్యప్రేమతో సంసర్గం కలుగు

తుంది. అదే అత్యుత్తమ మార్గం. ఒకటి కనుగొనేందుకు వేరొకటి వదల్చుకోవటం అంత సులభం కాదు. అసాధ్యమనే చెప్పాలి. మానవస్వభావం పరిమితమైనది. వైరుధ్యాలతో కూడుకున్నది. వేర్పాటుస్వభావం కలది. అందుచేత బాహ్యానురాగాలను పూర్తిగా నిరాకరించగలిగే పరిస్థితికి రాగలిగినపుడు, ప్రేమించగలిగే శక్తి నంతటినీ పొగొట్టుకునే ప్రమాదపరిస్థితి రావచ్చు. పాషాణంగా మారే అవకాశం ఉంది. తిరిగి ప్రేమించగలిగి ప్రేమను అభి వ్యక్తీకరించగలిగే సామర్థ్యం మేల్కొల్పేటందుకు ఎన్ని సంవత్సరాలు, శతాబ్దాలు వేచి ఉండవలసి వస్తుందో!

కాబట్టి నీలో ప్రేమ ఉద్భవించినపుడు – దాని స్వరూప, స్వభావాలేమైనప్పటికీ – దాని ద్వారా దానియొక్క బాహ్య ఆకృతిని చొచ్చుకొని, వెనుక నిక్షిప్తంగా దాని ఉనికికి ఆధారమై ఉన్న దివ్యసూత్రాన్ని కనుగొనాలి. ఇది సహజంగా ఎన్నో ఆటంకాలతో కష్టాలతో కూడుకుని ఉన్నది. అయినా, ఇది అతిసమర్థవంతమైనది. అపసవ్యంగా ప్రేమిస్తున్నామని అసలు ప్రేమించటమే మాని వేయటంకంటే సవ్యంగా ప్రేమించటం శ్రేయోదాయకం కదా!

ఉదాహరణకు – వ్యక్తుల మధ్య ప్రేమ, పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ, సోదరసోదరీల మధ్య ప్రేమ, స్నేహితుల, ప్రేమికుల మధ్య ప్రేమ – అంతా స్వార్థము, అజ్ఞానము మొదలైన ఎన్నో లోపాలతో, మానవసహజమైన మాలిన్యాలతో కూడుకుని ఉంటుంది. అందుకని అసలు ప్రేమించకుండా ఉండటం సరి కాదు. శ్రీఅరవిందులు చెప్పినట్లు అది కష్టమైనదీ, నిష్ప్రయోజనమైనదీ కూడా. ఇందువల్ల హృదయ కాఠిన్యత పెరుగుతుంది. ఆర్ద్రత లుప్తమైపోతుంది. కాబట్టి ఉన్నతంగా, భక్తిపూర్వకంగా, నిస్వార్థంగా, ఆత్మార్పణతో ప్రేమించటం నేర్చుకోవాలి. ప్రేమకి వ్యతిరేకంగా పెనుగులాడకూడదు. దాని వికృతరూపాలకు – ఈర్ష్య, గుత్తాధిపత్యం, స్వంతం కావించుకోవాలనే కోరిక, మమకారం – వీటికి వ్యతిరేకంగా పెనుగులాట ఉండాలి. నీ ఇష్టాయిష్టాలను ఎదుటివారిపై బలవంతంగా రుద్దాలనుకోకూడదు. ఒకరికి ఇవ్వటంలోనే ఆనందం తప్ప స్వీకరించటంలో కాదు అని తెలుసుకో

వాలి. ఒకరిని ప్రేమించటంలోనే నీకు సంతృప్తి. వారి నుంచి ఆశించే ప్రతిస్పందనలో కాదు. నీ ప్రేమానురాగాలు ఇతరులకు పంచియివ్వటంలోనే నీకు ఆనందం. ప్రతిస్పందన కొరకు ప్రేమిం చటంలోనే ప్రేమకు ఆనందం.

ఈ దృక్పథంతో ఈ భావనలో ముందడుగు వేస్తూ పురో గమిస్తే, ఏదో నాటికి ప్రేమ వ్యక్తిగత వ్యవహారం కాదని, ఇది విశ్వజనీనమైన భావన అని, ఇది నీ ద్వారా చక్కగా అభివ్యక్త మవుతుందని తెలుసుకుంటావు. ఇది నీ అంతస్తత్వంలో దివ్యమై నదిగా నీకు తెలుస్తుంది.

నిస్వార్థం మొదటి అడుగు, ఇది ఎవరికైనా ఒకటే – యోగంలో ఉన్నా, లేకున్నా. నిస్వార్థప్రేమ నిజమైన ప్రేమకి ప్రాతిపదిక. ప్రతిఫలాపేక్ష లేకుండా సమర్పణ భావం ఉండాలి. మొరటు స్వార్థజీవనాన్ని వదిలి, తన్ను తాను అధిగమించటానికి ఈ క్రమశిక్షణ ఆవశ్యకం.

యోగానికి సంబంధించి ఇంకా కొంత చెప్పాలి. ముందు చెప్పినట్లు పరిమితమైన మానవప్రేమ నధిగమించి ముందుకు దూసుకుపోయి, దానికి ఆవల ఉన్న దివ్యప్రేమ సూత్రాన్ని కను గొనాలనేదే – అది. ఇది ఉత్తమమైనది. హృదయంలో ఆర్ద్రతకి చోటులేకుండా కాఠిన్యతను పెంచుకోవటం సరి కాదు. ఇది కష్ట తరమే, అయినా అన్ని విధాలా శ్రేష్ఠమైనది. తన ఇచ్ఛను ఇతరు లపై రుద్ది బాధపెట్టడం కన్న నిశ్చలంగా వాళ్ల మానాన వాళ్లని వదిలివేయటం మేలు. ఉన్నత సామరస్య జీవనానికి, సాధారణ జీవితంలోనూ కూడా ఇదొక ముందడుగు.

*

మానవప్రేమ – దివ్యప్రేమ

దైవాన్ని నిజంగా పరిపూర్ణంగా ప్రేమించినవాడు దైవసృష్టిని, ఆయన సృష్టించిన జీవులను కూడా ప్రేమిస్తాడు. ఆయన సృష్టిం చిన ప్రాణులలో కొన్నిటిని సహజంగానే మరింత ఎక్కువగాను, ప్రత్యేకంగాను ప్రేమిస్తాడు. అయినా అక్కడ అప్పుడు అది స్వార్థ

ప్రేమ అవదు – సాధారణ మానవప్రేమవలె. ఈ ప్రేమ ప్రతిఫలాపేక్షలేని నిస్వార్థప్రేమ కదా మరి!

ప్రేమించటంలో పొందే ఆనందం కోసం ప్రేమించటం, శాంతి సంతోషకరజీవనానికి అత్యున్నతమైన నియమం. సర్వభూతనివాసియైన దైవాన్ని ప్రేమించటమే అవుతుందది.

దైవము కోరినదే తానూ కోరుకోవటం దివ్యప్రేమకి పరాకాష్ఠ. అప్పుడే పరిపూర్ణప్రశాంతత.

*

దైవమును ప్రేమించటం తెలిసినవానికి ఇతర రకాలైన (ప్రాపంచిక భౌతిక) ప్రేమలన్నీ అస్పష్టంగా, అహంకారపూరిత, అల్పత్వ అజ్ఞానసమ్మిశ్రితంగా ఉంటాయి. అవి ఆధిపత్యం, ఏలుబడి కోసం పెనుగులాడేవిగా ఉంటాయి. దురవగాహన, తెలివితక్కువతనంతో చిరచిరలు, ఘర్షణలతో కూడి ఉంటాయి.

తాను ప్రేమించిన దానివలె తానుకూడా తయారవుతాడు అనేది అందరికీ తెలిసిన నిజం. కాబట్టి నువ్వు దివ్యంగా ఉండాలనుకుంటే దైవాన్ని ప్రేమించు, దైవంతో ప్రేమను పంచుకున్న వానికే, సాధారణప్రేమ ఎంత నిస్సారంగా మందకొడిగా, దుర్బలంగా ఉంటుందో తెలుస్తుంది. దైవప్రేమగా దానిని మార్చుకోటానికి ఏ కఠోరనియమం అయినా, అది ఎంత దీర్ఘము, తీక్షణము అయినా కష్టం అనిపించదు.

వైభవోపేతమైన దివ్యప్రేమతో అనుబంధాన్ని దైవంపై నిలిపి ఉంచుకున్నప్పుడు ఇతరులతో నీకు ఉన్న అనుబంధాలు మార్పుచెందుతాయి. సాధారణప్రేమ స్థానంలో నిలకడతో స్థిరమైన నిస్వార్థప్రేమను నీలో నింపుకుంటావు. ప్రతిఫలాపేక్ష ఉండదు. కృతజ్ఞత, పురస్కారం, గుర్తింపు – వీటి కోసం దేవిరింపూ ఉండదు.

ఇతరులు నీ పట్ల చూపే నిరాదరణ నీకు పట్టదు. ఆగ్రహం ఉండదు. నీలోని స్వచ్ఛమైన ప్రేమతో దైవాన్నే నీకు న్యాయాధిపతిగా నిర్ణయించుకుంటావు. ఇతరులకు నీపై ఉన్న అపోహాలు,

దురభిప్రాయాలు – వీటి నుంచి కాపాడవల్సినది దైవమే అని భావిస్తావు.

హర్షామోదాలను, సహకార సద్భావాలను భగవంతుని నుంచే, అర్థించి అందుకుంటావు. నీ దుఃఖాలకు ఉపశమనం ఆయన నుంచే నీకు లభిస్తుంది. ఆయనే నీకు మార్గదర్శి. తత్తర పాటు, వైఫల్యాలు, అలసట – ఇలాటప్పుడు ఆయనే నిన్ను ఉద్ధ రించి తన అనురాగహస్తాలలో ప్రశాంత మధుర ఉపశమనం కల్గించే ఆయన ఆలింగనంతో నీ సేద తీరుస్తాడు.

*

పరోపకారము

పరపీడన ఆధ్యాత్మికసాధనకు విరుద్ధం. ఒంటరి మార్గంలో సాధన ఒక రకమైన అహంకారయుతమైన విధానం. నిన్ననుసరించే వాళ్లెవ్వరూ లేనపుడు మాత్రమే ఒంటరిమార్గంలో విముక్తి. ఇత రులను నీతో కూడా ముందుకు తీసుకుని వెళ్లటానికి నీ సంసి ద్ధత వ్యక్తం చేయాలి. ఇది నీకు భారమైనపుడు అది భగవద నుగ్రహాఫలితం. భగవదర్పణలో నీ చిత్తశుద్ధికి పరీక్ష. భగవదను గ్రహం, అది అందుకోగలిగే నీ సామర్థ్యం, నీ చిత్తశుద్ధికి అను గుణంగా ఉంటుంది.

దైవం పట్ల, ఇతరుల పట్ల నీ కర్తవ్యం

దైవము పట్ల నీ కర్తవ్యము, సమాజము, కుటుంబముల పట్లకంటె కూడా పవిత్రమైనది. ఇది చాలావరకు పూర్తిగా అపార్థం చేసు కోవటంగాని, విస్మరించటంగాని జరుగుతోంది. అందుకే ఇది మరింతగా పునీతమైనది.

*

భగవంతునికి ఆత్మసమర్పణ కావించుకున్నవానికి తన సమర్ప ణను ఇతోధికంగా పవిత్రీకరణం, పరిపూర్ణం చేసుకుంటూ ఉండ టంకంటే మరి వేరే కర్తవ్యం ఏమీ ఉండదు. ప్రపంచము, ప్రజలు ఎప్పుడూ కూడా మానవ సముదాయంపట్ల తమకు ఉన్న కర్త

వ్యానికే – దైవముపట్ల కంటె – ప్రాధాన్యతనిస్తారు. దైవం పట్ల కర్తవ్యాన్ని అహంభావంగా నిందిస్తారు. వాస్తవ దివ్యానుభవం లేనపుడు వారంతకన్న మరేమీ చేయలేరు. ఇది వారి అజ్ఞానం తప్ప మరేమీ కాదు. దైవం దృష్టిలో వారి అభిప్రాయానికి విలువ లేదు... ఇచ్ఛ శక్తిహీనము. వాళ్లని ఒప్పించే ప్రయత్నం అనవసరం. నీవు మాత్రం చలించకూడదు. నీ పవిత్ర అంతరంగరక్షణ ఆశ్రయంలో జాగరూకుడవై దైవసహకారాన్ని, రక్షణకు, మార్గదర్శకత్వాన్ని, ఆమోదాన్ని అపేక్షిస్తూ వేచి ఉండాలి. దైవసహకార ఆమోదాలు ఉన్నవని నీకు తెలిశాక, ప్రపంచం అంతా కలిసి నీకు ఎదురు తిరిగినా నీకు ఏమీ కాదు.

మరి, మానవజాతి తన మనుగడను వ్యవస్థీకరించుకోవటంలో తన సమర్థతను నిరూపించుకోలేదా? ప్రభుత్వాలు మారుతున్నాయి; పాలనా విధానాలు మారుతున్నాయి; శతాబ్దాలు గడుస్తున్నాయి; కాని మానవుని వ్యథ శోచనీయంగా యదాతథంగానే ఉంది. మనిషి మారనంతవరకు, అంధత్వం, అజ్ఞానం, ఆధ్యాత్మిక అనాసక్తత, అలాగే ఉన్నంతవరకు, మానవక్షోభ అలాగే ఉంటుంది. ప్రకాశవంతమైన చేతన కలిగిన రూపాంతరీకరణం – ఇదే. మానవునికి వాస్తవమైన పురోగతి. హేతువాదం ప్రకారం ఆలోచించినా కూడా మనిషికి ప్రాథమిక కర్తవ్యం దివ్యచైతన్య అన్వేషణ, అనుభవం.

*

దివ్యప్రేమ

దైవాన్ని యెరుకపర్చి భౌతికజీవనాన్ని దివ్యజీవనంగా రూపాంతరీకరించాలని దైవాన్వేషకులుగా ఈ ప్రపంచంలోనికి వచ్చినవాళ్లలో కొంతమంది దివ్యప్రేమను మరింత పరిపుష్టం చేసి స్వచ్ఛంగా అభివ్యక్తీకరించారు. అలాటివారిని ప్రజలు అపార్థం చేసుకున్నారు. ప్రేమంటే తెలియని కఠినులుగా నిరశించారు. అయినా వారిలో దివ్యప్రేమ ఉన్నది. అది బాహ్యంగా భౌతిక మానవస్థాయిలో కనపడకపోవచ్చును. మూలాధారస్థాయిలో ఉన్నది. భావా

వేశ దౌర్బల్యాన్ని ప్రేమగా మనుష్యులు భావిస్తారు. దివ్యావేశ మైమరుపుతో ప్రతిఫలాపేక్ష లేకుండా ఆత్మార్పణ చేసుకొనటం అనేది సాధారణ మానవుల అవగాహనకు అతీతమైనది. భావా వేశ కలగలుపు లేకపోతే దానిని వారు కఠినమైనదిగా ఉదాసీన మైనదిగా భావిస్తారు. ఉన్నతోన్నత అత్యంత తీవ్రస్థాయి (దివ్య) ప్రేమావేశశక్తిని వారు గుర్తించలేరు.

*

నీ అన్వేషణ, స్వచ్ఛమైన ఆకాంక్ష, అర్పణ భావస్ఫూర్తి కలిగి ఉండాలి. ఇది అంత సులువుగా సాధ్యం కాదు. నీకు నీవై ఈ దివ్యప్రేమను ఆకాంక్షించాలి. నిన్ను నీవు సూటిగా చిత్తశుద్ధితో శోధన చేసుకోవాలి. నీవు అపుడు (దివ్య) ప్రేమను గురించి ఆలోచించటం మొదలుపెట్టగానే నీ అంతరంగంలో కలవరం సుళ్లు తిరుగుతుంది. నీలోని ఆకాంక్ష ప్రతిస్పందనలను అభిలషి స్తుంది. ఇందుకు యోగమార్గంలో పురోగమనం ఉండాలి. ప్రాణిక అంతస్తత్వ స్పందనల తాలూకు కాలుష్యం దివ్యప్రేమకు సోక కూడదు. శ్రద్ధాళువులైన మానవుల అనుభవం ఆధారంగా నేను చెప్తున్నాను. ఇపుడు నీవు ఉన్న పరిస్థితిలో దివ్యప్రేమ స్పర్శ మంచుకన్న చల్లగా ఉంటుంది. ఎంతో సుదూరము, మహోన్న తము అనిపిస్తుంది. పర్వతశిఖరాగ్రంపై గడ్డకట్టుకొని ఉన్నట్లుగా ఉండి ఊపిరాడదు. చైత్యపురుష లేక ప్రాణికస్పందనల ఆచ్ఛా దన లేకుండా మానవులికి దివ్యప్రేమానుభూతి కలుగదు. (దివ్య) కృపానుభూతి కలుగుతుంది. అదైనా ఎంతో స్వచ్ఛమైనది, సము న్నతమైనది. సుదూరమైనది. శ్రమతో కృప అనుభవైకవేద్యమౌ తుంది. దివ్యప్రేమానుభూతి పొందటం మాత్రం కష్టం.

*

....నీలోని చైత్యపురుషుని కనుగొనాలి. అప్పుడే నీకు దివ్య ప్రేమ అంటే ఏమిటో తెలిసేది. దివ్యప్రేమ సంసర్గాన్ని నేరుగా పొందే యత్నం చేయకూడదు. ఎందుచేతనంటే అది ప్రాణిక సత్వకామనగా నిన్ను ముందుకు తూలతోస్తుంది. నీవు తెలుసు కోలేవు. ప్రాణిక కామనే అది.

నీ చైత్యపురుష సత్వ సంసర్గానికి నీవు కృషి చేయాలి. ముందు ఇది నీవు తెలుసుకోవాలి. చైత్యపురుష చైతన్యంలో స్వేచ్ఛగా విముక్తి పొందినపుడు సహజంగా దానంతట అదే నీకు దివ్యప్రేమ ఏమిటో గ్రాహ్యమవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సమాచార పత్రం

అధ్యయన శిబిరం: శ్రీఅరవిందుల గీతావ్యాసాలు గురించి డా॥ యం.వి. నడ్కర్ణిగారు అధ్యయన శిబిరాన్ని ఏప్రిల్ 26 నుంచి 5 మే 2007 వరకు పాండిచేరి బీచ్ ఆఫీసుదరి నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే ప్రతిదినము ఉ. 9 నుంచి 11.45 వరకు, మధ్య ఒక అరగంట విరామంతో కార్యక్రమం జరుగుతుంది. అందరూ ఆహ్వానితులే.

నౌడా (ఉ.ప్ర): బ్రాంచివారు '*శ్రీఅరవింద శిక్షణా నికేతన్.*' పేరుతో పాఠశాలను బలహీనవర్గాల పిల్లల కోసం శ్రీమాత సమాధిరోజు నవంబరు 17, 2006 న తెరిచారు. ఛైర్మన్ శ్రీఅరవింద సొసైటీ శ్రీ ప్రదీప్ నరంగ్‌గారు ప్రసంగించారు. అదే రోజున ఢిల్లీ బ్రాంచిలోనూ వారు ప్రసంగించారు.

గుల్బర్గా (కర్ణాటక) బ్రాంచివారు స్వర్ణోత్సవాల సందర్భంగా నవంబరు 16, 2006 న సెదామ్ (గుల్బర్గా జిల్లా) లో నూతన కేంద్రాన్ని స్థాపించారు.

అంబాలా (హర్యానా) బ్రాంచివారు 17.12.2006 న 'విశాల్ హిందూసమ్మేళన్' సందర్భంగా అంబాలాలో పుస్తకాలు, అగర్బత్తీ విక్రయ కేంద్రాలు తెరిచారు.

అన్నానగర్ (తమిళనాడు) కేంద్రంవారు 'Annaigin Arul Vakkugal 1000' Part I పుస్తక ఆవిష్కరణ కావించారు.

Rs. 15



దివ్యజీవనమును ఆకాంక్షించేవారికి నిత్యసాధనలు

అఖిల భారత పత్రిక, ఏప్రిలు 2007

దివ్యజీవనమును ఆకాంక్షించేవారికి నిత్యసాధనలు

విషయసూచిక



Le regard de la Conscience Divine

The Gaze of the Divine Consciousness

శాంతి సుస్థిరత

ప్రశ్న: మానసిక శాంతి, నిశ్శబ్దాలను సుస్థిరపర్చటం ఎలా?

ముందు వీటిని అభిలషించాలి. తర్వాత ఇందుకు సడలని ప్రయత్నం కావాలి. ఇంతకు ముందే మీకు ఒక సాధన తెలిపాను. ఇంకా కూడా ఉన్నాయి. ముందు స్థిమితంగా కూర్చో. తర్వాత అసంఖ్యాకంగా వచ్చే ఆలోచనలకు అడ్డుకట్ట వేయి. 'శాంతి, శాంతి, శాంతి నిశ్చలశాంతి' – శాంతి, ప్రశాంతతలను ఆవాహనం చేసుకో. ఆకాంక్షించు. కావాలని అడుగు. *'శాంతి, శాంతి, ప్రశాంతి'* తర్వాత నిన్ను ఏదైనా స్పృశించి, కదలించినపుడు నెమ్మదిగా – *'శాంతి, శాంతి, శాంతి'* – అని శాంతిమంత్రం మననం చెయ్యి. ఆలోచనల జోలికి పోకు. వాటిని దరిచేరనీయకు. చేరినా పట్టించుకోకు. ఎవరైనా వచ్చి నీకెంతో చీకాకు కల్గిస్తూంటే వానిని వదల్చుకోవాలనుకుంటావు. వాడు చెప్పేది వినవు. వింటావా? వినవు. బుర్ర అటు త్రిప్పుకుని మరేదో ఆలోచిస్తావు. అదే నీవు చేయవల్సినది. ఆలోచనలు వచ్చినప్పుడు వాటిపై దృష్టి పెట్టకూడదు, వినకూడదు. ఏమాత్రం పట్టించుకోకూడదు. అవి అసలు అక్కడ లేనట్లే ప్రవర్తించాలి. చూశావా! అలా మననం చేస్తూనే ఉండు. మూర్ఖుడు చెప్పినదే మళ్లా మళ్లా చెప్తూంటాడు చూడు, అలా! అదే మళ్లీ శాంతిమంత్ర జపం. శాంతి, శాంతి, శాంతి. కొద్ది క్షణాలు ఇలా ప్రయత్నించి చూడు. మరల ఇదే పునశ్చరణ – ఉదయం నిద్రలేవగానే, రాత్రి పరుండబోయేటప్పుడు కూడా. నువు తినే ఆహారం సరిగా జీర్ణం కావలన్నా కూడా, భోజనం తినే ముందు కొద్దిక్షణాలు శాంతిమంత్రం జపం చెయ్యి. జీర్ణక్రియకిది ఎంత సహకరిస్తుందో నీవు ఊహించలేవు. భోజనానికి ముందు – శాంతి, శాంతి అనుకో. అంతా ప్రశాంత సుందరంగా ఉంటుంది. చీకాకులు దరిచేరవు. అలా అలా దూరంగా అవి పారిపోతున్నట్లు అనిపిస్తుంది. నీవిలానే కొనసాగిస్తూపోతుంటే కొంతకాలానికి నీవిక వేరే కూర్చుని శాంతిమంత్రం

జపించవలసిన ఆవశ్యకతే ఉండదు. అంతా శాంతిమయమై, ప్రశాంత సౌందర్యప్రకాశమే!

ఆరంభంలో మాత్రం ప్రయత్నం అత్యావశ్యకం. మొదట కష్టంగా ఉంటుంది. ప్రశాంతత సాధించటం ఓ పట్టున సాధ్యప డదు. కాని ప్రయత్నంమాత్రం చాలా తేలిక. మొట్టమొదటసారిగా స్నేహితుని పల్కరించినంత సులువు. అలా పిలవగానే వస్తాడు కదా దరికి స్నేహితుడు! శాంతిసామరశ్యాలతో జతకట్టు. వాళ్లని పిలు – అపేక్షగా – శాంతి, శాంతి, శాంతి, రారండి, అని.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నిదానించు

మీలో చాలామంది బాహ్యప్రభావాల స్పర్శకి ఉన్మీలనం చెంది సత్యానికి ఉపరితలంలోనే జీవిస్తారు. శారీరక బాహ్యతలానికి అన్వయించుకుని జీవించే బాహ్యజీవనమే మీది. అలాగే నీకు నచ్చని బాహ్యజీవనుడు తారసిల్లినపుడు నువ్వు తలక్రిందులైపో తావు. ఈ బాధ అంతటికీ కారణం నిదానంగా ఒక్కమారు వెను తిరిగి చూచే అలవాటు లేకపోవటం వల్లనే. నీకెప్పుడూ అంత ర్దృష్టి ఉండాలి. అది క్షేమకరం. ప్రపంచంలో కదలాడే బాహ్య శక్తులకు నీవు వశం కాకూడదు. హడావిడిగా ఏ పనినైనా చేయ వలసివచ్చినా కూడా ఒక్క అడుగు వెనక్కివేసి కాస్త నిదానంగా ఉపక్రమించు. అపుడు నీవెంత త్వరగా విజయవంతంగా పనిచే యగలుగుతావో; నీకే ఆశ్చర్యం కలుగుతుంది. నీపై ఎవరైనా కోప గించినా, వాని స్పందనలకి లోబడి ఉండకు. కాస్త నిదానించు. అప్పుడతని కోపానికి ప్రతిస్పందనలేక, అది బలహీనపడి మాయ మైపోతుంది. ఎప్పుడూ నీ సంయమనాన్ని కోల్పోకు. ఏ ఆకర్ష ణకి లోబడక నిరోధించు. నిన్నే అది అప్పుడు వదిలిపోతుంది. నిదానించకుండా, ఒక్కసారి ఒక్కడుగు వెనక్కి వేయకుండా

నిర్ణయం తీసుకోకు. ఏ కార్యమూ తలపెట్టకు. ఈ లోకంలో అంతా అశాశ్వతమైనది, నిలకడ లేనిదే. అందువల్ల దేనిని గురించీ బెంగపెట్టుకుని తలక్రిందులయే అవసరం లేదు. ఏది శాశ్వతమో, నిత్యమో, నాశనము లేనిదో, అనంతమో అదే నిజానికి నీవు జయించి స్వాధీనపర్చుకోవలసినది. అదియే దివ్యతేజస్సు, దివ్య ప్రేమ, దివ్యజీవనము. అదే సర్వోన్నత ప్రశాంతత కూడా. అదియే పరిపూర్ణ ఆనందము. సర్వాధిపత్యము. ఈ భూమిమీద అదే సర్వోన్నత అభివ్యక్తీకరణ. విషయములు తాలూకు అన్యోన్యాశ్ర యత్వము, సాపేక్షభావము నీకు కలిగినపుడు నీవొక అడుగు వెనుకకు వేసి నిదానంగా విషయాలు దర్శిస్తావు. నిశ్చలంగా ఉండగలుగుతావు. దివ్యశక్తిని ఆవహానం చేస్తావు. జవాబు కోసం ఎదురుచూస్తావు. సరియైన పరిష్కారం అందుతుంది. ప్రశాంతచి త్తము లేకుండా నీకు సరియైన సమాధానం రాదు. అంతరంగ ప్రశాంతత పొందేందుకు సన్నద్ధమవు. చిన్నదే అయినా ప్రయత్నం ప్రారంభించు. ఒక అలవాటుగా మారేవరకు సాధన చెయ్యి.

*

ఈ సుళ్లు తిరిగే శక్తుల నుంచి వెనుకకు మరలి ప్రశాంతసీమలకు చేరుకున్నప్పుడు నీకిదంతా ఎంత భ్రమయో తెలుస్తుంది. మాన వాళి అంతా పరస్పరం ఒకరికి వ్యతిరేకంగా మరొకరు అడ్డుప డుతూ, తడపడుతూ, గ్రుడ్డిగా కలయతిరుగుతూ, తామేం చేస్తు న్నామో, ఎందుకు చేస్తున్నామో తెలియక తారట్లాడే పరిస్థితి నీకు తెలుస్తుంది. ఇదే జీవితం అనుకుంటారు. ఇది నిజజీవితం కాదు... అసలైన జీవనకార్యకలాపమూ కాదు. ఇది పనికిమాలిన సంక్షోభం. నేను మాట్లాడే నిశ్శబ్దత అంతరంగ నిశ్శబ్దత. చేసే కర్మల రణ గొణధ్వనిలో బంధితులైనవారికి అసాధ్యం. చేసే పనికి, దాని చలి తచాలనాలకి అతీతంగా ఉండేవారికే యిది సాధ్యం. అప్పుడే నిత్య సత్యచైతన్యం లోనికి అడుగిడగలుగుతారు. అపుడే వారికేది కర్త వ్యమో (true action) తెలిసొస్తుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

రోజుకో గంట ప్రయత్నించు

మీలో ప్రతి ఒక్కరు తప్పక ప్రయత్నించండి. అది ఎంతోసేపు పట్టదు. రోజు మొత్తం మీద ఒక గంట. ఆ గంటసేపు పూర్తిగా అవసరమైనది మాత్రమే మాట్లాడండి. అంతకు మించి ఒక్క మాట ఎక్కువా వద్దు. తక్కువా వద్దు. ఖచ్చితంగా మాట్లాడవలసిందే మాట్లాడండి....

ఇలా నిత్యజీవితంలో మీకు సౌకర్యవంతముగా ఉన్నపుడే ఆ గంట సమయాన్ని వెచ్చించండి. ఆ సమయంలో మిమ్మలని మీరు పూర్తిగా గమనించండి. అపుడు ఏమన్నా మాట్లాడవలసివస్తే కనీసంగా అవసరమయినది మాత్రమే... అంతకు మించి మాట్లాడకండి.

ఇలా చేస్తూ ఉన్నపుడు మీరు ఎదుర్కోబోయే మొదటి సమశ్య... అసలింతకీ ఖచ్చితంగా అవసరమయినది ఏదీ కాదు అన్నదే. నిజానికి ఇది కూడా స్వాధ్యాయనమే.... దీన్ని ఇంకా మీరు రోజు రోజుకి మెరుగుపర్చుకోగలరు. తరువాత మీరే చూస్తారు. ఏమీ మాట్లాడకుండా ఉన్నంతవరకు పూర్తిగా నిశ్శబ్దంగా ఉండటం కష్టమనిపించదు. కాని మీరు మాట్లాడటం మొదలుపెడితే ఎన్ని మాటలు మాట్లాడినా అవి నిష్ప్రయోజనమయినవే... నిజానికి మాట్లాడే అవసరమే అసలు ఉండదు.

ఇదిగో ఈ విధమైన అభ్యాసాన్ని వచ్చే శుక్రవారం వరకు మీకు ఇస్తున్నాను. దీనిలో మీరు ఏ మేరకు సఫలీకృతులు అవుతారో చూద్దాం. ఈ వారం చివరిలో దీనికై ప్రయత్నిస్తూ ఎవరెవరు ఎంతవరకు సఫలీకృతం అయ్యారో తెలుపుతూ ఒక సంక్షిప్తమైన వివరణ ఇవ్వండి.

*

తరువాత శుక్రవారం క్లాసులో అమ్మ ఇలా సూచించారు. వాక్కు నియంత్రణపై మీరు నోటు చేసుకొన్న వివరణలను నేను చదివాను. దీనికి సంబంధించి చాలామంది చాలా గంభీరంగా ప్రయత్నించారు. అట్లాగే మీ మీ ఫలితాలను చూచి నేను సంతోషిస్తు

న్నాను. దీనిని ఇంకా మీరు కొనసాగిస్తూ ఉంటే మంచిగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. మీలో ఒకరు వ్రాసింది పరిశీలించాను. అది ఎంతో నిజం. అది ఏమిటంటే ఈ అభ్యాసాన్ని గనుక ప్రారంభిస్తే ఇక ఆపడానికి కారణమే ఉండదు. ఇలా రోజుకు ఒక గంటసేపు అని అనుకుని మొదలుపెడితే అది '*అవసరం*' అవుతుంది. తరువాత అలవాటుగా మారుతుంది. దానిని ఇక ఎంతో సహజంగానే కొసాగించవచ్చు.

నిజంగా మీ అభ్యాసం, మీ ప్రయత్నం ఇట్లాంటి ఫలితాన్నే ఇస్తే అది ఎంతో గొప్ప విషయమే.

మూలం: శ్రీమాత
అనువాదం: సి. హర్షవర్ధన్

స్థిరశక్తిని ఉపయోగించుట

స్థిరశక్తి అంటూ ఒకటి ఉంటుంది. అది మీకు ఎలా వివరించాలి? చూడండి, క్రీడలలో ప్రత్యర్థుల నుంచి దాడిని ఎదుర్కొనటం, తిరిగి వారిపై దాడి చేయడం అనేవి ఉంటాయి కదా. అలాటిదే స్థిరశక్తికి క్రియాశక్తికి మధ్యనుండే వ్యత్యాసం. అర్థమైందా? స్థిరశక్తి అన్నింటిని ఎదిరించి నిలబడ కలిగేది. దానిపై ఏది పని చేయలేదు, దానిని ఏదీ తాక లేదు, ఏదీ కదల్చలేదు – అది నిశ్చలమైనది. అజేయమైనది. క్రియాశక్తి ఆచరణాత్మకమైనది. అప్పుడప్పుడది ముందుకు దూసుకెళ్లి ఒక్కోసారి దెబ్బతినవచ్చు. అంటే క్రియాశక్తి ఎల్లప్పుడు విజయవంతంగా ఉండాలనుకుంటే, దానికి స్థిరశక్తి సుస్థిరమైన ఆధారంగా ఉండాలి.

నీవేం చెప్పాలనుకుంటున్నావో నాకు తెలుసు – మనిషికి శక్తిని గురించి తెలిసేది అది క్రియాశీలకమైనప్పుడేనని; పని చేస్తే తప్ప దానిని శక్తిగా మనిషి పరిగణించడు. పనిచేయకపోతే, దానివైపు కన్నెత్తైనా చూడడు. ఈ క్రియాశూన్యత వెనుక నుండే మహత్తరశక్తిని అర్థం చేసుకోలేడు – ఎప్పుడూ కూడ, క్రీయాశీలశక్తికి

మించిన తీవ్రతను కలిగిన అమోఘశక్తిని గమనించడు. దీనిని నీపైనే ప్రయోగించుకొని చూడు. అవాంఛనీయమైనదేదైనా ఎదురై నప్పుడు, ప్రశాంతంగా, చలించకుండా, కదలకుండా ఉండగలు గుట చాలా కష్టం – అందుకు వ్యతిరేకమైన మాటలుకాని, చేత లుకాని – అంత ఘాటుగా, అంత తీవ్రంగా ప్రతిస్పందించకుండా ఉండగలుగుట కష్టం. ఎవ్వరైనా నిన్ను అవమానించారనుకో. అట్టి అవమానాన్ని ఎదుర్కొంటూ కూడ, నీవు చలించకుండా (కేవలం బాహ్యంగానే కాదు, పరిపూర్ణంగా) ఏ రకంగానూ ప్రభావితు డవు కాకుండా ఏ ఒక్క సంజ్ఞ కూడా చేయకుండా, ఒక్క మాట కూడా అనకుండా వుండగలుగుతే నీవు మహాశక్తివంతుడవన్న మాట. బాహ్యంగాను, అంతర్గతంగాను, నిన్ను ఏ అవమానము స్పృశించలేదు. నిశ్చలహృదయుడవై ఉండగలుగుతావు. నిశ్చల ప్రశాంతత కలిగి ఉంటావు. ఏమాత్రము కలత చెందవు. నీ బుద్ధి ప్రతిస్పందనలతో సమాధాన మీయదు. ముష్టియుద్ధం చేయాలని నరాలు గట్టిగా బిగబట్టవు. దెబ్బకి దెబ్బ తీయాలనిపించదు. నీవ లాగ స్థాణువులా ఉండగలుగుతే నీలో స్థిరశక్తి ఉన్నదన్న మాట. మాటకి మాట, దెబ్బకి దెబ్బ, ఆందోళనకి ప్రత్యాందోళన – వీట న్నిటికంటె కూడా అది అనంతమైన అతీతశక్తి.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

నీ వనుగ్రహించిన ప్రశాంతత లోలోన పదిలపర్చు కునే కటాక్షం ప్రభూ!
విధ్వంసగర్జనల వినాశకర (అనంత) కాలమధ్యంలో.

శ్రీమాత

తీరిక సమయంలో

నిత్యజీవితంలో మనకు తరచు తీరిక కల్గటం కద్దు. ఈ తీరిక కొన్ని క్షణాలే కావచ్చు లేదా కొన్ని గంటలు కావచ్చు. కొందరు ఈ తీరుబాటు కాలాన్ని సత్కాలక్షేపం, పుస్తకపఠనం లాంటివి కోసం వినియోగించవచ్చు. జనసామాన్యం ఈ కాలాన్ని వృథా చేయటం మనము నిత్యము గమనించవచ్చును. ఇందు వయో భేదము లేదు. చిన్నా, పెద్దా అందరికీ వర్తిస్తుందనటంలో సందేహం లేదు.

మనకు లభించిన తీరికను వృథా చేసుకోకుండా చక్కగా వినియోగించుకోవటానికి అనేక మార్గాలు ఉన్నవి. వీటిలో ముఖ్యమైనదే ఆత్మపరిశీలన. గతస్మృతులను విశ్లేషించుకోవటమే. కాస్తంత తీరిక దొరికిన తరువాత "హమ్మయ్య! ఇప్పటికి కాస్త తీరుబడి దొరికింది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. ఈ జంఝాటం నుంచి బయటపబడి జీవితం సార్థకం చేసుకోవాలి. నిత్యమైన సత్యస్వరూపం ఆకళింపు చేసుకోవాలి" అని తపన చెందాలి. ఈ తపన ప్రతి నిత్యము ప్రతిబింబిస్తే, నీకు మార్గమంతా పూలబాటే. వృథా కాలయాపనతో దుర్వినియోగం చేసుకొంటే జీవితచరమాంకంలో కాలాతీతమై దుఃఖమే నీకు శరణ్యము. అందువల్ల లభించిన అవకాశాలన్నిటినీ సద్వినియోగం చేసుకొని, జీవితధ్యేయాన్ని గ్రహించుకొని, ఆ లక్ష్యము చేరుకోటానికి కృషి చేయాలి.

మనము కార్యవిహీనులమైనపుడు ఒక విధమైన అశాంతికి లోనుకావటం సహజం. ఆ స్థితి నుంచి బయటపడటానికి ఏదో ఒక వ్యాపకం పెట్టుకోవటం జరుగుతుంది. కొందరు వాహ్యాళికి వెళ్ళవచ్చు. మొక్కల పనితో కాలక్షేపం చేయవచ్చు. మరేదైనా చేయవచ్చును. వీటన్నింటినీ మించినది, ఉత్తమమైనది మరొకటి ఉన్నది. సముద్రతీరానగాని, నదీతీరానగాని, ఏదైనా చెట్టు క్రింద గాని చక్కని స్థలము ఎంపిక చేసుకొని, స్థిరముగా కూర్చొని నీ

జీవితగమ్యమేమిటి, దానిని ఎలా సార్ధకం చేసుకోవాలి, ఈ సుఖ దుఃఖాల వలయం నుంచి ఎలా బయటపడాలి అని విశ్లేషించుకో.

*

ఈ పుడమిన జన్మించటం పూర్వజన్మ విశేషమే. ఈ జగన్నాటకంలో ఉచితమైన పాత్ర పోషించి, జన్మసార్ధకం చేసుకోవాలి. ఇందుకు జీవుడు మానసికంగా ఉన్నతస్థితిని అందుకోవాలి. లేకపోతే ఇంతే సంగతులు. జీవుడు చైతన్యవంతుడైనకొద్దీ, వానియందు ఈ తత్వము ఉన్నతస్థితిని చేరుకొంటుంది. ఈ తరుణంలో పూర్వమెన్నడూ గోచరించని విచిత్రమైన మానసికస్థితికిలోనై, తాను కారణజన్ముడన్న భావనతో స్వార్ధరహితుడై, కార్యరంగంలోకి దూకటం సంభవిస్తుంది. ఈ జగత్తులో ప్రస్తుతం జరుగుతున్నదిదే. మరో మార్గం కానరాదు. "ఈ పృథ్వీపై కాలు మోపాను కాబట్టి నా కర్తవ్యం నిర్వహించాలి. నా చైతన్యస్వరూపంతో ఈ సర్వసృష్టిని చైతన్యవంతం చేయాలి" అని సంకల్పించాలి.

మూలం: శ్రీమాత
అనువాదం: శ్రీశరణ్

ఈ పుడమిన జన్మించటం పూర్వజన్మ విశేషమే. ఈ జగన్నాటకంలో ఉచితమైన పాత్ర పోషించి, జన్మసార్ధకం చేసుకోవాలి.

శ్రీమాత

అనుభూతిని పొందే దెలా?

మనము అనేక వేదాంతగ్రంథాలు పఠించవచ్చు గాక, ఆధ్యాత్మిక బోధలు, పురాణశ్రవణం చేయవచ్చు గాక. ఇవన్నీ ఒక ఎత్తు. దివ్యానుభూతి మరొక ఎత్తు. ఈ అనుభూతి క్షణికమైనా, శత కోటి ప్రవచనాలుగాని, బోధలుగాని, ఈ అనుభూతికి సాటిరావు.

అయితే ఈ అనుభూతి ఎలా సాధ్యం, దీని మార్గమేమని ప్రశ్న ఉదయిస్తుంది.

ముమ్మందుగా నీవు అంతర్ముఖుడవు గావటం తప్పనిసరి. అటు పిమ్మట నీ అంతరంగంలోని అంతరాంతరాలను చొచ్చు కొనిపోయి, మరుగునపడి ఉన్న నీ సత్యస్వరూపాన్ని శోధించి గ్రహించుకో. అలా నిన్ను నీవు క్రమక్రమంగా విశ్వమంత విశా లంగా, విస్తృతపర్చుకొని అవధులు దాటిపో. ఇది ఎంతో నిశ్చల నీరవ ప్రశాంతతలో జరగాలి. ఈ ప్రశాంతత మనసును నిశ్శబ్ద పరిచి, ప్రాణికమును నిశ్చలపరుస్తుంది.

ఈ అభ్యాసం అవిచ్ఛిన్నంగా సాగిపోవాలి. కాలక్రమేణా బాహ్యచైతన్యానికి అంతుచిక్కని ఒకానొక సత్యస్వరూపం నీకు సాక్షాత్కరిస్తుంది.

ఈ పరిణామమంతా ఒకానొక కృపావిశేషమని గ్రహించు. అజ్ఞానచీకట్లు తొలగిపోగా, సత్యస్వరూపాన్ని గ్రహిస్తావు. ఈ తత్వము నీ ముందు నిలకడగా ఉండుటకు నీకు నిత్యము ఈ సాధన తప్పనిసరి.

మూలం: శ్రీమాత

అనువాదం: శ్రీశరణ్

చైతన్య విస్తృతి

వీలైతే చైతన్యాన్ని విస్తృతపర్చుకోవాలి. చైతన్యాన్ని విశాలపర్చుకోవాలని అనుకున్న ఒకతను నాకు తెలుసు. అందుకు అతనొక మార్గం కనుగొన్నట్లు చెప్పాడు. రాత్రి ఆరుబయట ప్రదేశంలో వెల్లకిలా పడుకుని నక్షత్రాలను తిలకిస్తూ వాటితో తాదాత్మ్యం చెంది విశాల విశ్వంలోకి సాగిపో. నిన్నూ నీతో పాటు ఈ భూమిని, ఈ భూమిపైన ఉండే అల్పమైన వాటినన్నిటినీ పూర్తిగా అధిగమించి అవధిలేని ఆకాశమంతగా విస్తృతిచెందు. విశ్వమంత విశాలమని అనలేము. మనకు కనిపించే విశ్వం అణుమాత్రమే కదా! నక్షత్రమండలంతో కూడిన ఆకాశమంత విశాలంగా అయిపో. ఆ రకంగా నీలోని మలినాలు జారిపోతవి – ఆ కొంతసేపైనా. విషయపరిజ్ఞానం విస్తృతి చెందుతుంది. ఇది ఒక మంచి శిక్షణ (exercise)

*

ప్రశ్న: మా చైతన్యాన్ని ఎలా విశాలపర్చుకోగలం శ్రీమాతా!

విశాలపర్చుకోవటమా? ఇందుకు పలుమార్గాలు. అన్నిటి కన్నా సులువైన మార్గం – సువిశాలమైనదానితో తాదాత్మ్యం చెందటం. నీకు ఎప్పుడైనా సంకుచిత, పరిమిత ఇచ్ఛ, చైతన్యంతో ఒక పెట్టెలాటి ఇరుకు స్థలంలో బంధింపబడిన భావన కల్గినపుడు సువిశాలమైనదానిని గురించి ఆలోచించటం మొదలుపెట్టు. ఉదాహరణకి – సముద్రమంత విశాలమైనది ...అది అలా అలా అంతం లేకుండా అన్ని వైపులా ముందు, వెనుకా, నలుదిశలా విస్తరించి, ఆవలి తీరం అగుపించకుండా సాగిపోతూంటే, ఆ అనంతంలో నిన్ను నీవు పోల్చుకున్నప్పుడు హద్దులు కానవు. అంతా విశాలత్వమే. అలాటి సముద్రంపై తేలియాడిపోతున్న భావన కలుగుతుంది. ఇది చాలా సులువు. అప్పుడు నీ చైతన్యాన్ని విస్తృతపర్చుకోగలవు.

కొంతమంది అంతరిక్షం వైపు తిలకిస్తూ నక్షత్రాల మధ్య అనంతమైన ఖాళీ స్థలాలను ఊహిస్తారు. అనంత విశాల విశ్వంలో భూమండలం అల్పమైన బిందుమాత్రంగా ఉంటుంది. నీవు దానిపై ఒక కీటకంకంటె చిన్నగా భావించు. అంతరిక్ష స్థలాల మధ్య తేలిపోతూన్నట్లు భావించు. అంతకంతకు ఇతోధికంగా పెరిగి పోతూ దూరతీరాలకు సాగిపోతూన్నట్లు భావించు. ఈ విధంగా కొంతమంది కృతకృత్యులవుతారు.

భూగోళం పైన ఉన్న వస్తువులతో తాదాత్మ్యత చెందటా నికి ప్రయత్నించే మార్గాలు కూడా ఎన్నో ఉన్నాయి.

చైతన్యాన్ని విస్తృతి పర్చుకునే మానసిక మార్గాలు కూడా ఎన్నో! నీకు విసుగు, బాధ కలిగినపుడు నిరవధికమైన కాలాన్ని గురించి, అపారంగా పరివ్యాప్తమై ఉన్న ప్రదేశాన్ని గురించి, గతం, భవిష్యత్తుల గురించి ఆలోచించటం ప్రారంభించు. అనంతమైన కాలంలో ఈ క్షణం ఎంత! కనురెప్పపాటంత. మనిషి ఎంత అల్ప మైనవాడు! ఊహించుకోగలగాలి. స్వల్పమైన ఈ భూమండలం మీద క్షణికమైన చైతన్యస్పందనకి బాధపడటం, దాని గురించి విచారించటం దేనికి! ఆ అవగాహనతో ఆలోచిస్తే జీవితసంఘటనలకు పెద్ద ప్రాముఖ్యాన్ని ఇవ్వటం ఎంత హాస్యాస్పదమో తెలుస్తుంది. ఈ సదవగాహన నీలో ఉన్నప్పుడు ఏ చికాకు, బాధ అయినా ఇట్టే తుడుచుకుపోతాయి. దేశకాలాల గురించి అనంతత్వం, నీ అల్పత్వం నీకు యెరుక అయినపుడు నిన్ను ఏ బాదరబందీలు బంధించవు. అన్ని బంధాల నుంచీ విముక్తుడవు కాగల్గుతావు. ఎంతటి గాఢవిచారమూ నిన్ను స్పృశించదు. కావల్సినది సక్రమ ఆలోచనావిధానము. అదే కనుక ఉంటే అల్పమైన అహం నుంచి విముక్తి కలుగుతుంది.

*

మనో, ప్రాణిక, భౌతికస్థాయిలలో ఉద్రిక్తతలు సడలించే విధానం వేర్వేరుగా ఉంటుంది. అయినా హేతుబద్ధమైన పద్ధతి ఒకటే. ఉద్రిక్తత, ఆమోదయోగ్యంగాని ప్రతికూల పరిణామం వైదొలగినపుడు – ఇది తాత్కాలిక నిరోధం మాత్రమే అనిపిస్తుంది. ఇంకా బాధ

ఉన్నా కూడా ఉద్రిక్తతలు సడలిన తరువాత నీవు విస్తృతమయే ప్రయత్నం చేయాలి. నేను విశాలమవుతున్నాను, అనే భావనలో ఉండాలి. ఎన్నో మార్గాలున్నాయి ఇందుకు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఏకాగ్రతా శక్తిని తీవ్రపర్చటం

ప్రశ్న: చేసేపని శక్తివంచనలేకుండా చేయాలనుకున్నప్పుడు కొంచెం ఎక్కువ సమయం అవసరమవుతుంది. సమయం ఉండదు. హడావిడిగా ఉంటాం. అలా హడావిడిగా ఉన్నా కూడా శక్తివంచన లేకుండా పనిచేయుటం ఎలా?

ఇది చాలా ఆసక్తికరమయిన అంశం. ఒకప్పుడు దీనిని గురించి సవివరంగా మాట్లాడాలనుకున్నాను. తొందరలో పనులు సాధారణంగా అసమగ్రంగా, అంతబాగా చేయలేకపోవటం జరుగుతుంది. అయితే ఇక్కడ ఒక మార్గం ఉంది. అది నీ ఏకాగ్రతను తీవ్రపర్చటం. దీనివల్ల నీకు సగం సమయం కలిసివస్తుంది. సాధారణ విషయాన్నే ఉదాహరణగా తీసుకుందాం. స్నానం చేయటం, వస్త్రధారణ ఈ పనులు చేయటానికి తీసుకునే సమయం వ్యక్తికీ, వ్యక్తికీ మారుతుంది. తొందరపడకుండా కాలయాపన చేయకుండా ఈ పనులు చేయటానికి అరగంట పడుతుందనుకుందాం. నీవు హడావిడిగా చేస్తూన్నపుడు – సరిగా స్నానం చేయలేకపోవచ్చు లేదా వస్త్రధారణలో లోపం గలుగవచ్చు. కాని మరియొక పద్ధతి ఉంది. చేసే పనిలో శ్రద్ధ, శ్రమలతోపాటు ఏకాగ్రత పాటించటం. చేసే పనిలోనే శ్రద్ధ వహించి ఏకాగ్రత పాటించి సరిగ్గా అవసరమైనంత సమయమే తీసుకుని చేసినపుడు, అరగంటలో చేసే పనిని పదిహేను నిముషములలోనే ముగిస్తావు. మరింత సమర్ధవంతంగా చేస్తావు. ఇది నీ తీవ్రమైన ఏకాగ్రతవల్ల సాధ్యం అవుతుంది.

అబ్బో! ఏ పనైనా సమర్థవంతంగా చేయటానికి సమయం పడుతుంది అనుకునేవాళ్లకి ఇది సరియైన సమాధానం. నీవు చేసే పని ఏది కానీ – చదువు, ఆట, పని – ఒకటే పరిష్కారం. ఏకాగ్రతాశక్తిని ఇనుమడింపచేయి, తీవ్రతరం చేయి. ఏకాగ్రతా సౌలభ్యం నీవు సంతరించుకున్నపుడు నీకు అలసట కూడా అనిపించదు. సహజంగా మొదట్లో కొంత టెన్షన్ ఉంటే ఉండవచ్చు. అలవాటుపడితే క్రమంగా అదీ తగ్గుతుంది. నీ అలసట ఏకాగ్రతవల్ల కాకపోవచ్చు. వేరే పనులలో నిమగ్నమైన కారణంగా ఏకాగ్రత లోపించడం వల్ల కాకపోవచ్చు. ఏకాగ్రతాశక్తి పనులను మరింత సమర్థవంతంగా, తొందరగాను జరిపిస్తుంది. ఈ రకమైన కార్య నిర్వహణలో నీవు ఉన్నతంగా యెదుగుతావు. లేకపోతే నీలో అనాసక్తత చోటు చేసుకుంటుంది. ఇది మరింత ప్రమాదకరం. అశ్రద్ధ అనాసక్తతకి మారుపేరు అవుతుంది.

*

ప్రశ్న: ఏకాగ్రత అంటే ఏమిటి?

చెదరిన చైతన్యతంతువు లన్నిటినీ సరిగా కూడతీసి ఏకోన్ముఖం కావించి, ఒకే సమగ్రభావనకి కేంద్రీకృతం కావించటం. పరిపూర్ణమైన ఏకాగ్రత సాధించి చేపట్టిన కార్యక్రమ పురోగమనం సత్వరమయి పూర్తి అవుతుంది. శిక్షణలో కండరాలను కూడతీసినట్లుగా, ఏకాగ్రతను, కూడతీసి పెంపొందించగలం. శిక్షణా పద్ధతులు, ఏర్పాట్లు వేర్వేరుగా ఉంటాయి. అతిహీనమైన దుర్బలుడు కూడా క్రమశిక్షణతో శక్తివంతుడు కాగల్గుతాడు. ఇచ్ఛాశక్తి నిలకడగా ఉండాలి. రెపరెప లాడకూడదు.

ఇచ్ఛ (the will), ఏకాగ్రతనలవర్చుకోవాలి. క్రమంతప్పని శిక్షణ, అనుసరించే విధానములపై ఆధారపడి ఉంటుంది. If you will you can చేయాలనే బలమైన ఇచ్ఛ ఉంటే, సాధిస్తావు. ఎందుకిది అంతా! ఏమిటీ ఉపయోగం! అనే నీరసమైన ఆలోచనలు రాకూడదు. నేనే పనికి తగను; నాలో ఆ లక్షణాలు లేవు; ఏమీ చేయలేను – అనుకోవటం శుద్ధతెలివితక్కువ.

మూలం: శ్రీమాత

పనిలో మమైక్యత

ఒక ఆట కానీ, పుస్తకరచనగానీ, చిత్రలేఖనం, సంగీతం లేదా ఒక పరుగుపందెం యే పనైనా, అది యే రకమైనదైనా, యెంత చిన్నదైనా సమగ్రంగా, చక్కగా చేయాలంటే అందులో పూర్తిగా నిమగ్నమయిపోవాలి. ఈ పని నేను చేస్తున్నానే అహంభావం వుండకూడదు. చేస్తున్న పని విజయవంతమై సఫలం కావాలంటే పనిలో లీనమయిపోవాలి. అదే గొప్ప ప్రగతి. చేసే పని ఎంత చిన్నదైనా యిది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఒక ఆసక్తికరమయిన సంఘటన తీసుకుందాం. ఒక సీసాలో ద్రవం మరొక సీసాలో నింపాలి. అలా నింపాలంటే యెంతో క్రమశిక్షణ, శారీరక నైపుణ్యం కావాలి. సీసాని ఒడుపుగా పట్టుకొని, జాగ్రత్తగా అది పక్కలకి జారకుండా ఏకధారగా, ఏకాగ్రతతో రెండో సీసాలోకి వొంపాలి. పూర్తిగా నిండేవరకు యింకో ధ్యాస వుండకూడదు. నింపే సీసా, నింపబడే సీసా, నింపే కార్యక్రమం – అంతా నీవే కావాలి. మొత్తం ఈ ప్రక్రియకి ప్రతిరూపంగా నీవు మారిపోవాలి. అప్పుడంతా సవ్యంగా సాగుతుంది. ఇది ఒక క్రమశిక్షణ. ఏమాత్రం యేమరుపాటుగా వున్నా, లేదా నీ పనితనానికి నువ్వే మురిసిపోతూ దృష్టి చెదిరినా, మరుక్షణమే చెయ్యి జారడమో, వణకడమో జరుగుతుంది. అంతే! అంతవరకు యెంతో చక్కగా అవుతున్న పని మొత్తం పాడవుతుంది. ఏ పనైనా అంతే. అలాగే అవుతుంది. అందుకనే క్రమశిక్షణ అలవడటానికి పని వొక మంచి సాధన. సవ్యంగా నిర్వర్తించే పనిలో తాదాత్మ్యత, ఏకాగ్రత ఉంటాయి. లేకుంటే పని సరిగ్గా జరగదు. పనిలో కర్తృత్వభావం రానీయకూడదు. ఆలోచనలు రానీయకూడదు. అలా చేస్తే పని ధ్వంసం అవుతుంది. చేతిలో గాజుసామాను ల్లాంటివి వుంటే కింద పడి ముక్కలవుతాయి. వండుతున్న పదార్థం మాడిపోతుంది. బంతాటలో బంతి తప్పుతుంది. అందుకే పని అంటే క్రమశిక్షణ అన్నది. నేర్పుగా పని చేయాలంటే మరి యిదే పద్ధతి.

ఒక రచయిత పుస్తకం వ్రాస్తున్నాడనుకుందాం. తననో గొప్ప రచయితగా అనుకుంటూ వ్రాస్తే అదొక చెత్తరచనగా తయారవుతుంది. ఆ రచనలో రచయిత వ్యక్తిత్వవాసనే తప్ప దానికి విలువ వుండదు. అలాగే చిత్రలేఖనం చేసే చిత్రకారుడు అహంభావి అయితే, ఆ చిత్రాలు నిర్జీవంగా, అందవిహీనంగా, నిస్సారంగా ఉంటాయి. అలాకాక తాను సృష్టించవలసినదానితో మమేకమై, రంగులు, కుంచె, చిత్రలేఖనము, కేన్వాసు – అంతా తానే అయి తనను తాను మరచి చిత్రం గీసినపుడు, అది ఒక అద్భుత కళాఖండం కాగలదు. అందుకే ప్రతి పనికి, ప్రతి వొక్క పనికి కార్యదీక్ష కావాలి. ఏకాగ్రతతో అందులో లీనమయిపోవాలి. ఆ విధంగా చేసిన పని యే తపస్సుకీ తీసిపోదు. శ్రద్ధలేనిది యేదైనా, చివరికి తపస్సు అయినా సరే! ఉపయోగం లేనిదే. నిన్ను నువ్వు చూసుకుంటూ నీలో నువ్వే "నేనేమైనా అభివృద్ధి సాధించానా? ఇంకా బాగా చెయ్యాలా? నా సాధన ఫలిస్తుందా?" అనుకుంటూ చెయ్యడం నీ అహాన్ని అపరిమితంగా పెంచుకోవటమే తప్ప వేరే పురోగతి ఉండదు.

ఆత్మన్యూనతాభావం, పరిమితత్వం, అల్పత్వము, బలహీనత – ఈ భావాలు ఎలా వస్తాయంటే నీ యొక్క 'స్వ' సూక్ష్మాతి సూక్ష్మమైన అహంకారప్రవృత్తిలో చిక్కుకునిపోయి ఉండటం వల్ల. నిన్ను నీవు విస్తృతపర్చుకోవాలి. అన్ని వైపులా తెరుచుకొని వుండాలి. నీ మీద శ్రద్ధకంటే చేస్తున్న పని మీద పూర్తి దృష్టి వుంచాలి. అది అన్నింటికంటే శ్రేష్టమైన మార్గం.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

దృఢసంకల్పం

ప్రశ్న: మాతా! సంకల్పాన్ని బలోపేతం చేసుకొనడం ఎలా?

శ్రీమాత: కండరాలను బలోపేతం చేసుకొనే విధంగానే అభ్యాసంతో కూడిన క్రమపద్ధతి ద్వారా సంకల్పాన్ని కూడ బలోపేతం చేసుకోవచ్చు. నీవు చేయదలచిన ఒక చిన్న విషయాన్నే తీసుకో. అల్పమైనదే – అలవాటుగా చేస్తూన్నది. అప్రధానమైది అయినా నిర్బంధంగా ఆ పని చెయ్యి. నిన్ను నీవు నిర్బంధించుకుని మోయనవసరంలేని బరువు క్రమం తప్పకుండా మోస్తూన్నట్లుగా నిర్వర్తించు. ఇలా అల్పవిషయాలతో ప్రారంభించి అనల్ప విషయాలు క్రమం తప్పకుండా నిర్వహించు. ఇలా చేస్తూంటే నీ అంతట నీవే ఇలా బలమైన స్వతంత్ర సంకల్ప శక్తిని సంతరింపచేసుంటావు.

ప్రశ్న: మాతా! దోషాలు అని తెలిసికూడా, అవి చేయటానికి ప్రచోదింపబడతాడు. మరి అప్పుడు?

శ్రీమాత: దేనిచేత ప్రోత్సాహింపబడుతుంటాడు? ఇలా సంభవిస్తూంటుంది. నిమ్నప్రకృతి నిశ్చైతన్య జంతుప్రవృత్తి నిన్ను నిర్దేశించి చేయకూడని పనులు చేయిస్తాయి. ఇక్కడ నీవు ఎంపిక చేసుకోవల్సినది రెండింటిలో ఒక్కటి. అది నీ బలమైన ఇచ్ఛాశక్తియా లేక బలహీనతకి తలొగ్గుటమా – ఈ సవాలు నీకెప్పుడూ ఎదురౌతూనే ఉంటుంది. నీది దివ్యసంకల్పమై, సత్యసంధత కల్గివున్నప్పుడు పొరపాటు పనిని తిరస్కరించగలిగే శక్తి నీకు వుంటుంది. "నా వశం కాదు" – అనుకోవటం బలహీనత, సాకు. అది నిజం కాదు. అంటే నీవు సక్రమార్గంలో విషయాలు కోరటం లేదన్నమాట. వద్దు, కావాలి – అని నిశ్చయించుకునే సావకాశం నీ కెప్పుడూ ఉండనే ఉంటుంది. బలహీనత వైపు మొగ్గు చూపినపుడు అందుకు ఏదో సాకు వెతుకుతావు. "నా తప్పు కాదు యిది, నాకంటే బలీయైనది అది" – అంటావు. విషయాలు నీకు మించి బలీయంగా ఉన్నాయంటే అది నీ పొర

పాటే. నీ ప్రచోదనలు కావు అవి. నీవు సచ్చైతన్యమైన అంతరాత్మవు. నీకు వివేకవంతమైన ఇచ్ఛ ఉన్నది. నీ కర్తవ్యమెప్పుడూ ఒక్కటే. నిమ్నకామనలయొక్క ప్రచోదనలకు అతీతంగా ఉండాలి.

ప్రశ్న: మధుమయీ మాతా! మేము మా నిర్ణయాన్ని స్థిరం చేసుకొనుట ఎట్లు?

శ్రీమాత: స్థిరం చేసుకొనాలని కోరుకొనుట ద్వారా (నవ్వు) ఇది పరిహాసంగా కనిపించవచ్చు. కాని ఇది నిజం. నీవు నిజంగా కోరుకునివుండవు. అది నీ నిజాయితీ లోపం. నీవు నిష్కాపట్యంగా పరిశీలించి చూస్తే, అది యిలా వుండాలని నీవు నిశ్చయించుకొని వున్నట్లు గ్రహించగలవు. కాని నీ సంకల్పం క్రింద అనిశ్చితంగా వున్నదే ముందుకు వచ్చుటకు సందేహంతో వేచివుంటుంది. నీవు నీలో దాగియున్న దీనిని గుర్తించి నిష్కాపట్యంగా అభిలషిస్తే, అది బాహ్యానికి వచ్చి, నీవు చేయరాదని నిర్ణయించుకొన్నదానిని నీవు చేయునట్లు చేస్తుంది.

కాని నీవు నిజంగా దృఢంగా అభిలషిస్తే నీవు కోరుకున్నదానిని చేయకుండా యీ ప్రపంచంలో యేదీ అడ్డగించజాలదు. నీ సంకల్పం రెండుగా చీలి వుంటుంది. నీ సంకల్పంలో అలా చీలిక లేకున్నట్లయితే, ఈ ప్రపంచంలో యేదికాని, యెవ్వరుకాని నీ సంకల్పాన్ని మార్చుకొనునట్లు చేయజాలరు.

కాకపోతే ఎలా సంకల్పించాలో తెలీదు. బలమైన కోరిక ఉండదు. నిష్ప్రయోజనకరమైన నీచ ఇచ్ఛాశక్తులు – "అది యిలా వుంటుంది. ఇంకా యిలా బాగుంటుంది. ఇంకా అలా వుంటే మరింత బాగుంటుంది. ఇంకా ఇంకా అలా అలా వుంటే అది కోరదగినదిగా వుంటుంది" ఇలా పరిపరివిధాలుగా అనుకోవటం ఇచ్ఛాశక్తి కాదు. మనసులో ఒక మూల ఎన్నో ఊగిసలాటలు – విరుద్ధంగా పనిచేస్తుంటాయి. ఏమాత్రం ఊగిసలాటైనా చాలు జరుగవల్సినది సక్రమంగా జరుగకపోవటానికి. అవగాహనతో కూడిన సంకల్పబలం, ఏకాగ్రత వుంటే, నీవు చేయాలనుకున్నది చేయకుండా ఏదీ అడ్డుకోలేదు.

వ్యక్తి కోరుతాడు. నిజమే. అలా దృఢనిశ్చయంతో సంకల్పిస్తే మంచిదే. కాని మనిషి బలహీనుడు. ఔనా? అతడు ఎల్లప్పుడు మరొకదానిపై నింద వేస్తూంటాడు. దీనికి కారణం బైట నుండి వచ్చే పరిస్థితుల ప్రభావం అనుకుంటాడు.

అంతే. ఆ క్షణం – నీకు తెలియకుండానే సాగిపోతుంది. అయ్యో! నాకు తెలియలేదే! అని వాపోతావు. నీకు ఇచ్ఛ లేదు కాబట్టి, నీకు తెలియలేదు. సంకల్పశక్తి లోపం. ఎలా సంకల్పించాలో తెలియకపోవటం.

ఎలా సంకల్పించాలో నేర్చుకొనుట చాలా ముఖ్యం, స్పష్టంగా సంకల్పించడానికి నీ అస్తిత్వాన్ని ఐక్యపరచుకోవాలి. వాస్తవానికి ఒక వ్యక్తి సమగ్ర వ్యక్తిత్వం కలిగి వుండాలంటే, అతని బాహ్యాంతరశక్తులు ఏకీకృతమై పరస్పరం సామరస్యం కలిగి వుండాలి. ఒకడు వ్యతిరేకభావాలతో లాగబడినపుడు, తన జీవితంలో మూడువంతులు తనను గురించిన ఎరుక లేకనే గడిపి వుంటే అతడు నిజమైన వ్యక్తి అనబడునా? అలాంటి వ్యక్తి పలు ప్రభావాలతో, చలనాలతో, శక్తులతో, కర్మలతో, ప్రతిస్పందనలతో కూడిన ఒక రాశిగా పిలువబడునేకాని, ఒక వ్యక్తిగా పిలువబడడు. ఒకడు దృఢసంకల్పం కలిగి వుండుటకు ప్రారంభించగానే, అతడు వ్యక్తిగా తయారగుట ఆరంభమగును. కాని అతని బాహ్యాంతర శక్తులు అనగా శారీరక, ప్రాణిక, మానసికశక్తులు చైత్యపురుషుని చుట్టూ ఏకీకృతమై, పరస్పర సామరస్యం కలిగి వుండకపోతే అతడు దృఢసంకల్పాన్ని కలిగివుండజాలడు.

నిజమైన సంకల్పం కలిగివుంటే నీవు దైవంతో 'నీ ఇష్టమే, నా ఇష్టము' అని అనగలుగుతావు. అంతవరకూ అలా అనలేవు. ఎందుకంటే దైవం కోరినదే నీవు కోరుటకు నీవు దృఢసంకల్పం కలిగి వుండాలి. లేకపోతే ఏదీ సంకల్పించలేవు. నీ సంకల్పం యాదార్థమైనదే అయితే, దైవం యేమి చేయ యిష్టపడతాడో దానినే నీవు మిక్కిలి యిష్టపడతావు. అంతట ఆయన సేవకై వుంచడానికి నీ కంటూ ఒక సంకల్పం వుండబోదు.

ఈనాటికి యిది చాలు. నేను చెప్పినదాన్ని అంతా కాదు – కొద్దిగా – కొంచెంగా – ఆచరణలో పెట్టండి. సరేనా! –

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నిరసింహాయ్యా

గతిసీలమైన ధ్యానము

ధ్యానం చేయటం చాలా కష్టము. అందులో అనేక రకాలైన పద్ధతులున్నాయి. ఒక భావంపై దృష్టి నిలిపి ఫలితం కనిపించేదాకా కొనసాగించడమనేది క్రియాశీలమైన ధ్యానము. సాధారణంగా ఒక సమశ్య పరిష్కారంకోసమనిగానీ, ఏదైనా రాయాలనుకున్నప్పుడుగానీ అసంకల్పితంగా ఇటువంటి ధ్యానం అందరూ చేస్తారు. కొందరు యథావిధిగా కూర్చొని ఒక భావం మీద కాకుండా వారి ఏకాగ్రతను పెంపొందిచుకోటానికి మాత్రమే ఒక బిందు స్థానం మీద దృష్టి కేంద్రీకరిస్తారు. ఈ విధంగా చేయడంలో నీవు కృతకృత్యుడవయావంటే, ఆ క్షణంలో అది మానసిక, ప్రాణిక, దైహిక స్థానాల్లో దేనిమీదైనప్పటికీ వాటిని దాటి వేరే చైతన్యస్థాయిలో ప్రవేశిస్తావు.

మరికొందరు వారిలో కలిగే అన్ని చలనాలనూ, భావాలనూ, ఆందోళనలనూ, ప్రతిస్పందనలనూ వైదొలగించుకొని నిశ్శబ్ద, నీరవ, ప్రశాంతతను చేరుకోవాలని ప్రయత్నం చేస్తారు. కాని ఇది చాలా కష్టసాధ్యము; పాతిక సంవత్సరాలు సాధన చేసి కూడా విఫలమనోరధులైన వారున్నారు. ఇది పోట్లగొడ్డు కొమ్ములు పట్టి వంచి స్వాధీనం చేసినంత కష్టము.

ఆలోచనలను అరికట్టే ప్రయత్నం చేయకుండా, సాధ్యమైనంత ప్రశాంతచిత్తంలో ధ్యానం చేసే పద్ధతి ఒకటుంది. సాధారణంగా వచ్చే ఆలోచనలన్నీ కేవలం యాంత్రికమైనవే కాబట్టి, వాటిని ఆపుదల చేయాలంటే ఏళ్లు పడుతుంది. పైగా అది ఫలిస్తుందనే నమ్మకం కూడా వుండదు. అలా కాకుండా నీ చైతన్యా

న్నంతా కూడదీసుకొని, ప్రశాంతచైతన్యంతో వుండి, బాహ్యావిష యాలపై ఆసక్తి లేనట్లు వాటినన్నిటినీ వదిలేసి వున్నప్పుడు, నీ ఆకాంక్షాజ్వాల వున్నట్లుండి తేజోవంతమవుతుంది, అప్పుడు నీ దగ్గరకొచ్చిన వాటన్నిటినీ అందులోకి విసిరేసి దాన్ని మరింత ప్రజ్వలింపచేస్తావు. అది అలా పైకెగిసిపడుతున్నప్పుడు, నీవు దానితో తాదాత్మ్యం పొంది దాంతోపాటుగా మీదికి వెళ్లి నీ ఆకాంక్షా, చైతన్యాల చరమస్థాయికి చేరుకుంటావు. అప్పుడిక దాని ఫలితాన్ని గురించిగానీ, మరిదేని గురించిగానీ ఆలోచిం చవు. ఏదో జరగాలనే తాపత్రయం కూడా వుండదు. కేవలం ఆకాంక్ష మాత్రమే అలా పైపైకి ఎగిరిపోతూ, ఆనందాన్ని కలుగ చేస్తూ తీవ్రతరమై, నిరంతరంగా కొనసాగే ఏకాగ్రతగా పరిణమి స్తుంది. ఇక అక్కడ నుంచీ జరిగేదంతా నీవు సర్వోత్తమంగానే జరుగుతుందని నేను హామీ యివ్వగలను. ఇలా చేసినప్పుడు నీకు సిద్ధించగల అత్యుత్తమ ఘటన ఇదే. ఒక్కొక్క వ్యక్తి నను సరించి సంభావ్యతలు వేర్వేరుగా వుండవచ్చు. ఏమైనప్పటికీ నిశ్శ బ్దంగా వుండాలని చేసే ప్రయత్నాలూ, ఆభాసగా తోచిన రూపా లకు అర్థాలు చూసుకోవడమూ, నీ కొచ్చే అనుమానాల నివృ త్తికని శక్తులను ఆహ్వానించి, సమాధానం కోసం ఎదురుచూడ డమూ మొదలైనవన్నీ కూడా కృత్రిమ భాష్పవాయువు మాదిరిగా మాయమైపోతాయి. ఈ విధంగా మీది కెగిసే ఆకాంక్ష అనే జ్వాలాశిఖలో చేతనాత్మకంగా జీవించగలిగితే వెంటనే ఫలితం కనిపించకపోయినా కొంతకాలానికి ఏదో కొంత ప్రతిఫలం దక్కుతుంది.

*

నీలో పరివర్తన తీసుకొనిరాగల శక్తి ఈ క్రియాసీలధ్యాన విధానం (dynamic meditation) లోనే వున్నది. అది నిన్ను పురోగమిం పచేయగలదు. ఇది సుస్థిర ధ్యానమార్గానికి పూర్తి వ్యతిరేకంగా పనిచేస్తుంది. సుస్థిరంగా మనస్సు నిలుపుకొని చేసే ధ్యానం (static meditation) వల్ల నీ వునికిలోగానీ, నీ చైతన్యంలోగానీ పెద్ద మార్పుండదు.

క్రియాశీల ధ్యానం పరివర్తన కలుగచేసేది. సాధారణంగా అందరూ ధ్యానమనుకొని ఒక స్థిరత్వంలోకి వెళ్లి ఏమీ తొణక కుండా యధాస్థితికి వచ్చేస్తారు. ధ్యానంవల్ల వారిలో, వారి చైత న్యంలో ఏ విధమైన మార్పు వుండదు. వారు చలనరహితంగా వుండిపోయి, అందులో ఆనందం పొందుతారు. ఈ విధంగా ఎంత కాలమైనా ధ్యానంలో వుండగలుగుతారుగానీ, దానివల్ల ఎక్కడా ఏ విధమైన మార్పూ వారిలోగానీ, ఈ ప్రపంచంలోగాని కనిపిం చదు. అందువల్లనే శ్రీఅరవిందులు దీనికి వ్యతిరేకమైన క్రియాసీల ధ్యానాన్ని ప్రవేశపెట్టారు. ఇదే పరివర్తనాత్మకమైన ధ్యానము.

ప్రశ్న: అది చేయడం ఎలా?

ఇందులో ధ్యానమంటే మన వైఖరే వేరుగా వుంటుంది. ఆకాంక్ష కూడా వేరుగానే వుండాలి. అది ఒక్కొక్కరికీ ఒక్కో విధంగా వుండవచ్చు.... అన్నింటికన్నా ముందుగా ధ్యానం ఎందుకు చేస్తున్నారోనని ఆలోచించాలి. ధ్యానానికి విశిష్టత నిచ్చేది అదే.... అప్పుడది ఏదో ఒక పద్ధతిగా నిలుస్తుంది.

దివ్యశక్తిని నీలోకి తెచ్చుకొనే ఉన్మీలత కోసం గానీ, సాధారణ చైతన్యాన్ని నిరసించడానికిగానీ, నీ హృదయాంతరా ళాల్లోకి ప్రవేశించడం కోసమనిగానీ, నిన్ను నీవు సమగ్రంగా ఎలా సమర్పించుకోవాలో నేర్చుకోవడానికిగానీ, ఇంకా ఇలా దేనికోసమైనా ధ్యానం చేయవచ్చు. నిశ్చల, నీరవ ప్రశాంతతలో ప్రవేశించటానికని కూడా ధ్యానం కొనసాగించవచ్చు. సాధార ణంగా జనం ఇందుకోసమే చేస్తారుగాని కృతార్థత మాత్రం పొంద లేరు. ఇంతేకాక పరివర్తనాత్మకశక్తిని పరిగ్రహించాలనీ, నీలో పరివర్తన తీసుకురావలసిన స్థానాలు గుర్తించడానికీ, ఇంకా ఏ క్రమంలో ప్రగతి సాధించవచ్చో తెలుసుకోడానికీ కూడా ధ్యానం సహాయకారి అవుతుంది. నీ వ్యక్తిగత వ్యవహారాల విషయంలో కూడా ధ్యానించవచ్చు. ఏదైనా సమస్యా పరిష్కారం కోసమనీ, ఒక సమాధానం కోరిగానీ, ఏదైనా పనిలో సహాయం కావాలని గానీ ధ్యానం చేయవచ్చు.

ఎవరి ధ్యానపద్ధతి వారికుంటుంది. అయితే ధ్యానం క్రియా సీలంగా సాగాలంటే మాత్రం నీలో ఆకాంక్ష తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే అది క్రియాసీల ధ్యానమవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామశాస్త్రి

నిన్ను నీవు తెలుసుకో

ముందు అసలు చైతన్యం అంటే ఏమిటో తెలుసుకోవాలి. దానిని యెరుకపర్చుకోవాలి. దానిని వికేంద్రీకరించాలి. అందుకు ఎంతో కృషి చేయాలి. అందులో భాగంగా, అందరికీ తెలిసినదే – స్వీయ పరిశీలన. నీ సత్వములో చైతన్యమును వర్గీకరించుకోవాలి. శరీ రమే చైతన్యమా? నేను – అని పిలుచుకొనేది ఈ శరీరమేనా? కాదు కదా! శరీరము వ్యక్తీకరించేది వేరు కదా! ఇది తెలుసుకు న్నాక – నీలోని ప్రేరణలు, ఉద్వేగాలు – వీటిని పరిశీలించాలి. ఒకవేళ చైతన్యమంటే అదేనా? పరిశీలించాలి. మళ్లీ చైతన్యమంటే అది కాదని తెలుసుకుంటావు. అపుడు మరి నీ ఆలోచనలు – చైతన్యమా? 'నేను' అనుకొనేది నా ఆలోచనలనా? కాదు – నా ఆలోచనలు 'నేను' కాదు అని తెలుసుకుంటావు. ఈ విధంగా పరిహరించటం ద్వారా క్రమక్రమంగా, నీకే తెలియని నీలో ఉన్న ఒకదానితో with something నీకు సంసర్గం కలుగుతుంది. "ఆ! అవును అదే నేను" – అనే అభిప్రాయం కలుగుతుంది. ఈ అనా మకమైనదానిని – నా శారీరక, మానసిక, ప్రాణికముల నుంచి వేరుచేసే ప్రక్రియ ద్వారా, నేను ఇతరులతో ఇతర విషయాలలో తాదాత్మ్యత చెందుతాను. అందుకు నాలో ఆకాంక్ష ఉండాలి. అప్పుడే నా భౌతికస్వరూపం నుంచి పైకి దానిని ఆవిష్కరించగ లుగుతాను. ఈ అల్పమైన శరీరానికి అతీతంగా ఉన్నత చైతన్య భూమికలకు యెదగగలుగుతాను". అ విధంగా స్వచైతన్యాన్ని యెరుకపర్చుకోవటం ప్రారంభించగల్గటం సాధ్యం. "నా చైత

న్యాన్ని చైత్యపురుషునితో సమైక్యపరుస్తాను. అక్కడే దానిని ఉంచుతాను. దైవసమర్పణలో దైవంతో సామరస్యం సిద్ధిస్తుంది." లేదా – "ఈ నా పరిశ్రమలో, మనోబుధ్యహంకారాలకు అతీతంగా యెదిగి స్వచ్ఛసత్యజ్ఞానానంత భూమికలకు చేరగలుగుతాను." అప్పుడు చైతన్యాన్ని అక్కడే భౌతికస్థాయికి అతీతంగా ఉండే వెలుగులో ఉంచగలుగుతాము.

ఇందుకు మొదట చైతన్యాన్ని చలనస్థితిలో ఉంచాలి. (this consciousness must be mobile) సత్వముయొక్క ఇతర భాగాలకి పైన ఉన్నతస్థాయిలో చైతన్యాన్ని వుంచుకోవాలి. అవి the other parts of being – సత్వము యొక్క ఉపకరణాలు మాత్రమేనని తెలుసుకోవాలి. వాటి నలానే గుర్తించాలి. ఈ ఉపకరణాలలో నీ చైతన్యాన్ని ప్రసరింపజేసి, నీ కార్యకలాపాలన్నీ, వాటి ద్వారా నిర్వహించుకోవాలే తప్ప – అదే చైతన్యమని పొరబడకూడదు. చైతన్యాన్ని వాటిలో చిక్కుపడేటట్లు చేసి కలగాపులగం చేయకూడదు. నీ ఇచ్ఛాశక్తి సచైతన్యంగా ఉండాలి. శారీరక ఇతర భాగాలు (భౌతిక, ప్రాణిక, మానసిక) చైతన్యంగా పొరబడకుండా జాగ్రత్తపడాలి.

నీ గురించి నీవు ఆలోచించినపుడు – నా శరీరమే 'నేను',, పొరుగువాడు – తన భౌతికరూపమే 'తాను' అని భావిస్తున్నంత కాలమూ, నీ స్వస్వరూపాన్ని తెలుసుకోలేవు. ఫలితంగా ఆత్మ సంయమనం కొరవడుతుంది.

నీలో శరీరం చివరి ఉపకరణం. కాని దురదృష్టవశాత్తు, అదే 'నేను' గా భావిస్తాను. అందుకే అంతఃకరణతో ఆలోచించాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకట్రామశాస్త్రి

సత్వములోని కదలికలను గమనించాలి, క్రమబద్ధీకరించాలి

నీ సత్వములోని కదలికలకు మూలం నీవు తప్పనిసరిగా తెలుసుకోవాలి. పరస్పర విరుద్ధమైన నీచ ఇచ్ఛాశక్తులు (contradictory valleities) కదలాడుతూ ఉంటాయి. అవి ఒత్తిడి కలిగిస్తాయి. జీవితంలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. నీకు కలత కల్గించే పని ఏమైన నీవు చేసినప్పుడు నిన్నే సమర్థిస్తూ, నీ బుద్ధి నీకు అనుకూలమైన హేతువు సమకూరుస్తుంది. పై పై మెరుగులు అద్దటంలో బుద్ధి బహు చాకచక్యమైనది. ఇలాటప్పుడే నిన్ను నీవు అవగతం చేసుకోవటం కష్టం అవుతుంది. మనోసత్వం యొక్క అల్లరిచిల్లరి అసంబద్ధపు చేష్టలు తెలుసుకోవాలంటే నీకు తప్పనిసరిగా చిత్త శుద్ధి ఉండాలి.

మానసికంగా నీవు వివిధక్రియ, ప్రతిక్రియాకలాపాలలో సతమతమవుతూ, గానుగెద్దు మాదిరి తిరుగుతూ వుంటే నీలో ప్రగతి ఉండదు. పురోగమన దిశగా నిన్ను నడిపించటానికి నీ అంతరంగంలో కనుగొన్న వెలుగులో నీకు నీవే విషయాలను సింహావలోకనం చేసుకుంటూ పర్యవేక్షించుకొనగలిగే విచారణాధికారివి కాగలగాలి. నీలో లోపలి వెలుగే నీలోని సర్వోత్కృష్ట భాగం. ఆదరణీయమైనది. నీ పురోగతిని అభిలషించేది. నీకు మార్గ దర్శియైన వెలుగు అది. ఆ వెలుగును నీవు ముందుంచుకోవాలి. నీ కార్యకారణములు, భావనలు, ఆలోచనలు, ప్రేరణలు – అన్నీ ఆ వెలుగు ముందుంచి చలనచిత్రంలో మాదిరిగా సాగిపోనీయాలి. తర్వాత వాటిని సమన్వయపరచి వాటి కదలికలను పరిశీలనగా సమీక్షించాలి. నీ లోపలి తెరమీద. కొన్ని అంశాలు ఏ నీడా లేకుండా స్వచ్ఛంగా, చక్కగా సాగుతాయి. కొన్ని అందుకు భిన్నంగా వీటి తాలూకు నీడలు వదిలిపెట్టిపోతవి. మరికొన్ని వాటి చిక్కటి చీకటినీడలు, ఆమోదయోగ్యం కానివి వదిలిపెట్టి పోతవి. ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో, ఒక ఆటగా పరిశీలించాలి, సమీక్షించాలి, ఆలోచించాలి. నీ ఆదర్శజ్ఞానమునకు, స్వాధి

పత్యానికి అనుగుణంగా వ్యవహారసరళి నడుస్తున్నదా? లేదా? పరిశీలించాలి. పనులు స్వచ్ఛంగా సాగుతుంటే నీడ లుండవు. ఆత్మజ్ఞానానికి, ఆత్మాధిపత్యానికి భిన్నంగా వుంటే నీ క్రియల తాలూకు క్రీనీడలు ప్రసరిస్తాయి. నిశ్చైతన్యంగా చేసే క్రియలు, వ్యర్థమైన, స్వార్థపూరిత దురహంకారయుత సంచలనాలు – వాటి నీలినీడలు వదిలి ముందుకు సాగుతాయి. నీ ఆదర్శజ్ఞాన కాంతిలో వాటిని పరీక్షించుకోగలవు. నీ అంతరంగ ప్రకాశంలో ఈ ఆట సాగుతూంటే నీలో గొప్ప మార్పు చోటు చేసుకుం టుంది. చిత్తశుద్ధితో ఆడవల్సిన ఆట యిది. కొంతకాలానికి నీలో వచ్చిన రూపాంతరీకరణం నీకే ఆశ్చర్యం కలుగచేస్తుంది. "ఏమిటి, యిది! ఇదివరకు యిలా వున్నానా! అసంభవం!". అనుకునేలా మారిపోతావు.

నీ అంతరంగ ప్రకాశంలో ప్రతి అంశాన్ని దర్శించటం ద్వారా నీవు రూపాంతరీకరణం చెందుతావు. ఇక్కడ వయసుతో నిమిత్తమే లేదు. ఈ ఆదర్శ సూత్రాలకి అనుగుణంగా లేని, బహి ష్కరించవలసిన మూలకాలు నీకు అవగతమౌతవి. అవి వాటి స్థానంలో లేనివని గ్రహిస్తావు. నీ భావాలు, ఆలోచనలు, ప్రతి స్పందనలు – అన్నీ – చైత్యపురుష కేంద్రానికి – నిజానికిదే నీ లోని అంతరంగ వెలుగు – క్రమబద్ధీకరిస్తే, నీలోని అక్రమ పద్ధతులకు లోబడిన అంశాలు ప్రకాశమానంగా క్రమబద్ధీకరింప బడటం గమనిస్తావు.

ఇదే పద్ధతిలో వ్యక్తివిషయంలోను, దేశవిషయంలోను, ప్రపం చంలోనే విషయాలు పరికిస్తే కష్టాలు వైదొలగుతాయి. విషయాలను క్రమబద్ధీకరిచండంలోనే ఉన్నది అంతా. ఎక్కడ వుండవలసినది అక్కడ వుండాలి. ఒక ప్రాచీన విజ్ఞాని చెప్పినట్లు:

పాపము అనేదే లేదు; లేనిది నిలకడ.

చెడు అంటూ ఏమీ లేదు; ఉండవలసిన స్థానంలో విష యాలు వుండవు. అంతే.

దేశాలలో, భౌతికప్రపంచంలో, అలానే వ్యక్తుల చర్యలలో, ఆలోచనలలో, భావాలలో, ప్రతిచోట, ప్రతీదీ వుండవలసిన

స్థానంలో, క్రమపద్ధతిలో కనుక వుంటే వైషమ్యాలు చాలవరకు మటుమాయమై పోతాయి.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

లోచీకటి ప్రవృత్తులు వెలికి తీయాలి

ప్రశ్న: అమ్మా! మీరు గతంలో చెప్పారు – మనలో వుండే దుష్టప్రవృత్తులు మనచేత తెలివితక్కువ పనులు చేయిస్తాయి. ఈ ప్రవృత్తి నీ యెరుకలో వున్నప్పుడు దానిని నీవు వైదొలగించాలి అని – దానినెలా తీసిపారవెయ్యాలమ్మా?

అందుకు, ముందు నీకది స్పష్టమయేలా నీ యెరుకలో వుండాలి. దానితో నీకున్న చైతన్యబంధాన్ని తెగ్గొట్టాలి. ఇదంతా అంతర్గత మనోవైజ్ఞానికశాస్త్ర సంబంధిత కార్యకలాపం.

నిన్ను నీవు శ్రద్ధగా పరిశీలించుకున్నపుడే నీకిది అవగతమవుతుంది. ఉదాహరణకి – ఒక రోజు నీవెంతో ఉదారంగా వున్నట్లుగా నీలో నీవే గమనిస్తావు. నీ భావాలలో, స్పందనలలో, ఆలోచనలలో, భౌతిక అంశాలపట్ల ఔదార్యంగా వుంటావు. ఇతరుల లోపాలు, బలహీనతలు, దురభిప్రాయాలు, అసహ్యాకరమైన చేష్టలు – వీటి పట్ల ఉదారభావంతో వుంటావు. అప్పుడు నీలో నీవే అనుకుంటావు – ప్రతివాడు తాను చేయగలిగినంతగా శక్తి వంచన లేకుండా చేస్తాడు కదా – అని.

మరొక సమయంలో – బహుశః మరుక్షణంలోనే కావచ్చు – నీలో నీవే గమనిస్తావు. దుస్సహామైన కాఠిన్యం, చెడు చేసిన వానిని శిక్షించాలనే పగ, ప్రతీకారం తీర్చుకోవాలనే భావం ముందు అనుకున్నదానికి సరిగ్గా వ్యతిరేకభావం. మరొకప్పుడు నీకెవ్వరైనా అపకారం చేస్తారు. అప్పుడు అనుకుంటావు "ఆ.. మరేం ఫర్వాలేదులే – ఏదో తెలియక చేశాడు పాపం. అది అతని స్వభావం"

మళ్లీ మరుక్షణంలోనే – కోపంగా "వాడిని శిక్షించాల్సినదే; తను చేసిన తప్పు తనకు తెలియాలి" అనుకుంటావు. ఈర్ష్య, అసూయ, సంకుచితత్వం – ఈ ప్రతికూలమైన భావాలు నీలో చోటు చేసుకుంటాయి.

ఇది నీలో వున్న దుష్టప్రవృత్తి. ఇది తెలుసుకుని నిరంహంకారివై, యిది నేను కాదు. ఇది నాలోని నీలినీడే. దీనిని నా నుంచి వైదొలగించుకోవాలి – అని అనుకున్నప్పుడు, నీలోని మరో భాగంలో ప్రకాశిస్తున్న వెలుగు నీ దుష్టప్రవృత్తులను మాయం చేస్తుంది. ఇలా మారిన సంఘటనలు వున్నాయి. అందుకు అవకాశం ఉంది. సకృత్తుగానే కావచ్చు. దుష్టస్వభావము మార్పు చెంది వెలుగు ప్రసరించి నీలోని సత్యచేతన బహిర్గతం కాబడే సందర్భాలు వుంటాయి.

తరచుగా కాకపోయినా యిది – జరిగే అవకాశం వుంది. నీవు ఒకటి అనుకోవాలి. అది నీకు చాలా ఉత్తమమైనది. అదేమంటే – No, this is not 'I'! ఇది నేను కాదు. ఇది నా స్వభావం కానేకాదు. ఇది నాకెంత మాత్రమూ వద్దు. దీనితో నా కెలాటి సంబంధము లేదు. నాకు సంబంధించినంతవరకు – it does not exist – అని అనుకోవాలి. ఆ విధంగా నీలోని దుష్టత్వాన్ని పారద్రోలి విముక్తుడవు కావాలి.

నీ అంతరంగంలో ఈ ఘర్షణను పసికట్టడంలో మాత్రం స్పష్టత, చిత్తశుద్ధి తప్పక వుండాలి. ఈ విషయాలకు సంబంధించి సాధారణంగా శ్రద్ధ వహించరు. పట్టించుకోరు. మనసులో ఆలోచనలు ముసురుకుంటాయి. మంచి ఆలోచనలు, దుర్మారపుటాలోచనలు కదలాడుతూ వుంటాయి. ఒకప్పుడు మంచిగా వుంటావు. మరొకపుడు దుర్మార్గంగా వుంటావు. ఒకప్పుడు రోజంతా మంచిగా వుంటావు. తర్వాత అకస్మాత్తుగా చెడుగా మారిపోతావు. లోపల కదలాడే దుర్మార్గ, సన్మార్గ ఆలోచనలను పరిశీలనగా గమనించవు. ఆలోచనలను గమనించాలి. పట్టుకోవాలి. వ్యక్తం అవుతూన్నప్పుడే గట్టి పట్టుపట్టాలి. (చైతన్యపు) కాంతిలో వాటిని పరిశీలించి అవగతం చేసుకోవాలి. ఒక దురాలోచనేదైనా

మొలకెత్తినపుడు, వెంటనే, – "వద్దు, నాకిది వద్దు, నా నుంచి నీవు వైదొలగిపో. దీనితో నాకెలాటి సంబంధము లేదు. పో... వెళ్లిపో. ఇక మళ్లీ తిరిగి రాకు..", అనుకోవాలి.

ఈ రకమైన అనుభూతి ప్రతి రోజు నీకు కలుగుతుంది. గొప్ప ఉత్సాహము, ఆకాంక్ష, దివ్యకార్యక్రమ లక్ష్యసాధన దిశగా ప్రేరణ – వీటివల్ల పొందిన గొప్ప శక్త్యానందాలతో బయటపడతావు. మళ్లీ అంతలోనే వింతగా కొంతసేపయాక పనికిమాలిన సామాన్య, అల్ప, స్వార్థపూరిత కామనలను సంతృప్తిపర్చుకునే ప్రయత్నం. ఆ రకంగా యింతకు ముందున్న సల్లక్షణాలు ఆవిరైపోతాయి. అసలు వాటి వునికి కూడా లేనట్లుగా. ఈ పరస్పర వైరుధ్యభావసంఘర్షణకి అలవాటుపడిపోతావు. వీటి పట్ల శ్రద్ధ లేకపోవటంతో, యివన్నీ – ఉన్నత, నీచ ఆలోచనలు, ఇరుగుపొరుగు వారుగా, హాయిగా సహజీవనంతో ఉంటాయి. ఇది ముందు నీవు కనిపెట్టాలి. చైతన్యంలో వీటి పరస్పర ఆవాసాన్ని నిరాకరించాలి. – నీలినీడలు కాంతి నుంచి విడగొట్టాలి. తర్వాత చీకటి దానంతటదే మాయమవుతుంది. వెలుగు మిగులుతుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

తాదాత్మ్యత

నీవు ఏ విషయంలో తాదాత్మ్యతాభావం పొందుతే అదే కొంతసేపు నీవు కాగలవు. అందుకు సంబంధిత సమగ్రజ్ఞానం నీకు కలుగుతుంది. దానిని గురించి భావనకాని కల్పనకాని చేయవలసిన అవసరం నీకు రాదు.

మరొకని చైతన్యంలో నీ చైతన్యం చొచ్చుకుని ప్రవేశించి అక్కడేమి జరుగుతూన్నదో తెలుసుకునే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు కదూ! అదేమంత ఆసక్తిదాయకంగా ఉండదులే. ఎందుకంటే ఆతనిలో నీవు నిన్నే దర్శించుకుంటావు కదా! ఎదుటి

వాని అంతరంగ చైతన్య అనుబంధంతో సామరస్యం, అంగీకారం కుదరకపోతే సదవగాహన ఏర్పడదు. ఫలితంగా అవివేకులైతే పోట్లాడుకుంటారు. అలా కాకుండా ఎదుటివాని ప్రవర్తనకి ప్రేరణ ఏమిటో తెలుసుకోవటం, అతనియొక్క అంతరంగ దృక్పథం, అతని దార్శినికత తెలుసుకోవటం ప్రయోజనకరం. ఇది నీకు చాలా ఆసక్తి కలిగిస్తుంది. నీకు కోపం రాదు. అర్థం చేసుకోగలుగుతావు. ఇది నీకు చాలా ప్రయోజనకరమైనది. ఎదుటివాని కోపతాపాలు నిన్నేమీ ప్రభావితం చేయవు. తర్వాత క్రమేపీ యిది నీలో తాదాత్మ్యతాభావాన్ని పెంపొందిస్తుంది. విభేదాలు, వికృతాలు, పోట్లాటలు ఉండవు. ఇది మరి చాలా ఉపయుక్తమైనది కదా!

*

తాదాత్మ్యతాభావం పొందటమెలాగో తెలుసుకుంటావు. నిరహంకారంగా ఉండటానికిది అత్యంత ఆవశ్యకం. 'అహం' కి బందీగా వున్నంతసేపూ నీకు పురోగతి వుండదు....

ఉదాహరణకు – నీవొకనితో కలిసి ఉన్నావనుకో. అతనేదో అంటాడు. దానికి విరుద్ధంగా నీవు మరొకటి అంటావు. వాదన పెరుగుతుంది. ఇది సాధారణంగా జరిగే పనే. ఇలాటపుడు సహజంగానే నిర్ణయాలు తీసుకోలేము. స్వభావాలు మంచివి కాకపోతే ఘర్షణ మిగులుతుంది. అలా కాకుండా నీ అభిప్రాయాలు నీలోనే వుంచుకుని, "కాస్సేపు ఆగుదాం. అతను అలా ఎందుకు అన్నాడో తెలుసుకునే ప్రయత్నం చేదాము" అనుకుని అతను చెప్పే విషయంపై దృష్టి నిలుపు. ఆతని మాట వినటం ద్వారా ఆతని భావాలలోనికి, మనసులోనికి ప్రవేశిస్తావు. వెంటనే ఆతని ఆలోచనావైఖరి నీకు తెలుస్తుంది. ఎందుకు అతను అలా మాట్లాడినాడో నీకు బోధపడుతుంది. ఒక్కసారి ఆకస్మికంగా నీ బుద్ధి వికసిస్తుంది. ఇంతకు ముందు ఉన్న, యిప్పుడు ఉన్న అవగాహనలతో వైరుధ్యం తెలుసుకుంటావు. సమన్వయం, సామరస్యం కుదురుతుంది. ఈ రకంగా ఎంతో పురోగతి సాధిస్తావు. ఆలోచనాపరిధిని విశాలపర్చుగో గలుగుతావు.

వాదన ప్రారంభమైతే వెంటనే ఊరుకో, యేమీ అనకుండా. ఎదుటివాని దృక్పథం గమనించే ప్రయత్నం చెయ్యి. అలాగని నీ అభిప్రాయాన్ని మార్చుకోనవసరం లేదు. ఉభయ దృక్పథాలు సమాంతరంగా దర్శిస్తావు. ఇదేమంత అల్పమైన పురోగతా! కాదే!

దేనికైనా పాటించవలసిన పద్ధతి ఇదే. ఏకీభావం కుదరక పోతే అపుడు అది దైవకృప అనుకో. నీ అభివృద్ధికి అదొక అద్భుత అవకాశంగా స్వీకరించు. అది చాల సూక్ష్మమైనది. ఇటు వైపున వుండటానికి బదులు అటువైపునే ఉండు. ఏకపక్షంగా నిన్ను నీవే అవలోకించుకునే బదులు ఎదుటివానిపైన దృష్టి మరల్చు. ఇక్కడ కావల్సినది కాస్తంత ఊహ, మరింత అవగాహన. ప్రయత్నిస్తే ఇదేమంత అసాధ్యమైన విషయం కాదు. క్రమేపీ సులభతరము అవుతుంది.

ఇందుకు పెద్దగా బుర్ర పాడుచేసుకుని, ఎడతెగని ఆలోచనలతో – "ఇది యిలాగుందేమిటి? అలాగుందేమిటి? ఎందుకలా చేశాడతను? ఎందుకు యిలా అన్నాడు?" ఈ రకమైన ధోరణిలో నిర్ణయానికి ఎప్పుడూ రాలేవు. ఏవేవో ఊహించుకుంటూ అవగాహనకు దూరమవుతావు. పనికిమాలిన సంజాయిషీలతో నిన్ను నీవు సమర్థించుకుంటూ – వాడు మూర్ఖుడు, దుర్మార్గుడు – అనుకుంటావు. మరి అది నిష్ప్రయోజనమే. అలా కాకుండా, కాస్తంత మానసికప్రేరణతో, ఆతని అంతరంగంలోనికి ప్రవేశించి, ఆతని చిన్నబుర్రలోకి తొంగిచూచే ప్రయత్నం చెయ్యి. నీకు అతనొక కొరకరాని కొయ్య అనుకోకు. అంతే! ఆకస్మికంగా నీవాతని వైపు మరలుతావు. చెప్పేది వింటావు. బోధపర్చుకుంటావు. అపుడు నీకు అంతా సుస్పష్టమవుతుంది. అతను చెప్పేదానికి కారణం, ఎందుకు, ఏమిటి, ఆతని భావన – ఇవన్నీ నీకు తెలుస్తాయి. ఇదంతా ఒక ప్రయోజనకరమైన, ఎన్నిసార్లు అయినా చేయదగిన ప్రయోగం.

మొదట్లో నీకిది అంత విజయవంతం కాకపోవచ్చు. కాని పట్టువిడువక చేస్తూ వుంటే అద్భుతమైన విజయాలనే సాధిస్తావు. జీవితమంటే అమితమైన ఆసక్తి కలుగుతుంది. పురోగమిస్తావు.

అహం చట్రంలో బిగుసుకుని వున్న నీకు విముక్తి కలుగుతుంది. వెలుగు కోసం చీకటిలో యింతవరకు వెతుకులాడుతూ వున్న నీవు అంతరంగకాంతిలోనికి చొచ్చుకుపోగలుగుతావు. విశాలమై, హాయిగా ఊపిరి పీల్చుకోగలుగుతావు. ప్రతిఘటనలు ఉండవు. అవగాహన, అంతరంగంలోనికి చొచ్చుకుని పోగల్గటం, ఒకే సమయంలో పలుచోట్ల సచైతన్యంగా ఉండగల్గటం, సాధ్యపడుతుంది. యిదంతా చాలా ఆసక్తికరమైనది.

ఉదాహరణకు – నీవు ఎంతో ఆసక్తిదాయకము, అద్భుతము అయిన ఒక పుస్తకము చదువుతున్నావు, అనుకో. కథలో లీనమై, తిండి, నిద్ర మర్చిపోతావు. అందు తాదాత్మ్యత చెంది, పరిపూర్ణ ఏకాగ్రతలో చదువుతూ కథలో రాబోయే సన్నివేశాలను కూడా దర్శిస్తావు. రచయిత చైతన్యంలో లీనమైపోతావు. కథలో రచయిత నిన్ను యెక్కడికి తీసుకునిపోతున్నాడో, ముగింపు యేమిటో ముందే ఊహిస్తావు. ఇదంతా మరి తాదాత్మ్యతా ఫలితమే కదా...

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ముఖ్యమైన ఒక పాఠం

ఎవరికివారం చేస్తున్న తప్పులే అయినా పక్కవారు చేస్తే హేళన చేసే గుణాన్ని శ్రీఅరవిందులు మనకి ఎత్తిచూపాలనుకున్నారు. ఈ గుణం మనలో ప్రత్యేకంగా ఒక సందర్భానికే కాదు, ప్రతి సందర్భంలోనూ కనిపిస్తుంది. మనలో ఏదన్నా లోపమో, హాస్యాస్పదమైనదో ఏదన్నా ప్రవర్తన ఉంటే, అది మన స్వభావంలోనే ఉంది కాబట్టి, అది మనకి చాలా సహజంగా అనిపించడమూ, ఏవిధంగానూ ఆశ్చర్యకరంగా వుండకపోవడమే ఆశ్చర్యం! కానీ ఇవే లోపాలో, అవలక్షణాలో ఇంకెవరిలోనన్నా కనిపిస్తే, 'ఏమిటీ! అతనలాటివాడా!' అని సంభ్రమాశ్చర్యాలు చూపే ముందు మనం

కూడా 'అలాంటివారమే' అనే స్పృహే ఉండదు. మనలో ఉన్న మూర్ఖత్వం ఆ బలహీనతకి తోడు అవుతుంది. ఇక్కడ ఒక పాఠం నేర్చుకోవచ్చు. మరో వ్యక్తిలో అనుచితమైనదో, విచిత్రమైనదో సరళి కనిపిస్తే అతని ప్రవర్తన, మాటతీరు, చేష్టల గురించి విమర్శించే ముందు మనలో మనం 'బహుశ నాకు తెలీకుండా నేను కూడా ఇలాగే ప్రవర్తిస్తున్నానేమో!' అనుకోగలగాలి. ముందు ఆత్మపరిశీలన చేసుకుంటే, విమర్శించే ముందు అవే పొరపాట్లు కొద్దిపాటి తేడాలతో మనం కూడా చేస్తూన్నామేమో తెలుసుకోవచ్చు. ఇతరులతో కలసిమెలసి ప్రవర్తించే సందర్భాలలో, వారి గుణదోషాలలో నీ గుణదోషాలను చాల ప్రస్ఫుటంగా అద్దంలోలా కనిపించినట్లు అగుపిస్తాయి.

యదార్థానికి సామాన్యంగా నీకు ఇతరుల ప్రవర్తనలో కొట్ట వచ్చినట్లు కనపడే అభ్యంతరకరమైనవన్నీ నీలో కాస్తో కూస్తో తేడాగా ఉంటాయి. కాని నీవు ఆత్మవంచన చేసుకుంటావు. నీ లోనే వుండి నీకు అసహ్యం కానిదే, ఇతరులలో రాక్షసంగా కనిపిస్తుంది. ఇది అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. నీలో ఈ మార్పు రావటానికి ఈ యెరుక నీకెంతగానో దోహదపడుతుంది. అదే సమయంలో యిది నీలో ఉత్సాహభరిత సహనాన్ని, ఆదరాభిమానాలను పెంపొందిస్తుంది. ఇతరులతో నీ సంబంధబాంధవ్యాలలో సదవగాహన ఏర్పడుతుంది. పనికిమాలిన కలతలకు తెరపడుతుంది.

ఈ రోజుల్లో ఎవరితోటీ పోట్లాడకుండా జీవించవచ్చు అంటే అది విచిత్రంగా అనిపించవచ్చుకానీ అది సంభవమే. జీవితమంటే చుట్టుపక్కల వున్నవారిలో క్షణక్షణ పోరాటమే అనుకోనవసరం లేదు. దురదృష్టకరమేమిటంటే పైకి కనపడేలా మాటకి మాట అనుకోకపోయినా, ఎప్పుడూ లోపల్లోపల చిరాకుపడటం సహజమనే స్థితిలో వున్నాం. ఇలా ఎందుకుంటుందంటే, నువ్వు ఏ పరిపూర్ణతనైతే సాధించాలో, అది నీకు కష్టమనిపిస్తూ, అదే పరిపూర్ణత ఇతరులలో లోపిస్తే నీకు చాలా అసందర్భంగా కనిపిస్తూంటుంది. 'అరె! వాళ్లలా ఎలా ప్రవర్తించగలరు?' అని వేరే

వాళ్లని నిందించేప్పుడు 'అలా ప్రవర్తించకుండా వుండటం ఎంత కష్టమో మర్చిపోకు మరి!' ప్రయత్నిస్తే నీకిలా ఆలోచించడం తెలుస్తుంది.

ఇటువంటి సంఘటనలన్నిటినీ ఒక చిరునవ్వుతో స్వీకరించడం నేర్చుకో. నీకు చిరాకు కలిగించే విషయాలన్నీ నీకు నేర్పే పాఠాలేనని తెలుసుకుంటే, నువ్వు ఎక్కువ ప్రశాంతంగా, ఎక్కువ సామర్థ్యంతో పనిచెయ్యగలుగుతావు. నీ వెంతసేపూ ఇతరులు సాధించవల్సిన పరిపూర్ణత గురించే ఆలోచిస్తావు కాని, నీవు సాధించవలసిన లక్ష్యాన్ని పట్టించుకోవు కదా! నువ్వు చెయాల్సిన పని మొదలుపెట్టు. మిగిలినవారి సంగతి నీ కనవసరం. నువ్వు యెలా వుండాలో తెలుసుకో. ఉత్తమమైన దృక్పథం ఏమిటంటే – "నా చుట్టూ వున్న వాళ్లూ, నా జీవితపరిస్థితులూ, అన్నీ నాకు దైవము నా ప్రగతి కోసం ఎత్తిచూపే అద్దం లాటివి. నన్ను కలవరపెట్టే ప్రతీదీ నాలో సరిదిద్దుకోవలసినదే!"

ఈ విధంగా నీలో పరిపూర్ణత సాధింపబడినపుడు నీ పరిసరాల్లో కూడా నీకు పరిపూర్ణత గోచరమయ్యే అవకాశాలుంటాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. వరలక్ష్మి

నీ వైఖరి బాగుండాలి

"దివ్యమాత సౌందర్యవతి. (కాని కావాలనుకుంటే) ఆమె కూడా కాఠిన్యం వహించి భయంకరంగా మారగలదు. అయినా, అమరత్వసిద్ధి పసివానికిచ్చే ఆటవస్తువా? లేక, కష్టపడకుండా లభ్యమయే పురస్కారమా? లేక, బలహీనుడు పొందగలిగే సార్వభౌమాధికారమా? గట్టిగా ప్రయత్నించు; నీవు పొందగలవు. విశ్వసించు.. చివరికి నీ నమ్మకము వమ్ము కాదు. మరైతే దివ్యమార్గానికి భయం

కర దివ్యశాసనము (the dread Law of the Way) వున్నది. దాని నెవ్వరూ ధిక్కరించ లేరు."

శ్రీఅరవిందులు

ప్రతికూలశక్తులు కలుగచేసుకొని నిన్ను ఎందుకు వేధిస్తాయి? మళ్లీ యిదే ప్రశ్న తలెత్తుతుంది. నీ చిత్తశుద్ధిని పరీక్షించేందుకు అవసరమైన పరీక్ష యిదే మరి. సులభమైన మార్గమే అయితే ప్రతివాడూ బయల్దేర్తాడు. కష్టం లేకుండా నిరభ్యంతరంగా గమ్యం చేరగలిగితే అందరూ గమ్యం చేరుకుంటారు. చివరిగా పర్యవసానం – పరిస్థితి ఆదిలో ఎలాగైతే వుందో అంతంలో కూడా అలాగే వుంటుంది. తేడా ఎక్కడి నుంచి వస్తుంది? నవ్య, ప్రాచీన లోకాలకి వ్యత్యాసం వుండదు. రెండూ ఒకే మాదిరిగా ఉంటాయి. అలాటిదాని కోసం ఎందుకీ శ్రమ? అందుకే పనికిరాని దానిని ప్రక్కకి పెట్టే ప్రక్రియ అవసరం. ఇది స్పష్టమే కదా! అప్పుడే కదా నవజీవన అభివ్యక్తీకరణ. అగ్నిపరీక్షలో పదును తేరి స్వచ్ఛంగా మేలిమి బంగారంలా వుండాలి. అగ్నిపరీక్షలో మిగిలేది బంగారమే కదా! మరి అది అలాగే వుంటుంది. What puts things out very much in all this is the religious idea of fault, sin, redemption. ఇక్కడ చికాకు కలిగించేదంతా మత విషయకమైన – తప్పు, పాపము, విముక్తి. కాని నిర్ణయం ఎప్పుడూ నిర్హేతుకంగా వుండదు. ప్రతి వ్యక్తికి అనుకూలమైన అవకాశాలు కల్పింపబడుతవి. దైవము తనకు ఇష్టమైనవారి పట్లనే తీవ్రంగా వ్యవహరిస్తాడని మనం యిదివరలో అనుకున్నాం. ఇది పరిహాసంగా అన్న మాట కాదు. వాస్తవం. ఆశావాదులు మాత్రమే పరిశుద్ధజ్వాలలో శోధింపబడి బయల్వెడలి గరిష్ఠస్థాయిలో లబ్ది పొందగలుగుతారు. దీనిని మీరు పరీక్షించవచ్చును కూడా. అందుకు తగినవిధంగానే మానవమస్తిష్కం నిర్మించబడి వున్నది. నీకు మరీ దుఃఖం కలిగించేది సంభవించినపుడు నీకు నీవే యిలా అనుకోగలవు, "ఈ దుఃఖం ఓర్చుకునే శక్తి నాలో ఏదో వున్నది. అందుకు తగినవాడిని అని నిర్ధారితమైనది" – అని అనుకుంటావు. బాధపడవు. హర్షిస్తావు. అది నీకు ఆహ్లాదయోగ్యమే

అవుతుంది. నీకిది సులువైన ప్రయోగం. ఏ పరిస్థితిలోను విషయాన్ని అనుకూలంగా దర్శించగలిగేందుకు. అలవాటుపడిన మనస్తత్వం వున్నపుడు నీకిది విచారం కల్గించేదిగా వుండదు. ఇది బాగా తెలిసిన విషయమే. మనసు ఒక విషయాన్ని స్వీకరించటానికి తిరస్కరించినపుడు, ప్రతిఘటించినపుడు, కష్టాలు, క్లేశాలు, అంతరంగ సంక్షోభాలు, గాలివానలు, – వీటితో అంతా దుఃఖ భూయిష్టంగానే వుంటుంది. అలాకాక – బాగుంది, జరగాలనుకున్నదే జరిగింది. కావల్సినదే వచ్చింది అనుకుని మనసును సమాధానపర్చుకున్నపుడు, యేది సంభవించినా, అది నీకు ఆమోద యోగ్యంగానే వుంటుంది. కొంతమంది మనోనిబ్బరం కల్గి వుంటారు. శరీరం వారికి వొదిగి వుంటుంది. దేనికీ బాధపడరు. కొంతమంది యోగులు గురించి నిన్న మీకు చెప్పాను. తమకు కలిగిన విపత్తు (ఆధ్యాత్మిక) అవరోధాలు అధిగమించేటందులకు సహకరించి, ఉన్నత శిఖరాన్నధిరోహింపచేసి, దివ్యసాన్నిధ్య లక్ష్యసాధనలో కృతకృత్యులు కాగలిగినప్పుడు వారు ఏ బాధ అనుభవించరు.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

కృతజ్ఞతా భావం

ఇది మరో రకమైన (భక్త్యావేశ) సంచాలనం.... అదే దైవ అస్తిత్వం పట్ల మనకు కలిగే కృతజ్ఞతాభావం. సర్వత్రా నిండిన దైవం యొక్క యెరుకతో మనలో ఉదయించే భావం. ఆ భావం ఎంతో ఉన్నతమైనది. గొప్ప ఆనందంలో మనల్ని ముంచెత్తే భావం. ఈ విశ్వంలో దైవం యొక్క ఉనికి దృశ్యంగా లేక అదృశ్యంగా కలిగించే ప్రేరణ. పరమోన్నత వాస్తవము. తీవ్రమైన అద్భుతానందంతో, విషయాలపట్ల, ఆహ్లాదకరమైన అభిరుచితో హృదయము

నిండిపోతుంది. దైవ అస్తిత్వ ప్రేరణతో కలిగిన అదొక రకమైన కృతజ్ఞతా భావన.

కృతజ్ఞతా భావంతో కలిగిన ఆనందంతో సరిపోల్చ తగ్గ మరో ఆనందం లేదు. అనేక సహజమైన విషయాల్లో... ఓ పక్షి పాట విన్నప్పుడు, ఓ అందమైన పువ్వును చూసినపుడు, పసి బిడ్డను చూసినపుడు, గొప్ప ఔదార్యమైన చర్య నవలోకించిన పుడు, ఇలా ఏదైనా సరే మనలో హఠాత్తుగా ఏదో సంతోషం కలుగుతుంది. దైవ అభివ్యక్తీకరణే కదా ఈ లోకం అంతా! ఈ దృశ్యమాన ప్రపంచమంతా నిండిన అదృశ్య దైవాన్ని దర్శించ డమే కదా! అదే ఆ కృతజ్ఞతాభావనతో కూడిన అద్భుత ఆనం దానుభూతి.

*

ఈ వ్యక్తప్రపంచమే నాకు దైవంయొక్క ఉనికికి తిరుగులేని నిదర్శనం. సర్వవ్యాప్తమైన 'అదే' తప్ప వేరు లేదు. 'తత్‌సత్' – అది అనిర్వచనీయ.మైనది, కాని అనుభవైకవేద్యమైనది. అదేదో – (a something) సర్వోత్తమమైనదానికన్నా ఉత్తమమైనది. సృష్టినంతటినీ కలిపినా కూడా అవ్యక్తమే అది. 'అది.. 'తత్' – తప్ప మరొకటికానిది, లేనిది, శూన్యంలో వ్రేలాడేదీ కాదు. 'అది' అదే మరి. అదే అంతటా నిండి ఉంది.

*

ఉన్నావు (ప్రభూ) నీవు, వహించి ఉన్నావు, పరివ్యాప్తమై ఉండి పరిపాలిస్తున్నావు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ఇదీ దారి

ప్రశ్న: మధుమయీ మాతా! భౌతిక, మానసికవిద్యలు కసరత్తులతో అనుసరించే క్రమానుగత పద్ధతుల ద్వారా సాధించే పద్ధతిలోనే శ్రీఅరవిందుల యోగంలో కూడా ప్రగతిని సాధించే సాధారణ ప్రక్రియలు ఉన్నవా? ఇవి వ్యక్తికీ – వ్యక్తికీ మారవచ్చు. అనుదినం అంచెలంచెలుగా అనుసరించదగిన ఏదైనా పద్ధతిని నాకు సూచిస్తారా?

అమ్మ: భౌతిక, ప్రాణిక, మానసికస్థితులలో అభివృద్ధి కొరకు యాంత్రికంగా అనుసరించాల్సిన నిర్దుష్టమైన పద్ధతులు తప్పనిసరి. అయితే నిరంతరం చిత్తశుద్ధి ద్వారా మాత్రమే కొనసాగించాల్సిన ఆధ్యాత్మిక అభివృద్ధిలో యాంత్రికమైన అలాంటి పద్ధతులకు స్థానం లేదు. ఈ విషయంలో సహజాతమైన పరిపూర్ణ చిత్తశుద్ధి (the spontaneity of an absolute sincerity) తప్పనిసరి.

ఏది ఏమైనా, నిన్ను ఆ మార్గంలో పెట్టేందుకు ప్రాథమికమైన కొన్ని విషయాలు చెప్తాను.

1. ఉదయం నిద్రలేవగానే ఆరంభం కాబోయే ఆ రోజును దైవానికి సమర్పించుకో. అంటే నీ ఆలోచనలు, నీవు చేసే పనులు, నీకు వున్న సమస్తం దైవార్పణంగా నిర్వహించు.
2. రాత్రి నిద్ర కుపక్రమించే ముందు గడచిన ఆ రోజును ఒకసారి సమీక్షించుకోవాలి. ఆ రోజు దైవానికి సమర్పించుకోకుండా చేసినవన్నీ, ఆ విషయం మరచిపోయిన సమయాలన్నింటినీ ఒకసారి నెమరువేసుకొని మళ్లీ అలా జరగకుండా చేయమని ఆకాంక్షించి, ప్రార్థించాలి.

ఇది కనీస కార్యక్రమం. ఒక చిన్న ప్రారంభం. ఇలా నీవు ముందుకు పోవడం అన్నది నీ చిత్తశుద్ధి మీద, అంకితభావం మీద ఆధారపడి వుంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు.

యోగంపై ఒక మాట

ప్రశ్న: యోగాన్ని గురించి కొంత చెప్పండి.

జవాబు: నీకు యోగం ఎందుకు కావాలి? అధికారం కోసమా? శాంతి, ప్రశాంతతల సాధనకా? మానవసేవ కొరకా? ఎందుకు?

అసలు జవాబు కోరే ప్రశ్న ఇది. దైవాన్ని పొందే యోగమే కావాలా? అపుడు దైవమే నిన్ను బ్రతికిస్తున్న ఉన్నత నాస్త్ర వాన్ని తెలుసుకొని అది వినా ఏదీ చేయలేదని భావిస్తున్నావా? నీ సర్వస్వమైన దైవమే లేని నీ ఉనికి అర్థం లేనిది గాదా? అలా అయితే ఆ మార్గానికి నీకు పిలుపు వచ్చినట్లే. ముందు పూర్తిగా దైవం కోసం ఆకాంక్ష కలగాలి. ఇది తప్పనిసరి.

తదుపరి దానిని ఆసక్తితో చురుగ్గా సజీవంగా వుండేలా పెంపొందించుకో. దానికై గాఢమైన ఏకాగ్రత కావాలి. దైవమే పరమమై కేంద్రంకాగలిగి, పరిపూర్ణ కైవల్యంతో ఆ దివ్యసంక ల్పమే లక్ష్యమై నీవు సమగ్ర నివేదనతో సమర్పించుకో.

ఆ ఏకాగ్ర సాధనకు హృదయమే కేంద్రంగా చేసుకొని ప్రవేశించు. లోలోతులకు వెళ్తూనే బయటంతా విస్తరించిన నీ చైతన్యపుతంత్రుల నన్నిటినీ చేర్చి, పట్టి, చుట్టి, నిండుగా మునిగి అట్టడుగు చేరు. అక్కడ హృదయపు నిశ్చలమైన అగాధంలో మండే జ్వాల వున్నది. అదే నీలోని దివ్యత్వం. నీ నిజమైన ఉనికి. దాని మాటలే విను. ఆ ఆదేశాలే పాటించు. ఇంకా కొన్ని నాడీ కేంద్రాలున్నాయి. నెత్తి మధ్యలో ఒకటి (సహస్రారం), కనుబొ మల మధ్య ఒకటి (భ్రూయుగ్మంలోని ఆజ్ఞాచక్రం). దేని ప్రభావం దానిదే. ఫలితం ప్రత్యేకం. ప్రధానకేంద్రం మాత్రం హృదయం లోనే ఆధారమైనదై, తక్కిన అన్ని కేంద్రాల కదలికలనూ, దిశా నిర్దేశం చేసి, పరిణామంగా, పరివర్తనలో, క్రియాశీలతా సిద్ధి కలు గుతాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: టి.యస్. రామచంద్రరావు

సమాచార పత్రం

శ్రీమాత ఫ్రాన్సు నుంచి మార్చి 29, 1914 న పాండిచేరి వచ్చి శ్రీఅరవిందులతో సమావేశమైన మరుసటి రోజు తమ డైరీలో ఈ విధంగా వ్రాసుకున్నారు. –


పరిపూర్ణంగా నీ దివ్యచైతన్య సాన్నిధ్యాన్ని పొందిన పూర్ణ సాధకులు ఎందరో. నేను అది పొందాలని పరితపిస్తున్నాను. అందుకు వారికంటె నేను ఎంతో వెనుకపడి వున్నాను. అది నాకు తెలుసు. అయినా ఆ నా యెరుక నన్ను నిరుత్సాహపర్చకపోగా, అవరోధాలన్నిటినీ అధిగమించి నీ దివ్యధర్మ కార్యక్రమముతో తాదాత్మ్యత చెందాలని, నా ఆకాంక్షను, శక్తిని, ఇచ్ఛను మరింత ప్రోత్సహిస్తున్నది. క్రమక్రమంగా సుదీరతీరాలు చేరువవుతున్నవి. దారి సుగమమవుతున్నది. అంతకంతకు నమ్మకము దృఢతరమవుతున్నది.

వేలాదిజీవులు గాఢ అజ్ఞానాంధకారంలో మునిగి ఉండుగాక. మరేం పర్వాలేదు. మేము నిన్న దర్శించిన ఆయన ఈ భూమిపై వున్నారు. వారి సన్నిధి చాలు! – ఏదో ఒకనాడు చీకటి వెలుగుగా రూపాంతరం చెంది, నీ దివ్యపాలన ఈ నేలపై ప్రతిష్ఠింపబడగలదనే నిరూపణకి.

ఓ ప్రభూ! అద్భుత దివ్యరూపశిల్పీ! దీనిని తలచుకుంటూ వుంటే నా హృదయం కృతజ్ఞతాపూర్వకమైన మహదానందంతో పొంగిపొరలుతున్నదయా! నా ఆశకు అవధులు లేవయా... నీ పట్ల పూజ్యభావము మాటలకు అందక, నా భక్తి మూగవోయినదయా, ప్రభూ!

శ్రీమాతవిందుల ప్రథమ సమావేశ వార్షికోత్సవ దినము మార్చి 29 న ఆశ్రమ క్రీడాస్థలిలో సాయంత్రం 7.15 నుంచి 8.15 వరకు సామూహిక ధ్యానంతో పాటించబడింది.

జాతీయ సమైక్యత కొరకు అఖిల భారతీయ వార్షిక యువ సమ్మేళనం శ్రీఅరవింద సొసైటీవారు పాండిచేరిలో జనవరి 3 నుంచి 11 (2007) వరకు నిర్వహించారు. 18-25 వయస్కులైన



Flower: Vigilance

అసిధారావ్రతం

అఖిల

అఖిల భారత పత్రిక, మే 2007

అసిధారావ్రతం

(శ్రీమాతారవిందుల మాటలలో)

విషయసూచిక

లే! మేలుకో! శ్రేష్ఠులైనవారిని కనుగొని వారినుంచి నేర్చుకో. పోవాల్సినదారి పదునైన కత్తిమీద నడక, సునిశితం, అతికఠినం – అంటారు మహర్షులు.

(కఠోపనిషత్తు)

ఇది తప్పని అంతర్మథనం

బలీయమైన త్యాగంవల్ల మాత్రమే దివ్యత్వలబ్ధి:
నరకాన్ని జయించవలసినవాడు సవాళ్ల నెదుర్కొని వ్యధను
భరించవలె.

చీకటి చాటులో పగ దాగుంది.
మనిషి లోలోతుల్లో, కనిపించని కాలం గుండెల్లో
గుప్తశతృత్వము ఆవాసమై అధికారాన్ని చలాయిస్తూ
భగవత్కార్యాన్ని మార్చి చెడగొట్టడానికి
ప్రపంచగమనాన్ని అడ్డగించేందుకు
రహస్యశత్రువుగా పొంచి ఉన్నది.
మనోవాక్కాయకర్మలపై తన ముద్ర వేస్తుంది.
చేసే ప్రతి కార్యముపైన మాలిన్యపు మరక వేస్తుంది.
ఇది నిర్మూలింపబడేదాకా భూమిపై శాంతి నిషిద్ధమే
శత్రువు పైకి కనబడడుకాని పొంచి ఉంటాడు
అదృశ్యంగా. మన చుట్టూ అదృశ్యశక్తులు ముట్టడిస్తాయి.
శతృసీమల అనుభూతులు, మనవికాని ఆలోచనలు
మనల్ని వశం చేసుకొని తప్పు చేసే మనసుని తరిమి
నిర్బంధిస్తాయి.
సందేహాపు వలలో చిక్కుకున్న బ్రతుకులు మనవి
పూర్వమే పుట్టిన ప్రతికూలశక్తి
మర్త్యమానవజీవితాన్ని ముట్టడించేది,
సూటియైన అమృతపథాన్ని చాటు చేస్తుంది.
దివ్యకాంతికి ముసుగు తొడిగే శక్తి వచ్చింది.
దివ్యసంకల్పాన్ని ప్రతిఘటించే శక్తి
నిర్దిష్టమైన దివ్యవాక్సం దేశాలని మరిపిస్తుంది.
విశ్వప్రణాళికాపట తీరరేఖలని వక్రీకరిస్తుంది.
ఒక రహస్య వ్యాఖ్యానం మానవహృదయానికి హాని
కలిగించేందుకు ప్రలోభ పెడుతోంది.
జ్ఞాననేత్రాలను, ఆత్మదృష్టిని కప్పి ఉంచుతుంది.

ఇక్కడ మన దుఃఖానికి మూల మిదియే.
ఈ భూమిని బాధకు, విపత్తుకు కట్టిపడేసేది.
విశ్వశాంతిని క్రిందికి తేవల్సినవారు
వీటన్నిటినీ తప్పక జయించవల్సినవారే.
మానవాంతరంగంలో దాగివున్న నిగూఢ శత్రువును
మనిషి జయించాలి లేదా ఉన్నత విధివిధానమును కోల్పోవలె.
మరి ఇదే తప్పని అంతర్మథనం.
(సావిత్రి, 447-448)

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: వై. యస్. వి. యస్. మూర్తి

దివ్యమార్గ నిర్దేశం

పిలుపు ఉందా? నీ ఆత్మ బదులిస్తోందా? సరి చూసుకో. పిలుపు సరిగా లేకుండా దైవీశక్తుల అనుగ్రహం లేక, వారి దూతల వాణి కాక, అహం ప్రలోభంతో చేసే కృషి చివరికి ఆధ్యాత్మిక భంగ పాటే అయి, ఘోరవిపత్తుగా పరిణమిస్తుంది.

దివ్యవాణికి సమాధానంగా ఆత్మోద్దీపనంలేక, మనస్సు యొక్క ఆమోదం, ఆసక్తి మాత్రమే ఉండవచ్చు. లేదా యోగంతో శక్తి సంపాదించుకోవటం, సరదా తీర్చుకోవటం వంటి ఆకర్షణల కోసం నిమ్నప్రాణికవాంఛలు ఏ మూలనుంచో పట్టుకోనూవచ్చు. దివ్యవాణి తీవ్రతకి, మాధుర్యానికి, మహత్యానికి చలించి క్షణి కోద్రేకంలో అల్లలాడే దీపకళికలా ఎగసిపడనూవచ్చు. అప్పుడు నీకు ఈ దుర్గమ యోగమార్గంలో నిశ్చయం అనేది ఉండదు.

మనిషి జీవితం అశాశ్వతం. భౌతిక ఉపకరణాలు నీరసమైనవి. ఆధ్యాత్మిక యాత్రలో ఎదురయే తీవ్రభావావేశాలను, అంతర్గత భయంకర సంఘర్షణలను, అవరోధాలను అవి ఎదుర్కొనలేవు. సూక్ష్మ, అసాధ్య ప్రమాదాలను అధిగమించలేవు – గంభీరమైన ఆత్మశక్తి, అచంచలమైన ఇచ్ఛాశక్తి, చల్లారని నిశ్చలమైన

తీవ్ర ఆత్మోద్దీపన – ఇవి మాత్రమే ఈ కష్టమైన రూపాంతరీకర ణకు, ఈ గొప్ప అసంభవ కార్యసాధనకు తగి ఉన్నవి.

మార్గము సుగమమని అనుకోవద్దు. ఇది సుదీర్ఘము, ప్రమాదభరితము, కష్టము, అసాధ్యము. అడుగడుగునా ప్రమాదము పొంచి ఉంటుంది. ప్రతి మలుపులో ఊహించని ఆపద. నీ అజ్ఞానంపై అతిసూక్ష్మంగాను, నీ బలహీనతపై అత్యంత శక్తివంతంగాను, అసంఖ్యాకమైన దృశ్యాదృశ్యశత్రువులు నీపై దండెత్తటానికి ఉద్యమిస్తాయి. నీవెంతో వ్యధతో వాటిని నిర్మూలించగానే మళ్లీ వేలకి వేలు వాటి స్థానే పుట్టుకొస్తాయి. నిన్ను చుట్టుముట్టి నిరోధించి, గాయపరచి, భయపెట్టి నరకం తన మూకలను వెళ్ల గ్రక్కుతుంది. స్వర్గమైతే మరోవైపు, దాని కనికరంలేని పరీక్షలు, ఉదాసీన ఉజ్వల నిరాకరణలతో నిన్ను ఎదుర్కొంటుంది. నీ దారిలో రాక్షసులు ఉగ్రంగాను, పైనుండి దేవతలు నిరాదరణంగానూ వర్తిస్తూంటే నీ పరితాపంలో నీవు ఏకాకిగా మిగిలిపోతావు. అజ్ఞాన తమస్సు పాలనలో ప్రయోజనం పొందే పురాతనము, శక్తివంతము, క్రూరము, అజేయము, అసంఖ్యాకము, సన్నిహితము అయిన భీకరశక్తులలో మార్పు రాకపోగా దివ్యతేజోమయమైనవి మాత్రము ఏకాంతంగా దూరంగా ఉంటూ నెమ్మదిగా చేరుతాయి. కొద్ది సంఖ్యలోనే ఉండి కాస్సేపే దర్శనమిస్తాయి. సహకరించటానికి ఇష్టపడతాయి. కాకపోతే ముందుకు వేసే అడుగడుగునా పోరాటమే. అపాయకరమైన అవరోహణలు. అంతులేని ఆరోహణలు. అధిరోహించవలసిన శిఖరాగ్రాలపై శిఖరాగ్రాలు ఎన్నో. పై ప్రతి పీఠభూమి మీదనుంచి చూస్తే అనంతమైన పీఠభూములు ఒకదాని కొకటి అతీతంగా ఆవిష్కృతమవుతూనే ఉంటాయి. ప్రతి విజయమూ ఇదే అంతిమ విజయపోరాటం అనుకుంటావు. కాని అది మరిన్ని ఇతర భయంకర పోరాటాలకి నాంది అని తెలుస్తుంది. కాని దైవకరావలంబనం, నాకున్నదని, తన కృపారవింద మందహాసంతో దివ్యమాత సన్నిధి ఉన్నదని అనుకుంటావు కదూ? అయినా నీకు తెలియదు, భగవదనుగ్రహం పొందటం ఎంత కష్టమో. పొందినదానిని భద్రపరచుకోవటం

మరీ కష్టం – దేవతల నుంచి పొందిన అమృతం, లేదా కుబేరుని అమూల్య సంపద భద్రపర్చుకోగల్గటం కంటే కూడా. ఆయనచే ఎన్నికైనవారి నడుగు వారు చెప్తారు – ఎంత తరుచుగా శాశ్వ తుడు తమ నుంచి ముఖం త్రిప్పుకున్నాడో, ఎన్నిసార్లు ఎలా తమనుంచి వెనుదిరిగి అద్భుతావహమైన తెర వెనుకకి మాయమై నాడో – భయంకరమైన చీకటిలో ఏకాంతంగా ఆచ్ఛాదన లేకుండా రక్షణలేని పోరాటంలో నరకయాతన పడుతూంటే. అప్పుడాయన సందర్శన అనుభూతి ఎలాటిది? చలికాలంలో మంచు, వర్షం, విపత్కర తుఫాను, కఠోరమైన గాలి, తీవ్రమైన చలి – ఇలాటి విషాద విపత్కర వాతావరణంలో సూర్యదర్శనం లాటిది. సహా కారం వెనుకకు తీసుకొనబడినట్లుగా ఉన్నా, నిస్సందేహంగా అది అక్కడ ఉన్నది – ఉషోదయం ముందు చిమ్మచీకటిలా నక్షత్ర కాంతి ఆశ కూడా లేకుండా. దివ్యమాత వదనము సౌంద ర్యవంతము. కాని ఆమె నిష్కర్షగా భయంకరంగా కూడా ఉండ గలదు. మరి కాకపోతే అమృతత్వసిద్ధి పిల్లవాని చేతిలో పెట్టే ఆట వస్తువా! లేక దివ్యజీవనం – కృషి, కష్టం లేకుండా పొందగలిగే పురస్కా రమా! లేక నీరసునికి లభ్యమయే కిరీటమా! తగురీతిగ కృషి చెయ్యి; నీకు లభ్యమవుతుంది. నమ్ము. నమ్మకమెప్పటికీ వమ్ము కాదు. దివ్యమార్గానికి భయంకర దివ్యనిబంధన ఉన్నది. దాని నెవ్వరు తప్పించుకోలేరు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(1927 ప్రాంతంలో శీర్షిక లేకుండా వ్రాసిన వ్రాతప్రతి నుంచి)

మార్గంలో ఆపదలు ఆటంకాలు

యుక్తాయుక్త వివేచన లేకపోవటం

వ్యక్తులు, తమ మనస్సు తమకు, ఇతర వ్యక్తుల గురించిన, విష యాలను, ఆలోచనలను, నిర్ణయాలను, సూచనలనూ అందిస్తున్నదా అనేదానిని గురించి పట్టించుకోరు. వారి స్వంత అభిప్రాయం వారికి ఏదో ఉంటుంది. అదే ఖాయమని దానినే అనుసరిస్తారు. ఎందుకంటే అది తమ స్వీయ అభిప్రాయం కాబట్టి. మానసికంగా తప్పు చేస్తున్నామని గుర్తించినా కూడా అదేమంత ప్రధానమైనది కాదు అనుకుంటారు. మానసికంగా మరింత జాగ్రత్త తీసుకోటానికి ప్రయత్నించరు. ప్రాణికస్థాయిలో తమ కోర్కెలకు, ప్రచోదనలకు లోబడకూడదని అడ్డు, ఆపు లేకుండా అనుసరించ కూడదని తమకు తెలుసు. వారికి ఒక అంతరంగం, నైతికజ్ఞానం తప్పక ఉండాలనీ తెలుసు. అవి విచక్షణాజ్ఞాన్ని కలిగించేవనీ తెలుసు. అయినా – వారు మనసుకు సంబంధించిన – తప్పు అయినా, ఒప్పు అయినా, తమ మనోభావాలనే సమర్థించుకుంటారు, ఏ అడ్డు, ఆపు లేకుండా. మనిషికి మనసే సర్వోన్నత ఉపకరణం అని అనుకుంటారు. దాని భావాలకు అనుగుణంగానే ఆలోచించాలి, పనిచేయాలి అని అనుకుంటారు. కాని ఇది నిజం కాదు. మనసును కూడా నియంత్రించటానికి, దానికి మార్గదర్శకత్వం వహించటానికి, ప్రాణికానికి వలెనే, అంతరంగజ్ఞానం అవసరం. మానసానికి అతీతంగా మరొకటి ఉంది. దానిని కనిపెట్టాలి. మనసు క్రియకి మధ్యవర్తి మాత్రమే. అసలు మూలం దివ్యజ్ఞానం.

*

నిమ్నప్రకృతి సృష్టించే ఆటంకాలు, ఈ యోగానికి స్పష్టమైన ఆటంకాలు.

ఇవి సాధనలో తప్పనిసరి. సాధన పురోగమనంలో స్వభావానికి చెందిన నిమ్నస్థాయి భాగాలు పైకి బహిర్గతం కాబడాలి. సత్వంలో మిగిలిన భాగాలతో పాటుగా, ఇవి కూడా రూపాంతరీకరణకు అనుకూలంగా ఉన్నాయా – లేవా – ప్రధానంగా నిర్ణ

యించుకోవాలి. నా కార్యక్రమం అంతా వీటి చలితచాలనాలపై ఆధారపడి ఉంది. ఈ యోగానికిది తప్పనిసరియైన అగ్నిపరీక్ష. ఇది మారకుండా, భౌతికచైతన్యము, ప్రాపంచికజీవనము మారవు. ఇది జరగకపోతే ఇంతకు ముందు జరిగినది వ్యర్థమైపోతుంది. అంతరంగం ప్రకాశించదు. పర్యవసానంగా అనుభవము, శక్తి, ఆనందము, – వీటికి విలువ ఉండదు. స్వల్ప బాహ్యావ్యక్తిత్వము, తన అస్పష్ట, పరిమిత, అల్ప, తుచ్ఛ, స్వార్థపూరిత, అసత్య, జడ మానవచైతన్యమును పట్టుకునే వ్రేలాడుతూ ఉంటే సాధనా కార్యక్రమాన్ని నిస్సందేహంగా నిరాకరించనట్లే. బాహ్యస్వభావ నియమాలలో నిజంగా మౌలికమైన మార్పులు రావాలి. ఇది లేకుండా అంతరంగంలో అసంపూర్ణ తాత్కాలిక ఆధ్యాత్మిక ఉన్మీలనం ఒక భంగపాటే అవుతుంది. పాతదానికిది ఒక కొత్త నమూనాగానే మిగులుతుంది. మరి అలాటిదానికి నా అనుమతి ఎలా ఉంటుంది! ఏ సాధకుడైనా ఆచరణలో దీనిని నిరాకరించినా, కనీసం దీని ఆవశ్యకతను గుర్తించటానికి నిరాకరించినా, నన్ను, నా యోగాన్ని అతను నిరాకరించినట్లుగానే నేను తీర్మానించుకోవలసి వస్తుంది.

ఈ మార్పు అంత సులువు కాదని నాకు తెలుసు. గమనసీలమైన ఇచ్ఛాశక్తి (dynamic will) ఒక్కసారిగా రాదు. వచ్చినా స్థిరపర్చుకోవటం మరీ కష్టం. తర్వాత కూడా బలమైన అలవాట్లు ఓ పట్టాన వదలవు. సాధకుడు ఏమీ చేయలేకపోతాడు. నాకు, శ్రీమాతకు ఇది తెలుసు. సత్యచేతన బహిర్గతమై రూపొంది బాహ్యసత్తలో సమర్థవంతంగా పనిచేయటానికి సమయం పడుతుంది. ఓరిమి వహించి మా దగ్గర ఉన్న సాధకులకు సమయం ఇస్తున్నాం. కాని ఎవరిలోనైనా ఈ భాగం (the stupid human consciousness) మొండిగా, తననే సమర్థించుకొనేదిగా, దాడి చేసేదిగా ఉండటం, ఇచ్ఛాశక్తుల మద్దతుతో చేసే పనులను నిరూపించటం చేస్తూ, చుట్టుప్రక్కల వ్యాప్తిచెందుతూ ఉంటే, అది వేరే విషయం. ఇది చాలా serious matter.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

పయనించాల్సిన మార్గం – అసిధారావ్రతం అతి కఠినం – సునిశితం

యోగంకాని, యజ్ఞంకాని చేసే చోట, ఏ విధంగానైనా దాన్ని ఆపాలని వ్యతిరేకశక్తులు గుమికూడతాయన్నది సత్యం మన దేశంలో యూరప్, ఆఫ్రికా దేశాల్లో కూడా యోగులు, మార్మికవాదులకు తెలుసు. ఒక అధమ ప్రకృతి, ఒక ఉన్నతమైన ఆధ్యాత్మిక ప్రకృతి ఉన్నాయనీ, ఆ రెండూ ప్రతికూలదిశలో పయనిస్తాయనీ, మొదట అధమ ప్రకృతి, ఆ తర్వాత ఉన్నతప్రకృతీ శక్తివంతమౌతాయనీ తెలిసిందే. అధమ ప్రకృతి సంచారాన్ని ప్రతికూలశక్తులు ఆసరాగా తీసుకొని, వాటి ద్వారా సిద్ధిని భంగపరచడానికి, క్షీణింపజేయటానికీ, నశింపజేయటానికీ ప్రయత్నిస్తాయనీ తెలుసు. ఉపనిషత్తుల కాలంలోనే '*పయనించాల్సిన మార్గం అసిధారా వ్రతం – అతి కఠినం – సునిశితం*' అన్నారు. ఆ తర్వాత 'స్వర్గసామ్రాజ్యాన్ని చేరే దారి కఠినతరం – ద్వారం ఇరుకైనది' అందుకే 'ఎందరినో పిలిచినా – ఎంపికయ్యేది కొందరే' అని క్రీస్తు ప్రవచించారు. అయితే ఎన్ని కష్టాలు, అడ్డంకులు, పతనాలు ఎదురైనా హృదయంలో చిత్తశుద్ధి, విశ్వాసం కలిగి ఉంటూ భగవంతునిపై భారం వేసినవారు ఆ గమ్యాన్ని చేరుకుంటారన్నదీ విదితమే.

*

ప్రతికూల చర్యలు

అధమ ప్రకృతి తెలియనితనంవల్ల కలిగేవి సాధారణ మానవలోపాలు. కాని ప్రతికూలశక్తుల చర్య అన్నది ప్రత్యేకమైన జోక్యం – తద్వారా కలిగే తీవ్రమైన అంతరంగ ఘర్షణలు, అసాధారణమైన క్రుంగుబాటు, ఆలోచనలు, సులభంగా గుర్తించగలిగే ప్రేరేపణలు – ఆశ్రమాన్ని వదలడం. యోగాను త్యజించటం, భగవంతుని పట్ల తిరుగుబాటు, అణచుకోలేని ఉపద్రవ సూచనలు, నిర్హేతుకమైన ప్రేరేపణలు వీటిలో కొన్ని. సాధారణ మానవీయ బలహీనతల కోవకు ఇవి చెందవు.

మనుషులలో అధమప్రకృతివల్ల కలిగే సాధారణ ప్రతికూలత వేరు; ప్రతికూలశక్తుల చర్య వేరు. మొదటిది సహజంగా అందరిలో కలిగేదే. రెండవది మాత్రం మానవేతర ప్రపంచ జోక్యం వల్ల కలిగేది. ఈ జోక్యం రెండు రకాలుగా ఉండవచ్చు. 1) శాంతంగా ఉండే సందర్భంలో కూడా అధమప్రకృతిశక్తులను బలవంతంగా ప్రతికూలంగా మలచటం... ప్రతికూలత సాధారణస్థాయిలో ఉండే దశలో కూడా తీవ్రతరం, హింసాత్మకంగా చేయడం; హింసాత్మకంగా ఉన్న దశలో మరింత ఉధృతపరచటం. ఈ ప్రతికూలశక్తుల ప్రభావంలో ఒక వైషమ్యపూరిత తెలివి, ప్రత్యేక వ్యూహము, సంయోగము, ఉంటాయి. సాధారణ శక్తుల ప్రతికూలతలో ఇవి ఉండవు.

2) అప్పుడప్పుడవి తమ శక్తులతోనే దాడి చేస్తాయి. అప్పుడు మన ఆలోచనలు, భావాలు, చర్యలు అసాధారణంగా ఉండేవిధంగా ఎదిరించలేని ప్రభావం, తాత్కాలికమైన వశీకరణ ఉంటాయి. మస్తిష్కంలో ఏదో నల్లని మేఘం కమ్ముకున్నట్లు, ప్రాణికశక్తిలో ఏదో అలజడి, అన్ని చర్యలూ మన వశంలో లేని విధంగా ఏదో బలవత్తరశక్తికి వశమైనట్టు అనిపిస్తుంది. లేదా ఏదో పట్టినట్లు కాకుండా గట్టి ప్రభావం ఉండొచ్చు. అప్పుడు గుర్తించదగిన సూచనలేవీ కనిపించకపోవచ్చు. అయితే ఈ శక్తుల వ్యవహారం తెలిసినవారికి మాత్రం ఏం జరుగుతున్నదో గమనించడం సులభతరం. చివరగా అది కేవలం ఒక దాడి మాత్రమే కావచ్చు. దయ్యం పట్టినట్లో లేదా ప్రభావమో కాకపోవచ్చు. అప్పుడా వ్యక్తి వేరుగా ఉంటాడు. వశపడడు. నిరోధిస్తాడు.

ప్రతికూలశక్తులు స్పృశించనివారు కూడా ఉంటారు కొందరు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: మాడభూషణం రాజగోపాలాచార్య

నిమ్నప్రాణికసత్తకు ఉన్న ఇబ్బంది

నిమ్నప్రాణికం ఇంకా తన ప్రాణికవ్యక్తిత్వానికే కట్టుబడి ఉండి దివ్యతేజస్సుకు వ్యతిరేకంగా తిరుగుబాటు ధోరణితో ఉంటోంది. ఇదే దానితో ఉన్న ఇబ్బంది. దివ్యసత్యమునకు కాని, నాకుకాని, శ్రీమాతకుకాని ఒదిగి ఉండకుండానే ఉంటోంది. అంతే కాదు. ఇంతవరకు దానికి నిజమైన అర్పణ అంటే ఏమిటో అవగాహన కాని, ఇందుకు ఇచ్ఛ కాని లేదు. ఈ రకమైన దృక్పథం నిమ్నచేతన కలిగి వున్నప్పుడు అది ఎంతసేపూ తన గతవ్యక్తిత్వానికి, నిమ్నస్వభావానికి సంబంధించిన రూపాలకే స్థిరపడి ఉంటుంది. అవి ఎప్పుడు నిరుత్సాహపరచబడినా వాటినే మళ్లీ బలపరుస్తూ వాటినే మళ్లీ తిరిగి వెనక్కి తీసుకువస్తుంది. పైగా అది తన మొరటు స్వార్ధపూరితభావాలు, కోర్కెలు, భ్రాంతులు, ప్రచోదనలు – వీటిని తనకు కావల్సినప్పుడల్లా అనుసరించే హక్కు, స్వేచ్ఛలను సమర్ధించుకుంటుంది. తన స్వభావాన్ని పరోక్షంగానో, ప్రత్యక్షంగానో అనుసరించే హక్కును, మానవ అవినీతి స్వభావాన్ని, స్వేచ్ఛను సమర్ధించుకుంటుంది. అజ్ఞానం, అసత్యములతో కుదురుగా ఉండలేకపోవటం ఈ సత్వానికి సహజం. ఇలాటి వ్యక్తిత్వాన్ని సమర్ధించుకుంటుంది. సైద్ధాంతికంగాను, ఆచరణకి ఇవే తనకు స్వంతం అనుకుంటుంది. వ్యక్తీకరిస్తుంది. ఈ పాతవ్యక్తిత్వం అస్వచ్ఛమైన, హీనమైన ఈ చెత్తను తన నడవడికలో సమర్ధించుకుంటూ, విపరీత వ్యాఖ్యానాలు చేస్తుంది. ఇంకా బడాయిలుపోతుంది. ఆలోచనలో, మాటలో, భావనలో ఈ పద్ధతులను, వికృతపర్చే ఈ తెలివితక్కువ లక్షణాలను అంతులేకుండా కొనసాగిస్తుంది. ఒక్కొక్కప్పుడు వీటిని బహిరంగంగా సమర్ధించుకుంటుంది కూడా. ఇందుకు వ్యతిరేకమైనదానిని అణచివేత, అపచారం, అన్యాయం అని ప్రకటిస్తుంది. మరొకప్పుడు ఆత్మవంచన చేసుకుంటూ, కపటంగా వర్తిస్తూ చెప్పేదొకటి చేసేదొకటిగా ఉంటుంది. ఇవే ఒప్పు, సహేతుకమైనవి, చేయతగినవి అని అంటుంది. అందరికీ నచ్చచెప్పుతుంది. యోగకార్యక్రమంలో ఇదే

అసలైన భాగం అని సమర్థించుకుంటుంది. ఒప్పించటానికి ప్రయత్నిస్తుంది.

ఈ నిమ్నప్రాణికసత్తయొక్క కార్యక్రమాన్ని నిన్ను ప్రభావితం చేసేందుకు అనుమతించినా, దీని సూచనలను దృక్పథాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ధృవపర్చినా, ఇది ఎక్కువ భాగం నీ మాటతీరును పనితీరును నిర్దేశిస్తుంది. ఇందుకు వ్యతిరేకంగా నీవు ఏమీ చేయవు. నీలో ఏ దాపరికం లేకుండా, శ్రీమాత పట్ల నిజాయితీగా ఉంటే నిన్ను నీవు సరిదిద్దుకుని, మారటానికి ప్రయత్నిస్తావు. అందుకు నీకు ఉన్న అవరోధానికి మూలం కనుగొంటావు. తిన్ననైన మార్గానికి మరలుతావు. మరి ఇది ప్రతికూల ప్రభావాలకి లొంగకుండా పట్టుదలగా ఉన్నపుడే సాధ్యం. కాని ఏదో ఒక సాకుతో ఈ చలితచాలనాలను గోప్యంగా ఉంచటానికి ఇష్టపడతావు.

రూపాంతరీకరణాన్ని ప్రతిఘటించే వ్యక్తిత్వ లక్షణాలు కొన్ని కొందరిలో అధికంగాను, ఇంకొందరిలో అల్పంగాను ఉంటాయి. వీటిని కట్టుదిట్టంగా బహిర్గతం చేయాలి. ఉన్న కష్టాలకి ఇవి అదనం. వీటిని రేఖామాత్రంగా వివరించటం అవసరం.

1) స్వాతిశయం, పొగరు

ఈ అల్ప, ప్రాణికసత్తలో స్వాతిశయం, పొగరు, పంతం నెగ్గించుకోవాలనే రాజసిక ఉద్రేకం లాంటి లక్షణాలు నిమ్నప్రాణిక చేతనలోని భాగాలలో పటిష్ఠశక్తి కలవారికి ఉంటాయి. ఈ శక్తి ఉన్నత ప్రాణికం దానికి దఖలుపర్చినది. ఇది ప్రాణికశక్తిని వికృతపరుస్తుంది. నాయకత్వం వహించి ఏలుబడి చేయాలనుకుంటుంది. దీనికి అనుగుణంగా మితిమీరిన స్వోత్కర్ష ఉంటుంది. ఇతరులకు తనొక స్థాయిలో కనపడేటందుకు, ఏలాగైనా తన హోదా, అంతస్థు చూపించటం కోసం ఇతరుల ముందు విన్యాసాలు చేయిస్తుంది. ఉపకారాలు, సహాయం చేస్తూ వారిని ప్రభావితులను చేస్తుంది. అదుపు చేస్తూ అధికారం చెలాయిస్తుంది. తాను ఉన్నతస్థాయి సాధకుడుగా ఉన్నత విజ్ఞానం, నిగూఢశక్తులు ఉన్నవాడుగా నాటకం ఆడుతుంది. ఉన్నత ప్రాణికం తనకున్న

శక్తియుక్తులను దైవశక్తికి అర్పించి, తాను కేవలం శ్రీమాత ఉప కరణంగా మాత్రమే, ఆమె దర్శకత్వంలో వ్యవహరిస్తూ ఉండాలి. అలాకాక, అహం తన హక్కుగా, తన పనికి, శ్రీమాతకు మధ్య, అలాగే ఆమెకి సాధకులకు మధ్య కలుగచేసుకుంటే తమ సహజ శక్తి, ఏమైనప్పటికీ, అది సత్యమార్గ వ్యతిక్రమణంతో, ఆసురికశక్తులకు స్థానం కల్పించి, పాడుచేసినదే అవుతుంది. సహకరిస్తున్నామనుకుంటూనే హాని కలుగచేస్తుంది. తక్కువస్థాయిలో ఈ స్వాతిశయం, పొగరులాటి లోపాలు, రాజసికమైన హింస మానవ ప్రకృతిలో ఉంటాయి. ఇతర రూపాలలో ఇవి కనిపిస్తూ ఉంటాయి. విజమైన ఆధ్యాత్మిక పరిణామానికివి అవరోధాలు.

2) అవిధేయత, క్రమశిక్షణ లోపం:

ఈ నిమ్నసత్వము ఎప్పుడూ క్రమశిక్షణారాహిత్యంతో, చపలచిత్తంతో, తన హక్కు కోసం పోరాడేదిగా, ఇతరుల ఆజ్ఞను లక్ష్యపెట్టకుండా, తన భావాలకి విరుద్ధంగా ఉన్నవాటికి అవిధేయంగా ఉంటుంది. మొదటి నుంచీ దీని లోపాలు, ఉన్నతప్రాణిక స్వభావమైన నూతనోత్సాహానికి, అది ఉద్దీపింపచేసే తపస్సుకి, అవరోధాలుగా ఉంటాయి. అవిధేయత, క్రమశిక్షణ లేకపోవటం దీని నైజం. ఎంతో బలీయంగా కూడా ఉంటుంది. అందుచేత అవరోధం ఉద్దేశ్యపూర్వకంగా కాకుండా, అంతఃప్రేరితంగా వెన్వెంటనే ప్రబలంగా ఉంటుంది. శ్రీమాతపట్ల విధేయాన్ని బహిరంగంగా పునశ్చరణ చేస్తుంది. కాని ఆచరణలో తద్విరుద్ధంగా ఉంటుంది. క్రమశిక్షణారాహిత్యం సాధనకు మౌలికమైన అవరోధం. ఇతరులకిది పనికిమాలిన ఆదర్శం. (the worst possible example for others)

3 కపట వర్తనము – అబద్ధాలాడటం:

చాలా హాని కలిగించే నిమ్నస్వభావలక్షణాలు ఇవి. ఋజు ప్రవర్తన లేనివాళ్లు శ్రీమాత సహకారలబ్ధిని పొందలేరు. తమకు తామే దానిని వదులుకుంటారు. వీళ్లు మారకపోతే నిమ్నప్రాణిక భౌతికాలలోనికి అతిమానస సత్యకాంతి అవరోహణ ఆశించలేరు. వారే సృష్టించుకున్న మురికికూపం లోనికి దిగపడిపోతారు.

ముందుకు పోలేరు. ఇది అతిశయోక్తి కాదు, అసత్య ఊహాగా నమూ కాదు. సత్యమును వికృతపర్చటం, అబద్ధాలతో నిజాన్ని కప్పిపుచ్చటం – ఇవి తమ అవిధేయతను, తప్పుడు పనులు పైకి రాకుండా చేయటానికే. ఇంకా తమ హోదాను నిలుపుకోవడం కోసం. ఇతరులను తన వైపుకి త్రిప్పుకోవటం కోసం. తన అల వాట్లకు, కోర్కెలకు అనుకూలంగా మరల్చుకోవటం కోసం. సాధా రణంగా ఈ రకమైన ప్రాణిక అలవాట్లు ఉన్నవాడు తన చైత న్యాన్ని మసకపర్చుకుంటాడు. తన మాటల్లో. చేతలలో పొరపాట్లు తెలుసుకోలేడు.

4) ఎప్పుడూ తనను తానే సమర్థించుకునే ప్రమాదకరమైన అల వాటు:

సాధకునిలో ఇది బలీయంగా ఉన్నప్పుడు సక్రమ చైతన్యం వైపు మరలటం తనకి అసాధ్యమే. ఎంతసేపూ అడుగడుగునా తన్ను తాను సమర్థించుకుంటూ ఉండటంతోనే సరిపోతుంది. మనసెంత సేపూ చేసిన పనులను సమర్థించుకోవటానికి, హోదా నిలబెట్టుకోవటానికే సరిపోతుంది. ఇందుకు ఎలాటి వికృత తెలి వితక్కువవాదానికైనా దిగుతాడు. ఎంత దూరమైనా పోతాడు. ఈ మనస్తత్వమే కనుక ఇలాగే కొనసాగితే మాత్రం సత్యచేతన దర్శనం, దివ్యజీవనం అసాధ్యమే.

దివ్యచైతన్య పరిణామం కోసం తన సత్వము యావత్తూ కూడా ఆమోదించాలి. ఎన్ని కష్టాలనైనా ఎదుర్కోవాలి. ఎంతకా లమైన వేచి ఉండాలి. ప్రక్రియ ఎంత బాధాకరమైనా ఓర్పుతో సహించాలి. ఉత్సాహవంతమైన దృక్పథం ఉండాలి. అందుకు తగిన కృషీ ఉండాలి. నీ సత్వములోని అన్ని భాగాలు ఈ లక్ష ణాలతో నిండి ఉన్నప్పుడు అవి సత్యచేతనకు ఉన్మీలనమై ఉంటాయి. కాని సాధకుడు స్వాతిశయంతో తామసికజడత్వంతో అంధుడై దివ్యకాంతికి వ్యతిరేకంగా ఉంటే ఎవరేమి చేయగలరు.

మూలం శ్రీఅరవిందులు:

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

మిక్కిలి ఆసక్తి గలిగినవారు, దైవంతో తాదాత్మ్యం చెందుటకై తమ అల్ప అహంకారాన్ని, దాని కోర్కెలను నశింపచేసికొనగల వారు – మాత్రమే ఈ యోగాన్ని చివరివరకు కొనసాగించగలుగుతారు. ఈ యోగప్రక్రియ చాల ఉన్నతమైనది. చాలా క్లిష్టమైనది. అంతే కాదు నిమ్నప్రకృతిలోని విరుద్ధ అసురశక్తులు ఏ కొద్ది పాటి అవకాశం, అనుమతి లభించినా, తాము ప్రయోజనం పొందడానికి సర్వదా సంసిద్ధంగా వుంటాయి. కనుక ఆకాంక్ష, తపస్సు నిరంతరాయంగాను, తీవ్రతరంగాను వుండాలి. యీ యోగం అలక్ష్యంవల్ల, అశ్రద్ధవల్ల సఫలీకృతం కానేరదు. మీరు ఆత్మవిశ్వాసం పేర మానవ మనోగత అభిప్రాయాలతో చిరచిరలాడినా, లేక మానవస్వభావం పేర నిమ్నసహజాతాలకు, నటనలకు లోనైనా యీ యోగం నెరవేరజాలదు. మీరు అజ్ఞానభూయిష్ఠములైన నిమ్న గుణాలను దైవసత్యముగా గుర్తించినా, యిది నెరవేరదు. మీరు మీ పాత జీవితాన్ని, మీ పాత శరీర, ప్రాణిక, మానసిక అలవాట్లను, రూపాలను విడువక పట్టుకొని వ్రేలాడుతుంటే దీన్ని మీరు తుదివరకు సాధించజాలరు. కనుక మీరు మీ పాతజీవిత విధానాలను వెనుకకు వదలివేసి, ఉన్నత, మరింత ఉన్నతస్థాయిలో నివసిస్తూ, సాధనను నిర్వహించవలసి వుంటుంది. మీరు మీ మానవ మానసిక, ప్రాణిక అహంకారాలకి స్వేచ్ఛను కోరితే దీనిని నెరవేర్చలేరు.

మీరు సాధారణ జీవితాన్ని కోరి కొనసాగిస్తున్నంత కాలం మీ యందలి అన్ని భాగాలు అపాయాన్ని కోరితెచ్చుకుంటూ వాటి యిష్టానుసారం ప్రవర్తించి తృప్తిపడడానికి తగిన అవకాశాన్ని కలిగి వుంటూంటాయి. ఈ యోగం ఆశయం సాధారణ జీవితానికి బదులు సత్యాన్ని గ్రహించి, దివ్యశక్తికి హృదయపూర్వక ఆత్మసమర్పణ గావించుకొనవలసి వుంటుంది. మీరు దీనిలో ప్రవేశించి, దీనితోబాటు సాధారణ జీవితస్వేచ్ఛను కూడా

కోరుతుంటే – ద్వంద్వజీవితబాటలలో అజ్ఞానశక్తులకు బానిసలై పోవలసి వస్తుంది సుమా!
ప్రతి ఒక్కరూ ఎన్నుకోవాలి:

తాము యీ యోగసాధకులమని బహిరంగంగా ప్రకటించుకొనువారు యీ యోగ ఆశయాన్ని తిరస్కరిస్తూ, వ్యతిరేకిస్తూ పరిహాసించే అజ్ఞానశక్తులకు కేంద్రాలుగా, పరికరాలుగా, లేక వాటి అధికార ప్రతినిధులుగా కొనసాగుతూ వుంటే, అట్టివారిచే యీ యోగం నిర్వహింపబడ జాలదు. ఒక వైపు అతిమానస దివ్యశక్తి జడచేతనలోను, భౌతికజీవితం నందును అతిమానస సాక్షాత్కార అవతరణకై అన్ని వ్యతిరేకతలను అధిగమిస్తూ ఒత్తిడి తెస్తూ అవతరిస్తున్నది. ఈ అతిమానస దివ్యశక్తి పృథ్విపై యిప్పటి వరకు సాక్షాత్కరించిన ఎలాంటి శక్తికన్నను ఎంతో ఎంతో గొప్ప దివ్యసత్యశక్తి. ఇంతవరకు మానవమేధ కనుగొన్న ఎన్నో సత్యాలకిది అతీతం.

మరోవైపు నిమ్నప్రాణికస్వభావం తన కపటంతో, పొగరుతో, అజ్ఞానంతో, అస్పష్టతతో, మందబుద్ధితో అనర్హమైన మొరటు స్వభావంతో తన ఉనికిని పొడిగించుకొనుటకై నిలిచి వేచి వుంటున్నది. అది ఊర్ధ్వలోకం నుండి అవతరిస్తున్న దివ్యశక్తికి వ్యతిరేకంగా నిలుచున్నది. అది సత్యాన్ని, అతిమానస సృష్టిని, అతిమానస చేతనను విశ్వసించక ఆటంకంగా నిలుచున్నది. అది తన అల్ప ప్రమాణాలను అనుసరిస్తూ, దైవసమక్షాన్ని తిరస్కరిస్తూ, తన భావాలను, నిర్ణయాలను, కోర్కెలను, సహజాతాలను సమర్థిస్తూ నిలుచున్నది. తన యీ స్వభావాలు వ్యతిరేకించబడితే, నీచపు పలుకులతో దానిపైకి గట్టిగా యెగబడుతుంది. ప్రస్తుతం ప్రతివారు ఈ రెండింటిలో ఒకదానిని ఎన్నుకోవాలి.

దివ్యచేతన అవతరణకు ఆటంకంగా వుంటున్న యీ వ్యతిరేకశక్తి చిరకాలం నిలువజాలదు. చివరకు ప్రతి ఒక్కరు సత్యం వైపునకుగానీ, లేదా వ్యతిరేకమైనదాని వైపునకుగాని రాకతప్పదు. అతిమానస ఆవిర్భావం నిమ్న అజ్ఞానంతో సహజీవనం చేయజా

లదు. విభిన్నములైన రెండు స్వభావాలతో కలసి వుండటం పొస గనే పొసగదు.

భౌతికస్వభావానికి ఉన్న ఇబ్బందులు:

ప్రాణిక, మానసిక సత్త్వాల సుదీర్ఘ సన్నాహాల తర్వాత భౌతికప్రకృతిని కూడ ఉన్మీలనము కావింపవలసిన సమయం ఆసన్నమవుతుంది. అది సంభవించినపుడు తన భూమికలో ఉన్నతస్థితిలో ఉంటున్న ప్రాణికస్థాయి పడిపోతుంది. అస్పష్టంగా ఉంటున్న స్థూలపదార్థచేతన, తమస్సు ప్రత్యక్షమవుతుంది. స్తబ్ధత, తమస్సు, సంకుచితత్వం, ఆధ్యాత్మిక అనుభవాల విస్మృతి – ఇవన్నీ భౌతికచేతనయొక్క లక్షణాలు. ఇవన్నీ నీలో తాత్కాలి కంగా సంభవించినవిగా గోచరిస్తాయి. వీటిని బైటికి పారద్రోల టానికని ప్రాణికం తిరుగుబాటు ద్వారా భౌతికచేతనను ఉద్రేక పరచకూడదు. నీ పరిస్థితులకు శ్రీమాతను నిందించడం తగదు. ఆ పద్ధతులు పరిస్థితిని మరింతగా దిగజారుస్తుంది. తమస్సును, స్తబ్ధతను పెంచుతుంది. కాని విశ్వప్రకృతి మూలం (an element of the universal Nature) మీలో ప్రతిబింబిస్తున్నదని మీరు గుర్తించి దానిని తొలగించాలి.

ఈ పని మరింతగా ఆత్మసమర్పణ చేసికొనుట ద్వారాను, ఆకాంక్ష ద్వారాను, ప్రాణిక, మానసిక భూమికలకు ఆవలనున్న యీ దివ్యశాంతిని, వెలుగును, శక్తిని కొనితెచ్చుట ద్వారాను సాధ్యపడుతుంది. భౌతికప్రకృతి రూపాంతరీకరణకు ఇదొక్కటే మార్గం.

ప్రాణికసత్త్వకుఇతర సత్త్వలతో పరస్పర సంయోగమునకు అవకాశం లేదు – తగదు:

ఈ యోగం యొక్క సమగ్ర సిద్ధాంతం దైవానికి సంపూర్ణ ఆత్మసమర్పణ చేసికొనుట. ఆ సమర్పణ దైవానికొక్కనికే తప్ప మరెవ్వరికిగాని లేదా మరి దేనికిగాని కారాదు. అలాంటి సంపూర్ణ సమర్పణం ద్వారా దివ్యజననితో ఐక్యత వలన ఆమె వెలుగును, శక్తిని, శాంతిని, సత్యచేతనను అతిమానస దివ్యచేతనయొక్క ఆనందాన్ని మన లోకానికి కొనితేవాలి. కనుక ఈ యోగంలో

ప్రాణికసంబంధాలకు, ఇతరులతో పరస్పర ప్రాణిక కలయికలకు స్థానం లేదు. అలాంటి సంబంధం లేదా కలయికలు ఆత్మను నిమ్నచేతనకు, దాని ప్రకృతికి కట్టివేయును. అంతేగాక అది దైవంతో సమగ్ర ఐక్యతకు ఆటంకం కలిగించును. ఇంకను అది అతిమానససత్యచేతన ఆరోహణను, అతిమానస ఈశ్వరీశక్తియొక్క అవతరణను అడ్డగించును. లైంగికసంయోగం యింకను అధ్వాన్నమైనదిగా పరిణమించును. కనుక ప్రాణికసంయోగములు నిషేధించబడినవి. అలాంటి భౌతికకార్యాలు సూక్ష్మరూపంలో కూడా తిరస్కరింపబడినవి. అతిమానస దివ్యచేతనతో ఒక్కటైపోయిన తర్వాతనే మనం ఇతరులలోని దైవంతో సత్య ఆధ్యాత్మిక సంబంధాలను నెలకొల్పుకొనగలుగుదుము. అట్టి ఉన్నత దివ్యతాదాత్మ్యంలో స్థూలపదార్థ నిమ్నప్రాణిక చలనాలకు తావుండబోదు.

లైంగికప్రేరణను అధిగమించుట ద్వారా, లైంగికకేంద్రంపై ఆధిపత్యం వహించటం వలన ఆ రేతస్సు ఓజస్సుగా మారి దేహానికి ఆధారభూతంగా శక్తిగా తోడ్పడును. లైంగిక కోర్కెను సాధనలో భాగంగా అంగీకరించడంకన్న ప్రమాదకరమైనది మరేదీ వుండబోదు. అలాంటి లైంగికతృష్ణ, లైంగికసంయోగము, ఆధ్యాత్మికభూమిక నుండి పతనం చేసి అతిమానస అవతరణను అడ్డగించే అసురశక్తులను క్రిందికి కొనితెచ్చి, వాటి మధ్యలో సాధకుని పడద్రోసి ఉపద్రవానికి దోహదకారి కాగలదు. సత్యాన్ని క్రిందికి కొనితెచ్చి, దాని కార్యం కొనసాగించవలెనంటే ఆసురీ శక్తుల వైపు మరలే యత్నాన్ని విరమించి వాటిని తొలగించాలి.

అతిమానసజీవితం కోర్కెలను ఉత్కృష్టపరచుకొని తృప్తిపర్చుకోవటం కాదు

అతిమానసజీవితం అంటే శారీర, మానసిక కోర్కెలను ఉత్కృష్టపర్చుకుని సంతృప్తిపొందటం అన్న ఆలోచనను తొలగించుకోండి. మానవస్వభావంలోని పశువును మహిమాన్వితం కావించడం, ఉన్నతభూమికల నుండి అవతరిస్తున్న సత్యానికి యెంతో ఆటంకమవుతుంది. దానికి మించిన ఆటంకం మరొకటుండదు. అతిమానసస్థాయి, తన అభిప్రాయాలను, తన పూర్వా

లోచనలను సమ్మతితో స్థిరపరచేదిగా వుండాలని మనస్సు అభి లషిస్తుంది. ప్రాణికము తన కోర్కెలను అది ఉన్నతంగా తీర్చే దిగా వుండాలని వాంఛిస్తుంది. ఇక దేహం తన సుఖాలను, విలా సాలను, అలవాట్లను అది పొడిగిస్తూపోవాలని కోరుకొంటుంది. పరిస్థితి అలా, వాటి కోరికల మేరకే కొనసాగితే అది మానవ ప్రకృతిలో పశుస్వభావం వృద్ధి చేసేదే అవుతుంది. అంతే తప్ప, అది మానవుని దైవత్వానికి రూపాంతరీకరించటం మాత్రం కానే రదు.

మూలం: శ్రీఅరవిందులు
భావానువాదం: బి. నరసింహయ్య

పరీక్షకులు

పూర్ణయోగం ఎడతెరపిలేని పరీక్షలతో కూడుకున్నది. ముందు హెచ్చరిక లేకుండా వచ్చిపడతాయి. నీ వెప్పుడూ జాగరూకుడవై మెలకువగానే ఉండాలి.

మూడు రకాలైన పరీక్షకుల బృందం పరీక్షలు పెడతారు. వాళ్లు ఒకళ్ల కొకళ్లు ఏం సంబంధం లేకుండా ఉన్నట్లుంటారు. చూడటానికి వాళ్ల పద్ధతులు వేర్వేరుగా ఉంటాయి. ఒకే లక్ష్యాన్ని చేరుకునేవిగా కాకుండా కూడా ఉంటాయి. అయినా కూడా ఒక దానికొకటి పరస్పరపూరకాలుగా, ఒకే లక్ష్యసాధనకు పనిచే స్తాయి. సమగ్రఫలితానికవి అత్యావశ్యకంగా ఉంటాయి.

పరీక్షలు మూడు రకాలు – ప్రకృతిశక్తులచే నిర్దిష్టమైనవి, ఆధ్యాత్మికశక్తులచే నిర్దిష్టమైనవి, మరియు, ప్రతికూలశక్తులచే నిర్దిష్టమైనవి. ఈ చివరివి చాలా మోసపూరితమైనవిగా కనిపి స్తాయి. పట్టుకు దొరకవు. వీటిచేత పట్టుబడకుండా ఉండటం కోసం ఎప్పుడూ మెలకువగా ఉండాలి. చిత్తశుద్ధితో ఉండాలి. నమ్రతతో ఉండాలి.

అతిసాధారణమైన పరిస్థితులు, జీవితంలో జరిగే నిత్యాసం ఘటనలు, అప్రధానంగా అగుపించే వ్యక్తులు, విషయాలు ఈ

మూడు రకాలైన పరీక్షకులుగా ఏదో ఒక వర్గానికి చెందినవారుగా ఉంటారు. ఈ విశాల సూక్ష్మ సంకీర్ణ పరీక్షావ్యవస్థలో జీవితంలో అత్యంత ప్రముఖమనుకునే సంఘటనలకు సంబంధించిన పరీక్షలు అత్యంత సులభంగాను, సహించేవిగానే ఉంటాయి. ఎందుకంటే అందుకు నీవు ముందే జాగరూకత వహించి సంసిద్ధంగా ఉంటావు. జీవనమార్గంలో చిన్నచిన్న సంఘటనలకు సంబంధించిన విషయాలలోనే బోర్లాపడతాం. ఎంతకంటే అవి మన దృష్టికి రావు.

సహనశక్తి, మృదుత్వం, ఉత్సాహం, నిర్భయం – ఈ లక్షణాలు భౌతికస్వభావానికి సంబంధించిన పరీక్షలు ఎదుర్కొనటానికి అవసరం అవుతాయి.

ఆకాంక్ష, నమ్మకం, ఆదర్శం, గట్టిపట్టుదల, ఉదారమైన ఆత్మార్పణ – ఆధ్యాత్మిక పరీక్షలు ఎదుర్కొనటానికి కావాలి.

జాగరూకత, చిత్తశుద్ధి, అణకువ – ఈ లక్షణాలు ప్రతికూలశక్తుల నెదుర్కొనే పరీక్షలకు అవసరం.

పరీక్షలు పెట్టేవారు, వాటి నెదుర్కొనేవారు వేర్వేరుగా ఉంటారనుకోకు. పరిస్థితులను బట్టి మనమంతా పరీక్షకులము, పరీక్షల నెదుర్కొనేవారమే, అయి ఉంటాము. ఒక్కొక్కప్పుడు ఏకకాలంలో ఇది సంభవిస్తుంది. వీటివల్ల పొందే లబ్ధి, గుణశ్రేష్ఠత, పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ఆకాంక్ష తీవ్రతను బట్టి ఉంటుంది. చైతన్యమేలకువను బట్టి ఉంటుంది.

ముగించే ముందు ఓ చిన్న సలహా. ఎప్పుడూ నువ్వు పరీక్షకుడుగా ఉండకు. ఎప్పుడూ ముఖ్యమై పరీక్షను ఎదుర్కొంటునే ఉన్నాననే స్పృహ మంచిది. కాని ఇతరులకు పరీక్ష పెట్టే బాధ్యత నేనే వహిస్తున్నానని అనుకోవటం మాత్రం చాల ప్రమాదకరమైనది. ఇది అత్యంత హాస్యాస్పదమైన, హానికరమైన ఆడంబరం. వీటి నన్నిటినీ నిర్ణయించేది అత్యున్నత దివ్యజ్ఞానం (the Supreme Wisdom) అంతేకాని అజ్ఞానంతో కూడిన మానవేచ్ఛ కాదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నీ జాగ్రత్తలో నీ వుండు

సత్యం ముసుగులో వచ్చే సూచనలు

ఈ మధ్యకాలంలో సాధన ప్రథమదశలో నీవు అత్యవసరంగా గుర్తుపెట్టుకోవలసిన మూడు ముఖ్య విషయాలున్నాయి. అనుభవం పొందడానికెప్పుడూ సిద్ధంగా ఉండాలి. అంతేగాని పొందిన ఆనందానుభూతిని అనుభవిస్తూ ఉండవద్దు. ఏ విధమైన ప్రత్యేక అనుభవానికీ అంటిపెట్టుకుని ఉండకు. అన్ని అనుభవాలు, సూచనలూ సత్యమైనవిగా స్వీకరించకు. ఏ విజ్ఞానంగాని, స్వరం లేదా ఆలోచనారూప సందేశాన్నిగాని, అదే ఆఖరిదిగా భావించకు. సత్యం కూడా సంపూర్ణమైనపుడే సత్యమౌతుంది. సాధకుడు మరో ఉన్నత ఆధ్యాత్మిక అంతస్తులోని కెదిగినప్పుడల్లా, సత్యంయొక్క అర్థం మారుతూంటుంది.

ఈ యోగంలో సాధకులందరిపైన దాడిచేసే ప్రతికూల శక్తుల సూచనల బారిన పడకుండా నిన్ను నీవు సురక్షితంగా వుంచుకోవాలి. వాటి సూక్ష్మతర సూచనలు సత్యముగా కనపరుస్తాయి. బాహాటంగా చేసే దాడులకన్నా ఇవి మరింత ప్రమాదం కలుగచేసేవి. కాని సత్యంయొక్క రూపం ధరించి జరుగవు. మామూలుగా, అలా సత్యం రూపం ధరించి వచ్చే సూచనలు కొన్నింటిని నేను వివరిస్తాను.

ఈ అహంకారాన్ని అతిశయింపజేస్తూ ఏ సూచన వచ్చినా దాన్ని గురించి జాగ్రత్తపడు. ఉదా: ఇతరులకంటె నీవో గొప్ప సాధకుడివి, లేదా నీ సాధన చాలా ప్రత్యేకమైనది. లేదా ఎవరూ చేయలేనంత గొప్ప సాధన నీది అనే సూచనలు. ఇప్పటికే నీకు ఇటువంటి సూచనలు కొన్ని అందివున్నట్లు కన్పిస్తోంది. నీకు చైత్య అనుభవాలు సమృద్ధిగా కలిగాయి. ఆ అనుభవాల అభివృద్ధి కూడా వేగంగా జరిగింది. ఖచ్చితంగా అవే అనుభవాలు ఇచట ధ్యానించిన ఇతరులు కొంతమందికి కూడా కలిగాయి. నీకు కలిగిన అనుభవాల్లో ఏదీ కూడా నీకే ప్రత్యేకమైనది గాదు. లేదా ప్రత్యేక శ్రేణికి సంబంధించినదీ గాదు. లేదా ఇతరుల అనుభవా

నికి రానివీ కాదు. అలా కాని మరోవిధమైనదైనప్పటికీ, అది నీకే కలిగినదనే అహంకారం సాధనకు అత్యంత ప్రమాదకారి. ఆధ్యాత్మికంగా ఏ విధంగానూ సమర్ధనీయం కాదు. ఎంత గొప్ప ఆధిక్యమైనా భగవంతునికే చెందుతుంది. వెరేవ్వరికీ కాదు.

ఏ విధమైన మాలిన్యాన్నీ, అపరిపూర్ణతనూ అంటిపెట్టుకుని ఉండకు. మనస్సులో గందరగోళస్థితినీ, హృదయంలో attachment రాగంగాని, ప్రాణికంలో కోరిక, ఆవేశం లేదా దేహంలో రుగ్మతలకు తావివ్వకుండా, లేదా అంటిపెట్టుకొనని చ్చే సూచనలకు వ్యతిరేకంగా నిన్ను నీవు కాపాడుకో. యుక్తియుక్తమైన సమర్ధనలు, సాకులు చూపి అపరిశుద్ధతను నీవు విడువకుండా చేయాలని ప్రతికూలశక్తులు ప్రయోగించే సాధనాలు ఇవి.

దైవశక్తులు, ఈ ఆసురికశక్తులు ఒకటేనని అంగీకరింపజేసే ఎటువంటి భావానికైనా లోనుగాకుండా నిన్ను నీవు రక్షించుకో. సర్వం భగవంతుని అభివ్యక్తే గనుక, సమస్తాన్నీ అంగీకరించవచ్చు అని నీవన్నట్లుగా నా కర్థమైంది. ఓ రకంగా సమస్తమూ భగవదభివ్యక్తీకరణే కాని దాన్ని అపార్ధం చేసుకొంటే, తరచుగా జరిగేదిదే. ఈ వేదాంత సత్యాన్ని అనృతత్వపు కార్యాలకుపయోగించడం జరుగుతుంది.

నీవు యదార్థంగా నేను చెప్పేవి అంగీకరించి, నిన్ను నాకు సమర్పించుకుంటే నేను చెప్పే సత్యాన్ని అంగీకరించి తీరాలి. అజ్ఞానాన్ని, అనృతాన్ని తిరస్కరించి, జ్ఞానం వైపు, అంధకారాన్ని తిరస్కరించి వెలుగువైపు, అహంకారాన్ని తిరస్కరించి దివ్యాత్మ వైపు, అపరిపూర్ణతలను తిరస్కరించి పరిపూర్ణతవైపు ఉద్యమించేదే నా సత్యము. నా సత్యం భక్తి సత్యం (the truth of Bhakti) మాత్రమే గాదు, లేదా చైత్యాభివృద్ధికి సంబంధించినది మాత్రమే గాక, జ్ఞానం, పరిశుద్ధత, దివ్యశక్తి, ప్రశాంతి, వీటన్నింటినీ వాటి వాటి మానసిక, భావోద్వేగ, ప్రాణికరూపాల నుండి, వాటి వాటి అతిమానస యదార్థతలలోనికి ఉద్ధరించేవి.

*

మనం క్రిందికి తీసుకురావాలని ప్రయత్నిస్తున్న దైవచేతన, దివ్య సత్యచేతన. అది, మనస్సు, జీవితం, దేహాలకు సంబంధించిన సమస్త స్తరాలలోని మన అస్తిత్వం, వాటి తాలూకు సమస్త సత్వాన్నీ, స్వభావాన్నీ మనకు స్పష్టంగా చూపుతుంది. అది వాటిని దూరంగా విసిరికొట్టదు. వాటిని వెంటనే వదిలించుకోవాలని, వాటి స్థానంలో, అసహజమైన అద్భుతాన్ని ప్రతిష్ఠించాలని అసహనంతో ప్రయత్నించదు. వాటిలో పరిపూర్ణస్థాయికి లేవనెత్తగలిగిన దాన్నంతా ఉద్ధరించడానికి, అస్పష్టంగా, అపరిపూర్ణంగా ఉన్నదాన్నంతా మార్చడానికి ఆ దివ్యసత్యచేతన ఓర్పుతో నెమ్మదిగా వాటిపై పనిచేస్తుంది.

ఒక్క క్షణంలో దైవంగా మారిపోవడం సాధ్యమేనని నీవూహించడం మొదటి తప్పు. ఉన్నతచేతన నీ లోనికి అవరోహించి అచట ఉండిపోతే మొత్తం పని అయిపోయినట్లే అని నీ వూహిస్తున్నావు. ఎంతో సమయంగానీ, సుదీర్ఘ కఠిన లేదా నియమనిష్ఠల కృషిగానీ అవసరం లేదని నీవూహిస్తున్నావు. భగవత్కృప వల్ల నీ క్కావలసినదంతా ఒక్క క్షణంలో జరిగిపోతుందనీ నీవూహిస్తున్నావు. ఇది చాలా తప్పు. అలా ఎప్పుడూ జరగదు. ఈ విధమైన అపసవ్యమైన ఆలోచనలో నీవున్నంత కాలం, శాశ్వతమైన దైవీకరణం జరగనే జరగదు. పైగా లోనికి ప్రవేశించాలని ప్రయత్నిస్తున్న పరమసత్యాన్ని నీవు అస్తవ్యస్తం చేసినట్లవుతుంది. అంతేగాక నీ మనస్సును, దేహాన్ని నిష్ప్రయోజన సంఘర్షణకు గురిచేసినట్లవుతుంది.

ఒకానొక శక్తి, సన్నిధి నీ కనుభూతమౌతున్నది గనుక, దైవంగా అయిపోయినట్లు, ఇపుడే భావించడం నీవు చేస్తున్న రెండో తప్పు. దైవంగా తయారుగావడం అంత తేలిగ్గాదు. ఏ విధమైన శక్తి, లేక సన్నిధి లభించినా దానితోపాటు సరైన వివరణ, ప్రతిస్పందన, మనస్సులో సరైన జ్ఞానం, ప్రాణిక భౌతిక అస్తిత్వంలో సరైన సన్నద్ధత కూడా చోటుచేసుకుంటాయి. కాని ఓరిమి లేక నీ కామనలు పెట్టే తొందరవల్ల అసామాన్య ప్రాణిక శక్తిని ఆపాదించుకొంటున్నావు. ఆ ఉన్నత స్థాయిని మాత్రమే

నీవు గ్రహిస్తున్నావు. అందువల్ల ఆ కోరికల నుండి సూచనలు పుట్టుకొస్తున్నాయి. ఈ సూచనలనే నీవు సత్యమనీ, అంతఃప్రేరణలనీ, అంతఃస్ఫూర్తి అనీ పొరపడుతున్నావు.

ఇటువంటి స్థితిలో నీవు చేసే పొరపాట్లను కొన్నింటిని ఎత్తి చూపిస్తాను. ఇలా ముందు నానుంచి ఎటువంటి ఉపదేశాలు, లేక మార్గదర్శకత్వం అవసరం లేదనే భావన మొదలవుతుంది. కారణం అప్పట్నించీ నీవు నాతో ఒకటైనట్లు ఊహిస్తావు....

"నన్ను నీవలె చేశావు" అని నీవనడంలో ఉన్న ఉద్దేశ్యమేమిటి? ఆ మాటల కర్థం లేదు. నేను సరిగ్గా మీ వ్యక్తిత్వాన్నే సంతరించుకున్నానని అనలేవు కదా! ఎందుకంటే ఇద్దరు అరవిందులుండడం అసంభవం. ఒకవేళ సాధ్యమైనా, అది అసంబద్ధం, నిష్ప్రయోజనం. నీవు పరాత్పరునివై పోయినట్లు భావించకు. ఎందుకంటే నీవు భగవంతుడివి, లేదా ఈశ్వరుడివి కాలేవు. సాధారణార్థంలో (వేదాంత పరిభాషలో) అయితే, ప్రతి జీవుడూ ఏకైకుని అంశయే గనుక ప్రతివ్యక్తీ నేనే అవుతాను. బహుశా కొంతకాలం ఈ ఏకత్వాన్ని గ్రహించి వుంటావు. కాని ఆ చైతన్యం, ఆ గ్రహింపు మాత్రమే నిన్ను దైవంగా రూపాంతరీకరించటానికి సరిపోవు.

*

మితిమీరిన భౌతికనియమనిష్ఠలవల్ల దాపురించే ప్రమాదాలు

మనం ఆకాంక్షించే రూపాంతరీకరణ చాలా విశాలమైనది, ఒక్కసారిగా జరిగిపోవడానికి సాధ్యం కానంత సంక్లిష్టమైనది. దాన్ని దశలవారీగా జరుగనివ్వాలి. ఈ దశ లన్నింటికీ చివరి దశ భౌతిక పరివర్తనం. అది కూడా ఒక క్రమపురోభివృద్ధితో కూడిన ప్రక్రియ.

భౌతికవిధానాల ద్వారా – అవి అనుకూలమైనవైనా, ప్రతికూలమైనవైనా – ఆంతరికరూపాంతరీకరణం సాధించలేం. తద్విరుద్ధంగా, దేహజీవకణాల లోనికి మహోన్నతమైన అతిమానస చేతన అవతరణ ద్వారానే భౌతికపరివర్తన సాధ్యం అవుతుంది.

(మరో విధంగా కాదు) అప్పటి వరకూ దేహాన్ని, దానికాధారభూతమైన శక్తులను సాధారణ ఆలంబనల ద్వారా అంటే ఆహారం, నిద్ర వైగైరాల్లాంటి వాటి ద్వారా కొంతవరకైనా దేహాన్ని పోషిస్తుండాలి. ఆహారాన్ని సరైన ధోరణిలో, సరైన చేతనతో స్వీకరించాలి. నిద్రను క్రమంగా యోగప్రశాంతతగా రూపాంతరం చెందించాలి. దేహవ్యవస్థయొక్క వివిధ భాగాలలో గందరగోళాన్ని, శక్తుల అసామాన్య హెచ్చుతగ్గులను కలిగించే అపరిపక్వ అత్యధిక భౌతికనిష్ఠ, తపస్సు, సాధనా ప్రక్రియకి హాని కలిగించవచ్చు. మానసిక, ప్రాణిక భాగాలలోని గొప్ప శక్తి పొంగిపొరలవచ్చు. కాని నాడీతంత్రులు, దేహం, అందువల్ల అధిక వత్తిడికిలోనై, ఈ ఉన్నతశక్తుల ఖేలనానికి ఆధారంగా నిలువగల సత్తువని కోల్పోతాయి.

అపుడపుడూ ఒకటి రెండు రోజులపాటు ఉపవాసం ఉండడంలోగాని, స్వీకరించే ఆహారాన్ని బాగా తగ్గించి తగినంత మాత్రంగా తీసుకోవడంలోగాని దోషం లేదు. కాని సుదీర్ఘకాలం పాటు ఆహారాన్ని పూర్తిగా మానివేయడం మాత్రం మంచిది గాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కోనేరు వెంకటేశ్వరరావు

జాగరూకుడై వుండాలి

మనం సత్తలో అంతగా ప్రాధాన్యతలేని భాగంలోనే సచేతనులమై ఉన్నాము. చాలా భాగం తెలియకుండా మనకు అచేతనంగా వుండిపోతున్నది. ఈ అచేతనమే మన స్వభావాన్ని మార్చుకొని ఉన్నతంగా తీర్చిదిద్దుకొనకుండా మనల్ని అధమస్థితికే పరిమితం చేస్తున్నది. ఈ అచేతనం ద్వారానే ఆసురికశక్తులు మనలో చొరబడి మనల్ని తమ బానిసలుగా చేసుకుంటున్నవి. అందుకే నీవేమిటో తెలుసుకోవాలి. నీ స్వభావంపట్లా, నీలో జనించే స్పందనలపట్ల నీవు జాగరూకుడవై వుండాలి. నీవేమి చేస్తున్నావో, ఎలా చేస్తున్నావో, ఏ విధంగా అనుకుంటున్నావో, ఎలా ఆలోచిస్తున్నావో నీకు స్పష్టంగా తెలియాలి. నీలో పైకి కన్పిస్తున్న, కన్పిం

చకుండా నిన్ను పురికొల్పుతున్న, దాగివున్న ప్రేరణలను భావాలను, శక్తులను గురించిన ఎరుక నీకుండాలి. నీ సమస్త సత్త యొక్క యంత్రాంగంలోని భాగాలన్నింటినీ విడివిడిగా యథాతథంగా తెలుసుకొని వుండాలి. అలా నీవు చేయగలిగితే ఏ శక్తులు నిన్ను ప్రగతిపథాన సాగిపోయేందుకు సాయపడుతున్నదీ, అలాగే ఏ శక్తులు ముందుకు సాగకుండా నిలువరిస్తున్నదీ జల్లెడపట్టి తెలుసుకోగలగుతావు. అలా మంచివేవో – చెడువేవో; దివ్యమైనవేవో – ఆసురికమైనవేవో; సత్యమేదో – అసత్యమేదో నీ ఎరుకమేరకు తెలుసుకొని దేనిని తృణీకరించాలో, దేనిని అనుసరించాలో తెలుసుకొని సాగిపోగల్గుతావు. ఈ ద్వంద్వస్థితి అనేది నీ మార్గంలో అడుగడుగునా ఎదురవతూనే వుంటుంది. అందులో దేనిని ఎంచుకోవాలి అనేది ఇష్టం మీదనే ఆధారపడి వుంటుంది. నీవు చాలా ఓపిగ్గా వుండాలి. దృఢంగా, సాక్షీభూతంగా గమనించాలి. అందుకే పెద్దలంటూరు 'జాగరూకుడవై వుండు' అని దివ్య శక్తులను వ్యతిరేకించే అదివ్యశక్తులకు ఏమాత్రం అవకాశం ఇవ్వవద్దు.

నిజాయితీగా ఉండు:

యోగాన్ని దైవం కొరకు గాకుండా ఏవో శక్తులను సంపాదించాలన్న తృష్ణతో యోగమును ఒక సాకుగా వాడుకొనే వారికి అపాయాలు, విఘ్నాలు కలుగుతూనే వుంటాయి. అలాంటి కోరికలను త్రోసిపుచ్చలేనివారు యోగమార్గంలో ప్రవేశించకూడదు. అది అగ్నిలా కాల్చివేస్తుంది సుమా!

నీలో చిత్తశుద్ధి లేకపోతే, యోగమార్గంలో ప్రవేశించకు. నీవు సాధారణ జీవితంలో మోసం చేయగలవేమో, కానీ భగవంతునితో సంపర్కం పెట్టుకొని వ్యవహరిస్తే ఎప్పుడూ ఎక్కడా మోసానికి అవకాశమే లేదు. ఆ వెలుగుబాటలో నీవు సురక్షితంగా సాగిపోతావు – నీవు నిష్పాక్షికంగా అంతరంగానికే తెరుచుకొని, దైవసాధనే లక్ష్యంగా, దైవముచేతనే నిర్దేశింపబడుతూ ఉన్నప్పుడు.

మరో అపాయం కూడా వుంది. అది లైంగికప్రేరణలకు సంబంధించింది. యోగంలో నీవు పవిత్రంగా సాగిపోతున్నప్పుడు

నీలో దాగివున్న కోరికలు, ప్రేరణలు అన్నీ ఒక్కసారిగా బయట పడతాయి. అలాంటప్పుడు వాటిని దాచుకోవాలనో లేక వాటినొక మూలపడవేయాలనో ప్రయత్నించకుండా వాటిని నేర్పుగా ఎదు ర్కోవాలి. వాటిని జయించడమో లేక వాటి మార్గాన్ని మళ్ళించి పునర్వ్యవస్థీకరించడమో చేయాలి. యోగంలో మొదటి ఆటంకం ఏమిటంటే మనస్సుమీద అదుపును కోల్పోయినపుడు అంతవ రకు తెరల మాటున దాగివున్న తృష్ణలు ఒక్కసారిగా హఠాత్తుగా విజృంభించి, సత్తా మీద దాడిచేస్తాయి. ఈ మానసిక అదుపు స్థానంలో, దివ్యతత్వంయొక్క అదుపునెలకొనే సంధిదశలో నీ నిజాయితీ, సమర్పణలు అనేక పరీక్షలకు గురికావలసి వస్తుంది. ముఖ్యంగా ఈ దశలో లైంగికతృష్ణలు ప్రాధాన్యత వహించి సాధ కుని బలవంతంగా యోగం నుండి దృష్టిని మరల్చే ప్రయత్నం చేయడం జరుగుతుంది. నీవు ఎంతెంతగా వాటిని అదుపుచేయా లని ప్రయత్నించి 'నేను వాటికి తలవంచేది లేదు. నేను ఏ మాత్రం లొంగను' అని భీష్మించుకుంటావో అంతగా వాటికి లొంగిపోవడం జరుగుతుంది. అందువల్ల నీవు చేయాల్సిందేమి టంటే, ఆ సమయాలలో నీవు వాటిని గురించి అసలు పట్టించు కోకూడదు. ఆ ఆలోచనలను దరి చేరనీయకూడదు. వాటిని ఖాతరు చేయకూడదు. ఒకవేళ ఆ ఆలోచనలు చొరబడినా వాటికే మాత్రం ప్రాధాన్యత నీయకుండా అవి నిన్ను లోబరుచుకోకుండా వాటిపట్ల నిర్లిప్తంగా వుండాలి.

పట్టించుకోకు – సమర్పించుకో:

యోగంయొక్క వత్తిడివల్ల బయటపడిన ప్రేరణలు మరియు కోరికలను నిర్లిప్తంగా, ప్రశాంతంగా ఎదుర్కోవాలి. అవి నీవి కావు. బయటి ప్రపంచానికి చెందినవన్నట్లుగా ఉండడం అలవర్చుకో వాలి. వాటిని దైవానికే సమర్పించుకుంటే దైవం వాటిని చేపట్టి రూపాంతరం చెందిస్తుంది.

ఒక్కసారి నీవు దైవానికి ఉన్ముఖుడవైనా, దైవశక్తి నీలోకి ప్రవేశించాక కూడా పాతశక్తులనే అంటిపెట్టుకున్నందువల్ల వచ్చే అపాయాలను, సంకటస్థితిని ఎదుర్కోక తప్పదు. అందుకే నీవె

పుడూ జాగరూకతతో మసలాలి. దైవం నీ సంతృప్తి కోసం, నీ కోరికల పరిపూర్తి కోసం సహాయపడాలని ఆశించకూడదు. తమంతట తాము అవి ముందుకు వస్తాయి. అవి తప్ప వేరే ఏవీ ఆశించని అవాంఛనీయశక్తులు ఎప్పుడూ కాచుకొని వుంటాయి. నీవు తిన్నగా నడవకుండా, తప్పటడుగులు వేయడం ప్రారంభిం చగానే – నీకు వాటి గురించి ఎంతో కొంత తెలిసినా, తగు మాత్రమైనా వాటిని ఎదుర్కొనగలశక్తి లేనపుడు – ఒక విధమైన నిమ్నజీవులు, శక్తుల చేతిలో నీవొక గ్రుడ్డి పరికరంగా మారిపో తావు. చివరికి కీలుబొమ్మగా మారి త్రోవ తప్పిపోతావు. ఎక్కడ నటన ఉంటుందో అక్కడ అపాయం కాచుకొని వుంటుంది. నీవు దైవాన్ని మోసగించలేవు. మనస్సులో 'నాకు శక్తులు కావాలి. వాటితో నేను ఆనందంగా వుండాలి' అనుకుంటూ పైకి మాత్రం 'నేను నీతో ఏకత్వాన్నే కోరుకుంటున్నాను' అని చెప్పాలనుకుం టున్నావా! జాగ్రత్త! నీవు తిన్నగా కొండచరియ అంచుకు చేరు కోబోతున్నావు. అయితే ఇంత అయినా రాబోయే అనర్థాన్నుంచి తప్పించుకోవచ్చు. పసిపాపలా మారిపో. శ్రీమాత చేతిలో ఒరిగిపో. ఆమె నిన్ను అక్కున చేర్చుకుంటుంది. ఇక ఏ అపాయమూ నీ దరి చేరదు. సరేనా!

నీలోని విభిన్న భాగాలన్నింటినీ ఏకం చేయి:

దీనర్థం నీవే ఇక్కట్లను ఎదుర్కోవాల్సిన పని లేదనీ, నీవే ఆటంకాలను ఎదుర్కోవలసిన అవసరం లేదనీ వాటిని జయిం చాల్సిన పని లేదనీ కాదు సుమా! సమర్పణ అనేది ఏ అవాంత రాలూ లేని, ఏ కంటకాలు లేని నిరంతర ప్రగతికి దోహదం చేస్తుందనే హామీ లేదు. దీనికి కారణం ఏమిటంటే నీ సమర్పణ సంపూర్ణం కాలేదింకా. అలాగే నీ సత్త ఇంకా (ఆమెతో) ఏకం కాలేదు. ఏదో ఒక భాగంలోనే నీవు సమర్థించుకోగలిగావు. ఈ రోజు కొంతభాగం మరొక రోజు మరికొంతభాగం (సమర్పితం) చేయగలవు. యోగంయొక్క ముఖ్య ఉద్దేశమే – నీలో చెల్లాచెదు రుగా చెదిరిపోయిన భాగాలన్నింటిని నెమ్మదిగానైనా సరే ఏకీ కృతం చేసి వాటినన్నింటినీ విడదీయరానంతగా ఒకటి చేయడం.

అందాకా నీవు కష్టాలనుండి బయటపడలేవు. కష్టాలంటే ఉదాహరణకి – అనుమానాలు, నిస్పృహ, తిరస్కారం. ప్రపంచమంతా విషపూరితమే. దానిని ప్రతి శ్వాసలోను లోనికి తీసుకుంటున్నావు. ఒక అవాంఛనీయ వ్యక్తితో ఒకింత సమయం మాటలు కలబోసుకున్నా, అంతెందుకు అలాంటి వ్యక్తి నీ ప్రక్కనుండి వెళ్లినా, అదొక అంటువ్యాధిగా నిన్ను పట్టుకుంటుంది. ప్లేగు వ్యాధి ప్రబలివున్న ప్రదేశాన్నుండి నీవు వెళ్లినా సరే, దాని విషాన్నుంచి నీవు బయటపడలేవు. అక్కడది వున్న సంగతి నీకు తెలియనక్కరలేదు. కొద్ది నిముషాలలోనే ఆ వ్యాధి నిన్ను పట్టుకొని పీడిస్తుంది. మళ్ళీ ఆరోగ్యవంతుడివి కావాలనంటే కొన్ని నెలలు పడుతుంది. నీవు సామాన్య మానవజాతికి చెంది వున్నా, సామాన్య మానవుడిగానే జీవిస్తున్నా, నీవు ప్రాపంచిక జీవులతో కలిసివుంటే ఆ సంగతి వేరు. కానీ నీవు దివ్యజీవితాన్ని వాంఛిస్తే నీవు కలుస్తున్న వ్యక్తుల పట్లా నీ పరిసరాల పట్లా చాలా జాగ్రత్తగా వుండాలి సుమా!

నీ సంకల్పం దృఢంగా వుండాలి. నీకు ఇంకా అదుపులోకి రాని, అవిధేయంగా (recalcitrant) ఉండే భాగాలను నీ మాట వినని చిన్నపిల్లలుగానే సముదాయించు. వాటిపట్ల ఎడతెగని సహనంతో వ్యవహరించు. వాటి తప్పులను అవి తెలుసుకొనేలా చెయ్యి.

నీ లోతులలో, దేవాలయంలోని దేవునిలా చైత్యపురుషుడున్నాడు. ఈ కేంద్రం చుట్టూ, నీలో చెల్లాచెదురుగా పడివున్న భాగాలన్నింటినీ, పరస్పర వ్యతిరేకతలతో సతమతమవుతున్న కదలిక లన్నింటినీ, కేంద్రీకరించు. ఒకసారి నీవు చైత్యసత్త చేతనలో ప్రవేశించి ఆ ఆకాంక్షతో మమేకం కాగలిగితే, నీ అనుమానాలు, నీ కష్టాలు అన్నీ పటాపంచలు అవుతాయి. అందుకు ఎంత సమయం పడుతుంది అనేది అప్రస్తుతం. అంతిమ విజయం మాత్రం సునిశ్చితం. ఒక్కసారి నీవు దైవం వైపుగా తిరిగి, 'నేను నీవాడిని కావాలి' అని చెప్పినపుడు ఆ దైవం 'తథాస్తు' అన్నప్పుడు ప్రపంచమంతా ఏకమైనా నిన్ను దైవాన్నుండి దూరం

చేయలేదు. కేంద్రసత్వం తనకు తాను సమర్పించుకున్నప్పుడు అసలు ఆటంకం తొలగిపోయినట్లే. బాహ్యసత్త అనేది చిట్లము కట్టిన పొర లాంటిది. సామాన్య ప్రజానీకంలో ఈ పొర ఎంత దళసరిగా ఉంటుందంటే అది వారిలోని దైవంయొక్క స్పృహను కూడా వారికి కలుగనీయదు. ఒక్కసారి క్షణకాలమైనా సరే కేంద్ర సత్వము నేనిక్కడ ఉన్నాను, నేను నీ వాడిని అన్న మరు క్షణం బాహ్యాంతరాల మధ్య వారధి నిర్మాణం జరిగి ఈ పొర అంతకంతకు పలుచనైపోతుంది. బాహ్యాంతరాలు రెండూ సంపూర్ణంగా ఏకమైపోతాయి. ఒకటౌతాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

ఏకైక మార్గం

యోగసాధనకి దగ్గర దారులు, సులభపద్ధతులు వుండవు:
ఈ యోగసాధన నిశ్చయంగా కష్టమైనదే. కానీ ఏ యోగం మాత్రం సులభం?

ముక్తి సాధించి అతీత విశ్వచైతన్యం చేరుకోవాలనే ప్రలోభం గురించి మీరు మాట్లాడుతున్నారు. కాని ఎంతమంది యీ నిర్వాణపథంలో బయలుదేరినవాళ్ళు యీ జీవితంలోనే దానిని చేరుకున్నారు? సుదీర్ఘమైన కఠిన ప్రరిశ్రమ, కష్టం లేకుండా ఫలితాన్ని పొందారు? శుష్క ఎడారిమార్గాలలో పోకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరే మార్గాలేవైనా వున్నాయా? అత్యంత సులభమని అనుకునే భక్తిమార్గం కూడా అనేక ప్రసిద్ధ భక్తుల దుఃఖగాధలతో నిండి ఉన్నదే. సంకేత స్థలంలో సర్వం సిద్ధపరచి, ఆర్తితో పిలిచే భక్తులకు చిక్కకుండా దాగుడుమూతలాడుతూ తప్పించుకుంటూ మురిపిస్తాడు కృష్ణపరమాత్మ. సుదీర్ఘ విరహావేదన తరవాతగాని కొద్ది క్షణాల సంయోగం సిద్ధించదు. ఆ కొద్ది క్షణాల అమందానంద అనుభూతి కోసం కఠోర తపస్సు చేయాలి. ఏ

యోగసాధనకైన సునాయసన మార్గాలుంటాయనుకోవడం పొర పాటు. దైవాన్ని చేరుకునేందుకు రాచబాటలు, సులభమార్గాలు వుంటాయని అనుకోవద్దు. 'ఆరు రోజుల్లో అరవం', 'ఆడుతూ పాడుతూ ఆంగ్లం' వంటి చిట్కాలు, కిటుకులు యోగాలలో లేవు. ఎక్కడో మహితాత్ములు, ఎన్నో జన్మలనుండి యోగసాధకులైన వారు, ఆధ్యాత్మిక శిఖరాల నధిరోహించిన పుణ్యాత్ములు అలవో కగా సిద్ధి పొందగలరేమోగాని, సామాన్యులకది సాధ్యం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు, శ్రమదమాదులతో కూడిన సుదీర్ఘ సాధన తర్వాతకాని యీ సిద్ధి మార్గం కనిపించదు. ఉన్నత శిఖ రారోహణ కవసరమయిన శ్రమ, తీవ్రసంఘర్షణ, తపన వున్నవా రికేగాని, అవి లేనివారికి అంత తేలిగ్గా ఆధ్యాత్మిక విజయ కిరీటం దక్కదు. సానపట్టిన కత్తి అంచుమీద నడక లాంటిది యీ సాధనా మార్గం అని చెప్పొచ్చు.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, అతి నిరుత్సాహపూరితమ యిన మార్గం అనిపిస్తుంది. ఎందుచేతనంటే ప్రాథమికసూత్రాలు కూడా తెలియని దశలో యోగసాధన అత్యంత నిరాసక్తంగా, నిరుత్సాహంగా అనిపిస్తుంది. చాలామందికి ఏవి సాగించాలన్నా అన్నింటికి ఆ మార్గాలలో మొదట యేదో ఒక దశలో యీ నిరు త్సాహం యెదురవుతుంది. ఏ కొద్దిమందికో యిది వర్తించకపో వచ్చు. అనుభవద్వారాలు తెరుచుకుంటూ, క్రమక్రమంగా ఒకదాని తర్వాత ఒకటిగా అంతర్గత మనోదర్శనమార్గాలగుండా నడిచిపో వాలంటే సుదీర్ఘమైన సన్నద్ధం, సహాయం అవసరం. ఇంత చేసిన తర్వాత కూడా ఆ నూతన మార్గాలు ప్రత్యక్షం కావచ్చు, కాక పోవచ్చు. సాధకుడి మానసికస్థితి చాలదనిపించినప్పుడు, అది పరిపూర్తి అయేవరకు అవి తెరుచుకోవు. ఈ సంఘర్షణలో, సాధ నలో ప్రతి అడుగు ఆసక్తికరంగా మార్చుకొనగలిగే తీవ్రమైన ఆత్మపరిశీలన, ఆత్మోన్నత్యం సాధించినవారికి తప్ప మిగిలినవా రికిది శూన్యమైన ఎడారి లాంటిది. సాధనలో, సంఘర్షణలో అడు గడుగునా ఆసక్తి కలగాలంటే విశ్వాసరహస్యం తెలియాలి. ఆత్మ నివేదన చెయ్యగలగాలి. అలాంటివారికే ఆ దివ్యశక్తి దివ్యహస్తం

అడుగడుగునా సహాయమందిస్తుంది. ఏ కష్టంలోనైనా ఆ కృప, సహాయం లభిస్తుంది. ప్రారంభంలో యోగసాధన అత్యంత దుర్భరంగా అనిపిస్తుంది. ఆ కష్టం, సంఘర్షణ అటువంటివి. చివరికి అది తేనెలా తీయగా మారిపోతుంది. పరమాత్మని గుర్తించడంలో ఉండే ఆనందం, ముక్తిసాధనలో ప్రశాంత దివ్యపరమానందం యోగసాధకులచే వర్ణింపబడుతూ ఉంటుంది. అలాగే సాధకులు, భక్తుల అనుభవవర్ణనలు ప్రారంభంలో వుండే శూన్యతాదశలు అసమాన వైచిత్రిని తెలియపరుస్తాయి. ప్రాచీన సాధకులందరూ దీనిని గుర్తించారు. అందుచేత యోగసాధనకు అత్యంత వోర్పు, నిర్వేదాన్ని అధిగమించగలిగే స్థిరహృదయం వుండాలని గీత చెప్తుంది. అదే యీ మార్గానికి కావలసిన అర్హత. గీతామార్గం, వేదాంతం చెప్పిన కత్తి అంచు మీద నడక లాంటిది సాధన - ఈ మార్గానికే కాక ఏ మార్గానికైనా వర్తిస్తుంది. అత్యున్నతమైన ఆ దివ్యానందాన్ని సాధించాలంటే అంత తీవ్రసాధన చెయ్యాలి. శూన్యతర యెడారుల్ని దాటాలి.

ఒకే వొక మార్గం:

ఈ రకమైన సంఘర్షణకు వొకే వొక పరిష్కారం వున్నది. వ్యతిరేకశక్తుల ప్రాణికశక్తుల సూచనలను తిరస్కరించగలగాలి. ఆధ్యాత్మిక పునరుజ్జీవన వ్యతిరేకతను సూచించే భావాలను గుర్తించి పారద్రోలాలి. ఆ విధమైన భావాలను గుర్తించి తిరస్కరించకపోతే అవి నిన్ను దారి తప్పిస్తాయి. సాధకుడి మనస్సు, ప్రాణిక చేష్టలను సమర్థించకూడదు. అతడి స్వభావం యే కొంచెమైనా వీటిని అంగీకరించి, ప్రాధాన్యత నిచ్చినంతకాలం యీ సంఘర్షణ నుంచి అతడికి విముక్తి లభించదు.

వస్తుస్వభావంలోను, భావప్రకటనలోను, యెప్పుడూ వొకే లాగ వుండే యీ సూచనలన్నీ బాగా తెలిసినవే. ప్రతిస్పందనలో కూడా మార్పు వుండదు. వాటి స్వభావమే చూపిస్తుంది - అవి యెక్కడి నించి వచ్చాయో? తీరని కోరికలవల్ల కలిగిన నిరాశ, నిర్వేదం, అసంతృప్తి, ఆరాటం, విచారం, అన్యాయం, ప్రతీకారం, తామసం లేదా జడత్వం వైపు నెట్టేస్తాయి. ప్రాణికజీవి తన అహం

కోరిన కోరికల్ని ఆమోదించకపోతే, ఆధ్యాత్మికసాధనకి వొప్పు కోదు. శూన్యత, బుద్ధిమాంద్యం, సాధన మధ్యలో ఆగిపోవడం సంభవిస్తాయి. ఇవే మళ్ళీ మళ్ళీ పునరావృతమౌతూ వుంటాయి. ఇవన్నీ అధోప్రాణిక స్వభావలక్షణాలుగా గుర్తించబడతాయి. దివ్యసత్యసాధన అతిమానసస్థాయిలోకి తీసుకుపోయే తపస్సుపై వీటి తిరుగుబాటుగా కూడా అనుకోవచ్చు. అధోప్రాణికం అహాన్ని విడిచిపెట్టడానికి, కోరికలని, సుఖలాలసని విడిచి ఆత్మ నివేదన, పరిపూర్ణ సమర్పణను తిరస్కరిస్తుంది. ఇటువంటి తిరస్కృతిలో కూడా అది తనంతట తాను ఆత్మ పరిణామానికి తాను దివ్య జీవన పరికరమనే భావనల వత్తిడిని అనుభవిస్తుంది. ఈ వత్తిడినే అది వూపిరాడదని బాధగా భావిస్తుంది. దిక్కుమాలిన కోరికలకి అంతరంగం అంగీకరించకపోవడమే యిరుకుగా, యిబ్బందిగా భావిస్తుంది. ప్రశాంతమైన, నిర్మలమైన, నిశ్శబ్ద వాతావరణంలో అతిమానస పరిణామం కోసం చేసే తపస్సుని నిర్జీవస్థితిగా నిందిస్తుంది. కోరికలని, అపేక్షలని కుదించుకుని పరిమితులలో వుంచుకోవడాన్ని, ఆత్మతిరస్కృతి, ఆధిక్యతల్ని అదుపు చెయ్యడాన్ని సంకుచిత పరిధులుగా అపోహపడుతుంది. అన్నిటి కంటె ప్రమాదకరమైన వంచన, అతినికృష్ట సూచన యేదంటే తనకి కోరికలు, ఆపేక్షలు అసలు లేనట్లు బుకాయిస్తూ, వేషాలతో తనని తాను వంచించుకుంటూ యితరుల్ని కూడా వంచించడానికి చేసే ప్రయత్నం. ఇది కూడా యోగసాధనలో ఒక భాగమే అని సాధకులని భ్రమింపచెయ్యడం.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: నడిమించి విజయలక్ష్మి

అహంకారపూరిత ఇంద్రియవాంఛలకు బదులుగా చైత్యసంబంధిత ఆకాంక్షను ఏర్పరుచుకో

ఈ విధమైన అధః ప్రవృత్తి ఆవహించినప్పుడు బయటపడే మార్గం ఒక్కటే ఉంది. ప్రాణిక అహంకారం కోరే అన్ని హక్కులనూ, కోరికలనూ సంపూర్ణంగా తుడిచేసెయ్యాలి. అసంతృప్తికి లోనైన

ప్రాణికము చేసే ప్రేరణ స్థానంలోకి చైత్య ఆకాంక్షయొక్క పవిత్ర తను ప్రవేశపెట్టు. ప్రాణికమైన ఈ అలజడుల పరితృప్తిగానీ, వైరాగ్యంతో నిష్క్రమించడంగానీ దీనికి సరైన పరిష్కారం కాదు. నీ ప్రాణికసత్తను దైవానికి అధీనం చేసి, ఏ పరమసత్యం దరికి ఇచ్ఛలూ, కోరికలూ చేరలేవో, ఆ పరమసత్యానికి మనఃస్ఫూర్తిగా సర్వసమర్పణం గావించుకో. ఆ పరమసత్యమే తేజోమయమూ, ఆనందమయమూ కాబట్టి అక్కడ ఏ కోరికా ప్రవేశించలేదు. ఇంకా ఎక్కడైతే కామనలూ, కాంక్షలూ ఉంటాయో అక్కడ దివ్యానంద మునకు స్థానం లేదు.

చైత్యపురుమనిలో కలిగే తపన మాత్రమే మన ప్రకృతిని అతిమానసపరివర్తనదిశగా నడిపిస్తుంది తప్ప ప్రాణికస్థాయిలోని ఇచ్ఛ కాదు. అది మాత్రమే మానసిక, ప్రాణికములలో మార్పు తీసుకొనివచ్చి వాటికి సముచితమైన ప్రవృత్తిని సూచించగలదు. అయితే ప్రాణిక ఇచ్ఛలనే చైత్యమయ ఆకాంక్షలనే భ్రమలో ఉండటం జరుగుతుంది. కానీ ఆ రెండింటికీ తేడా చాలా స్పష్టం గానే ఉంటుంది. చైత్యమయ ఆకాంక్షలో ఏ విధమైన ప్రతిస్పంద నలూ ఉండవు. తిరగబడటంగానీ, ప్రోత్సహించడంగానీ ఉండదు. దానిక్కారణం చైత్యకం దైవానికి సమర్పణ చేసుకుంటూ ఆంత ర్గత ఏకత్వం ఆకాంక్షిస్తుంది. సవాలు చేసి ప్రశ్నించాలనుకో కుండా ఈశ్వరేచ్ఛతో ఒకటై అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. వ్యక్తిగతమైన సంతృప్తిని కోరకుండా జీవి లోపలి దివ్యత్వం వృద్ధి పొందటంతో తృప్తి పొందుతుంది. అది వెతికి వెతికి చివ రకు చేజిక్కించుకునేది శారీరక, ప్రాణికపరమైన అనుభవంకాక కేవల భగవత్ సాన్నిధ్యము; అది తన హృదయస్థానంలో నిరం తరం ఉండిపోవడం; ఇంకా ప్రకృతి అంతా ఆయన శాసనంలో ఒదిగి యుండటము – ఇదే చైత్యపురుషుడు కోరేది. ఆ చైత్యపు రుషుడు సదా ఇలా ఆక్రోశిస్తాడు. "ప్రభూ! పరమసత్యం అమలు కావాలి. నాదికాక నీ ఇచ్ఛయే అమలు జరగనీ" అయితే ప్రాణిక వేదన దీనికి పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. అది "నా సంక ల్పమే నీ సంకల్పం కావాలి. నా పంతాలు నెగ్గించు. నా కోరికలు

నెరవేర్చు. అప్పుడే నిన్ను అన్వేషించి అంగీకరిస్తాను; నీలో ఉన్న భగవంతుని చూడటానికి ఒప్పుకుంటాను" అని పట్టు పడుతుంది. పరమసత్యాన్ని చేరటానికి ఏది సరైన మార్గమో, ప్రవృత్తిలోని సంఘర్షణకి పరిష్కారమేమిటో వేరే చెప్పనవసరం లేదు.

*

కష్టాలను ఎదుర్కోవటము:

ఇటువంటి కష్టాలన్నిటినీ అహంకారం తగ్గించుకొని మిక్కిలి శాంతమైన చిత్తవృత్తితో ఎదుర్కోవాలి.

ఈ యోగవిధానమే ఒక ఆధ్యాత్మిక కదనం; దాని ఆరంభంలోనే అన్నిరకాల వ్యతిరేకశక్తులూ ఎదురవుతాయి; వాటిని ఎదుర్కోటానికి అంటే ఎదురొచ్చే కష్టాలను, బాధలను, అపజయాలను దాటటానికై జంకులేని నిశ్చలతత్వంతో సంసిద్ధులు కావాలి. అలా ఎదురొచ్చే శోధనలను, విషమ పరీక్షలను సరైన స్ఫూర్తితో ఎదుర్కొన్నట్లయితే ఇంకా దృఢంగా తయారై ఆధ్యాత్మికంగా పరిశుద్ధులుగా, ఉద్దండులుగా తయారవుతారు.

వ్యక్తిలో ఏదో ఒక లోపం, కల్మషం, దౌర్బల్యం, అజ్ఞానం వంటివేవో ఉంటేనే తప్ప విపత్తులనేవి సంభవించవు. ప్రతికూల శక్తులు ఇబ్బంది పెట్టి జయించలేవు. అందువల్ల తమలో ఎక్కడ లోపముందో చూసుకొని దాన్ని సరిచేసుకోవాలి.

వ్యక్తుల ద్వారా ఈ దుష్టశక్తులు దాడికి దిగినప్పుడు (from human instruments of adverse forces) వారిపై ద్వేషం పెంచుకొని, కోపంతోనో, అహంతోనో కాకుండా ప్రశాంతచిత్తంతో బలం పుంజుకొని, సమతను పెంచుకొని దైవబలాన్ని అర్థించి దాన్ని ఎదుర్కోవాలి. ఆ తర్వాత జయాపజయాలు దైవాధీనమే.

సాధారణంగా ఇతరులతో వ్యవహారం చేసేప్పుడు ఒక రకమైన మాటలవల్ల, చేతలవల్ల తప్పు జరిగి అపార్థాలకు దారి ఏర్పడుతుంది. అట్లా కాకుండా ప్రశాంతంగా, నిలకడగా వ్యవహరించే పద్ధతి వేరే ఉంది. అది సరసమైనవారిని సమాధానపరుస్తుంది. అంటే పూర్తిగా చెడ్డ ఉద్దేశంతో లేనివారైతే సమాధానపడతారు.

కాబట్టి ఈ రెండో పద్ధతే మంచిది. బలహీనత, అతిశయం, దౌర్జన్యంలేని తత్త్వమే సరైన బాట.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

యోగానికి రక్షావలయాలు

నేనీ యోగం సులభసాధ్యమని ఎన్నడూ అనలేదు. నేనన్న మాట ఏమంటే – ఎవరికి ఏ మార్గం నచ్చుతుందో వారా మార్గంలో ప్రయాణించగలరని. ఉన్నత ధ్యేయమున్నవారు తమ విమానాన్ని జాగ్రత్తగా నడుపుకోకపోతే తలక్రిందులుగా పడటం తప్పదని హెచ్చరించాను. ఎవరికీ పతనావస్థ? అంటే ఆదర్శంగా, ఉన్నతంగా ఉండి క్షుద్రాలోచనల్లో విహరిస్తూ ద్వంద్వజీవితాన్ని గడుపుతారో వారికి. అలా వున్నవారి నెవరెలా రక్షించగలరు కనుక. మనస్సు నేకాగ్రం చేస్తే – మనః ప్రాణ విజయం లభిస్తుంది. అలాకాక భూమ్యాకాశాల నడుమ క్రిందకి వస్తూ పైకి పోతూన్నవారి నెవరూ రక్షించలేరు. ఇది ప్రారంభకులకీ, కొంత ముందుకు సాగినవారికీ సమంగానే అన్వయిస్తుంది. ఇవి నగ్న సత్యాలు. ఇందులో నేనేమీ అసత్యమాడటం లేదు. నటించటమూ లేదు. ప్రతివారికీ ఇదే శరణ్యం. చిత్తైకాగ్రత. భగవంతునకు శరణి నటం వానిపై అనంతప్రేమ, శ్రద్ధావిశ్వాసాలు, పట్టుదల అవసరం. ఆధ్యాత్మిక వినమ్రత కూడా అవసరం. ఇదే యోగరక్షణకు ఉండాలి. ఇవే కష్టాలు, నష్టాలు, జారుపాట్లు, తోట్రుపాట్ల నుండి రక్షించేవి. ఇవి తాత్కాలికాలే అయినా, స్వభావానికి సహకరించి ప్రగతికి తోడ్పడుతవి.

చిత్తైకాగ్రత అత్యంత ప్రధానం:

ఎవరిలో చైత్యపురుషుడు నిత్యజాగరూకుడో వారికా మార్గంలో ప్రయాణించటం సులభం. విజయమూ తథ్యమే. వీరీ రెండు విషయాలు గుర్తుంచుకోదగ్గవి. ధ్యేయానికి చేరుకోవాలన్న తపన. ఇది అంతఃపురుష విషయం. భౌతికపురుషునకు

లౌకికవాంఛాజాలం మీద తపన. ఇవి క్రిందికీ పైకీ లాగుతుంటాయి. ఈ రెంటికీ మధ్య మనస్సు నలుగుతుందన్న మాట. కాబట్టి దృఢమైన పట్టుదల చైత్యపురుషుని తపనలో వాటిని ద్రవింపచేస్తే తప్ప ప్రయోజనం నాస్తి. భౌతిక ప్రాణిక భూమికల్లో దృఢత్వముంటే తప్ప ఈ యుద్ధం శమించదు. ఎవనిలో ఈ దీర్ఘప్రయాణానికి సంసిద్ధత, ధ్యేయం మీద విశ్వాసముండవో, నిరంతర సాధన వుండదో వారి నడక నత్తనడక – తొట్రుపాటు నడక తప్ప వేగవంతం కాదు. వారిలో ప్రాణికచైతన్యం నిద్రావస్థలో వుంటూ ప్రయాణానికి సహకరించదు. నిరంతర విఘ్నపరంపరవల్ల వారి కాధారభూమిక జారిపోతుంది. మరల భౌతిక జీవనారాటం పెరుగుతుంది. పరిసరాలు దానికే సహకరిస్తాయి. అవ్యక్తశక్తులు – వ్యక్తులూ దానికే ఉన్ముఖంగా లాగుతారు. సాధన ఫలించికపోగా భ్రష్టమైపోతుంది. వాడు భయభ్రష్టుడౌతాడన్న మాట. సాధారణ జీవితమూ వాడికి ఫలించనందువల్ల.

నిరాశా నిస్పృహాలు పనికిరావు;

అసాధారణశక్తి మేల్కొకపోతే వ్యక్తియొక్క భౌతికపరిధిలో విరుద్ధాంశాలుత్పన్నమై సాధన తప్పుదారి పడుతుంది. సాధారణంగా సాధనలో ఇది తప్పదు. ఐనా సంశయం, యుద్ధం, ప్రయత్నం, అపజయం, లోపాలు, సుఖదుఃఖాలు, మంచిచెడుల పరిస్థితులు, వెలుగుచీకట్లు – ఇలాంటివి సాధారణ జీవితాంశాలు. అవి యోగజనితాలు కావు. యోగమార్గంలో ఎదురయ్యేవీ కావు. యోగంలో వాటి కదలికలను గుర్తించటం తేలిక. వాటి కారణాలు తెలుస్తాయి. అప్పుడు గుడ్డిగా వాని ననుసరించకూడదు. అప్పుడు జ్యోతిర్మార్గ ప్రయాణం సులభమౌతుంగి. కష్టనష్టాలు వచ్చిన సాధకుడు వానిని అధిగమించిపోతాడు. వానికొక శాంత భూమిక ఆధారంగా లభిస్తుంది. కనక విరుద్ధాంశాలు ఉన్నత భూమికలో ప్రవర్తించినా విజయం తప్పదు.

అనుభవం దారి చూపినా – నీ ఉన్నత ప్రయోజనానికి విరుద్ధంగా చేసినా – దుఃఖానికి తావుండదు. బహుశా దీనికి (దుఃఖానికి) కారణం – యోగమే హేతువనుకోవటం, సాధనకు తానన

ర్భాడను అనుకోవటం కావచ్చు. ఈ రెండు కారణాలు సరైనవి కావు. వీటిని నీ నుండి వైదొలగించుకోవాలి.
వీటిని పరిహరించాలి;

ఆత్మసాధనకు విరుద్ధాలోచనలను ఏరి పారేయాలి.

1. ఇవి సభ్యమైన నైతికదృష్ట్యా వచ్చేవి కావు. మనస్సులో ప్రాణికచేతనలో వైరుధ్యాలు కల్పించేది మనస్సు. ఇచ్ఛ వాటిని కాదన్నపుడు నైతికభూమిక చెడిపోదు. అది విధ్వంసం కావటానికి కారణాలు ప్రాణికచేతనలో బలహీనత కావచ్చు. నరాల బలహీనతలు కావచ్చు.
2. గతజలసేతుబంధన మనవసరం. భవిష్యత్తులోకి దృష్టి సారించు. దానిని ఆశాజనకంగా భావించు. అలాకాక గతంలో వచ్చిన అపజయాలనే భావిస్తే నీ కనారోగ్యంతోపాటు మనోబలహీనత సంభవించి, ధ్యేయమసాధ్యంగా తోచి శీలభంగం కల్గిస్తుంది.
3. ఒకేసారి విజయం కల్గదని తెలిసి అధైర్యపడబోకు. ఓర్పుతో ధ్యేయోన్ముఖంగా ప్రయాణించు.
4. నిత్యమూ నీలోని బలహీనతలపైనే దృష్టి కేంద్రీకరించకు. సాధ్యవస్తువునకు నేను చేరలేనేమోనన్న అధైర్యాన్ని కల్గిస్తుందది. వాని ఉనికి గుర్తించి ధైర్యాన్ని కూడగట్టుకొని ప్రయాణించు. అప్పుడే ప్రయాణం ధ్యేయానికి నిబద్ధంగా సాగుతుంది. అనుకున్నది సాధిస్తావు.

మూలం; శ్రీఅరవిందులు
అనువాదం; తుమ్మపూడి కోటేశ్వరరావు

సరియైన ఆధ్యాత్మికదృక్పథం

మనలోని చైతన్యం ఒక్కోసారి తమోగుణంవల్ల, మరోసారి రజోగుణంవల్ల, ఇంకోసారి ఈ రెంటి కలయికవల్లా రకరకాలుగా వర్తిస్తూ వుంటుంది. తమస్సుతో నిండిన చైతన్యంలో ఎప్పుడూ నీరసం, నిరాశ, నిస్సత్తువ, నిర్లిప్తత కనిపిస్తాయి. ఎప్పుడూ తాను

దుఃఖంలోనే వున్నాననీ, దురదృష్టవంతుడిననీ, కష్టాలన్నీ తనకే వస్తాయనీ, భగవంతుడు కూడా తన్ని రక్షించలేడనీ, అందరూ ఆనందంగా ప్రగతి సాధిస్తూంటే తనొక్కడే వెనకబడి మ్రగ్గిపోవ డానికే పుట్టాననే ఆలోచనలతో సతమతమవుతూ తనకి బాధ, వ్యథ, చావు తప్ప దిక్కులేదనుకుంటాడు. ఇదే రజోగుణంతో నిండిన చైతన్యం అయితే, అహంకారంతో, గర్వంతో, స్వాతిశ యంతో పొంగిపోతూ ప్రతి చోటా, ప్రతి సందర్భంలోనూ తానే అధికుడనని చాటుకుంటాడు. ఒక్కో సందర్భంలో ఈ తామసిక, రాజసిక అహంకారాలు రెండూ మిళితమై పరస్పరం గోప్యంగా సమర్థించుకుంటూ ఉంటాయి. ఈ రెండు సందర్భాలలోను తనకు తానే అల్లరిపడేది ఈ 'నేను' అనేదే. ఇది అజ్ఞానపు పొరల వెనక కప్పబడిపోయి వుంటుంది.

నిజమైన 'చైతన్యం' లేదా నిజమైన 'నేను' అనే స్పృహ ఈ తామసిక, రాజసిక ఆలోచనలకి విరుద్ధంగా వుంటుంది. "నేను ఏమయినా, నా ఆత్మ ఆ భగవంతుని రూపం, ఏదో ఒక రోజుకి తిరిగి భగవంతుని చేరుకోవాల్సిందే. నేను లోపాలతో ఉన్నా, నాలో పూర్ణత్వాన్ని వ్యక్తం చేసుకోడానికి కృషి చేయాలి. ఈ పూర్ణత్వసాధన నా కృషి వల్ల సంభవం కాదు. కానీ నేను నమ్మి, అర్పణ చేసుకుంటే, ఆ భగవదనుగ్రహం వల్లే మొత్తం మార్పులు జరిగి పూర్ణత్వం సిద్ధిస్తుంది" అనుకోవడమే నిజమైన చైతన్య లక్షణం.

దివ్యమాత అనుగ్రహం ఎప్పుడూ నీ మీద ఉన్నా, నీలోని చైతన్యం క్రమేణా స్వచ్ఛత పొందితే తప్ప, ఈ తమో, రజోగు ణాల మబ్బుల నుంచి విడిపోతే తప్ప, ఆ దివ్య అనుగ్రహపు మధు రిమ అనుభూతిలోకి రాదు. చాలామందికి కొన్ని సూచనలు వస్తూంటాయి. యివి అందరికీ వస్తాయి. గొప్ప గొప్ప సాధకు లకీ, అవతారపురుషులకీ, బుద్ధుడికీ, ఏసుక్రీస్తుకీ కూడా వచ్చాయి. ఇవి ప్రకృతిలో అంతర్భాగం. వీటిని అధిగమించాలి. ఎటువంటి సూచనలనీ పూర్తి నిజాలుగా ఆమోదించకూడదు. స్వీయ ఆలోచ నలుగా వాటిని స్వీకరించకూడదు. వాటిని జాగ్రత్తగా పరిశీలిం

చాలి. వాటిని తప్పించుకుని ఉండాలి. మానవ యంత్రాంగంలో అవరోధాలు సరిదిద్దుకోవల్సిన పొరపాట్లుగా భావించాలికాని, అవి ఏవో పూర్వం చేసిన పాపాలకి విధించబడ్డ శిక్షలుగా తీసుకోకూడదు.

*

విశ్వాసాన్ని దృఢపర్చుకోవలసిన ఆవసరం:

నీ విజ్ఞత ఉపయోగించి, సరైన ఆలోచనాశక్తిని, చక్కటి నమ్మకాన్ని వృద్ధిచేసుకోవాలి. గుడ్డినమ్మకం కాదు! భగవంతుడనే వాడే కనుక ఉండి ఈ దివ్యమార్గంలోకి నిన్ను మరలుస్తే, దాని వెనుక తప్పక దివ్యకృప వుండే వుంటుందనీ, ఎన్ని కష్టాలెదురైనా నీవు చేరవలసిన లక్ష్యానికి చేరుతావనీ నమ్మగలగాలి. నిరాశావాదుల నీళ్లుజల్లే మాటలని పట్టించుకోవడం, తొందరపాటుతో, ఆవేశంతో నమ్మకాన్ని పోగొట్టుకుని కష్టాలు కొండల్లా వున్నాయి కాబట్టి, అవి తరగడం అసంభవమనో, ఇప్పటి వరకూ భగవత్ సాక్షాత్కారం జరగలేదు కాబట్టి ఇంక జరగదనో అనుకోకూడదు. ఒక లక్ష్యం సాధించాలన్న ప్రతివాడు కొంత దృఢత్వం అలవరచుకోవాలి. "ఎన్ని కష్టాలెదురైనా, నేను నా లక్ష్యసాధనలో విజయం సాధించేవరకూ కృషిని ఆపను" అని అనుకోగలగాలి. ఇదే భగవంతుని నమ్మినవాడైతే, ఈ ధైర్యంతో పాటు, భగవంతునిపై నమ్మకాన్ని జోడించి, "దేముడున్నాడు, నేను ఆయనని చేరే నా ప్రయత్నం తప్పక ఫలిస్తుంది. ఆయనని పొందేవరకూ ఎట్టి పరిస్థితులలోనూ వెనకడుగు వేయను" అనుకుంటాడు. ఇదే నిజమైన చైతన్యస్ఫూర్తి. పరిపూర్ణ నమ్మకంతో వచ్చే ఆలోచనా తరంగం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: బి. వరలక్ష్మి

ఆత్మవంచనకాని, దైవవంచనకాని వద్దు

నీకు సంపూర్ణమైన చిత్తశుద్ధి ఉన్నట్లైతే నీకు తప్పక విజయం లభిస్తుంది. ఇది అత్యంత క్లిష్టమైంది. చిత్తశుద్ధి, వ్యక్తి అస్తిత్వం

లోని అన్ని భాగాలలోను పనిచేస్తూ, బాహ్యా అంతర్గత శక్తులు, స్పందనలు అన్నీ సంపూర్ణముగా దైవానికి మాత్రమే చెందిన ఒకే ఒక ఇచ్ఛగా దైవం కోసమే జీవనముగా, దైవేచ్ఛయే తన ఇచ్ఛగా, దైవేచ్ఛను మాత్రమే ప్రకటించేదిగా పనిచేస్తుంది. ఇదీ చిత్తశుద్ధి అంటే.

క్షణక్షణం నీ చిత్తశుద్ధిని తీవ్రతరము చేయవలసిన అవసరము, సరిదిద్దుకునే అవసరము నీకు ఉంది. ఇది నీవు తెల్సుకుంటే నీలో దైవవంచన ఉండదు. ప్రథమంగా వ్యక్తి తనను తాను వంచించుకోకూడదు. దైవాన్ని మోసం చేయలేమని ప్రతి ఒకరికీ తెలుసు. ఎంతటి తెలివి, చాకచక్యముకల అసురుడైనా దైవాన్ని వంచించలేడు. కానీ ఈ విషయంలో ఎంత అవగాహన కలవారైనా ఏదో సమయంలో ఆకస్మికముగా, యాంత్రికముగా ఆత్మవంచనకు గురి అవుతూ ఉంటారు. వారి వ్యవహారాలకు, సంభాషణలకు, చర్యలకు అనుకూలమైన సదభిప్రాయాలను ఆపాదించుకుంటూ ఉంటారు. ముందుగా అదే జరుగుతుంది. "ఇది అతని లోపం" అని ఇతరులను ఆక్షేపించే విషయాలను గురించి నేను మాట్లాడటము లేదు. దైనందిన జీవితంలోని అతిసూక్ష్మవిషయాల గురించి మాట్లాడుతున్నాను.

నాకు తెల్సిన ఒక పసిబిడ్డ తలుపును ఢీకొని తలుపును కోపంతో గట్టిగా తన్నడము నాకు తెల్సు. ఇదీ అటువంటిదే. వక్రమార్గములో ఉన్న వ్యక్తే పొరపాటు చేస్తాడు. నీ బాల్యదశను నీవు దాటినా నీకుగల ఒకే ఒక హేతువుతో బుద్ధిహీనమైన అనేక కుంటిసాకులు చెప్తుంటావు. "అతను ఆ విధముగా చేయకపోయి నట్లైన నేను ఇలా చేసేవాడిని కాను కదా!" అని. కానీ దీనిని నీకు వ్యతిరిక్తంగా నీవు ఆపాదించుకోవాలి.

నేను దీనినే చిత్తశుద్ధితో ఉండటము అంటాను. నీవు ఇంకొకరితో ఉన్నప్పుడు నీ ప్రతిక్రియ సక్రమంగా ఉండాలి. ఈ విధముగా ఉండని ఇంకొక వ్యక్తితో నీవు ఉన్నప్పుడు కూడా నీవు సరైన విధముగానే తప్పక ఉండాలి. సర్వసామాన్యమైన ఒక చిన్న ఉదాహరణ: ఒకరు కోపముతో మనసును నొప్పించే

మాటలు విసరడానికి బదులుగా మారుమాట్లాడక ప్రశాంతముగా ఉన్నట్లైన అంటువ్యాధివంటి ఆ కోపం నీకు సోకదు. అవునో కాదో నిన్ను నీవు నిశితముగా పరిశీలించుకో. ఇది చాలా సులభసాధ్యం. ఇది ఒక ఆరంభం మాత్రమే. నేను ఈ అంటువ్యాధిని చాల సులువుగా తెచ్చుకునే వారిని గురించి ప్రస్తావించటం లేదు.

నేను అంటాను – నిన్ను నీవు నిశితముగా పరిశీలించుకున్నట్లైన నీ సాధారణవైఖరిలో నీవు చిత్తశుద్ధితో ఉండాలని ప్రయత్నము చేస్తున్నా నీలో వందలకొలది చిత్తశుద్ధిలేని విషయాలు నీకు కనబడతాయి. అప్పుడు అది ఎంతటి కష్టసాధ్యమైనదో నీకు తెలుస్తుంది.

ఈ అస్తిత్వములోని అన్ని భాగాలలో నీకు చిత్తశుద్ధి ఉన్నట్లైతే నీ శరీరంలోని ప్రతి కణము నీ పూర్తి అస్తిత్వము సమగ్రముగా దైవాన్ని కోరినట్లైన పరిపూర్ణ విజయం నిశ్చయముగా నీకు లభిస్తుంది. దీన్నే నేను చిత్తశుద్ధితో ఉండటము అంటాను.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రివేణి

కష్టాలు ప్రగతికి మెట్లు

నీవు పొందే విజయాలకి సూచికలుగా నీ కష్టాలు ఉంటాయి.

యోగంలో సాధించవలసిన విజయం అదే అవుతుంది. సోదాహరణంగా అదే నిరూపితమవుతుంది. నీలో అంతులేని స్వార్థం ఉందనుకో, నీవు భవిష్యత్తులో సాధించవలసిన గొప్ప విజయం, ఆ స్వార్థాన్ని జయించి దానికి వ్యతిరేకమైన విశాలత్వాన్ని, విశ్వమానవత్వాన్ని నీలో స్థాపించడం. ఆ శక్తి నీలోనే ఉంది అని అర్థం.

నీవు ఏదైనా సాధించాలి అనుకున్నప్పుడు దాన్ని వ్యతిరేకించే గుణం కూడా నీ స్వభావంలో ఉంటుంది. అపుడు నీలోనే

నీవు ముఖాముఖి ఆ గుణాన్ని ఎదుర్కొన్నప్పుడు... ఛీ! నేనేనా! ఇలా ప్రవర్తించాను అని, నాలో ఈ గుణం ఉందా అని అనుకుంటావు. అయితే ఆ సందర్భంలోని వాస్తవాన్ని తెల్సుకోవాలి. నీకు నీవే అనుకో – "నేను చివరిగా దేనిని నిరూపించాలో, నా ప్రతిబంధకమే దానిని నాకు స్పష్టంగా చూపిస్తోంది. పరస్పర విరుద్ధమైన రెండు సిద్ధాంతాలలో ఆవలిదానిని చేరుకోవటమే నా లక్ష్యం" అని. సాధారణ నిత్యజీవితంలో అనేకసార్లు ఈ పరస్పర విరుద్ధమైన భావాల తాకిడి మనం అనుభవిస్తూనే ఉంటాం. జీవితంలో ఎంతో పిరికస్వభావం గలవాళ్లు దేన్నీ భరించలేనివాళ్లు ఎంతో ఓర్పుతో ఎన్నో కష్టాలను భరించడం చూస్తాం.

దైవం కోసం ఆకాంక్షించేవారికి వారి ముందుండే ప్రతి కష్టము దైవాన్ని చేర్చే మార్గాన్ని చూపేదిగా వారిని మేల్కొల్పి విజయం సాధించడానికి సాధనంగా మారుతుంది. తన వ్యక్తిత్వ తరహాలో తనను తాను అభివృద్ధి చేసుకుందుకు కారణమౌతుంది.

నిజానికి ఎవరిలోనైనా లోటుపాట్లు ఉన్నాయంటే అతనిలో అంత గొప్ప విజయాన్ని సాధించగలిగే అంతర్గత సాధనాశక్తి కూడా ఉందని అర్థం. అయితే ఇక్కడ ఒక షరతు. నీలో ఓరిమి, సహనశక్తి, లోపాలను ప్రతిఘటించే చల్లారని దివ్యాగ్ని జ్వాలను నిలిపి ఉంచే ఆకాంక్ష – ఉన్నప్పుడే.

జ్ఞాపకం ఉంచుకో. కష్టాలకి తగిన ప్రమాణంలోనే దైవ కృప కూడా ఉంటుంది.

*

దుష్టవ్యక్తి:

నీవేదైనా సాధించాలనుకున్నప్పుడు, నువ్వొక గొప్ప కార్యాన్ని సఫలీకృతం చేయాలనుకున్నప్పుడు నీలోనే ఆ కార్యాన్ని ప్రతిఘటించే ఆటంకాలు కూడా ఉంటాయి. ఎందుకంటె విజయానికి దగ్గరగా ఉన్న నిన్ను ఆ ఫలితాన్ని అందుకోకుండా చేసేందుకు అవి సన్నాహాలు చేస్తూ ఉంటాయి. సాధించవలసిన విజయం కూడా నీకు చేరువయే ఉంటుంది. అయితే భూమిపై అంతా వ్యాపించి ఉన్న కష్టాన్ని నిరోధించటం నీకు కష్టమే. (దానికి

విశాలమైన చైతన్యశక్తి కావాలి) అయితే స్వభావంలో ఉన్న ఆ కష్టాన్ని లేదా ఆ ఆటంకం తాలూకు ఛాయ నీలో ఉన్నప్పుడు దాని పరిణామాలు గమనిస్తూ ఉండు. వెంటనే సూటిగా ఎదిరించగలుగుతావు. విజయం సాధించడం నీ చేతుల్లో ఉన్న పనే. అది చాలా ఆచరణయోగ్యమైన వ్యవస్థ.

బులెటిన్‌లోని శ్రీఅరవిందుల ఉత్తరంలో 'Evil persona' ను గురించి చూడలేదా? అందులో చాలా చక్కగా వివరించారు.

*

దుష్టవ్యక్తి:

ఈ 'దుష్టవ్యక్తి' గురించి నువు వ్రాసినది నాకు చాలా కుతూహలం కలిగించింది. ఎందుకంటె నా అనుభవానికిది సమాధానంగా ఉంది. ఏదైనా ఒక కార్యంలో ఎవరైనా పూర్తిగా నిమగ్నమైనపుడు, ఆ సాధనలో లీనమై ఉన్నపుడు... వారి వ్యక్తిత్వంలో భాగంగా కనిపిస్తూ, పరస్పరవిరుద్ధంగా ఉండి, ఆతని కార్యానికి అవరోధంగా తయారయ్యే ఒక స్వరూపం ఉంటుంది. ఒకవేళ ఆతని వ్యక్తిత్వంలో భాగంగా కాకపోయినా, వాతావరణంలోంచి ఓ దుష్టశక్తి ప్రభావం ఆతనిలో చేరి, ఆ కార్యాన్ని చెడగొట్టడానికి ప్రయత్నిస్తుంది. దాని పని నిరోధించటం, పడగొట్టడం, తప్పుదారి పట్టించడం, ఒక్క మాటలో చెప్పాలంటే మనం ఏ కార్యాన్ని దీక్షతో, నిష్ఠతో చేయుటం ప్రారంభించామో, ఆ పనికి సంబంధించిన సమస్య నంతటినీ మన ముందుంచటం. ఇది ఎలా అనిపిస్తుందంటే సమస్య విధి నిర్ణయించిన ఉపకరణంచేత తప్ప, మరోవిధంగా పరిష్కరింపబడదు. సమస్యనే ఆ ఉపకరణం తన స్వంతం చేసుకుంటుంది. ఇది తాంత్రిక వ్యవస్థకి సంబంధించినది. బాహ్యంగా అస్తవ్యస్తంగా కనిపించే చాలా విషయాలనది వివరిస్తుంది.

(యోగంపై లేఖలు *SABCL* Vol. 24, p. 1660))

రంధ్రాన్వేషకులు:
ప్రతి వ్యక్తి తన స్వభావంలో, తనతోపాటుగా రంధ్రాన్వేషకులను కూడా మోసుకుపోతూంటాడు (Sri Aurobindo calls: Censors) నిజం చెప్పాలంటే అవి దుష్టశక్తుల శాశ్వత ప్రతినిధులు. వాళ్ల పని నిర్దయగా మనం చేసే ప్రతి పనిని, ప్రతి ఆలోచనని, మన చైతన్యంలోని ప్రతి చిన్న కదలికని దయాదాక్షిణ్యాలు లేకుండా విమర్శించడం. అదే కాకుండా మన చర్యల్లో అట్టడుగున ఉన్న చైతన్యప్రకంపనలను సైతం మన ముందుకు తెచ్చి చూపడం. నిశిత పరిశీలన వీటి కార్యక్రమం. ఎంతో పవిత్రంగా భావించే మన ఆలోచనల్లో, కార్యాల్లో, ఏ చిన్న నిమ్నప్రకృతికి సంబంధించిన, లేదా సామాన్యంగా ఉన్న ఏ చిన్న లోటుపాట్లు మన స్వభావంలో కనిపించినా వాటిని మన ముందుకు తేవడం వీటి పని.

ఇది నీతికి సంబంధించిన విషయం కాదు. ఈ పెద్దమనుషులు నీతిపాఠాలు చెప్పేవారు కారు. ఎవరైనా అత్యంత శ్రద్ధతో వారి చైతన్యాన్ని సంస్కరించుకుంటూ, శుద్ధపరుచుకుంటున్నప్పుడు... వాళ్ళనే ఈ పరిశీలకులు దయాదాక్షిణ్యాలు లేకుండా కర్కశంగా విమర్శిస్తారు. చెవిలో జోరీగలా అనుక్షణం: "నీవు ఇలా చేయకుండా ఉండాల్సింది, అలా చేయకుండా ఉండాల్సింది. ఇలా చేసి ఉంటే బాగుండేది. అలా చెప్పి ఉండవలసినది. నీ వంతా పాడు చేశావు. చూడు! అంతా నీవల్ల ఎలా ధ్వంసమైందో'' అని సతాయిస్తూ ఉంటాయి. కొంతమంది చైతన్యాన్ని దెయ్యం పట్టినట్లు పట్టేస్తాయి. ఆలోచించనీయవు. మరో ఆలోచనా రానీయవు. బుర్ర తినేస్తూ ఉంటాయి.

నేను మాత్రం ఈ పెద్దమనుషులు వచ్చినపుడు స్వాగతీకరిస్తాను. ఎందుకంటె వాళ్లు మనల్ని సంపూర్ణంగా విజాయితీతో ఉండేలా వెంటాడతారు. మనలో కనిపించే అతిచిన్న లోటుపాట్లను కూడా వెతికి బయటపెట్టి మనలోని ద్వంద్వమనస్తత్వాన్ని మనకి చూపెడతాయి. అవి చాలా తెలివైనవి. మనకన్న ఎన్నోరెట్లు అధికమైన తెలివివాళ్ళది. చిన్న ఆలోచనతో, చిన్నవాదంతో,

ఓ చిన్నపనితో నీపై నువ్వే ఎదురుతిరిగేలా చేస్తాయి. అత్యంత నిశితపరిశీలనతో, చాలా కనీకనిపించకుండా సాధిస్తాయి. ఏదీ వాటి దృష్టిని దాటిపోదు. వాటికీ ప్రతికూలవైఖరి రావటానికి కారణం, అవి ప్రధానంగా నిరాశావాదులు కావటమే. ప్రతీదీ నల్ల రంగులోనే చిత్రిస్తాయి. నీ అభిప్రాయన్ని వికృతపరుస్తాయి. అయితే అవి నిజాయితీకి పనిముట్లు. అయితే అవి ఎప్పుడూ విస్మరించేది ఒక్కటే. అదే దైవకృప.

ఇది ఉన్నట్లే భావించవు. అవి ప్రార్ధన మరిచాయి. హఠాత్తుగా హృదయంలోంచి పెల్లుబికి వచ్చే ఆ గాఢమైన పిలుపు విని ఆ దివ్యశక్తి, కృప దిగివచ్చి మనకు వెలుగు చూపి, విషయాల గతిని మార్చివేసేది – దీనిని అవి గుర్తించవు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

అంతరాత్మే అద్దంగా ఒక పరిష్కారం

మనకు ఎప్పుడూ దారి చూపే మార్గదర్శక సూచిక ఒకటుండాలి. మన సంవేదనల్లో, భావనల్లో, ప్రేరేపణల్లో, ఆవేశాల్లో వాస్తవికతను ప్రతిబింబించే ఒక దర్పణాన్ని మన అంతరంగంలో చక్కగా అమర్చుకోవాలి. అన్నింటినీ ఈ అద్దం లోనుంచి పరిశీలించాలి. దీనిలో కొన్ని ఎంతో చక్కగా ఆనందాన్ని అందిస్తూ ఉంటాయి. మరికొన్ని అంశాలు వికృతంగా విచారభరితంగా కానవస్తాయి. కానీ ఈ విభిన్న అంశాల ప్రతిబింబాలను ఈ అద్దంలో చూడాలి. ఈ పని రోజూ ఎన్నిసార్లైనా ఫర్వాలేదు. నిజానికి ఇది ఎంతో ఆసక్తిని రేకెత్తించే ప్రక్రియ. అంతరాత్మనే దర్పణంగా... అంశాలను దాని దగ్గరకు చేర్చి దానిలో నుండి వాటిని చూడాలి. అప్పుడు సరిగా లేనిదీ... క్రీనీడ క్రమ్ముతూ అద్దాన్ని మసకపరుస్తున్నదానిని అక్కడ నుండి తొలగించివేయాలి. లేక సరిచేయాలి. ఇదిగో ఇలా దానిని పసిగట్టి, ఆ చీకటి నుండి బయటకు రావాలి. ఇలా చేస్తూ ఉంటే నీ ఆంతరంగిక

వ్యవహారంలో విసుగనేదే నీకుండదు. నీ చుట్టూవున్న జనులు నిర్దయులుగా ఉన్నప్పుడు, నీవు శిరోభారంతో బాధపుడుతున్న ప్పుడు, కర్తవ్యం తెలియకపోయినప్పుడు ఈ అంతరాత్మ అనే దర్పణంలో నుండీ ఆయా విషయాలను చూడటం మొదలుపెట్టాలి. ఇలా చేయడం నిజంగా ఆసక్తికరంగా వుంటుంది. ఇలా చేస్తున్న ప్పుడు వ్యక్తి "నేను చాలా నిజాయితీపరుడిని అని అనుకున్నాను కాని, అసలు కాదు" అనుకుంటాడు. అసలు మన జీవతంలో ఆసక్తిని కలుగజేయనిది అంటూ ఏది ఉండదు. అలా ఇంకా ఇంకా ఈ ఆంతర్గత దర్పణాన్ని జాగృతం చేసుకోవాలి. ఇలా రెండేళ్ళూ, మూడేళ్ళూ.... ఇరవైయేళ్లైనా చేస్తూనే ఉండు. ఇలా చేస్తూ... కొన్ని యేండ్లు గడిచిన తర్వాత వెనుకకు తిరిగి నీ గతాన్ని చూడు. మూడేళ్ళ క్రితం నీవెలా వున్నావో నీవే అంటావు: "ఎలా ఎంతగా మారిపోయాను! అప్పుడు నేనలా వున్నానా! అలా ప్రవర్తించానా!" అని...

చూడు నిజంగా ఇది ఎంతో వినోదంగా ఉంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

దివ్యానుగ్రహం – నిరోధం

సృష్టి ఆవిర్భవించినప్పటి నుండీ దుఃఖం, మూర్ఖత్వం, అస్పష్ట తల్లో కూరుకుపోయివున్న లోకాన్ని ఉద్ధరించడంలో అనంత దివ్యానుగ్రహం పనిచేస్తూనే వుంది. ఈ ప్రపంచాన్ని ఉన్నత సత్యసౌందర్యాలకి మేల్కొలుపుటకు ఎన్ని వేల సంవత్సరాలు పడుతుందో కదా!

వ్యక్తిలోనే ఆ దివ్యకృప పనిచేయడంలో ఎంతో ప్రతిఘ టన ఎదురు అవుతున్నప్పుడు ఇక లోకం తీవ్రంగా దివ్యకృప చేసే కార్యాన్ని ఎంతగా నిరోధిస్తుందో ప్రతి ఒక్కరూ... అంచనా వేసి చూచుకోవచ్చు.

తనకు తానుగా అభివ్యక్తమయ్యేందుకు ప్రయత్నిస్తూ ప్రసరిస్తున్న దివ్యప్రకాశానికీ, శక్తికీ పూర్తిగా సమర్పించుకోనంత వరకూ, బాహ్య ఉపకరణాలు, మానసికంగా చేసే కల్పనలు, భౌతికయత్నాలన్నీ వ్యర్ధమని, ఎందుకూ పనికిరావని తెల్సుకొన్నప్పుడు మాత్రమే మనిషి నిర్దిష్టమైన ప్రగతిని సాధించడానికి సమాయత్తమౌతాడు. కాబట్టి ప్రేమపూర్వకంగా పరిపూర్ణంగా పైన వున్న మహాశక్తికి సమర్పించుకోవడమే ప్రతిభావంతమైన, నిజమైన వైఖరి. సమస్తాన్ని మార్చివేయగల శక్తి ఆ మహాశక్తికే వుంది.

ఎప్పుడైతే నీలోనే వున్న అంతరంగశక్తికి నీవు తెరుచుకుని ఉంటావో అప్పుడు అది ఉన్నతమైన జీవితమంటే ఎలా వుంటుందో వాచవిగా రుచి చూపిస్తుంది. ఇలా ఉన్నతంగా జీవించడమే... జీవించడం అంటే! అప్పుడిక ఉన్నత జీవనానికై ఇచ్ఛ మేల్కొంటుంది. దాన్ని అందుకోవాలనే ఆశ... ఆపై మనకు అది సాధ్యమే అన్న సుస్థిర విశ్వాసం, ఆఖరుగా ఆవశ్యకమైన కృషికి శక్తీ... ఆ అంతిమ లక్ష్యాన్ని చేరే దృఢనిశ్చయం సమకూడుతాయి. మొట్టమొదట మనిషి మేల్కోవాలి. ఆ పై అతడు దేన్నైనా జయించగలడు.

మూలం: శ్రీమాత
అనువాదం: హర్షవర్ధన్

కొసమెరుపు:

మీరెందుకంత సరదాగా ఉన్నారు?

ఆ సంఘటన నేనెప్పటికీ మర్చిపోను. నేను మూడవ తరగతిలో ఉన్నాను. హెలెన్ కెల్లరు మా స్కూలుకి వచ్చారు. ఆమె వయస్సులో డెబ్బదికి చేరువలో ఉన్నారు. చాలా బొద్దుగా పొడవుగా ఉన్నారు. నాకు గుర్తే. ఎంత ఉత్సాహమో ఆమెలో! ఆమెకు కళ్లు కనపడవు. కాని అవి అన్నీ చూస్తాయి. ఆమె ఎక్కడ ఉంటే

అక్కడ ఉత్సాహం వెల్లివిరుస్తుంది. ఆమె చిరునవ్వు! ఏమది! ప్రపంచానికది ఒక ఆనందరేక! అంతటి ఆనందదాయినిని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు.

ఆమె మాట్లాడటం ప్రారంభించింది. అది ఒక ప్రవక్త కంఠధ్వనిగా నాకు వినిపించింది. తమాషా అయిన ఆమె స్వరవైవిధ్యం, ఉచ్ఛారణ ఎలా ఉన్నాయంటే – ఆమె ఇదివరకెన్నడూ అసలు మాటే విననట్లుగా అనిపించింది. నేనెంతగానో చలించిపోయాను. నాకు తెలియకుండానే నేనామెతో మాట్లాడాలనిపించింది. ఏం మాటాడాలో నాకు తెలియదు. అయినా ఆమెతో మాట్లాడాలి. ఆమె సహచరుడు మీలో ఎవరికైనా సందేహాలున్నాయా అని అడిగాడు. మావాళ్లు అందరూ బిడియంతో ముఖాలు చూసుకుంటూ తత్తరపాటు పడుతున్నారు. నాకు తెలియకుండానే నేను చేయెత్తాను. ఆమె దరికి ఎలా చేరానో నాకే తెలియదు.

మిస్ కెల్లరు నా ముఖంపై ఆమె హస్తాన్ని ప్రశ్న చదవటానికి ఉంచారు. ఆ వేళ్లు నా మాటలు చదువుతున్నాయి. అరచేయి నా పెదవులను చదువుతోంది. అప్పటికీ నా కింకా ఏం మాట్లాడాలో తెలియదు. ఆమె చేయి మాత్రం నా ముఖం నుంచి వైదొలగలేదు.

తుదకి నా హృదయంలో ఉన్నదేదో వెళ్లగ్రక్కాను. "మీరెందుకు ఇంత ఆనందంగా ఉన్నారు?"

ఆమె ఒకటే నవ్వు. ఆ నవ్వు ఏ పార్శ్వం నుంచి వచ్చిందో మరి! ఎత్తైన సరుగుడు వృక్షసముదాయాల నుంచి వచ్చే ధ్వని లాటిదా నవ్వు.

ఆమె కంఠధ్వని వివిధ స్థాయిలలో తారట్లాడుతూంటే అన్నారు – "బిడ్డా! ఎందుకంటే, నేను ప్రతి రోజూ ఇదే ఆఖరి దినం అన్నట్లుగా బ్రతుకుతానమ్మా! ప్రతి క్షణం నాకెంతో వైభవోపేతమైనదే.."

ఆంగ్లమూలం: Jean Houston
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

Vol. 36, No. 5
May 2007

Registered: TN/PMG(CCR)/39/06-08
WPP No. 35/06-08

AKHILA - Akhila Bharat Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)
Published on 1st day of every month.

Matter shall reveal the Spirit's face.

Sri Aurobindo

ఉన్నత ఆధ్యాత్మిక స్థాయి చేరవలసినవాడు అనంతమైన శోధనలు, పరీక్షలు ఎదుర్కొని సాధించాలి. కాని చాలా మంది పరీక్షకునికి లంచమివ్వటానికే ఆతురత చూపిస్తారు.

శ్రీఅరవిందులు

Editor: Karra Venkateswarlu
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society,
No. 1, Rangapillai Street, Pondicherry - 605001
Printed by Amiyo Ranjan Ganguli at Sri Aurobindo Ashram Press,
38, Goubert Avenue, Pondicherry - 605001

Single copy: Rs. 15 **Annual Subscription: Rs. 125 (in India)**

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY, PONDICHERRY - 605002

7/06/07 Rs. 15



దివ్యకృప

అఖిల

అఖిల భారత పత్రిక, జూన్ 2007

7/06/2007

దివ్యకృప

(శ్రీమాతారవిందుల మాటలలో)

విషయసూచిక

అనుగ్రహం అంటే ఏమిటి?

ప్రేమ అనేదానిమూలంలోనే అనుగ్రహంగా మార్పు చేయబడినది ఏదో వుంది. అది వికసించే ఓదార్పులాంటి స్పందన, ఒక మధురిమ. ఒక శక్తి....

*

అనుగ్రహం! సర్వాన్ని తనలో ఇముడ్చుకొని ఆర్ద్రతతో కూడిన స్పష్టమైన చూపుతో అన్నింటినీ అధిగమించగలిగే అనుగ్రహం.

*

నిన్ను నీ గమ్యం వైపుగా నడిపించేది అనుగ్రహం. దాన్ని నీ మనస్సుతో వర్ణించే ప్రయత్నం చేయకు. అది నీవల్ల కాదు. వర్ణించ వీలులేని ఒక మహత్తరమైన భావవల్లరి అది.

*

అవధులులేని ఆ అనుగ్రహపు జల్లులో తడిసి ముద్దవుతావు. అందుకు దానికదే సాక్ష్యం.

శ్రీమాత

*

అనుగ్రహం అనేది పరిశోధించి తెలుసుకొనేది కాదు. అదొక ఆధ్యాత్మిక అనుభూతి.

*

దివ్యచేతనలోతుల నుండి స్వతస్సిద్ధంగా ఎగసివచ్చి నిరంతరం ప్రవహించేదే అనుగ్రహం అంటే.

శ్రీఅరవిందులు

అనువాదం: కొంగర భాస్కరరావు

దివ్యానుగ్రహం శ్వాసతోనే
మన జీవితాలు వర్ధిల్లుతున్నాయి

కొన్ని పరిస్థితులు, సన్నివేశాలు అవి చిన్నవైనా, పెద్దవైనా ఎదురై నపుడు అవి నీవు కోరినవిధంగా లేనపుడు "ఆహా! ఇవి ఇలా కాకుండా మరోలా ఉంటే ఎంత బాగుండేది" అనుకుంటావు. తర్వాత అలా కొన్ని సంవత్సరాలు గడుస్తుంది. పరిస్థితులన్నీ మారుతూంటాయి. ప్రగతిని సాధిస్తూ వుంటావు. నీలో చైతన్యం విచ్చుకుంటుంది. అవగాహన పెరుగుతుంది. ఒక్కసారి వెనక్కు తిరిగి చూసినపుడు నీకు ఆశ్చర్యం కలుగుతుంది. నీలో నీవు అను కుంటావు. ఆయా పరిస్థితులన్నీ నీవనుకున్నట్లుగా జరిగివుంటే నీవీనాడు సాధించిన అభివృద్ధి సాధించి వుండేవాడవు కాదని, అపుడు నీవు తెలివిగలవాడవైతే "నిజం! భగవంతుని అనుగ్రహం అనంతమైనది సుమా... అని నీకు నీవే చెప్పుకో.

అలా చాలాసార్లు జరుగవచ్చు. మానవుడు ఎంత అంధకా రంలో పడి కొట్టుమిట్లాడుతున్నా పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నట్లు పైకి కన్పించినా, అనుగ్రహం అనేది ఎల్లవేళలా పని చేస్తూనే వుంటుంది. ప్రపంచం అర్థం చేసుకోలేకపోయినా, ఆ క్షణాల్లో జరగాల్సిన మంచే జరుగుతుంది. కానీ మనం కేవలం మన పరిమితులలోనే వున్నాం. అంతేకాదు. మన ఇష్టాయిష్టాలు అనేవి ముందు చూపులేనివి. ఎందుకూ కొరగానివి. అంధకారబంధుర మైనవి అని తెలుసుకుంటావు.

మానవమేధస్సు ఏదైనా స్పష్టంగా కన్పిస్తే తప్ప సరిగ్గా అర్థం చేసుకోదు. నీకీ విషయం తెలుసా! ఏవో (ఉపద్రవాల నుండి) తాము బయటపడినట్లు కృతజ్ఞత తెలుపుతూ నాకు చాలా ఉత్త రాలు వస్తూంటాయి. అంతేకాదు. చాలా చాలా తరచుగా మాత్రమే వారికే మాత్రం (కష్టం) కలగలేదని కృతజ్ఞతలు తెలియజేస్తూ కూడా జవాబులు వస్తుంటాయిలే. ఏదో ప్రమాదం ముంచుకొ చ్చిందనుకున్నపుడో లేక తృటిలో ప్రమాదం నుండి సురక్షి తంగా బయటపడినపుడో, అప్పుడు మాత్రమే అనుగ్రహం పనిచే

సిందని తెలుసుకుంటారు. అలాంటి సమయాలు ఎదురైనప్పుడే వారికి ఆ సంగతి తెలుస్తుంది. ఏదో ఒక సంఘటన లేదా ప్రయాణం: ఏ ప్రమాదం లేకుండా హాయిగా జరిగినపుడు అది కూడా ఆ అనంతమైన అనుగ్రహంతోనే సాధ్యమైందని వారు తలపోయరు. పరిస్థితులన్నీ చక్కగా, సానుకూలంగా వుండే విధంగా (ఏ అవాంఛనీయ సంఘటన జరుగకుండా) ఆ ఏర్పాటు చేయబడింది. కానీ అదంతా వారికి సహజంగానే (సాధారణ విష యంగానే) కన్పిస్తుంది. ఎవరైనా తీవ్రంగా జబ్బుపడి సీఘ్రంగా కోలుకున్నపుడు వారు కృతజ్ఞత చూపిస్తారు. అంతేగాని ఏ అనా రోగ్యం లేకుండా హాయిగా వున్నపుడు కూడా అదొక అద్భుత మేనని వారు అనుకోరు.

*

మన జీవితంలో అనుక్షణం, అన్ని పరిస్థితులలోనూ, మన సంక టస్థితుల నుండి మనల్ని బయటపడవేసేందుకు అనుగ్రహం సహా యపడుతూనే వుంది.

*

అనంతుని శక్తి అనంతంగానే వుంది. దాని ముందు మన విశ్వా సమే చాలా అల్పంగా వుంది.

*

భగవంతుని అనుగ్రహం ఎంతో ఎంతో విశాలమైనది. మానవుడు దానిని అందుకోలేకపోతున్నాడు.

*

భగవంతుని సహాయంతో సాధించలేనిది ఏదీ లేదు.

మూలం: శ్రీమాత
అనువాదం: కొంగర భాస్కరరావు

దివ్యకృప – నీ తోడ్పాటు

భగవత్కృప యెంత నిర్దుష్టంగా, ఖచ్చితంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తుందో తెలియదు. అదెంత అద్భుతంగా, అపారంగా పని చేస్తుందో కూడా నీవెప్పటికీ కనిపెట్టలేవు. ఇందులో నీకు భగ వంతుడిపై యెంత విశ్వాసం, నమ్మకం వున్నది – అన్నది ప్రధానం కాదు. సందర్భాన్ని బట్టి యెప్పుడు యేం జరుగుతుందో దేశకాలపరిస్థితులు అంచనావేసి చెప్పగలిగే సామర్థ్యం నీకు ఎంతగా వున్నదీ అన్నదికూడా అనవసరం. ప్రతి చిన్నవిషయం వెనుక ఈ కృప ఎంతెలా పనిచేస్తున్నది, ఎలా నిర్వహించి నడు పుతున్నది నీవు ఎన్నటికీ గ్రహించలేవు. కాబట్టి వాటి గురించి పట్టించుకోకు. ప్రపంచ పరిస్థితుల్ని దృష్టిలో వుంచుకొని యెంత త్వరగా వీలైతే అంత త్వరగా దివ్యసాధనలో సంపూర్ణ సామర స్యంతో పరిపూర్ణత సాధించు. ఈ విషయం ఇదివరకెక్కడో నేను చెప్పడమో, వ్రాయడమో జరిగింది.

ఈ దివ్యమార్గంలోకి నీవు అడుగుపెట్టినది లగాయితూ ప్రతిక్షణం, ప్రతి చిన్నవిషయంలో ఎంత కళ్లు మిరిమిట్లు కొలి పేటట్లుగా నిరంతరము ఈ దివ్యకృప ఎలా పనిచేస్తూంటుందో చూస్తావు. శాశ్వతమైన ఈ కృప నిరంతర జోక్యంతో ఏదీ నీకు ఆశ్చర్యంగానూ, అద్భుతంగానూ ఉండకుండా ఉండదు. దీనిని ఎప్పుడైతే గ్రహించావో దానికి సాటి యేదీ లేదని తెలుసుకుం టావు. అది ఎప్పటికీ మరువలేవు. అందుచేత నిన్ను భయం, క్రోధం, విచారం లాంటివేవీ బాధించవు. ఎప్పుడైతే వ్యక్తి ఈ కృపని పొందేడో, అణువణువునా దానిని దర్శించగలిగేడో, యిక అందులోనే జీవిస్తాడు. అది అత్యంత ఆహ్లాదము, సర్వశక్తిమంత మయిన పరమానందకర జీవితము. అదే దివ్యసాధనలో (పరమా త్మతో) collaboration in the divine work పరమోత్కృష్ట సహ కారము.

*



The Mother giving Darshan from her terrace
15 August 1969

ఎప్పుడైతే వర్ణనాతీతమైన అద్భుతస్థితిలోకి మనిషి ప్రవేశించగలి గేడో, అప్పుడే దానిని దర్శించడం ప్రారంభిస్తాడు. ఈ దర్శనాల వెనుకగల దైవకృప గుర్తిస్తాడు. ఆ కృప అనంతము, అద్భుతము, సర్వశక్తిమంతము. అది అన్నీ తెలిసినది. దేనినైనా నిర్వహించగలిగినది. అన్ని వస్తువులను సక్రమంగా అమర్చగలిగినది. మనిషికి నచ్చినా, నచ్చకపోయినా, మనం గుర్తించినా, గుర్తించకపోయినా, మనల్ని పరమోన్నత లక్ష్యం వైపు నడిపించగలిగేది. అదే మనలో దైవస్పృహని కలిగించేది. దైవంతో సంయోగపర్చేది.

అప్పుడు వ్యక్తి దైవసన్నిధి, దివ్యక్రియాకలాపంలోనే జీవిస్తాడు. ఆ జీవితం కృపాపూర్ణమై అద్భుత ఆనందమయజీవితంగా భాసిస్తుంది. ఆ అనుభూతి పరిపూర్ణ ప్రశాంతతతో కూడినదై ఎప్పటికీ ఏదీ కదిలించలేని నిశ్చలతతో మహత్తర బలోపేతంగా ఉంటుంది.

ఎప్పుడైతే మనిషి సమగ్ర శీఘ్ర గ్రహణశక్తి, పరిపూర్ణమైన పట్టు సాధిస్తాడో అప్పుడు దివ్యప్రక్రియకి అడ్డుపడే ప్రాపంచిక అవరోధాలన్నిటినీ బలహీనపరుస్తాడు. ఫలితంగా దివ్యకార్యక్రమానికి తన మహోత్కృష్ట సహకారం అందించగలుగుతాడు. పరమాత్మ కేది అభిలషనీయమో మనిషి గ్రహిస్తాడు. దివ్యసంకల్పానికే గట్టిగా అంటిపెట్టుకుని ఉంటాడు.

*

మొత్తం అభివ్యక్తీకరణలో అనంతమైన పరమాత్మ కృప స్థిరంగా పనిచేస్తూ ఈ ప్రపంచాన్ని తానున్న మూఢ అవాంఛనీయశక్తుల నుండి, కష్టాల నుండి కాపాడుతుంది. ఈ కృప నిరంతరం, నిర్విరామంగా పనిచేస్తూనే వుంటుంది. ఈ జగత్తు ఇప్పటికంటె అత్యంత సత్య, శివ, సుందరంగాను, మహత్తరంగాను ఉండటానికి, అందుకు జాగృతం కావటానికి, ఇంకా ఎన్ని వేల సంవత్సరాలు పడుతుందో కదా! పరమాత్మ కరుణకి వ్యతిరేకంగా ప్రపంచంలో భయంకరమైన ప్రతిబంధకం పనిచేస్తూ వుంటుంది. ప్రతి మనిషి తన సత్వములోనే యీ ప్రతిబంధకాన్ని ప్రతిఘటన తీవ్ర

తని తెలుసుకోగలడు. ఊర్ధ్వలోకాల నుండి వచ్చే దివ్యశక్తి, దివ్య కాంతి పొందగలిగితే తప్ప మానవులు ఈ ప్రతిబంధకాన్ని ఎదు ర్కోలేరు. బాహ్యావస్తుపరిజ్ఞానం, మానసిక నిర్మాణవ్యవస్థ ఇంకా ఇతర పదార్థసంబంధమైన ప్రయత్నాలుగాని, అవగాహనలుగాని, పనిచేయవు. మనిషి నిశ్చితమైన పురోగతి సాధనకి సంసిద్ధుడు కావాలి. అప్పుడే ఈ సత్యం తనంతట తాను అభివ్యక్తమవుతుంది. కాబట్టి దానికి కావలసినది నిజమైన క్రియాశీల దృక్పథం, సమగ్ర సంపూర్ణ ఆత్మార్పణ మాత్రమే. మనని అధిగమించి ప్రతి వస్తు వుని మార్చగలిగిన యే శక్తయితే వుందో దానిని సాధించాలి. నీలోనే వున్న ఆ దివ్యశక్తి వైపు నీ అంతట నీవే తెరుచుకోగల గాలి. అప్పుడే ఆ దివ్యజీవనం రుచి వాచవిగా తెలుస్తుంది. అది మాత్రమే జీవించదగ్గ జీవితం అని తెలుసుకుంటావు.

*

ఈ నిర్బంధ కఠినసూత్రాలు నిన్ను దివ్యశక్తియొక్క సృజనాత్మక శక్తి నుండి, పరమాత్మయొక్క కరుణాకటాక్ష, సత్యశక్తుల నుండి వేరుచేస్తున్నాయి. నీ ఆకాంక్ష, నడవడివల్ల నువ్వు అర్థం చేసు కోగలవు. ఒక ఉన్నత నూతన మౌలికాంశం – ప్రస్తుతం దానినే మనం అధిమానస అంశంగా Supramental element అనుకుం టున్నదానిని – ప్రస్తుతం సిద్ధంగావున్న సంయోగాలకి పరిచయం చేస్తున్నావు. వాటిని అకస్మాత్తుగా మార్చగలవు. అవసరాలు, తప్పించుకోలేని సిద్ధాంతాలు అంటూ చెప్పబడే ఈ అనవసర సరంజామా అంతా అసంగతమైపోతుంది. అంటే నీ అంతట నువ్వే ఇంతవరకు నీలోవున్న భావాలు, నడవడి ఏదో కుంటిసా కుతో వాటికి సానుకూలంగా వొప్పుకునే కొన్ని సూత్రాలకి ఆశ్చర్యకరంగా తెరదించుతావు. వాటి నిజస్వరూపం తెలుసుకు న్నప్పుడు అవి అంత ఆశ్చర్యకరమైన మహిమలు కావన్నది తెలుస్తుంది. కేవలం బాహ్యాచైతన్యానికి మాత్రమే అవి అలౌకిక మహిమలుగా కనిపిస్తాయి. తర్కంతో సహేతుకంగా వున్నాయని నీకు నువ్వు చెప్పుకోవచ్చు. “సరే, నేనిది చేసినట్లైయితే అది సంభవమౌతుంది. నేను కాదు అనుకుంటే అది మరొకలా అవు

తుంది" అని. అందుచేత అటువంటి వాటికి అడ్డుతెర వైదొలగిం చవలసినది నువ్వే. అలా కాకుంటే, భగవత్కృప యొక్క స్వేచ్ఛా ప్రక్రియకీ, నీకూ, మధ్య నీ అంతట నువ్వే ఇనుపతెర నడ్డం పెట్టుకున్నవాడివి అవుతావు.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

అనుగ్రహంయొక్క మరో దృక్కోణం

ఒకప్పుడు మనిషి ఆధ్యాత్మిక అభిలాష, ఆకాంక్షలు ప్రాపంచిక విషయాల కతీతంగా, కర్మలాచరించకుండా నిశ్శబ్ద, ప్రశాంతతల వైపు మరలి ఉండటమే. జీవిత సంఘర్షణల నుండి తప్పుకొని, పోరాటాల నధిగమించి జీవితంనుండి సుదూర ఉన్నతభూమికల పైకి ఎగసిపోయేదిగా వుండేది. అది జీవితంలోని అన్నివిధాలైన ఆదుర్దాల నుండి, మనస్తాపాలనుండి, కర్మలనుండి, బాధలనుండి తప్పుకొని మనుగడ సాగించే ఆధ్యాత్మికశాంతిగా చెప్పుకొనబ డేది. ఇదే సత్యమైన ఆధ్యాత్మిక జీవితంగాను, దివ్యజీవనంగాను పరిగణింపబడేది. ఇదే దివ్యానుగ్రహం గాను, దైవసహాయంగాను, దైవజోక్యంగాను భావించబడేది. ఇప్పుడు కూడ అంటే మనోవ్య ధలు, రక్తపోటు, మితిమీరిన ఆదుర్దాలకు ఆలవాలమై వుంటున్న యీ ఆధునిక యుగంలో కూడ ఈ పరమశాంతియే సర్వులకు శ్రేష్ఠమై, సహకరించేదిగా వుంటున్నది. ప్రజలు తమ బాధలకు ఓదార్పుగా, ఆశించి స్వాగతీకరిస్తూన్నది ఇలాంటి ప్రశాంతతనే. చాలామందికి ఇప్పటికీ ఈ పరమశాంతియే దైవానుగ్రహాలబ్ధి.

ఎవరు ఏది పొందాలని అనుకున్నా సరే, ఈ మారని స్థిర మైన శాంతిని ప్రాథమికంగా తనలో ప్రతిష్ఠించుకోవాల్సి వుంది. అతడు చేయాల్సిన సాధనకు ఇదే మూలాధారం కావాలి. కాని అతడు వ్యక్తిగత అహంకారంనుండి విముక్తి పొందాలంటే మాత్రం

పరమశాంతినేగాక, ఇంకా ప్రత్యేకమైన ప్రగతికి కలలు కంటుంటే మరి అంతటితో ఆగిపోకూడదు.

దైవానుగ్రహానికి మరో పార్శ్వం లేదా మరో దృక్కోణం వుంది. అన్ని ఆటంకాల నుండి, విజయాన్ని పొందే అభివృద్ధి సాధించే దృష్టి. అది మానవాళిని నూతనసిద్ధికి పురోగమింపచేస్తుంది. నూతన లోకాలకి ద్వారాలు తెరుస్తుంది.

*

శాంతి అంటే జీవితాంతం ఒడుదుడుకులులేని ప్రశాంతమార్గంలో నడిపేదేనని మనుష్యులు నమ్ముతారు. కాని అది సత్యం కాదు.

అనుగ్రహం పనిచేసినప్పుడు దాని ఫలితం హర్షణీయంగా ఉండవచ్చు, ఉండకనూపోవచ్చు. అది మానవ విలువలను పరిగణించకపోగా, అనుగ్రహ ఫలితం సాధారణదృష్టిలో ఘోర విపత్తుగాను వుండవచ్చు. కాని అదే ఎల్లప్పుడు మానవునికి అత్యుత్తమమైనదిగా వుంటుంది. అది దైవ ఆఘాతం. మానవప్రగతికి ఇతోధికంగా సహకరించేదిగానే ఉంటుంది. దైవానుగ్రహం దైవ సాక్షాత్కారసిద్ధి వైపుగా నిన్ను వేగిరపరచేదిగా ఉంటుంది సుమా!

*

నీవు నిష్కపటంగా ఆధ్యాత్మిక జీవితాన్ని ఆకాంక్షిస్తే, కొన్ని సమయాల్లో, విచారకర పరిస్థితులు నీపై కుప్పతిప్పలుగా పడతాయి. నీవు నీ ఉత్తమ స్నేహితులతో పోట్లాడుతావు. నిన్ను నీ కుటుంబీకులు ఇంట్లోనుండి గెంటివేస్తారు. నీవు సంపాదించుకున్నదంతా కోల్పోతావు. యోగాన్ని, జ్ఞానాన్ని పొందాలన్న గొప్ప ఆకాంక్షతో భారతదేశం వచ్చిన ఒక వ్యక్తిని నేనెరుగుదును. ఇది చాలా కాలం క్రిందటి మాట. ఆ కాలంలో ప్రజలు గడియారం గొలుసులు, బంగారు గొలుసులు ధరించేవారు. పైన పేర్కొనబడిన వ్యక్తి అతని అవ్వ అతనికి బహూకరించిన బంగారు పెన్సిలును కలిగివుండేవాడు. అది అతనికి ప్రపంచంలోని అన్ని వస్తువుల కన్నను యెంతో విలువైనది. ఆ పెన్సిలును అతడు తన చైనుకు కట్టుకొనివున్నాడు. అతడు పాండిచ్చేరి ఓడరేవు వద్దనో లేదా భారతదేశమందలి మరో ఓడరేవు వద్దనో కాకపోతే కొలంబో

ఓడరేవు వద్దనో – కొలంబో వద్దనే దిగాడనుకొంటాను. ప్రయాణీకులు స్టీమర్ నుండి చిన్న పడవల్లో సముద్రం ఒడ్డుకి కొనిపోబడేవారు. మన కథానాయకుడు ఓడనుండి చిన్న పడవలోనికి దుమకవలసి వచ్చింది. ఆ దుముకుటలో అతని కాలు జారింది. అయినా కష్టంపై నిలద్రొక్కుకొన్నాడు. కాని అతని బంగారు పెన్సిల్ సముద్రంలో పడి నేరుగా సాగరగర్భాన్ని చేరుకొంది. తొలుత అతడు చాలా విచారించాడు. కాని వెన్వెంటనే "విచారమెందుకు? ఇది భారతదేశ ప్రభావం. నేను బంధాలనుండి విముక్తుడనయ్యాను" అని తనలో తాను అనుకున్నాడు. అటువంటి పరివర్తన నిష్కపటులైన జనులకు చేకూరుతుంది. ప్రధానంగా నిష్కపటవర్తనులనే కష్టాలు కౌగలించుకొనేది. సుజనులుకాని వారు అందమైన కాంతులీనే విషయాలచే ఆకర్షితులవుతారు. అవి వారిని మోసగించటానికే అలా ఆకర్షిస్తాయి. కాని చివరకు అవి మీరు పొరబడ్డారని గ్రహించేట్లు చేస్తాయి.

*

ఉరిశిక్ష అమలుజరుపబడబోవు నేరస్థుని చూచి సర్ ఫిలిప్ సిడ్నీ "భగవదనుగ్రహం లేకపోవటం వల్ల కదా సర్ ఫిలిప్ సిడ్నీ అలా వెడుతున్నాడు" అన్నాడు. అతడు జ్ఞానియై వుండి వుంటే "దైవానుగ్రహంచేతనే కదా సర్ ఫిలిప్ సిడ్నీ అలా వెడుతున్నాడు (ఉరితీయబడటానికి)" అని అనివుండేవాడు.

శ్రీఅరవిందులు

ప్రశ్న: ఈ సూక్తి నా కర్థం కాలేదు.

శ్రీమాత: సర్ ఫిలిప్ సిడ్నీ రాజతంత్రజ్ఞుడు. కవి కూడ. జీవితం సుఖమయంగా సాగించినవాడు కూడా. ఆయన వినయ సంపన్నుడుగానే మనుగడ సాగించాడు. ఒక నేరస్థుడుకి ఉరిశిక్షను అమలుపర్చటానికి తీసుకుపోబడుతూంటే, చూచిన ఆయన శ్రీఅరవిందుల సూక్తిలో చెప్పిన మాటలు చెప్పి ఉండవలసినవాడు. అంటే దాని అర్థం. దైవానుగ్రంహా వల్లనే అతనికి ఉరిశిక్ష పడింది. దైవానుగ్రహమే ఉంటే అదేదో నాకూ పడేది. ఎందుకంటే దైవానుగ్రహం ఎల్లప్పుడూ, ఎల్లవేళలా, ప్రతిసంఘటన వెనుక

వుంటుంది. ఆ అనుగ్రహ ఫలితంపట్ల, గ్రహఫలితం పట్ల మన ప్రతిస్పందన యెలా వున్నా; అది మనకు మంచిగా వున్నా లేక చెడుగావున్నా – విపత్తుగావున్నా లేక ప్రయోజనకారిగావున్నా – అది జరిగి తీరుతుంది. అంటే మంచికి చెడుకూ అంతటికీ దైవానుగ్రహమే కారణం అవుతుంది.

సర్ ఫిలిప్ యోగియై వుండి వుంటే సకల మానవాళిలో తనను చూచుకొనే స్థితిని పొంది (తాదాత్మ్యతాభావం) ఉరికి గొనిపోబడుతున్నది తానే అని లేదా తనలో ఒక భాగమని అనుభూతి నందగల్గి వుండేవాడు. అంతే కాదు, యేది సంభవించినా దైవానుగ్రం వల్లనే సంభవిస్తుందని కూడ ఆయన తెలిసికొని వుండేవాడు.

మూలం: శ్రీమాత
అనువాదం: బి. నరసింహయ్య

అనుగ్రహం – ఆవాహన

ప్రశ్న: పిలుస్తే దైవనుగ్రహం లభిస్తుందా?

పిలిస్తేనా! అలాగే అనుకుంటాను. ఏమైనా అంత పూర్తిగా. సమగ్రంగా మాత్రం కాదు. అయితే దైవకృపపై నమ్మకం ఉండాలి. పసిపాప అమ్మ వద్దకు వెళ్లి "అమ్మా! నాకిది ఇవ్వవా" అని అడిగితే తప్పక ఇస్తుందనేటంతటి సహజమైన నమ్మకం ఉండాలి. అలా అడుగుతే దైవం నీ పిలుపు వింటాడు. నీకు మంచిది కానిది, హాని కలిగించేది అననుకూలమైనదీ అడుగుతే మాత్రం నీ మాట వినడు.

ప్రశ్న: పిలుపునకు కార్యకారణ సంబంధం ఏమిటి?

బహుశా, మరో గత్యంతరం లేక పిలుస్తాడు. ఇది ఎలాంటిదంటే కోడి నుండి గ్రుడ్డు వచ్చిందా లేక గ్రుడ్డు నుండి కోడి వచ్చిందా? అని అడిగినట్లు అనుగ్రహాన్ని అర్థించమని నిన్ను ఆదే

శించింది అనుగ్రహమా, లేక నీవు పిలిచినందువల్ల అనుగ్రహం వస్తుందా? ఇది నాకు తెలియదు. చెప్పడం కష్టం.

ముఖ్యంగా, విశ్వాసం లోపించే అవకాశం ఎక్కువ. మనసులో ఎక్కడో ఒక మూల సందేహం దాగి ఉంటుంది. అదే మరి అంతటిని చెడగొడుతుంది. నీవు మరీ క్లిష్టపరిస్థితిలో ఉన్న సమయంలో, మనసు ఇక తానేమీ చేయలేనని తెలుసుకొన్నప్పుడు, అది నిస్సహాయమైపోయినపుడు, తీవ్రదుఃఖంతో దైవరక్షణను ఆకాంక్షించినపుడు కొంత ప్రయోజనం ఉంటుంది. అయితే ఇంకా అప్పుడు కూడా నీ ఆలోచన క్రిందిమీదిలాడుతూ – నేను ఆకాంక్షించాను. ప్రార్థించాను; భగవంతుడు సమయం కోసం చూస్తున్నాడు; వెళ్లాలా వద్దా అని – ఈ ఊగిసలాటలో ఉంటే మాత్రం, మరింతే సంగతులు. ఏమీ కాదు. ఇదే సాధారణంగా జరిగేది.

దైవానుగ్రంహాపై నమ్మకం ఉండాలి. దైవానుగ్రంహా అన్నది ఒకుటన్నదనే యెరుక ఉండాలి. అది ప్రార్థనకు, ఆకాంక్షకు ఆవాహనకు బదులిస్తుందని విశ్వసించాలి. నిర్ధారణ చేసుకోవాలి. అపుడు దానిపై నమ్మకముంచి దాసోహమని అన్యథా శరణం నాస్తి అనుకుని అర్థించినచో, దైవకృప కల్పించుకుంటుందని విశ్వసించి ప్రార్థిస్తే, అప్పుడది, రూఢిగా కల్పించుకుంటుంది. విజయానికి అవకాశం ఉంటుంది. ప్రయత్నించు ఫలితం నీకే తెలుస్తుంది.

ప్రశ్న: అయితే అమ్మా! దైవానుగ్రహసాయానికి ఎవరైనా నిజాయితీతో ప్రార్థించినపుడు ప్రత్యేక ఫలితాన్ని ఆశిస్తాడు కదా?

మన్నించాలి. అది ప్రార్థనాసరళిపై ఆధారపడి ఉంటుంది. సహజంగా దైవానుగ్రహాన్ని ఆవాహనం చేసి, తనను తాను ఆయనకు సమర్పించుకొనినచో అతడు ఎట్టి ఫలితాన్నిగాని ఆశించడు. ఒక ప్రత్యేక ఫలితాన్ని ఆశించుటకు, అతడు తన ప్రార్థనను ప్రత్యేకంగా రూపొందించుకోవాలి. కావలసినదాన్ని అర్థించాలి. నీవు దైవానుగ్రహానికై మాత్రం గొప్ప ఆకాంక్ష కలిగి, ఏ ప్రత్యేక కోరిక లేకుండా, అర్థిస్తే అప్పుడు నీకు కావల్సినది ఆయనే అనుగ్రహిస్తాడుగా!

ప్రశ్న: అదే చాలా శ్రేష్ఠమైనది కదా?

ఆ! అది వేరే ప్రశ్న. ఎందుకంటే అది గుణాధికమైనది. అయినా నీవేదైనా ప్రత్యేకంగా అర్థించినపుడు నీవు దానిని స్పష్టంగా అసందిగ్ధంగా సూత్రీకరించుకోవటం మంచిది.

సంపూర్ణ శరణాగతిలో తనను తాను పూర్తిగా దైవానికి అర్పించుకొని దైవనిర్ణయానికి వదలిపెట్టినట్లైతే అది చాలా శ్రేష్ఠ మైనది. అయితే తర్వాత మళ్లీ ప్రశ్నించనే కూడదు. "అయ్యో! ఇది నేను ఆశించి చేశాను". అనకూడదు.

*

ఏదైనా ప్రత్యేకంగా నీవు పొందాలని భావించినపుడు నీ కోరి కను చిత్తశుద్ధితో అర్థించు. ఆపైన చేయవలసినదేదో దివ్యకృపయే నిర్ణయిస్తుంది. తనకు కావలసినదాన్ని స్పష్టంగా వ్యక్తీకరించ టంలో ఎట్టి హానీ లేదు.

ఇది ఎక్కడ పాడవుతుందంటే, నీ కోర్కె నెరవేర్చబడలే దని తిరగబడినప్పుడు. ఆకాంక్షలో అతడు తన కోరిక, తన ఆకాంక్ష ఒక వేళ వివేకవంతమైనది కాదేమో, మంచిది కాదేమో నని అర్థంచేసుకోవాలి. అప్పుడు తాను వివేకంతో (సింపులుగా) వినయంతో "మంచిది! స్వామీ! నీ ఇచ్ఛయే నెరవేరబడనీ" అను కోవాలి. అపుడు చేయవలసినది దైవమే నిర్ణయించుకుంటుంది. నీవు లోపల స్పష్టమైన అవగాహనతో నీకు కావల్సినది ఏదైనా ఉంటే సూత్రీకరించి అర్థించడంలో తప్పు లేదు. ఇది సహజమై నదే.

ఉదాహరణకు మూర్ఖంగా ఉన్నా, పొరపాటు చేసినా, చిత్త శుద్ధితో ఇక ఇలాంటి పొరపాటు ఎప్పుడూ చేయనని నిర్ణయించు కుని దైవకృపను అభ్యర్థిస్తే, అది హానికరమైనది కాదు. నీ లోలో పలి అంతరంగం నుంచి వచ్చిన చిత్తశుద్ధితో కూడిన నీ అభ్య ర్థన మన్నింపబడే అవకాశం ఉంది.

దైవం నిన్ను వ్యతిరేకించుటకే ఇష్టపడతాడని నీవు తలం చకు. అలా చేయడంలో ఆయనకు ఏలాంటి పట్టుదల ఉండదు. నీకు ఏది మంచిదో నీకన్నా ఆయనకే బాగా తెలుసు. తప్పనిసరి

అయితే నీ ఆకాంక్షను ఆయన వ్యతిరేకిస్తాడు. అలా కానిచో నీవు కోరిన దాన్ని ప్రసాదించుటకై ఆయన సదా సంసిద్ధంగానే ఉంటాడు.

మూలం: శ్రీమాత
అనువాదం: నైనారు అప్పాస్వామి

నమ్రత – కృతజ్ఞతాభావం

ప్రశ్న: కృతజ్ఞతాభావంతో దైవకృప నంగీకరించే మార్గమేది?

ఆహా! మొదట దీని అవసరాన్ని భావించాలి. ఇదీ అత్యావశ్యకమైనది. అంతరంగంలో ఓ విధమైన వినయం ఉంటే తప్ప దైవకృప లేనపుడు మనం ఎంత నిస్సహాయులమో అర్థం కాదు. నిజానికి 'కృప' లేకుండా మనం అసంపూర్ణులం, అశక్తులం అన్నది తెలుసుకోవడం మొదటి మెట్టు.

ఇదే మొదటి షరతు. నీలో ఆ విధమైన ప్రమత్తత కల్గినపుడు, 'కృప' తప్ప నిన్ను ఏదీ బయటకు లాగలేదు అన్న విషయం గుర్తించి, ఈ అశక్తతను తెలుసుకున్నప్పుడు సహజంగానే నీలో ఒక గాఢమైన ఆకాంక్ష మేల్కొంటుంది. నీవు దైవశక్తికి, కృపకు తెరుచుకుని ఉంటావు. ఎల్లవేళలా జాగృతమైన ఆకాంక్ష ప్రకాశిస్తుంది. నీవు పిలిచినపుడు, ఆకాంక్షించినపుడు నీకు సమాధానం దొరుకుతుందన్న ఆశ నీలో ఉదయించినపుడు నీవు ఆ కృపకు ఉన్మీలనుడవై ఉంటావు.

అయితే ఆ తరువాత ఒక విషయంలో నీవు గొప్ప జాగ్రత్తగా ఉండాలి. దైవకృప నీకు సమాధానమిచ్చి, నిన్ను నీ కష్టం నించి, నీ సమశ్య నించి బయటకు లాగినపుడు నీవు ఒక విషయాన్ని విస్మరిస్తావు. అంటే మీ కష్టం గట్టెక్కగానే, నీ సమస్యకు పరిష్కారం దొరగ్గానే దైవకృప సంగతి మరచి అంతా నీ గొప్పతనమే అనుకుంటావు. ఆ విధమైన స్వోత్కర్షతో కూడిన ప్రవర్తనతో నీకు నీవే దివ్యకృపాకటాక్షానికి తలుపు మూసి

తాళం వేసినవాడివే అవుతావు. ఇకపై నీకేదీ అందదు. ఆ తరువాత మళ్ళీ ఏదో తీవ్రవిపత్తు లేక భయంకరమైన కష్టం నీకు దాపురిస్తే తప్ప నీ తెలివితక్కువతనం నీకు మళ్లీ తెలిసిరాదు. అంతవరకు నీవేమీ చేయలేవు. మనమెంత అశక్తులమో తెలుసుకుంటూ ప్రమత్తతతో ఉన్నపుడే మన స్వభావం మృదువుగా మారి ఆ దైవకృపకు నిరంతరం తెరుచుకుని ఉంటుంది. అంతా నా వల్లే జరుగుతోంది, ఇది నా నైపుణ్యమే, ఆ 'సమర్థత' నాలోనే ఉంది అని భావించినపుడు... ఆ తక్షణమే నువ్వు దైవకృపకు దారులు మూస్తున్నావని అర్థం. నీ చుట్టూ ఓ అభేద్యమైన కోట కట్టుకుంటావు నీ అహంతో. నిజానికి మనిషిలో అతిపెద్ద లోపం చాలా త్వరగా ఉపకారాన్ని, మంచిని, దైవకృపని మర్చిపోవడం.

నిజాయితీగా ఉండడం చాల కష్టం.... అందుకే మనకి తగిలే దెబ్బలు రెట్టింపవుతూంటాయి. ఒక్కొక్కసారి భరించలేని ఇబ్బందులు కలుగుతాయి. ఎందుకంటే మన కళ్లు తెరిపించి, మన తెలివితక్కువతనాన్ని మనకి తెలియచేయటానికి ఆ బాధలు తప్పక అవసరం. మనకొచ్చే కష్టాలు, నష్టాలు న్యాయబద్ధమైనవే. చాలా బాధల్లోనో, మన హృదయాంతరాళాల్లో భరించలేని బాధ కల్గినపుడో తప్ప మనలోని ఈ తెలివితక్కువతనం పోదు. అయితే నీవు చెప్పినట్టుగా మానవస్వభావం ఎంతమారినా, ఇంకా ఎక్కడో కరడుగట్టిన అల్పత్వం చాలాకాలం ఉంటూనే ఉంటుంది.

ఎన్ని అఘాతాలు అవుసరమవుతాయో కదా జీవితంలో! – తాను ఏమీ కానని, ఏం చేయలేనని, అసలు తనకంటూ ఒక ఉనికియే ఉండదని, దివ్యత్వం లేనిదే తన అస్తిత్వమే లేదని తెలుసుకోడానికి! ఆ నిజం తెల్సుకున్న మరుక్షణంలో... సర్వం మారిపోతుంది. నీ కష్టాలన్నీ వైదొలగిపోతాయి. సర్వసమగ్ర దృష్టితో మనం ఏం కాదని గ్రహించినపుడు ఏ ఆటంకాలు ఉండవు. మరి ఆ జాగృతి కలగటానికి ఎంత సమయం పడుతుందో... వేచి ఉండవల్సినదే అంతవరకు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ఆటంకాలు, దైవానుగ్రహం, పురోగతి

కష్టాలు మూకుమ్మడిగా మిమ్ములను చుట్టుముట్టినపుడు ఈశ్వ రానుగ్రహము మీతోనే ఉన్నదని తెలుసుకోవాలి.

*

అన్ని జీవితపరిస్థితులూ మనకు పాఠం నేర్పటానికే క్రమపద్ధతిలో ఏర్పాటు చేయబడుతూ ఉంటాయి. మనకు అతీతంగా దివ్యకృప ఉన్నది. దానిపై నీకు ఉన్న విశ్వాసానికి అనుగుణంగా నీ బల హీనతల నతిక్రమించి, నీకు ఎదురయ్యే పరీక్షలను తట్టుకోవటా నికి అది నీకు శక్తి నిస్తుంది. దివ్యచైతన్యసంపర్కానికి దోహదప డుతుంది. ఇంకా శాంతి, ఆనందము, ఆరోగ్యము, శారీరక సౌష్ఠ వము ప్రసాదిస్తుంది.

*

భగవదనుగ్రహం అను క్షణం తనను వెన్నంటి ఉన్నదని, తనను నీడలా వెన్నంటి కాపాడుతున్నదని, అందుచేత ఏమి జరిగినా తనకేమీ కాదని, వెన్నంటి నిలిచిన దైవానుగ్రహమే తనను సుర క్షితంగా పురోగమింపజేస్తుందని భగవంతునిపై పరిపూర్ణమైన విశ్వాసంతో, శరణాగతితో మనుగడ సాగించేవానికి జీవితం నిస్సంశయంగా, సాఫీగా, సజావుగా సాగుతుంది. అది అత్యంత బలోపేతమైన, ఎరుకగలిగిన, అనంత శక్తి. అది నీ శరీరదారు ఢ్యంపై ఆధారపడదు. నీ దేహస్థితిగతులతో దానికి పని లేదు, అది దైవానుగ్రహానికి మాత్రమే నిబద్ధమైనది. దానికి దివ్యసత్యమే ఆధారం. కాబట్టి అది అచంచలము.

*

అశక్తత అనే వాదం అసంబంద్ధం. దైవానుగ్రహంతో సతతము తమను తాము సంస్కరించుకోవాలని దృఢంగా సంకల్పించినవా రికి చేదోడువాదోడుగా అది వెన్నంటి ఉంటుంది. అలాంటివారు "నేను దుర్బలుడను, నన్ను నేను సరిదిద్దుకోటానికి అశక్తుడను, అజ్ఞానుడను" అనుకోకూడదు. వారు తమను తాము సరిదిద్దుకో నుటకు ఇంకా నిర్ణయించుకోలేదని, దృఢమైన సంకల్పం వారిలో

కొరవడినదని చెప్పవచ్చు. అంటే వారి అస్తిత్వంలో ఏదో ఒక చోట ఏదో ఒకింత సందిగ్ధత ఉన్నదన్న మాట. అంటే ఇది చాలా ప్రమాదకరమైన విషయమే.

అశక్తతావాదం ఓ సాకు మాత్రమే. దృఢసంకల్పంతో తమను తాముద్ధరించుకోవాలన్న సంకల్పంగలవారికి మహత్తర మయినశక్తి, సమకూర్చటానికి సతతము దైవానుగ్రహాము సర్వస న్నద్ధంగా ఉంటుంది.

అది బలహీనత కాదు. చిత్తశుద్ధి లేకపోవటం. అంటే శత్రు వుకు ద్వారాలు తెరచి ఉంచటమే. ఇంకా చెప్పాలంటే కుటిల త్వంతో రహాశ్యంగా చేతులు కలపటం. ఇది మరి ప్రమాదమే కదా!

*

అంతా నీవేమి కోరుకొంటున్నావన్నదానిపై ఆధారపడి ఉంటుంది. నీకు యోగం సిద్ధించాలనుకుంటే, ఏమేమి సంభవించినా అదంతా నీ సంకల్పసిద్ధికి, గమ్యం చేరుకోటానికి దైవానుగ్రహం నీకు ప్రసాదిస్తున్నదిగా స్వీకరించు. పరిస్థితులు నేర్పే పాఠాలను చక్కగా అవగతం చేసుకోవటానికి ప్రయత్నించు.

*

ఎవరైతే పరమాత్మకు తమను తాము పరిపూర్ణ శరణాగతి గావిం చుకొన్నారో, వారికి ఎదురయ్యే ప్రతి ప్రతిబంధకమూ ఓ వినూత్న ప్రగతికి దైవం ప్రసాదించే హామీ. అందుచేత దానిని దైవకృప ప్రసాదించిన కానుకగా స్వీకరించాలి.

*

ఈశ్వరానుగ్రహ ఆకాంక్షగలవారి ముందు ఎల్లపుడూ కదలాడే ప్రతిబంధకం – అతడు తన ప్రత్యేక పద్ధతిలో ఏ మార్గం ద్వారా అనంతాత్మ సాక్షాత్కారం పొందాలనుకొంటున్నాడో ఆ దారికి ద్వారం తెరుచుకుంటున్నదని అర్థం.

ఇందులో ఇంకొక నిజం దాగుంది. అదేమిటంటే, ఎవరి నైనా లెక్కలేనన్ని కష్టాలు చుట్టుముట్టాయంటే, దాని అర్థం అద్భుత అనుభూతిని పొందనున్నాడన్న మాట. కాకపోతే ఒక

షరతు. ఓర్పు, సహనశక్తులతోపాటు లోపాలనన్నింటినీ సమూలంగా దహించివైచే మహోన్నత ఆకాంక్షజ్వాల వెలుగుతూన్నపుడే. సర్వసాధారణంగా దైవానుగ్రహం, నీ కష్టాలకి తగిన ప్రమాణంలోనే ఉంటుందని గుర్తుంచుకో.

*

భౌతికపదార్థంలో వచ్చిన పెద్ద చిక్కల్లా ఒక్కటే. భౌతికచైతన్యం (భౌతికమనస్సు) ప్రతిబంధకాల ఒత్తిడితో రూపొందినదే – కష్టాలు, ఆటంకాలు, ఆవేదనలు, ఆరాటాలు, పోరాటాలు – వీటితో అది రూపొందినదన్న మాట. వీటి ప్రభావం, ముద్ర మనసుపై ఉంటుంది. అందుకే దానికి సర్వత్రా చెడుమాత్రమే కనిపిస్తుంది. ఓటమిస్వభావమే కలిగి ఉంటుంది. ఇదే మనసుతో వచ్చే పెద్ద చిక్కు.

అత్యధికంగా భౌతికచైతన్యము, భౌతికమానసముల పురోగమనం కొరడా ఝుళిపింపుల ద్వారానే సాధ్యం. కృషి బాగా ఉండాలి. లేకపోతే ఇది తమోమయంగానే ఉంటుంది. ఎపుడూ కష్టాలనే ఊహిస్తుంది. ప్రతిబంధకాలు, అవరోధాలు – ఇదే ధ్యాస దానికి. మరి అలాంటప్పుడు ప్రగతి భయంకరంగా కుంటుపడిపోదా! ఈ ప్రతిబంధకాలన్నిటి వెనుక దైవానుగ్రహం ఉన్నదని, అపజయాల వెనుక విజయమున్నదని, వేదనల, వైరుధ్యాల వెనుక ఆనందం ఉన్నదని విశ్వసింపజేయటానికి అత్యంత వాస్తవమైన, సుస్పష్టమైన మరియు తరచుగా పునరావృతమయ్యే అనుభవాలు కావాలి.

*

మనం ఎప్పుడైతే మన చైతన్యం నుండి ఓటమి నంగీకరించే స్వభావాన్ని తరిమికొట్టగలమో, అప్పుడు మనం ఆత్మసాక్షాత్కార దిశకు గొప్పగా లంఘించగలం.

దైవానుగ్రం పట్ల పరిపూర్ణ విశ్వాసంతో మాత్రమే మనం మన నిర్ణిద్రచేతనలో ఉన్న ఓటమి స్వభావాన్ని జయించగలం.

మూలం: శ్రీమాత

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

దైవకృపవల్ల అనారోగ్య నివారణ

దివ్యకృప కార్యనిర్వహణకి ఎప్పుడూ సంసిద్ధంగానే ఉంటుంది. కాకపోతే అందుకు నీ వడ్డు రాకుండా, దాని పనినది కొనసాగ నీయాలి. ఇక్కడ ఒక్కటే షరతు. అదే – నమ్మకం. నీపై దాడి చేయబడినట్లు నీకేమైనా అనిపించినపుడు, శ్రీఅరవిందులవారి యొక్క, నాయొక్క సహకారాన్ని అర్థించు. నీ అభ్యర్ధన చిత్త శుద్ధితో కూడినదైనపుడు, అందుకు సమాధానం ఉంటుంది. దైవ కృప నీకు స్వస్థత సమకూరుస్తుంది – చిత్తశుద్ధితో నీ అభ్యర్ధన ఉండాలి.

ప్రశ్న: ఏ అనారోగ్యం కలిగినా శ్రీమాత నెలా ప్రార్థిం చాలి?

అమ్మా! నాకు స్వస్థత చేకూర్చు!

...ఈ అద్భుతం ఎప్పుడు జరుగుతుందంటే దైవకృప పట్ల ప్రగాఢ విశ్వాసంతో, పరిపూర్ణ చిత్తశుద్ధితో తన్ను తాను భగవద ర్పణం కావించుకోవటం ద్వారా మాత్రమే. కానీ ఇలా జరగటం లేదు. ఎన్నో భయాలు, కామనలు. భౌతికసత్వంపైన, దాని అవ సరాల పైన మాత్రమే భయంకరమైన ఏకాగ్రత. ఇది అంతా చిత్త శుద్ధితో కూడిన దైవార్పణకు విరుద్ధమే అవుతుంది కదా మరి!

*

మరోటేమంటే – కష్టాన్ని సూటిగా ఎదుర్కొనే బదులు తప్పిం చుకు పారిపోయే లక్షణం. కష్టం వచ్చినపుడు దానికి దూరంగా ఎగిరిపోవటం. కష్టాన్ని, సమశ్యని నేరుగా గ్రహించాలి. దానిపై పట్టు సాధించాలి. అంటే అంతరంగంలో సుస్థిరంగా ఉండాలి. అంతేకాని దీనిని నేను భరించలేనని నిరూత్సాహంతో చతికిల పడిపోకూడదు. మనసును నిశ్చలంగా ఉంచుకోవాలి. అంతేకాని అది ఎటు లాక్కెడితే అటు పోకూడదు. ప్రతికూల స్పందనలకు తలొగ్గకూడదు.

ఇదీ కావల్సినది. ఇదే – దివ్యకృప పట్ల నమ్మకం. దివ్యా నుగ్రహస్ఫూర్తి. ఆర్తితో కూడిన పిలుపు. ప్రతిఘటించే ప్రేరణలకు

లొంగిపోకూడదు. అందుకు బదులు, దివ్యకృపకు ఉన్ముఖమై, అద్భుతమైన దివ్యప్రేమకు ఉన్మీలనం చెంది, దాని కనుగుణమైన ప్రచోదనలతో చిక్కునుంచి బయటపడటం మేలైనది.

మొండిపట్టుదలతో కూడిన సాహసం నీలో లేకపోవటం, శక్తివిహీనంగా ఉండటం, మరీ భయంకరమైన పరిస్థితి. తరుచు ఎంతోమంది వచ్చి నాతో చెప్తూంటారు. "నేను చచ్చిపోతాను" "ఇక్కడ ఉండలేను" "నేను వెళ్లిపోతాను" వాళ్లకి నా సమాధానం ఎప్పుడూ ఒక్కటే – "సరే! అయితే చచ్చిపో. నీకు "నీవు చచ్చిపో. నీ 'అహం' బ్రతికి ఉండాలని ఎవరు చెప్పారు నీకు! నీవు చనిపోతానంటున్నావు కాబట్టి, నీ 'అహం' చచ్చిపోనీ! నీ అహాన్ని చంపుకునే సాహసం నీకు కావాలి. అందుకు తగిన ధైర్యం కలిగి ఉండు.

శారీరకంగా ఏమైనా అస్వస్థత కలిగినపుడు భయపడకూడదు. దానినుంచి తప్పించుకుని పారిపోకూడదు. అనారోగ్యం నిజం కాదు – అనే నిశ్చలమైన దృఢవిశ్వాసంతో ధైర్యంగా దానినెదుర్కోనాలి. పరిపూర్ణ నమ్మకంతో, నిశ్చల విశ్వాసంతో, దివ్య కృప దిశగా మరలినపుడు నీలోని జీవకణాలన్నీ సత్వపు లోలోతుల్లో సుస్థిరపడి దివ్యసత్య ఆనందాలతో భాగస్వామ్యం చెంది ఉంటాయి.

*

శారీరక సుస్థిరతను భంగపరిచే అనారోగ్య పరిస్థితి ఏమైనా సంభవించినపుడు ఏకాగ్రత వహించాలి. అంతరంగ నిశ్చలత పాటించాలి. దైవకృపపట్ల దృఢనమ్మకంతో కూడిన ఏకాగ్రత ఉండాలి. శారీరక సమతూకం, ఆరోగ్యం, నిలుపుకొనవలెననే ఇచ్ఛాశక్తి కలిగి ఉండాలి. ఇదీ సరియైన ఆత్మశక్తి

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

జడత్వంవల్ల దుష్టసంకల్పాలు సరేసరి. ఉపద్రవాలు కూడా సంభవిస్తాయి. విపత్తు అనేది ముందుగా ఊహించేది కాదు. సంకల్పించేదీ కాదు. ఇది నిరోధశక్తులవల్ల సంభవిస్తుంది.

ఇక్కడ దివ్యానుగ్రహ కార్యనిర్వహణ దృష్టి జతకూడుతుంది. ఈ దివ్యానుగ్రహం ఏ మేరకు స్వీకరింపబడుతుందో, ఆ మేరకు అది దిగివచ్చి పరిస్థితుల పర్యవసానాలను పరిమితం చేస్తుంది. మానవాంశకు సంబంధించినంతవరకు, ఆకాంక్ష నమ్మకము, పరిపూర్ణ విశ్వాసము, సామరస్య సాధనకు తోడ్పడి గ్రుడ్డి నిరోధంవల్ల వచ్చే పరిణామాలను క్రమబద్ధీకరించి దివ్యకృప తనపనినది కొనసాగించేందుకు సహకరిస్తాయి.

ప్రశ్న: నవ్యతకు ఆటంకంగా ఉంటూ, కాలం చెల్లిపోయిన గతాన్ని తుడిచివేయటానికి యుద్ధాలు సహకరిస్తాయని మీరు వ్రాశారు. కానీ ఇప్పుడు అతిమానసం భూకక్ష్య లోనికి దిగి ఉన్నది కాబట్టి ఇప్పుడు కూడా లోకస్థితిగతులను పరివర్తన చెందించడంలో యుద్ధంయొక్క ఆవశ్యకత ఉన్నదా?

అదంతా నేటి ప్రపంచదేశాలలో ఉన్న గ్రహణశక్తిని (ఇముడ్చుకొనే శక్తిని) బట్టి ఉంటుంది. ఒకవేళ అవి ఎంతో విశాలదృష్టిలో త్వరితగతిని ఆ నూత్నశక్తులకు ఉన్మీలనం (తెరుచుకుని) చెంది వాటికి ఆహ్వానం పలికి దేశీయభావనల్లో, కార్యాల్లో తగినంత వేగంగా మార్పును తెచ్చుకోగలిగితే ఇక యుద్ధమనేదే అవసరముండదు. కాని ఎప్పుడూ కూడా దేశమనుగడల పరస్పర బెదిరింపులతో, తేల్చుకోలేని స్థితిలో ఉంటాయి. తేజోవిహీనమైన చైతన్యం, పొరపాటు – ఎప్పుడూ భయం కల్గిస్తూనే ఉంటాయి.

ఏదేమైనప్పటికీ చివరికి, భగవంతుని కృప పైనే ఆధారపడి ఉంటుంది. మనం ఎంతో ప్రగాఢ విశ్వాసంతో ప్రశాంతచిత్తంతో, భవిష్యత్తుని చూడాలి. దీనితోపాటు వీలైనంత వేగంగా పురోగమనదిశ వైపు పయనించాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

కర్మ – దైవకృప

జీవితాన్ని బరువెక్కించే, విధివిలాసంగా భావించేదే కర్మ అంటాం మనం (భారతదేశంలో). ఇవి సంచితకర్మలు. చేతనకు గుదిబం డలు. వీటిని పూర్తిగా అనుభవించి నిశ్శేషం చేయాలి.

కాని ఇది కర్మ కాబట్టి, నువ్వే ఏదైనా చేయాలి. ఇది అహంకార నిర్మితం. ప్రతీది అహం కోసమే చేయబడదు. అహం కూడా ఏదైనా చేయాలి. సత్యమేమిటంటే అహం చేసిన పనుల ఫలితమే కర్మ; అహం తొలగి తన హక్కును పరిత్యజించినపుడే, కర్మ కరిగిపోతుంది.

దైవకృపచే కర్మ పరిహరింపబడి దానిపై విజయం సాధిం చేకాలం ఆసన్నమైనప్పుడే ఆ కర్మకు కారణాలను గూర్చిన దృశ్య, జ్ఞానానుభవం కలుగుతుంది. అదిగో అప్పుడే ప్రక్షాళన ప్రారంభం కావాలి.

ఏదో ఒక రోజు ఆ పని చేయాల్సిన క్షణం, విమోచన కల్గించే నిజమైన అంతర్గత సంచలనం కలుగుతుంది. నిజం చెప్పా లంటే వేలాది సంవత్సరాల తర్వాత ఇప్పుడే శక్తివంతమైన సచే తన సాయం పొందే సదవకాశం లభించింది. ఒకప్పుడు కర్మాను భవాన్ని తప్పించలేమనీ, ఎన్నో ప్రక్షాళనా కార్యక్రమాల ద్వారా దాని పరిణామాలను మారుస్తూ, తొలగించుకోగల్గుతామనీ అను కోవలసి వచ్చేది. కాని అధిమానసశక్తి ద్వారా విమోచనరకర మైన వివిధ దశలను దాటే అవసరం లేకుండానే దీన్ని సాధించ వచ్చు.

*

పైన పరిపూర్ణ స్వాతంత్ర్య క్షేత్రం ఉంది. చిత్తశుద్ధితో కూడిన ఆకాంక్ష, ఉద్వేగభరితమైన ప్రార్థన ద్వారా కర్మమార్గాన్ని మార్చ లేమని ఎందుకంటారు?

అంటే ఏదైనా సాధ్యమే.

కావాల్సిందల్లా తగిన ఆకాంక్ష, తగినంత ఉద్వేగపూరిత ప్రార్థన. మానవ ప్రకృతి కిచ్చిన అద్భుతవరాల్లో ఇదొకటి. కాని దాన్నెలా ఉపయోగించుకోవాలో మనకు తెలియదు.

అంతా తలరాత – పూర్వలిఖితం అయినా ఈ అడ్డుగీత లను అధిగమించి ఉన్నతోన్నత చైతన్యపుటంచులను చేరుకో వడం తెలిస్తే పూర్వనిర్దేశితాన్నీ, విధి లిఖితాన్నీ మార్చవచ్చు.

ప్రశ్న: కర్మశృంఖలాలకు మనం బద్ధులమై ఉన్నామంటు న్నారు మీరు. కాని దైవకృప ప్రసరించినప్పుడు అట్లా కాదు కదా?

దైవకృప కర్మను పూర్తిగా వ్యతిక్రమింపచేస్తుంది. ఎండలో పెట్టిన వెన్నవలె అది కరిగిపోతుంది.

నీలో స్వచ్ఛమైన ఆకాంక్ష, ప్రార్థన ఉంటే అన్నింటినీ మార్చగలిగే శక్తిని నీలోకి దింపుకోవచ్చు. ఒక చిన్న ఉదాహ రణ ద్వారా దీన్ని పూర్తిగా అర్థం చేసుకోవచ్చు. ఒక రాయో, గూనపెంకో వదులైనప్పుడు యాంత్రికంగా నేలపై పడుతుంది. కాని ఆ దారిలో వెళుతున్న బాటసారి ఒకరు ప్రాణికంగా, మాన సికంగా అది క్రిందపడరాదని నిర్దేశించుకొని, చేతి నడ్డంపెడితే అప్పుడది చేతిపైనే పడుతుందికాని నేలపై పడదు కదా! అంటే అతను ఆ వస్తువు విధిని మార్చాడన్న మాట! ఇది మరోరకమైన పూర్వనిర్దేశనం. ఎవరి తలపైనో పడి చంపే బదులు ఆ రాయి చేతిపై పడింది. అచేతన యంత్రాంగంలో జోక్యం చేసుకునే సచే తన సంకల్పం అది.

ఇందుకు కావల్సిన సాధనం సరియైన ఆకాంక్ష లేదా ప్రార్థన. లేదా రెండూ కూడా. కర్మను మార్చాలంటే ఎంతో వినయం, బృహత్‌సంకల్పం అవసరం.

*

తప్పులు చేస్తూన్నంతవరకూ ఏదీ తొలగిపోదు. ప్రతినిమిషం అది పునరావృతమౌతుంది. పెద్దదైనా, చిన్నదైనా తప్పు చేసినప్పుడు దాని పరిణామం కార్యరూపంలో వెన్నాడుతుంది. దీన్ని అనుభ వించాలి. కాని దైవకృప వైపు మనం మళ్లితే ఆ పరిణామాలను

ఖండించే శక్తి దానికుంది. దీనికోసం తప్పులను పునరావృతం చేయొద్దు. మనం మూర్ఖంగా తప్పులు చేస్తూ, దైవకృప దాని పరిణామాలను తొలగిస్తుందనుకోవడం తప్పు. అట్లా జరగదు. భవిష్యత్తుపై ప్రభావం లేకుండా గతాన్ని పూర్తిగా ప్రక్షాళనం చేసుకోవచ్చు. కాని దాన్ని నిరంతర వర్తమానంగా మార్చుకోవద్దు. మనలో దుష్టప్రకంపనలను మనమే అడ్డుకోవాలి. అంతే కాని ఆ తరంగాలనే ఎప్పుడూ పునరావృతం చేసుకోవద్దు.

మూలం: శ్రీమాత

అనువాదం: యమ్. రాజగోపాలాచార్య

సార్వత్రికప్రకృతి – అవతారప్రభావం

దైవకృపకు ఎవడు అర్హుడు ఎవడనర్హుడు? అందరూ దివ్యమాత బిడ్డలే కదా! ఆమె తన దివ్యప్రేమను అందరిపైనా ఒకే రకంగా వర్షింపచేస్తుంది. ప్రతి ఒక్కరికి వారి స్వభావ, గ్రహణశక్తుల కనుగుణంగా అందుతుంది.

*

ఆమె కృప అందరికీ సమానంగానే ఉంటుంది. తమ చిత్తశుద్ధికి అనుగుణంగా ఎవరికి వారు స్వీకరిస్తారు. వారి వారి ఆకాంక్షకి, సంసిద్ధతకి అనుగుణంగా ఉంటుంది. అంతేకాని బాహ్యాపరిస్థితులకు అనుగుణంగా మాత్రం ఉండదు. వ్యక్తి స్వతంత్రుడు కాడు. ఏదో అజ్ఞాత బాహ్యాశక్తికి, ఖచ్చితంగా హేతుబద్ధమైన సార్వత్రిక ప్రకృతి నియమాలకి నిబద్ధుడై ఉంటాడు. తప్పించుకోలేని ఆరోగ్యనియమనిబంధనలు ఉంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని వైద్యుడు హేతుబద్ధంగా ఆరోగ్యాన్ని కాపాడటానికి పోరాడతాడు. అలాగే నైతిక చైతన్యం ఆరోగ్యమైన సంఘజీవనానికి, తపస్సు ఆధ్యాత్మికపరిధిలోను పనిచేస్తాయి.

ఈ సార్వత్రిక బాహ్యాప్రకృతి నియమాలలో జోక్యం కలుగచేసుకొని, వాటి గతినే మార్చగలిగే శక్తి ఒక్క దైవకృపకి

మాత్రమే ఉంది. దివ్యకృపని భూమిపై అభివ్యక్తీకరించటమే అవతారమూర్తి చేసే మహత్కార్యం. అవతారమూర్తికి అనుయాయి అంటే దివ్యకృపకి ఉపకరణంగా తయారై ఉండటమే. పరిపూర్ణ పరిజ్ఞానంతో దైవకృపను అందరికీ పంచియిచ్చే ప్రదాత శ్రీమాత. తాదాత్మ్యత, సార్వత్రిక ప్రకృతిధర్మ యంత్రాంగంయొక్క పరిపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండటం వల్ల ఆమెకిది సాధ్యం.

ఆమె దివ్యకృపను కిందికి తీసుకొని తెస్తుంది. చిత్తశుద్ధితో ప్రగాఢవిశ్వాసంతో, దివ్య ఆకాంక్షతో కదలాడే ప్రతికదలికకు సమాధానంగా దివ్యకృప కలుగచేసుకుంటుంది. శ్రీమాత సంధానకర్తగా వ్యవహరిస్తుంది. అందువల్ల ఇదంతా సాధ్యపడుతుంది.

ఓ ప్రభూ! "నేనెప్పుడూ పొరపాటు చేయలేదు" అని చిత్తశుద్ధితో నీ ముందు నిల్చుని ఎవడు చెప్పగలడు? నీ దివ్యకృపకు ప్రతికూలంగా ఎన్నిసార్లు పొరపాట్లు చేశామో! ప్రతిసారీ నీ దివ్యకృప కలుగచేసుకుని వాటిని తుడిచివేయలేదా!

నీ దివ్యకృపయే లేకుంటే, ఎన్నిసార్లు తప్పించుకోలేని సార్వత్రిక బాహ్య ప్రకృతి ధర్మాల పదునైన కత్తివేట్లకి గురియైపోయేవాళ్లమో కదా!

ఇక్కడ ప్రతీదీ ఒక్కొక్క అపరిష్కృత జటిల సమస్యయే. నీ దివ్యకృపాప్రభావంవల్ల అంతా పరిష్కృతమవుతున్నది. అసంభావ్యమనుకున్నది దివ్యసిద్ధిగా సంభావ్యమవుతున్నది.

— శ్రీమాత

*

విశ్వశక్తియొక్క కర్తవ్యం విశ్వాన్ని, విశ్వధర్మాన్ని పరిరక్షించటం. విశ్వాతీత దివ్యశక్తివల్ల అసాధారణ రూపాంతరీకరణ సాధ్యమవుతుంది. ఆ అతీత దివ్యకృపకి సాకారమే శ్రీమాత. ఆ విశిష్టకార్యక్రమం ఆచరణలో పెట్టడానికే ఆమె అవతరణ.

*

విశ్వజనీన కార్యక్రమంలో శ్రీమాత నియమబద్ధంగా వ్యవహరిస్తారు. ఆమె దేహధారియై చేసే ప్రతి కార్యము దివ్యకృపతో ఆమె

అందించే అభయహస్తాన్ని అందిపుచ్చుకునే సదవకాశమే. ఇదే ఆమె అవతరణ పరమార్థం.

*

చైత్యపురుషసంసర్గం నీలో ఎంత పెంపొందితే అంతగా దైవకృప పనిచేసే అవకాశం ఉంటుంది.

*

ప్రశ్న: శ్రీమాత అనుగ్రహం సర్వసాధారణమైనదేనా?

సర్వసాధారణమైనదీ, ప్రత్యేకమైనదీ కూడా.

ప్రశ్న: సాధారణంగా ఆమె అనుగ్రహించినది అందుకోవటమెలా?

నీవు అందుకు ఉన్ముఖుడవై సిద్ధంగా ఉండాలి. నీకు అవసరమైనది, నీవు అందుకోగలిగినంత అందుకుంటావు.

*

నీ విశ్వాసము, చిత్తశుద్ధి, శరణాగతి ఎంతగా ఉంటే అంతగా కృప, రక్షణ నీకు ఉంటుంది. శ్రీమాత యొక్క కృప, రక్షణలు నీతో ఉన్నప్పుడు నిన్నేది మాత్రం స్పృశించగలదు? నీవెవరికి భయపడాలి? అది నీకు ఏ కాస్తంత ఉన్నా చాలు. అది నిన్ను కష్టాలు, అవరోధాలు, ప్రమాదాల నుంచి ఉద్ధరించటానికి. ఆ పరిపూర్ణ (దివ్య) సన్నిధి నిన్ను పరివేష్టించి ఉన్నపుడు నీ మార్గంలో భద్రంగా ముందుకు కొనసాగగలుగుతావు. ఈ లోకం నుంచీ, అదృశ్యలోకాల నుంచీ కాని ఎదురయే భయాలను లక్ష్యపెట్టనిది అది. ఎందుకంటే ఆ శక్తి ఆమెది. ఎంతటి ప్రతికూలశక్తిచేత కూడా ప్రభావితం కాబడదు. దానియొక్క స్పర్శ మాత్రాన, కష్టాలు అవకాశాలుగా, ఓటమిలు గెలుపులుగా, బలహీనతలు నిశ్చలశక్తిగా మార్పుచెందుతవి. సర్వోన్నతుని ఆమోదమే శ్రీమాత కృప. ఎప్పటికీ దాని ఫలితం నిశ్చయమే. సాధికార శాసనమది. అనివార్యమైనది. బలమైనది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దైవానుగ్రహ భావన

పరమసత్యాన్ని చేరడానికి ఏ బుద్ధి కాదారి ఉండొచ్చు. దేని ప్రవేశం దానికి ఉంటుంది. ఆ యాత్రకు వెయ్యి మార్గాలూ ఉంటాయి. దైవానుగ్రహంపై విశ్వాసం, తన అత్యున్నత అంతరాత్మయేగాక వేరే దైవం కలదని గుర్తించటంలాంటి విషయాలను ఆమోదించని యోగమార్గాలున్నాయి.

ఈ దైవానుగ్ర విషయానికొస్తే మనం అలాగే ఎందుకు చెబుతామంటే మనం పరమాత్మలో, దివ్య ఆత్మస్థితిలో ఒక దివ్య సన్నిధిని, దివ్యసత్తను అనుభవిస్తాము – దాన్నే మనం దైవం అంటాము. అది వేరే వ్యక్తి కాదని, మనలోని ఆత్మను, ఒక భాగంగాను, వాహికగాను చేసికొనియున్న దివ్యసత్తయేనని నిశ్చయించే దివ్యచైతన్యంగా అనుభవిస్తాము. అయితే దానిని అందరూ అలాగే చూడవలసిన అవసరం లేదు. అది ఎవరికీ ప్రత్యేకంగా చెందని, అందరకూ చెందే దివ్య ఆత్మ మాత్రమే అనుకోవచ్చు. అయితే ఉపనిషత్తు ఇలా చెబుతోంది "ఈ అవ్యక్తాలోచనాశక్తి తర్కతపోపాండిత్యముల ద్వారా పొందరానిది. ఈ దివ్యాత్మ ఎవరిని ఎన్నుకొంటే వానికే తన సాక్షాత్కారాన్ని ప్రసాదిస్తుంది". మనం దైవానుగ్రహమనేదీ, అదే – పైనుంచిగాని, అంతర్గతంగాగాని, మానసిక హేతువుల కతీతంగా తన చేష్టలను తానే నిర్ణయించుకునే చర్య. మనం దాన్ని దైవానుగ్రహం అంటాము. బాహ్యంగా సమయాసమయ సందర్భాల కతీతంగా మనసుకు అభివ్యక్తమయే అంతరంగ పరమాత్మ, అంతరంగ వికసనం, ఆత్మజ్ఞానం, ఆత్మోద్దీపనం అనీ అనవచ్చు. మనకదెలా దగ్గరౌతుందో, సాక్షాత్కరిస్తుందో అలానే దానిని మనసు దర్శిస్తుంది.

రస్సెల్‌గారి ఆక్షేపణలకు నేనంతగా సమాధానం చెప్పలేను. ఏమంటే, సమగ్ర శక్తిమంతమైన బాహ్యాశక్తి ఏదో ఈ ప్రపంచాన్ని సృష్టించి ఎదురులేని నిరంకుశ ప్రభువుగా పాలిస్తోందనే క్రైస్తవ, సెమిటిక్ భావన నాకెప్పుడూ లేదు; అది నా దర్శనానుభవాలకు విరుద్ధం. దైవేచ్ఛ మాటకొస్తే నా ఉద్దేశం వేరు. పరిణా

మక్రమంలో అవిద్యాలోకంలోకి దైవేచ్ఛ దిగివచ్చినది. అది విష యాల వెనుకనుండి తమస్సును దివ్యప్రకాశంలోకి తీసుకొనివెళ్ల టానికి ఒత్తిడి చేస్తుంది. ప్రస్తుతం అవిద్యాలోకపరిస్థితులలో వీలై నంత ఉత్తమంగా ముందుకు నడిపిస్తుంది. చివరకు ఒక మహా త్తర దివ్యశక్తి అవరోహణకు దారితీస్తుంది. ఆ దివ్యశక్తి తన సర్వతోముఖశక్తిని మరుగునపరచి, ప్రపంచనియమాలకు ఒడంబ డినట్లుగాక యధేష్టమైన క్రియాకలాపంతో వర్తిస్తుంది. దైవీప్రకృ తిలోని కాంతి, శాంతి, సామరస్యము, ఉల్లాసము, ప్రేమ, సౌంద ర్యము, మరియు దివ్యానందములను తన ఏలుబడిలోనికి తీసుకు నివస్తుంది. దైవానుగ్రహం పనిచెయ్యడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. అయితే అది ఎవరైనా అవిద్యాధర్మము నుండి దివ్య ప్రకాశధర్మం లోనికి ఎదుగుతూన్నప్పుడు మాత్రమే ప్రకటిం చుకొంటుంది. అంటే తరచు ఎంత అద్భుతంగా అది కలుగజేసు కొంటున్నా, అకారణచాపల్యంతో మాత్రంకాక, అభివృద్ధిలో సహ కరించేదిగా, దారిచూపించే దివ్యప్రకాశంగా చివరకు కాపాడు తుంది.

*

మానవమేధస్సుకు అర్థమయ్యేటట్లు దివ్యానుగ్రహం పనిచెయ్యా వలసిన అవసరం లేదు. సాధారణంగా అలా కాదు. అది తనదైన గోప్యమైన పద్ధతిలో పనిచేస్తుంది. మొదట్లో పరోక్షంగా పనిచే స్తుంది. విషయాలను ప్రకటించకుండానే సిద్ధం చేస్తుంది. తర వాత అది ప్రకటించవచ్చు. అయితే సాధకుడు మాత్రం ఏం జరు గుతోందో గ్రహించలేడు. ఆ అవగాహన కలిగేటప్పటికి అతను దానిని అనుభూతి పొందుతాడు, తెలుసుకుంటాడు. కనీసం ఆ దిశగా ముందుకు సాగుతాడు.

*

దైవానుగ్రహం గురించి నేను కొంత చెప్పాలి – మానవబుద్ధి కంటే భిన్నంకాని రీతిలో ఒక దివ్యవాదంగా అది ఉండాలని నువ్వు అనుకొంటున్నట్లుంది. కాని అది అలా కాదు. అలాగని దానిని సమీపించేవారందరికి నిష్పక్షపాతంగా అన్ని ప్రార్థనలనూ

సమ్మతించే సర్వసామాన్యమైన దేవుని కనికరమూ కాదు. నీతి మంతుడిని ఎన్నుకొని పాపాత్ముని నిరాకరించేదీ కాదు. ఆ దైవా నుగ్రహం హింసాత్ముడిని (తార్సస్‌వాడైన సౌల్ – St. పాల్) పోకిరీయైన St. అగస్తీనును, అపకీర్తిమంతులైన జగు, మధులను, బిల్వమంగళుణ్ణి, ఇంకా అనేకులను ఉద్ధరించడానికి దిగివచ్చింది. మానవసహజమైన న్యాయబుద్ధి, ఈ పరివర్తనను అపవిత్రంగా భావి స్తుంది. కాని అది ధర్మాత్ముల కోసముకూడా దిగి రాగలదు. నీతిపరులమని భావించే తత్త్వమును స్వస్థతపరుస్తుంది. వీటన్ని టికి అతీతమైన స్వచ్ఛతర చైతన్యంలోనికి దారితీస్తుంది. ఆ శక్తి ఎట్టి నియమముకంటె, ఆఖరికి దివ్యవిశ్వధర్మానికంటే కూడా మేలైనది. ఎందుకంటే ఆధ్యాత్మిక దార్శనికులందరూ దైవశాస నము, దైవానుగ్రహముల మధ్య తేడాను గమనించారు. అయినా అది భేదాలు చూపలేనిది కాదు. ఆ దివ్యమనస్సు మరి ఏ ఇతర సహజ దివ్యశక్తికంటె విషయాలను, వ్యక్తులను, యుక్తాయుక్త సమయాలను, వేరే దృష్టితో చూచేది. తనదైన వివేచన కలది. మనస్సుకు అందని లెక్కలేనన్ని ఉపాయములతో, తరచుగా ముతక తెరల చాటున వ్యక్తిలో ఒక దివ్యానుగ్రహస్థితిని సిద్ధము చేస్తుంది. ఆ దివ్యానుగ్రహస్థితి సంభవించినప్పుడు ఆ దైవాను గ్రహం తానే నడిపిస్తుంది. అచ్చట ఈ మూడు శక్తులూ ఉంటాయి. 1) దివ్యకర్మయొక్క విశ్వధర్మం (కాక మరేమిటి) 2) దివ్యన్యా యజాలముల ద్వారా ఎన్నింటిని ఆదుకోగలిగితే అన్నింటిపై పనిచేసే ఆ దివ్యసానుభూతి 3) మరింత లెక్కింప శక్యంకాని విధంగా, తక్కినవాటి కంటె మిక్కిలి తిరుగులేని విధంగా పని చేసే ఆ దైవానుగ్రహం. అన్ని జీవన వైపరీత్యాల వెనుక ఆ పిలు పునకు స్పందించేది, ఎంత కష్టమైనా చివరకు ఆ దైవానుగ్రహ ప్రకాశానికి సన్నద్ధమయ్యే వరకు తెరుచుకొని యున్నదేదైనా ఉన్నదా అన్నదొక్కటే ప్రశ్న – మరి అదేదో మానసిక, ప్రాణిక చలనం కాకుండా అంతరదృష్టికి స్పష్టంగా గోచరం కావాలి (కొంచెం అంతర్ముఖం కావాలి) అది అలాగయితేనే ముందుగు వచ్చి కార్యరూపం దాలిస్తేనే ఆ దివ్యసానుభూతి ఉద్ధరించగ

లదు. దైవానుగ్రహంయొక్క సంపూర్ణ క్రియాకలాపము నిష్కర్ష యైన నిశ్చయము లేక పరివర్తన కలిగేవరకు వేచియుండవచ్చు. గ్రహించడానికి సిద్ధంగా లేనటువంటిదేదో సత్తలోని కొంత భాగము, స్వాభావికమైన స్థానము మధ్య అడ్డుపడుతూ ఉండ డము వలన ఈ విషయము మరో భవిష్యత్ ఘడియకు వాయిదా పడవచ్చు.

అసలు ఏదైనా, ఏ ఆలోచనైనా, ఏ సంఘటనయైనా నీకూ దైవానికీ మధ్య ఎందుకు అడ్డుపడాలి? నువ్వు పరిపూర్ణమైన ఆకాంక్ష, ఉల్లాసముతో ఉన్నప్పుడు దేనినీ లెక్కచెయ్యకు. నీ ఆకాంక్ష దైవము వినా మరి దేనికీ ప్రాముఖ్యత నివ్వకూడదు. ఎవ రైనా దైవాన్ని తొందరగా, కేవలంగా, సంపూర్ణంగా అభిలషిస్తే దాన్ని చేరడానికి ఉత్సాహమూ అలాగే ఉండాలి. అదే పూర్తిగా నిండియుండి మరేదీ దేనిలో చొరబడకుండా ఉండేటట్లు ఏకైక లక్ష్యంగా చేసుకోవాలి.

దైవాన్ని గురించిన మనోగత అభిప్రాయాలకు విలువ ఏముంది? ఆయన అలా ఉండాలి, ఆయన అలా పని చెయ్యాలి, ఇలా పని చెయ్యకూడదు అనే తలపులు మార్గానికి అవరోధం మాత్రమే. ఆ దైవమొక్కటే అవశ్యం. ఎప్పుడు నీ చైతన్యం దైవాన్ని అంగీకరిస్తుందో, అప్పుడే ఆ దైవమేమిటో నీకు అవగత మవుతుంది. కాని అంతకు ముందు కాదు. కృష్ణుడు కృష్ణుడే. ఆయన ఏం చేసేడు, ఏమి చెయ్యలేదని ఎవడూ లక్ష్యపెట్టడు. ఆయన్ని దర్శించడం, ఆయనతో సమాగమం పొందడం, ఆ దివ్య ప్రకాశాన్ని, ఆ దివ్యసన్నిధిని, ఆ దివ్యప్రేమానందాల అనుభూతి పొందటం – ఇదే ఆవశ్యకం. అందుచేత, ఎల్లవేళలా ఆధ్యాత్మిక ఆకాంక్ష కోసమే ఆధ్యాత్మజీవనసూత్రం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: వై.యస్.వి.యస్ మూర్తి

భగవత్కటాక్షమే అంతా చేయగలిగితే ఇక తపస్సెందుకు?

నిర్దుష్టమైన సమాధానం లేని ప్రశ్న ఇది. ఎందువల్లనంటే ఈ రెండు వాదాల్లోనూ సత్యముంది. మొదటగా దైవకృప లేనిదే ఏదీ జరగదు. అయితే ఆ దైవకృప సంపూర్ణంగా ఆవిష్కారం కావా లంటే సాధకుడు తానై అందుకు సిద్ధంగా ఉండాలి. మొత్తంగా అంతా దైవకృపే చేస్తుందనుకుంటే మనిషి కేవలం ఒక తోలు బొమ్మగా మిగులుతాడు. సాధనతో ప్రయోజనం ఉండదు, ఏ నిబంధనలూ అవసరం లేదు, ఏ ధర్మమూ లేదు, కాబట్టి ఈ విశ్వం కూడా ఉండదు. ఒక భగవంతుడే తన లీలావినోదంగా అంతా ఆడిస్తూ ఉంటాడు. ఇలాకాక అంతా భగవంతుని విశ్వర చనే అని ఒప్పుకున్నప్పటికీ అది పరాప్రకృతినియమాల ననుస రించి వ్యక్తుల ద్వారా, శక్తుల ద్వారా పనిచేస్తుంది. ఒక్కొక్క సారి భగవంతుడు ప్రత్యేకంగా కల్పించుకొని పనిచేస్తాడు. కానీ అన్నింట్లో ప్రత్యేక జోక్యం ఉండదు.

*

నీలోని ఒక భాగం తపోఫలితం కోసమని, ఆత్మ పరిపూర్ణత కోసమని, దీర్ఘకాల పరిశ్రమతో చాలా అసహనానికి లోనౌతూ దైవకృపామహిమతో అతిమానససిద్ధి పొందవచ్చు కదా అని కోరుతున్నట్లుగా ఉంది.

*

బ్రహ్మానందంగారు తపస్సు గురించి చెప్పింది నిజమే. ఎవరైతే శరీ రపరిశ్రమ, తపస్సూ చేయటానికీ, మనస్సునీ, ఇంద్రియాలనూ అదుపులో పెట్టుకోటానికీ సంసిద్ధత చూపరో వారు పెద్దగా ఆధ్యాత్మికలబ్ధి పొందలేరు. ఎందువల్లనంటే వారి మనస్సూ, ప్రాణి కమూ రెండూ కూడా వాటి ఇష్టాయిష్టాలను నెరవేర్చుకుంటూ తమ కోర్కెలు సాగించుకోటానికై అనేక పన్నాగాలు పన్నుతూ వారు విధేయులై లోనున్న భగవంతునికి మంచి ఉపకరణాలుగా, మాధ్యమాలుగా ఉందామనుకున్నా పడనీయవు. ఒక్కొక్కసారి

దైవకృప అయోగ్యమైనచోట లేక యోగ్యతలేనట్లు భావించే చోట వరాలిస్తుంది. అయినప్పటికీ ఎవరూ గూడా తమ హక్కుగా, ప్రత్యేకవరంగా దైవకృపను సాధించలేరు. అటువంటప్పుడు అది దైవకృప కాజాలదు. అరిచి గోలచేసి సాధించుకోలేరని నీకు తెలిసింది కదా. అంతేకాక అలా దైవకటాక్షం కలిగే ముందర దీర్ఘకాలికంగా తెలియరాని సాధన ఉన్నట్లు నేను చాలాసార్లు గమనించాను. ఇంకా అలా జరిగిన తర్వాత కూడా దాన్ని నిలబెట్టుకొని అభివృద్ధి చేసుకోటానికై చాలా పాటుపడవలసి ఉంటుంది – ఏదైనా సంపూర్ణమైన సిద్ధి కలిగేవరకూ శ్రమించవలసిందే కదా. ఆ తర్వాత చేతికి చిక్కుతుందనుకున్న తదుపరి పరిశ్రమ ఆగిపోతుంది. అందువల్ల ఏదో రకమైన తపస్సు తప్పదు.

*

ఆ తర్వాత మళ్ళీ "ఆహో, నాకు ప్రేమ ఉన్నా లేకపోయినా నాకు కావాలి, నేనెప్పుడూ కోరుతూనే ఉన్నాను, ఇప్పుడు ఇంకా ఇంకా కావాలి, కానీ నాకేమీ రావటం లేదు" అని నీవు అనవచ్చు. అయితే కోరినంత మాత్రాన సరిపోదు. నీవిప్పుడు చూస్తున్నట్లుగా ఇక్కడ కొన్ని నిబంధనలు పాటించాలి. హృదయాన్ని శుద్ధి చేసుకోవడం లాంటివి. అయితే నీవు మాత్రం "నేను భగవంతుని కోరుకోగానే నాకు ప్రత్యక్షం కావాలి, కనీసం ఒక్క క్షణమాత్రమైనా నిజమైన, గాఢమైన దర్శనం ఇవ్వాలి. ఏదో నాకు తెలియకుండా, అస్పష్టంగా పదిలపరుచుకో లేకుండా కాదు. నాకు అర్హత ఉందా లేదా అని చూడకుండా నా పిలుపు విని దైవం కరుణ చూపాలి. అలా కాకపోతే దైవకృప అనేదే లేదు" అని వాదిస్తావు. నిజానికి కొన్ని సందర్భాలలో అలాగే దిగివస్తుంది. కానీ బలవంతంగా రప్పించగలమా? అలా బలవంతంగా రప్పించేది దైవకృప కాదు. అది నిర్బంధమే, విధి నిర్వహణ లాంటిది, లేదా ఒక ఒప్పందము. కాని భగవంతుడెప్పుడూ హృదయంలోకే చూస్తాడు... అదనుచూసి మూసిన తెరను వైదొలగిస్తాడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించినపుడు

వ్యక్తియొక్క బాహ్యాజీవితం అజ్ఞానంలో సాగుతున్నంత కాలం మాత్రమే ఆతనిపై విధి (destiny) కఠినంగా తన ప్రభావాన్ని చూపిస్తుంది. నిజానికి మన అస్తిత్వం గతంలో కూడబెట్టుకొన్న స్వాభావిక శక్తులు ఒకదానిపై మరొకటి పనిచేయడం కారణంగా, మన ప్రస్తుత కృషి, దాని భవిష్యత్ఫలితాన్ని నిర్ణయించేదాన్ని విధి అంటాం. కాని ఆధ్యాత్మిక జీవనమార్గంలోనికి ప్రవేశించ గానే, గతంలోనే ముందుగా నిర్ణయమైన విధి ప్రభావం తగ్గిపో వడం ప్రారంభమౌతుంది. అపుడొక నూతన అంశం, దైవకృప, కర్మకు సంబంధించిన వత్తిడి గాకుండా దైవసంబంధమైన క్రియా శక్తి, సాయం లభిస్తుంది. ఈ దైవకృప అతని ప్రకృతియొక్క ప్రస్తుత సంభావ్యతల కతీతంగా అతనిని ఉద్ధరిస్తుంది. అప్ప ట్నించి అతని భవిష్యత్తును తీర్చిదిద్దే ఆధ్యాత్మిక విధివిధానం భగవంతుని నిర్ణయం ప్రకారం జరుగుతుంది. మార్గంలో ఎదు రయ్యే విపర్యయాలు, పయనించడానికి పట్టే కాలాన్ని గురించిన అనుమానం మాత్రమే ఉంటుంది. ఇదిగో ఇక్కడ, ఈ అనుమాన స్థితిలో ఆతని గతప్రకృతికి సంబంధించిన బలహీనతల నాధారం చేసుకొని ఆసురశక్తులు ఆతని ప్రగతి వేగాన్ని అడ్డుకోడానికి, ఆతని కృషి సాఫల్యతను వాయిదా వేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాయి. ప్రాణికశక్తులు దాడిచేసినందువల్లగాక, తనంత తాను ఆసురికశక్తితో చేయికలుపడవంవల్ల, ఆధ్యాత్మికసిద్ధికన్న, ప్రాణికతృష్ణకు, కామనకు ప్రాధాన్యత నివ్వడంవల్ల, సాధకుడు పతనమౌతాడు.

*

...ఆధ్యాత్మిక వెలుగు, పరమసత్యానికి సంబంధించిన పరిస్థితులు ఉన్న చోట మాత్రమే భగవత్కృప పనిచేస్తుంది. అనృతం, అవిద్య, విధించే షరతుల మధ్య అది పనిచేయదు. ఎందుచేతనంటే దైవ కృప అనృతంయొక్క వత్తిడులకు తలవంచితే, అది ఏ కార్యాని

ర్వహాణ నిమిత్తమై దైవంనుండి దిగివచ్చిందో, ఆ ముఖ్యకార్యా నికే భంగం వాటిల్లుతుంది.

ఈ దైవకృప పనిచేసే పరిస్థితులు, ఆధ్యాత్మిక వెలుగుకు, పరమసత్యానికి సంబంధించినవి. కేవలం ఈ పరిస్థితులుంటేనే మహోన్నత క్రియాశక్తి దిగివస్తుంది. పైనుండి దిగివచ్చే, క్రింది నుండి తెరచుకొంటూ పైకివచ్చే చాలా మహోన్నతమైన అతిమానస క్రియాశక్తి మాత్రమే దిగ్విజయంగా భౌతికప్రకృతిని అధీనం చేసుకొని, దాని యిబ్బందుల నన్నింటినీ తొలగించవేయగలుగుతుంది.

...చిత్తశుద్ధితో కూడిన సంపూర్ణ సమర్పణ తప్పనిసరిగా ఉండాలి. మరి దేనికీగాక, కేవలం దైవశక్తికి మాత్రమే ఆత్మ ఉన్మీలనమై ఉండాలి. క్రిందిగి దిగివచ్చే పరమసత్యాన్ని మాత్రమే సదా, సమగ్రంగా కాంక్షించాలి. ఇంకా భౌతిక ప్రకృతిని శాసిస్తున్న మానసిక, ప్రాణిక, భౌతికశక్తులు, ఆకారాలకు సంబంధించిన అనృతాన్ని సదా, సమగ్రంగా తిరస్కరించాలి.

నీ భక్తిసమర్పణల వెనుక, నీ కోరికలను, అహంకారిక పట్టుదలలను, ప్రాణికపంతాలను దాచుకొంటే. యదార్థ ఆకాంక్ష స్థానంలో వీటిని నీవు చొప్పిస్తే, లేదా ఆ ఆకాంక్షకు వీటిని జోడించి, దైవశక్తి మీద విధిస్తే, నిన్ను రూపాంతరం చెందించమని, నీవు దైవకృపను ఆవాహన చేయడంవల్ల ప్రయోజనం వుండదు.

ఒక ప్రక్క లేక ఒక భాగంలో పరమసత్యాన్ని ఆహ్వానిస్తూ మరో ప్రక్క ఆసురీశక్తులకు సదా ద్వారం తెరుస్తూ, దైవకృప నీతోనే ఉండాలనుకోవడంలో అర్థం లేదు.

నీ (దేహ) దేవాలయంలో సజీవమైన సన్నిధిని ప్రతిష్ఠించాలనుకొంటే దాన్ని పరిశుద్ధంగా ఉంచాలి.

దైవశక్తి జోక్యం చేసుకొని, పరమసత్యాన్ని క్రిందికి తెచ్చిన ప్రతిసారీ, దానికి నీవు వెన్నుచూపిస్తూ, నీవిది వరకు బయటకు నెట్టిన అసత్యాన్ని తిరిగి ఆహ్వానిస్తూ వుంటే సంభవించే వైఫల్యానికి నిందించవలసింది దైవకృపను గాదు.. నీ స్వీయ ఇచ్ఛకు

సంబంధించిన కపటత్వాన్ని, నీ సమర్పణలోని అపరిపూర్ణతను నిందించాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కోనేరు వెంకటేశ్వరరావు

ఈశ్వరానుగ్రహము

భగవదనుగ్రహంవల్ల నెరవేరనిదీ, భగవంతుని శక్తికి మించినదీ ఏదీ ఉండదు. కాకపోతే సాధకుడు దాని నందుకోవటానికి సిద్ధంగా ఉండాలి. పరిపూర్ణ సంసిద్ధత కలిగి ఉండటమే సాధన అంటే.

*

నీలో ఏమాత్రమధైర్యంకానీ, భగవంతునిపై అవిశ్వాసంగానీ కన్పించకూడదు. నీ బాహ్యజీవితంలో ఎన్ని అవాంతరాలు, కష్టాలు తోచినా – నీ లోపల బలహీనత లెన్ని వున్నా – నీకు శ్రద్ధాభక్తులుంటే – భగవత్కామనే – వుంటే, నిన్నొక గుప్తశక్తి నడిపించుకుపోతుంది. నమ్ము. నిన్ను విరుద్ధశక్తులు దిగద్రొక్కుతున్నా, నీవు జారిపడుతున్నా, నీకు మార్గమగమ్యమైనా – నీ దివ్యకామన మాత్రం సడలనీయరాదు. కొంచెంసేపు అవిశ్వాస మేఘాలు క్రమ్మినా నీ హృదయాన్ని మా వైపునకే మళ్లించుకుని ఉంచు. కష్టాలు తొలగిపోతాయి.

*

శక్తి – ఆత్మసంబంధమైతే – తద్దర్శనం కల్గించేదదే. పట్టుదల – చిత్తశుద్ధి ఉంటే చాలు. అన్నిటికంటే ఈశ్వరకారుణ్యం మహత్తరమని తెలుసుకో. నేనెన్నోసార్లు చెప్పాను – ఎన్ని కష్టాలనైనా – దూరాన్నైనా చిత్తశుద్ధి ఉంటే అధిగమించగలవు. దైవకృప గురించి ఎన్ని పర్యాయములు ఉద్ఘోషించలేదు! గీతావాక్యాన్ని ఎన్నిసార్లు గుర్తు చేయలేదు! "అహం త్వాం సర్వ పాపేభ్యో మోక్ష



సమస్త కటాక్ష వైభవాలూ, సమస్త దివ్యత్వమూ
ఒకే ఒక్క రూపంలో ఇక్కడే మూర్తీభవించాయి

(సావిత్రి, 680)

యిష్యామి మాశుచః" సర్వపాపాలనుండి నిన్ను ముక్తుని చేస్తాను. దుఃఖించకు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: టి. కోటేశ్వరరావు

సర్వోన్నత వివేకము

పరాజ్ఞానమంటే భగవత్కారుణ్యం మీద అచంచల విశ్వాసం.

*

దైవకారుణ్యము, సహాయ్యములక్కడే సంసిద్ధంగా ఉన్నాయి. వాటి కోసం ఆకాంక్షించాలి. కాని, వాటి శక్తి అపారం. కాకపోతే, నమ్మకం, శ్రద్ధాభక్తులతో స్వీకరించగలగాలి.

*

ఆ కారుణ్యవర్షాన్ని పొందటానికి దివ్యకామనతో పాటు శ్రద్ధాస హిత వినయవిశ్వాసాలు కావాలి.

*

సర్వకారణ మీశ్వరుడన్న భావనతో ఆ స్పర్శ ననుభవించగలి గితే అయిన సాన్నిహిత్యాన్ని అనుభవించవచ్చు. అప్పుడు – అంతా ఆయన కరుణే అని నీకు తెలియటంతోపాటుగా నీ జీవి తమంతా ప్రశాంతానందమయమౌతుంది.

సుఖ, శాంతి, సంతోషాలను, శక్తినీ, వెల్గునీ, జ్ఞానాన్నీ, ప్రేమను, ఆనందాల నిచ్చేదాయినయొక్క కారుణ్యము అనుగ్రహామే.

ఓ ఈశ్వరా! నీ అనుగ్రహామనంతము. నీ మంచితన మంతు లేనిది. నీ ముందు కృతజ్ఞతతో మోకరిల్లుతున్నాము.

మూలం: శ్రీమాత
అనువాదం: టి. కోటేశ్వరరావు

దివ్యమాత సంరక్షణలో జీవయాత్ర

భయములను, ఆపదలను, విపత్తులను ప్రతిఘటించు కవచ సంరక్షణలో జీవయాత్ర సాగించుటకు రెండు విషయములు అవసరము. ఈ రెండును ఒకదానిని విడిచి మరొకటుండక జంటగా నుండును. ఒకటి దివ్యమాత కృప. మరొకటి నీ పక్షమున యదార్థ అర్పణలతో కూడిన అంతరంగస్థితి. నీ భక్తి అమలము, యధార్థము, పరిపూర్ణమై యుండనిమ్ము. పేరాశ, గర్వడంబాహంకార స్వేచ్ఛాప్రవృత్తి, స్వార్థలంపటత. నీచప్రకృతి తృప్తికొరకు అల్పకాంక్షలు... మొదలగువానిచే కలుషితమైన మనోప్రాణసత్త్వల యందలి అహంకారపూరిత భక్తి ... కొడిగట్టిన దీపము కావున స్వర్గము వైపునకు ఊర్ధ్వముగా వెలుగలేదు....

నీ నిష్కపటత్వమును, నీ యర్పణమును కేవలము నిజముగాను, పరిపూర్ణముగాను ఉండనిమ్ము. నీ వర్పించుకొనునప్పుడు ఏలాటి హద్దు, ఏలాటి షరతు, ఏలాటి మినహాయింపులేక, పరిపూర్ణముగా సమర్పించుకొనవలయును. అట్లు చేయుటవలన నీలోని సర్వము ఒక్క దివ్యమాతకే చెంది తీరవలెను. మరే శక్తికిగాని, అహంకారమునకుగాని ఏమియు చెందుటకు మిగలకూడదు.

నీ భక్తినిష్కపటత్వము, అర్పణము లెంతెంత పరిపూర్ణముగా నుండునో యంతంత అధికముగా నీకు దివ్యమాత కృపారక్షణ లుండును.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: డా॥ అనుముల లక్ష్మీనరసయ్య

('మాతృశ్రీ నుండి)

సమాచారపత్రం

31-3-2007 న ముగిసే సంవత్సరాంతానికి క్రొత్తగా పదకొండు శ్రీఅరవింద సొసైటీ కేంద్రాలు తెరువబడినవి.: గడగ్, ముమ్మిగట్టి, సెదామ్ మరియు ఆర్కోడ్ (ఇవన్నీ కర్నాటకలో) జబల్‌పూరు (మ.ప్ర.) ఉదయపూర్ (త్రిపు) షహాజార్పురు (ఉ.ప్ర), రుద్రపూరు (ఉత్తరాంచల్) ఖంజియా ఖలిహియాపూరు, సాల్టులేకు (వెస్టుబెంగాలు)

విజయనగరం (ఆంధ్రప్రదేష్) కేంద్రంవారు 4-4-2007 బుధవారం నాడు వారి సొసైటీ నవమ వార్షికోత్సవ సభ నిర్వహించుకున్నారు. ఆచార్య వై.యస్.వి.యస్. మూర్తిగారు (శక్రటరీ కాకినాడ కేంద్రం) సభ నుద్దేశించి ప్రసంగించారు. ఆంధ్రరాష్ట్ర సొసైటీ ఉపాధ్యక్షులు శ్రీ డి.వి.యన్. శర్మగారు పాల్గొన్నారు. స్కూలు పిల్లలకు బహుమతి ప్రదానం జరిగింది. లలితభక్తి గీతాలాపనతో సభ ముగిసింది.

నౌడా బ్రాంచి (ఉ.ప్ర): వారు పుష్పప్రదర్శనలో పాల్గొన్నారు. దీనిని ఫిబ్రవరి 23, 24 తేదీలలో Noida Authority మరియు Floriculture Society of Noida వారు సంయుక్తంగా నిర్వహించారు. మార్చి 10 న శ్రీ విజయ్ పొద్దార్‌గారు ఈ బ్రాంచీలో ప్రసంగించారు. మార్చి 18 న గోష్ఠులు నిర్వహించారు. శ్రీ ఆర్. కె. గోస్వామిగారు ఇందు పాల్గొన్నారు.

పైగాంబరపూర్ (ఉ.ప్ర): లో శ్రీమతి శృతిగారు అక్కడ గ్రామీణ స్త్రీలను కలసి ముచ్చటించారు. భజనలు, జానపదగేయాల ఆలాపనలో పాల్గొన్నారు. అక్కడ యువత నుద్దేశించి 'సావిత్రి' కావ్యంపై ప్రసంగించారు.

అన్నానగర్ చెన్నై కేంద్రం (తమిళనాడు) వారు '*ఆలోచనాశక్తి*' అంశంగా ప్రసంగాలు ఫిబ్రవరి 4 న, 11 న ఏర్పాటు చేశారు. శ్రీ యన్.వి. బాలుగారు పాల్గొన్నారు. శ్రీ మోహన్‌గారు శ్రీమాత దివ్యకృప నెలా ఆవాహన చేసుకోవాలో తెలిపారు.



నిగూడార్థ పద వివరణ

అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2007

నిగూఢార్థ పద వివరణ

(శ్రీఅరవిందుల రచనల నుండి సేకరణ)

విషయసూచిక

దైవాన్ని కనుగొని, అనుభవించి, ప్రకటించడం కోసం మనకివ్వబడిన ఒక అపూర్వ అవకాశం జీవితమంతా.

శ్రీఅరవిందుల (గ్రంధాల) ను ఎలా చదవాలి?

నీవు చదువుతూన్నపుడు, కలవరమొందిన మనస్సుతో అర్థం చేసుకోవాలని ప్రయత్నించినట్లయితే ఆ మాటల మాటునవున్న అర్థాన్ని, సత్యాన్ని, శక్తిని మూడొంతులకు పైగా పోగొట్టుకున్న వాడివౌతావు.

*

అందుకే నేనెపుడూ సలహా ఇస్తుంటాను. మనస్సును వీలైనంత ప్రశాంతంగా, నిశ్చలంగా వుంచుకో. అర్థం చేసుకొనేందుకు ప్రయత్నించక, మనసును వీలైనంత నిశ్చలంగా వుంచుకో. నీవు చదివిన విషయంలోని శక్తిని నీలోని అగాధతలాలలోనికి ఇంకిపోయేలా చేసుకో. అంతశ్చేతనలోని మౌనంలోనూ, ప్రశాంతిలోనూ అవతరించిన శక్తి, తన వెలుగులో తాను చేయాల్సింది చేస్తుంది. అంతే కాదు. అవసరమైతే నీ మెదడు ఆ విషయాన్ని అవగాహన చేసుకొనేందుకు, అవసరమైన నూతన కణజాలాన్ని సృష్టిస్తుంది. అలా జరిగినపుడు అదే విషయాన్ని మరికొన్ని నెలల తర్వాత తిరిగి చదివినపుడు, ఆ భావం మరింత స్పష్టంగా, ఒక నూతన దృక్పథాన్ని కలిగిస్తుంది. కొన్ని సమయాలలో అది తనదే అయినంతగా అనుభూతిని కూడా కల్గిస్తుంది.

ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదవాలి, అంతేకాదు. నియమిత సమయాలలో కొద్దికొద్దిగా చదవడం వాంఛనీయం – ఈ విధంగా చేస్తే నీ బుద్ధిగ్రహణశక్తి అంతకంతకూ అధికాధికంగా ఎదుగుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

అస్తిత్వము

(జీవితంయొక్క) ఉనికి అనేది ప్రకృతి యంత్రాంగము కాదు. ఓ క్షణానికి లేదా బహుకాలంనుండి చక్రభ్రమణంలో చిక్కుకున్నది కాదు. అది ఆత్మయొక్క నిరంతర ఆవిష్కరణ.

*

అభివ్యక్తీకరణ అనేది అనంతుని ప్రాసంగిక ఇతివృత్తం కాదు. అది అతని అనంత ఐశ్వర్యంయొక్క ప్రతీక, వదనం. అది అతని కదలికలోని, ఆనందం మరియు శక్తి సమన్విత లీలావిలాసం.

*

ఉనికి యాదృచ్ఛికం కాదు. ఎవరో చేసిన అర్ధరహిత సృష్టి కాదు. అనవసరవిషయం అంతకన్నా కాదు. తనలో భగవంతుని వాక్కుని వహించుకుని ఉన్నది. దివ్యతత్వాన్ని పరిపూర్ణంగా దాచుకున్న సత్వం.

జీవితం అనేది గుడ్డిగా ఏవో కొన్ని అర్ధరహితమైన కదలికల పర్యవసానంగా, అకారణంగా, అచేతనంగా ఉనికిలోకి రాలేదు. జీవితం (existence) ఒక క్రమానుగతమైన, ఆవిర్భావం ద్వారా తనను తాను ప్రకటించుకొంటున్న పరమసత్యం. తనలో అంతర్గతంగానున్న పరమార్థాన్ని వెలువరిస్తున్న నిజతత్వం.

జీవితం అనేది భ్రాంతి కాదు. జీవితంలోకి రావల్సిన అవసరంగాని, కారణంగాని, పనిగాని, లేనిది ఉన్నట్లుగా కన్పించే ఒక మాయాకల్పితంగాని కాదు. ఒక బ్రహ్మాండమైన అస్తిత్వంగా తనను తాను ఈ అద్భుత విశ్వంలో అభివ్యక్తీకరించుకున్నది.

*

అస్తిత్వం – నిర్మూలనమే (నాశనమే) ధ్యేయంగా సాగిపోయేది కాదు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కొంగర భాస్కరరావు

జీవితం

జీవితం అనేది నిరంతరం వికసించే ఆత్మ పరిణామ సమాహార వేదిక. అది (పరమాత్మ) పదార్థంలో దాగివుండి తనను తాను ఆవిష్కరించుకొనేందుకు పెనుగులాడుతున్న మూలవస్తువు. అదే ఈ ఐహిక జీవన పరమార్థం.

*

పదార్థములోని సత్త్వము తనను తాను ప్రకటించుకొనేందుకు ఆరాటపడే చేతనాశక్తియే ఇక్కడ ఈ భౌతికజీవితము. మానవజీవితంలో, మానవసత్త పదార్థమయప్రపంచంలో తనను తాను పటిష్టంగా ప్రకటించుకొనేందుకు విస్తృతపరచుకునేందుకు తన యావచ్ఛక్తిని వినియోగించుకొంటున్నది.

*

ఈ విశ్వం ఒక జడపదార్థం మాత్రమే కాదు. అదొక ఆధ్యాత్మిక వాస్తవం. అది శక్తుల క్రీడాస్థలం మాత్రమే కాదు. ఒక మానసిక అనుభూతి మాత్రమే కాదు. తనను తాను మరుగుపరచుకొన్న ఆత్మ తిరిగి వికసించుకొనడం కోసం ఎంచుకొన్న రంగస్థలి.

బాహ్యంలోకి విసిరివేయబడిన గమనసీలమైన ఛిత్‌శక్తి వ్యక్తీకరణయే జీవితం. ఇది తనకు తానుగా సామరస్యరూపంగా ప్రస్ఫుటం కావలసి ఉన్నది.

*

జీవితమంతా దైవాన్ని కనుగొని, అనుభవించి, ప్రకటించడం కోసం మనకివ్వబడిన ఒక అపూర్వ అవకాశం.

*

మన జీవితం ఒక విరోధాభాసం, భగవంతుడే దాని కీలకం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కొంగర భాస్కరరావు

పరిణామము

దట్టంగా కూడుకొని ఉన్న పదార్థచైతన్యం నుండి విడివడి బయ టపడిన చిదాత్మ, క్రమవికాసం పొందుతూ జంతుసమానంగా ఉండే జీవినుంచి దైవంగా తన్ను తాను ఆవిష్కరింపచేసుకోవడమే పరిణామము.

*

పరిణామక్రమమంతా దాని అంతస్సారంలో చైతన్యశక్తిని అభి వ్యక్త సత్వంలో బలోపేతం చేయడమూ, అభివ్యక్తమై ఉన్నదా నిని మరింత ఉన్నతస్థాయికి తీవ్రతరం చేయటము. సృష్టిలో చైతన్యశక్తిని గాఢతరంగా చేయటము. పదార్థం నుంచి ప్రాణము, ప్రాణం నుంచి మనస్సు, మనస్సు నుంచి ఆత్మ– ఇలా.

*

ఏకం సత్ – పరమచైతన్యము పదార్థమయ ప్రపంచంలోకి దిగి అంతర్లయమై చిక్కుకునిపోయింది. అది మళ్లీ తనను తాను విముక్తి కావించుకునే విధానమే పరిణామక్రమము. చైతన్యరహితంగా కన బడే నిశ్చేతనములో (inconscience) చైతన్యం వ్యక్తమైనప్పుడు, అది ఇంకా ఇంకా ఎదగాలని తనని తాను ప్రేరేపించుకుంటుంది. అంతేకాక అత్యంత ప్రస్ఫుటమైన వికాసం పొంది పరిపూర్ణంగా ఉండాలనుకుంటుంది. ఆ చైతన్యమే ప్రాణికోటిగా ఆవిర్భవిం చటం మొదటి పర్వమైతే, అక్కడ మనస్సు వికసించడం రెండవ సిద్ధి. అయితే పరిణామం ఇంతటితో ఆగదు. ఇంకా ఉన్నతస్థాయి కెదిగి ఆధ్యాత్మికము, అతిమానసము అయిన చైతన్యాన్ని పొందా లని ఆశిస్తోంది. అందువల్ల పరిణామక్రమంలో తదుపరి సిద్ధి అతిమానసజీవి. ఈ అతిమానస చైతన్యజీవి పూర్తి దైవశక్తిగానే నడుస్తుంది. అప్పటికిగానీ పూర్తిగా పదార్థంలో చిక్కుకుని ఉన్న దైవత్వానికి విముక్తి కలగదు. అప్పుడిక ప్రాణికోటి పరిపూర్ణత్వం పొందగలదు.

*

ఆధ్యాత్మిక పరిణామమే ఇక్కడ మన అస్తిత్వం పరమార్థం.

అంతర్లయం

పరిణామప్రక్రియ ప్రారంభమవడానికి పూర్వం దైవము అంతర్లయమై (an involution of the Divine) ఉండాలి. అలా కాని పక్షంలో అది పరిణామక్రమం కాకుండా క్రమానుగతమైన నూతన సృష్టి కార్యక్రమమే అవుతుంది. అటువంటప్పుడు ఆ సృష్టికి అంతకు పూర్వమున్నవాటి గుణగణాలుకానీ, తద్వారా సంక్రమించిన పర్యవసానఫలితాలుగానీ, ప్రక్రియలుకానీ ఉండవు. అదొక అనిర్వచనీయమైన ఘటనో, అదృష్టశక్తి సంకల్పించిన అద్భుత ఊహాగానంతో జరిగినదో లేక వేరే ఒక బాహ్యసృష్టికర్తచే చేయబడిన సృష్టియో అయి ఉండాలి.

*

అసలు పరిణామశబ్దంలోనే పరంపర అనే అర్థం గోచరిస్తుంది. మూలార్థంలో ఒక అంతర్లయముయొక్క (involution) ఆవశ్యకతను తెలియపరుస్తుంది.

...పరిణామం చెందవలసినది ముందుగా అంతర్నిహితమైయుండాలి. అది స్థబ్దంగా ఉన్నా, చలించుతూ ఉన్నా, మనకు కనిపించని రీతిలో పదార్థప్రకృతి అంతర్భాగంగా గుప్తమై ఉన్నదే. ఇప్పుడు శరీరధారిగా ఇక్కడ వ్యక్తమవుతున్న చిదాత్మ పూర్వం నించి గూడా పదార్థమయజగత్తులోని ప్రతిగ్రంథిలోనూ, ప్రతివ్యవస్థలోనూ, ప్రతి అణువులోనూ ముకుళితమై ఉంటూనే ఉన్నది. ప్రాణము, మనస్సు, మనస్సుకు ఆవలనున్నదీ కూడా భౌతికశక్తి ప్రక్రియలన్నిటిలోనూ కూడా అదృశ్య ఉత్తేజితశక్తిగానో లేక నిద్రాణశక్తిగానో ఉంటూ ఉండాలి.

*

అతిమానస చేతనాత్మ నిశ్చేతన పదార్థంలో సంలగ్నమైపోవటమే ఈ దృశ్యమానసృష్టికి మూలరహస్యము, నిశ్చేతనాప్రకృతిలో నుంచి అతిమానస చేతనాత్మ పరిణామంచెంది వికశించడమే పుడమి పొడుపుకథకి విడుపు జవాబు. ఆ పరమేశ్వరుడు కోరి ఈ పుడమిని తనకు నివాసం చేసుకున్నాడు. ఆ పరమపురుషని

సంకల్పం ఏమంటే అంధకారబంధుర కారాగారంగా ఉన్న దీనిని తనకు తగిన పరమధామముగా, స్వర్గాన్ని తలదన్నే ఆలయంగా మార్చుకోవాలని.

మానవుడు

మనో, ప్రాణదేహాలుగా ఆకృతి తాల్చి ఆత్మసాధకుడుగా మానవుడు భూమిపైకి వచ్చాడు.

*

భారతీయభావన ప్రకారం శక్తియొక్క చాలనప్రక్రియల మరుగున ఉంటూ, భగవంతుడు కాదగిన అర్హత కలిగి తనను తాను ఆవిష్కరించుకోవాలని ప్రయత్నం చేసే ఆత్మే మానవుడు. చేతనాత్మక తత్వంగా పరాపకృతి ద్వారా వృద్ధిపొందుతున్న ఆత్మే అతను. అతను ఒక దైవత్వం, ఒక అనంతత్వం. భగవంతుడొక మహాసముద్రమైతే అక్కడ నిరంతర ఉత్తుంగ కడలి తరంగం మానవుడు. అతడొక అనివార్య ఉత్కృష్ట జ్వాలా విస్ఫులింగము. వాస్తవతత్వంలో కూడా అతను మూలస్థానమైన అనిర్వాచ్య పరతత్వంతో సరిసమానము. ఆ విధంగా తను ఆరాధించే దేవతాగణం కంటే అతనే గొప్పవాడు. ఒక్కొక్కసారి సహజమైన అర్ధజంతుస్వరూపమా అన్నట్లు కనబడినప్పటికీ అది అతని అసలు తత్వం కానే కాదు. అతని అంతరాంతరాల్లోని సత్యం పరమాత్మ స్వరూపం. లేదా పరమాత్మయొక్క చైతన్యవంత శాశ్వత అంశ. దానిని తెలుసుకొని ప్రకృతిపరమైన బాహ్యాజీవన విధానాన్ని అధిగమించడంలోనే అతని ఔన్నత్యం. ఇహలోకజీవుల్లో అతనికొక్కడికే అది సాధ్యము. పరమోత్కృష్టమై, అనితరసాధ్యమైన ఈ మానవజీవితశిఖరాగ్రం చేరుకోగల ఆధ్యాత్మిక సమర్థత అతనికి ఉంది. భారతీయ సంస్కృతి మానవునికి నిర్దేశించిన ప్రథమ ఆదర్శం అదే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా। ఎ. వెంకటరామశాస్త్రి

మొదట మనిషి గ్రుడ్డిగా అన్వేషిస్తాడు. తాను అన్వేషించేది తన దివ్యాత్మనే అనే విషయం కూడా తెలియకుండానే అన్వేషిస్తాడు. ఎందుకంటే అతడు భౌతికప్రకృతియొక్క అస్పష్టజ్ఞానంతో మొదలుపెడ్తాడు. కొంత అభివృద్ధి జరిగాక, చూడ్డం మొదలైనా అతనిలో పెరుగుతున్న వెలుగులో మరీ చూడలేనివాడవుతాడు. మొదట్లో భగవంతుడు గూడా అతని వెదుకులాటకు అస్పష్టంగానే సమాధానం చెప్తాడు. తడుముళ్లాడుతూ చీకట్లో తన కోసం వెతికే చిన్నబిడ్డ హస్తాలకై అమ్మ ఎలా ఎదురుచూస్తుందో, అలా భగవంతుడు గూడా గ్రుడ్డిగానైనా మనిషి తనను వెతకాలనే కోరుకొంటాడు. అలా అతను వెతుకుతుంటే ఆనందిస్తాడు.

*

మనిషిలో, మనిషి ద్వారానే ప్రపంచప్రకృతి తనను తాను తెలుసుకొంటుంది. అలా తెలుసుకొన్నపుడు అది తన నుపభోగించే పురుషుని వైపు ఒక దూకు దూకినట్లవుతుంది. ప్రకృతి, తనకు తెలియకుండానే ఈ దివ్యభోక్తను తన అధీనంలో వుంచుకొంది. జీవితం, ఇంద్రియమనస్సు ఆ భోక్తను తమ అధీనంలో వుంచుకొని కూడా అతనిని తిరస్కరిస్తుంటాయి, తిరస్కరిస్తూ కూడా అతనినే కావాలని కోరుకుంటాయి. ప్రపంచ ప్రకృతికి భగవంతుడెవరో తెలియదు. కారణం తానెవరో తనకే తెలియకపోవడం. ప్రపంచప్రకృతి తనను తాను తెలుసుకున్నప్పుడు తనలోగల పురుషుని నిర్మలానందాన్ని అది తప్పకుండా తెలుసుకొని అనుభవిస్తుంది.

మూలం శ్రీఅరవిందులు
అనువాదం: కె.వి. రావు

నిరపేక్షం (బ్రహ్మం)

బ్రహ్మము అంటే, మనకంటె, మనం నివసిస్తున్న జగత్తు కంటె గొప్పదని మన భావం. మనం భగవంతుడని పిలుచుకొనే విశ్వాతీత పురుషునికంటె అది పరమోన్నత సత్యం. ఏది లేకపోతే మనం చూసేది, లేదా అస్తిత్వం కలిగి వున్నట్లు మనకు తెలిసి ఉండి ఉండేది కాదో. దానినే భారతీయచింతన బ్రహ్మం అంటుంది. ఐరోపీయ ఆలోచన దీనిని నిరపేక్షం అటుంది. ఎందుచేతనంటే అది స్వయంభువు. సాపేక్షతల సమస్తబంధనాలనుండి విముక్తమైన నిరపేక్షం.

*

పరాత్పర బ్రహ్మం అంటే, పాశ్చాత్య తాత్త్వికచింతనలో నిరపేక్షం (the Absolute) కాని బ్రహ్మం అంటే ఏకకాలంలో, సర్వవ్యాపి సత్యం కూడా. దానిలో సాపేక్షమైన సమస్తం, రూపాలుగా లేదా దాని చలనాలుగా అస్తిత్వం కలిగి వుంటుంది. సమస్త సాపేక్షతలను తన కౌగిలిలోనే ఉంచుకొనే నిరపేక్షం మన బ్రహ్మం.

విశ్వంలోనూ, మన స్వీయ అస్తిత్వంలోనూ ఉన్న బ్రహ్మంను ఎలా తెలుసుకోవాలో ఈశోపనిషత్తు బోధిస్తుంది. మనం బ్రహ్మంను ఏకకాలంలో స్థిరము, అస్థిరము అయినదిగా సమగ్రంగా తెలుసుకోవాలి. మనం దానిని శాశ్వతమూ, అవికారమూనైన ఆత్మగా, అదే సమయంలో విశ్వంయొక్క మారుతున్న సమస్త అభివ్యక్తులుగా మరియు సాపేక్షతగా కూడా దర్శించాలి.

దేశకాలాల్లో ఉన్న సమస్తాన్నీ, దూరంగా ఉన్నదాన్నీ, దగ్గరగా ఉన్నదాన్నీ స్మృతికందని గతం, అనుభవిస్తున్న వర్తమానం, అనంత భవిష్యత్తు, వాటిల్లో ఉన్న సమస్తాన్నీ, సంఘటనలనూ ఒకే ఒక బ్రహ్మంగా దర్శించాలి. ప్రత్యేకమైన, సమస్తమైనవాటినీ అతిశయించి వుంటూ వాటన్నిటినీ తనలోనే భరిస్తూ, వాటన్నింటికీ ఆధారమై వుండి, అలాగే విశ్వానికీ, దేశకాలాలకూ అతీతమై, ఈ సృష్టి అంతటికీ మహాకారణమైనదానిగా మనం బ్రహ్మమును దర్శించాలి. అంతేగాదు. విశ్వంలోనూ, విశ్వం ఉన్న

వాటన్నింటిలోనూ నివసిస్తూ వాటిని పూని ఉన్నదానిగా కూడా మనం బ్రహ్మమును దర్శించాలి.

సత్త – సంభూతి

ఆదియందు దైవంలో సదా శాశ్వతమైనదేది గలదో అది సత్త. చేతన, పరిస్థితులు, శక్తులు, రూపాలు వగైరాల్లో దైవశక్తివల్ల ఏది అభివృద్ధి చెందినదో అది సంభూతి. శాశ్వత దైవం సత్త. కాలం లోని విశ్వం, ఆ విశ్వంలో దృగ్గోచరమయ్యే సమస్తం సంభూతి.

*

నిరపేక్షం రెండు విధాలుగా తనను తాను అభివ్యక్తం చేసుకొంటుంది. అవి సత్త, సంభూతి. సత్త ప్రాథమికసత్యం. సంభూతి సత్త ఫలితమైన సత్యం. అది సక్రియశక్తి, శక్తి ఫలితం కూడా. అదొక సృజనాత్మకశక్తి, సత్త నిర్వహించిన కార్యం, మార్పు చెందుతూన్నప్పటికీ ఎల్లకాలమూ నిలిచివుండే రూపం. ఒక ప్రక్రియ, దానికి మూలమైన అవికార, రూపరహిత సారతత్త్వం నుండి ఉత్పన్నమైనది.

...సత్త, సంభూతి నుండి విడివడి లేదు. అందులోనే వుంది. దానిగానే అయి వున్నది. దాని ప్రతి సూక్ష్మాణువులోనూ, విరివి, విస్తృతి (మహత్తు) యందు కూడా అంతర్నిహితమై వుంది. తాను సత్తననికూడా సంభూతి తెలుసుకొన్నపుడే, అది తనను తాను సంపూర్ణంగా తెలుసుకొనగలుగుతుంది. పరాత్పరుని, నిరపేక్షాన్ని తెలుసుకొని అనంతుని, నిత్యునియొక్క ప్రకృతిని పూనినపుడు, సంభూతి యందలి అంతరాత్మ ఆత్మజ్ఞానాన్ని సముపార్జించుకొంటుంది. అదే మన అస్తిత్వంయొక్క పరమోన్నత లక్ష్యం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి. రావు

ఆత్మ

ఆత్మయే 'సెల్ఫ్' లేక 'స్పిరిట్'. అది మనకు పైన ఉంటుంది. అది పరిశుద్ధమైంది, మలినం లేనిది. జీవితమాలిన్యాలైన కోరికలు, అహంకారం, అజ్ఞానంవల్ల ప్రభావితంకానిది. అది వ్యక్తియొక్క నిజమైన అస్తిత్వంగా తెలియబడుతుంది. అంతేకాక విస్తారంగా అందరిలోనూ ఒకే అస్తిత్వంగాను, విశ్వంలోని ఆత్మగాను, వ్యక్తికి విశ్వానికి పైన స్వయంస్థితి కలిగినది కూడా అవటం మూలంగా పరమదివ్య అస్తిత్వమగు పరమాత్మగా పిలువబడుతుంది.

*

ప్రతీదీ ఆత్మలోనే పనిచేస్తుంది. ప్రకృతి క్రీడ అంతా దివ్యమైనటువంటి ఆత్మలోనే జరుగుతుంది. ఆత్మలో విశ్వము నిక్షిప్తమై ఉన్నది.

*

ఆత్మయే సత్వము, సత్వము (ఆత్మ) కాదు. ఆత్మ అంటే అన్నింటిలోనూ సారభూతంగా ఉండే చేతనాస్థితి.

కేంద్రపురుషుడు

కేంద్రపురుషుడు అనే పదం మన యోగంలో, మామూలుగా, మనలో మిగతా అంతటికీ ఆధారభూతమై జననమరణాలలోనూ చెక్కుచెదరకుండా ఉండే దైవంలో కొంతభాగానికి వాడబడుతుంది. కేంద్రపురుషునికి రెండు రూపాలున్నాయి. ఒకటి, మనకు పైన జీవాత్మగా, మన నిజ అస్తిత్వంగాను, ఉత్కృష్టమైన ఆత్మజ్ఞానం పొందినపుడు తెలియబడేదానిగాను, రెండవది, క్రింద మనః శరీరాలకు, జీవితానికి వెనుకగా నిలబడి ఉండే చైత్యపురుషుడు. జీవాత్మ జీవితంలో అభివ్యక్తి (ప్రకటితమయ్యే దానికి) పైన ఉండి, దానికి అధ్యక్షత వహిస్తుంటాడు. చైత్యపురుషుడు జీవితంలో అభి

వ్యక్తి (ప్రకటితమయ్యేదానికి) వెనుకగా ఉండి దానికి ఆధారంగా ఉంటాడు.

*

కేంద్రపురుషుడైన జీవాత్మకు పుట్టుకా లేదు, పరిణామమూ లేదు. కాని వ్యక్తి పుట్టుకకూ పరిణామానికీ అధ్యక్షతక వహిస్తాడు. ప్రతి చేతనాభూమికలోను తన ప్రతినిధిని ముందుంచుతాడు. మానసికభూమికలో నిజమానసికజీవియైన మనోమయపురుషుడుగాను, ప్రాణికభూమికలో నిజప్రాణికజీవియైన ప్రాణమయపురుషుడుగాను, భౌతికభూమికలో నిజభౌతికజీవియైన అన్నమయపురుషుడుగాను ప్రాతినిధ్యం వహిస్తాడు. ప్రతిజీవి అజ్ఞానం అంతమయేదాకా ఏ భూమికలో ప్రధానంగా జీవిస్తాడో వాటికి సంబంధించిన మానసిక, ప్రాణిక, భౌతికపురుషులను కేంద్రంగా చేసుకుంటాడు. ఆ పురుషుడే అతనికి కేంద్రపురుషుడు. కాని అన్ని సమయాలలోను నిజమైన ప్రతినిధిగా మానసిక, ప్రాణిక, భౌతికాలకు దాగి ఉండేది, మన అస్తిత్వమై, లోలోతులలో అట్టడుగున ఉన్న చైత్యపురుషుడు.

చైతన్యం

చైతన్యమే అస్తిత్వానికి ప్రాతిపదిక. అదే శక్తి, చలనం, విశ్వసృష్టిని చేసే చైతన్యగమనం. సర్వం అందులోనే ఉంది. చైతన్యం అతిస్థూలపదార్థమేకాక, అత్యంత సూక్ష్మపదార్థం కూడా. తనను తాను అది అమర్చుకోవడమేకాక, మరేమీ కాదు.

*

చైతన్యం అస్తిత్వంలోని అంతర్గత యదార్థం. అది పైకి క్రియాశీలంగా కనపడకపోయినా అక్కడ ఉన్నదే, కాని అది నిశ్శబ్దంగా కదలికలేనిది. అది పైకి కనపడకపోయినా, బాహ్యావస్తువుల మీద ప్రతిస్పందన చేయకపోయినా, సంవేదన వ్యక్తపరచకపోయినా కూడా అది అక్కడ ఉన్నదే, కాని అది లోపల ముడుచు

కుని క్రియాశీలంగాకాని, నిష్క్రియంగాగాని ఉన్నది. మనకు అది లేనట్లుగా అనిపించినా, మన దృష్టికి దాని అస్తిత్వం అచేతనంగా, ప్రాణరహితంగా తోచినా అది అక్కడనే ఉన్నది.

చైతన్యం జీవానికి, (విశ్వంలో) అన్నింటికీ జాగృతికశక్తి కాక అది గమనశీలమై సృష్టించే శక్తి లేదా సృష్టించకలిగిన శక్తి. అది మన ప్రతిచర్యలను చేయడంగాని, మానుకోవడంగాని అదే నిర్ధారించుకోగలదు. అది శక్తులకు సమధానం ఇవ్వగలగడమే కాకుండా శక్తులను సృష్టించగలదు. తననుంచి శక్తులను బయటకు పంపించనూ గలదు. చైతన్యమే ఛిత్. అంతేకాక అది ఛిత్ శక్తి కూడా.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ప్రసన్నకృష్ణ

విశ్వాతీతము, వైశ్వానకము, వైయక్తికము

సకల చరాచరసృష్టికీ మూలాధారమై, సర్వవ్యాపకమై దాన్ని పర్యవేక్షిస్తూ ఉండేవి విశ్వాతీత, వైశ్వానక, వైయక్తికమనే మూడు శక్తులు. ఇది త్రిత్వములో మొట్టమొదటిది. పరిపూర్ణ చైతన్యవికసనములో కూడా ఈ మూర్తిత్రయమే ప్రధానమై యుండాలి. ముఖ్యంగా సత్యదర్శన అనుభూతి పొందాలనుకున్నప్పుడు వీటిలో ఏ ఒక్కదానినీ అలక్ష్యం చేయకూడదు. వ్యక్తిగా ఉన్న మనం సువిశాల విశ్వచైతన్యానికి జాగృతమవుతాము. అయితే ఆ చైతన్యం వివిధశక్తులతో, ఆకృతులతో సంకులమై ఉంటుంది కాబట్టి దానిని అధిగమించి అపరిమిత చైతన్యానికి నిలయమైన నిరపేక్ష పరబ్రహ్మమును చేరుకోవాలి. అయినప్పటికీ ఈ విధమైన ఊర్ధ్వగమనంలో మనం కోల్పోవలసినవాటిని కూడా కోల్పోనవసరం లేకుండా వాటిని రూపాంతరం కావించుకుంటాము.

*

...ఒకే అస్తిత్వానికి చెందిన రూపాంతరాలే విశ్వాతీతము, వైశ్వానకము, వైయ్యక్తికము అనే మూడు మాటలు. ఇందులోని ప్రతి ఒక్కటీ కూడా మిగిలిన రెంటినీ బహిరంగంగాకాని, రహశ్యంగా కాని తెలియచేస్తాయి. విశ్వాతీతశక్తి మిగిలిన తనలో ఇముడ్చుకొని వాటిని తన ఐహిక అవకాశాలకు ఆధారంగా నియంత్రిస్తుంది. అదే దైవము. సర్వమూ తానై, సర్వాన్ని తన యందుంచుకొన్న పరమేశ్వర చైతన్యం; సమస్త అస్తిత్వానికి (సకల జీవ కోటికీ) జ్ఞానాన్ని ప్రసాదిస్తూ, పాలించి పోషించే సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వోపగతుడు అయిన పరమేశ్వరుడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

వైయక్తికం

భూమిమీద పరిణామక్రమంలో మూడవదశ మానవుడు. ఈతడు అత్యంత శక్తిమంతుడు. పరిణామం యొక్క క్లిష్టమైన మలుపులో పనిచేయగలిగినవాడు మానవుడు మాత్రమే. ఆ మలుపు స్వయం వ్యక్తము. చైతన్యవంతము. దివ్యచైతన్యం యొక్క నిగూఢ ముకుళిత దశ, సంపూర్ణవికాస దశలు అజ్ఞాన, జ్ఞాన దశలు యీ రెండింటి మధ్య అది మనకు కనిపిస్తుంది.

వైయక్తికాన్ని మనం యెలా అర్థం చేసుకోవాలి?

సాధారణంగా దీనిని వ్యక్తి నైజమైన అహంగా చెప్పుకుంటాం. అది వ్యక్తియొక్క శారీరక, మానసికప్రక్రియలు రెండింటి మీదా పట్టు కలిగి వుంటుంది. ఈ అహాన్ని తుడిచిపెట్టాలి. లేనట్టయితే సంపూర్ణ విముక్తి సాధ్యం కాదు. అంటే వ్యక్తియొక్క ఆత్మ మాత్రం యీ అహం కాదు. జీవాత్మ దివ్యసత్వము. అదే శాశ్వతమైన దివ్య అంశగా అభివర్ణించబడుతుంది. పరమాత్మ స్వయంగా తన అభివ్యక్తిని ఒకటే అనేకంగా సమర్థించుకునేందుకు తోడ్పడేదిగా కూడా అది అభివర్ణించపడుతున్నది. మనం

మన అహం నుంచి విముక్తి పొంది, మన ప్రత్యేక కుహనావ్య క్తిత్వం నుండి బయటపడాలి. అప్పుడే సంపూర్ణ సత్యదర్శనం కలుగుతుంది. మనం నిజమైన ఆధ్యాత్మికవ్యక్తి కాగలం. అప్పుడే విశ్వతత్వంతో కూడిన దివ్యత్వంలోను, సకల జీవులలోను మన ఏకాత్మతాతత్వాన్ని దర్శించగలం.

సార్వత్రికం (విశ్వతత్వం)

జగత్తుయొక్క విశ్వతత్వ చైతన్యం, విశ్వతత్వ దివ్యత్వం, సకలజీ వులలో యిమిడియున్న సార్వత్రిక మూలచైతన్యశక్తులు యివన్నీ వైయక్తిక చైతన్యం వంటి శక్తి కలిగినవే. అయితే వాటి విధా నాలు వేర్వేరుగా వుంటాయి.

వైయక్తిక చైతన్యం సార్వత్రిక చైతన్యంలో భాగమే. అయినా తాను వేరు అన్న వేర్పాటుభావం వ్యక్తిని సార్వత్రిక చైతన్యం నుండి వేరుచేస్తుంది. అయితే నిరంతరం వ్యక్తి తాను సార్వత్రిక చైతన్యంలో భాగమే అన్నది గుర్తుపెట్టుకోవాలి. ఎంత సాధన చేసినా యీ వేర్పాటు అనే అజ్ఞానం, గోడలా అడ్డుపడుతూనే వుంటుంది. ఒక్కసారి యెప్పుడైతే ఆ గోడని బ్రద్దలుకొట్టగలిగేడో అప్పుడు వ్యక్తిలోగల సార్వత్రిక ఆత్మ జాగృతమై ఆ చైతన్యం అందులో పనిచేస్తున్న శక్తులు అన్నీ అవగతమవుతాయి. భౌతిక పదార్థం దాని ప్రభావాలన్నిటితోపాటు వున్న తాను ఆ అనుభూ తిని పొందగలుగుతాడు. బృహత్తర సర్వాత్మతో మమేకమైన వీట న్నిటినీ వ్యక్తి గుర్తిస్తాడు. సార్వత్రిక మానసిక, ప్రాణిక, భౌతిక తత్వం అక్కడుంటుంది. వ్యక్తి మనస్సు, ప్రాణిక, భౌతిక కదలి కలతో తయారయినవి. వాటి చైతన్యశక్తుల యెన్నిక నుండి తయారుచేయబడినవే. శారీరక జీవమనస్సుల స్వభావాని కతీ తంగా ఆత్మ ప్రకాశిస్తుంది. అది దివ్యతేజస్సుకి చెందినది. ఎందు చేతనంటే దానివలన మనం ఉన్నత ప్రకృతివైపు తెరుచుకోగలు గుతాం.

సార్వత్రికం, విశ్వతత్వం రెండింటికీ తేడా లేదు. కాని సార్వత్రికం అనే పదం విశ్వతత్వం అన్నదాని కంటే తరచుగా అన్నిటికీ వాడుతూ వుంటాం. సార్వత్రికం లోకసామాన్యంగా చెప్పొచ్చు. విశ్వతత్వం అన్నది కూడా అదే. అయినా సార్వత్రికం అన్నిటికీ చెందుతుంది.

ఉదా: ఇది సార్వత్రిక బలహీనత అంటాం కాని విశ్వతత్వ బలహీనత అనం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

విశ్వాతీత శక్తి

విశ్వచైతన్యానికి ఆవలగా మన కందుబాటులో సర్వోత్కృష్ట చైతన్యం ఒకటుంది. అది అహంకారాన్ని అధిగమించేదే కాక, విశ్వాన్నే అధిగమించిన సర్వోత్కృష్ట చైతన్యం. దాని ముందర ఈ జగత్తంతా ఒక బ్రహ్మాండమైన నేపథ్యంలోని చిత్రపటంలా కనిపిస్తుంది. ఆ సర్వోత్కృష్టచైతన్యమే ఈ విశ్వముయొక్క చలి తచాలనా లన్నిటికీ ఆలంబనం, వాటి ఆలన పాలన కూడా అదే నని చెప్పవచ్చు. అనంతజీవజాలాన్ని తన పరిరక్షణలో ఉంచుకో వటమో లేక తిరస్కరించటమో చేస్తుంది.

విశ్వము, వ్యక్తి – రెండూ ఏ పరమాత్మ నుంచి ప్రాదుర్భ వించాయో ఆ పరమాత్మే వాటిలో నిక్షిప్తమై ఉన్నది. కాబట్టి వ్యక్తి మనస్సు, జీవితం, ప్రకృతి కూడా పరమాత్మయొక్క పాక్షిక వ్యక్తీ కరణలే అవుతాయి. కాకపోతే అసంపూర్ణంగా ఉంటాయి. ఏ కొద్దిపాటిదైనా అది దాని పరమార్థమే అవుతుంది కదా!

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

శ్రీమాత (ఆద్యశక్తి)

జగన్మాత, పరమాత్మ చైతన్యమూ – శక్తి, లేదా ఆమే దివ్యచైత న్యశక్తి అనీ అనవచ్చు.

*

ఇదే ఆద్యశక్తి అంటే. ఆమె విశ్వాతీతపరమచైతన్యం – చిచ్ఛక్తి. ఆమెనుండి వచ్చినవారే. సర్వదేవతలు చివరకు అతిమానస ఈశ్వ రుడు ఆమె ద్వారా అభివ్యక్తీకరింపబడినాడు. అతడే అతిమానస పురుషోత్తముడంటే – దేవతలూ – శక్తులూ – సర్వులూ ఆయనే.

*

ఆద్యాశక్తియే మూలాధారశక్తి. సర్వోన్నతమాతృమూర్తి. కాకపోతే సాధకుని భూమిక ననుసరించి ఆమె అభివ్యక్తమవుతుంది.

*

మనం అనంతత్వాన్ని చూస్తున్నామన్నది స్పష్టమే. ఆత్మశక్తి సర్వక్రియాకలాప సమర్థం. అన్నీ సమంజసములే. మనం విస్తృ తంగా చూడగలిగితే – సగుణ నిర్గుణ తత్త్వాలొకే సత్య సంబం ధమన్న అవగాహనముంటే – ఆ వెలుగులో, నిర్గుణంలో సగుణ మూర్తి ప్రకాశం – రెండూ ఒకే సత్యము యొక్క జంటని – అవి ఆత్మ లేదా ఆత్మశక్తివికాసాలని తెలుస్తుంది. ఆ మూర్తిలో నుండి ఒక జంట తత్త్వావిర్భావం జరుగుతుంది. ఈశ్వరశక్తి – దివ్యాత్మ – సృష్టికర్తగా – జగజ్జనని మాతృమూర్తిగా సృష్టిశక్తిగా తోస్తుంది. అప్పుడు స్త్రీ-పురుష (అర్ధనారీశ్వర) తత్త్వావగాహనమంటే ఏమిటో తెలుస్తుంది. అవి విశ్వశక్తులని, అవి సృష్టి కవసరమనీ – కేవల పరమ చైతన్యసత్తలో ఈ రెండు శక్తులు పరస్పర విలీనావస్థలో ఉంటాయి. సృష్టి కార్యోన్ముఖావస్థలో ఈ రెండూ విడిపోయి – తల్లి మాయాశక్తి – సృష్టికర్త్రి పరాపకృతి లేదా చిచ్ఛక్తిగా అవత రించి విశ్వాత్మకు – ఈశ్వరుని సృష్టిస్తుంది. అలాగే తనకు తానూ సృష్టించుకొని ద్వంద్వాత్మక సృష్టిని చేస్తుంది. ఆమె ద్వారానే ఆమె వల్లనే అభివ్యక్తమై ఈశ్వరుడు – ప్రవర్తిస్తాడు. అతని సంక ల్పమామెలో నిక్షిప్తమైవున్నా ఆమెవల్లనే అతడు క్రియాపరతంత్రు

డౌతున్నాడు. ఆమె పరాచైతన్యశక్తిగా అన్నిటినీ చేస్తుంది. – సర్వ జీవాత్మలను – జీవులనూ ధరిస్తుంది. సృష్టి నిర్వాహకశక్తిగా స్థితి కారకురాలుగా సృష్టిని భరిస్తుంది. సర్వమూ ప్రకృత్యనుగుణంగా జరుగుతుంది. అంతా చైతన్యశక్తి నిర్వహణమే. సర్వవిశ్వంలో – జీవుల్లో – కదలికల్లో – అతనిని నిక్షిప్తం చేస్తుంది.

*

ఈశ్వరశక్తి – దివ్యచైతన్యశక్తి = జగన్మాత – శాశ్వత ఏకత్వా నికీ – అనేకత్వానికీ నడుమనున్న మణిసేతువు. ఒక ప్రక్క శాశ్వ తత్త్వం నుండి నానాశక్తులను తెచ్చి విశ్వంలో అనేక దివ్యదేవ తలను సృజిస్తూ – అనంత దృశ్యమానప్రపంచాన్ని, సృజిస్తూ, క్రీడిస్తూ మరొకప్రక్క నానాత్వాన్ని ఏకత్వం వైపునకు మళ్లిస్తూ, వ్యక్తాత్మలను ఏకాత్మలోకి తీసికొనిపోతుంది. లేదా ఇక్కడే దివ్య లక్షణాల నాపాదిస్తుంది. ఆమెలో మాత్రము ఇంద్రజాలం కానీ – మిథ్యాతత్త్వం కానీ లేదు. విశ్వనిర్మాణంలో అచేతన యాంత్రిక నిర్వహణ కానీ లేదు. అవాస్తవికతా లేదు. మనమనుకునే మాయా శక్తియొక్క ప్రాథమిక భ్రాంతీ, మిధ్యా లేదు. పరతత్త్వంనుండి వచ్చిన ఆమెలో చేతనత్వశక్తి వున్నట్లు అనుభవించే జీవాత్మకు తెలుస్తుంది. మనల నజ్ఞానంలో తేలించినా – దాని ఆనుపానులు – పథకం మనకందదు. ఆమె శక్తి నానావిధ భ్రాంతి హేతువైనా – అది మనలో ఆత్మతత్త్వవిస్మృతికి కన్పిస్తున్న విషయంగా – సాధనలో తెలుస్తుంది. ఆ దివ్యజ్ఞానావిష్కరణ కామె పన్నిన పన్నుగడ ఇదంతా. ఆమెలోని జ్ఞాన – ఇచ్ఛా ఆనందావిష్కృతికి ఆమె మనలను తన వైపున కాకర్షిస్తూనే విశ్వావతరణ మహాశక్తిగా వుంటుంది. అజ్ఞానచలనాల్లోనూ – సాధకునిలో తాను మార్గదర్శ కశక్తిగా నిలుస్తుంది. ఇది అతనికి స్పష్టం చేస్తుంది. అతని ప్రయా ణాన్ని నెమ్మదిగానో – వేగంగానో సాగించే తోడ్పాటు అంది స్తుంది. అంధకారంనుండి వెలుగులోనికి తీసుకొనిపోతుంది. మృతినుండి అమృతత్త్వానికి – పాపంనుండి శివమైన తత్త్వానికి నడిపిస్తుంది. ఆ విధంగా ఆమె శక్తి క్రియాశీలము – ప్రయోజన వంతము – శక్తిమంతము – సృజనాత్మకము. వస్తుసృష్టి చేయటమే

కాదు – నడిపించటమూ ఆమె వంతే. అధోజగత్తులోని వక్రత లను సరిదిద్ది ఉత్తమగతికి దారి కల్పిస్తుంది.

*

మానవమనస్సు కల్పించే భ్రాంతిజ్ఞానమేమంటే ఆ మహాశక్తిని ప్రకృతికీ – దాని యాంత్రిక శక్తులకూ అన్వయించటం. ప్రకృతి ఒక యంత్రం. అది సృష్టిపరిణామానికి హేతువైన అజ్ఞాన మూల వస్తువు. కనుక మహాదేవి అంటే ఈ క్షుద్రప్రకృతిశక్తి కాదు. అయితే దీనిలోనూ మహాశక్తి స్పర్శ లేకపోలేదు. పరిణామ హేయ కల్పనలో తన అంశా లేకపోలేదు. కానీ ఇదీ – ఆద్యశక్తీ ఒకటి కాదు. ఆ తల్లి దివ్యచైతన్యం. ఒక మహాశక్తి – కాంతి – పరాప్ర కృతి – మానవజాతి ఊర్ధ్వముఖమైన ప్రయాణానికి లక్ష్యం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు

పరదేవత

ఓం ఆనందమయి చైతన్యమయి సత్యమయి పరమే.

శ్రీఅరవిందులు

ఓం – ఆమె ఆనందము
ఆమే చైతన్యము
ఆమే సత్యము
ఆమే పరము

అనువాదము

*

ఆమె సమస్తజీవులలో మాతృరూపంలో ఉండే పరదేవత
ఆమె, సమస్త జీవులలో శక్తిరూపంలో ఉండే పరదేవత
ఆమె సమస్త జీవులలో శాంతిరూప పరదేవత
ప్రణామములు ఆమెకు, ప్రణామములు ఆమెకు
ప్రణామములు ఆమెకు

ఈశ్వర – శక్తి

ఈశ్వరుడు విశ్వేశ్వరుడు. విశ్వశక్తిగా ఆయన ప్రక్కనే ఆసీనయై ఉన్న శ్రీమాత నుంచి ఉద్భవిస్తాడు.

ఈశ్వర-శక్తి; పురుష-ప్రకృతి, ఒకటి కాదు

పురుష-ప్రకృతి – ఇవి విడివిడిగా ఉండే శక్తులు. ఈశ్వరునిలో శక్తి, శక్తిలో ఈశ్వరుడు పెనవేసుకొని ఉంటారు

ఈశ్వరుడే పురుషుడు: పురుషునిలో ప్రకృతి ఉన్నప్పుడు; ఈశ్వరశక్తిచే పాలింపబడినపుడు, ఈశ్వరుడే పురుషుడు (గా కన్పిస్తాడు).

శక్తే ప్రకృతి: శక్తి ప్రతి కదలికలో ఈశ్వరుడుంటాడు. శక్తి ఇచ్ఛే ఈశ్వరేచ్ఛ. ప్రకృతిలో పురుషుడాత్మగా ఉన్నపుడు, ఈశ్వరేచ్ఛచే ప్రకృతి పనిచేసినపుడు, శక్తే ప్రకృతి (గా కన్పిస్తుంది).

ఈశ్వర-శక్తుల అవగాహన – అనుభవం – ద్వారా, ఉన్నత దైవకార్యాలలో క్రియాశీలంగా పాల్గొనవచ్చు. ఆధ్యాత్మికంగా, సత్తా నైజంలో, (సత్తా అన్ని భాగాలలో) దైవంతో సంపూర్ణ ఐక్యతా, సామరస్యాలను సాధించవచ్చు.

పురుషుడు

పురుషుడే ఆధారము – సాక్షి: పురుషుడంటే ప్రాథమిక చైతన్యమే. అదే మన నిజమైన సత్తా. ఇంకా చెప్పాలంటే, ప్రాథమిక చైతన్యము వ్యక్తమయే భూమికలో సత్తాయే పురుషుడు.

సాధారణ మానవనైజంలో ఈ పురుషుడు 'నేను' అనబడే అహంకారంలోను; 'నాది', 'నావారు' వంటి అజ్ఞానపు సంబంధాలతో కూడిన ప్రకృతి క్రీడాకలాపాలలోను కప్పబడి, మరుగున ఉంటాడు. అజ్ఞాతంగా ఉన్నా, ప్రకృతి అజ్ఞానక్రీడలకు ఆధారంగా సాక్షిగా ఉంటాడు.

ప్రకృతి వెలుపలకు పురుషుడు రావటం, విముక్తికి ఆరంభం మాత్రమే ఐనప్పటికీ నెమ్మదిగా ప్రకృతిపై ఆధిపత్యము సాధించి అధికారి కాగలడు. మనలో అహంకారము తన అజ్ఞానపు వ్యస నాలను (భోగేచ్ఛలను) వదులుకోలేదు. మనలో అధోశక్తులు కూడా పురుషుని ఆధిపత్యానికి వ్యతిరేకులు. దీనివల్లే పురుషుడు అధి కారి కావడం నెమ్మదిగా జరుగుతుంది. ఐనప్పటికీ ఊర్ధ్వశక్తుల క్రీడ, దిగువ కదలికలను స్థానభ్రంశము చేయగల్గినపుడు, పురు షుడు నియంత కాగలడు. ఈ ప్రక్రియ – ఊర్ధ్వశక్తుల ఆగమ నము, దిగువశక్తుల పెనుగులాట – ఒక్క మారుగా ఎన్నడూ పూర్తి కాదు. దైవానికి సమర్పణవల్ల ఈ చర్య నిజం చెప్పాలంటే ఎక్కువ ఫలవంతం, వేగవంతం అవుతుంది. సంపూర్ణ ఆత్మసమ ర్పణ సాధ్యమయేవరకూ ఈ రెండు పద్ధతులు – దైవానికి సమ ర్పణ, ఊర్ధ్వశక్తులు అధోశక్తులను స్థానభ్రంశం చేయుట, కొన సాగుతాయి.

*

సహజంగా పురుషునికి వ్యక్తిత్వము లేదు. ప్రకృతి కదలికలలో బాహ్యంగా కలవటంవల్ల, ఒక అహంకారాన్ని, వ్యక్తిత్వాన్ని, తనకు తానుగా ఏర్పరచుకుంటాడు. కాని, తన సహజనైజంలో అతడు దేనితో సంబంధం లేక, విడివిడిగా ఉండే – సాక్షిగా కన్పి స్తాడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

ఆధ్యాత్మిక పరిణామమే ఇక్కడ మన అస్తిత్వం పరమార్థం.

ప్రకృతి

ప్రకృతి దివ్యప్రాకృతిక శక్తి, నిర్వాహక దివ్యశక్తి, దివ్యచైతన్యము నుండి వేరైన దివ్యశక్తి. చైతన్యము పురుషుడికి చెందినది. పురుషుడులేని ప్రకృతి జడము, యాంత్రికము, నిశ్చేతనమైనది.

*

ప్రకృతి చలనము ద్విముఖమైనది. ఒకటి ఊర్ధ్వముఖము. రెండు అధోముఖము. వీటినే దైవికము – దైవికము కానిది అని పేర్కొనవచ్చు. ఈ విభేదము వ్యావహారికమైనదే. నిజానికి దైవికము కానిదేదీ లేదు. ప్రకృతి సహజమూ, మానవాతీతమూ మధ్య భేదము ఏ విధంగా అర్థరహితమో, ఇదీ అంతే. ఎందుకంటే అస్తిత్వము కలిగిన వస్తువులన్నీ సహజమైనవే గదా! సమస్తమూ ప్రకృతిలోనూ ఉంది. భగవంతునిలోనూ ఉంది. కాని వ్యావహారిక పరిభాషలో భేదం ఉంటుంది. మనకు తెలిసిన, మనమే అయిన అధోప్రకృతి మన విశ్వాసం సడలనంతవరకూ అట్లాగే ఉంటుంది. పరిమితి, విభజన ద్వారా వ్యవహరిస్తుంటుంది. అవిద్యా ప్రకృతికి లోబడి అహంకారభూయిష్టమైన జీవనంగా పరాకాష్ఠ చెందుతుంది. మనం ఆకాంక్షించే ఊర్ధ్వప్రకృతి ఏకత్వంతో నియంత్రణాతీతంగా వ్యవహారిస్తుంది. జ్ఞానప్రకృతికి సంబంధించినదై దివ్యజీవనంగా పరిణామం పొందుతుంది.

పురుషుడు – ప్రకృతి

పూర్ణత్వం చెందాల్సిన ఆత్మ సంపూర్ణత కలిగిన జీవాత్మ కాదు – అసంపూర్ణతకు కారకమైన అహం కాదు. ప్రకృతిలో కదులుతూన్న ప్రవాహంగా రూపొందిన పరాప్రకృతి.

జీవితం ప్రకృతీ-పురుషుల కలయిక. చూసే చైతన్యమూ, చూసినదాన్ని వ్యవస్థీకరించి, కార్యరూపం కల్గించే చైతన్యాల సమ్మేళనం. ఒకదాన్ని ఆత్మ అనీ, మరోదాన్ని ప్రకృతి అనీ అంటాం. ఈ తొలి ద్వంద్వాల నుండే యోగం ప్రారంభం కావాలి.

బహిర్ముఖంగా కాకుండా మనం అంతర్ముఖులమై వ్యక్తిగత అనుభవాలను విశ్లేషిస్తే జీవుని రెండు విభిన్నమైన భాగాలు కనిపిస్తాయి. జడమూ, నిశ్చేతనమై సహకరించే చైతన్యం ఒకటి; క్రియాశీలమూ, సృజనాత్మకమూ అయి సహకారం పొందే చైతన్యం మరొకటి. క్రియారహితమైన ప్రాథమిక చైతన్యమే పురుషుడు, సాక్షి; క్రియాశీలమైన మానవాతీత చైతన్యమే ప్రకృతి, సాక్షియొక్క సృజనాత్మకశక్తి. కాని మొదట ఈ రెండూ పూర్తి విభిన్నంగా, ఒకదానితో ఒకటి సంబంధం లేనట్టుగా కనిపిస్తాయి.

ప్రకృతి సృష్టికి మౌనసాక్షిగా ఉంటూ, దాని చేతల్లో జోక్యం చేసుకోకుండా తన శాశ్వత అస్తిత్వపు అద్దంపై వివిధ రూపాలనూ, పేర్లనూ, కదలికలనూ ప్రతిబింబిస్తూ ఉండేవాడు పురుషుడు. పురుషుడి ఆనందం కొరకు అవిశ్రాంతిగా సృష్టిస్తూ, చరిస్తూ, విషయాలను రూపొందిస్తూ, ప్రభావితం చేస్తూ ఉండేది ప్రకృతి. సాంఖ్యం ద్వంద్వవిధానం ఈ రెంటితో ఏర్పడిందే. కాని ఈ సంబంధాలను స్వంత అనుభవాలతో రంగరించి తరచి చూస్తే పురుషుడి దృష్టి నిజానికొక నిర్దేశం అని గమనిస్తాం. పురుషుడి దృష్టి కోసం ప్రకృతి గ్రహించేది, త్యజించేది, నిర్మూలించేదంతా వ్యక్తిగత అనుభవంగా ప్రోగుచేసుకుంటుంది. తనలో ఆయనకు నచ్చిందంతా ఆయనకు సమర్పిస్తుంది. ఆయనపై తన నియంత్రణకూ, ఆయన లొంగుబాటుకు సంతసిస్తుంది. కాని ఆయన ఒత్తిడి చేసినప్పుడల్లా ఆయన్ను శిరసావహించక తప్పదు. మొదట వ్యక్తిగత అనుభవంలో నిజమనిపించిన ఈ అంతిమ సూత్రాన్ని బాహ్య ప్రపంచాన్ని నిర్ధారించటానికి కూడా యోగులు గ్రహిస్తారు. కాబట్టి పురుషుడు – ప్రకృతులు కేవలం సాక్షి, సాక్షీభూతమైన కార్యమే కాదు, భగవంతుడూ – అతని నిర్వాహకశక్తి కూడా. ఈశ్వరుడు పురుషుడు, ఆయన శక్తి ప్రకృతి.వారి క్రీడావినోదమే ఈ విశ్వం ఉనికికి ప్రేరణా, కార్యనిర్వాహకశక్తి – రెండూను.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం మాడభూషణం రాజగోపాలాచార్య

దైవము

నిరపేక్షము, చైతన్యము, ఆత్మ – దేశకాలాల కతీతమైనది భగవంతుడు. విశ్వాత్మగా అభివ్యక్తమౌతుంది. ప్రకృతికి అధిపతి. మనం అనుకునే భగవంతుడే – ఇదంతా.

*

సర్వమూ భగత్స్వరూపమే. కాగా సర్వమునూ అధిగమించి అతీతంగా కూడా భగవంతుడు ఉన్నాడు. భగవంతుడు లేని అస్తిత్వమే అసలు లేదు. అస్తిత్వంలో దైవం స్వీయ చైతన్య ప్రతిరూపం. అందుకు ప్రతీకగా ఉంటాడు.

*

సాపేక్ష ప్రపంచానికి వెనుక భగవంతుడు నిరపేక్షబ్రహ్మగా నిలిచి ఉంటాడు. అశాశ్వతమైన ప్రతిదానికి, దృగ్గోచర విషయ సముదాయానికి అంతటికి వెనుక ఆలంబనగా శాశ్వతుడుగా ఉంటాడు. విశ్వాత్మకుడుగా ప్రతి వైయ్యక్తికమైనదానిలోనూ తాను అభివ్యక్తమై ఉంటాడు.

*

భగవంతుడు స్థిరమైన, శాశ్వత ఏకైక సత్యము. ఆయన *'ఏకః'* ఒక్కడే. సాటిగా మరొకడు లేడు. సత్, అసత్ అంతా ఆయనే. స్థిరుడు. భగవంతుడు దేశకాలాల కతీతుడు. మారనివాడు. చలనమనేది దేశకాలాలలో మార్పు. ఇపుడు ఉన్నాడు. ఎప్పటినుంచో ఉంటున్నాడు. భవిష్యత్తులోనూ ఉంటాడు. సర్వకార్యకారణములకు అన్యాశ్రయములకు అతీతుడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దేవతలు

దేవతలు పరబ్రహ్మమునకు ప్రాతినిధ్యము వహించే వైశ్వానరమూర్తులు. రూపరహిత కార్యాచరణలో పలు ప్రకృతినియమాలను క్రీడావినోదహేలగా నిర్వహిస్తారు. ఒకే దివ్యత్వాన్ని వ్యక్తీకరిస్తారు.

*

దేవతలు గొప్ప అమృతశక్తులు, శాశ్వత వ్యక్తిత్వాలు. అవి వ్యక్తావ్యక్త విశ్వశక్తులపై ఆధిపత్యం వహించి సచైతన్యంగా ప్రోత్సహిస్తూ, నియమిస్తూ ఉంటాయి.

*

మౌలికంగా దేవతలు తమ అంతస్తత్వంలో శాశ్వత దివ్యాంశలు. ఆద్యశక్తి అతీత దివ్యమాతచేత నియమింపబడిన పరబ్రహ్మశక్తులు. విశ్వక్రియాకలాపంలో అవి దివ్యశక్తులు, దివ్యమూర్తులు. విశ్వంలో వాటికి ఒక్కొక్క ప్రత్యేక స్వయంప్రతిపత్తితో, విధి, క్రియాకలాపాలు కలిగి ఉంటాయి. అవ్యక్త వ్యక్తిత్వాలు కావు అవి. వైశ్వానకవ్యక్తులు. సాధారణంగా అవ్యక్తశక్తుల చలితచాలనాల వెనుక అదృశ్యంగా ఉంటాయి. అధిమానసంలో (in the Overmind) అవి స్వతంత్ర సత్యాలుగా ముల్లోకాలలో దర్శనమిస్తాయి. అతిమానసంలో (in the Supermind) అవి ఏకైకుని (the One) తిరిగి చేరుకుంటాయి. ఆ ఏకైక పురుషోత్తముని పలు రూపాలు సామరస్యంతో ఒక్కటిగా కలిసి పనిచేస్తాయి.

*

ఓ వరుణా! నన్నావరించి నిండిపో. ఇంద్రా! శక్తివంతంగా నన్నావేశించు. ఓ సూర్యమా! తేజోవంతంగా నాలో వెలుగొందుమా!. చంద్రా! నీ సౌందర్యమాధుర్యాలు నా సొంతం చేయి. ఓ రుద్రా! తీవ్రతని, భయంకరత్వాన్ని నాలో నింపు. మరుత్తులారా! మీ తీవ్రవేగచలనాన్ని నా కందించండి. ఓ! ఆర్యమా! నీ శక్తిసాహసాలు నావి కానీ. ఓ భాగా! నీ ఆనందభోగలాలసలు, నా పరం చేయవా! ఓ మిత్రా! నీ దయ, ప్రేమ, భావావేశాలు, కోమలత్వం

నాకు దక్కనీ. ఓ ఉషాదేవతా! తేజస్సుని అనుగ్రహించి, సర్వమూ సందర్శనీయం కావించు. ఓ నిశారూపమా! నాకు పవిత్రత, సాఫల్యత చేకూర్చుము. ఓ క్రియాత్మక చేతనమా! పరిపూర్ణత, సంసిద్ధత, ఉల్లాసము నాలో పాదుగొలుపు. ఓ మృత్యుదేవతా! ఒక జీవనభవంతి నుంచి మరో నూతన జీవన హర్మ్యానికి నన్ను నడిపించు. ఓ బ్రహ్మణస్పతీ! సర్వ దేవతాశక్తులూ నాలో సామరస్యంగా కొలువు తీరి ఉండనీ. ఓ కాళీమాతా! నన్నీ దేవతలకు స్వాధీనుడను కానీయకు సుమా!

మూలం: శ్రీఅరవిందులు

ప్రశ్న: శ్రీఅరవిందులు కాళీమాతకే ప్రాధాన్యత ఎందుకిస్తారు?

జవాబు: దేవతలందరూ ప్రకటించే దివ్యలక్షణాలు కలిగి ఉండటం మంచిదే, అవసరమే. అందుకే శ్రీఅరవిందు లందరినీ ఆమంత్రించి తమ స్వభావాన్ని అందించమని వేడారు.

అతీత దివ్యానుభవమే సాక్షాత్కారంగా పరమాత్మతో ఐక్యం కోరేవారికిది చాలదు. ఆ కారణమే వారిని తుదికోరికగా ఈ దేవతాతీతధారణతో అధిగమించే శక్తిని ప్రార్థించారు.

భువనేశ్వరి అత్యంత సాహసశక్తియైన శ్రీకాళీ మాతయే. శ్రీకాళీమాత అతీతశక్తులతో గోచరిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: టి.యస్. రామచంద్రరావు

ఈ రూపాంతరీకరణను నీవు అభిలషిస్తే నిన్ను నీవే ఆక్షేపణ, ఆటంకం లేకుండా శ్రీమాత హస్తాలలోనికి అర్పించుకో. ఆమెను ఆమె కార్యాన్ని అడ్డు, ఆపు లేకుండా నీలో నిర్వహించనివ్వు.

అసురులు

అసురులు రెండు రకాలు. ఒక రకం మౌలికంగా (ప్రారంభంలో) దేవతలుగనే వుండేవారు. కాని వారు వారి దివ్యత్వంనుండి ఐచ్ఛికంగా పతనమై దైవ ఉద్దేశానికి వ్యతిరేకులైపోయారు. హిందూశాస్త్రాల్లో వారు పూర్వదేవతలుగ ప్రేర్కొనబడినారు. వారు మరల దేవతలుగ మార్పు చెందబడగలరు. అంతేకాదు వారి మార్పు విశ్వంయొక్క అంతిమ ప్రయోజనానికి అవసరం కూడ.

కాని సాధారణ అసురుడు యీ కోవకు చెందినవాడు కాడు. ఇతడు పరిణామ ప్రక్రియకు చెందినవాడు కాడు. ఇతడు ఒక ప్రత్యేక వర్గానికి చెందిన ప్రాణి. మరియు పరిణామం చెందనట్టి, పరిణామం చెంద నిష్టపడనట్టి ఒక స్థిరమైన సృష్టి సిద్ధాంతానికి ప్రతినిధి. ఈ అసురులు, రాక్షసులు, పిశాచాలు, దైవవ్యతిరేకశక్తులు. క్రైస్తవ సంప్రదాయంలోని సైతానులు లాటివారు. వీరు మానవపరిణామ ప్రక్రియను, దైవ ప్రయోజనాన్ని వ్యతిరేకిస్తారు. వీరి జీవితలక్ష్యమైన దుష్టత్వాన్ని వీరు మార్చుకోరు. కాని ఆ దుష్టత్వంలానే వీరూ హతమార్చబడవలసినవారు.

*

అసురులు మానసిక లేదా ప్రాణమయమనస్సుయొక్క అంధకార పార్శ్వమునకు చెందినవారు. ఈ మనోభూమికయే అసురుల యదార్థ క్షేత్రం. వారి ప్రధాన లక్ష్యం ఉన్నత దైవశాసనాన్ని వ్యతిరేకించే అహంకార బలోపేతమైన పోరాటం. అసురుడు ఆత్మనిగ్రహం, తపశ్శక్తి, తెలివి కలిగివుంటాడు. కాని అదంతా కూడా తన అహంకారం కొరకే. నిమ్నప్రాణికభూమికలోని రాక్షసులు తీవ్ర మనోవికారాలకు, ప్రభావాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రాణికభూమికలో యితర విధాలైన ప్రాణులున్నారు. వారు పిశాచాలని, ప్రమధులని పిలువబడుతారు. వారు జడాశ్రిత ప్రాణమయజీవులు.

ప్రతికూల శక్తులు

ఈ ప్రపంచంలో అసురశక్తులు చేసే పని అచేతన, అజ్ఞానశక్తుల పనులకు పరిపూర్ణ అవకాశం కల్పించడం. అతిమానస చివరి గమ్యం తన పరమ సామరస్యతతోవాటి సమశ్యల పరిష్కరించు టయే. ఈ ప్రపంచ ఉనికికి కారణం కూడ అదే కదా! ఈ ఆశ్రమం లోని జీవితము, ఇచ్ఛలు అభివృద్ధిచెందుతున్న పని, ప్రపంచ సమ శ్యల పరిష్కారాన్ని చూచుకొనుటగా వుంటున్నది. అందువలన యీ ఆశ్రమం మానవునిలో పనిచేస్తున్న దుష్టశక్తుల పోరాటాన్ని ఢీకొనుటయే యగును. ఈ కార్యాన్ని యిది తప్పించుకోజాలదు. ఎందుకంటే ప్రపంచంలోని అసురశక్తులను నిర్మూలించుటయే యీ ఆశ్రమ లక్ష్యం కదా!

*

నిమ్నప్రకృతి అజ్ఞానభూయిష్ఠమైనది, దైవవిరుద్ధమైనది. అది అసు రశక్తుల నిలయం కాదు. కాని వెలుగుకు, సత్యానికి అది తనను తాను మూసుకొని వుంటుంది. అసురశక్తులు దైవవ్యతిరేకమైనవి. అవి నిమ్నప్రకృతిని ఉపయోగించుకొంటాయి. దానిని తప్పుడు మార్గంలోనికి త్రిప్పుతాయి. దానిని వక్రచలనాలతో నింపివేస్తాయి. తద్వారా అవి మానవునిపై తమ ప్రభావం చూపుతాయి. అంతే కాదు, అవి మానవుని ఆవహించి అతన్ని పూర్తిగా తమ స్వాధీనం చేసికొంటాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య

అవిద్య, అసత్యం

Ignorance అంటే అవిద్య అని అర్థం. వేరుచేసి చూపించే చైతన్యమే అవిద్య. అహంకారంతో కూడిన మనస్సు, ప్రాణము దాని నుండి వెలువడినవే. అహంకారంతో కూడిన మనస్సు, ప్రాణములకు సహజసిద్ధమైనదంతా ఈ వేర్పాటు చైతన్యంనుండి వచ్చినదే. విశ్వాత్మకమైన, దివ్యమైన వివేకం, అతిమానస ప్రకాశం (దివ్య తేజస్సు) నుండి విడివడి దివ్యసత్యాన్ని పోగొట్టుకుంటుంది. సత్తయొక్క సత్యం, దివ్యచైతన్యంయొక్క సత్యం, బలక్రియాకలాపాల సత్యం, దివ్యానందంయొక్క సత్యం అన్నీ దివ్యసత్యానికి సంబంధించినవే. ఫలితంగా, దివ్య ఆత్మజ్ఞానప్రకాశంలో పూర్ణసత్యం, దివ్యసామరస్యంతో సృష్టించబడవలసిన ప్రపంచానికి బదులు నిమ్నస్థాయిలో, విశ్వాత్మకమైన దివ్యబుద్ధియొక్క పాక్షికసత్యాలతో ఈ ప్రపంచం నిర్మించబడింది. దీనిలో అన్నీ పాక్షికసత్యాలు, పాక్షికదోషాలే. దీన్నే శంకరులవంటి కొందరు ప్రాచీనయోచనాపరులు దైవీమాయగా అపవాదు నంటగట్టారు. దీని వెనుకనున్న మహత్తర దివ్యశక్తిని దర్శించలేకపోయారు. ఈ సృష్టియొక్క చైతన్యమంతా పరిమితమైనది లేదా పరిపూర్ణమైన దివ్యప్రకాశంనుండి వేరుపడడము వలన పెడదారి పట్టినది. అది దర్శించే దివ్యసత్యం కూడా పాక్షికజ్ఞానమే. అందుచేతనే దీనిని అవిద్య అన్నారు.

అసత్యం దీనికి భిన్నంగా ఉంటుంది. అది ఈ అవిద్య కాదు. కాని దాని కట్టకడపటి ఫలితం అదే. అది ఒక అసురశక్తిచే కల్పించబడింది. ఈ అసురశక్తి సృష్టిలో కలగజేసుకుంటూ ఉంటుంది. ఇది దివ్యసత్యాన్నుంచి విడివడి ఉండడంచేత పరిమితజ్ఞానం కలిగియుండి దోషానికి తెరుచుకుని ఉంటుంది. అయితే అది దివ్యసత్యాన్ని ప్రతిఘటిస్తుంది. సాధారణంగా దివ్యసత్యాన్ని వశం చేసుకుంటూ విరుద్ధంగా ఉంటుంది. అయితే అది కేవలం దాన్ని పెడదారి పట్టించడానికే. ఈ దివ్యశక్తి, ఈ ఘోరమైన దివ్య అసురశక్తి లేదా దివ్యరాక్షసమాయ తనదైన పెడదారి పట్టించే చైతన్యమే. సత్యమైన జ్ఞానమని ప్రతిపాదిస్తుంది. ఇదే

తన మూర్ఖమైన వక్రీకరణలతో దివ్యసత్యాన్ని తల క్రిందులుచేసి దాన్నే వాస్తవమని కూడా ప్రతిపాదిస్తుంది. ఈ రకంగా పెడదారి పట్టించిన, లేక పట్టిస్తూ ఉన్న చైతన్యంయొక్క శక్తులు, మూర్తులనే మనం ప్రతికూలజీవులని, ప్రతికూలశక్తులని వ్యవహారిస్తాము. ఎప్పుడు అవిద్యా వస్తువిషయంనుండి సృష్టించబడిన ఈ పెడదారి పట్టిన విషయాలే దివ్యసత్యంగా ప్రతిపాదించబడునో, అప్పుడు దానిని అసత్యం అని, యోగపరిభాషలో మిథ్య, మోహం అని అంటాం.

శక్తులు, పోలికలు: ఈ శక్తులు, జీవాలే అవిద్యా ప్రపంచంలో అవి సృష్టించిన అసత్యాలను కొనసాగించడానికి, మానవులు పాటించవలసిన సత్యం అదేనని ప్రతిపాదించడంలో శ్రద్ధ చూపిస్తాయి. భారతదేశంలో వాటిని అసురులని, రాక్షసులని, పిశాచాలని (ఈ జీవులు వరుసగా మానసికప్రాణిక, మధ్యప్రాణిక, అధోప్రాణిక స్తరముల లోనివి.) అంటారు. అవి దివ్యప్రకాశం యొక్క దివ్య.శక్తులైన దేవతలకు ప్రతికూలంగా ఉంటాయి. ఇవి కూడా దివ్యశక్తులే. ఏమంటే వాటికి కూడా వాటి విశ్వాత్మక క్షేత్రం ఉంది. దానిలో వాటియొక్క వ్యాపారమును నెరవేరుస్తూ పెత్తనం చలాయిస్తూ ఉంటాయి. వీటిలో కొన్ని ఒకప్పుడు దైవీ శక్తులే (పూర్వదేవతలు, 'పూర్వే దేవాః' అని మహాభారతంలో ఒక సందర్భంలో సూచించారు) అవి విశ్వం వెనుకనున్న దైవేచ్ఛపై తిరగబడడం చేత అంధకారంలోకి పడిపోయాయి. ప్రపంచాన్ని పాలించడానికి ఎన్నుకొన్న రూపాలనే పోలికలని (appearances) ప్రస్తావిస్తాము. ఈ రూపాలు సాధారణంగా అసత్యమైనవి. అసత్యాన్నే ఎప్పుడూ మూర్తీభవింపజేస్తాయి. దైవాన్ని పోలిన మిథ్యాభావన కలగజేస్తాయి.

అహంకారం

'నేను' అనే ఈ అల్ప అహంకారం దివ్యప్రకృతిచేత రూపకల్పన చెయ్యబడింది. ఇది ఏకకాలంలో మానసిక, ప్రాణిక, భౌతికరూపములు ధరించి బాహ్యాచైతన్య క్రియాకలాపాలను కేంద్రీకృతం చెయ్యడంలోను, వ్యక్తీకరించడంలోను తోడ్పడుతుంది. నిజసత్తను తెలుసుకున్నప్పుడు ఈ అహంకారంయొక్క ప్రయోజనం ముగుస్తుంది. ఈ రూపకల్పన అదృశ్యం కావలసివస్తుంది – దాని స్థానంలో నిజసత్త అనుభవమవుతుంది.

*

మానసిక, ప్రాణిక అహంకారములు దేహేంద్రియ జ్ఞానంతో ముడిపడి ఏర్పడడమే పరిణామక్రమంలోని విశ్వ (దివ్య) జీవనానికి గొప్ప తొలి ప్రయత్నం. ఏమంటే అది పదార్థం నుండి చైతన్యవంతుడైన వ్యక్తిని సృష్టించడంలో కనుగొన్న పద్ధతి ఇదే. పరిమితిలోనుంచే ఈ అహంకారాన్ని అంతమొందించడం తప్పనిసరి. దివ్యత్వసిద్ధికి దివ్యజీవనానికి అవశ్యమైన పద్ధతి ఇదే. అప్పుడే ఎరుక కలిగిన వ్యక్తి విశ్వాతీత ఆత్మస్థితిని తన నిజదివ్యపురుషత్వాన్ని కనుగొనగలడు.

*

వేరువేరుగా చూపించే మనస్సుచే ప్రతిపాదించబడిన ప్రజ్ఞయే ఈ అహంకారం. ఇంద్రియజ్ఞానం కలిగిన మనస్సుయొక్క అనుభవాలను తన చుట్టూ తిప్పుకోడానికి గమనాన్ని కలిపి ఉంచుతూ చక్రం పడిపోకుండా చేసే ఇరుసు సీలలాగ పనిచేస్తుంది. అది ఒక పరికరం కంటె గొప్పది ఏమీ కాదు. మామూలు మనస్తత్వం మనల్ని పరిమితం చేస్తుంది. మానసికస్థితియొక్క స్వభావం మనల్ని వివశులను చేస్తుంది. అహంకార వ్యాపారమునే మన ఆత్మ అని తప్పుగా అభిప్రాయపడేటట్లు చేయడమే ఆ ఉపకరణం యొక్క ఉద్దేశం.

*

అహంకారం అని వేర్పాటుభావంతో మనలను గట్టిగా విడదీసే ఈ ఆత్మానుభవం ఏమిటి? అదేమంత ప్రధానమైన వాస్తవం కాదు. మనలోని దివ్యప్రకృతి చుట్టూ మన చైతన్యాన్ని కేంద్రీకృతం చేయడంలో ఒక ఆచరణయోగ్యమైన సంవిధానం మాత్రమే. మన సత్తలో మిగిలినవాటి నుండి విడిగా వర్గీకరింపబడి మానసిక, భౌతిక, ప్రాణికానుభవముల రూపముగా మనకు గోచరమయ్యే దానినే మన వాస్తవ స్వాభావిక అస్తిత్వంగా భావిస్తాము – వ్యక్తమవడంలో సత్తయొక్క ఈ వైయ్యక్తీకరణము. ఆ విధంగా ఏదో తానే వ్యక్తీకృతమై, అది ఆ వ్యక్తీకరణ ఉన్నంతవరకే ఉంటుందని మనలో మనం భావించడంలో మొదలుపెడతాము. తాత్కాలిక లేక కనీసం ఐహిక ఆవిర్భావం అనుకుంటాం. లేక పోతే మనకి ఎవరో ఆసరా అవుతూ లేదా వ్యక్తీకరణకు కారణభూతుడవుతూ ఉండే అమృతత్వ పురుషుడే వ్యక్తీకరణచే పరిమితుడయినాడని భావిస్తాము. ఈ స్ఫురణ, ఈ భావన మన అహంకారమును వ్యవస్థీకరిస్తుంది. సాధారణంగా మన వైయక్తికజ్ఞానంలో ఇంతకంటె ముందుకుపోము.

చివరకు మన వ్యక్తీకరణ ఒక బాహ్యా ఆకృతి. ఒక ఆచరణ యోగ్యమైన ఎంపిక మాత్రమేనని, ఒక విశిష్టమైన శరీరంలో జీవానికి తాత్కాలిక ప్రయోజనం ఒనగూర్చే పరిమిత చైతన్య సమన్వయం మాత్రమేనని అర్థం చేసుకోవాలి. లేదా భవిష్య శరీరములలో భవిష్య జీవనముల ద్వారా సాధించబడుతూ నిరంతరం మారుతూ క్రమాభివృద్ధిచెందే సమన్వయమే ధ్యేయంగా సాగుతోందని భావించాలి. దాని వెనుక ఒక చైతన్యమున్నది. ఒక దివ్య పురుషుడున్నాడు. ఆయన వ్యక్తీకరణముచే నిర్ధారింపబడడు, పరిమితుడు కాడు. ఏ సమన్వయం చేతనూ నిర్ధారింపబడడు. దానికి విరుద్ధంగా తానే వాటిని నిర్దేశిస్తాడు. ఆసరాగా ఉంటాడు. దాన్ని అధిగమిస్తూ అతీతంగా ఉంటాడు. ఈ సమన్వయాన్ని రచించడానికి ప్రపంచసత్త యొక్క పూర్ణానుభవాన్ని అతడు ఎన్నుకుంటాడు. అందుచేత మన వ్యక్తీకరణ ప్రపంచసత్త పైనే ఆధారపడి ఉంటుంది. వ్యక్తీకరణలోని సంభావ్యతల అనుభవం కొరకు

ప్రపంచసత్తను ఉపయోగించుకునే చైతన్యంపైన కూడా ఆధార పడి ఉంటుంది.

*

ఎప్పుడైతే మనం ప్రత్యేకించి చూపే వ్యక్తీకరణను అధిగమించి పోతామో అప్పుడే మనం నిజమైన దివ్యవ్యక్తులం (పురుష.) కాగలము. అహంకారమే సహాయకారి. అహంకారమే అడ్డంకి.

*

విభజింపబడిన వ్యక్తిని విశ్వమానవునిగా పరివర్తన నొందించుము. నీ సమస్తమూ దివ్యం కానిమ్ము. ఇదే నీ లక్ష్యం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం వై.యస్.వి.యస్ మూర్తి

అల్పమైన అహం

ఈ తైతక్కలాడే అహాన్ని రూపొందించింది లోకమాత,
దివ్యప్రకృతి కార్యకలాపాల నుంచి పొందే హీనలబ్ధిదారుడు,
జీవితానికి గుత్తాధిపతి – ఆమె పట్ల నమ్మకద్రోహి,
ఇంకా ఏవేవో స్వంతం చేసుకోవాలనే తపనతో
అమ్మకు తాను ఋణపడి ఉన్నాననేది విస్మరిస్తాడు

తన బ్రతుకు ప్రతి కదలిగా అహంకారపూరితమే ...దానితోనే
సత్వమంతా దట్టంగా పడుగు పేకగా నేయబడి ఉంది,
నిస్వార్ధమంటూ గొప్పలు చెప్పుకుంటూన్నప్పుడిది
ఏ నీచభాగానికో మెల్లగా చేరుతుంది. ఏ మూలా కాళీ ఉంచదు.

ఒక్కటే మిగిలిన స్వేచ్ఛామార్గము మనకు –
హృదయాంతరంగాలు
మనోదేహాలు ఆమెకే అర్పించి ఆమె అనంతవిశ్వవ్యాప్తలోకంలో

వసిస్తూ (ఆమె దివ్య) కాంతిలో విలీనమై ఉండిపోవటమే
వాడిన వ్యామోహాన్ని వీడి.

తిరుగుబాటును త్యజించి స్వభావము అనంతపరమాత్మకి
ఊపిరి కాక తప్పదు.

మూలం శ్రీఅరవిందులు
అనువాదం కర్రా వెంకటేశ్వర్లు

అచేతన

అచేతన వ్యతిరేకదిశలో పునరుత్పత్తి గావింపబడిన (inverse reproduction) దివ్యచేతన. అది దివ్య అస్తిత్వం మాదిరిగా సమగ్రత కలిగి తనకు తానే పనిచేయగలిగేది. కానీ, అదంతా తనలోనే ముకుళితమై ఉండే విశాల సమాధిస్థితి. అది తనలోనే, తనకు తానుగా పోగొట్టుకున్న అస్తిత్వం. తన లోలోపలి అనంత అగాధాల్లోకి నెట్టివేయబడి ఉండేది అది.

*

విశ్వంలో తన యదార్థ అభివ్యక్తి ప్రకటనలో పరమేశ్వరుడు అనంతుడు, అవధులులేని వాడవటం మూలాన, తన చైతన్యంలోని లెక్కలేనన్ని అవకాశాలనుంచి, ఒక విధంగా తనకు వ్యతిరేకంగా తానే దట్టమైన చీకటి, అచేతన, జడత్వం, సంవేదనలేమి, అస్తవ్యస్తత, చెల్లాచెదరుగా ఉండేటట్లుగా స్వయంభువుగా (తనకు తాను) ప్రకటించుకోగలడు. దీనినే భౌతికప్రపంచానికి ఆధారంగా మనం గమనిస్తాం. దానినే ఈ రోజులలో అచేతనగా చెప్తుంటాం. దానినే ఋగ్వేదం అచేతనా సముద్రమని అన్నది. అందులో ఏకత్వం (ఏకం సత్) దాగి వుండి పైకి లేచి ఈ విశ్వంగా రూపు దాల్చింది, అదే మరో రకంగా అప్పుడప్పుడు అభావంగా (శూన్యంగా) అసత్తుగా పిలవబడుతోంది.

ప్రకాశం

ప్రకాశం ప్రాథమికంగా ప్రదీప్తం చేసే, సృష్టిని చేయగలిగే దివ్య సత్యపు మొట్టమొదటి ఆత్మచైతన్య (ఆధ్యాత్మిక) అభివ్యక్తీకరణ. తరువాత దాని ప్రతినిధిగా వచ్చిందే ఈ భౌతిక ప్రకాశం, లేదా అది మార్పుచెంది భౌతికశక్తి కార్యకలాపాల కోసమై, భౌతిక (పదార్థం) లోనికి వచ్చింది.

*

మన ఇంద్రియం దాని అసమర్థత వలన చీకటిని సృష్టించింది. యదార్థంగా ప్రకాశం తప్ప ఇంకొకటి లేదు. చీకటనే, మన పరిమిత అల్పమానవ దృష్టి పరిమితికి ఎగువగాని, దిగువగాని ఉన్న ప్రకాశపు శక్తి మాత్రమే.

కాని, సూర్యుని వల్లనే వెలుగు (కాంతి, ప్రకాశం) సృష్టించబడిందని అనుకోవద్దు. సూర్యులు ప్రకాశం యొక్క భౌతికసాంద్రతలు, కాని అవి మనకొసగే వైభవం స్వయంజనితమై, అంతటా ఉండేది.

దైవం అంతటా ఉన్నాడు, ఎక్కడ దైవం ఉన్నాడో అక్కడ దివ్యప్రకాశం ఉంది.

జ్ఞానం చైతన్యం జ్యోతిర్ బ్రహ్మ.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ టి. ప్రసన్న కృష్ణ

గమనం

మనం సాధారణంగా ఎప్పుడూ చూసే భూమి, నక్షత్రాలు, ఆకాశము ఒక రైలుపెట్టె అనుకుంటే, ఇదే ప్రపంచం అనుకుంటారు చాలామంది. ఇవన్నీ అనంతాకాశంలో, నిత్యం, ఏటో వేగంగా పరుగులు తీస్తున్నాయనే సత్యం చాలామందికి తెలియదు. అలాగే మనం చూసే నక్షత్రమండలాని కావల అసంఖ్యాక నక్షత్రమండ

లాలు, సౌరమండలాలు ఉన్నాయని, అవి కూడా అలాగే పరుగులు తీస్తున్నాయని చాలామందికి తెలియదు.

అహంకారపు ఆలోచనలతోనే జనం సతమతమౌతుంటారు. పరిమితము, క్షణికము అయిన ఇట్టి ఆలోచనల నుండి దృష్టి మరల్చి, ప్రపంచాన్ని సత్యాన్వేషణ దృష్టితో పరిశీలిస్తే, అద్భుతమైన ఫలితాలు వస్తాయి. వీని మొదటి ఫలితం – ఈ అనంత విశ్వంయొక్క అస్తిత్వం వెనుకనుండే అనంతశక్తియొక్క అనుభూతి; ఈ శక్తి ఫలితంగా కల్గే, ఆది, అంతములేని విశ్వగమనము; ఆనంతాకాశము, అనంతకాలములోకి ప్రవహించే అనంత చైతన్యం – వీనియొక్క అవగాహన. వీటన్నిటితో కూడిన అనంత విశ్వం యొక్క అస్తిత్వం ముందు – మన అహంకారము – లేదా అనేక అహంకారాల సంపుటి – లేదా ఈ విశ్వంలో అనంతకాలంలో ఏర్పడిన అసంఖ్యాక వస్తువులు, అహంకారాల సంపుటి కూడా. ఒక క్షణికమైన గాలిధూళివలె – లేదా అల్పమైన మిడతలదండువలె – లెక్కించబడుతాయి.

*

ఈ ప్రపంచ అస్తిత్వము నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా పరిశీలిస్తే రెండే విషయాలు కన్పిస్తాయి: 1) ఆకాశములో గమనము 2) కాలంలో గమనము – మొదటి గమనము పరిణామాత్మకము. రెండవ గమనము మానసికము – ఎందుకంటే కాలముయొక్క అనుభూతి మానసికమైనది.

*

ఈ గమనానికి ఆధారము వస్తుసంబంధమైనది కాదు – సక్రియాత్మక చైతన్యశక్తి. నైజంలో ఒకటే అయినా, రూపంలో వేరు వేరుగా కనపడే సిద్ధాంతాలచే ఈ శక్తి అనేక రెట్లు గుణింపబడి – ఏకత్వంలో భిన్నత్వాన్ని, అఖండాకాశ కాలాలలో విభజనను సృష్టిస్తున్నది. అంతే కాకుండా, ఈ శక్తే వేరు వేరు పరిస్థితులను, కారణాలను సృష్టించి సంపుటీకరిస్తున్నది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం యస్.వై. సోమయాజులు

శక్తి

శక్తి స్వయంవ్యక్తం కాదు. శూన్యంలో వ్యవహరించదు. గుప్తచైత న్యముయొక్క క్రియాశక్తి. ఆత్మజ్ఞానావిష్కృతి – అనుభవమూ జరి గితే ఇది పరిపూర్ణతావిష్కరణగా పరిణమిస్తుంది. పదార్థగతమైన సృజనశక్తి ఆత్మచైతన్యముయొక్క స్పందన – చలనం.

పదార్థం

ఇది బాహ్యదృష్టికి జడంగా కన్పిస్తుంది. ఆధునిక శాస్త్రీయ దృక్పథం కూడా పదారథం శక్తియొక్క చలనం అని అంగీకరిస్తు న్నది. భారతీయదృష్టిలో ఇది కదలికలో గుప్తంగా ఉన్న ఛిత్‌శక్తి.

పదార్థం వాస్తవం కాదు. అది ఘనీభూతశక్తి

జవము (Force)

కదలికలో జీవచైతన్యం – శక్తి

జవము ప్రధానంగా శక్తే. జవం – వేగం – దీనిని ముందుకు త్రోసేది శక్తి. దీని క్రియారూపం. ఇక జవంలోని వేగసామర్థ్యం శక్తి (power). బలమంటే ఆధారంలో నిల్వచేయబడ్డ ఘనీభూత శక్తి.

*

వాస్తవిక సత్తా అంతా జవంలో లీనమౌతుంది. అది శక్తిక్రియ. అదే పదార్థంగా దేహధారణ చేస్తుంది. ఆత్మవికాసానుభవాలకు అనువుగా స్థూలసూక్ష్మరూపాలుగా మలిచే శిల్పి ఈ జవశక్తి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు

సాక్షాత్కారము

దైవాన్ని ఒక సత్వంగా (Being) అంగీకరించడమే సాక్షాత్కారము (Presence) అనే పదానికి అర్థం. ఏ అర్హత, వర్ణనలతో నిమిత్తం లేకుండా మన ఉనికి, చైతన్యంలో భాగంగా ఉన్నట్లు భావించటం సాక్షాత్కారం. అనిర్వచనీయమైన సాక్షాత్కారం అంటే అది అక్కడ ఉందని చెప్పడమే. అంతకంటె ఎక్కువ చెప్పలేం. అదే సమయంలో అంతా ఉందని తెలుసు మనకు. వ్యక్తిత్వము – వ్యక్తిత్వరాహిత్యమూ, శక్తి – వెలుగు – ఆనందమూ – మిగతా అంతా ఈ వర్ణించలేని సాక్షాత్కారం నుండే వెలువడతాయనీ మనకు తెలుసు. ఒక్కొక్కసారి ఈ పదం అంత నిరపేక్షంగా కన్పించకపోవచ్చు. కాని ఇదే ఎప్పుడూ మూలభూతమైన సారము. అన్నిటికీ ఆధారభూతమైన మూల సాక్షాత్కారానికి సంబంధించిన ప్రాథమిక భావన.

*

దివ్యసాక్షాత్కారాన్ని అందులో దర్శించకుండానే దివ్యచైతన్యాన్ని అమూర్తవంతమైన ఆధ్యాత్మికస్థితిగా, ఒక రకమైన శాంతి, వెలుగు, ఆనందం, వ్యాప్తియొక్క స్థితిగా మనం ఊహించుకోవచ్చని నా ఉద్దేశ్యము. వెలుతురు మొదలైనవాటికి ప్రాణభూతము, సారభూతమైనదే దివ్యసాక్షాత్కారము. కాబట్టి అది కేవలం ఒక ఆధ్యాత్మికస్థితి మాత్రమే కాదు. అదొక అస్తిత్వం. శ్రీమాత సాక్షాత్కారం మరింత నిర్దుష్టమైనది, వ్యక్తిగతమైనది. – ఏదో తెలియని శక్తికో, అస్తిత్వానికో సంబంధించింది కాదు. మనకు తెలిసిన, సన్నిహితమైన, ప్రియమైన వ్యక్తికి సంబంధించినది. సజీవంగా, నిర్దిష్టంగా మన అస్తిత్వాన్నంతా సమర్పణ పొందగలిగే వ్యక్తిది. అనివార్యం కాకున్నా, ఆ రూపం మనకు సాయం చేస్తుంది. ఆ సాక్షాత్కారాన్ని ఆంతరికంగా అనుభవించవచ్చు రూపం లేకున్నా.

*

ఆ సాక్షత్కారాన్ని మౌనంగా, అంతర్ముఖంగా భావించవచ్చు.

*

భావోద్దీపన పెరిగేకొలదీ ఆ సాక్షాత్కారం అనుభావ్యమవుతుంది. చైత్యపురుష చైతన్యాన్నుంచి ఆ తపన పుడుతుంది. ఆ చైత్యపురుష చైతన్య తీవ్రతవల్లనే స్థిరసాక్షాత్కారం చివరగా సుసాధ్యం కాబడుతుంది.

*

సర్వత్రా, సర్వదా నిజమైన అనంత సాక్షాత్కారానికి సంబంధించిన పరిచయం, స్థిరభావన, సన్నిహితత్వం, సామీప్యత, గ్రహణం, అంతరంగ ఆవాసం, మనను ఆవరించిన భావనలో జాగృతమయి ఉండాలి. ఆ దివ్యసాక్షాత్కారం సజీవంగా పరివ్యాప్తమైన వాస్తవంగా మనతో ఉండాలి. అందులోనే మనమూ, విశ్వమంతా ఉంటూ, చరిస్తూ, వ్యవహరిస్తున్నామనీ, ఖచ్చితంగా, దృశ్యమానంగా అదే అన్నింటా పరివ్యాప్తమై ఉందనీ, వాటి నిజమైన ఆత్మ, నాశరహితమైన, మౌలికమైన సారమూ అదేనని మనకు గోచరించాలి. సృష్టిలో సర్వత్రా ఈ ఆత్మ, శక్తి ఉన్నాయని అనుకోవడమే చాలదు. స్పష్టంగా దర్శించగలగాలి, భావించగలగాలి. సంబంధాన్ని పొందగలగాలి. అంత స్పష్టంగానూ, ఆత్మశక్తిలో సృష్టిని చూడగలగాలి. సర్వజ్ఞానమూ ఈ ప్రాథమికానుభవంతో పరివ్యాప్తిచెందాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: మాడభూషణం రాజగోపాలాచార్య

మన సమర్పణ వివేచనాశక్తిలేని అచేతనమైన ఉదాసీనతకు, ఏ ప్రలోభాలకు లేక ఏ ప్రభావానికైనా సరే లోను కాకూడదు. అయితే ఆ సమర్పణ చిత్తశుద్ధి కలిగి, చైతన్యవంతంగా నుండి, మెలకువతో ఆ పరమాత్మ, ఆ పురుషోత్తము డొక్కడే స్పష్టమైన లక్ష్యంగా ఉండవలె.

అతిమానసం (అతిమనస్సు)

మనోవైజ్ఞానికానుభవం మనస్సును దాటి వేరే క్రియాశీలశక్తియొక్క సామర్ధ్యాన్ని గ్రహిస్తుంది. సత్తయొక్క ఆరోహణక్రమంలో ఇంకొక స్థాయిని కనుగొంటుంది. దీన్నే మనం అతిమనస్సు అని అందాం.

*

అతిమనస్సు దివ్యసత్యచేతన. దానిలో దివ్యసత్యం పూర్తిగా అభి వ్యక్తం కాబడినపుడు అవిద్యాసాధనాలతో ఇక పని లేదు.

*

మనస్సు దివ్య సత్యాన్వేషణలో నున్న అజ్ఞానం. అతిమానసం తన లక్ష్య లక్షణంలో దివ్యసత్యచేతన. స్వీయ ప్రతిపత్తి కలది. తనకు తానే తన స్వశక్తిచేత సఫలీకృతమవుతుంది.

*

తాదాత్మ్యత వల్ల జ్ఞానాన్ని పొందడం దాని ప్రధాన లక్షణం. అలాగే పరమాత్మను తెలుసుకుంటుంది. దివ్య సచ్చిదానంద జ్ఞానం కలుగుతుంది. సృష్టిరహాశ్యం తెలుస్తుంది. ఎందుచేతనంటే ఇదీ – అదే That (తత్) కదా – సర్వం ఖల్విదం బ్రహ్మ, వాసు దేవః సర్వమ్, మొ॥ మనస్సు విషయాన్వేషణలో అవిద్యయొక్క ఉపకరణం. అతిమానసం జ్ఞానం కలిగిన దివ్యజ్ఞాని. జ్ఞానంతో ఐక్యత కలది. కావున తన దివ్యజ్ఞానప్రకాశంలో సత్యాత్మప్రకా శంలో సర్వమూ దర్శిస్తుంది. మరి అదీ ఆయనే కదా. అది ఒక స్థిరశక్తియేగాక, గమనశీలి, దివ్యజ్ఞానమే కాక, దివ్యజ్ఞానానుసా రిణీ అయి దివ్య ఇచ్ఛాశక్తి కూడా అయి ఉన్నది. అది అవిద్య వలనకాని, మరే ఇతర బాహ్యావేషాల వలనగాని అలజడి చెందదు. అందు సర్వమూ ఆ దైవంయొక్క ఐక్యతా సామరస్యాలతో తేజో మయంగా నెలకొని ఉంటుంది. ఆ విధంగా ఈ అతిమానసం అన్నిరకాల అవతరణలకు అతీతంగా ఉండదు. కాని, త్రివిధము లైన ఈ సృష్టియొక్క మన ప్రస్తుత అనుభవంలోని – మనః ప్రాణ పదార్థాలకు పైస్థాయిలోనే వ్యవహారిస్తుంది.

యోగము

యోగం అంటే దైవంతో ఐక్యమని అర్థం – ఈ ఐక్యత అతీత మైనది (లోకానికిపైన) లేక విశ్వాత్మకం (సార్వత్రికం) లేక వ్యక్త్యాత్మకం లేదా మన యోగంలోవలె ఈ మూడూ కలిసినది. ఇది అల్పమైన అహంకార, వ్యక్త్యాత్మక మనః ప్రాణ శరీరములకు పరిమితంకాని చైతన్యమును పొందడమని అర్థం. ఆ పరమాత్మ లేదా సార్వత్రిక (విశ్వాత్మక) చైతన్యంతో సంయోగం పొంది ఉంటుంది. తన ఆత్మను, తన అంతస్సత్తను సృష్టి రహశ్యాన్ని ఎరిగియున్నట్టి లోలోతుల్లోని మరేదో చేతనతో ఐక్యత కలిగి ఉంటుంది. యోగచేతనలో విషయాలేకాక, శక్తులనూ, ఎరిగి ఉంటుంది. శక్తులేకాక, శక్తులవెనుకనున్న చైతన్యసత్తను కూడా ఎరిగి ఉంటుంది. వీని గురించి తనలోనేగాక విశ్వమంతలోనూ ఎరుక కలిగి ఉంటుంది.

*

సత్తులో నిక్షిప్తమైన నిగూఢ అంతర్నిహితశక్తుల ప్రకటన వలన క్రమపద్ధతిలో స్వయం పరిపూర్ణతను సాధించుటయే ఈ పదానికి (యోగం) అర్థం – ఆ ప్రయత్నంలోని విజయకేతనం – మానవునిలోను, దివ్యవిశ్వక్షేత్రంలోను పాక్షికంగా ప్రకటించబడు తున్నట్లు మనకు గోచరించే సార్వత్రిక మరియు విశ్వాతీత దివ్య సత్తు మానవీయవ్యక్తిత్వంతో ఐక్యత నొందడమే యోగము. కాని పై పై వేషాల వెనుక మనం పరిశీలిస్తే జీవనమంతా దివ్యప్రకృతియొక్క ఒక విస్తారమైన దివ్యయోగమే (a vast Yoga of Nature) అది ఇప్పటికీ వ్యక్తంకాని అంతర్నిహితశక్తులను క్రమారోహణంలో ప్రకటించడం ద్వారా తన పరిపూర్ణతను సాధించడంలో సచేతనలోను, అవచేతనలోనూ కూడ ప్రయత్నిస్తూ ఉంటుంది. అది తనకు తాను తన దివ్యసత్యంతో సంయోగం చెందడానికి యత్నిస్తూ ఉంటుంది. ఆమెయొక్క యోచనాపరుడైన మానవునిలో మొట్టమొదటిసారిగా పృథ్వీపై ఈ మహత్తర సంకల్పం మరింత వేగవంతంగాను, శక్తిమంతంగాను సాధింపబడటానికి

ఆమె స్వయంచేతనా పద్ధతులను, కార్యశీలతలో ఇచ్ఛాపూర్వక మైన ఏర్పాట్లను కల్పిస్తుంది. స్వామి వివేకానందులవారు చెప్పి నట్లు యోగమంటే పరిణామక్రమాన్నంతటినీ ఒకే జన్మ లేక కొన్ని సంవత్సరాలు లేక కేవలం కొన్ని నెలల దేహధారణతో సంక్షిప్తం చేసే ప్రక్రియగా భావించవచ్చు.

రూపాంతరీకరణము

రూపాంతరీకణ అంటే ప్రకృతిలో ఎంతో కొంత మార్పని నా భావం కాదు – ఉదాహరణకు సన్యాసము, నైతిక పరిపూర్ణత, యోగసిద్ధులు (తాంత్రికునివలె) లేక ఒక అతీత (చిన్మయ) శరీరం అని నేననుకోవడం లేదు. రూపాంతరీకరణ పదాన్ని ఒక ప్రత్యే కమైన అర్థంతో ఉపయోగిస్తున్నాను. చేతనలో మౌలికమైన, ఆమూ లాగ్రమైన మార్పు కలగాలి. సత్తుయొక్క ఆధ్యాత్మిక పరిణామంలో బలమైన, సుస్థిరమైన, భద్రమైన ముందడుగుగా ఊహించడం జరిగింది. మనోమయ పురుషుడు ప్రాణిక, భౌతికమైన జంతుప్ర పంచంలో మొట్టమొదటిసారిగా ప్రకటించుకొన్నప్పటికంటె అది మహత్తరము, ఉన్నతము అయిన ప్రకృతి కలిగి బహువిస్తార మును, సంపూర్ణత్వమును పొందు చైతన్యముగా ఊహించబడినది.

*

సంపూర్ణమైన అంతరస్వేచ్ఛను, ఒక ఉన్నతమైన ఆధ్యాత్మిక చైతన్యాన్ని సాధించడం కూడా ఆ పరమోచ్ఛ రూపాంతరీకరణం కానేరదు. దానికది ఒక సంపూర్ణతను, ఘనతను సాధించియుండ వచ్చును. కాని మన క్రియాత్మక విభాగాలు వాటి పనితీరులో ఒక ప్రస్ఫుటమైన ఆధ్యాత్మికమనస్సునకు చెందినవే. మనస్సు ఇప్పటికీ ఒక పాక్షికమైన, లేక స్థానికమైన అస్పష్టతకు లోబడినది లేదా మౌలికమైన అవిద్యతో చుట్టుముట్టబడినది. అందుచేత అది తన మహత్తర శక్తిజ్ఞానములలో కూడ మౌలికమైన అజ్ఞానపరిమితు లతో కూడుకున్నదే అయి ఉంటుంది.

నిజానికి మన పరిణామ ఫలితంగానే మనం ఈ రూపాంతరీక రణం సంభవమయ్యే స్థితికి చేరుకుంటాము. ప్రకృతి పదార్థాన్ని అధిగమించి ప్రాణాన్ని ప్రకటించింది. ప్రాణాన్ని అధిగమించి మనస్సును ప్రకటించింది. అలాగే ఆమె మనస్సును అధిగమించి పరిణామము చెందవలసి ఉన్నది. ఆమె ఒక కళంకరహితమైన ట్టియు, మానసికజీవన పరిమితికి లోనుగానట్టియునైన ఒక అతి మానస లేక సత్యచైతన్యాన్ని ప్రకటించవలసి యున్నది. అది ఆత్మయొక్క శక్తి, పరిపూర్ణతలను వికసింపజేయగలగాలి. ఇచ్చట మెల్లగాను, ఆలస్యంగాను జరిగే మార్పు మన పరిణామ శైలి, నియమం కానక్కర లేదు. మానసికమైన అజ్ఞానం మన ఆరోహ ణానికి ప్రతిబంధకం కలిగిస్తూ పట్టుకుని కూర్చున్నప్పుడు కొద్దో, గొప్పో అది అలాగే ఉంటుంది. కాని ఒకసారి ఎప్పుడైతే మనం సత్యచేతనలోనికి ఎదిగామో, అప్పుడు సత్తయొక్క ఆధ్యా త్మసత్యశక్తి అన్నింటినీ నిర్ణయిస్తుంది. ఆ సత్యం లోనికి మనం విముక్తులమవుతాము. మరి అది మనః ప్రాణ శరీరాలను రూపాం తరీకరణం గావిస్తుంది. కాంతి, ఆనందం, అందం మరియు యావ త్సత్త సహజ ధర్మకార్యాచరణాన్ని పరిపూర్ణం చేయడంలాంటి వన్నీ అచట అతిమానస సత్యచేతనయొక్క సహజశక్తులుగా ఉంటాయి. అవి వాటి సహజధోరణిలో ఇచ్చటే భూతలం పైననే సత్యచైత్యాత్మ యొక్క ప్రకటనగా ఈ మనః ప్రాణ శరీరాలను రూపాంతరం గావిస్తాయి. అతిమానస సత్యచేతనపై పృథ్వియొక్క అస్పష్టతలు ప్రాబల్యం చూపలేవు. ఏమంటే అది (అతిమానసం) పృథ్వీతత్వం లోనికి కూడా ఆత్మయొక్క సర్వజ్ఞమైన కాంతిని, సర్వశక్తిమంతమైన శక్తిని చాలినంత గొనివచ్చి విజయం సాధి స్తుంది. అందరూ దాని శక్తి ప్రకాశాలకు పూర్తిగా తెరచుకొని యుండకపోవచ్చును కాని, ఎంతవరకు తెరచుకని యుంటే అంత వరకు పరివర్తన కలుగుతుంది. అదే రూపాంతరీకరణ సూత్రమ వుతుంది.

మన సత్తుయొక్క దివ్యసత్వంతో సత్తు మొత్తం ఐక్యమవడమే దివ్యయోగంయొక్క అత్యావశ్యక మైన ఏకైక లక్ష్యం. దీనిని జ్ఞాపకముంచుకోవడం అవసరం. మన యోగం అతిమానసాన్ని సాధించ డానికి మాత్రమేకాదని, ఆ దైవం కోసం మాత్రమే నని మనం గుర్తుంచుకోవలె. అతిమానసాన్ని అన్వే షించడం కేవలం దాని స్వీయ ఆనందం, ఘనత కోసం కాదు. అయితే ఆ సంయోగాన్ని నిరపేక్షం, మరియు సంపూర్ణం చేసుకోవలె. దాన్ని అనుభ వించాలి, దాన్ని వశం చేసుకోవలె. మన సత్త యొక్క అన్ని సాధ్యేతర మార్గాలలో, దాని అత్యు న్నత తీవ్రస్థాయిలలో, అత్యంత విశాలతలలో, ప్రతీ అంతస్తులో, మలుపులో, మారుమూలల్లో మన ప్రకృతి కుహరాంతరాలలో దాన్ని క్రియోన్ముఖం చేయాలి.

ఆధ్యాత్మజీవనం

ఆధ్యాత్మజీవనం, ధర్మజీవనం, మరి సాధారణ జీవనం ఈ మూడూ వేర్వేరు జీవనాలు. నైతికసూత్రాలు పాటించటం సాధారణ జీవనంలో భాగం. మనకి ఏ జీవనం అవసరమో ఎవరికి వారే తేల్చుకోవాలి. అంతేకాని ఈ మూడింటిని కలగాపులగం చేసి తబ్బిబ్బైపోకూడదు. సాధారణ జీవనమనగా ఒక సగటు మనిషియొక్క చైతన్యం. అది తన నిజమైన ఆత్మనుండి, దైవాన్నుండి వేరుపడి ఉంటుంది. అవిద్యానియమాలపై వర్తించే మనః ప్రాణ శరీరాల సర్వసాధారణమైన అలవాట్లచే నడిపించబడుతూ ఉంటుంది. ధార్మికజీవనమన్నా అదే అవిద్యా మానవచైతన్యం యొక్క మనోవ్యాపారం. అది భువి నుండి దివికి గొనిపోయేది లేక అట్టి ప్రయత్నమైనా చేస్తూ ఉంటుంది. అయితే అది ఇంకా జ్ఞానం లేకుండానే మూర్ఖమైన తెగల లేక మతసిద్ధాంతాలతో నడిపించబడుతూ ఉంటుంది. పృథ్వీచైతన్యబంధాలను త్రెంచుకొని ఏదో దివ్యానందకరమైన దివ్యపరతత్త్వాన్ని కనుగొన్నట్లు బుకాయిస్తూ ఉంటుంది. ధార్మికజీవనం ఆధ్యాత్మజీవనానికి నాందికావచ్చు. కాని అది తరచు ఏ ముగింపు లేకుండా రివాజుగా ఆచరించే ఏవో కర్మలు, నియమాలు, మూసలో పోసిన పాతభావాలు, ఆచారాల చుట్టూ గుడుగుడు గుంచం తిరుగుతూ ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఆధ్యాత్మజీవనం చైతన్యపరివర్తనతో, సూటిగా ముందుకు సాగిపోతుంది. ఆ పరివర్తనలో ఆత్మ సత్యం, దైవం నుండి విడివడిన అవిద్యతో కూడిన సాధారణ చైతన్యం స్వస్వరూప జ్ఞానం కలిగి ముందు నేరుగా సజీవ సంపర్కం, పిమ్మట దైవంతో సాయుజ్యాన్ని పొందుతుంది.

మూలం శ్రీఅరవిందులు
అనువాదం వై.యస్.వి.యస్. మూర్తి

శ్రీమాత ఆశీస్సులు

ఎగిరిపడే, విచ్చుకునే ధూళిలాగ,
ఎదిగే చెట్టులాగ,
పూసే పువ్వులాగ,
పాడే పిట్టలాగ,
ప్రేమించే మనిషిలాగ,
ఆయన దివ్యకాంతి నిన్ను ఆవరించనీ.
నిరంతరం పెరిగే ఆనందంలో
సదా విస్తరించే ఆనందంలో
దివిలో నడిచే చుక్కల్లాగ
నిలకడగా ముందుకు సాగే ఆనందంలో
ఆయన దివ్యకాంతి ప్రసరించనీ.

మూలం శ్రీమాత
అనువాదం వై.యస్.వి.యస్. మూర్తి

కొ సమెరు పు

ఉదయం వేళ, హడావిడిగా ఉంది. సుమారు 8-30 గం॥ల సమయం. ఓ పెద్దాయన ఎనభై ఏండ్లు దాటాయి. గాయమైన బొటనవ్రేలుకు కుట్లు తీయించుకోవటానికి వచ్చాడు. 9 గం॥లకి ఒకర్ని కలుసుకోవటానికి మాట ఇచ్చాను – వెళ్లిపోవాలంటూ హడావిడిగా వచ్చాడు. ఆయన తొందర గమనించాను. కూర్చో పెట్టాను. గంటసేపు పట్టేట్టుంది. గడియారం చూసుకుంటూన్నా డాయన. మరో రోగి ఎవరూ లేకపోవటంవల్ల కాళీగా ఉన్నాను. గాయం ఎంతవరకు మానిందో పరీక్షించ నిశ్చయించాను. చూస్తే బాగానే నయమైంది. మరో డాక్టరుతో మాట్లాడి అవసరమైన సరంజామా తెప్పించి, కుట్లు విప్పించి, మళ్లీ కట్టు కట్టించాను. అప్పు

డాయనతో మాట్లాడే సమయం చిక్కింది. "మరో డాక్టరు నెవరి నైనా కలుసుకోవాలా, హడావిడిగా ఉన్నారు!" అని అడిగాను. లేదని అంటూ, మరో నర్సింగ్‌హోమ్‌లో ఉన్న తన భార్యతో breakfast తినటానికి వెళ్లాలని చెప్పాడు. ఆమె కొంతకాలంగా అస్వస్థతతో అక్కడ ఉంటోందని చెప్పాడు. ఆమెకి Alzheimer's disease వ్యాధట. (మనుష్యులను గుర్తుపట్ట లేదు.) "మీరు కాస్త ఆలశ్యమైతే ఆమె బాధపడుతుందా?" అని అడిగాను. "ఆమెకి నేనెవరో తెలియదుగా? అయిదు సంవత్సరాలుగా ఆమె నన్ను గుర్తుపట్టలేని పరిస్థితి" అన్నాడు. నేను చకితుడనయాను. "మీరెవరో ఆమెకి తెలియకపోయినా, ప్రతి ఉదయం మీరామె దగ్గరికి వెడతారు!" ఓ చిరునవ్వు నవ్వి "ఆమెవరో నాకు తెలుసు కదా!" అన్నాడు. నాకు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. – నిజానికి జీవితమంతా ప్రేమే! ఎలా బ్రతకాలో తెలుస్తే! నిజమైన ప్రేమ శారీరకమైనదీ కాదు, భావోద్వేగమైనదీ కాదు. వాస్తవమైన ప్రేమ దివ్యానుభూతితో కూడి, విశ్వజనీనమైనది.

(రచయిత తెలియదు)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఎంత ఇబ్బందయినా ఆ దైవానికి, ఆ పరమేశ్వరి దివ్యమాతకు ఆత్మసమర్పణ గావించుకోవడమొక్కటే మన సార్థకమైన ఉపాయం, స్థిరమైన ఏకైక శరణాగతి. ఆమెకు ఆత్మార్పణ చేసుకోవడమంటే మన ప్రకృతి ఆమె హస్తాలలో పనిముట్టు కావలె. మన ఆత్మ ఆమె బాహువులలో బిడ్డ కావలె.

సమాచార పత్రం

ఆంధ్రప్రదేశ్ శ్రీఅరవింద సొసైటీ రాష్ట్రకమిటీ కార్యనిర్వాహక సంఘసభ్యులుగా 31-3-08 సం॥ అంతం వరకు నియమితులైన వారు – అధ్యక్షులు: శ్రీ బి. వెంకట్రామయ్య. కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు: మరియు యువసమన్వయకర్త శ్రీ పి. సి. స్వరూప్. ఉపాధ్యక్షులు: సర్వశ్రీ డి.వి.యస్. శర్మ, ఎ.వి.యస్ రాజు, జె. సురేంద్రాచార్య, వి. నరేంద్రబాబు రెడ్డి. కార్యదర్శి మరియు కోశాధికారి: శ్రీ వి. సుబ్బారావు. సభ్యులు: సర్వశ్రీ ఎ. ప్రేమ్‌చందర్, యం. మల్లికార్జున రావు, కుమారి. యన్. విజయలక్ష్మి, సర్వశ్రీ పి. రాజేశ్వరరావు, కర్రా వెంకటేశ్వర్లు. ఎక్సు అఫీషియో మెంబరు: శ్రీ ప్రదీప్ నారంగ్. సహకార సభ్యులు: సర్వశ్రీ వై.యస్. వి.యస్. మూర్తి, టి.వి. రమణారావు, ఆర్.యస్.కె. చౌదరి, శ్రీమతి డా॥ ఆర్. సరోజా ప్రసాద్, సర్వశ్రీ యడ్ల మోహనరావు, కె.ఆర్.యల్. నర్శింహరావు, టి.యస్. రామచంద్రరావు

శ్రీఅరవింద సొసైటీ తిరుపతి బ్రాంచివారు తే 24-04-2007 దీని శ్రీమాత భారతదేశానికి శాశ్వత ఆగమనదినం పాటించారు. సాయంత్రం జరిగిన సభకి శ్రీ యమ్. బలరామరెడ్డికారు అధ్యక్షత వహించారు. శ్రీ కె. జయదేవరెడ్డిగారు, శ్రీ యన్. అప్పాస్వామిగారు ప్రసంగించారు. కార్యదర్శి శ్రీ కె. హనుమంతుగారి వందన సమర్పణతో సభ ముగిసింది. హైదరాబాదు (ఆంధ్రప్రదేశ్) బ్రాంచివారు రెండు రోజుల యువశిబిరాన్ని మే 5, 6 తేదీలలో నిర్వహించారు. 15 మంది విద్యార్థులు వివిధ విద్యాసంస్థలనుంచి వచ్చి పాల్గొన్నారు. శ్రీ కె.వి. రావు, శ్రీ పి.సి. స్వరూప్, శ్రీ కె. ఆర్. యల్ నరశింహారావు, శ్రీ శ్రీనివాస్ మూలుగు పాల్గొని సహకరించారు. వివిధ అంశాలపై ప్రసంగించారు.

నవోడా (ఉ.ప్ర) బ్రాంచివారు – 'ఒత్తిడిలో జీవితం – యువతయొక్క సాంఘిక బాధ్యతలు' అంశంగా మార్చి 21, 2007 న IEC College of Engineering & Technology విద్యార్థులకు గోష్ఠి ఏర్పాటు చేశారు. ఎనభైమంది ఆఖరు సం.రం విద్యార్థులు,

Rs. 15

శ్రీఅరవిందుల బోధనలు

అఖిల

అఖిల భారత పత్రిక

ఆగస్టు 2007



శ్రీఅరవిందుల బోధనలు

6/8/07

విషయసూచిక

శ్రీఅరవిందులు, భూమిమీద పూర్వపు మతాలకి, ఉపదేశాలకి పోటీగా ఒక క్రొత్త మతాన్ని, ఉపదేశాన్ని తీసుకురావటానికిగాక, గతాన్నధిగమించి అనివార్యంగా రాబోయే భవిష్యత్తుకి వాస్తవమైన దారి చూపటానికి అవతరించారు.

శ్రీమాత



మన జీవిత సమైక్య సాఫల్యత

మన అంతరంగంలోను, బాహ్యానైజంలోను 'జీవిత సమైక్య సాఫల్యాన్ని' దర్శించడం, తెల్సుకోవడం, పొందడం – అనేవే ఎల్లప్పుడూ మన రహస్య లక్షణాలు. ఇవే మన మూర్తిమంతమైన అస్తిత్వానికి, ఎరుకతో కూడిన ప్రయోజనాలు, లక్ష్యాలు. విభజించి చూడడమే నైజంగాగల బుద్ధివల్ల, బాహ్యాంగా కనబడుతున్న ప్రతి దానిలోను, అదే విధంగా మన అంతరంగంలోని వివిధ భాగాల్లోను, వాని కాధారమైన సర్వేశ్వరుని ఎరుకను కల్గి ఉండడమే వ్యక్తిగత చైతనన్యపు (ఎదుగుదలకు) పరాకాష్ఠ. అందరిలోను మనం, అందరూ మనలో ఉండటం; ఈ విధంగా సర్వేశ్వరునిచే పట్టుబడి ఉండడము – ఇదే యోగసామ్రాజ్య సీమాధిపత్యము. కర్మలోను, శాంతిలోను, శక్తిలోను, ఏకత్వంలోను, అనేకత్వంలోను, అన్ని అనుభవాల్లోను ఆ సర్వేశ్వరుని ఎరుకను ఆనందించడమనే సౌఖ్యం – ఇదే పూర్ణయోగలక్ష్యానికి నిర్వచనం. విశ్వప్రకృతి తనలో దాచుకొని – మరియు తెల్సుకోడానికి పడే ప్రసవవేదన.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఎస్. వై. సోమయాజులు

సత్వముయొక్క సమైక్య ఏకీకృత ఆలోచన

యోగమంతా నైజంలో ఒక క్రొత్త జన్మ. అసాధారణ పుట్టుక. మానసిక, ద్రవ్యాత్మక జీవనం నుండి ఉన్నత ఆధ్యాత్మిక చైతన్యంలోకి ఉద్భవించిన అధికతర దివ్యసత్వము.

విశాలతర ఆధ్యాత్మిక అస్తిత్వం, దాని ఆవశ్యకత గూర్చి సత్వములో ఒక దృఢమైన జాగృతి ఉంటేనే తప్ప ఏ యోగమూ విజయవంతంగా చేపట్టబడదు. ఈ లోతైన, విశాలమైన ఆంతరం

గిక మార్పు కొరకు ఆత్మకు పిలుపు. తన తొలి ప్రస్థానం నుండి అనేక మార్గాల్లో చేరవచ్చు.

కాని ఏ మార్గంలో వచ్చినా – దాని బుద్ధి, ఇచ్ఛ యొక్క నిర్ణయము తప్పనిసరి. ఆ నిర్ణయం ఫలితంగా వచ్చే, సంపూర్ణ, ఫల వంతమైన, ఆత్మసమర్పణ కూడ తప్పనిసరి. ఒక కొత్త ఆలోచనా బలము, సత్తాలో ఊర్ధ్వంగా ఒక మలుపు, ఒక కొత్త వెలుగు, ఇచ్ఛచే చేపట్టబడ్డ పరివర్తన మరియు హృదయపు ఆకాంక్ష – వీటన్నిటినీ అనుమతించుటలోనే – బీజంలో వృక్షఫలాలున్నట్లు – యోగం ఇచ్చే ఫలాలన్నీ ఉన్నవి. ఇది ఒక బృహత్తర – దిశా నిర్దేశ చర్య.

బుద్ధి యొక్క ఆసక్తితో ఎంత గట్టిగా పట్టుకొన్నప్పటికీ, కేవల భావన, లేదా ఏదో ఉన్నతమైన, సుదూరమైన దానిని బుద్ధితో అన్వేషించడంవల్ల, ఈ చర్య ఫలవంతం కాదు. ఇదొక్కటే కోరదగిందని హృదయంచే ఈ చర్య చేపట్టబడాలి; ఇదొక్కటే చేయదగిందని ఇచ్ఛచే ఈ చర్య చేపట్టబడాలి; ఎందుకంటే, ఆత్మ-సత్యం, కేవలం ఆలోచించబడవల్సింది కాదు – జీవించబడవల్సింది. అది జీవించాలంటే 'సమైక్య ఏకీకృత బుద్ధి' అత్యావసరం. ఈ యోగం ఆశించేటంతటి బృహత్తరమార్పు, అనైక్య ఇచ్ఛతోగాని, సంశయాత్మకబుద్ధితోగాని, శక్తిలో ఒక చిన్న భాగం వల్లగాని ఫలవంతం కాదు. దైవాన్నన్వేషించేవారు, దైవానికి – దైవానికి మాత్రమే – ఆత్మసమర్పణ గావించుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఎస్. వై. సోమయాజులు

నిత్యపరిపక్వమైన ఆత్మ విచ్చుకోవడంలోనే మనిషి పరిపక్వత ఉన్నది.

శ్రీఅరవిందులు

శ్రీఅరవిందుల బోధన – సాధన

1. సకలవస్తుసముదాయంలో ఉండే శాశ్వతమైన ఆత్మ ఒక్కటే. అదే శాశ్వతమైనది. జగత్తులో కనబడుతున్న దృశ్యాల వెనుక యిమిడివున్న జీవం, జీవచైతన్య సత్యమిదే. ఇది సనాతన భార తీయఋషుల అనుభవసారం. ఇక్కడి నుండే శ్రీఅరవిందుల బోధన ప్రారంభమయింది. సకల జీవరాసులు దివ్యశక్తి సమన్వితమైన ఒకే ఆత్మలో కలుస్తాయి. కాని ఒక ప్రత్యేక చైతన్య విభజన వేర్పాటు ధోరణిలో ఆత్మస్వరూపాన్ని అర్థం చేసుకోలేని అజ్ఞా నంతో కూడిన మనస్సు, ప్రాణం, శరీరం కలిగి ఉంటాయి. కాని మానసిక క్రమశిక్షణ, సాధన ద్వారా ఈ చైతన్యవిభజన వేర్పాటు తనం అనే ముసుగును తొలగించుకోవచ్చును. నిజమైన ఆత్మస్వ రూపాన్ని, మన లోపలి దివ్యతత్వాన్ని తెలుసుకోవచ్చు.

2. దివ్య ఏకసత్వం *'ఏకంసత్'* దివ్యచైతన్యం పదార్థంలో నిక్షిప్తమయ్యి ఉంటుంది. క్రమవికాసం ద్వారా ఆత్మ స్వయంవిము క్తిని సాధిస్తుంది అంటారు శ్రీఅరవిందులు. నిశ్చైతన్యంగా కని పించేదానిలోంచే చైతన్యం గుర్తించబడుతుంది. ఒకసారి దర్శించ గలిగితే దానంతటదే స్వయంచోదకశక్తితో ఉన్నతోన్నతమైన పరిపూర్ణత దిశగా అభివృద్ధి సాధించబడుతూ ముందుకు సాగు తుంది. అదే సమయంలో మహోన్నత సమగ్రస్థితి వైపు విస్తృతమై, వృద్ధిపొందుతుంది. ఈ చైతన్య విముక్తికి మొదటి మెట్టు ప్రాణం. రెండవ మెట్టు మనస్సు. మనస్సుతో పరిణామవికాసం పూర్తవ్వదు. అది మరింత ఉన్నతస్థాయిలో విముక్తిని కోరి వేచి ఉంటుంది. ఆ చైతన్యం ఆధ్యాత్మికము, అతిమానసము. పరిణామక్రమ ఆత్మ వికసనం (evolution) లో తరువాత అభివృద్ధి దశ అతీతమనస్సు – చైతన్యసత్వంలో ఇది ప్రబలమైన శక్తి. అప్పుడు మాత్రమే వస్తు వుల్లో ఉండే నిక్షిప్త దివ్యత్వం తనంతట తాను పరిపూర్ణంగా విడుదలవుతుంది. జీవితానికనుకూలమైన పరిపూర్ణ అభివ్యక్తీక రణ అప్పుడే సాధ్యపడుతుంది.

3. తన అసంకల్ప ఇచ్ఛాశక్తితోనే వృక్షజంతుజీవ పరిణా మాలకి దివ్యసృష్టి ఇంతకు ముందు చర్యలు తీసుకోగా, తర్వాత మాత్రం, చైతన్యంతో కూడిన సంకల్పశక్తిగల మానవుని ఆవిష్క రించింది. అయినప్పటికీ మనిషిలో మానసికసంకల్పంతో వికాసం పూర్తి కాలేదు. మనస్సు కొంతవరకు అంటే ఒక ప్రత్యేకస్థాయి వరకు వెళ్లి తరువాత అక్కడికక్కడే గిరికీలు కొడుతూ ఉండిపో తుంది. అక్కడ తప్పక మార్పు రావలసి ఉంది. చైతన్యపు మలు పులో మనస్సు ఒక ఉన్నతాశయంలోకి మారితీరవలసి ఉంటుంది. ఈ పద్ధతి సనాతనుల మానసిక క్రమశిక్షణ ద్వారా కనుగొనబ డ్డది. యోగానుష్ఠానం ద్వారా సాధించబడ్డది. గతంలో ప్రాపంచిక జీవితం నుండి దూరమయి ఉన్నత ఆత్మాశ్రయజీవనంగా మారింది. దివ్యత్వాన్ని పొందిన ఆత్మ ప్రపంచం నుండి ముక్తి పొందడమే కాదు. తిరిగి ఆ ఉన్నతస్థాయి నుండి భువికి అవతరించడం కూడా సాధ్యమేనని శ్రీఅరవిందులు చెప్పారు. ఆ విధమైన అవత రణ పరిమిత జ్ఞానమో, అజ్ఞానమో కాదు. వాటికి బదులుగా అతి మానస దివ్యసత్యచైతన్యంతో జరుగుతుంది. ఇందులో అంతరా త్మకి తగిన పరికరంగా మనిషి మారతాడు. ఈ స్థితిలో మనిషి తనని తాను తెలుసుకొని, ఆంతరంగిక వృద్ధి సాధిస్తాడు. జంతు స్వభావ సమ్మిళితమైన స్వభావంనుండి అతిమానససత్యచేతనస్థా యికి ఎదగడం సంభవిస్తుంది. అదే దివ్యమానసజాతిగా రూపొం దుతుంది. ఆత్మపరిణామం ద్వారా అతిమానస అవతరణ కోసం అన్ని వైపులనుంచి తెరుచుకొనబడడానికి యోగాభ్యాసంలో మాన సిక క్రమశిక్షణ తోడ్పడుతుంది. మరుగున ఉన్న ఉన్నత అతి మానససూత్రం క్రిందికి దిగి (through descent) పనిచేయటం ద్వారా పరివర్తన, రూపాంతరీకరణ సాధ్యపడుతుంది.

4. ఏదేమైనా పరిణామం హఠాత్తుగా ఒక్కసారి ఊడిపడదు. కొద్ది సమయంలో కూడా కాదు. మంత్రతంత్రమాయాజాలవిద్య లతో సాధించేది అసలే కాదు. అతిమానస అవతరణ సాధ్యపడా లంటే ముందు సాధకుడు అంచెలంచెలుగా ఎన్నో దశలు అధి గమించాలి. మనిషి సాధారణంగా మనస్సు ఉపరితలంలోనే

భౌతిక, ప్రాణిక పరిధులలోనే జీవిస్తూ ఉంటాడు. కాని అంతర జీవి ఒకటి అతని ఆంతర్యపు లోతులలో ఉంటుంది. ఆ జీవి ఎన్నో మహోన్నత అనుకూలశక్తులు కలిగి ఉంటుంది. దానిని జాగృతం చేయాలి. అది మహోత్కృష్ట సౌందర్యం, సామరస్యం, జ్ఞానం మరియు శక్తి కలిగినది. అది మానవుణ్ణి మహోన్నతస్థితికి చేర్చి అక్కడే స్థిరంగా నిలిపి ఉంచగలదు. అది ఎంతో సంక్లిష్ట సాధనతో తప్ప సాధ్యపడదు. మొట్టమొదట ఈ అంతర్జీవి మార్గంలో గల అన్ని ద్వారాలు, అన్ని స్థాయిల్లో తెరవగలగాలి. అక్కడి నుండి బాహ్యాస్థాయికి చేరి జీవించాలి. అంతర తేజస్సు, శక్తి సహాయంతో బాహ్యాజీవితాన్ని శాసించగలగాలి. ఇలా చెయ్యడం ద్వారా వ్యక్తి తన ఆత్మ సత్యస్వరూపాన్ని, తనని తాను తెలుసుకోగలగుతాడు. సత్యమైన ఆత్మ మానసిక, ప్రాణిక, భౌతిక అంశాలతో కూడినది కాదు. వాటి వెనుకగల వాస్తవం – అది దివ్యజ్వాల నుండి వెలువడిన కాంతిరేణువుగా భావించబడింది. మనిషి ఆత్మలో జీవించడం నేర్చుకోవాలి. మిగిలిన ప్రకృతితో పాటు శాశ్వతసత్యంవైపు నడిపింపబడాలి. స్వచ్ఛమైన, సహజమైన ఆత్మలో జీవించాలి. తరువాత ఊర్ధ్వ దిశామార్గాన్నను సరించి జీవియొక్క పరమోన్నతాశయమైన అవతరణ కోసం తెరుచుకోబడాలి. అప్పుడు కూడా వెంటనే దానిని పరిపూర్ణ అతిమానసతేజస్సు, శక్తి అనలేము. అక్కడ సాధారణ మానవ మనస్సుకి, అతిమానస దివ్యసత్యచైతన్యానికి మధ్య ఎన్నో చైతన్య స్థాయి లున్నాయి. ఈ స్థాయిల జోక్యంలో ఊర్ధ్వంగా తెరువబడి వాటి శక్తి మనోప్రాణశరీరాల్లోకి తీసుకురాబడుతుంది. ఆ తరువాత మాత్రమే పరిపూర్ణ దివ్యసత్యచైతన్యం ప్రకృతిలో పని చెయ్యడం ప్రారంభిస్తుంది. ఈ ఆత్మ క్రమశిక్షణ లేదా సాధనా విధానం సుదీర్ఘమైనది. అత్యంత కష్టతరమైంది. అందులో ఏ కొంచెం సాధించినా, ఎంతో ప్రయోజనం పొందామనుకోవచ్చు. ఎందుకంటే తత్ఫలితంగా కోరుకున్న సమగ్రత, విముక్తి సులభతరమవుతాయి. మార్గమధ్యంలో అవసరమయే అనేక అంశాలు సనాతన పద్ధతులకి చెందినవి. ఒక గొప్ప విశాలతత్వం, ఆత్మ

జ్ఞానం వైపు మనస్సు తెరుచుకోవాలి. అనంతత్వము, విశ్వచైతన్య అవగాహనకు కూడా మనస్సు తెరుచుకోవాలి. ఇలా జరగాలంటే కోరికలు, అనుబంధాల మీద అదుపు సాధించాలి. ఆశలు, అవసరాలు, శారీరకవాంఛల మీద సైతం అదుపు సాధించడం తప్పనిసరి. అసలు సత్యానికి, పైకి కనిపించేదానికి మధ్య తేడా తెలుసుకోగలగాలి. సర్వసమర్పణ, ప్రేమ, భక్తి వలన కలిగే హృదయస్పందన అనుభవంలోకి రావాలి. స్వార్థప్రేరణల నుండి ఇచ్ఛని మరలించే విధానాలు తెలియాలి. దివ్యసత్యం, అహంకంటే మహోన్నతమైన వాస్తవం కోసం సాధన చెయ్యాలి. ఇవన్నీ మనసు యొక్క విచక్షణగా జ్ఞానం, సనాతన సాధనా పద్ధతుల మిశ్రమ సాధనవల్ల సమకూరుతాయి. జీవి సంపూర్ణంగా శిక్షణ పొందాలి. అప్పుడే అది పరిణామానికి ప్రతిస్పందిస్తుంది. ఎప్పుడైతే ప్రకృతిలో ఆ తేజస్సు, శక్తిసాధన సాధ్యమవుతుందో అప్పుడే లక్ష్యసిద్ధి సిద్ధిస్తుంది.

ఇదే శ్రీఅరవిందులవారి బోధన – సాధన విధానం. ఏదో ఒక మతాన్నిగాని, లేదా కొన్ని మతాల సమ్మేళన సారాన్నిగాని ప్రచారం చెయ్యడం వారి ఉద్దేశం కాదు. కొత్త మతం స్థాపించడం అంతకంటే కాదు. వారి పరమాశయం నుండి ఇవన్నీ దూరంగా తరిమివేయబడ్డాయి. వారి ఏకైక ఆశయం అంతరాత్మ అభివృద్ధి సాధనే. అదే వారి యోగసాధన కూడా. దాని వలన వారిని అనుసరించినవారికి తగిన సమయంలో అందరిలో ఉండేది ఒకే ఆత్మ అనే ఉన్నత చైతన్య స్పృహ కలుగుతుంది. ఈ మహోన్నత చైతన్యమే మానసిక, ఆధ్యాత్మిక మానసికస్థాయి నుండి పరిణామం చెందిన దివ్యమానస ప్రకృతి.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: నడిమింటి విజయలక్ష్మి

ప్రస్తుత ప్రపంచ పరిస్థితి – దీని నుంచి బయటపడే మార్గం

నేటి ప్రపంచాన్ని చూచావా! పరిస్థితులన్నీ సంకటభరితంగానే ఉన్నాయి. మొత్తం లోకమంతా సంఘర్షణలతో, యుద్ధ వాతావరణంతో నిండిపోతూ ఉంది. ఇట్లాంటి తరుణంలోనూ సత్య ప్రకాశాలకు చెందిన శక్తులు లోకంలో ఆవిర్భవించకోరుతున్నా, వాటిని వ్యతిరేకించే శక్తులు మార్పు చెందేందుకు సుముఖంగా లేవు. ఇది గతంలో పాతుకుపోయి, కరుడుగట్టుకుపోయిన ప్రతికూలతలకు ప్రాతినిధ్యం వహిస్తూంటుంది. అదే మార్పు చెందక నిరాకరిస్తుంది. అట్లాగే వ్యక్తిగతంగా ప్రతి మనిషీ ఇవే కష్టాలను అనుభవిస్తున్నాడు. ఇదే మాదిరి అవరోధాలను, విరోధ వైఖరిని ఎదుర్కొంటున్నాడు.

నీకు కేవలం ఒకే ఒక్క మార్గం ఉన్నది. అదే పరిపూర్ణంగా, బేషరతుగా నీకు నీవుగా చేసుకొనే 'సర్వసమర్పణ'. నా దృష్టిలో అర్పించడమంటే... నీ చేతనను, నీ పనిని, నీ ఆశాకాంక్షలను నివేదించడమే కాదు... నీ అనుభూతి, సంవేదనలను కూడా అర్పించాలి. అంటే... నీవు చేస్తున్నది, నీవు నీవుగా ఉన్నదంతా... పరిపూర్ణంగా దైవానికే సమర్పితం కావాలి. కాబట్టి నీ చుట్టూ వున్న మానవసంబంధిత ప్రతిచర్యలకు అతీతంగా మసలుకో... అలా వాటికి స్పందించక వాటిని అధిగమించి ఉండటమే కాదు... దివ్యానుగ్రహము యొక్క రక్షణచేత, వాటి నుండీ రక్షించబడాలి... ఏ విధమైన కోర్కెలు, మరే ఝుంఝూటన లేకుండా ఈ మనుష్యుల నుండీ... (వాళ్లెవరైనా కావచ్చు) ఏదో ఫలాన్ని, బహుమానాన్ని పొందాలనే ఆశను, అవసరాన్ని త్యజించివేసి... అసలైనదీ ఎప్పటికీ విఫలంకాని సుయోగ్యమైన బహుమానం దైవం నుండి పొందేది మాత్రమే అని తెలుసుకొంటూ, ఈ బాహ్యా వస్తుప్రపంచం నుండి, ఈ బయటి వ్యక్తుల నుండీ విడివడినప్పుడు... ఒక్కసారిగా నీ హృదయంలో ఆ దివ్యసన్నిధిని, ఆ వ్యక్తిని, నీలోనే వశించి ఉన్న దివ్యకృప అనుభూతి పొందుతావు. ఇంకొక తరుణోపాయమే

లేదు. ఇదొక్కటే పరిష్కారం సుమా! దీనిలో ఏ ఒక్కరికీ ఎలాంటి మినహాయింపు లేదు. ఎవరెవరు బాధలకు గురి అవుతున్నారో, వారందరికీ చెప్పేది ఇదే. ఈ బాధలు, వేదనలూ మన సమర్పణ పరిపూర్ణం కాలేదని చెబుతున్న సంకేతాలే... నీవేదైనా గట్టి దెబ్బ తిన్నప్పుడు, బాధను అనుభవిస్తున్నప్పుడు 'ఇది ఎంతో దారుణంగా ఉందనో', 'నా పరిస్థితి మరీ దుర్భరంగా ఉందనో' అనడానికి బదులుగా 'నా సమర్పణ సరిగ్గా లేదు', 'పరిపూర్ణం కాలేదు' అని అనుకో. అప్పుడది సరిగా ఉంటుంది. అప్పుడు ఆ దివ్యానుగ్రహానుభూతి కలుగుతుంది. అది నీకు సహకరించి, నిన్ను నడిపిస్తుంది. ఇక ఆ దిశలో ముందుకు పయనిస్తావు. ఒకానొక సమయానికి ఏ చిన్న ఇబ్బందికీ తావు లేకుండా ప్రశాంతంగా బయటపడతావు. అప్పుడీ వ్యతిరేక శక్తులకూ, విరుద్ధ చేష్టలకూ, దుష్టప్రహారాలకూ, అపోహ, అపార్థాలకూ, దుస్సంకల్పాల కన్నింటికీ... అదే దివ్యానుగ్రహంపై ఉన్న పూర్ణవిశ్వాసం నుంచీ తరలి వచ్చే వినిర్మల చిరునగవుతోనే బదులిస్తావు. ఇదొక్కటే ఆ విపరీత పరిస్థితుల నుండి బయటపడే మార్గం. మరి మరోదారి లేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: సి. హర్షవర్ధన్

నిన్ను నీవు తెలుసుకో

వ్యక్తి తప్పక తన అంతరంగం లోతులలోకెళ్లి అక్కడ ఉన్న అతి ముఖ్యమైన విషయాన్ని కనుగొనాలి. నిజానికి ఆ వ్యక్తి అక్కడ ఉండడు. అక్కడ ఉన్న అస్తిత్వం ఒక్కటే. అదే దైవం – ఆ ఉనికిని నీవు కనుగొననంతవరకు ముందుకు పోలేవు. కాని ఇది తాబేలు వీపు మీద ఉన్న చిప్పవలె చాలా కఠినమైనది. నీకు తాత్వికచింతన ఉన్నట్లైతే నిన్ను నీవు ప్రశ్నించుకో – 'నేను' అని దేనిని పిలుచుకోవాలి? ఈ దేహాన్నా? ఇది శాశ్వతముగా ఒకే విధముగా ఉండక సదా మార్పుకు లోనవుతూ ఉంటుంది.

మరి నా మనోభావాలా నేను? ఇవి చాలా తరచుగా మారిపోతూ ఉంటాయి. మరి నా ఆలోచనలా నేను? ఇవి నిరంతరము నిర్మించబడుతూ నిర్మూలించబడుతూ వుంటాయి. ఇవన్నీ కాను 'నేను' మరి నేను యొక్క ఉనికి, నేను నిరంతరమూ ఉన్నాను అనే భావనను కలిగిస్తున్నది ఏది? ఈ అన్వేషణను చిత్తశుద్ధితో చేయుటకు నీవు కొన్ని సంవత్సరముల కాలం వెనుకకు మరలాలి. ఈ సమస్య నిన్ను మరల మరల కలవరపెడ్తుంది. నీవు స్వీయపరిశీలనను కొనసాగిస్తూ 'ఇది నా స్మృతి' అని నీకు నీవు చెప్పుకో. కాని నీవు ఈ స్మృతిని కోల్పోయినా కూడా నీవు నీవుగానే ఉంటావు. దీనిపై లోతుగా పరిశోధన కొనసాగించినట్లైన ఒకానొక క్షణములో అన్నీ అదృశ్యమై ఒకే ఒక సత్యం గోచరిస్తుంది. అదే 'దైవం', ఆ దైవం యొక్క ఉనికిని. వ్యక్తి తాను అనేక అలవాటులతో కూడిన ఒక సమాహారం. ఒక సముదాయం మాత్రమే అనే ఎరుకను ఆవిష్కరించుకోగలిగితే ఎండ వేడిమికి వెన్న కరిగినట్లుగా సమస్తం విడిపోయి కరిగిపోయి అదృశ్యమవుతాయి. దైవం గురించి ఒక అవగాహన స్పృహ లేకుండానే ఆ దైవం గురించి మాట్లాడటము సదా జరుగుతూ ఉంటుంది. ప్రతి వ్యక్తిలో స్పృహలేని మార్పు చెందే, స్వేచ్ఛగా చలించే అనేక విధములైన వందల కొలది 'నేనులు' ఉంటాయి. గడచిన దినమున మాట్లాడిన 'నేను' ఈ దినము మాట్లాడుతున్న 'నేను' ఒకటి కాదు. అవి వేరు వేరు. ఇంకా కొంచెం లోతుగా విచారణ చేస్తే ఆ 'నేను' అదృశ్యమై ఉంటుంది. మార్పుచెందక శాశ్వతముగా నిలిచి ఉండేది ఒకటి మాత్రమే. అదే దైవం.

*

మానవజీవిత ప్రయోజనము, 'తత్' (దివ్య) చేతనలో ఉండటం, దానిని అభివ్యక్తీకరించటం.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రివేణి

తరగని శక్తి

తరగని మూలాధార విశ్వశక్తి నుంచి, తరిగిన తన శక్తులను తిరిగి పుంజుకోవటం ఎలాగో క్రీడాకారునికి తెలియచెప్పేది యోగపర మైన క్రమశిక్షణ.

పోషణాకౌశల్యంలో, ఆధునిక విజ్ఞానశాస్త్రం, శక్తులను పూరించడంలో ఎంతో అభివృద్ధిని సాధించింది. అయితే ఆ పద్ధతి చాలా అనిశ్చితమైనది, పరిమితులతో కూడుకున్నది. ఇప్పుడు మన చర్చ ఆ విషయం కాదు. దాని గురించి కూలంకషంగా చర్చించడం జరిగింది. ప్రపంచం, మనుషులు, ఇప్పటిలా ఇలానే కొన సాగుతూన్నంతవరకూ 'ఆహారం' అనేది ఆవశ్యకమైన శారీర కాంశం. శక్తిని పొందటంలో యోగశాస్త్రానికి వేరే మార్గాలు తెలుసు. అందులో ముఖ్యమైనవి ఓ రెండు చూదాం.

మొదటిది భూభౌతిక ప్రపంచంలో సేకరింపబడి ఉన్న ఆ తరగని శక్తులతో అనుసంధానం పొంది, వాటినుంచి తిరిగి శక్తిని పొందటం. ఈ భౌతికశక్తులు అస్పష్టంగాను, సగం నిశ్చేతనంగాను ఉంటాయి. మనిషిలోని పశుత్వాన్ని ప్రేరేపిస్తాయి. అయితే అవి మనిషికి, ప్రకృతికి మధ్య ఒక సామరస్య బంధాన్ని స్థిరపరుస్తాయి.

ఎవరికైతే ఈ శక్తిని గ్రహించడం, ఉపయోగించుకోవడం వస్తుందో, వాళ్లు ఏ పనిలోనైనా విజయం సాధిస్తారు. అయితే ఇది చాలవరకు వారి వారి జీవనవిధానం, వారి శరీర ఆరోగ్యస్థితి మీద ఆధారపడుతుంది. వారిలోని సమతుల్యత పూర్తిగా రోగనిరోధశక్తిని కల్గి ఉండదు. పరిస్థితులు వికటించినపుడు ఆ శక్తి మాయమౌతుంది. అయితే పిల్లలు ఈ భౌతిక ప్రకృతి నుంచి ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆ శక్తిని తీసుకోగలుగుతారు. ఎందుకంటె వారిలో గ్రహణశక్తి ఏ అడ్డంకులు లేక స్వేచ్ఛగా, నిర్మలంగా ఉండడమేకాక, ఏ మాత్రం సంకోచించకుండా, ఆనందంగా ఆ శక్తిని ఖర్చు చేయడం కూడా వారికి సహజక్రియ. అందుకే ఆ శక్తిని తిరిగి పొందుతారు. ఖాళీ అయినపుడల్లా తిరిగి

నింపుకుంటారు. అయితే మనుష్యులలో వయసు పెరిగేకొద్దీ జీవితంలోని బాధలవల్ల ఈ నైపుణ్యం మొద్దుబారిపోతుంది. చైతన్యం, మనోవ్యాకులతలతో నిండిపోతుంది.

మరొక రకమైన శక్తి ఉంది. ఆ కిటుకు మనకు తెలిస్తే ఆ శక్తిని నిరవధికంగా పొందవచ్చు – మన బాహ్య పరిస్థితులు, భౌతికపరిస్థితులు ఎలా ఉన్నా. అదే ఆధ్యాత్మికశక్తిగా మనం అభివర్ణించవచ్చు. ఆ శక్తి మన సామాన్య ప్రకృతినుంచి, అవచేతన లోతులనుంచి, వచ్చినదికాక, సర్వశక్తివంతమైన ఉన్నత శాశ్వత అతిమానస అద్భుతసీమల నుండి వచ్చినది. అది మన చుట్టూ అంతటా పరివ్యాప్తమై అన్నిట నుంచి ప్రసారమౌతుంది. దానిని చిత్తశుద్ధితో ఆకాంక్షించి, దానికి తెరుచుకుని, దానితో సంబంధం కలిగి ఉన్నపుడు, దాని పట్ల నమ్మకం కలిగి ఉన్నపుడు మన చైతన్యాన్ని విస్తృతపరచి, ఆ విశ్వచైతన్యంతో ఏకమైయే సంభావ్యత సాధ్యమవుతుంది.

ఐతే ప్రారంభంలో ఇది చాలా కష్టమైనదిగా అనిపించినా అసంభవం కాదు. అయితే ఈ పద్ధతిని నిదానంగా పరిశీలించినపుడు సాధారణచేతనకు అంత వింతగా అనిపించదు. ఎందుకంటే ఎప్పుడో అప్పుడు ఆ అతీతశక్తి కృపకు పాత్రులు కానివారు చాలా అరుదుగా ఉంటారు. మన నిత్యకృత్యంలో కూడా ఎప్పుడో ఒక్కసారి మనం చేయలేని పనిచేయగల్గినపుడు, మన శక్తికి మించిన పనిచేసినపుడు, ఆ క్షణం ఆ శక్తి గురించి మనకి ఎరుక కలుగుతుంది. అలాంటి క్షణాల్లో 'అసంభవం' అన్న మాటకి అర్థం ఉండదు.

అలాంటి అనుభవం క్షణికమే అయినా, ఆ ఉన్నతశక్తితో కలిసిన అనుభూతిని, అనుభవాన్ని అందిస్తుంది. అది యోగక్రమ శిక్షణవల్ల పొంది నిలబెట్టుకోగలిగేది. అయితే ఆ ఉన్నతశక్తితో సంబంధం ఎలా సాధించగలమో మనం ఇక్కడ చర్చించలేము. ఎందుకంటె ఆ దివ్యశక్తి వ్యక్తిగతం, ప్రతి ఒక్కరికి సాటిలేనిది. ఎవరి స్థితిని బట్టి వారి కనుగుణమైన పద్ధతిలో వారు మొదలుపెట్టాలి ఎవరి స్వభావమూ, స్థితినిబట్టి వారి కనుగుణమైన పద్ధ

తిలో వారు మొదలుపెట్టాలి. ఎవరి స్వభావమూ, స్థితినిబట్టి వారి ప్రారంభం ఉంటుంది. నెమ్మదిగా ఒక మెట్టు తర్వాత ఒక మెట్టు ఎక్కాలి. ఒక్కోసారి ఆ మార్గం చాలా సుధీర్ఘంగా, నెమ్మదిగా సాగుతుంది. అయితే ఫలితం కోసం ఎంత కష్టమైనా పడచ్చు. సంకల్పమాత్రంగా అన్ని పరిస్థితులలోను ఆ శక్తిని పొందగల గడం అంటే ఒక అద్భుతం. ఈ శక్తియొక్క పర్యవసానం మనం ఊహించవచ్చు. అవధులు లేనిది, సర్వవ్యాప్తమైనది, కాంతివంత మైనది, స్వచ్ఛమైనది – అది. చిరాకు, అలసట, అనారోగ్యం, ముదిమి, చివరకు మృత్యువులాంటి అన్ని అడ్డంకుల్ని మన ధృఢ సంకల్పంతో, దీక్షతో దాటవచ్చు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ప్రార్థనలు – ధ్యానములు

ఫిబ్రవరి 10, 1913

నా సత్వము కృతజ్ఞతార్పణలో నీకై ఎగసిపడుతున్నది, నీవు అభివ్యక్తమయేందుకు ఈ అపరిపక్వ నీరస శరీరాన్ని నిన్ను నీవు అభివ్యక్తం చేసుకోవటానికి వినియోగిస్తావనేగాక – నిన్ను నీవు రూఢిగా అవతరింప చేసుకున్నందులకు – అదే మరి – వైభవాలలోకెల్ల దివ్యవైభవం, ఆనందాలలోకెల్ల దివ్యానందం, అద్భు తాలలోకెల్ల పరమాద్భుతం. గాఢావేశంతో నిన్నన్వేషించేవారంతా తప్పక తెలుసుకోవాలి – ఏ సమయంలో నీ అవసరమవుతుందో అప్పుడు నీవక్కడే ఉంటావని. నీకై అన్వేషణ మాని, నీ కోసమే నిరీక్షించేటంతటి మహత్తర విశ్వాసమే కలిగి, నీ సేవకై పరిపూ ర్ణంగా ప్రతిక్షణం తమకు తాము నియోగించగలిగినట్లైతే, నీ అవ సరం ఎప్పుడైతే అప్పుడు నీవక్కడే ఉంటావు; నీ అభివ్యక్తీకరణ రూపాలు తరుచు అనూహ్యంగాను, ఎంతో వైవిధ్యంగాను ఉన్న ప్పటికీ నీతో మా కెపుడూ అవసరమే కదా!

నీ దివ్యతేజం ప్రకటింపబడి
జీవనము పునీతమగు గాక;
అది మానవహృదయాలను రూపాంతరీకరించు గాక,
నీ దివ్యశాంతి భువిపై రాజ్యమేలు గాక.

మూలం: శ్రీమాత

మన సంస్కృతియొక్క నాల్గు విశిష్ట లక్షణాలు

మిగతా ప్రపంచం అంతా ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం కోసం, స్వేచ్ఛ, వెలుగుల కోసం భారతదేశం వైపు మరలుతూన్న తరుణంలో భారతదేశం తన ఆధ్యాత్మిక వారసత్వాన్ని నిర్లక్ష్యం చేయటం ఒక విషాదకర విధి వైపరీత్యం. ఇది జరుగకూడదు. ఎప్పటికీ జరుగదు...

శ్రీఅరవిందులు

మొదటి విశిష్ట లక్షణం

1. భారతప్రజానీకంయొక్క 'అజ్ఞానసముదాయం' లో కూడా ఒక విశిష్టత ఉంది. శతాబ్దాల నుంచి సంతరించుకున్న క్రమశిక్షణ వారిని అంతరంగ వాస్తవాలకు సన్నిహితులను కావించింది. అందు చేత వీరిలో సార్వత్రిక అజ్ఞానతెర (veil of the universal ignorance) పల్చపడి వీరిని వేరుచేసి వీరికి ప్రత్యేకతను సంతరించి పెట్టింది. ఫలితంగా మిగతా ప్రదేశాలలోని సంస్కారవంతులైన ఉన్నతవర్గాలకంటె కూడా వీరు దైవము, ఆత్మ, అంతరాత్మ, శాశ్వతత్వములాటి భావాలకీ, అన్నిటికీ ఆయువు పట్టు అయిన తాత్కాలిక దైవసాక్షాత్కారానికి మరింత సులువుగా ప్రచోదింపబడినవారైనారు. ఆధ్యాత్మికతత్వం, దానియొక్క ఉన్నత వాస్తవాలు వారిలో బలంగా నాటుకుపోవటం, దానితో ప్రగాఢ సన్నిహితత్వం, అందుకు తగినట్లుగా మొత్తం జాతియొక్క మానసిక సంసిద్ధత –

ఇవన్నీ సనాతనము, వాస్తవము అయిన సజీవ పరమోన్నత ఆధ్యాత్మిక సంస్కృతికి పరిణామ సూచికలు.

2. ఇంతవరకు ఆధ్యాత్మికత అంటే సాధారణంగా మానసిక, ప్రాణిక స్వభావాలకు అతీతంగా ఏదో ఉన్నది అనే ఒక గుర్తింపు. స్వచ్ఛ దివ్యోన్నత చేతనకొరకు ఆకాంక్ష. నిమ్నభాగాల అల్పత్వాన్ని, బంధాలని తప్పించుకుని తన లోలోపల గోప్యంగా ఉన్న ఉత్తమమైన అంశం వైపు వ్యక్తిలో ఉప్పొంగి పైకెగసిపడే వ్యక్తి జీవాత్మ – ఇదీ భారతీయచింతనకి మూలము – భారతీయ భావన, అనుభవమూ.

3. ఆధ్యాత్మిక ఆకాంక్ష ఈ సంస్కృతికి నియంత్రణశక్తి. చింతనకూ మూలమిదియే. పాలించే గాఢవేశము కూడా ఇవియే. ఇదే జీవిత సర్వోన్నత ఆదర్శం అయింది. మానవజాతి గతంలో పరిస్థితులు అనుకూలించినంత మేరకు సర్వజీవనాన్ని ఆధ్యాత్మిక దిశగా మళ్లించే ప్రయత్నం చేసింది కూడా. మతం మనసులో ఉద్భవిస్తుంది, దానికి అది ఆదినివాసి. అందుచేతనే అపరిపూర్ణ ఆధ్యాత్మికప్రేరణ, ఆధ్యాత్మికభావన, ఆధిపత్యం, జీవనాన్ని తన వశం చేసుకునే కృషి... ఈ ఆలోచన, కార్యకలాపాలు... అన్నీ మతపరంగా ఒకే మూసలో ఇమిడ్చివేసే అవసరం కలిగింది. ప్రతి విషయాన్ని మతభావనలో మిళితం చేయవలసిన తప్పని పరిస్థితి కలిగింది. ఈ విధంగా అందుకే మత-ఆధ్యాత్మిక సంస్కృతి పరివ్యాప్తమయే తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది.

*

4. భారతీయ మేధస్సుకి ఆధ్యాత్మికత అత్యంత కీలకమైనది. (the master key) అనంతత్వ భావన దానికి నైసర్గికము. బాహ్యా జీవనం వాస్తవమైనది, పరిపూర్ణమైనది కాదని భారతదేశం ఏ నాడో గ్రహించింది. హేతువాద యుగాల్లోను, అజ్ఞానాంధకారం పెరిగే యుగాల్లోను కూడా ఈ నిశితదృష్టిని ఆమె ఏనాడూ కోల్పో లేదు. ద్రవ్యనియమాలు, శక్తుల ప్రాముఖ్యత గురించి స్పృహ ఆమెకు ఉన్నది. భౌతికశాస్త్రాల ప్రాచుర్యం గురించిన నిశితదృష్టి ఆమె కలిగి ఉన్నది. సాధారణ జీవనక్రియాకలాపాలను కళాత్మ

కంగా మలుచుకోవటమూ ఆమెకు తెలుసు. భౌతికం అతీత భౌతి కంతో సరైన సంబంధంలో నిలిచేటంత వరకు అది అపరిపూర్ణమే అవుతుందని ఆమె గ్రహించింది. ప్రస్తుత కాలమాన పరిస్థితులలో తనకున్న పైపై దృష్టితో ఆధునిక మానవుడు విశ్వంయొక్క చిక్కు ముడిని విప్పలేడని ఆమె తెల్సుకున్నది. వెనుక పరోక్షంలో అదృ శ్యశక్తు లున్నాయనీ, తనకు తెలియని శక్తులు తనలోనే నిక్షిప్తమై ఉన్నాయని, తన గురించి తనకు తెలిసినది అతిస్వల్పమని, కని పించేదాని చుట్టూ అగుపించనిదెంతో ఉన్నదని, అలాగే, తెలిసిన దాని వెనుక నెంతో తెలియనిది, పరిమితమైన దాని చుట్టూ అప రిమితంగా ఎంతో ఉన్నదని, భారతీయ మేధస్సు తెలుసుకుంది. మానవుడు తన్ను తాను అధిగమించగలడని, ఇంతకన్నా పరి పూర్ణంగానూ, లోతుగానూ జీవించగలడని గ్రహించింది. మనిషికి మించిన అసంఖ్యాక దేవతలను దర్శించింది. దేవతలకు మించిన దేవదేవుని దర్శించింది. ఆ దేవదేవునికి అతీతంగా అనిర్వచనీయ మైన అనంతత్వాన్ని సాక్షాత్కరింపచేసుకుంది. మన జీవనానికి అతీతంగా జీవనశ్రేణులు, మన ప్రస్తుత మనసుకి అతీతంగా మాన సికశ్రేణులు, ఇంకా వాటిపైన ఆత్మోజ్వలకాంతులను దర్శించింది. అప్పుడు సాహసోపేతమైన అంతస్ఫూర్తితో నిర్భయంగా అల్పత్వ మనేది లేకుండా ఏ కార్యనిర్వహణకీ సంకోచించలేదు – అది ఆధ్యాత్మికమే అవనీ, మానసికమే కాని, నైతికమే కాని, లేక ప్రాణికస్థాయి సాహసోపేతమైన కార్యమేనా కాని – వీటిలో ఏదీ మనిషికి అసాధ్యము కాదని ప్రకటించింది. కాకపోతే తనలోని జ్ఞాన ఇచ్ఛాశక్తులు సుశిక్షితమై ఉండాలి. అపుడే ఈ మానసిక శ్రేణుల నధిగమించగలడు; ఆత్మ కాగలడు, దేవత కాగలడు. దివ్య ఐక్యత సాధించగలడు; అనిర్వచనీయమైన బ్రహ్మమే తాను కాగ లడు. హేతుబద్ధమైన వాస్తవికత, శాస్త్రవిజ్ఞానము, వ్యవస్థీకృత పద్ధతి – వీటి మార్గాన్వేషణ కావించింది. యుగయుగాల నుంచి ఈ నిశిత దృష్టి కార్యాచరణ ఆమెలో ఉన్నాయి. శక్తివంతమైన ఆత్మశక్తి ఉంది. అనంతత్వమును సాధించి పొందాలనే పరితాపం ఉంది. దైవభక్తిపూరితమైన సంవేదన ఉంది. ఆదర్శం ఉంది.

యోగము ఉంది. కళ, వేదాంతముల పట్ల నిరంతర అభిరుచి ఉంది. అందుచేతనే ఆధ్యాత్మికత జీవకణాలలో నాటుకుపోయింది.

*

భారతీయ సంస్కృతికి రెండవ విశిష్ట లక్షణము

ఆధ్యాత్మికత తనకు తాను భూమిమీద శూన్యంలో వర్ధిల్లదు. ఏ ఆధారం లేకుండా గిరిశిఖరాలు వాటంతటవి లేచి నిలబడవు కదా! అవి మేఘాల్లో విహరించే ఉల్లాసకరసుందరస్వప్నాలు కావు. భారతదేశగతాన్ని చూస్తే మనకు ప్రస్ఫుటంగా కనపడేది దానియొక్క అద్భుతమైన ప్రాణికశక్తి, అపరిమితమైన జీవశక్తి. దాని జీవనోల్లాసంతో మూడువేల సంవత్సరాలుగా – ఇంకా పై మాటే – ఎడతెరిపి లేకుండా, సమృద్ధిగా, పుష్కలంగా అపరిత మైన వైవిధ్యంతో, ఊహాకి అందని విస్తారమైన కల్పన, సృష్టి చేస్తూనే ఉన్నది. గణతంత్రరాజ్యాలు, రాచరికాలు, సామ్రాజ్యాలు సృష్టించింది. తత్వచింతనలు, విశ్వరహాశ్యాన్ని తెలిపే శాస్త్రాలు, విజ్ఞానశాస్త్రాలు, సిద్ధాంతసంగ్రహాలు, కళలు, కావ్యాలు సృష్టించింది. ఎన్నో రకాలైన స్మారకనిర్మాణాలు, రాజప్రాసాదాలు, దేవాల యాలు నిర్మించింది. ఎన్నో ప్రజోపయోగకరమైన పనులు చేసింది. ఉమ్మడి యాజమాన్యాలు, సంఘాలు, మతవర్గాలు రూపొందిం చింది. చట్టాలు, శాసనసంహితలు రచించింది. మతపరమైన అను ష్ఠానాలు, భౌతికవిజ్ఞానశాస్త్రాలు, మానసిక విజ్ఞానశాస్త్రాలు, యోగ దర్శనాలు, రాజకీయ, ప్రభుత్వనిర్వహణా వ్యవస్థలు, ఆధ్యాత్మిక, లౌకికకళలు, వ్యాపారాలు, పరిశ్రమలు, లలితకళలు – ఇలా ఎన్నని! – అంతులేనన్ని సృష్టిస్తూనే ఉన్నది. ప్రతి అంశము లెక్కలేనన్ని క్రియాకలాపాల సందడి సంరంభాలతో నిండినదే. నిర్విరామంగా అలా సృష్టిస్తూ ఇంకా, మరింకా సృష్టిస్తూనే ఉన్నది. దీనికి అంతు లేదు. నిర్లిప్తత లేదు. బద్ధకం లేదు. తీరికా లేదు. దేశసరిహద్దులు దాటి వ్యవహారాలు విస్తరించాయి. తన ఓడలు సముద్రాలు దాటి పయనించాయి. తన నాణ్యమైన వస్తు సముదాయంతో, సంపదతో జూడా, ఈజిప్టు, రోము దేశాలు నిండి

పోయాయి. తన కళలు, కావ్యాలు, సిద్ధాంతాలు వలస స్థావరాలైన ఆర్చిపిలాగోలో వ్యాప్తి చెందింనాయి. మెసపటోమియా ఇసుకతిన్నెలపై ఆ జాడలు ఇంకా చెరిగిపోలేదు. తన మతాలు, చైనా, జపాను దేశాలను జయించాయి. ఇంకా, పశ్చిమదిశగా పాలస్తీనా, అలగ్జాండ్రియా వరకు విస్తరించాయి. ఉపనిషత్తుల ఊసులు, బౌద్ధుల ప్రవచనాలు, జీసస్ క్రైస్తు స్వరంలో ప్రతిధ్వనించాయి. తానెక్కడ కాలిడినా, అక్కడ తన నేలపై వలెనే, అపరిమితమైన తన జీవశక్తి సమృద్ధిని కుమ్మరించటమే! తన ప్రాచీన భవన నిర్మాణంలోను, శిల్పకళ, ఇతర కళాకౌశలప్రదర్శనలోను నిర్బంధం, మితం, అడ్డు ఆపు అనేది లేదని యూరోపియను విమర్శకులు వ్యాఖ్యానించారు. భారతీయ కళాకారునికి దాపరికం తెలియదు. తన కళాకౌశలాన్ని స్వేచ్ఛగా సర్వత్రా పరివ్యాప్తం చేస్తాడు. ఏ కాస్త లొసుగు, లోపం ఉన్నా దానిని తన బంగారంలాంటి కళా కౌశలంతో నింపి సుసంపన్నం చేస్తాడు. లోపము, కొరతతో తనకు నిమిత్తం లేదు. ఆక్రమించిన ప్రతి అంగుళం సుసంన్నం కాబడ వల్సినదే. తన అపరిమిత జీవశక్తి సుసమృద్ధి అలాటిది! పుష్కలత్వం తొణికిసలాడుతుంది. మరి అది తప్పనిసరి. అంతా అపరిమిత జీవశక్తి విన్యాసమే. ఇది 'అనంతము' It is the Infinite.

*

భారతీయ సంస్కృతికి మూడవ విశిష్ట లక్షణం

అయితే ఈ పరమోన్నత ఆధ్యాత్మికత, విస్తారమైన ఈ జీవన శక్త్యానందాల అపరిమిత సృష్టి – ఇదే ప్రాచీన భారతానికి జీవ లక్ష్య లక్షణసర్వస్వం కాదు. స్వచ్ఛ వినీల అనంతాకాశాల క్రింద చిందరవందరగా వెదజల్లబడి బహుదట్టంగా విలసిల్లే ఉష్ణమండల వృక్షసంపద లాటిది కాదది. దర్శనీయమైన సుందర సుసంపన్న అపరిమిత జీవనాకృతుల సమూహంతో, చెల్లాచెదురుగా ఉన్న ఆ విలాసాల లాలస, ఆ అపరిమిత సంపద, అలవాటులేని కళ్లకి జనసమ్మర్దంగా కాళీలేని స్థలంలో కావాలని, పద్ధతి పాటించని చిందరవందర నిర్లక్ష్యధోరణి అనిపిస్తుంది. ప్రాచీనభారత మూడవ

జీవలక్షణం బలమైన బుద్ధివికాసం. సంపన్నతలో నిరాడంబరత, సరళతలో నిర్దిష్టత, శక్తిలో సౌకుమార్యం. విస్తృతిలో సూక్ష్మాం శాలపట్ల శ్రద్ధ. ప్రధాన ప్రేరణగా దాని క్రమపద్ధతి, అమరిక. న్యాయబద్ధమైన కార్యాచరణ – ఇవి ఎప్పుడూ దృష్టిలో ఉంటాయి. అన్నిటికీ మించి భారతదేశం ధర్మభూమి. శాస్త్రాలకి పుట్టినిల్లు. అన్ని మానవీయ, విశ్వధర్మాలు, సత్య నియమాలు అన్వేషించి కనుగొంది. వాటిని జాగ్రత్తగా సవివరంగా జీవితానికి అన్వయిం చేలా సూత్రబద్ధం చేసి క్రోడీకరించింది. తేజోవంతమైన ఆత్మావి ష్కారం ఆమెయొక్క మొదటి దశ. రెండవ దశలో ధర్మ ఆవిష్క రణ కావించింది. ఇక మూడవ దశగా శాస్త్రాలకి సంబంధించిన అన్ని అంశాలనీ క్రోడీకరించి సూత్రబద్ధం చేసింది. ఈ మూడు మూలకాలు ముప్పేటగా ఉన్నవేకాని వేటికవి వేరు కావు.

మూడవ దశలో మొత్తం జీవన విషయపరిశీలన అంతా జిజ్ఞాసతో సశాస్త్రీయంగాను, కళాత్మకంగాను జరిగింది. అశోకుడు నుండి, మహమ్మదీయశక ఆరంభందాకాగల మధ్యకాలంలో మేధోపరమైన ఉత్పత్తి నిజంగా, రాసిలో పండించినది, అసాధా రణం. ఈ మధ్య పండితులు వెలువరించిన అధ్యయనాలు గమ నిస్తే ఇది తెలుస్తుంది. ఆ పాండిత్యవివరణ ఇప్పటికీ ఇంకా ఉన్నదాంట్లో అతిస్వల్పభాగాన్ని గురించి మాత్రమే తెలియచె ప్పింది. తెలుసుకోవల్సినది ఇప్పటికీ ఇంకా ఎంతో మిగిలే ఉన్నది. ఈ మిగిలినదైనా ఒకప్పుడు వ్రాసి ప్రకటించిన దాంట్లో అతిస్వ ల్పశాతమే. ఇలాంటి మేధోపరమైన కృషికి చరిత్రలో ఎక్కడా సారూప్యత లేదు. ఈ జరిగిన కృషి అంతా. ఆధునిక విజ్ఞానశాస్త్ర సదుపాయాలు, అవకాశాలు అందుబాటులోలేని కాలంలో జరిగి నది. అయినా కూడా సూక్ష్మవివరణపట్ల జిజ్ఞాసతో కూడిన శాస్త్రీయ అధ్యయనాలు భారీస్థాయిలో ఏ ఆధునిక అవకాశాలు, రికార్డులు లేకుండానే సాధింపబడినాయి. జ్ఞాపకశక్తే నాటి అందుబాటులో ఉండే రికార్డు. ఉపకరణాలైతే తొందరగా పాడయే తాళపత్రాలు. ఈ బ్రహ్మాండమైన సాహిత్యం – తత్త్వము, దేముడు, మతము, యోగము, తర్కము, వ్యాకరణము, కావ్య, నాటక, అలంకారాలు,

వైద్య ఖగోళ – మరి యితర శాస్త్రాలకే పరిమితం కాలేదు. సమస్త, జీవనశైలీ, దానికి సంబంధిత ప్రతి అంశమూ – అల్పము, అధి కము – అనే తేడా లేకుండా, సాదరంగా స్వీకరించింది. సంఘము, రాజకీయము, అన్ని కళారూపాలు.. చిత్రలేఖనం మొదలుకొని నృత్యము వరకూ – మొత్తం అరవైనాలుగు కళలు – నాటి జీవి తానికి ప్రయోజనకారి అయినది, ఆసక్తి కలిగించేది – సర్వమూ – ఉదాహరణకి అంత ప్రధానంకాని అశ్వ, గజసంరక్షణ, శిక్షణ, ఉత్పత్తి – ఆనాటివారిని ఆకర్షించింది. వీటన్నిటినీ సశాస్త్రీయంగా పరిశోధించి సమగ్రమైన శాస్త్రపరిజ్ఞానంతో సాంకేతికపదజాలంతో పరిపుష్టం చేసింది. ప్రధానము, అప్రధానము, అల్పము, అనల్పము – అనే భేదం లేకుండా – ప్రతి అంశముపట్ల ఒకే శ్రద్ధ, నిర్దిష్టత, సమగ్రతలతో కూడి తన బుద్ధివికాసమును ప్రసరింపచేసింది. ఒక వైపు జీవితాన్ని గురించి సూక్ష్మాతిసూక్ష్మ వివరాలతో తెలుసుకో వాలనే కోరిక, తృప్తితీరని జిజ్ఞాస – మరోవైపు దానిని అత్యంత జాకరూకతతో కూడిన పద్ధతిలో వ్యవస్థీకరించాలనే ఉత్సాహం – క్రమబద్ధీకరించిన విజ్ఞానంతో జీవనగమనం సాగాలనే మానసి కోల్లాసం ఈ విధంగా సాగింది. గాఢంగా నాటుకున్న ప్రబలమైన ఆధ్యాత్మికత, తరగని ప్రాణికకల్పనాశక్తి, జీవితంపట్ల ఎడతెగని అభిరుచి, సునిశిత నిష్కల బుద్ధివివేకం, అందుకు తోడుగా నైతిక ఉత్తమ అభిరుచితో కూడిన తీవ్రకార్యాచరణవిధానం కలిగిన బుద్ధి, సామరస్యంతో కూడిన సుసంపన్న సంస్కృతిని – సృష్టిం చింది.

*

భారతీయ సంస్కృతికి నాల్గవ విశిష్ట లక్షణం

భారతీయ తత్వచింతనకి సంబంధించి, జీవితాన్ని తిరస్కరించే బౌద్ధుల మాయావాదంపై యూరోపియనుల దృష్టి పడింది. అయితే ఒకటి గుర్తుంచుకోవాలి. దీనియొక్క తత్వచింతనా వైఖరిలో ఇదొక పార్శ్వం. ఇదీ కూడా దాని క్షీణదశ లోనిది. దీనిని గోరం తలు కొండంతలుగా చేశారు. ఇది కూడా ఒక దశలో ఒక ప్రత్యేక

ప్రేరణతో కూడిన ప్రచోదనలో ఒకే దిశగా సాగే చలితచాలనాల ఫలితం. భారతీయచింతనలో, దాని కార్యకలాపాలలో ఈ వైఖరి సాధారణంగా కనిపిస్తుంది. మేధోపరంగాను, నైతిక, ప్రాణికప రంగాను, లోలోతులకు పోయి దాని అంతం కనుగొనటం భారత ఆధ్యాత్మికచింతనలో పరిపాటి. పరిపూర్ణ వివరణ కోసం, అన్వేషణలో లోలోతులు మథించడం, ఉన్నతశిఖరాల నధిరోహించటం, ఇదంతా అంతర్గత అన్వేషణలో భాగం. పరిమితుల నధిగమించి దాని అంతుతేల్చటానికి – 'ఈ అందమైన అమితం' – 'fine excess' – అవసరమవుతుంది. సాధారణ మందబుద్ధి అయితే పరిమితులను దాటిపోవటానికి ఇచ్చగించదు. 'fine excess' తో పరిమితుల నధిగమించటానికి ఈ అన్వేషణలో అంతులేని సాహసం కావాలి. లక్ష్యం వైపు అడుగు దృఢంగా పడాలి. ఆ విధంగా ప్రతి ఆధ్యాత్మికచింతనలో ప్రతి వక్రతను, ఆధ్యాత్మిక అనుభవపరంపరలను, తుట్టతుదవరకు లాక్కెళ్లి, ఆ కొసనుంచి మొత్తం దాని పరిస్థితిని పర్యావలోకనం చేసింది. ఇది ఎందుకు చేసిందంటే అలాటి పర్యావలోకనంలో ఏ వాస్తవం, లేక శక్తి ఆవిష్కరింపబడుతుందో గమనించేందుకు. మరిదే మార్గం. సర్వ దివ్యప్రకృతిని అలా పరామర్శించటానికి ప్రయత్నించింది. ఇంకా దివ్యప్రకృతికి అతీతంగా, వీలైనంత ఉన్నతస్థాయి నుంచి, దివ్యత్వాని కతీతంగా, ఏదైనా అనంతత్వం (Supradivine) ఉంటే దానిని కనుగొనటం కోసం కృషి చేసింది. ఆధ్యాత్మిక నిరీశ్వర వాదాన్ని సూత్రీకరించవలసి వచ్చినపుడు, దాని పరాకాష్ఠ చేరుకుని దర్శించటానికి దానిని వెన్నంటి ముందుకు సాగింది. తీరని మనోవైకల్యంతో కూడిన జిజ్ఞాసతో నాస్తికవాదంపై మనసుపడినా, దానిని క్రీగంటిచూపుతో నిర్మొహమాటంగా, ధైర్యంగా సూత్రీకరించింది. కాని అక్కడ మాత్రం ఆదర్శంతోకాని, నైతిక సూత్రాలతోకాని రాజీపడలేదు.

ఎక్కడైనా కూడా ఈ రకమైన మనోప్రవృత్తినే గమనిస్తాం. భారతీయమేధస్సుకి జీవితాదర్శాలుగా, మానవజీవలక్షణాలుగా, – దృఢమైన ఆత్మోన్నత్యం, స్వేచ్ఛాపిపాస, దృఢసంకల్పం, స్వాధీ

నత, ఆత్మత్యాగం, పారతంత్రత, విధేయత, ఆత్మసమర్పణ గమనిస్తాం. విలాసవంతమైన జీవనం, అత్యంత పేదరికమైన జీవనం – రాజభోగం, దిగంబరత్వం – ఈ రెడు విరుద్ధ ఆదర్శాలు వాటి గరిష్ఠస్థాయికి కొనిపోబడినాయి. అయినా ఇక్కడ అత్యంత తీవ్రమైన జీవనవిధానాలను పాటించటంలో, క్రమరాహిత్యానికి ఎక్కడా అవకాశం రానీయలేదు. అత్యంత విలాసవంతమైన జీవనసరళిలోనూ కూడా విశృంఖలమైన అవినీతి చోటు చేసుకోలేదు. ఇదే పరిస్థితి యూరపులో ఉన్నపుడు అక్కడ అవినీతి చోటుచేసుకుంది. భారతీయ మేధస్సు ఆధ్యాత్మికమైనది, నైతికమైనదే కాక, వివేకవంతమైనది, కళాత్మకమైనది కూడ. మానసిక నిబంధన, లయబద్ధమైన జీవనసౌందర్యము, ఈ రెండూ, అస్తవ్యస్త, గందరగోళ స్వభావానికి, విశృంఖలతకు విరుద్ధం. ఏ వైపరీత్యంలోనైనా కూడా, భారతీయజీవనశైలి తన ప్రయోగంలో, న్యాయం, నియమం, మితము, తీరు అన్వేషిస్తుంది. అంతేకాదు. విపరీతధోరణుల లోతులలోనికి ఎంతగా చొచ్చుకునిపోయినా, తనలో గాఢంగా నాటుకుని ఉన్న సంయోజన ప్రవృత్తి, సమతౌల్యాన్ని నిలపెడుతుంది. ప్రతిప్రేరణా చివరివరకూ ప్రచోదింపబడినా, భారతీయమేధస్సు తాను సంతరించుకున్న విజ్ఞానాన్ని కార్యవిధానంలోను, వ్యవస్థలోను విలీనం చేసుకోవడంలో సామరస్య సమతౌల్యాలు పాటించింది. భారతీయ సంస్కృతికి సమన్వయపరిచే ప్రత్యేక లక్షణం ఉంది. సమతౌల్యం, లయబద్ధ జీవనం గ్రీకులు స్వనియమపాలనవల్ల సాధిస్తే, భారతీయులు మనోప్రాణిక సంయోజనాత్మక ప్రచోదనవల్ల, మానసిక, నైతిక, సౌందర్య అభిరుచితో కూడిన క్రమపద్ధతివల్ల సాధించారు.

*

జీవితానికి ఆధ్యాత్మిక ఆదర్శం అంటే ఏమిటి?

ముందు ఈ ఆదర్శం అంటే ఏమిటి కాదో తెలుసుకోవాలి. స్పష్టంగా ఇది ఐహిక జీవనం నిస్సారమని భావించటం కాదు. వీలైనంత త్వరగా మనమంతా సన్యాసులం కావాలనీ కాదు.

అందుకు తగినట్లుగా సాంఘికజీవనాన్ని, ఏ పనిపాటు లేకుండా, మానవజాతి ప్రగతి లేకుండ, అభ్యుదయ ఆదర్శాలు లేకుండా మఠానికో, గుహకో, పర్వతాగ్రానికో తరలిపోయేందుకు సన్నద్ధం కావటమూ కాదు. భవబంధాలు లేకుండా ఉండటం అన్న ఒకే ఆదర్శం కొంతకాలం భారతీయ ఆలోచనా ప్రవృత్తియై ఉండి ఉండవచ్చు. కాని అదే పరిపూర్ణమైన ప్రవృత్తి కాదు. ఆధ్యాత్మికత అంటే జాతీయజీవనాన్ని – ఒక ప్రత్యేక మతసూత్రాలకి, సిద్ధాంతాలకి, రూపాలకి పరిమితం చేసి, ఒకే మూసలో తయారు చేయటమూ కాదు.

ఇంకా – ఉన్నత మానవీయ ఆదర్శాలను, ఆధునిక ప్రపంచ సమస్యలను, సాధారణ మానవజీవన కార్యకలాపాలను, మన పరిధిలో నుంచి వైదొలగించటం కాదు. అలాగే – అంతరంగ ప్రచోదనతో ఆత్మోన్నతిని, విస్తృతిని వృద్ధిపొందించి జవము, జీవము, వెలుగు, ఆనందము పరిపూర్ణత – కలిగించే విశిష్ట సాధనాలను వదులుకోవడమూ కాదు.

పోతే ఆధ్యాత్మికజీవన దృక్పథంకి కేవలం భౌతిక మానసిక దృక్పథంకి గొప్ప తేడా ఉంది. ఆధ్యాత్మిక దృక్పథంలో మనసు, ప్రాణికము, శరీరము మనిషికి సాధనాలు. అంతేకాని లక్ష్యాలు కావు. ఆ సాధనాలైనా సర్వోన్నతమైనవీ కావు, అవే అంతిమ సాధనాలు కావు. వాటిని బాహ్యోపకరణ సత్వంగా మాత్రమే తప్ప పూర్ణసత్వంగా దర్శించదు. పరిమితమైన విషయాలకి పరోక్షంగా అపరిమితత్వాన్ని దర్శిస్తుంది. పరిమితమైనవాటి విలువ, అపరిమితమైనదాని యొక్క విలుతో బేరీజు వేసి నిర్ణయం చేస్తుంది. పరిమిత భౌతికము, అపరిమిత అనంతమునకు అసమగ్ర ప్రతిరూపముగా గుర్తిస్తుంది. ఈ పరిమితాలు అపరిమితంగా వ్యక్తమయే దిశగా చేరుకునే ప్రయత్నం చేస్తాయి. ఆధ్యాత్మిక దృష్టి బాహ్యదృష్టికి కనిపించేవాటి వెనుక ఉండే మహత్తును దర్శిస్తుంది – మానవునిలోను, దృశ్యమానప్రపంచములోనూ కూడా. మనిషిలో ప్రధానమైన ఈ జీవాత్మ, దివ్యత్వం తనలోనే కాక, ఈ దృశ్యమాన ప్రపంచంలో అంతటా కనుగొని గుర్తించి,

సర్వత్రా, సర్వులతోను ఏకత్వాన్ని సాధిస్తుంది. ఈ దృక్పథం తప్పనిసరిగా విషయాలను దర్శించే తీరునే మార్చివేస్తుంది. మానవీయ జీవనలక్ష్యాలను పదిలపరుస్తూనే, వాటికి ఒక నూతన సంవేదనతో పథనిర్దేశం కల్పిస్తుంది.

ధర్మము అంటే మా ఉద్దేశం

ధర్మము అంటే వెంటనే స్ఫురించేది మతానుష్ఠానము. ఇంకా లోతైన నైసర్గిక నియమము. అంతేకాని పాశ్చాత్య భావనలా – మతసిద్ధాంతమో, ఆరాధనావ్యవస్థో లేక నైతిక సాంఘిక నియమాలను ప్రోత్సహించే ఆదర్శమో కాదు. ఇది జీవితానికి సంబంధించి అన్ని అంశాలలోను సక్రమ నియమపాలన. మనిషి వైఖరియుక్తమైన పరిపూర్ణమైన జీవననియమశైలికోసం చేసే అన్వేషణ నిజమై రుజువయేది ధర్మపాలనం లోనే. ప్రతిదానికీ ఒక ధర్మం ఉంది. దానికి దాని స్వభావం విధించే జీవననియమం ఉంది. మరి మనిషికి అయితే తనవారందరితో పాటు తనకుండే ఆదర్శజీవన బంధం తనకు తానై విధించుకున్న ధర్మం. అంతస్తత్వంలో ధర్మం స్థిరంగా నిర్దేశింపబడుతుంది. అయినా కూడా అది మన చేతనలో వృద్ధిపొంది దశలుగా రూపుదిద్దుకుంటుంది. అధిరోహణాక్రమంలో ఆధ్యాత్మిక, నైతిక అంతస్తులున్నాయి... మన స్వభావానికి అనుగుణంగా సర్వోన్నత ధర్మాన్ని (న్యాయాన్ని) అన్వేషించటంలో. అన్ని విషయాలలోను అందరూ ఒకే స్థిరమైన సర్వసాధారణ నిబంధనను అనుసరించలేరు. జీవితం ఎంతో వైవిధ్యం కలది. అందరికీ ఒకే ఆదర్శం హేతుబద్ధం, ఆమోదయోగ్యం కాదు. నైతికచింతనాపరుడు మాత్రం అందరూ ఒకే ఆదర్శం కలిగి ఉండటం ఇష్టపడతాడు. స్వభావాలు వేర్వేరుగా ఉంటాయి. ఉద్యోగమో, చేసే పని వత్తిడి తీరు వేరుగా ఉంటుంది. ప్రమాణాలుంటాయి, లక్ష్యాలుంటాయి. అభిరుచులుంటాయి. జీవితకర్తవ్యం, అంతరంగ ఆదేశం అందరికి ఒకేలా ఉండవు. సామర్థ్యం, దశ, దిశ, పురోగతి తేడాగా ఉంటాయి. అందరినీ కలిపి ఒకే పట్టికలో జమచేయకూడదు. అది మొరటుగా ఉంటుంది. తెలివితక్కువపని

అవుతుంది. మృదులమైన జీవనస్వారశ్యం దెబ్బతింటుంది. ఒక్కొక్కరిది ఒక్కొక్క విలక్షణ స్వభావం. దానిని పరిపూర్ణంగా తీర్చి దిద్దేదిగా తగిన నిబంధన ఉండాలి. ప్రతివానికి తాను నెరవేర్చవలసిన ప్రయోజనకరమైన పని ఉంటుంది. అందుకు తగిన ఆదేశం, ఆదర్శం ఉండాలి. అన్ని విషయాలకి వివేకవంతమైన సదవగాహన ప్రామాణికమైన ఆచరణ విధానం... పరిపూర్ణత ఆదర్శంగా సజీవనిబంధన – ఇవీ ధర్మానికి అవశ్యంగా కావలసినవి. కోరిక, ఆసక్తి ఎటు లాక్కెడితే అటుపోయే జీవనవిధానం కాకూడదు. దీనిని నియంత్రించి, నిరోధించి, నిర్దేశించే మార్గదర్శకత్వం కావాలి. నైతికనియమం, జ్ఞానం, నిగ్రహం, – వీటితో పాటు – పరిమితి, క్రమపద్ధతి, పరిపూర్ణతా ప్రమాణం, తప్పనిసరి. వ్యక్తి లక్షణాన్ని బట్టి తను చేసే క్రియాలక్షణాన్ని బట్టి ఈ ప్రత్యేక ధర్మాలు మిగిలినవాటికి అతీతంగా ఉన్నతతర సత్యధర్మాలుగా పెరిగి, విశ్వాజనీనంగా సార్థకమవుతాయి. అప్పుడవి విశిష్టవ్యక్తికి విశిష్టధర్మాలు అవుతాయి. పురోగతికవి ప్రాతిపదిక అవుతాయి. జీవన గమ్యంగా. అవి విశాలపరిధిలో సర్వులకూ ఆచరణయోగ్యమవుతవి.

*

...ఈ ప్రపంచంలో శరీరధారులమైనవాళ్లం మనమంతా ఒకే అస్తిత్వంలో సమాన స్వభావ లక్షణాలు కలిగి ఉంటాం. అయినప్పటికీ వ్యక్తిగత జీవాత్మలు అతీత పరమాత్మతో నేరుగా సంసర్గం కలిగి ఉండగలుగుతాయి. మనలోని ఈ పరమోన్నత సత్యం రెండు విశిష్ట లక్షణాలు తప్పక కలిగి ఉండాలి. అది, ఒక ఆధ్యాత్మిక సామూహిక జీవనంయొక్క పొందిక, సామరస్యతల సమగ్ర సంచలనాలను అన్వేషించే ధర్మము, సత్యము – అయి ఉండాలి. దివ్యసృష్టిలోని అనేకత్వంతో కూడిన ఏకత్వంలో సంబంధాలు, సమగ్రంగా నిర్ణయించేవిగా ఉండాలి. అదే సమయంలో క్షణం క్షణం మనకు, వ్యక్తియొక్క దేహ, ప్రాణ, మనో, ఆత్మల లయాత్మక కదలికలలో దివ్యత్వం వ్యక్తం అవాలి. ఈ సర్వోన్నతశక్తి, కాంతుల ఉన్నత వ్యక్తీకరణ కార్యాచరణలో ఒక తప్పనిసరి ధర్మముగా, సమగ్రమైన స్వేచ్ఛగా, అనుభావ్యమవటం గమనిస్తాం.

ఈ వాస్తవాలు ఎందుకు ప్రస్తావించానంటే గతచరిత్రల్లో ప్రస్ఫుటమైన భారతీయ బుద్ధి, జీవలక్షణాలు గురించిన కొన్ని పార్శ్వాలని మాత్రమే చూచినవాళ్లు వీటిని తప్పక విస్మరిస్తారు. వీటినే నొక్కి చెప్పటంవల్ల భారతదేశం యొక్క అనిర్దిష్ట, అసంపూర్ణ భావన మరియు దానియొక్క నాగరికత యొక్క సమగ్ర అభిప్రాయము. దాన్ని చైతన్యవంతం చేసిన ఆత్మశక్తి గురించి మనకు ఒక అవగాహన కలుగుతుంది. గతంలో వరదపొంగు తగ్గుముఖం పట్టగా వదిలిపెట్టి వెళ్లిన నిక్షేపమే వర్తమానం. ఇది నిస్సందేహంగా భవిష్యత్తుకు నాంది. కాని ఈ వర్తమానంలో భారతదేశ గతంకి సంబంధించినదంతా ఇంకా నిద్రాణంగానే ఉంది. అది నశించలేదు. కొత్త రూపాలు సంతరించుకోవాలని నిరీక్షిస్తోంది. ఉత్పాదకశక్తి తగ్గుముఖం పట్టడమే పతనం. దాని ఉధృతి అది పొంగినప్పుడు చూస్తేనే తెలుస్తుంది.

మూడు తిరోగమన ఉద్యమాలు క్షీణదశకు కారణభూతమయాయి. మొదటిది: అంతవరకు అమిత సమృద్ధంగా ఉండే ప్రాణికశక్తి కృశించటం. జీవిత ఉల్లాసం లుప్తమవటం. కల్పన పట్ల నిరాసక్తత. ఈ క్షీణదశలోని శక్తి కూడా అసాధారణ వైభవోపేతంగానే ఉంది. నిద్రాణస్థితి కొద్దికాలమే ఉంది. గత ఔన్నత్యంతో పోల్చి చూచినపుడు పతనం క్రమంగా గుర్తింపబడినది. రెండోది: మానసిక స్వేచ్ఛాకార్యకలాపాలు ఒక్కసారిగా స్తంభించిపోవటం. శాస్త్రీయ స్వేచ్ఛావిమర్శనాత్మక మనోకార్యకలాపాలు, సృజనాత్మకతకి అంతర్ప్రేరణ నిద్రాణస్థితికి చేరుకోవటం. కాస్తేదైనా మిగిలినదంటూ ఉంటే అది గత విజ్ఞానసష్టావశేషాల చర్విత చర్వణం మాత్రమే. అది కూడా సక్రమ అవగాహనతో కానే కాదు. బుద్ధిలో స్తబ్ధత, జీవితంలో నిర్వీర్యత, గతమానసిక వైభవం సృష్టించిన అవశేషరూపాలలో చోటు చేసుకున్నాయి. పాత ఆధికారిక ప్రమాణాలు, నియమాలు నిరంకుశంగాను, కఠినంగాను తయారైనాయి. అలాటి సమయాలలో సాధారణంగా జరిగేదే ఇది.

అవి వాటి జీవము సూక్ష్మ సంవేదన కోల్పోయాయి. చివరిగా: ఆధ్యాత్మికత, గతంలోవలె, మసకలేని దివ్యజ్యోతి ప్రకాశంగా నిలిచి వెలగలేదు. నాటి దివ్యసంయోజనం లేదు. ప్రత్యామ్నాయంగా గొట్టాల్లోంచి ఎగజిమ్మే తీవ్రధారలలా చెదురుమదురుగా కనిపించేది. ఆధ్యాత్మికసూత్రాలు కొన్ని నొక్కిచెప్పటం, కొన్నిటిని పూర్తిగా విస్మరించటం జరిగేది. ఇందుకు కారణం కృషి లోపమే. జీవితము, మనసు, పరిపూర్ణ ఆధ్యాత్మీకరణ కావించాల్సిన తరుణంలో సక్రమస్థాయిలో అది జరుగులేదు.

సరిగా ఇదిగో ఇప్పుడే ముంచెత్తింది దేశాన్ని పాశ్చాత్య ఉప్పెన. కాని మన అదృష్టంవల్ల అక్కడ జీవశక్తి తాత్కాలికంగా నిద్రాణంగానే అయినా ఉంది. చావలేదు. మిగిలివున్న శక్తితో లోనున్న దౌష్ట్యం తన చికిత్స ఏదో తనకు తానే నిర్వహించుకుంది. ఈ పాశ్చాత్య మొరటు జీవన సంస్కారాల తాకిడివల్ల తాత్కాలికంగా కొంత కుళ్లు, మొరటుతనం వచ్చి చేరింది. కాకపోతే అది ప్రయోజనకరమైన మూడు ప్రచోదనలు కల్పించింది. గుప్తంగా ఉన్న మానసిక ప్రచోదనను తిరిగి చైతన్యవంతం కావించింది. జీవితానికి పునరావాసం కల్పించింది. నూతన సృష్టికి మేల్కొలుపు నిచ్చింది. పునశ్చైతన్యవంతమైన భారతీయ ఆత్మను నూతన ఆదర్శాలకు, పరిస్థితులకు భేటీగా ఎదురుగా ముఖాముఖి నిలబెట్టింది. వాటిని ఇముడ్చుకుని వశం చేసుకొనవలసిన అత్యావశ్యకతను విశదపర్చింది. ఈ మేల్కొన్న భవిష్యదార్శినకతతో కలిగిన ప్రచోదనలనుంచి భారతదేశం పునరుద్దీపనం చెందుతోంది. భవిష్యద్వైఖరిని మరి అదే నిర్దేశించాలి. అంతటి వైభవోపేతంగాను, గాఢంగాను, పరిపూర్ణంగాను పురాతన ఆత్మజ్ఞానానుభవం తిరిగిపొందాలి. ఇదే మొట్టమొదటి అత్యావశ్యకమైన పని. ఈ ఆధ్యాత్మిక స్రవంతిని పలురూపాల లోనికి – తత్వశాస్త్రం, సాహిత్యం, కళలు, శాస్త్రవిజ్ఞానం, విమర్శనాత్మక విజ్ఞానం మొదలైన – పలుపాయలుగా మళ్లించటం రెండో పని. భారతీయ జీవన సారమునకు అనుగుణంగా ఆధునికసమస్యలను మౌలికంగా పరిష్కరించటం మరియు ఉన్నత సంయోజనకరమైన రీతిలో ఆధ్యా

త్మీకరింపబడిన సమాజాన్ని వ్యవస్థీకరించటం, మూడవది, కష్ట తరమైనది కూడా. ఈ దిశగా సాధించే కార్యాచరణ ఫలితాలు భవిష్య మానవాళికి అందించే సప్రమాణ ఫలితాలు.

అంతరాత్మను, ఉచ్చతరశక్తుల యొక్క పైపైన, చాటుమాటునగల తీవ్రతలను అన్వేషించటం, అంతరాత్మయొక్క వ్యక్తీకరణకు స్పందించేలా జీవితాన్ని ఏదో విధంగా అధీనంలోకి తెచ్చుకొని జీవితంయొక్క జవసత్వాలను పెంచటం – ఇదీ భారతీయ విధానం. బుద్ధి, ఇచ్ఛ, మర్యాదలతో, ఉత్తమ అభిరుచుల ఉద్వేగముల సత్వము, సాధారణ మానసిక సంభావ్యతలను గమనించటం కూడా దాని ప్రవృత్తియే. తమ అత్యున్నత అంతర్దృష్టుల యొక్క ఘనతరశక్తి కాంతుల మేరకు వాటిని ఉద్ధరించటం కూడా దాని ప్రవృత్తే. భారతదేశంలో పునరుజ్జీవన కార్యక్రమం, ఈ ఉన్నత జీవనశైలియే స్ఫూర్తిగా కొనసాగించటం తప్పనిసరి. ఈ అంతర్నిహిత శక్తితత్వం మళ్లీ ఒక సృజనాత్మకశక్తిగా.... బహుశా ప్రపంచంలోనే ఒక ప్రబలమైన శక్తిగా రూపొందే స్ఫూర్తి తప్పని సరే. అయితే భారతదేశం ఈ వాస్తవానికి ఇంకా అస్పష్టంగానే జాగృతమై ఉన్నది. భారతదేశ జనసామాన్య క్రియాకలాపం ప్రస్తుతం ఇంకా పాశ్చాత్య ప్రేరణా పద్ధతుల్లోనే సాగుతోంది. మన అంతరాత్మ స్ఫూర్తికి ఈ పాశ్చాత్య పద్ధతులు నప్పవు. క్రియకు వచ్చేసరికి, మన సత్తయొక్క మూలం నుంచి జనించకపోవటం వల్ల ఈ కార్యకలాపం అల్పసంకల్పబలంతో, హీనమైన రీతిలో, నిష్ప్రయోజన ఫలితాల నిస్తోంది. కొన్ని వైపుల నుంచి మాత్రమే కొంత స్పష్టమైన ఆత్మజ్ఞానప్రకాశం ఉంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

> మేల్కొంటున్న భారతం నుంచి వెల్లువగా దైవత్వాన్ని పుష్కలంగా అందుకోవటానికి లోకం వేచి ఉంది.
>
> శ్రీఅరవిందులు

Q: What does the Divine want of me?

A: He wants that you first find yourself; that with your true being, your psychic being, you master and govern the lower being, and then you will quite naturally take your proper place in the great Divine Work.

The Mother

(*CWM* Vol. 16, pp. 154-55)



దైవం
ఆచార్యుడు, మార్గదర్శకుడుగా

అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2007

దైవం – ఆచార్యుడు, మార్గదర్శకుడుగా

విషయసూచిక

నేనెవరికైనా ఉపదేశం (initiation) ఇచ్చానని చెప్పానంటే, ఆ వ్యక్తికి నేనెవరో తెలిసేలా చేసాననీ, మాటలతో పనిలేకుండానే నన్ను చూసేందుకు, తెలుసుకొనేందుకు, అవగాహన చేసుకొనేందుకు కావలసిన సమర్థతను ప్రదానం చేసానని అర్థం.

శ్రీమాత

లోకేశ్వరుడు మనలోనే దాగి ఉన్నాడు

అనుగ్రహించడానికి దిగి వచ్చింది ఆయన ఆత్మ విశాల
లోకాలనుండి.

క్షణిక దర్శనంగల మన సీమలోనికి,
అమృతత్వము నుండి దిగివచ్చిన వలసవాడు.
దిక్కుతోచని పుడమి బాటలపై దారి చూపే కాంతికిరణం,
ఆయన పుట్టుక పట్టి పైకెత్తి చూపే సంకేతం, ఒక శకునం.
ఆయన మానవాత్మ ఒక మసక తొడుగువలె
కప్పి ఉంచింది గుడ్డి లోకానికి దారిచూపే సర్వజ్ఞుడిని.

*

ఎవడు మన లోపల గోప్యమైన ఆత్మగానున్నాడో, వాడే
మన అపరిపక్వతా వేషాన్ని ధరించినవాడు,
వాడే ఈ మాంసపు గూడును తనదిగా చేసుకున్నవాడు,
తన రూపాన్ని మానవ పరిమాణంలో పోత పోసుకున్నాడు
తన దివ్య ప్రమాణం లోకి మనం ఎదుగుటకై
అప్పుడొక దివ్యరూపంలో
ఆ దివ్యస్రష్ట మనల్ని తిరిగి పోతపోసి బిగిస్తాడు
మర్త్యుడి, మూసపై దివ్యత్వ ప్రణాళికా చట్రాన్ని
మన పరిమిత బుద్ధుల్ని అనంతమున కెత్తడానికి,
క్షణాన్ని శాశ్వతత్వంతో తాకించుతూ.
ఈ రూపాంతరం దివికి భువి చెల్లించే ఋణం;
పరస్పరం బాకీపడినదొకటి, దైవంతో మనిషిని కట్టిపెడుతుంది;
ఆయన ప్రకృతిని మనం ధరించాలి. మనదాయన వేసుకొన్నట్లే;
మనం దైవీపుత్రులం ఆయనలాగే ఉండాలి మరి:
ఆయన మానవాంశమనం, పెరగాలి దివ్యత్వం లోనికి.
మన జీవనమొక అసత్యాభాసం దైవమేదానికి కీలకసూత్రం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: వై.యస్.వి.యస్. మూర్తి

గురువు – మానవ, దైవసంభూతుడు

దివ్యకాంతిప్రదాత గురువు

మన ఈ ఆధునికయుగంలో భౌతికవిజయాలు, వాటివల్ల పొందే సంతృప్తి – ఇవే గణనీయమైనవి. అయినప్పటికీ నిరాశాపరులైన ప్రజలు అంతకంతకు జీవనగమ్యాన్ని అన్వేషిస్తూ ఉన్నారు. మరొకవైపు జ్ఞానకాంతిని ప్రసరింపచేస్తూ పీడితప్రజానీకాన్ని ఆదుకోవటానికి కృషిచేసే వివేకవంతులైన విజ్ఞానులూ ఉన్నారు. తెలిసినవారు, తెలుసుకోవాలనుకున్నవారు – ఉభయులు కలుసుకున్నప్పుడు – లోకంలో ఒక క్రొత్త ఆశ చిగురించదా! అలముకుని ఉన్న చీకట్లో ఓ కాంతికిరణం చొరబడదా!

– శ్రీమాత

మానవ మధ్యవర్తి గురువు

కంటికి కనుపడకుండా ఆంతర్యంలో ఉన్నదానిని నమ్మటం మనిషికి కష్టం. దానిని బహిర్గతం చేసుకుని దానికి రూపం కల్పించినదానిని నమ్మటం తనకు సులువు. చాలామంది మానవుల ఆధ్యాత్మికపురోగతికి ఆసరాగా నమ్మకం కలిగించే బాహ్యాకృతి ఒకటి అవసరమవుతుంది. ఇందుకు భగవంతుని బాహ్యారూపం ఒకటి కావలసివస్తుంది. లేదా – ఒక మానవ మధ్యవర్తి అయినా అవసరం అవుతాడు. అవతారమూర్తి ప్రవక్త లేక గురువు లేదా ఉభయులు కావలసివస్తారు. మానవ అంతరాత్మ అవసరానికి అనుగుణంగా మానవ లక్షణాలు కలిగివుంటూ, దైవం, మానుషరూపంలో మార్గనిర్దేశకత్వం అందించే సాధనంగా అభివ్యక్తమవుతుంది. దైవత్వాన్ని ప్రచ్ఛన్నంగా గుప్తపరుస్తుంది.

హైందవ ఆధ్యాత్మికక్రమశిక్షణ, జీవాత్మ అవసరం తీర్చటం కోసం, ఇష్టదేవత అనే భావాన్ని ప్రతిపాదించి ప్రవేశపెట్టింది. అదే అవతారము, గురువు. ఎన్నుకొన్న దైవం – అదే ఇష్టదేవత – అంటే అది నిమ్నస్థాయికి చెందిన దివ్యశక్తి కాదు. నామ

రూపసహితమైన వైశ్వానిక దేవత. ఇంచుమించు అన్ని మతాలు నామరూపసహిత దైవాన్ని కలిగి ఉంటాయి. వాటి ఆలంబన, ఆధారం కావాలి. మానవజీవాత్మకి దీని ఆవశ్యకత స్పష్టమే. సర్వము అంతా దైవమే. అంతటికీ అతీతంగా ఉన్నదీ దైవమే. 'అతీతము' – అనే దానిని మానవుడు ఎలా భావిస్తాడు? ముందు ఈ 'సర్వము అనేది ఓ పట్టాన కొరుకుడుపడదు. మనిషిది పరిమిత చైతన్యము; పరిమిత స్వభావము. వీటితో సామరస్యభావన కలిగి ఉన్నవాటికే తాను ఉన్మీలనం చెంది ఉంటాడు. 'అన్నిటి' లో, లేక 'సర్వము' లో ఉన్నదనేది తన అవగాహనకు మించినది. భావాతీతంగా ఉంటుంది. దైవమని ఊహించలేడు. దరిచేరడు. లేదా – గుర్తించలేడు. తన అజ్ఞాన పాక్షిక ఆలోచనాపరిధిలోనికి రావు. కాబట్టి తన ప్రతిరూపంగా భగవంతుని ఊహించుకుని రూపకల్పన చేసుకోవటం ఆవశ్యకం అవుతుంది. లేదా తనకు అతీతంగా లేదా తన సర్వోన్నత ఉద్దేశాలు, భావాలు, బుద్ధి – వీటి కనుగుణంగా ఉండే దివ్యరూపం ఏదో తన కవసరం. అలా లేకపోతే దైవసంసర్గం, సన్నిహితత్వం తనకసాధ్యమవుతుంది.

స్వాభావికంగా మానవుడు మానవమధ్యవర్తిత్వాన్నే అభిలషిస్తాడు. అలా అయితేనే దైవమును మానవతకి సన్నిహితంగా భావిస్తాడు. అపుడే మానవ ప్రభావానికి, ఆదర్శానికి దైవం సన్నిహితమవుతుంది. దైవం మానుషరూపం దాల్చి – కృష్ణుడు, బుద్ధుడు, క్రైస్తు – అవతారంగా వ్యక్తమవుతేనే తన అవసరం తీరుతుంది. ఇది కూడా భావించడం మానవునికి కష్టమైతే, గురువుగా, ప్రవక్తగా మరీ అంత అద్భుతావహం కాని మధ్యవర్తిగా దైవం ప్రాతినిధ్యం వహిస్తాడు. దివ్యమానవునిగా భావించలేని, అంగీకరించలేనివారు, అవతారమూర్తిగాకాక, మహోన్నత మానవునిగా, జగద్గురువుగా, దైవప్రతినిధిగా అంగీకరించగలరు.

ఇదీ చాలదు. ఒక సజీవ ప్రభావం. సజీవ ఆదర్శం, ప్రస్తుతం అందుబాటులో ఉండే ఒక జ్ఞానబోధ అవసరం అవుతుంది. ఎందుకంటే, గత దివ్యోపదేశకుని ఉపదేశంతో వారి ఆదర్శప్రభా

వాలతో గత అవతారాన్ని ఏ కొద్దిమందో తమ జీవితాలలో సజీవంగా నిలుపుకొని ఉంచుకోగలుగుతారు. ఈ అవసరాన్ని తీర్చటం కోసమే హైందవ క్రమశిక్షణ గురు-శిష్య అనుబంధాన్ని కల్పన చేసినది. గురువు ఒకపుడు అవతారమూర్తి కావచ్చు లేదా జగద్గురువు కావచ్చు. ఆయన దివ్యజ్ఞానప్రబోధకుడై, జీవాత్మ – పరమాత్మ అనుబంధాన్ని భావించి సిద్ధింపచేసేవాడు కాగలుగుతే చాలు, మనిషికి.

*

గురువు యోగానికి మార్గదర్శకుడు. దైవముచేత అంగీకరింపబడిన మార్గదర్శకుడు, గురువుగానే అంగీకరింపబడినవాడవుతాడు.

*

ఒక హెచ్చరిక

రామకృష్ణుడు ఇతరులకు సిద్ధి ప్రసాదించకుండా, ముందుగ తాను పొందేరు. అలాగే బుద్ధుడు కూడా. మిగిలినవారి గురించి నాకు తెలియదు. తన మార్గంలో పరిపూర్ణత సాధించడమే సిద్ధి. తనకు పరిపూర్ణమైన అధికారం ఉంటే తప్ప వేరొకరికి తాను గురువు కాకూడదనే నియమాన్ని ఎప్పుడూ రామకృష్ణుడు ప్రతిపాదించేవారు.

శ్రీఅరవిందులు

కోరిక యోగులకు వినాశహేతువు

ఎందరో యోగులకు కోరిక వినాశహేతువైనది. ఆ జాడ్యం ఎంత కాలమైనా అలా దాగి ఉంటుంది. ఉన్నట్లు తెలియకుండానే యోగ మార్గంలో చాలమంది పయనిస్తూంటారు. శక్తులు సంతరించుకున్నాక అప్పుడు మొలకెత్తుతుంది. వారిలో కోరిక – మరీ ఉద్ధృతంగా ఎందుకంటే మొదట్లోనే దానిని తుంచిపారవేయకపోవటం వల్ల.

అద్భుతశక్తులు పొందిన ఒక యోగి కథ ఇది: ఆయన శిష్యులు ఆయన్ని ఒక విందుకు ఆహ్వానించారు. ఎత్తు తక్కువైన

ఒక భోజనాలబల్ల పై విందు ఏర్పాటు చేశారు. అపుడు శిష్యులు తమ గురువుని తమ తపోమహిమ ఏమైన చూపమని ప్రాధేయపడ్డారు. అది కూడదని గురువుకి తెలుసు. మోహం బీజప్రాయంగా ఆయనలో నాటుకుని ఉంది. అనుకున్నాడు ఆయన: "ఇదేమీ పాపకార్యం కాదు కదా! ఇలాంటి విషయాలు సాధ్యమేనని నిరూపించటంవల్ల భగవంతుని గొప్పతనం వారికి తెలియపర్చడమవుతుంది" – అనుకుని వారితో అన్నాడు – "బల్లను తొలగించండి. బల్లను మాత్రమే. బల్లపై వున్న గుడ్డను ఎలా ఉన్నది అలానే ఉంచండి – దానిపై వడ్డించిన భోజనాలతో సహా" "ఓ! అలా చేయటానికి వీల్లేదు. అంతా క్రింద పడిపోతుంది" అన్నారు శిష్యులు. ఆయన మాత్రం గట్టిగా నొక్కి చెప్పారు. శిష్యులు గుడ్డను యథాతథంగా ఉంచి బల్లను తొలగించారు. ఏమి ఆశ్చర్యం! గుడ్డ, గుడ్డ పైన ఉన్నవి అన్నీ అలానే ఉన్నాయి – బల్ల అడుగున ఉన్నట్లుగానే ఉన్నాయి. శిష్యులు ఆశ్చర్యపోయారు. కాని గురువు ఉన్నట్లుండి ఒక్కమారు బయటకు ఒక గంతువేసి పరుగెత్తాడు – ఆర్తనాదం చేస్తూ. "ఇక ఎన్నడూ నాకు శిష్యుడనేవాడు ఉండకూడదు. మరెన్నడూ! ఏమి నా దౌర్భాగ్యం! నా దైవాన్ని మోసగించాను" హృదయంలో మంట చెలరేగింది. తన దివ్యశక్తులు స్వార్థానికి వినియోగించారు.

శక్తుల ప్రదర్శన ఎన్నడూ చేయకూడదు. అలాని అవి నిరుపపయోగమనీ కాదు. అవెలా సమకూడినవో అలానే వినియోగించాలి. దైవానుసంధానంతో అవి లభ్యమవుతాయి. దైవేచ్ఛతోనే వాటిని వినియోగించాలి. ప్రదర్శనగా మాత్రం కాదు. ఒక గ్రుడ్డివాడు నీకు తారసిల్లినపుడు. ఆతనికి దృష్టినిచ్చే శక్తి నీకున్నప్పుడు, ఆతనికి దృష్టి రావటం దైవసంకల్పమైతే, నీవు ఒక్క మాట అనాలి – "అతను చూడనీ" అతను చూస్తాడు. నీవాతనికి చికిత్స చేయగోరి ఆతనికి కళ్లు వచ్చేటట్లు చేస్తే నీకున్న శక్తిని నీ వ్యక్తిగత కోరికను సంతృప్తిపరచటానికి వినియోగించినవాడవు అవుతావు. ఇలాటి సందర్భాలలో నీవు సర్వసాధారణంగా నీ శక్తులను పోగొట్టుకుంటావు. అంతే కాదు. ఆ వ్యక్తిలో

ఓ గొప్ప అలజడిని సృష్టించినవాడవు అవుతావు. చూడటానికి రెండు మార్గాలు ఒకేలా అగుపిస్తాయి. కాని ఒక విషయంలో దైవేచ్ఛకు అనుగుణంగా, మరో విషయంలో వ్యక్తిగత ప్రేరణవల్ల ప్రవర్తిస్తావు!

మానవసేవపట్ల వ్యామోహం, శిష్యబృందం కావాలనే కామన

మానవసేవ చేయాలనే భావం అతిసామాన్యమైన కోరికలలో ఒకటి. అలాటి సేవాకార్యక్రమాలకి ఆకర్షితులవటం వ్యక్తిగత వ్యామోహం. తనవద్ద ఒక గొప్ప సత్యము ఉన్నది. అది నలుగురికి తెలియపర్చాలి. అందుకు శిష్యబృందం కావాలి – అనుకొనే వ్యక్తి స్పష్టంగా తన వ్యక్తిగతవ్యామోహానికి వశుడై వర్తిస్తున్నాడు. శిష్యులు తన నుంచి జారుకుంటే కలతపడతాడు. ఎవరేనా కనిపిస్తే పట్టుకుని శిష్యునిగా వశం చేసుకోవాటానికి ప్రయత్నిస్తాడు.

దివ్య ఆదేశాన్ని అనుసరించేందుకు నువ్వు సిద్ధంగా ఉంటే నీకేపని వప్పగింపబడినా దానిని నిర్వహించాలి – అది ఎంత జటిలమైనదేనా కానీ. పనిని ఎంత నిశ్చలంగా చేపట్టావో అంత నిర్మోహమాటంగానూ వదిలిపెట్టివేయగలగాలి. ఏదో బ్రహ్మాండమైన బాధ్యత నిర్వర్తిస్తున్నాననే భావన నీలో రానీయకూడదు. ఎలాటి పని అయినా, ఏ విషయం పట్ల అయినా వ్యామోహం తగదు. పరిపూర్ణంగా విముక్తుడవై ఉండాలి. దైవానుగ్రహం సమకూడినది స్వీకరించటం, విడిచిపెట్టవలసినపుడు అదే మనస్తత్వంతో విడిచిపెట్టివేయటం – ఇదీ నిజమైన యోగదృక్పథం. 'నాకేమీ అక్కర్లేదు' అనే సన్యాసి, 'నాకిది కావాలి' అనుకునే సంసారి వీరిద్దరి మనోవైఖరి ఒక్కటే. సన్యాసి పరిత్యాగానికి, సంసారి వశం కావించుకునేదానికి వశులు. దైవం నీకేది సమకూరుస్తే దానిని స్వాగతీకరించాలి. గుప్తకామనలనుంచి విషయాలు ఉద్భవిస్తాయి. కామనలు సుప్తచేతనలో ప్రవర్తిస్తాయి. నీవు వాటిని గమనించలేవు. అవి దైవసంభూతములు కావు. మారువేషంలో వచ్చే దొంగకోర్కెలు.

పూర్ణయోగంలో గురువు

పూర్ణయోగంలో గురువు మనలోని అంతరంగ ఉపదేశకుని విధానమునే వీలైనంతవరకూ అవలంబిస్తాడు. శిష్యుని స్వభావానికి అనుగుణంగా అతనిని ముందుకు నడిపిస్తాడు. బోధన, వ్యక్తిగత ఆదర్శం, ప్రభావము – ఈ మూడూ గురువునకు ఉపకరణాలు. గ్రుడ్డిగా అంగీకరించేందుకు గ్రహణశక్తిగల బుద్ధిమంతుడు లభించాడు కదా అని వివేకవంతుడైన ఏ గురువు తన అభిప్రాయాలతో అతనిని ప్రభావితం చేసే ప్రయత్నం చేయటానికి సిద్ధపడడు. దివ్యపోషణలో వర్ధిల్లి తప్పక బీజం సఫలప్రదమవుతుందనుకున్నట్లుగా భావిస్తేనే తాను కలుగచేసుకుంటాడు. బోధన కన్న, బుద్ధిని జాగృతం చేయటానికే ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటాడు. నిగూఢశక్తులు, అనుభవాలు, సహజప్రక్రియ ద్వారా స్వేచ్ఛగా విస్తృతమయి పెంపొందించాలనే లక్ష్యంతోనే ఉంటాడు. సహాయంగా ఒక కార్యాచరణ విధానాన్ని సద్వినియోగసాధనాన్ని అందిస్తాడు. అదేమీ తప్పక పాటించవలసిన సూత్రంగా ఉండదు. నిర్దిష్టమైన, స్థిరమైన నిత్యకృత్యంగా కూడా ఉండదు. యాంత్రిక ప్రక్రియ కాకుండా, పరిమిత సాధనంగా ఉండకుండా జాగ్రత్త తీసుకుంటాడు. ఆతని వ్యవహారశైలి అంతా దివ్యకాంతిని ఉద్దీపనం చేయటం, దివ్యశక్తిని ప్రచోదింపచేయటం వరకే. తానైతే కేవలం ఒక సాధనంగా, సహాయకుడుగా, వాహికగా మిగిలి ఉంటాడు.

ఆదేశంకంటే ఆచరణ ఎంతో శక్తివంతమైనది. అయితే ఇది బాహ్యాచరణల ఆదర్శంకాని, వ్యక్తిగతయోగ్యత, విశిష్టతల ఆదర్శంకాని కాదు. ఇవీ అమూల్యమైనవే. వీటి స్థానం, వీటి ఉపయోగం వీటికున్నవి. అన్నిటికీ మించి ఇతరులలో ఆకాంక్షను ప్రేరేపించే ప్రముఖమైన యదార్థం ఒకటి ఉన్నది. అదే – అంతరంగాన్ని, అంతర్గతస్థితిని కార్యకలాపాలని నిర్దేశించే ఆత్మసాక్షాత్కారం – the divine realisation. ఇది అత్యావశ్యకము, విశ్వజనీనము అయిన మూలకం. మిగిలినదంతా వ్యక్తికి, బాహ్యాపరిస్థి

తికి సంబంధితమైనది. ఇదిగో ఈ గమనశీలమైన (దివ్య) సిద్ధియే సాధకునికి అనుభావ్యం కావాలి. స్వాభావికంగా తనలో పునరుత్పన్నం కావాలి. ఇతరులను బాహ్యంగా అనుకరించి శ్రమపడనక్కర్లేదు. ఇది నిస్సారమైనది. సఫలీకృతం కానిది. అనుకరణకంటే (ఆధ్యాత్మికశక్తి) ప్రభావం ప్రముఖమైనది.

ప్రభావం అంటే శిష్యునిపై గురువుయొక్క బాహ్య అధికారం కాదు. ఆయన ఉనికి, సామీప్యత, సంసర్గం – వీటి శక్తి, పరస్పర ఆత్మానుబంధం – ఇదీ. ఇది గురువుయొక్క నిశ్శబ్ద ప్రభావం. ఆయన కూడా నిశ్శబ్దంగానే ఉంటాడు. ఆచార్యునికిది సర్వోన్నత సూచన; గుర్తు. ఉత్కృష్టమైన ఆచార్యుడు ఉపదేశకుడే కాదు. ఆయన దివ్యసన్నిధియే దివ్యచైతన్యలహరులను ప్రవహింపచేస్తుంది. ఆయన చుట్టూ, వారి సన్నిధిలో ఉన్నవారికి, అందుకోగలగాలే కాని, అందుకోగలిగేవారికి, వారి స్వచ్ఛమైన శక్త్యానంతకాంతులు సంధానపరుస్తుంది.

పూర్ణయోగంలో ఆచార్యునికి మరో లక్షణం ఉంటుంది. ఆయనకు గురువుననే అహంకారం, గర్వం ఉండదు. ఉన్నతుడననే అతిశయం ఉండదు. విశ్వాసం పొందిన నమ్మకస్తుడు. తానొక వాహిక. ఒక ప్రవక్త. ఒక ప్రతినిధి. ఆయన పని ఏమైనా ఉంటే, అది పైనుంచి వచ్చిన ఆస్తి. A trust from above. సాటివారికి సహకరించే వ్యక్తి a child leading children. దివ్వెలను వెలిగించే దివ్యజ్యోతి. (The Sun from which we kindle all our suns – *Savitri*) నిద్రాణంగా ఉన్న జీవాత్మలను మేల్కొల్పే జాగృతమైన ఆత్మ (an awakened Soul) ఉన్నతోన్నతస్థాయిలో దివ్యశక్తుల నధీనంలో ఉంచుకుని ఉన్న దివ్యసాక్షాత్కారం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ప్రభూ! నాకున్న పరిమితులకు నేను దుఃఖిస్తాను. కానైతే, వాటి ద్వారానే, వాటి ఆధారంగానే, మనుష్యులు నీదరికి చేరగల్గుతారు.

అవి లేకుండా నీ దరి చేరే వీలులేకుండా నీవు సుదూరంగా అసలు శరీరధారివి కానట్లుగానే ఉండి ఉండేవాడివి.

అందువల్లనే అవి కల్పించే ప్రతి పురోగమనమూ నాకు నిజమైన విముక్తి. నీ దరికి చేరే ప్రతి ముందడుగూ, ఒక్కొక్క ప్రతిబంధకాన్నీ వదల్చుకునే హక్కును, నాకు అవి కల్పిస్తాయి. నిన్ను మరింత వాస్తవంగా, పరిపూర్ణంగా అభివ్యక్తీకరింప చేస్తాయి.

అయినప్పటికీ ఈ ప్రతిబంధకాలు సడలింపబడగలిగేవే. అయితే అపుడు మాత్రము, ప్రభూ, తమ అంతరంగంలో కాని, విశ్వంలో కాని, ఒక్క పర్యాయమైనా, నీతో తాదాత్మ్యతాభావాను భూతి పొంది ఉన్నవారిని మాత్రమే నా దరిని ఉంచుకోవలసి వచ్చేది. ఎందుకంటే ఈ తాదాత్మ్యత మా యోగానికి అత్యావ శ్యకమైన ఆధారం; ఇందుకు ఇది ప్రాతిపదిక.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దివ్యోపదేశకుని కృప, సహకారము

గురువుయొక్క సహకారము

అత్యంత కష్టసాధ్యమైన ఈ ప్రయత్నంలో (యోగసాధనలో) దైవంతో తాదాత్మ్యతానుభూతిని పొంది, ఆ దైవానికి ప్రాతినిధ్యం వహించగలిగిన (గురువు) వారి యొక్క మార్గదర్శకత్వము అత్యంత ఆవశ్యకము.

నీకు మార్గం చూపే గురువు కేవలం మార్గదర్శి మరియు సహాయకుడు. ఆ గురువుకు కొన్ని పరిమితులు ఉన్నాయి. అద్వైతి మరియు భౌద్ధమాతవలంబి చెప్పినట్లు నీకెవరు సాయం చేయలేరనీ, నీ స్వశక్తి మీదనే నీవు ఆధారపడాల్సి ఉంటుందనీ కొన్ని యోగమార్గాలు చెప్తాయి. కాని ఎంతో నిజాయితిగల అద్వైతి కూడా వాస్తవానికి గురువు మీదనే ఆధారపడతాడు.

అంతేకాదు. బౌద్ధమతావలంబి కూడా '*బుద్ధం, శరణం. గచ్ఛామి*' అంటూ వారి ముఖ్యమంత్రం మీదనే ఆధారపడి ఉంటాడు. ఇతర యోగసాధన మార్గాలలో ముఖ్యంగా భగవద్గీతా మార్గంలో జీవాత్మయొక్క నిత్యసత్య భగవదంశ యదార్ధమని నమ్ముతోంది. అంతేకాక భగవంతుడు మరియు భక్తుడు ఇద్దరూ వాస్తవమేనని, గురువు మీద ఆధారపడడం తప్పనిసరి అని నమ్ముతోంది.

ఈనాటి వరకు, ఏ ముక్తపురుషుడు గురువుయొక్క అవసరమును కాదనలేదు. మానసిక, ప్రాణికస్థాయిలలో నివసించేవారు మాత్రమే, మానసికంగా గర్వితులై లేదా ప్రాణిక స్వాతిశయానికి లోనై గురువును అంగీకరించడమనేది తమ స్థాయికి తగదని భావిస్తారు.

*

యోగములో ఇదంతా సర్వసాధారణమే. గురువుయొక్క స్పర్శ లేదా అనుగ్రహం (శిష్యునిలో) ఒక విధమైన వికాసమును గొని వస్తుంది. అయినా మార్గములోని ఆటంకాలను, అధిగమించేందుకు చేయాల్సింది మిగిలే ఉంటుంది. వాస్తవం ఏమిటంటే చైతన్యం యొక్క ప్రభావమును ప్రసరింపచేసి, సర్వసమర్పణము సాధ్యమైనప్పుడు ఈ ఆటంకములు ఏమాత్రం మార్గమును నిరోధించలేవు. అవి కేవలం పైకి కనిపించే అసంపూర్ణతలు. అవి కూడా అనుగ్రహము పనిచేయుట ప్రారంభించగానే అంతర్ధానమైపోతాయి.

*

ద్విముఖముగా పనిచేయు అనుగ్రహము

గురుశిష్యుల మధ్యనున్న స్పర్శచేత ప్రధాన ప్రతిబంధకం తొలగిపోగలదు అను మాట యదార్థం. కాని అసలు అనుగ్రహం అంటే ఏమిటి? అది సాధారణంగా గురువుద్వారా ప్రసరించే ప్రేమానురాగాలు అనుకుంటే అది శిష్యునకు ఎప్పుడూ అందుతూనే ఉంటుంది. శిష్యునిగా అంగీకరించగానే అనుగ్రహం అనేది శిష్యుడు స్వీకరించేందుకు అందుబాటులోకి వస్తుంది. కాని అనుగ్రహం అనేది నేరుగా దైవంనుండి లభించినా లేక గురువు ద్వారా అందు

బాటులోకి వచ్చినా అది ఇంద్రియగోచరమయ్యే ఒక ప్రత్యేకతతో, ద్విముఖములుగా కలిగి ఉంటుంది. భగవంతుని లేదా గురువు యొక్క అనుగ్రహం – వాస్తవానికి రెండూ కలిసే ఉంటాయి – ఒక వైపు, దానిని స్వీకరించగల శిష్యునిస్థాయి మరొకవైపు, (దానిని స్వీకరించే స్థాయిని దీర్ఘమైన తపస్సు ద్వారా సాధించుకోవాలి) అతనిలో ఏమాత్రం చలించని – ఎప్పుడైన చిన్న చిన్న స్పందనలు ఉంటే ఉండవచ్చు గాక – విశుద్ధత ఏర్పడినప్పుడు అది అకస్మాత్తుగా ఏ ముందస్తు హెచ్చరికలు లేకుండానే వస్తుంది. శ్రీరామ కృష్ణ పరమహంస చెప్పినట్లు ఇదంటూ జరిగితే ఒక్కసారిగా మౌలికమైన ఆటంకాలన్ని అంతర్ధానం అవుతాయి. లేదా కనీసం మిగిలిన సాధన అంతా – అదెంత కాలమైనా పట్టవచ్చును – సాఫీగా, సజావుగా, సాగిపోయేందుకు దోహదం చేస్తుంది.

ఈ అసందిగ్ధ అనుగ్రహస్పర్శ అనేది *'మార్జాలకిశోర పద్ధతి'* సిద్ధమయ్యే ఉంటుంది. అంటే ఆత్మసమర్పణ చేసుకొన్నవారికి అది అవలీలగా లభిస్తుంది. ఆత్మసమర్పణ ద్వారా సచేతనముగా గురువు లేదా దైవంపై ఆధారపడనేర్చినప్పుడు మనఃప్రాణప్రవృత్తులను సైతం అదుపులోకి తేజాలిన దాని ప్రభావం వలన సాధనలోని మౌలిక ప్రతిబంధకాలన్నీ పటాపంచలుకాక తప్పదు. ఇంకా మరికొన్ని చిన్నచిన్న అవాంతరాలున్నా అవి సరిచేసుకోవలసినవే తప్ప వాటిని గురించి పెద్దగా పట్టించుకోవాల్సింది ఏమీ మిగలదు. ఈ పద్ధతిలో (మార్జాలకిశోరం) ఏ తపశ్చర్యను ఆశ్రయించాల్సిన పని ఉండదు. తనను నడుపుతున్నట్లు, భావించుకొనే దివ్యశక్తికి తనను తాను సర్వము నివేదించుకొంటూ, దాని ఆదేశమును అనుసరించేందుకు సిద్ధంగా ఉండటం, – సాధించాల్సిన పరివర్తనను ఆ శక్తియే నెమ్మదిగానో, త్వరితముగానో సాధించడం జరుగుతుంది – ఈ మార్పు నెమ్మదిగానా, త్వరితముగానా అనేది, అతడు పట్టించుకోడు. ఎందుకంటే, ఆ మార్పు తప్పకుండా వస్తుందనే నమ్మకం అతనికి ఉంటుంది. తపస్సు అనేది (స్వప్రయత్నం) అవసరమైనప్పటికీ అదొక అసాధ్యమైనది కాదనే ఉత్సాహంతో అలవోకగా దానిని చేపడతాడు.

ఇక మిగిలిన వారిలో అది '*మర్కటకిశోర*' పద్ధతి అనుసరించేవారు ఎక్కువ స్వతంత్రముగా వ్యవహరిస్తారు. వారు స్వతంత్ర అభిప్రాయాలు కలిగి తమదైన సాధనా పద్ధతిని అనుసరిస్తారు. అప్పుడప్పుడు కొంతమేర గురువు సహాయసహకారాలను అర్థిస్తారు. ఇలాంటివారి విషయంలో కూడా గురుకృప ఉండనే ఉంటుంది. అయితే అది వారి స్వప్రయత్నానికే విశేష ప్రాధాన్యత నిచ్చి వారి స్వభావానికి అనుగుణంగా పనిచేస్తుంది. వారిని అది కనిపెట్టుకునే ఉంటుంది. కష్టకాలములో ఆదుకుంటూనే ఉంటుంది. అపాయంలో కాపాడుతూనే ఉంటుంది. అయినా సాధకుడు తను స్వప్రయత్నములోనే నిమగ్నుడై ఉన్న కారణంగా, అతనికి ఇదేమి తెలియకపోవచ్చు. అయితే ఇలాంటివారికి మౌలికమైన ప్రతిబంధకాలు తొలగిపోయి మార్గం సుగమం అయ్యేందుకు కొంత దీర్ఘకాలం పట్టడం తప్పనిసరి. అది వారి మానసికస్థితిని బట్టి ఉంటుంది.

ఏదో విధంగా గురుకృప అందరిలోను పనిచేస్తూనే ఉంటుంది. తిరుగుబాటు చేసిగాని. స్వతంత్రతను ప్రకటించుకొనిగాని, తన అంతరాత్మను తనకు దూరం చేసుకొనే విద్రోహ ప్రవృత్తి ఫలితంగాకాని, శిష్యుడు దూరంగా జరిగితే తప్ప అది శిష్యుని ఎన్నడూ విడచిపెట్టదు. అలాంటి సందర్భాల్లో సైతం ఆత్మద్రోహం మితిమీరిపోతే తప్ప గురుకృపను తిరిగిపొందడం అసంభవమేమీ కాదు.

*

బాహ్యంగా మంత్రోపదేశ స్వీకారం

సాధారణముగా దైవమునకు ప్రాతినిధ్యము వహించు శబ్దబ్రహ్మ (మంత్రము) ఆత్మవికసనానికి ఉపకరణంగా అవసరమవుతుంది. ఆ శబ్దము గతించిన కాలమునకు సంబంధించినది (ఉపదేశ వాక్యము లేక మంత్రము) కావచ్చు. ఇప్పుడు జీవించివున్న గురువుకు చెందిన అత్యంత శక్తివంతమైన వాక్కు కావచ్చు. కొన్ని సందర్భాలలో ఈ శబ్దం అంతరంగములోనున్న శక్తిని మేలుకొ

ల్పేందుకు కేవలం నిమిత్తమాత్రంగా మాత్రమే తీసుకోబడవచ్చు. సర్వజ్ఞుడు, సర్వశక్తుడు అయిన దైవము, లోకమర్యాదను పాటించేందుకు మంత్రోపదేశం పొందినట్లు అగుపడవచ్చును. అందుకే ఉపనిషత్తులలో దేవకీనందనుడైన కృష్ణుడు ఘోరుడనే ఋషివద్ద ఉపదేశమును పొంది, జ్ఞానసిద్ధిని పొందినట్లుగా చెప్పబడింది. అలాగే శ్రీరామకృష్ణ పరమహంస జ్ఞానరహస్య సంసిద్ధిని, కేవలం తన అంతరంగంలోని జ్యోతినుండి పొందిగూడా, వివిధ మార్గములందు, అనేకమంది గురువులను అంగీకరించడం జరిగింది. ఇదంతా జ్ఞానమును సంపాదించుటకై గురుశిష్య సంప్రదాయమును పరిరక్షించడం కోసం ఆయన అలా చేసినట్లు ఋజువగుచున్నది.

కాని, సాధారణంగా సాధకుని జీవితంపై ప్రత్యక్ష గురువు యొక్క ప్రభావమే ఎక్కువగా ఉంటుంది. అయితే పూర్వయోగుల అనుభవ సంపద, గ్రంధస్థమొనరింపబడిన శాస్త్రోపదేశమే సాధనకు ఆలంబనమైనప్పుడు, కేవలం స్వప్రయత్నంతోగాని, గురువు మార్గదర్శకత్వముతోగాని దానిని ఆచరించవచ్చును. ఆయా సందర్భాలలో ఆధ్యాత్మికజ్ఞానమును శాస్త్రపాతిప్రదిత సత్యములను ధ్యానము ద్వారా స్వంతం చేసుకోవచ్చు. ఆ విధంగా శాస్త్రముల చేగానీ, సంప్రదాయములలోగానీ చెప్పబడిన సత్యములను, గురువుల సహాయముతో ఫలితాలను పొందుతూ కొనసాగించవచ్చును. ఇది ఒకింత ఇరుకుబాట అనే మాట నిజమేగానీ, నలుగురూ నడిచిన బాటగా చిరపరిచితమైన దైనందున ఉన్నంతలో భద్రమైనది, ఫలప్రదమైనది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కొంగర భాస్కరరావు

గురువు గూర్చిన సద్భావన

గురువు పట్ల భక్తివిశ్వాసాలు ప్రతి శిష్యునికి అవసరం

సద్గురువులందరూ సమానమే. గురువు ఎప్పుడూ ఒక్కరే. ఎందుకంటే గురుస్సాక్షాత్పరబ్రహ్మ కదా! ఇది మౌలికమైన విశ్వజనీన ఏకైక సత్యం. వైవిధ్యమైన మరొక సత్యం కూడా ఉంది. దైవం వివిధ వ్యక్తిత్వాలతో, భిన్నమనస్సులతో, బోధనలతో, ప్రభావాలతో విలసిల్లి ఉంటాడు. అందువల్ల ఆయన ప్రత్యేకమైన అవసరములు, గుణములు, భవితవ్యములు కలిగిన విభిన్న పద్ధతుల్లో రకరకాలుగా ఆవిష్కరింపచేస్తాడు. గురువులంతా దైవ స్వరూపులే కాబట్టి శిష్యుడు, తనకి తగిన గురువును వదలి మరో గురువును అనుసరించడం తగదు. అలా ఉన్నతిని పొందడు. భారతీయ సంప్రదాయ రీత్యా గురువుపట్ల భక్తివిశ్వాసాలు శిష్యునికి అవశ్యం. తన ప్రధాన కర్తవ్యం. 'గురువులందరు సమానమే' అన్నది ఆధ్యాత్మికసత్యం. కాని దీనిని అనాలోచితంగా ఆచరణలో పెట్టరాదు. అందరు ఒకే బ్రహ్మమే కదా అని అందరిపట్ల ఒకేరీతిగా వ్యవహింపదగదు. అలా వ్యవహరిస్తే తికమకపడి విచారకరంగా కష్టాలపాలవుతారు. మానసికహేతువాదం అలాంటి కష్టాలపాలు చేస్తుంది. ఆధ్యాత్మిక విషయాల్లో మానసికతర్కం పొరబాట్లకు తావిస్తుంది. ఆధ్యాత్మిక విషయాల్లో అంతఃస్ఫురిత జ్ఞానము, విశ్వాసము, మృదులమైన ఆధ్యాత్మిక విచారణ, మార్గదర్శకాలు కావాలి.

2. ఆధ్యాత్మిక విశ్వాసమంటే చంచలమైన మనోవిశ్వాసం కాదు. మానసిక విశ్వాసం వేరు. కాని అతి నమ్మకము అవ్వదు. అది దానికి బాహ్యరూపం మాత్రమే. బాహ్యరూపమైన శరీరం మారవచ్చు. కాని ఆత్మ మారదు. అలాగే ఆధ్యాత్మిక నమ్మకం కూడా. నమ్మకం అంటే ఆత్మాశ్రయమైనది. అది హేతువుగా బాహ్యమనోభావనలపై, పరిస్థితులపై ఆధారపడి వుండదు. ఈ ఆత్మవిశ్వాసం లోన అంతర్నిహితంగా ఉంటుంది. తాత్కాలికంగా

నశించిపోయినట్లుగా మరుగు కావచ్చు. నశించిందన్న భావన కలుగనూ వచ్చు. ఐనా అది ఆత్మలో ఇంకా ఇంకా ప్రజ్వలిస్తూనే వుంటుంది. మనస్సు చలించే సందేహ కడలితరంగం కావచ్చు. ఐనా దానిలో లోపల నమ్మకం (విశ్వాసం) వుంటుంది. ఆ నమ్మకం సందేహాస్పదంగానే ఉన్నా విధి నిర్దిష్టమైన గమ్యం వైపు కొనసాగిస్తూనే వుంటుంది. నమ్మకం ఆధ్యాత్మిక ఆత్మవిశ్వాసం. అది దైవ ఆదర్శం. ఆత్మలక్షణం. ఆ నమ్మకం జీవితంలో నిరాశాజనిత పరిస్థితుల వల్ల నెరవేరకపోవచ్చు. కాని అదలానే అంటిపెట్టుకొని ఉంటుంది. మానవజీవితంలో ఇది సాధారణ అనుభవమే. అలా కాకపోతే మనిషి మారే మనస్సు మాయాజాలంలో ఆటబొమ్మగా మిగిలిపోతాడు.

*

చైత్యపురుష ఉన్మీలనము – విశ్వాసము – ఆత్మసమర్పణము సాధనయొక్క పురోగతిని వేగిరపరుస్తాయి

ఆతని ఉత్తరాలు శ్లాఘనీయమైన వర్తమానభావనల, సాధారణ సంస్కార సంగ్రహాలని నాకు తోచడం లేదు. భావాలనుండి సంస్కారాల నుండి పూర్తిగా వైదొలగిన నూతన జ్ఞానమూలం నుండి దర్శించే అతని శక్తి శ్లాఘనీయమనిపించినది. అతడు వర్తమాన మానవచలితచాలనములతో సంసర్గం కలిగి ఉండివుంటే రోమరోలాకన్న ఉన్నతంగా వాటిని మలచి వుండేవాడని నేను భావించను. అతడు వాటిపట్ల యోగదృష్టితో ఉన్నత దృక్పథంతో కార్యనిర్వహణ చేయగలిగినాడని నాకు తోస్తున్నది.

యోగానికి అతని అర్హత, ఆధిక్యతలను ఆధారంగా అతని పురోగతిని నేను వివరించడం లేదు. కాని అతడు తన ఆంతర్యంలో భక్తునిగను, శిష్యునిగను త్వరగా రూపుదిద్దుకొనడాన్ని నేను వివరిస్తాను. ఈ గుణం ఆధునిక మనస్సుకు – అతడు యూరోపియన్ అయినా లేదా భారతీయ విద్యావంతుడైనా – అరుదైన సంభావ్యత. ఎందుకంటే ఆధునిక మనస్సు విశ్లేషనాత్మకము, సందేహాత్మకము, సహజంగా స్వతంత్రమునైనదిగా వుంటు

న్నది. అది అలాగాక మరోలా ఉండదలచినా – దివ్యశాంతితో అది ప్రభావితమయినా – వెనుకంజ వేస్తుంది. "నేను నీలో ప్రవేశించి నా సర్వస్వాన్నీ త్యజిస్తానని, నా చేతనను దివ్యమార్గంలో రూపుదిద్దుకొంటానని" పలుకుతు అది ఆ వెలుగులోనికి దుమకదు. సంపూర్ణ ఆత్మసమర్పణకు సంసిద్ధంగా మనలో ఒక తత్వం ఉంది. కాని మనలోనే దానికి భిన్నమైనదై సమర్పణకి అడ్డుపడే మరో గుణం కూడా ఉంది. సమగ్ర సమర్పణకు సంపూర్ణ సత్యాన్ని ఆకళించుకున్న మాలాంటి కొందరికి ఆ దారి చేరువుగ, సులువుగ అయినదేకాని, తక్కినవారెల్లరకు అది సుదూరమై, పలుచిక్కులకు ఆలవాలమై ఉన్నది. ఆతను ఈ భయంకర ఆటంకాలను సులభంగా అధిగమించినందుకు నేను హర్షిస్తున్నాను.

అతని గురువులో ఏ రకంగానైనా స్వల్పలోపం ఉందేమో నాకు తెలీదుకాని, అతనికి ఉన్న దృక్పథంవల్ల ఆతనిలో లోపాలు ఏమైనా ఉన్నా, అవి పట్టించుకోనక్కర్లేదు. శిష్యుని సాధనామార్గంలో అతనిలో కలిగిన చైత్యపురుష ఉన్మీలనము, అతని విశ్వాసము, ఆత్మసమర్పణములే ప్రధానములు కాని, అతని గురువు యొక్క మానవ బలహీనతలు అతనికి ఆటంకాలు కానేరవు. గురువు తన వ్యక్తిత్వము లేదా ఆధ్యాత్మిక సంభావ్యతలకు అనుగుణంగానే శిష్యునికి ఒక మార్గదర్శకుడుగా, ప్రతినిధిగా వుండగలుగుతాడు. ఆ గురువు ఎవ్వరైనా శిష్యుడు ఉన్మీలితుడయ్యేది ఆయన యందలి దైవానికే. దైవానుగ్రహాన్ని పొందగలిగే అంతస్చేతన, అచంచల విశ్వాసము, సంపూర్ణ ఆత్మసమర్పణ శిష్యుడు కలిగి ఉంటే చాలు. అతని గురువు (పరుల దృష్టిలో) అతని కన్న ఆధ్యాత్మికంగా తక్కువ స్థాయిలో ఉన్నా, గురువులో ఉన్న దైవంవల్ల అతడు దైవానుగ్రహాన్ని పొందగల్గుతాడు.

*

ఆతను ఆది నుండి ఆ విధంగా చేసి ఉంటాడు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఆత్మసమర్పణభావన ఎంతో కష్టంగా, ఎంతో నిదానంగాకాని సమకూరదు. నా స్వంత విషయంలో కూడ నా అంతర్జీవితం యొక్క మలుపు ఇలానే జరిగింది. నా ఆధ్యాత్మిక మార్గ

దర్శి, మేధాసంపదలో, విద్యలో, ఆధ్యాత్మికతలో నాకన్న తక్కువ తరగతికి చెందినవారు. కాని నేను ఆయన వెనక ఒక శక్తిని దర్శించి సహాయానికై ఆయన వైపు మళ్ళినాను. ఆయనకు సంపూర్ణంగా ఆత్మసమర్పణ గావించుకొన్నాను. ఆయన ఆదేశానుసారం సాధన చేశాను. ఆ తర్వాత ఆయనే ఇతరులతో తాను అదివరకు నాలా నిస్సందేహంగా సమగ్ర ఆత్మసమర్పణ గావించుకొన్నవారిని చూచి ఉండలేదని ఆశ్చర్యంతో పలికారట. నా ఆత్మసమర్పణ ఫలితంగా నాలో తీవ్రమైన ఆధ్యాత్మిక రూపాంతరీకరణం కల్గింది. అంతట నా మార్గదర్శి నేను తనకు చేసికొన్నంతటి సంపూర్ణ ఆత్మసమర్పణమునూ, నా లోపలి గురువుకు (దైవానికి) గావించుకొమ్మని సలహా నొసగినారు. ఆధ్యాత్మిక సాధనా ఫలితాలు ఎలా జరుగుతాయో తెల్పడానికే నేనీ దృష్టాంతాన్ని తెల్పినాను. మానవుని హేతువాదానుగుణంగా అవి చేకూరవు. అవి అత్యంత రహస్యంగా ఒక ఉన్నత శాసనానుగుణంగానే సిద్ధిస్తాయి.

*

విశ్వాసము, భక్తి, సక్రమ దృక్పథము – వీటి శక్తి

నీవు నీ కన్నను, ఇతర గురువుల కన్నను, ఆధ్యాత్మికంగా తక్కువ స్థాయిలో నున్నవారిని గురువుగా ఎన్నుకున్నా, ఆయన పట్ల భక్తివిశ్వాసాలతో పాటు ఆధ్యాత్మిక గ్రహణశక్తి కలిగి ఉన్నట్లయితే, నీ గురువు ద్వారానే దైవంతో సంబంధాన్ని పెంపొందించుకొని గురువుకన్న ముందే ఆధ్యాత్మిక అనుభూతులను, సాక్షాత్కారాన్ని పొందగలుగుదువు. 'ఐతే' అన్న షరతును గుర్తించడం అవసరం. ప్రతి శిష్యుడు ప్రతి గురువుపట్ల అలా ప్రవర్తింపజాలడు. కపటి నుంచి కపటత్వాన్నే పొందగలవు.

గురువు శిష్యుని దైవంతో అనుసంధించగల ఏ కొద్దిపాటి ఆధ్యాత్మికశక్తైనా కలిగి ఉండాలి. అతనిలో ఆధ్యాత్మికమనేది ఏమీ లేకపోతే అతడు గురువనిపించుకోడు. అట్టివాడు కపట గురువగును. ఒక గురువుకు మరొక గురువుకు మధ్య నిస్సందేహంగా తేడాలుంటాయి. కాని గురుశిష్యుల మధ్యగల అంతరంగ

సంబంధాలపై ఫలితం ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి గొప్ప ఆధ్యాత్మిక సంపన్నుడైన గురువు వద్దకు వెళ్ళి, ఆధ్యాత్మికంగా ఏమీ పొందలేకనూ పోవచ్చు. లేదా ఏ కొద్దిగనో పొందవచ్చు. అలానే మరొకరు తక్కువ ఆధ్యాత్మశక్తి గల గురువు వద్దకు వెళ్ళి ఆయన ఇవ్వగలిగినంతా లేదా మరింత ఎక్కువగను ఆధ్యాత్మికశక్తిని పొందనూవచ్చు. ఈ అసమానతలకు కారణాలు భిన్నములు, సూక్ష్మములు. వాటిని గూర్చి నేనిక్కడ విస్తరింపనవసరం లేదు. అది వ్యక్తికి వ్యక్తికి మధ్య తేడాతో ఉంటుంది. శిష్యుడు స్వీకరించగలిగితే లేదా స్వీకరించ సిద్ధంగా ఉంటే, గురువు తానివ్వగలిగినంతా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాడని నేను నమ్ముతాను. శిష్యపరమాణువు గురుదేవుడు ప్రసాదించే ఆధ్యాత్మిక అనుభవాన్ని స్వీకరింప తిరస్కరించినా లేదా స్వీకరింప అసాధ్యంగా ప్రవర్తించినా లేదా అతనిలో చిత్తశుద్ధి లోపించినా లేదా సక్రమ దృక్పథంతో ఆతను లేకున్నా, పరిస్థితులు కష్టసాధ్యాలవుతాయి. శిష్యుడు నిష్కపటిగా, శ్రద్ధాళువుగా, విశ్వాసపాత్రుడుగా, సరైన భావన కలిగినవాడుగా వుంటే – గురువు కూడ సద్గురువుగా వుంటే, ఏ నాటికైనా సిద్ధించవలసినది తప్పక సిద్ధించి తీరుతుంది.

*

దైవానికి చేసికొనే ఆత్మసమర్పణము, గురువుకు చేసికొనే ఆత్మసమర్పణము ఒక్కటి కాదు. శిష్యుడు గురువుకు చేసికొనే సమర్పణం గురువులోని దైవానికి చేసికొనే సమర్పణ అవుతుంది. అది కేవలం మానవశరీరధారిగా నున్న గురువుయొక్క స్థూల దేహానికి చేసికొంటే అది నిష్ప్రయోజనం అవుతుంది. గురువుయందలి దివ్యచేతనా సన్నిధియే అతన్ని నిజమైన గురువుగా నిలుపుతుంది. శిష్యుడు గురువును మనుష్యమాత్రుడుగా భావించినా, ఆయన యందలి దైవానికి సమర్పణం గావించుకొంటే, ఆ దివ్యసన్నిధియే అతనికి ప్రయోజనకారి కాగలుగును.

*

గురువును అతీతునిగ, అమూర్తిగ, మూర్తిగ, అన్నివిధాలా స్వీక రించాలి.

*

గురువు వద్ద దోషాలను అంగీకరించడం ద్వారా పాపప్రక్షాళనం

శిష్యుడు చిత్తశుద్ధితో ఆత్మసమర్పణం చేసికొన్న తర్వాత సాధన జీవితానికి సంబంధించిన ప్రధాన సంఘటనలను గురువు వద్ద దాచరాదు. గురువు వద్ద తన దోషాలను అంగీకరించడం ద్వారా సాధన యందలి ప్రతిబంధకాలను కల్పించే చేతనను అది ప్రక్షా ళనం చేస్తుంది. అది అంతఃశుద్ధిని కలిగించి గురుశిష్యుల మధ్య సన్నిహిత సంబంధాన్ని, సత్ఫలితాన్ని చేకూర్చుతుంది.

*

మత దురభిమానాన్ని విసర్జించు

పూర్ణయోగసాధకుడు మతసహాయాలన్నింటిని తన స్వభావాను గుణంగా ఉపయోగించుకొంటాడు. కాని వాటి సంకుచిత ధోర ణులను తొలగించుకోవాలి. అహంకారభూయిష్టమైన 'నా దేవుడు, నా అవతారమూర్తి, నా మతప్రవక్త, నా గురువు గొప్ప' అన్న మాటలను సంకుచిత మతదురభిమానాలను విసర్జించాలి. ఈ సంకుచిత మతదురాభిమానాలు పరిపూర్ణ దివ్యసాక్షాత్కారానికి వ్యతిరేకం.

దీనికి విరుద్ధంగా పూర్ణయోగసాధకుడు సకల దేవతల రూపాలను, నామాలను, తన భావనలో అనుసంధించేవరకు, తన ఇష్టదేవతను ఇతర దేవతలలో దర్శించేవరకు, సకల అవతార మూర్తులను అన్ని అవతారములకు మూలపురుషుడైన పరమా త్మతో ఐక్యం చేసేవరకు, అన్ని బోధనల సత్యాన్ని పరమస త్యంతో సామరస్యం చెందించేవరకు తృప్తిచెంద నేరడు.

*

బాహ్య సహకారముయొక్క ఆవశ్యకత

సాధకుడు తన అంతర్గత దైవముతో సంసర్గాన్ని కల్పించే బాహ్యా సహాయాల ఉద్దేశ్యాన్ని మరువరాదు. ఈ విధంగా తనలో జీవాత్మ పరమాత్మల అనుసంధానం చేకూరేవరకు ఎలాంటి సత్ఫలితం చేకూరదు. మనలో బుద్ధ, క్రీస్తు, కృష్ణుల సాక్షాత్కారం కలిగే వరకు, వారి అంతఃప్రేరణలు పొందేవరకు, వారి బాహ్యా ఆరాధన మాత్రమే చాలదు. ప్రతి సహాయము మానవునిలో కలిగే దైవసాక్షాత్కారమునకు అతని జీవాత్మకు మధ్య ఒక వంతెనగా ఉండాలి.

అన్ని సహాయాల అవసరము అదే.

*

ఐరోపాలో గురుస్థానాన్ని మతగ్రంథం ఆక్రమించుకొంది. సాధకుని మనస్సు మతగ్రంథాలలో తెల్పబడిన కఠినశాసనాల తీవ్ర ప్రభావాలకు లోనయ్యింది. అది గురుబోధనల ననుసరించదు.

*

గురువుకు, అంతర్ దైవానికి ఆత్మసమర్పణ

గురువుకు చేసికొనే ఆత్మసమర్పణం ఇతర అన్ని సమర్పణల కన్న ఎంతో గొప్పది. ఎందుకంటే దీని ద్వారా నీ సమర్పణ వ్యక్తిగతం, వ్యక్తిగతానికి అతీతంగాను ఉంటుంది. ఆ విధంగా నీ అంతర్గత దైవానికి, బహిర్గత దైవానికి సమర్పణ చేసికొన్న వాడవవుతావు. అంతేగాదు. దీని ద్వారా నీవు అహంకారరహితమైన నీ ఆత్మలోనికి ప్రవేశించడమే గాక, నీ వ్యక్తిగత స్వభావంలో నీపై ఆధిపత్యం వహించి, నిన్ను పరిపాలిస్తున్న అహంకారాన్ని గూడ నీవు దాటుకొనిపోతావు. ఇది దైవానికి పరిపూర్ణ ఆత్మసమర్పణం అవుతుంది. '*సమగ్రంమాం... మానుషమ్ తనుమ్ ఆశ్రితమ్*' ఇదంతా యదార్థం కావాలంటే నీ సమర్పణం వాస్తవమైన కల్తీలేని ఆధ్యాత్మిక సమర్పణం కావాలి.

*

అవును, అది ప్రాణమయదోషము. క్రమశిక్షణకు దృఢసంకల్పం లేకపోవడం. ఆధ్యాత్మిక విషయాల్లో శిష్యుడు గురువు ననుసరించాలి. ఎందుకంటే గురువుకు ఆధ్యాత్మిక జ్ఞానము, బోధనాపద్ధతి తెలుసు. అలానే మామూలు పాఠశాల విద్యలో కూడా శిష్యుడు గురువు నుండి నేర్చుకొని, ఆయన బోధనలను అనుసరించాలి. ఎందుకనగా విషయం గురువుకు తెలుసు. ఆ విషయాన్ని ఎలా నేర్పాలో కూడా ఆయనకు తెలుసు. శిష్యుడు అన్నీ తనకు తానుగానే నేర్చుకుంటే అతడు అన్నింటినీ దోషభూయిష్ఠంగానే నేర్చుకొనే అవకాశాలున్నాయి. అలా దోషభూయిష్ఠంగా నేర్చుకునే స్వేచ్ఛవల్ల ఏం ప్రయోజనం?

శ్రీఅరవిందులు

*

పాశ్చాత్యుల మానసం గురువుకు సంపూర్ణ ఆత్మసమర్పణం కావించుకొనుటకు చాల కష్టంగా భావిస్తుంది. కాని నిస్సందేహంగాను, సమగ్రంగాను ఆత్మసమర్పణం చేసికోనిదే ఆయన సహాయం నీకు సక్రమంగా అందక కుంటుపడుతుంది. అందువల్లనే నేను పాశ్చాత్యులకు తమకు తాముగా తమలోనే దివ్యసన్నిధిని, మార్గదర్శిని కనుగొనుమని సలహా నిస్తుంటాను. ఈ ప్రక్రియవల్ల వారు తమ అహంకారపు సలహాలను తమ అంతర్వాణి ప్రబోధంగా (ఆత్మసందేశంగా) పొరబడే అవకాశం ఉంటుందనడం కూడ నిజమే.

ఈ విషయాలలోను నీకు రక్షణ సమకూర్చేది నీ పరిపూర్ణ చిత్తశుద్ధి, కల్తీలేని నీ నమ్రత మాత్రమే.

*

భారతీయులు మానవునిలో దైవం వున్నాడని విశ్వసిస్తారు. అనుభూతి నందుతారు కూడ. ఐరోపావాసులు దీనిని విశ్వసించరు. వారు దైవం పైన ఎక్కడో ఉంటున్నాడని భావిస్తారు. దైవం కేవలం ఏసుక్రీస్తులో మాత్రమే మూర్తీభవించి ఉన్నాడని ఎంచుతారు. కనుక వారు ఎలాంటి మానవునికీ తలవంచరు. కాని దివ్యచేతన మూర్తీభవించిన మానవునికి విశ్వాసంతో శిరము

వంచితే అప్పుడాయన తన దివ్యచేతనను సులభంగా ప్రసరింప చేయగలడు.

*

నీకు ప్రగాఢ విశ్వాసమే కనుక ఉంటే నీ ఆరాధన నీ గురువు యొక్క మానవరూపానికి గాక, ఆయన ద్వారా ఆవిష్కరింపబడే పరమాత్మకే చెందుతుంది.

బాధపడకండి. మీకు ఏ సాధనా పద్ధతి సహాయకారిగా ఉంటే, ఆ పద్ధతి ద్వారానే పరమాత్మకు పరిపూర్ణంగా మిమ్ము లను అర్పించుకోండి.

*

ప్రతికర్మ యోగభావనతో చేయగలగాలి. మరియు చేయబడాలి. కాని ఆ త్యాగం మానవునికిగాక సర్వోన్నత పరమాత్మకే చేయ బడాలి.

మూలం: శ్రీమాత
అనువాదం: బి. నరసింహయ్య

అంతర మార్గదర్శిగా దైవం

జగద్గురువే అంతర్గత మార్గదర్శి

పూర్ణయోగానికి సర్వోన్నత దివ్యశాస్త్రంగా ప్రతి మానవ హృద యంలోను నిగూఢంగా సనాతన వేదము ఉన్నది. కాబట్టి, దాని యొక్క దివ్యోపదేశికుడు, జగద్గురువు మనలోనే దాగి ఉన్నాడు. తన దేదీప్యమానమైన జ్ఞానప్రకాశంతో మనలో చీకట్లు మటు మాయం చేసేది ఆయనే. ఆ తేజస్సే మహిమాన్వితంగా స్వీయ ఆవిష్కరణతో మనలో ప్రవర్ధమానమవుతుంది. ఆయన తన ప్రకృతిలోని, ఆనందాన్ని, ప్రేమను అమృతత్త్వ సత్తలను క్రమేపీ ఆవిష్కరిస్తాడు. మనకు ఆదర్శంగా ఆయన తన దివ్యనమూనాను మచ్చుకి పైన ప్రదర్శిస్తాడు. మన అధోజీవన విధానం కావాలని,

పరితపించే దాని ప్రతిబింబంగా పరివర్తన చేస్తారు. ఆయన తన ప్రభావాన్ని, సన్నిధిని మనలోనికి ప్రసరింపజేయడం ద్వారా మన వ్యక్తిసత్తను సార్వత్రికము మరియు అతీతముతో తాదాత్మ్యం చెందేలా చేస్తారు.

ఆయన (కార్యాచరణ) విధానం

ఆయన పద్ధతి, వ్యూహం ఏమిటి? ఆయనకు ఏ పద్ధతీ లేదు. మరి ప్రతీది పద్ధతే. ప్రకృతికి వీలయిన అత్యున్నత క్రియాకలాపాల యొక్క సహజవ్యవస్థయే ఆయన పద్ధతి. అత్యల్పమైన వివరాలను, అతి నిరర్ధకంగా కనిపించే చర్యల విషయాలను కూడా పట్టించుకుంటూ అతి విశిష్టమైన వాటికి చూపించేటంత నిర్దిష్టత, శ్రద్ధ వహింపబడతాయి. చివరకు అన్నీ ఆ దివ్యకాంతి లోనికి ఉద్ధరింపబడి, పరివర్తింపబడతాయి. ఏమంటే ఆయన దివ్యయోగంలో ఉపయోగింపబడేది ఏదీ అల్పము కాదు. తలపెట్టడానికి ఏదీ అధికము కాదు. ఆ పరమేశ్వరునకు బంటు, శిష్యుడు అయిన వానికి గర్వం, అహంకారములకు తావు లేదు. అతనికి అంతా పైనుంచే సిద్ధిస్తుంది. అలాగే తన సహజ లోపాలకు, తొట్రుబాట్లకు కూడా చింతించవలసిన పని లేదు. ఏమంటే అతనిలో పని చేసే దివ్యశక్తి వ్యక్తిత్వము కానిది, వ్యక్తిత్వానికి అతీతమైనది మరియు అనంతమైనది.

*

అత్యంతప్రధానమైనది అంతర దివ్యమార్గదర్శిని గుర్తించడమే.

యోగేశ్వరుడు, ప్రభువు, ప్రకాశం, సర్వకర్మఫలత్యాగ లక్ష్యం, భోగి అయిన ఈ అంతరమార్గదర్శిని సంపూర్ణంగా గుర్తించుటే సమగ్ర పరిపూర్ణతామార్గంలో పరమ ప్రాధాన్యం. సమస్త విషయాల వెనుకనున్న అవ్యక్తమైన దివ్యజ్ఞానప్రేమశక్తిగా ఆయన ముందుగా గోచరమయితే అదంత ప్రధానం కాదు. తన అత్యున్నత ఆత్మగానో, అందరి అత్యున్నత దివ్య ఆత్మాగానో, మనలో

మరియు లోకంలోని దివ్యపురుషుడుగానో, అతని లేక ఆమె అసంఖ్యాక నామరూపాలలో ఒకటిగానో లేక మనస్సు ఊహించే ఆదర్శంగానో ఆయన ముందుగా గోచరమయితే అదంత ప్రధానం కాదు. చివరకు అన్నీ ఆయనే అని, మరి వీటన్నిటి మొత్తమూ ఆయనే అని మనం గ్రహిస్తాము. ఆయన గురించిన అవగాహన పూర్వసంస్కారం, ప్రస్తుత నైజాన్ని బట్టి అవశ్యంగా మారుతూ ఉండవలసినదే.

ఈ అంతర దివ్యమార్గదర్శి తరచు చాటున ఉంటాడు. మన వ్యక్తిగత సాధన తీవ్రత వలననూ, అహంకారంచేత తనలో తానే నిమగ్నమై ఉండడం వలననూ, దాని గమ్యాల వలననూ మొదట్లో అలా జరుగుతుంది. మనలో స్పష్టత పెరిగేకొద్దీ అహంతో కూడిన సాధనయొక్క అల్లకల్లోలం సమసిపోతుంది. ప్రశాంతమైన ఆత్మజ్ఞానం చోటుచేసుకుంటుంది. అప్పుడు మనలో ప్రవర్ధమాన మవుతున్న ప్రకాశానికి మూలాన్ని గుర్తిస్తాము. వెనుకటి విష యాలను కూడా గుర్తిస్తాము. మనలోని అస్పష్టమైన, పరస్పర విరుద్ధమైన కార్యకలాపాలు ఏ విధంగా రూపుదిద్దుకొన్నదీ తెలు సుకుంటాం. వాటి గమ్యాన్ని ఇప్పుడిప్పుడే గ్రహించగలుగుతాం. మనం యోగమార్గంలోనికి ప్రవేశించక పూర్వమే మన జీవిత పరిణామం అలాంటి మలుపునకు తీసికొనిరాబడినదని గ్రహిస్తాం. ఏమంటే, ఇప్పుడే పోరాటాలు, సాధనలు, విజయాలు, వైఫల్యాల లోని ఆంతర్యం అర్థమవడం ఆరంభమవుతుంది. కడకు మన విషమ పరీక్షలకు, బాధలకు ఉద్దేశించబడిన భావనలను హఠా త్తుగా తెలుసుకోగలుగుతాం. మనల్ని బాధించినట్టి, నిరోధించినట్టి వాటన్నింటి వలన కలిగిన సహాయాన్ని, ఆఖరుకు మన పత నాలు, తొట్రుపాటు వలన కలిగే ప్రయోజనాన్ని కూడా చక్కగా మదింపు చేయగలుగుతాం. అనంతరం ఈ విధంగా దైవం నడి పించడాన్ని గుర్తిస్తాం. మన ఆలోచనలను ఒక లోకాతీత దివ్య ద్రష్ట రూపకల్పన చేయడాన్ని మనం సింహావలోకనంగాకాక వెంటనే తెలుసుకుంటాం. మన ఇచ్ఛ క్రియాకలాపాలను సర్వ మును ఇముడ్చుకొన్నట్టి దివ్యశక్తి రూపుదిద్దుతూ ఉన్నదని

గుర్తిస్తాం. మన మానసికోద్వేగ జీవనం ఒక సర్వసమ్మోహన తన్మయత్వంతో, దివ్యానంద, దివ్యప్రేమలచే రూపొందించబడు తున్నదని తెలుసుకుంటాం. దానిని మన వ్యక్తిగత సంబంధా లలో కూడా తెలుసుకోవచ్చు. తొలి పరిచయంలో కావచ్చు లేదా అంతిమంగా స్వాధీనం చేసుకోవడమూ కావచ్చు. ఒక పరమోచ్ఛ ప్రభువుగా, సఖుడిగా, ప్రేమికుడిగా, గురువుగా ఆయన నిత్యస న్నిధ్ధిని మనం అనుభవిస్తాం. ఇప్పటికంటె గొప్పది, విశాలము అయిన స్థితితో సామ్యమును, ఐక్యమును పొందునట్లు వృద్ధిచెందు సత్తయొక్క సారములో మనం దానిని గుర్తిస్తాం. ఈ అద్భుత పరిణామం మన స్వయంకృషి ఫలితం కాదని గ్రహిస్తాం. ఒక శాశ్వతమైన దివ్యపరిపూర్ణత మనను తన ప్రతిరూపంగా రూపుది ద్దుతోందని గ్రహిస్తాం. ఎవ్వడు దివ్యవేతాంతములకు ప్రభువో, ఈశ్వరుడో, చైత్యగురువో, అంతర్యామియైన దివ్యమార్గదర్శి ఎవ్వడో, చింతనాపరులకు దివ్యముగా కేవలమైన వాడెవ్వడో, తన అస్తిత్వాన్ని ఋజువు చేయడం సాధ్యం కాని వాదించేవానికి తెలి యబడని దేవుడైన వాడెవ్వడో, భౌతివాదియొక్క సార్వత్రిక దైవీ శక్తియైన వాడెవ్వడో, పరమాత్మ, పరాశక్తియైన వాడెవ్వడో, వేరు వేరు మతములచే వేరు వేరు పేరులు, మూర్తులు కల్పించబడిన దివ్యుడైన వాడెవ్వడో వాడే మన దివ్యయోగము యొక్క దివ్యప్ర భువు.

*

అంతర దివ్యమార్గదర్శిని గుర్తించడంలోని ఆటంకాలు

గుట్టుగా మన లోపల కాపురమున్న ఆ దివ్యప్రభువెవ్వడో, వానిని కనుగొనడమే ఈ సమగ్ర సాఫల్యతకు అత్యంత దృఢమైన మార్గం. దివ్యజ్ఞాన ప్రేమలయిన ఆ దివ్యశక్తికి ఎల్లవేళల మనము తెరచుకొని పరివర్తన చెందడానికి దానినే నమ్మి యుండడం నిశ్చ యమైన మార్గం. అయితే మొదట్లో అహంకారపూరిత చైతన్యము నకు దీనిని సాధించడం ఎంతో కష్టం. ఒక వేళ అదే కుదిరితే దానిని పూర్ణంగాను, మన ప్రకృతి ప్రతీ తంతువులోను సాధించడం

మరింత కష్టం. ఆదిలో అదే కష్టం. ఎందుచేతంటే, మన అలవాట్లయిన తలపులు, అనుభూతులు, ఉద్వేగాలు అన్నీ అహంకారపూరితాలు. అవి అవశ్యమైన స్ఫూర్తిని పొందే దారిని దిగ్బంధం చేస్తాయి. ఆ తరవాత ఇది కష్టమవుతుంది. ఏమంటే ఈ మార్గానికి కావలసిన విశ్వాసం, సమర్పణ, ధైర్యం, అహం కమ్మేసిన ఆత్మకు సులభం కావు. అహంకారపూరిత మనస్సు కోరుకుని ఆమోదించే కార్యక్రమమూ, దైవీకార్యక్రమమూ ఒకటి కావు. ఏమంటే అది పరిపూర్ణతకు చేరడానికి అపరిపూర్ణతను; ఆనందాన్ని చేరుకోవడానికి బాధను; సత్యాన్వేషణలో దోషాన్ని వాడుకుంటుంది. అహంకారం తానెక్కడికి తీసుకొనిపోబడుతోందో గమనించలేదు. దానిని ప్రతిఘటిస్తుంది. నమ్మకం, ధైర్యం కోల్పోతుంది. దివ్యమార్గదర్శి లోపల ఉన్నాడు గనుక ఈ వైఫల్యాలకు అంత పట్టింపు లేదు. లోపలనున్న దివ్యమార్గదర్శి ఈ ప్రతిఘటనకి చిరాకుపడడు. మన విశ్వాసరాహిత్యానికి నిరాశ చెందడు. మన బలహీనతవల్ల వెనుకకు తగ్గిపోడు. ఆయనకు మాతృమూర్తి యొక్క పూర్తి ప్రేమ, గురువుయొక్క సంపూర్ణమైన ఓరిమి ఉంటాయి. అయితే మార్గదర్శకత్వానికి మన అనుమతిని నిరాకరించడం వలన మనం చైతన్యాన్ని కోల్పోతాం. వాస్తవంగా దాని పూర్తి లాభాన్ని పొందలేకపోవచ్చు. ఏది ఏమైనా జరగవలసింది జరగదు. మనం మన నిమ్నప్రకృతికి, ఉన్నత దివ్యాత్మకు మధ్య భేదం గమనించలేక భంగపడడం వలననే మనం మన అనుమతిని నిరాకరిస్తాము. ఆయన నిమ్నప్రకృతి ద్వారానే ఆత్మ సాక్షాత్కారానికి సిద్ధం చేస్తూ ఉంటాడు. ఆయన చేష్టల వలన ప్రపంచంలో మాదిరిగానే మనలోనూ ఆయనను తెలుసుకోలేము. ఏమంటే ప్రత్యేకించి ఆయన మన నైజాన్ని అనుసరించి పని చేస్తూ ఉంటారు కాని, వరసగా అకారణమైన అద్భుతాలతో కానే కాదు. తనకు విశ్వాసం కలగడం కోసం మానవుడు అద్భుతాలను అపేక్షిస్తూ ఉంటాడు. చూడడానికి మిరుమిట్లు గొలిపేటట్లుండాలని కోరుకుంటాడు. ఈ అసహనం, అజ్ఞానం ఒక గొప్ప అపాయం, ముప్పుగా పరిణమించవచ్చు. దైవం నడిపించడానికి ప్రతిఘటించడంలో మానసిక

ప్రేరణలకు, కోరికలకు, ఎక్కువ తృప్తి నిచ్చేటట్టి ఒక వక్రీకరించే శక్తిని మనం ఆహ్వానించి, దానినే దారి చూపమని, దానికే దైవ నామాన్నిచ్చినట్లయితే అప్పుడు ఈ అసహానం, ఈ అజ్ఞానం, ఒక గొప్ప అపాయం, ముప్పుగా పరిణమించవచ్చు.

*

మానవాళియొక్క దివ్యసూత్రధారి – ఆయన ఆదర్శం

దివ్యమైన అవతారమెప్పుడూ మానవత్వం, దైవత్వం జంటగా కనిపించే విషయం. మానవనైజమును దాని సమస్తమైన బాహ్యా పరిమితులతో సహా దైవం తనపై వేసుకుంటాడు. వాటినే తన దివ్యచైతన్యం, దివ్యశక్తుల యొక్క ఉపాయములుగాను, అవస్థలు గాను, సాధనములుగాను చేసుకుంటాడు. దివ్యకార్యములకు, దివ్యజన్మకు దానినే వాహికగా చేసుకుంటాడు. అయితే అది అంత నిశ్చయంగానూ జరుగవల్సినదే. లేనిచో అవతార అవరోహణ లక్ష్యం నెరవేరదు. మానవజన్మను, దాని సమస్త పరిమితులలో కూడా దివ్య అవతరణకు, దివ్య కార్యకలాపాలకు ఒక ఉపకర ణంగా తయారుచెయ్యవచ్చునని ఋజువు చెయ్యడమే ఈ లక్ష్యం. మానవచేతన యొక్క నమూనా దివ్యచేతనయొక్క సారమును ప్రదర్శించడం, తన వాహికలోనికి మార్చడానికి వీలవుతుందని, దాని నమూనాను మార్పుచేసి, దాని బలప్రేమప్రకాశ శక్తులను వృద్ధిచేసి దివ్యచేతనకు అతి చేరువలో అనుగుణంగా మలచడా నికి కుదురుతుందనిన్నీ మరి దానిని ఎలా సాధించాలో కూడా ప్రదర్శించడమున్నూ ఈ లక్ష్యం. దివ్యమైన అవతారం కనక పూర్తిగా మానవాతీతధోరణిలో వ్యవహరించినట్లయితే ఈ లక్ష్యం నెరవేరదు. బొత్తిగా మానవాతీతం – లేదా అద్భుతం అయిన దివ్య అవతారం అర్థంలేని అసందర్భం అవుతుంది. మానవాతీత శక్తులు, అంటే క్రీస్తుయొక్క రోగనివారిణి అద్భుతాలంటారే అలాంటివాటిని అసలు వినియోగించకూడదని కాదు. ఏమంటే మానవాతీతశక్తులు మానవప్రకృతికి సుసాధ్యమే. అయితే అదేమీ అసలు అక్కర లేదు. ఏమయినా విషయానికి మూలం అది కాదు.

జీవనమంతా మానవాతీతశక్తుల చమత్కార ప్రదర్శనం తప్ప మరేమీ లేకపోయేటట్లయితే అదేమీ అసలు కుదరదు. దివ్య మైన అవతారం – గారడీలో చేసే ఇంద్రజాలికుడిలా దిగజారడు. మానవాళికి మార్గదర్శిగాను, ఆదర్శంగాను మాత్రమే దివ్య అవ తారం దిగివస్తుంది. ఆఖరుకి మానవుని దుఃఖాన్ని, భౌతికమైన బాధను ఆయన తనపై వేసుకోవలె. ముందుగా బాధే విమోచ నకు మార్గమెలా కాగలదో – క్రీస్తు చేసినట్లు – చూపించడానికి దానిని నియోగించాలి. రెండో విషయం – మానవనైజంలో దివ్యాత్మ ఆవహించబడి, అదే నైజాన్ని ఎలా అధిగమించాలో కూడ ప్రదర్శించడం – బుద్ధుడివలె – హేతువాది క్రీస్తు ముందు "నీవే దేవుడవయితే శిలువలోంచి దిగిరా" అని కేకలు వేసి ఉండే వాడు, లేదా దివ్యమైన అవతారం దైవం కాదని మేధావిలాగ సూచించేవాడు. ఏమంటే ఆయన మరణించాడు, మరీ రోగంతో కూడ చనిపోయాడు – కుక్క చచ్చినట్లు – ఏమంటున్నాడో అతనికి తెలియడం లేదు. అతనికి మొత్తం విషయానికి మూలం అర్థం కాలేదు. దివ్యానందంతో దివ్య అవతారం రావడానికి ముందు దుఃఖం, బాధయొక్క దివ్య అవతారం రావాలి. వాటిని ఎలా జయించాలో చూపడానికి మానవ పరిమితులలోనే ఆవా హన జరగాలి. ఈ విజయానికి మార్గం మరి ఎంత మేరకు, ఆంత ర్యంలో మాత్రమేనా, బాహ్యంలో కూడానా అన్నది మానవ పురోగతియొక్క పరిణామ దశ మీద ఆధారపడి ఉంటుంది. మానవీయంకాని, అద్భుతంతో దానిని సాధించరాదు.

*

దివ్యజననం, దివ్యకార్యకలాపాల యదార్థస్వభావాన్ని దివ్య అవ తరణ నుండి ఎవరయితే నేర్చుకుంటారో వారే దివ్యమైన అవ తార ఆగమనం యొక్క ఫలసారాన్ని పొందుతారు. ఎవరయితే వారి చైతన్యంలో ఆయనను పూర్తిగా పెంచుకుంటారో, ఆయన లోనే తమ పూర్తి సత్తకు ఆశ్రయం పొందుతారో – *మన్మయా మామ్ ఉపాశ్రితః* – వారి జ్ఞానం యొక్క సాక్షాత్కార అనుభవం వలన దిగువ ప్రకృతి నుండి విముక్తులవుతారో వారే దివ్యస

త్తను దైవీప్రకృతిని పొందుతారు. – మద్భావమ్. స్వేచ్ఛగా, నిర హంకారంగా, నిస్వార్థంగా, వ్యక్త్యాతీతంగా, సార్వత్రికంగా, దివ్య ప్రకాశం, దివ్యశక్తి, దివ్యప్రేమలు నిండి ఉండిన దైవీప్రకృతిని మానవునిలోనికి నిమ్నప్రకృతికి పైన ప్రదర్శించడానికే దివ్య మైన అవతారం ఆవిర్భవిస్తుంది. పరిమితమైన అహంకారపూరిత మైన వ్యక్తిత్వాన్ని దైవీ వ్యక్తిత్వంతో భర్తీ చేయడానికే ఆయన దిగివస్తారు. అప్పుడది అహంకారం నుండి అనంతంలోనికి, జననం నుండి అమృతత్వం లోనికి విముక్తి పొందుతుంది. మాన వులను తనలోనికి ఆహ్వానించే దైవీప్రేమశక్తులుగా ఆయన దిగి వస్తారు. అప్పుడు చాలీచాలని మానవాభీష్టములలో, మానవ సహజమైన భయాందోళనల పోరాటంలో, క్రోధమోహాలలో, మరి ఇలాంటి అన్ని కలతలు, బాధలతో ఇక ఎంత మాత్రంకాక దైవంయొక్క ఆనందం, ప్రశాంతతలలో ఆశ్రయం పొంది జీవించ వచ్చు.

*

దివ్యుడైన గీతాచార్యుడు

దివ్యుడైన గీతాచార్యుడు, శాశ్వతుడైన దివ్య అవతారం; మానుష రూపం లోనికి దిగివచ్చిన దైవం. సర్వభూతముల హృదయావా సియైన దివ్యప్రభువు. తెర వెనుకనుండి మన ఆలోచనలకు, కర్మలకు హృదయాన్వేషణకు మార్గదర్శి. తన దివ్యసత్తలో తానే అభివ్యక్తీకరించుకున్న ప్రపంచంయొక్క గొప్ప సర్వ క్రియాకలా పాన్ని దృగ్గోచరము, ఇంద్రియ సంవేద్యము అయిన రూపములు, శక్తులు, ఉద్దేశముల వెనుక తెర చాటుగ ఉంటూ, ఆయన త్రోవ చూపిస్తున్నాడు. ఈ తెరను చీల్చగలిగి మన వేషము వెనుక గల నిజస్వరూపజ్ఞానాన్ని పొందినపుడు మనం పైకి వెళ్లే ప్రయత్నం లోని పోరాటం, అన్వేషణలు సార్థకతనిచ్చే పరాకాష్టను కనుగొం టాయి. మన సత్త అంతా ఈ నిజమైన దివ్యప్రభువు సత్తలోనే కలదని తెలుసుకుంటాము. మన వ్యక్తిత్వాన్ని ఆయనకు ఆయన లోనికి అర్పించగలుగుతాం. నిరంతరం చెదరిపోతూ, మరల కూడ

కట్టుకుంటూ ఉండే మానసిక క్రియాకలాపాలు ఆయన సంపూర్ణమైన ప్రకాశంలో ఇమిడిపోతాయి. దోషాలతో పెనుగులాడే ఇచ్ఛాశక్తులను దివ్యుడైన ఆయనయొక్క విస్తృతము, జ్యోతిర్మయ అవిభాజ్య దైవేచ్ఛకు అర్పిస్తాం. విషయలోలమై వెలుపలికి పోయే కోరికలను, ఉద్రేకాలను ఒక్క పట్టున త్యజించి, ఆయన దివ్యాత్మానందానుభవంలో తృప్తి చెందుతాం. ఈయనే జగద్గురువు. మరే ఇతర అత్యున్నతమైన బోధనయైనాకాని దాని విభిన్నమైన ప్రతిరూపము, పాక్షిక వ్యాఖ్యయే. ఈ దివ్యవాణిని వినడానికి మన ఆత్మ జాగృతం కావాలి.

*

ప్రతి యుగంలోను మానవుడు ఒక జగదోద్ధారకుడు (Mesasiah) లేక దివ్యుడైన ఆచార్యుడి ఆగమనం కోసం వేచి ఉంటున్నాడు. తన అత్యున్నత వైభవాన్ని శిష్యరికంలో కనుగొంటున్నాడు. అయితే రాబోయే దివ్య ఆచార్యుడు జగదోద్ధారకుడిని, ఆయన అనుచరుడిని, ఆచార్యుడిని, శిష్యుడిని ప్రతి మనిషిలోను చూపిస్తాడు. అతని తీక్షణ వీక్షణానికి ఒక పరిపూర్ణ దివ్యత్వం యొక్క శాశ్వతమైన వైభవాన్ని ప్రదర్శిస్తాడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: వై.వి.యస్.యన్. మూర్తి

ప్రతికర్మ యోగభావనతో చేయగలగాలి. మరియు చేయబడాలి. కాని ఆ త్యాగం మానవునికిగాక సర్వోన్నత పరమాత్మకే చేయ బడాలి.

శ్రీమాత

దైవంతో సంబంధాలు

ప్రేమ బంధానికి కీలకం

దైవం యజమానిగా ఎవ్వరినీ శిక్షించదు. భయపెట్టదు. విధేయంగా ఉండమని బలవంత పెట్టదు. తనను దివ్యోన్నత స్థాయికి ఉద్ధరించడానికి, పరిమిత స్వభావానికి అపరిమిత ఆనంద ఆధిపత్యం అందచేయటానికి, సర్వోన్నతునికి సేవ అందించి అహం నుంచి, నిమ్న స్వభావం నుంచి విముక్తిపొందటానికి జీవాత్మయే స్వచ్ఛందంగా దైవమును చేరుకుని ఆ నిరవధిక శక్తికి అర్పణ కావించుకోవాలి. భారతీయ యోగంలో ఈ సంబంధానికి, సేవకి, దాస్యానికి కీలకం ప్రేమ. ఇది దివ్య చెలికాని ఆనందదాస్యం. లేక – దివ్యప్రేమికునికి భావావేశపూరిత సేవ. లోకేశ్వరుడు గీతలో తన సేవకుని నుంచి, భక్తుని నుంచి కోరేది జీవితంలో తనకు ఉపకరణంగా మిగిలి ఉండమని. సర్వలోక మహేశ్వరుడుగా, సర్వభూతహితుడుగా తాను కోరేది ఇదియే. ఇవి రెండు బాంధవ్యాలు. ఇవి జంటగా కలిసి సాగవలసినవి. ఒకటి లేక మరొకటి పరిపూర్ణము కాదు. దైవం సృష్టికర్తగా, తండ్రిగా జీవునికి రూపం ప్రసాదించినవాడుగా విధేయతని సాధికారికంగా కోరడు. కాకపోతే పితృవాత్సల్యం యోగకలయికను ప్రోత్సహిస్తుంది. అసలు కీలకం అంతా ఇక్కడ ప్రేమయే. పూర్ణప్రేమ ఉన్నచోట భయము ఉండదు. భయము, ప్రేమ పరస్పర విరుద్ధాంశాలు – పరమాత్మతో అనుసంధానం జీవాత్మ లక్ష్యం. భయం అందుకు అవరోధం. దానిని దూరం చేస్తుంది. భక్తిపూర్వక పూజ్యభావాలు కూడా దూరాన్ని పెంచి చనువు లేకుండా చేస్తాయి. ప్రేమపూర్వకయోగానికి విఘాతం కలిగిస్తాయి. అదీకాక భయం నిమ్నప్రకృతి లక్షణం. ఉన్నతాత్మ ఆరోహణదశలో దానిని దగ్గరికి రానీయకూడదు.

*

ప్రార్థన అనుబంధాన్ని రూపొందించే సాధనం

దైవం తండ్రి అనే అనుబంధము, ఇంకా సన్నిహితమైన తల్లి అను బంధము – దివ్యమాతగా – విశ్వాత్మగా దివ్యమాతృత్వబంధం – ఈ బంధాలకి మూలం పూర్వపు వేరే మతసంబంధమైన ప్రేరణ. కోర్కెలను తీర్చేవాడుగా, తన మంచిని చూచేవాడుగా, తన బాహ్యా అంతరంగ అవసరాలను సంతృప్తిపరచేవాడుగా భక్తుడు దేవుని దగ్గరికి చేరుతాడు. *యోగక్షేమం వహామ్యహం* – అని ప్రభువు అన్నాడు. మానవజీవితం భౌతిక, ప్రాణిక, మానసిక, ఆధ్యాత్మిక అవసరాలు కోర్కెలు, కామనలతో కూడినది. ఏదో ఉన్నత దివ్య శక్తి పైనుంచి పరిపాలిస్తున్నదనే యెరుక తనకు కలిగినపుడు తన అవసరాలు తీర్చుకోవటం కోసం సహకారాన్ని అర్థిస్తూ, ప్రార్థన ద్వారా భగవంతుని ఆశ్రయిస్తాడు. కల్లోలభరిత జీవన యానంలో రక్షణ సహాయం అర్థిస్తాడు. భగవత్సందర్శనానికి సాధారణ మత పార్థనారీతులు, ఎన్నో. అవి మొరటుగా, అనాగరి కంగా కూడా ఉంటాయి. ముఖ్యంగా స్తోత్రాలు, ప్రాయశ్చిత్తాలు, పొగడ్తలు, లంచాలు – వీటితో సమ్మతింపచేయ ప్రయత్నించటం, బ్రతిమాలటం, బహుమానాలర్పించటం, – దైవాన్ని ఆశ్రయించే ఈ రకమైన పద్ధతి సరియైనది కాదు. ఇది సారభూతమైనది కాకపో యినా ఈ రకంగా దైవం వైపు దృష్టి మళ్లించటం మతపరమైన జీవనానికి తప్పనిసరి. విశ్వజనీనమైన ఒక సత్యానికి ఆధారం చేసుకొని చేసేది ఇదంతా.

ప్రార్థనయొక్క సార్థకత తరుచు సంశయింపబడుతోంది. అసలు ప్రార్థనయే అనావశ్యకం, హేతుబద్ధం కానిది, అసమర్థమై నది అనే భావన ఉన్నది. ఇది నిజం. విశ్వజనీనమైన ఇచ్ఛాశక్తి (the universal will) తన లక్ష్యాన్ని ఎప్పుడూ నిర్వహిస్తుంది. స్వార్థపూరిత ప్రాయశ్చిత్తాలు, వేడుకోవటాలు, దానిని పక్క మార్గం పట్టించ లేవు. విశ్వాతీతుడు సర్వజ్ఞుడు. చేయవలసిన దానిని దూరదృష్టితో ఆలోచించి చేస్తాడు. విశ్వజనీనంగా వ్యక్తీక రించుకుంటాడు. అందుకు మానవబుద్ధి తాలూకు ప్రేరణ, దర్శ

కత్వం అవసరం లేదు. వ్యక్తిగత కామనలు ఏ రకమైన ప్రపంచ క్రమపద్ధతిని నిర్దేశించే అంశాలు కావు, కాలేవు. అయితే అలాగని విశ్వజనీన ఇచ్ఛాశక్తి పూర్తిగా కేవలం యాంత్రిక ధర్మంగా నిర్వహింపబడదు. క్రియానిర్వహణ సాధించదు. కాకపోతే, ఈ విషయంలో మానవజీవితానికి సంబంధిత ప్రజ్ఞాపాటవాలు, ఇచ్ఛాశక్తి, ఆకాంక్ష, విశ్వాసము – ఇవి అప్రధానమైనవి, హీనమైనవి కూడా కావు. అయితే ప్రార్థన అనేది ఇచ్ఛాశక్తికి, ఆకాంక్షకి, విశ్వాసానికి ఒక ప్రత్యేక ప్రతిరూపమే. దీనియొక్క రూపాలు సాధారణంగా మొరటుగా ఉంటాయి. శిశుసహజమైన అమాయకత్వంతో ఉంటాయి. అమాయకత్వం లోపం కాదు. అంతే కాకుండా కుర్రతనపు చేష్టలుగా కూడా ఉంటాయి. అయినా కూడా అది ఒక వాస్తవశక్తి. ప్రాధాన్యత కలిగినది. దానియొక్క శక్తి, సంవేదన మానవేచ్ఛను, ఆకాంక్షను, విశ్వాసాన్ని దైవేచ్ఛతో అనుసంధానం చేస్తుంది. అది చైతన్య దివ్యసత్వంతో సజీవ, చైతన్యబంధములు కలిగి ఉండేటట్లుగా ఉంచుతుంది. మన ఇచ్ఛాశక్తి, ఆకాంక్షలు, మన బలము, కృషి, వీటి కనుగుణంగా పనిచేయగలవు. నిస్సందేహంగా వీటిని ఉన్నత లేదా నిమ్నప్రయోజనాల కోసం సంవిధానపర్చుకోవచ్చు. ఇందుకు ఎన్నో నైతిక, మానసిక క్రమశిక్షణలు (disciplines) శక్తివంతంగా పనిచేసేవిగా ఉన్నాయి. అదీగాక ఇది దైవశక్తి లేక వైశ్వానక ఇచ్ఛాశక్తి – వీటికి కూడా లోబడి పనిచేయగలదు. ఈ తర్వాత చెప్పిన మార్గం. మన ఆకాంక్షకు ప్రత్యుత్తరరూపంగా ఆ ఇచ్ఛాశక్తిని ఒక ప్రత్యేకభావంతో దర్శిస్తుంది. కాని ఇది చాలావరకు యాంత్రికంగా ఒక రకమైన (law of energy) నియమితశక్తి ధర్మంగా, వ్యక్తిగతానికతీతంగా, లేదా, దివ్య ఆకాంక్షకు, మానవ ఆత్మవిశ్వాసానికి సచైతన్య ప్రతిస్పందనగా, అందుకు కావల్సిన సహకారం, మార్గదర్శకత్వం, రక్షణ, సఫలత సమకూరుస్తుంది. *యోగక్షేమం వహామ్యహం* అనే దానికి అనుకూలంగా.

మొదట నిమ్నభూమికలో ఈ సంబంధాన్ని నెలకొల్పటానికి ప్రార్థన సహకరిస్తుంది. ముందు అహంకారయుతంగా, ఆత్మ

వంచనగా ఉన్నప్పటికీ తర్వాత దాని వెనుక ఉన్న ఆధ్యాత్మిక సత్యానికి చేరువగా ఆకర్షితులం కాగలం. అప్పుడది అడిగింది ఇవ్వటమనేది కాక, దైవంతో మానవజీవిత అనుసంధానం సచైతన్యంగా జరుగుతుంది. ఆధ్యాత్మిక విషయాలలో ఆధ్యాత్మిక ఉపలబ్ధి అన్వేషణలో ఈ సచైతన్య అనుబంధం ఒక గొప్ప శక్తి. ఇదీ మరింత పరిపూర్ణ ఆధ్యాత్మిక పురోగతికి తోడ్పడుతుంది. అనుభవాల నందిస్తుంది. స్వయంకృషితో సాధించిన దానికంటె మరింత ఉన్నతతరమైన శక్తి. చివరకు ప్రార్థన మనలను ఉన్నతాంశానికి ఉద్ధరిస్తుంది. లేదా ఒక ఆనందకరమైన అనుబంధంగా నిలిచిపోతుంది. విశ్వాసము, ఇచ్ఛాశక్తి, ఆకాంక్ష ఉన్నపుడు మనం సాధారణంగా భావించే ప్రార్థన యొక్క ఆవశ్యకతయే ఉండదు. సాధించాలనుకున్న ఇష్టకామ్యార్థాలు కూడా ఉన్నతోన్నతంగా ఎదుగుతాయి. చివరికి మిగిలేది నిష్కామభక్తి. మరి అదే స్వచ్ఛమైన దివ్యప్రేమ. కోర్కెల కతీతమైనది.

అనుబంధాలు పలు రూపాలు

ఈ దృక్పథం నుంచి వెలువడే దైవానుబంధాలు – దైవమే తండ్రి, దివ్యమాత, దివ్య చెలికాడు (the divine Friend) ఈ రకంగా జీవాత్మ పరమాత్మ దగ్గరకి, సహకారాన్ని, రక్షణని, మార్గదర్శకత్వాన్ని, భోగానుభవాన్ని కోరి (అర్థార్థిగా) చేరుతుంది. (దివ్య) జ్ఞానము ఆదర్శమైతే, దైవము దివ్యజ్ఞానకాంతిప్రదాత కాబట్టి, దివ్యమార్గదర్శకుని, దివ్యోపదేశకుని (జిజ్ఞాసువుగా) చేరుకుంటుంది. బంధంలో, దుఃఖంలో ఊరట కోసం, ఉపశమనం కోసం, విముక్తి కోసం (ఆర్తుడుగా) పరమాత్మని చేరుతుంది. విముక్తి అంటే – దుఃఖం నుంచి విముక్తి లేదా దుఃఖభూయిష్ఠమైన ఈ లోకం నుంచి విముక్తి లేదా అంతర్గత, వాస్తవ కారణాల నుంచి విముక్తి. గీత గుర్తించిన నాల్గు రకాలైన భక్తులలో వీరు మూడు రకాలు – ఆర్త, అర్థార్థి, జిజ్ఞాసు. ఈ విషయాలలో ఒక రకమైన gradation స్థాయిని గమనిస్తాం. పితృబాంధవ్యం గురించి – అది అంత సన్నిహితం, తీవ్ర ఉద్వేగపూరితం కాదు.

అందుచేత ఇది యోగంలో తక్కువగా ఆశ్రయింపబడుతుంది. యోగం (ఎప్పుడూ) అత్యంత సామీప్యతని అన్వేషిస్తుంది. దివ్య స్నేహితుడుగా (the divine friend) – అనుబంధం మధురమైనది, సన్నిహితమైనది. సామీప్యతకి, సమానత్వానికి ఇది అవకాశం కలిగిస్తుంది... అసమానతలో కూడా. ఇది పరస్పర ఆత్మార్పణకి నాంది. (the beginning of mutual self-giving) అత్యంత సన్నిహితత్వ సంబంధంలో ఇచ్చి పుచ్చుకోవటాలు మాయమవుతాయి. ప్రేరణ ఉండదు. ఉండేది ఒకే ఏకైక ప్రేరణ – అంతటికీ కావల్సినంత – ప్రేమ. ఇది కలసిమెలసి ఆడుకునే ఆనంద స్వేచ్ఛాయుత దివ్యలీలానుబంధం. ఈ పరిణామంలో సంబంధము మరింకా సన్నిహితము. మరీ మరీ సన్నిహితము, ఆంతరికము అయిన సంబంధము: దివ్యమాతాసుతుల అనుబంధము. సుసమృద్ధమైన తీవ్ర మతప్రేరణ హృదయంలో ఉప్పొంగినపుడు దీని పాత్ర చాల గొప్పగా ఉంటుంది. అన్ని కష్టాలు కోర్కెలలో జీవాత్మ పరమాత్మను చేరుకుంటుంది. దివ్యమాత కూడా అలాగే కోరుకుంటుంది. అలాటప్పుడు తన హృదయాంతరంగం లోనుంచి అనురాగవర్షం కురిపించాలని అభిలషిస్తుంది. అది ఎపుడో అటే మళ్లుతుంది. కారణం ఏమంటే స్వాభావికంగా అంతర్గతమైన అనురాగమిది. ఇది అటు తిరిగి ఇటు తిరిగి చివరికి చేరవలసిన స్వగృహానికే చేరుతుంది. ఆ కౌగిలికే చేరి అక్కడే దివ్య పరమాత్మలో సేద తీర్చుకుంటుంది.

సర్వోత్కృష్ణ, సర్వోన్నత అనుబంధం

ఏ రకమైన మతప్రేరణతో సంబంధం లేని అనుబంధం ఇది. యోగము యొక్క అంతస్సారమిది. సహజ స్వభావసిద్ధమైన ప్రేమ లోనించి పెల్లుబుకేది ఇది. ఇది దివ్యప్రేమికుల గాఢ దివ్యావేశం. ఇది మతాలలోకి చొరబడ్డా అవి దీనికంత ప్రాముఖ్యత నీయవు. ఇక్కడ అత్యంత ప్రధానమైనది ప్రేమ. ప్రేమను కోల్పోవటం సహింపబడదు. ఒకే ఒక దుఃఖమున్నది ఇక్కడ. అదే విరహావేదన (separation of love) మిగిలినవాటితో ప్రేమకు ఎలాటి

ప్రమేయము లేదు. అవి అసలు అక్కడే ఉండనే ఉండవు. ఉన్నా అవి సంఘటనలు, ఫలితాలుగా ఉంటవి. అంతేకాని ప్రేమకి సంబంధిత అంశాలుగా నిబంధనలుగా ఉండవు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సూక్తులు

జగద్గురువైన ఆ పరమాత్మ నీ బుద్ధికి అతీతమైన విజ్ఞతకలవాడు. నీవు అతన్ని నమ్మాలేకానీ నిరంతరం స్వార్ధపూరిత అహంతో సంశయాత్మకుడవు కాకూడదు.

*

నా మార్గదర్శకుడు, గురువు అయిన భగవంతుని నేను ఈ విధంగా ప్రశ్నించవచ్చు. "నాది యదార్థమేనా? లేక నీ ప్రేమ, వివేచనలతో నా మనస్సు నన్ను మోసగించేటట్లు చేశావా?" నీ మనస్సునే సందేహించు. అంతేకాని నీకు దారి చూపి నడిపించే ఆ దైవాన్ని సంశయించకు.

*

భగవంతుడంటే అపరిపూర్ణమైన అభిప్రాయాన్ని వారు నీకు మొదట కలుగచేయడం వల్ల కోపించి ఆయనను తిరస్కరిస్తున్నావా? ఓ మానవుడా! మొదటే పరిపూర్ణజ్ఞానం నీకు అందించలేదని నీ గురువుని శంకిస్తావా? అలా కాక ఆ అసమగ్ర సత్యాన్నే అధ్యయనం చేయి. దానికి ఇవ్వవలసిన విలువ దాని కియ్యి. అపుడు నీ ముందు ఆవిష్కృతమవుతున్న విశాల పరిజ్ఞానాన్ని నీవు పొందటానికి నీకు వీలు కలుగుతుంది.

*

దైవం తన ప్రేమతో పసి ఆత్మలకు, అర్భకులకు జ్ఞానబోధ చేసే విధానమిది. ముందే ఒకేసారి పరమ సాక్షాత్కారాన్నివ్వక, దుర్గమ పర్వతాగ్రాల పైన దృష్టి పడనీయక ఒక్కొక్క అడుగు వేయిస్తూ

నడిపిస్తాడు. మనందరం అర్భకులం, ఆయన దృష్టిలో పసిపిల్లలం కదా!

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

సర్వతోముఖము, సర్వసమన్వితము

పూర్ణభక్తియోగ మార్గమంటే సర్వత్రా భగవత్భావనను కలుగచేసికొని, ఈశ్వరునితో సర్వతోముఖంగా, సర్వసహితంగా ఆత్మీయత నేర్పరుచుకొని తనలో సర్వత్రా, సర్వదా ఆయనే నిలిచేటట్లు చేసుకొని, తన సర్వస్వమూ ఆయనకే, కైంకర్యం చేసి చివరకు ఆయన సన్నిధిలో, నీలో ఆయన కొలువై, వారిలో తాదాత్మ్యత పొందటమే (సామీప్య, సాలోక్య, సారూప్య సాయుజ్యత) పూర్ణయోగము. లేక వస్తుగత సార్వత్రిక ఏకత్వము.

బాహ్య లేక వస్తుగత ఏకత్వము

నిరంతర మననము, దర్శనములు ఈ భక్తిమార్గంలో ప్రధాన విషయాలు, భౌతిక ప్రకృతి విషయాలు దర్శించినప్పుడు, మనుష్యులలోనూ, ఇతర ప్రాణులలోనూ సంబంధ మేర్పర్చుకునేటప్పుడు అవన్నీ మన దివ్యప్రేమకు పాత్రమైనవిగా భావించి వాటన్నిటిలో భగవంతుని దర్శించాలి. భౌతిక ప్రపంచపు పరిధులు దాటి ఇతర స్తరాల జీవులను కలిసినపుడు కూడా పై విధంగానే భావించి మనస్సుకి అదే విధంగా తెలియచెప్పుకోవాలి. కేవలం స్థూలవస్తువులతో, కంటి కెదురుగా కనిపించినంత వరకూ పై పై అసమగ్ర సాధారణ సంబంధాలనే పెంచుకొంటూ లోనున్న దైవాన్ని నిర్లక్ష్యం చేయడం, మనస్సుకు అలవాటు. ఆ అలవాటు నించి దాన్ని తప్పించి అంతర్దర్శనంతో సమగ్ర అవగాహనతో, అనుబంధాలతో, నిరంతరాయంగా, సర్వసహితంగా ప్రేమిస్తూ ఆనందించే అలవాటును మనసుకి కల్పించాలి. దేవతలందరూ కూడా ఆ

భగవంతుని వివిధ రూపాలే కాబట్టి మనం ఆరాధించే దైవాన్నే వారిలోనూ దర్శించాలి. మన ఆధ్యాత్మికతను ఆ విధంగా విస్తృతపరిస్తే సర్వత్రా ఆయన్నే దర్శించగలుగుతాము. అప్పుడు కలిగే ఆనంద చైతన్యం నిరంతరాయంగా ఉండే పద్ధతిలో ప్రపంచాన్ని చూడటం మనకి అలవడుతుంది. ఈ విధంగా దైవంతో సార్వత్రిక ఏకత్వం సిద్ధిస్తుంది.

అంతర్గత లేక ఆత్మాశ్రయ పరివ్యాపనమయ్యే ఏకత్వము

అంతరంగంలో దివ్యప్రేమికుని ప్రతిరూపం అంతర్నేత్రానికి దృశ్యమానమవ్వాలి. మన హృదయాన్ని తన దివ్యధామంగా ఆవాసం చేసుకోవాలి. తన అస్తిత్వ మాధుర్యం సర్వదా మనలో అత్యున్నతస్థానాన్ని అదిష్టించి ఉండాలి. మన సకల మనోజీవన కార్యకలాపాలకు ఆధిపత్యం వహించాలి. సర్వవ్యాపకమై ఉన్న తనతో పైనుండి మనకు ఐక్యత కల్పించాలి. తన దివ్యస్వరూపమును మన మనోనయనాలకు సదా దర్శింపచేస్తూనే ఉండాలి. ఈ విధమైన సంసర్గం ఎప్పుడో ఒకసారి మన బాహ్యావ్యాపారాల నుంచి విరమించుకుని అంతర్ముఖమై ఉండి, ఉపాసనాస్థితి అనుభవిస్తున్నప్పుడూ, ఏకాగ్రతలో ఉన్న సమయాలకు మాత్రమే పరిమితం కాకూడదు. ఇది సర్వదా జరగాలి. మన సర్వ ఆలోచనలు, ప్రేరణలు, భావనలు, చర్యలు మొదలైన వాటినన్నిటినీ కూడా ఆయన అనుమతి లేక నిరాకరణ కోసం ఆయనకే నివేదింపబడాలి. అయితే మనం ఆ స్థితికి చేరలేనప్పుడు వాటిని మన గాఢ ఆకాంక్షా యజ్ఞంలో ఆయనకు సమర్పించుకోవాలి. అలా చేస్తే క్రమక్రమంగా ఆయనే దిగివచ్చి వీటన్నిటినీ పర్యవేక్షిస్తూ తన శక్తినీ, సంకల్పాన్నీ, వెలుగునూ, జ్ఞానాన్నీ, ప్రేమనీ, ఆనందాన్నీ అందులో ప్రవేశపెడతారు. ఆఖరుకు మన ఆలోచనలు, భావనలు, ప్రేరణలు, చర్యలు, అన్నీ గూడా ఆయన దగ్గర్నుంచే రావడం ప్రారంభించి అవే దివ్యబీజాలై, ఆకృతులుగా మారిపోతాయి. మన ఆంతరంగిక జీవితమంతా కూడా చైతన్యవంతమై, దైవంలో భాగంగా అయిపోయి మనం ఉపాసించే దైవానికీ, మన జీవితానికీ విభేదం తొల

గిపోతుంది. ఆ తర్వాత మనకు జరుగుతున్నవన్నీ కూడా మన ప్రియుడైన భగవంతునితో జరిపే వ్యవహారాల మాదిరిగానే చూడ గలుగుతాము. కాబట్టి అవన్నీ మనకు ఆనందదాయకంగానే ఉంటాయి. చివరకు దుఃఖం, బాధ, వేదన – ఇవి దైవం ఇచ్చిన కానుకలుగానే స్వాగతీకరింపబడి హర్షామోదంగానే పరిణమిస్తాయి. ఆ దివ్య స్పర్శ ఒక పరుస వేదిగా వస్తువులను రూపాంతరం చెంది స్తుంది. కొంతమంది నిజంగానే జీవితాన్ని నిరసిస్తారు – అది దుఃఖమయమూ, బాధామయమూ అని. కానీ దైవాన్ని ప్రేమించే వారికి అవి ఆయన దరికి చేర్చే సాధనాలు; ఆయన కల్పించిన ఒత్తిడి పట్ల ఏర్పడే గుర్తులు. చివరకు ఆయన ప్రకృతితో మన సంయోగం పరిపూర్ణమైనప్పుడు ఇవేమీ ఉండవు. అంతా ఆనం దమయంగానే పరిణమిస్తుంది.

ప్రేమికులు ఇద్దరి మధ్యన ఉండే అత్యంత ఆనందాతిశయ అనుబంధము

ఈ సంయోగానికి దారితీసే అనుబంధాలన్నీ సుస్థిరంగా, పరమా నంద హేతువులుగా తనకే స్వంతమవుతాయి. ఏ అనుబంధమైతే చివరకు అన్నిటినీ అనుసంధానం చేసి కలుపుతుందో అదే ప్రియు డికీ, ప్రియురాలికీ ఉండే అనుబంధం. అదే అన్నిటికంటే దృఢ మైనది. అన్నిటినీ కూడా అత్యున్నత స్థాయికి చేరుస్తుంది. అదే అన్నిటికన్నా మిన్న.

సంయోగం సమగ్రం కావాలంటే ఇతరమైన అనుబంధాల ఛాయల కలగలుపు అవసరం

ప్రారంభం నుంచీ ప్రియుడు, ప్రియురాలు మధ్య అత్యంత ప్రగాఢ అనుబంధం ఉండే అవకాశం ఉన్నప్పటికీ మిగిలిన భక్తిమార్గాల్లో ఉన్నట్లుగా ఈ పూర్ణయోగులకి అది అంతవరకే పరిమితం కాదు. మొదటి నుంచీ కూడా పూర్ణయోగి భగవంతునితో అనేక రకాల సంబంధాల ఛాయలు కలుపుకొని ఉంటాడు; జ్ఞానయోగం, భక్తి యోగం కూడా అనుసరిస్తాడు కాబట్టి దైవాన్ని మిత్రునిగా, గురు

వుగా, యజమానిగా చూసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. దైవం ఎడ ప్రేమ వృద్ధి పొందేకొద్దీ భగవంతుని గురించిన జ్ఞానం తన ప్రకృతిపై ఆయన ప్రభావము, తన జీవితంపై ఆయన చేతలూ దివ్య ఇచ్ఛాశక్తి – అన్నీ కూడా విస్తృతమై ప్రకటితమవుతాయి. చివరకు ఆయన ప్రేమికుడుగా, బహిరంగంగా తన జీవితాన్ని కైవశం చేసుకుంటాడు. ఈ విధంగా ముఖ్యమైన బంధం ప్రేమానుబంధమే. అందులో నుంచే సమస్తం ప్రవహిస్తాయి. అది ప్రగాఢము, సంపూర్ణము అయి తన పరిపూర్ణత కోసం శతకోటిమార్గాల ననుసరిస్తూ సంయోగంలోని ఆనందాతిశయమును సిద్ధింపచేసుకుంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

దైవంతో ఆంతరంగిక సంబంధ ప్రాముఖ్యత

మార్గదర్శకురాలిగా దివ్యమాత

ప్రశ్న: మీ ప్రేమ, ఆశీర్వాదాలు నా కెప్పుడూ వుంటాయని నాకు తెలుసు. కాని ఒక్కొక్కప్పుడు కోరుకుంటాను –అవెప్పుడూ ఒకే విధంగా ఉండకుండా ఉంటే బాగుండును – అని. ఎందుకంటే, మరి అలాంటప్పుడే కదా నా స్వాభావిక కష్టాలు మీకు విన్నవించుకోవటానికి, అవసరమైన రీతిలో మీ యోగాన్ని స్వీకరించటానికి, మరింత నాకు దుర్భరమయ్యేది? మరిది (ఈ కష్టం) లేకుండా శిష్యరికం ఏమిటి?

ఒక గురువుగా గాక, తాను ఇచ్చే దానికి ప్రతిఫలాన్నాశించని దివ్యమాతగా నేను నీకు నా ప్రేమ, ఆశీస్సుల నందజేస్తున్నాను.

*

ఎవ్వరికీ నేను గురువుని కావాలని ఆరాటపడటం లేదు. ఈ సమస్తానికీ దివ్యమాతననీ, ప్రేమశక్తి ద్వారా మౌనంగా వాళ్లను ముందుకు తీసుకుపోవాలనీ స్వభావసిద్ధంగా నాకు తెలుసు.

*

జగన్మాతనై, ప్రేమ ద్వారా, మౌనంగా పనిచేయడం, అప్రయత్నంగా జరుగుతుంది, అది నాకు చాలా సహజం.

*

ప్రశ్న: మీతో నా సంబంధాన్ని ఎలా భావిస్తున్నారు?
నీవు జగన్మాత బిడ్డవుగావా?

*

తన ప్రేమ హస్తాల్లో జగత్తును భరిస్తున్న జగజ్జనని కుండే దృక్పథమే, ఇప్పటి వరకూ అప్రయత్నంగా నాది కూడా. ప్రతీదానినీ సమభావంతో సహించే జగన్మాతగా ప్రతివానితోనూ వ్యవహారిస్తున్నాను. నన్ను సంతోషపెట్టడానికి అక్కడున్నవారంతా చేస్తున్నదాన్ని వారి ప్రేమకు చిహ్నంగా స్వీకరిస్తున్నాను. అందుకు, వారికి నేను కృతజ్ఞురాలిని. అనేకమంది – చాలామంది గాకపోయినా – నన్ను తమ గురువుగా భావిస్తున్నారని, గురువును సంతోషపెట్టడం, సాధనా మార్గంలో మెప్పు పొందడానికి చాలా మంచి మార్గమని, నన్ను సంతోషపెట్టడానికి ఆతురతతో వున్నారని ఈ రోజు గ్రహించాను. త్వరితంగా భగవంతుని దగ్గరకు తీసుకుపోయి ఆతని దివ్యకార్యానికి ఉపయోగపడేదేదో ప్రతివానిలోనూ ఉంది. దానిని ప్రోత్సహించడం, గురువుయొక్క ధర్మమని అర్థం చేసుకున్నాను. ఈ పాఠం నేర్పినందుకు చాలా కృతజ్ఞతలు.

*

వాళ్లు ప్రేమించేది, నన్ను గురించి వారేర్పరుచుకున్న, స్వీయమానసిక, ప్రాణిక రూపాన్నేగాని నన్ను గాదు. ఈ వాస్తవం నాకు చాలాసార్లు తెలిసొచ్చింది. ప్రతి వ్యక్తీ తన అవసరాలు, కోరికలకు తగినట్లు నా ప్రతి రూపాన్ని తయారుచేసుకొంటాడు. ఈ ప్రతి రూపంతోనే అతను సంబంధబాంధవ్యా లేర్పాటు చేసుకొం

టాడు. దాని ద్వారా అతడు విశ్వశక్తుల్ని అత్యల్పంగానే పొందు తాడు. ఈ రూపకల్పన లన్నింటిలో నుంచీ వడపోతగా ఏ కొంచె మైనా అతిమానసశక్తులు అతని లోనికి రాగలిగితే, వాటిల్లో నుంచి అల్పభాగాన్నే స్వీకరించగలుగుతాడు.

*

ఓ ప్రభూ! నేను నిన్ను మాత్రమే ప్రేమిస్తాను గనుక, సమస్తం లోనూ, ప్రతివానిలోనూ నేను ప్రేమించేది నిన్నే. వాళ్లలో ఉన్న నిన్ను ప్రేమించడంవల్ల వాళ్లలో నిన్ను గురించిన ఎరుక ఏ కొంచె మైనా కలిగించగలుగుతున్నాను.

ఏ విధమైన వివక్షత, ఆటంకం లేకుండా తాము ప్రేమిం చబడేట్లు చేసుకోవడం అనేది వాళ్లు సాధించవలసిన యథార్థ విషయం. తాము కోరిన రీతిగాకాక, మరో విధంగా ప్రేమించబడ డానికి ఇష్టపడకపోవడం మాత్రమేగాక తాము వరించిన మధ్యవర్తి ద్వారా వస్తే తప్ప మరో విధమైన ప్రేమ వాళ్లు అంగీకరించను గూడా అంగీకరించరు. కొద్ది గంటల్లో, కొద్ది నెలల్లో లేక కొద్ది సంవత్సరాల్లో సాధించబడేది ఇలా అయితే శతాబ్దాలు పడుతుంది.

*

ఆంతరంగిక సంసర్గం అవసరం

ఆధ్యాత్మిక పురోభివృద్ధికి భౌతిక సామీప్యత తప్పనిసరి అను కోవడం పెద్ద పొరపాటు. అంతరంగిక సంబంధం గనుక ఏర్పడి వుండకపోతే దానివల్ల ఏం ప్రయోజనం లేదు. అంతరంగిక సంబంధం లేకపోతే ఉదయం నుండి సాయంత్రం దాకా నీతో ఉన్నా నీవు నన్ను యథార్థంగా కలుసుకోనట్లే. అంతరంగ ఉన్మీ లనం ద్వారా, సంబంధం ద్వారా మాత్రమే నీవు నా సాన్నిధ్యాన్ని వాస్తవం చేసుకోగలుగుతావు.

*

యథార్థంగా ప్రభావం కలిగేవిధంగా, నీవు నా దగ్గరగా ఉండా లంటే, నీవు అధికాధికంగా చిత్తశుద్ధి కలిగి ఉండాలి. నా వైపు తిరిగి, నిష్కపటంగా ఉండాలి. నీలోని కాపట్యాన్ని పూర్తిగా

తొలగించివేసుకో. నాకు వెనువెంటనే తెలియజేయలేనిదానిని దేనినీ చేయనని తీర్మానించుకో.

*

...అంతరంగిక సంబంధాన్ని ఏర్పాటుచేసుకోవడం తెలుసుకో. (నేను ఏకాంతంలోనికి ఉపసంహరించుకోవడంలోని ప్రధానోద్దేశ్యాలలో అదొకటి) అపుడు నీకు మార్గం చూపి సహాయం చేయటానికి సదా నీతో నేను ఉంటున్నట్లు గ్రహిస్తావు.

చికాకుగా ఉండకు. నిశ్చలంగా హృదయంలో ఏకాగ్రతతో ఉండు. అక్కడ నన్ను కనుగొంటావు.

*

మీ ఆంతరంగిక ద్వారాన్ని తెరిచేందుకు నేను చాల జాగ్రత్త వహిస్తాను. ఏ కాస్తంత ఏకాగ్రత నీలో ఉన్నా మూసివున్న ద్వారాల చెంత – తెరవటానికి తాళం లేని, ఉన్నా తెరవటం ఎలాగో తెలియని – నీవు వేచి ఉండవలసిన పని లేదు. తలుపు తెరిచే వుంది, నీవు చేయవలసింది ఆ దిశగా చూడటమే. నీవు వెనుదిరిగి కూర్చోకు.

*

సర్వావస్థలలోనూ స్వేచ్ఛగా, శాంతితో, సదా జవసత్త్వాలతో సంతోషంగా వుండే నీ యదార్థ అస్తిత్వానికి జన్మ నిచ్చిన నిజమైన తల్లిని నేను.

*

ప్రశ్న: దివ్యమాతా! నా చేతనను నీవైపు త్రిప్పుకో.

నా ప్రేమ నెన్నడూ శంకించకు. అలా శంకించకుంటే అత్యంత సహజంగా నీవు నా వైపు తిరుగుతావు.

*

నేనెల్లప్పుడూ నీ హృదయంలోనే కూర్చుని ఉన్నాను, అచట సచేతనంగా జీవిస్తున్నాను.

*

నేను నీవు, లేదా నీవే నేను. అందుచేతే నేను నీతో ఉన్నాను. నేను, నీతో ఉన్నాను అనే మాట విషయప్రపంచమంత విశిష్టత గల మాట. ఎందుచేతనంటే, పరాత్పరచేతన దగ్గర్నుండి, నా అత్యంత భౌతికచేతన వరకూగల అన్ని అంతస్తులలోనూ, అన్ని స్తరాలలోనూ నేను నీతో ఉన్నాను. ఇచట పాండిచ్చేరిలో నా ఊపిరియే నీకు ఊపిరి. దాదాపు పదార్థరూపంగా ఈ వాతావరణమంతా నా చేతనతో నిండిపోయి ఉంది. సూక్ష్మభౌతికరూపంలో, ఇచట నుండి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సరస్సు వరకూ వ్యాపించి ఉంది. ఇంకా దూరంలో, ప్రాణిక ద్రవ్యంలో ఆ పైన మానసిక స్తరం పైన, ఇంకా పైనున్న స్తరాలలో ప్రతి చోటా నా చేతన అనుభూతి పొందవచ్చు. నేను మొట్టమొదటి సారి ఇచటికి వచ్చినపుడు, శ్రీఅరబిందో వాతావరణాన్ని – పది మైళ్ల దూరంలో, అంటే పది నాటికల్ మైళ్లు, కిలోమీటర్లు కాదు – పదార్థాన్ని స్పృశించినట్లు, అనుభూతి పొందాను. ఘనపదార్థమంత గట్టి స్పర్శ కలిగించే విశుద్ధమైన, తేజోమయమైన నిన్ను పైకెత్తగలిగినంత అతి తేలికైన వాతావరణాన్ని ఆకస్మికంగా అనుభూతిచెందాను.

చాలా కాలం క్రిందటే శ్రీఅరబిందో ఆశ్రమంలో ప్రతి చోట, మీకు గుర్తు చేయడానికి ఒక విషయాన్ని లిఖించి బాహాటంగా పెట్టారు. అది దివ్యమాత మీవంక చూస్తూ ఉన్నట్లుగానే మీరందరూ ఎప్పుడూ ప్రవర్తించండి. ఎందుచేతనంటే, నిజానికి ఆమె సదా చూస్తూ ఉంటున్నది.

ఇది కేవలం ఒక పదసంపుటి గాదు. వాస్తవం. ఎంతో స్పష్టమైన విధంగా నేను మీతో వున్నాను, సూక్ష్మదృష్టి ఉన్నవాళ్లు నన్ను చూడగలరు

నీ అస్తిత్వం యొక్క మనస్తత్వానికి సంబంధించిన అంశాలలో నీవు వేటిని పరివర్తన చేయాలి, వేటినభివృద్ధి చేయాలి, వేటిని బహిష్కరించాలి అనేది నీ అంతట నీవు వివేచించుకో

నేట్లు సదా మార్పులు చేస్తూ, వాటి మధ్య నూతన సంబంధాలను నెలకొల్పుతూ ఒక సామాన్య అర్థంలో దివ్యమైన నా క్రియాశక్తి ఎపుడూ నీలో పనిచేస్తూ ఉంటుంది.

అదలా ఉండగా, శ్రీఅరవిందుల, నా యొక్క ఉపదేశమునకు ఉన్ముఖులై ఉన్నవారందరికీ, నాకు మధ్య ఒక విశిష్టమైన వ్యక్తిగత అనుబంధం ఉంటుంది. నీవు ఫ్రాన్సులో ఉండవచ్చు, ప్రపంచానికి చివర లేదా పాండిచ్చేరిలోనే ఉండవచ్చు. దీనికి దూరంతో సంబంధం లేదు, ఈ బంధం ఎపుడూ యదార్థంగా, సజీవంగా ఉంటుందనేది వేరే చెప్పవలసిన అవసరం లేదు. నేనో క్రియాశక్తిని పంపడానికి, ఒక ప్రేరణ నివ్వడానికి, ఒక రక్షణ లేక మరేదైనా చేయవలసివచ్చినపుడు నాకు తెలియజేయవలసిన అవసరమున్న, పిలుపు వచ్చిన, ప్రతీసారీ నాకో వార్తలాంటిది ఆకస్మికంగా అందుతుంది. నేను అవసరానికి తగినట్లు చేయవలసింది చేస్తాను. ఇలాంటి సమాచారం ఏ క్షణంలోనైనా రావచ్చుననేది స్పష్టమే. నేను ఏదో మాట్లాడుతూ, లేక ఏ పనైనా చేస్తూ మధ్యలో హఠాత్తుగా ఆగిపోవడం అనేకసార్లు చూసి ఉంటారు. ఏదో సమాచారం నాకందడం వల్ల దాని మీద కేంద్రీకరించడం వల్ల అలా చేయడం జరుగుతుంది.

నేను శిష్యులుగా అంగీకరించినవారికీ, నేను 'అవును' అన్నవాళ్లకూ నాకు మధ్య బంధంకంటె ఎక్కువైన సంబంధమే ఉంటుంది. నా నుండి వెలువడిన నా రూపమొకటి (an emanation) వారితో ఉంటుంది. అవసరం కలిగినప్పుడల్లా నన్ను హెచ్చరిస్తుంటుంది. అక్కడేం జరుగుతున్నదో చెబుతూ ఉంటుంది. నిజానికిటువంటి సూచనలను ఎప్పుడూ అందుకుంటూనే ఉంటాను. కాని అన్నీ నా స్మృతిపథంలో మెదుల్తూ ఉండవు. ఉంటే ఆ వరదలో మునిగిపోయేదాన్నే. నా భౌతికచేతన ఒక వడపోత పరికరంలా పనిచేస్తుంది. ఒక సూక్ష్మస్తరంలో విషయాలన్నీ నమోదు చేయబడి ఉంటాయి. అవన్నీ అచ్చట, కన్పించకుండా రికార్డు చేయబడి ఎవరూ వినకుండా ఉండిపోయిన సంగీతాంశంగల గ్రామఫోను ప్లేటులా ఉండిపోతాయి. నా భౌతికచేతనతో నేను తెలుసు

కోవలసిన అవసరం కలిగినపుడు, ఈ సూక్ష్మభౌతిక స్తరంలో సంబంధం పెట్టుకోగానే గ్రామఫోన్ ప్లేటు తిరగడం మొదలుపెడ్తుంది. సంగతులేమిటో, కాలంలో అభివృద్ధి ఎలా జరుగుతోందో, అసలైన పర్యవసానమేమిటో అపుడు నాకు తెలుస్తుంది.

ఏదో కారణంతో, నా సాయం కోరుతూ నీవు నాకు వ్రాస్తే, నేను "నీతో ఉన్నాను" అని సమాధానమిస్తే, దానర్థం, నీతో నా సమాచారం ఇచ్చిపుచ్చుకొనే యంత్రాంగం పనిచేయడం ప్రారంభమైనదన్న మాట. నీవు నా సక్రియచేతనలో కొంతసేపు ప్రవేశిస్తావు. అచట అవసరమైనంత కాలం అక్కడ ఉంటావు.

నీకూ నాకూ మధ్యగల ఈ బంధం ఎన్నటికీ విచ్ఛిత్తి గాదు. చాలాకాలం క్రితం ఆశ్రమాన్ని తిరుగుబాటు ధోరణిలో కొంతమంది విడిచి వెళ్లిపోయారు. అయినప్పటికీ వాళ్లను గురించి సమాచారం అందుకుంటూనే ఉన్నాను. అవసరమైనది వాళ్లకూ చేస్తూనే ఉన్నాను.

నీవెన్నటికీ విడిచి వేయబడవు.

యదార్థానికి నా జీవితకాలంలో ఒక్క సెకనుపాటు మాత్రమే నన్ను కలుసుకొన్నవారితో గూడా కలిపి, ప్రతి ఒక్కరి బాధ్యతను నా మీద వేసుకుంటాను. ఒక విషయం గుర్తుంచుకో. శ్రీఅరవిందులు, నేను, ఒకే చేతన, ఒకే మూర్తిత్వం. ఒకే విధమైన ఈ క్రియాశక్తి లేక ఈ దివ్యసన్నిధి, నీ వ్యక్తిగత చేతనలో నుండి పయనించినపుడు, అదొక రూపాన్ని తీసుకొంటుంది, దృగ్గోచరస్థితిని సంతరించుకొంటుంది. అది నీ చిత్తవృత్తిని బట్టి, నీ ఆకాంక్షను బట్టి, నీ అవసరాన్ని బట్టి, నీ అస్తిత్వం యొక్క ఒక ప్రత్యేక నడవడిని బట్టి విభిన్నంగా ఉంటుంది. చెప్పాలంటే నీ వ్యక్తిగతచేతన ఒక వడపోత పరికరంలా, ఒక సూచికలా, అనంతమైన దివ్యసంభావ్యతల నుండి ఒక సంభావ్యతను ఎన్నుకొని స్థిరీకరిస్తుంది. యదార్థానికి దైవం నుండి ఖచ్చితంగా ఏది ఆశిస్తున్నాడో దానినే ప్రతి వ్యక్తికి దైవం ప్రసాదిస్తుంది. దైవం చాలా దూరంగా ఉన్నాడు, కర్కశుడు అని నీవు నమ్మితే ఆతడు చాలా దూరంగానే ఉంటాడు, కర్కశంగానే

ఉంటాడు. ఎందుకనంటే భగవంతుని రౌద్రాన్ని నీవు అనుభూతి చెందడం చివరకు నీకు శుభం జరగడాని కవసరం. కాళీ ఉపాసకులకు అతడు కాళి, భక్తునికి బ్రహ్మానందస్వరూపుడు. జిజ్ఞాసువుకు దివ్యజ్ఞానం. భ్రాంతివాదికి అతీత నిరాకారం. నాస్తికుడికి నాస్తికుడు. ప్రేమికునికి ప్రేమ. ఆతడు సోదరస్వభావుడు, సన్నిహితుడు, సతతం విశ్వసనీయ స్నేహితుడు. ప్రతి క్షణం, ప్రతి కదలికలో ఆంతరిక మార్గదర్శకునిగా భావించేవారి కతడు తన తోడ్పాటు నందించ సదా సిద్ధంగా ఉంటాడు. ఆతడు సర్వదోషాలనూ పరిహరించివేయగలడని నమ్మితే, నీ సమస్త దోషాల్నీ, సమస్త పొరపాట్లనూ అవిశ్రాంతంగా పరిహరించివేస్తుంటాడు. ప్రతి క్షణం నీవాతని అనంత దివ్యకృపను అనుభూతి చెందగలుగుతావు. నీ ప్రగాఢ ఆకాంక్షలో దైవం నీకేమి కావాలని ఆశిస్తే, అదే అవుతాడు.

దైవానికీ, మనుష్యులకీ మధ్య అనంతంగా విస్తరించిన సంబంధబాంధవ్యాల నన్నింటినీ ఏకదృష్టితో చూడగల చేతనాస్థాయికి నీవెదిగినపుడు, ఈ ఉన్నదంతా, సవివరంగా ఎంత సుందరంగా కన్పిస్తుందో, మానవజాతి ఆధ్యాత్మిక చరిత్రను గనుక నీవు గమనిస్తే, మనుష్యులు ఆయన్ని ఎలా అర్థం చేసుకున్నారో, ఆయన్నెలా కావాలని కోరుకొన్నారో, ఆయనెలా ఉండాలని ఆశించారో, కలగన్నారో దాని కనుగుణంగా దైవం ఎంతగా పరిణమించాడో గ్రహిస్తావు. భౌతికవాదితో భౌతికవాదిగా ఎలా అయ్యాడో, ప్రతి రోజూ తన్ను తాను విశాలం చేసుకొన్న మానవచేతనను అనుసరించి, ఎంత సన్నిహితుడు, ప్రకాశవంతంగా పరిణమించాడో గ్రహిస్తావు. ప్రతి వ్యక్తికీ ఎంచుకోవడానికి స్వేచ్ఛ ఉన్నది. ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్ర మొత్తం అవలోకిస్తే, మనిషికి, భగవంతునికి మధ్య పరిపూర్ణ అనంత వైవిధ్యభరిత సంబంధాలు ఒక అనిర్వచనీయ అద్భుతం. అదంతా కలిపి, దైవంయొక్క సంపూర్ణ అభివ్యక్తితో పోలిస్తే క్షణమాత్రం గానే కన్పిస్తుంది.

నీ ఆకాంక్షకు అనుగుణంగా దైవం నీతో ఉంటాడు. అంటే నీ బాహ్యప్రకృతి చాపల్యాల కనుగుణంగా ఆతడు లొంగిపోతా

డని గాదు. నీ అస్తిత్వపు సత్యాన్ని గురించి నేనిక్కడ ప్రస్తావిస్తున్నాను. అయినప్పటికీ, నీ బాహ్య ఆకాంక్షలకు తగినట్లు కొన్ని కొన్ని సందర్భాల్లో తనను తాను రూపొందించుకొంటాడు. భక్తుల్లాగా, నీవు దైవంతో ఏకత్వంలోకీ, ఎడబాటులోకీ, పారవశ్యం, విరహంలోకీ మారుతూ జీవిస్తుంటే, దైవం కూడా నీ నమ్మకాన్ని బట్టి నీ నుండి వేరై ఉంటూ ఏకమౌతూ ఉంటాడు. నీ దృక్పథం బాహ్యదృక్పథంతో సహా చాలా ప్రధానం. విశ్వాసం ఎంత ప్రాముఖ్యమైనదో, ఎంత అద్భుతమో, అద్భుతాల సృష్టి కర్తో జనానికి తెలియదు. ప్రతి క్షణం దైవం నిన్ను ఉద్ధరించాలని, తన వైపు నిన్ను తీసుకుపోవాలని నీవు కోరుకొంటే,ఆతడు నిన్నుద్ధరించడానికి వస్తాడు, నీ కత్యంత సన్నిహితంగా, మరింత సన్నిహితంగా, నిత్యం సన్నిహితుడుగా వుంటాడు.

మూలం: శ్రీమాత

అనువాదం: కోనేరు వెంకటేశ్వరరావు

గురువు – శిష్యుడు దైవ అనుబంధాలలో ఒకటి

దైవంతో ఎన్నో అనుబంధాలు. అందులో గురుశిష్య సంబంధం ఒకటి. ఈ యోగలక్ష్యం అతిమానససిద్ధి కాబట్టి, ఇలా వ్యవహరించటం అసాధరణం. ఇందులో దైవం దివ్యజ్ఞాన చైతన్యకాంతిగా పరిగణింపబడి, ఆధ్యాత్మికసిద్ధికి మూలస్థానంగా పరిగణింపబడుతుంది. అంతా ఇక్కడి నుంచే అందుకున్నట్లు, సత్వం అంతా దివ్యహస్త పునర్నిర్మాణంగా భావింపబడుతుంది. ఈ బంధం సాధారణ గురుశిష్య సంబంధం కన్న ఉన్నతము, సన్నిహితము. సాధారణ గురుశిష్య బంధము ఒక పరిమిత మానసికభావన. అయినా ఇది సుపరిచితమైనదే. అవసరమైన మేరకు ఇది ఆచరణ యోగ్యమే. జీవాత్మకి బంధంగా ఉండకూడదు. దైవసంబంధానికి, విస్తృత అనుభవాలకి అది అవరోధం. అలా కారాదు.

అతిమానసయోగంలో 'గురు' శబ్ద ప్రయోగం అసాధారణం. ఇక్కడ ప్రతీదీ దైవీసంభూతమే. కావాలంటే ఎవ్వరైనా దీనిని తాత్కాలికంగా వినియోగించుకోవచ్చు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సమాచార పత్రం

శ్రీఅరవింద సొసైటీ సాధారణ వార్షిక సమావేశం అక్టోబరు 6, 2007 న కలకత్తాలోని రిజిస్టర్డు ఆఫీసులో నిర్వహింపబడుతుంది.

2007 నవంబరు 26 నుంచి డిశంబరు 4 వరకు శ్రీఅరవిందుల దివ్యకావ్యం 'సావిత్రి' పై గోష్ఠి డా॥ మంగేష్ నడ్కర్ణిగారిచే సొసైటీ బీచ్ ఆఫీసు (పుదుచ్చేరి) హాలులో రోజూ సా॥ 4.30 నుంచి 6.40 వరకు మధ్య 25 ని.లు విరామంతో నిర్వహించబడుతుంది. అందరూ ఆహ్వానితులే.

పుదుచ్చేరి శ్రీఅరవింద సొసైటీవారిచే, 2007 మే 20 నుంచి 28 వరకు వార్షిక విద్యాశిబిరం నిర్వహింపబడింది. ఉపాధ్యాయులు, కళాశాల అధ్యక్షులు, పాఠశాల యజమానులు, 52 మంది పాల్గొన్నారు.

వడోదర (గుజరాత్) బ్రాంచివారు రెండు శిక్షణా శిబిరాలు 2007 సం.రం మే నెలలో నిర్వహించారు. 5 రోజులు చొ॥న బట్టలకు అద్దకం మరియు కళాశిక్షణ నిర్వహించారు.

అన్నానగర్, చైన్నై (తమిళనాడు) కేంద్రంవారు పూర్ణయోగం గురించి పదకొండు రోజులు వేసవి శిబిరం 2007 మే నెలలో నిర్వహించారు.

ఖాన్డ్వా (మధ్యప్రదేశ్) బ్రాంచిలో శ్రీ భరత్‌సింగ్ జాలాగారు శ్రీఅరవిందుల వారిపై రెండు ఉపన్యాసాలు మే 28, 29 తేదీలలో ఇచ్చారు.

ప్రతాప్‌ఘర్ (ఉ. ప్ర) కేంద్రంవారు శ్రీఅరవిందుల యోగ ఆశయాల గురించి గోష్ఠి, మే 27 న ఏర్పాటుచేశారు. డా॥ జె.పి. సింగ్, డా॥ ధర్మపాల్ సింగ్, డా. అవినాష్, శ్రీ ఉదయరాజ్ మిశ్రా, శ్రీ రవి ప్రసాద్‌సింగ్ గారలు ప్రసంగించారు.

బెంగుళూరు (కర్నాటక) జె.పి. నగర్ శ్రీఅరవింద కాంప్లెక్సులో జూన్ 11 న శ్రీఅరవిందుల అవశేషాల సంస్థాపనోత్సవ దినం పాటించారు (సప్తమ వార్షికోత్సవం).

గోదావరి ఖని (ఆంధ్రప్రదేష్) కేంద్రంవారు శ్రీఅరవిందుల వారి యోగంపై డా॥ టి.వి. నాగరంజనిగారి ప్రసంగం మే 31 న ఏర్పాటుచేశారు.

ఏలూరు (ఆంధ్రప్రదేష్.) కేంద్రంవారు ఏప్రిల్ 1 వ తేదీన వారి కేంద్ర దశమవార్షికోత్సవం జరుపుకున్నారు. శ్రీ బి. వెంకట్రామయ్యా రాష్ట్ర చైర్మెన్‌గారు పాల్గొన్నారు. శ్రీఅరవిందులవారి 'సావిత్రి' కావ్యం గురించి ప్రసంగించారు. శ్రీమాత గురించి శ్రీ హర్షవర్ధన రాజుగారు మాట్లాడారు.


నీ హృదయము, ఆత్మ ఆధ్యాత్మికంగా మార్పును చిత్తశుద్ధితో ఆకాంక్షిస్తే అపుడు అందుకు మార్గాన్ని, మార్గదర్శకుని నీవు కనుగొంటావు.

ఆత్మ ద్వారాలు తెరవటానికి కేవలం మానసిక అన్వేషణ, విచికిత్స సరిపోవు.

శ్రీఅరవిందులు

Rs. 15

మహేశ్వరి



అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబరు 2007

మహేశ్వరి

విషయసూచిక

శ్రీమాత యొక్క నాలుగు శక్తులు

దివ్యమాతకు నాలుగు మహనీయ శక్తులున్నవి. ఆ నాలుగు ఆమె ప్రముఖ వ్యక్తిత్వాలు. అవి విశ్వాన్ని పరిపాలించడంలో అగ్రస్థానంలో నిలిచి ప్రపంచక్రీడకు సంబంధించిన ఆమె వ్యవహారాలను ఒక క్రమంలో, ఒక సామరస్యతలో పెట్టి, ఆమె సహస్రానేక శక్తుల లయవిన్యాసాలను చక్కబెడతాయి.

ప్రశాంత విశాలత, సంపూర్ణజ్ఞానం, అపారకరుణ, మహిమాన్వితమైన వైభవం, తిరుగులేని అధికారమహత్తులతో పనిచేసే శక్తి మొదటిది కాగా, ఆమె శోభాసమన్విత, నిర్నిరోధ ఉత్సాహం, ఆవేగం, ప్రచండమైన ఉత్తేజం, అప్రతిహతమైన సంకల్పం, దుర్నిరీక్షమై తేజోసమన్వితమై, ప్రపంచాన్ని ప్రకంపింపజేయగల మూర్తి భావం రెండవది. కాగా ఆమె తృతీయ వ్యక్తిత్వం, సముజ్వలం, సుమధురం, మహాద్భుతం, ఆకర్షణీయ సౌందర్య సామరస్యాలతో, ఘనమైన లయవిన్యాసాలతో, విరాజమానమైనది. ఇంక ఆమె నాలుగవ వ్యక్తిత్వం సకలజ్ఞాన సమన్వితమై సర్వసమర్థమై, తన కార్యకలాపములందు అణువణువునా పరిపూర్ణతతో, సామరస్యం, పటిమ, పటిష్ఠత మొదలైన లక్షణాలతో, నిండారివుండే దేవతామూర్తి. వీటన్నింటినీ ప్రపంచములోనికి గొనివచ్చి మానవ ముసుగులలో ఈ విభూతులను అభివ్యక్తం చేస్తుంది. తమ భౌతిక ప్రకృతిని శ్రీమాత సక్రియాత్మకత వైపు వికసింపచేసుకొన్న వారందరిలో వారి స్వభావం ద్వారా ఆధ్యాత్మికంగా ఎదిగేలా వారిని ప్రోత్సహిస్తాయి. ఈ చతుర్విధ శక్తులనే మనం మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అన్న దివ్యనామాలతో పిలుచుకుంటున్నాము.

ఇవికాక, దివ్యమాతకు మరిన్ని మహనీయ మూర్తిమత్వములున్నవి, అయినా అవి పరిణామంలో పనిచేయుటకు ఈ భౌతికస్థరమునకు అందుబాటులోకి దిగిరాలేదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కొంగర భాస్కరరావు



మహేశ్వరి అంశలో శ్రీమాత

మహారాజ్ఞి మహేశ్వరి ఆలోచనా మనస్సుకు, ఇచ్ఛకు, పైగా ఉన్న విశాలత్వంలో ఆసీనురాలై ఉన్నది; వాటిని వివేకంగా విస్తృతిగా నిర్మలం చేస్తుంది; మహనీయం చేస్తుంది; లేదా వాటికి అతీతంగా ఉన్న ఉజ్జ్వలవైభవాలతో వాటిని ముంచెత్తుతుంది. కారణం, ఆమె మహాశక్తి, వివేకం కలది. దివ్యచైతన్య అనంతత్వాలకు విశ్వమహావిశాలతకు, పరమప్రకాశ మహత్త్వానికి అద్భుతజ్ఞాన భాండాగారానికి, అమ్మ శాశ్వతశక్తులకు చెందిన అమేయ గమనానికి మనను తెరుస్తుంది.

ఆమె పరమ ప్రశాంతమూర్తి, ఎల్లప్పుడూ అద్భుతంగా మహనీయంగా, స్థిరంగా ఉండేది. సమస్త వివేకము ఆమెలో ఉన్నందువల్ల ఏదీ ఆమెను కదిలించలేదు; ఆమె తెలుసుకోవాలనుకున్నదేదీ ఆమె నుంచి దాగదు; సర్వవిషయాలను సర్వజీవులను, వారి స్వభావాన్ని వారిని కదిలించే వాటిని, ప్రపంచధర్మాన్ని దాని సమయాలను, సర్వం గతంలో ఎలా ఉన్నదో ఇప్పుడు ఎలా ఉన్నదో, ఎలా ఉండాలో గ్రహిస్తుంది. దేనినైనా ఎదుర్కొని స్వాధీనం చేసుకోగల ఒక శక్తి ఆమెలో ఉన్నది; విస్తారమైన ఆమె దుర్గ్రాహ్య వివేకానికి ఉన్నత ప్రశాంతశక్తికి వ్యతిరేకంగా ఎవ్వరూ విజయం సాధించలేరు. సమత్వం సహనం అచంచల ఇచ్ఛ కలిగి ఆమె మనుష్యులతో వారి ప్రకృతినిబట్టి, వస్తువులతో సంఘటనలతో వాటి శక్తిని బట్టి, వాటిలో ఉన్న సత్యాన్ని బట్టి వ్యవహరిస్తుంది. పక్షపాతం ఆమెకేదీ లేదు. కాని పరమాత్మ ఆదేశాలను అనుసరించి కొందరిని పైకెత్తుతుంది, కొందరిని క్రిందికి విసిరి పారవేస్తుంది లేదా తననుంచి దూరంగా అంధకారంలోకి త్రోసివేస్తుంది; వివేకులకు మరింత మహనీయమైన మరింత తేజోమయమైన వివేకాన్ని ఇస్తుంది; దర్శనం కలవారిని తన హితవర్గంలోకి రానిస్తుంది; విరోధుల మీద వారి విరోధానికి పర్యవసానాన్ని విధిస్తుంది; అజ్ఞానులను, బుద్ధిహీనులను వారి అంధత్వాన్ని బట్టి నడిపిస్తుంది; ప్రతి మనుష్యునిలోని విభిన్న

స్వభావ అంశాలతో, వాటి అవసరాన్ని, ప్రేరణను, వాటికి రావలసిన ప్రతిఫలాన్ని బట్టి సమాధానం ఇస్తుంది, వ్యవహారిస్తుంది, వాటి మీద అవసరమైన ఒత్తిడి కలిగిస్తుంది, లేదా అజ్ఞానమార్గాలలో బాగుపడటానికిగాని, నాశనం కావటానికిగాని వారు విలువైనదిగా భావించే స్వాతంత్ర్యానికి వారిని వదలివేస్తుంది. ఆమె అన్నింటికీ ఎగువన విశ్వంలో దేనికీ బంధించబడక దేనితోనూ సంగంలేక ఉన్నది. అయినప్పటికీ ఆమె అందరికన్నా ఎక్కువగా, విశ్వమాతృహృదయం కలది. కారణం ఆమె కరుణ అంతులేనిది, తరిగిపోనిది. ఆమె కంటికి అందరూ, అసురులు, రాక్షసులు, పిశాచాలు ఆమెకు ఎదురుతిరిగినవారు విరోధులు కూడా, ఆమె బిడ్డలే, ఏకంలో భాగాలే. ఆమె నిరాకరణలు ఒక వాయిదా మాత్రమే. ఆమె విధించిన శిక్షలు కూడా అనుగ్రహమే. కాని ఆమె కరుణ ఆమె వివేకాన్ని గ్రుడ్డిది చేయదు లేదా ఆదేశిత మార్గం నుంచి ఆమె కర్మను తప్పించదు; కారణం ఆమె ఒకే ఆసక్తి సత్యంపట్ల; ఆమె శక్తికి కేంద్రం జ్ఞానం. మన అంతరాత్మను మన ప్రకృతిని దివ్యసత్యంగా నిర్మించటమే ఆమె కర్తవ్యం; ఆమె శ్రమ.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

శ్రీమాతా! ప్రపంచశక్తుల కార్యాచరణ పద్ధతులను మహేశ్వరి నిర్ధారిస్తుంది. అంటే ఏమిటి?

అంటే ప్రపంచం ఎలా ఉండాలనేది ఆమె ప్రణాళికాబద్ధం చేస్తుంది. ప్రణాళికకు సంబంధించిన కార్యాచరణ పద్ధతులను నిర్ధారిస్తుంది. ప్రపంచం, విశ్వం ఎలా ఉండాలనేది నిర్దేశిస్తుంది. విశ్వసృష్టికి సంబంధించి ఆమెది సమ్యక్‌దృష్టి. వివరాలను విడివిడిగా చూడదు. మొత్తం అంతా పరిపూర్ణంగా దర్శిస్తుంది. సృష్టి ఎలా ఉండాలి, ఏ దిశగా పురోగమించాలి, ఫలితాలు ఎలా ఉంటాయి – అనేదాని గురించి ప్రణాళికా సూత్రాలను నిర్ధారిస్తుంది. విశ్వవిశాలదృష్టి ఆమెది. వివరాల జోలికి పోదు ఆమె.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

కొన్ని పదముల వివరణ

పరమోచ్ఛ చైతన్యశక్తియైన దివ్యమాత ఆ నాలుగు శక్తులతో (మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి) ఈ విశ్వాన్ని పాలిస్తూ కార్యకలాపాలని నిర్విహిస్తూ ఉంటుంది. మరి ఆలాగే అవి దివ్యమూర్తులుగా ఉంటాయి. ప్రతీదీ దివ్యత్వంయొక్క వివిధ లక్షణములను, స్వకీయ చైతన్యరూపములను వ్యక్తపరచే సత్వవిశేషమే.

*

దైవం నుండి వెలువడిన దేవతలను ఎలాగయితే ఉద్భూత దివ్య శక్తులని అనవచ్చో అలాగే ఒక విధంగా చూస్తే దివ్యమాత యొక్క ఈ నాలుగు శక్తులను వాటి ప్రభవస్థానం దృష్ట్యా ఆమె యొక్క దివ్యత్వం నుంచి ప్రభవించిన దివ్యశక్తులని అనవచ్చు. అయితే ఈ శక్తులకు అంతకంటె హెచ్చు స్థిరత్వలక్షణము, శాశ్వతత్వము ఉంటాయి. వాటి ఖేలనము స్వతంత్రంగా ఉండేలా దివ్య ఆద్యశక్తిచే అవి కల్పింపబడినవి. అయినా అవి దివ్యమాత, ఆ దివ్యమహాశక్తిలోని భాగములే. ఆమె ఎప్పుడూ వాటి ద్వారా వేర్వేరు శక్తులుగా తాను ప్రకటించుకొనగలదు. లేదా వాటన్నింటిని తనలోని వివిధములైన వ్యక్తీకరణములుగా విలీనం చేసుకొనగలదు. ఒక్కోసారి వెనక్కి తగ్గినట్లుగాను, మరోసారి క్రీడించునట్లుగానో ఆమె యధేచ్ఛగా ఉండగలదు. అతిమానసలోకంలో అవన్నీ ఆమెలోనే ఉంటాయి, స్వతంత్రంగా వ్యవహరించవు. అతిమానస మహాశక్తిలోని సన్నిహిత అంతర్భాగములుగానే పనిచేస్తాయి. ఒకదానితో మరొకటి చేరువై పొత్తుతో సామరస్యంగా వ్యవహరిస్తాయి.

*

ఈ నాలుగు దివ్యశక్తులూ జగన్నాటకంలో నిత్యమైనవి. దివ్యమాతయొక్క విశ్వాత్మకమైన దివ్యదేవతామూర్తులు. ప్రముఖమైన విశ్వాత్మక దివ్యదేవతామూర్తుల సరసన వాటికి స్థానం కలదు. ఈ ముల్లోకములయొక్క దివ్యమహాశక్తిగా దివ్యమాత "అచ్చట

(అధిమానస స్తరంలో) దేవతలకుపైన అధిష్ఠించి యున్నది" అని అన్నప్పుడే ఈ విషయం ప్రస్తావించబడింది. ఇంతకు ముందు చెప్పినట్లే దేవతలు మౌలికంగా, సంగ్రహంగా దైవంయొక్క శాశ్వత ఉద్భూతశక్తులు. విశ్వాతీత దివ్యమాత, దివ్య ఆద్యశక్తిచే పరమోచ్చ ప్రభువునుండి అవి ఆ విధంగా వ్యాప్తి చేయబడినవి. విశ్వక్రియాకలాపంలో అది దైవంయొక్క దివ్యశక్తులు, దివ్యమూర్తులు. ప్రపంచంలోని విధివిధానం, కార్యకలాపంలో దేనికదే ఆయన యొక్క స్వతంత్రమైన విశ్వాత్మక స్థానాన్ని కలిగి ఉంటుంది. అవి అవ్యక్త్యాత్మకములు కావుగాని విశ్వాత్మక దివ్యమూర్తులు. సాధారణంగా అవి అవ్యక్త్యాత్మశక్తుల చేష్టల వెనుక తెరచాటుగా ఉండగలవు, ఉంటాయి. అయితే అవి అధిమనస్సులోను, త్రైగుణ్య ప్రపంచంలోను స్వతంత్రశక్తులుగా ఉంటాయి. అతిమానసంలో దివ్యమైన ఏకత్వం లోనికి నిర్గమిస్తాయి. అచ్చట మాత్రం ఆ ఏకేశ్వరుని, ఆ దివ్యపురుషోత్తముని యొక్క అసంఖ్యాకమూర్తులతో కూడిన ఒక సామరస్యక్రియాకలాపంలో కలిసిపోతాయి.

*

విశ్వాతీత దివ్యమాత: ఈమెయే దివ్య ఆద్యశక్తిగా పిలువబడుతోంది; ఆమెయే విశ్వానికి పైన ఉన్న పరమోచ్చ దివ్య చైతన్యము, దివ్యశక్తి. ఆమె వలననే సమస్త దేవతలు ఆవిర్భవించారు. ఆఖరుకు ఏ అతిమానస దివ్యపురుషోత్తమునియొక్క దివ్యశక్తులుగాను, దివ్యమూర్తులుగాను, దేవతలయినారో, అట్టి అతిమానసిక దివ్యపురుషోత్తముడు కూడా ఆమె ద్వారానే అవతరిస్తాడు.

*

దివ్య ఆద్యశక్తి అంటే ఆ దివ్య ఆదిశక్తియే. అందువలన ఆమె దివ్యమాత యొక్క అత్యున్నత స్వరూపం. ఆమె తనకు తానే తాను దర్శించే స్తరాన్ని బట్టి వేర్వేరుగా ప్రకటించుకుంటుంది. (వివిక్త నిజస్వభావ)

*

దైవంయొక్క దివ్యచైతన్యం, దివ్యశక్తియే దివ్యమాత – ఆమెయే అన్నిటికి దివ్యమాత (అమ్మల గన్నయమ్మ)

*

దివ్యమాత దైవంయొక్క చైతన్యం, శక్తి – లేదా ఆమెయే చైతన్య శక్తిలోని దైవం అనవచ్చు. ఆ దివ్యమాత నుండియే విశ్వేశ్వరుడుగా ఆవిర్భవిస్తాడు. దివ్యమాతయే ఆయన ప్రక్కన విస్వాత్మక దివ్యశక్తిగా తన స్థానాన్ని అధిష్టిస్తుంది – ఆ విశ్వాత్మక దివ్య ఈశ్వరుడు దైవంయొక్క ఒక అంశయే.

*

దివ్య విశ్వాత్మక దివ్యశక్తి అన్నింటినీ కూరుస్తుంది. దివ్య విశ్వాత్మక దివ్యాత్మశక్తి (విరాట్ పురుషుడు) ఆమె చర్యకు ఆధారమయి ఉంటుంది. అవిద్యా పరిస్థితులలో పనిచేసే దివ్యశక్తియే దివ్యవిశ్వాత్మక దివ్యశక్తి – అది నిమ్నప్రకృతివలె తోస్తుంది. ఆ నిమ్నప్రకృతే నీచేత తప్పుడు పనులు చేయిస్తుంది. నీకై నువ్వు అంతకంటె అధికంగా ఏమీ ఆశించకుండా ఉన్నంతకాలం ఆ దైవం ఈ శక్తుల కార్యకలాపాన్ని అలాగే కొనసాగనిస్తుంది. నువ్వుగాని దివ్యమైన సాధకుడవయితే మాత్రం ఈ నిమ్న ప్రకృతి కార్యకలాపాన్ని అంగీకరించవు. దానికి బదులు నీవు దివ్యమాత వైపుగా మళ్లుతావు. ఈ నిమ్నప్రకృతి బదులు ఆమెనే నీలో పనిచెయ్యమని ఆహ్వానిస్తావు. సంపూర్ణంగా నీ సత్తలోని ప్రతిభాగమూ ఆ దివ్యమాత వైపే మళ్లి, ఆమెని మాత్రమే అభిలషిస్తే, ఆ దైవమే నీ ద్వారా అన్ని కార్యకలాపాలను నిర్వర్తింపచేస్తుంది.

*

ఆ ఈశ్వరీశక్తి, దివ్యచైతన్యశక్తి మరియు జగన్మాత శాశ్వతమై ఆ ఏకత్వానికి, ప్రకటితమైన ఈ దివ్య అనేకత్వానికి సంధానకర్త అవుతుంది. ఒక వైపు దివ్యుడైన ఆ ఒక్కడి నుండి గొనివచ్చిన ఆ శక్తుల ఖేలనముతో బహుముఖమైన దివ్యత్వాన్ని విశ్వంలో ఆమె అవతరింపజేస్తుంది. దృగ్గోచరానుగుణమైన తన పదార్థం నుండి అంతులేని రూపాలను లోనికి తెస్తూ, బయటకు వికసింప

జేస్తూ బహుముఖమైన దివ్యత్వాన్ని విశ్వంలో ఆమె అవతరింప జేస్తుంది. మరోవైపు నుండి ఆమె ఇదే శక్తుల యొక్క పునరధి రోహణ ప్రవాహంతో ఏ పరమాత్మనుండి అందరు ఉత్పన్నమ యినారో దాని లోనికే తిరిగి మరలునట్లు చేస్తుంది. ఇలా చేయ డంలో ఆత్మ తన వ్యక్తీకరణయొక్క పరిణామక్రమంలో ఇంకా ఇంకా అచ్చటి దివ్యత్వం వైపు మరలడమో లేక ఇచ్చటే ఆ దివ్యత్వ లక్షణాన్ని ధరించడమో జరుగుతుంది. ఆమె విశ్వాత్మక శిల్పనిర్మాణ విధానాన్ని కల్పన చేస్తున్నప్పటికి అచేతనాత్మకము, యాంత్రికమునైన కార్యనిర్వహాకురాలి స్వభావం ఆమెలో లేదు. ఆదిలో దివ్యప్రకృతిలో, దివ్యనైసర్గిక శక్తులలో కనపడే ముఖస్వ భావ లక్షణాలు ఆమెలో లేవు. దివ్యమాయయొక్క ప్రథమ దర్శ నంతో బాటు కలిగే భ్రమలు, పాక్షిక భ్రాంతులు జనింపజేసే అవా స్తవికతాబుద్ధి కూడా అచట లేదు. ఏ పరమోచ్ఛ ప్రభువు నుండి ఆమె దిగివచ్చినదో ఆ పదార్థస్వభావాల చైతన్యశక్తి ఇచ్చటనే కలదని ఆత్మానుభవం పొందుతున్నప్పుడు వెంటనే తేటతెల్లమ వుతుంది. మనం అర్థం చేసుకోలేని ఆమె ఫథకం మనల్ని ఆమె అవిద్య, అచేతనములలో ముంచినట్లనిపిస్తుంది. ఆమె శక్తులన్నీ విశ్వంలో తారసపడే అనుమానాస్పదమైన శక్తులవలె గోచరిస్తాయి. ఆమె ఒక దివ్యచైతన్యాన్ని మనలోనే వృద్ధి చెయ్యడానికి శ్రమి స్తూన్నదని త్వరలోనే గ్రహిస్తాం. ఆమె మన పైన నుండి మనల్ని ఆమె యొక్క ఉన్నతస్థానానికి లాక్కొనిపోతూన్నదని తెలుస్తుంది. దివ్యజ్ఞానం, దైవేచ్ఛ, దివ్యానందముల సారాన్ని క్రమక్రమంగా మనకు తెలిసేలా చేస్తారు. అవిద్యాచలనములలో కూడా తాను వేసే అడుగులకు ఆమె ఊతం ఇస్తున్నదని సాధకుని ఆత్మకు అవగతమవుతుంది. ఆమె నింపాదిగాకాని, వడిగాకాని, నేరుగాకాని, చుట్టుదారులలోగాని అంధకారం నుంచి మహోన్నత చైతన్యం లోనికి, మృత్యువు నుండి అమరత్వం లోనికి, చెడు నుండి మంచికి, బాధ నుండి సంతోషానికి తీసికొనిపోతుంది. అయితే మానవమేధస్సు ఇప్పటికి వీటన్నిటి అస్పష్ట ప్రతిరూపాన్ని మాత్రమే రూపుదిద్దుకొనగలదు. అలాగ ఒక్కసారిగా ఆమె శక్తి

విముక్తిదాయని, గమనశీలి, సృజనాత్మకం, సార్థకమునై వ్యవహ రిస్తుంది. సృజనాత్మకమంటే వస్తువులు అవి ఉన్నదున్నట్లుగా మాత్రమేకాక, అవి ఎలా ఉండాలో అలాగ అని భావించాలి. అవిద్యా పదార్థంతో నిర్మించబడిన అధోచైతన్యం యొక్క చిక్కుపడిన, ముడివడిన చలనాలను ఆమె శక్తి నిర్మూలిస్తుంది. ఆమె ఒక మహోన్నత దైవీప్రకృతియొక్క పదార్థశక్తుల లోనికి అతని ఆత్మను, నైజాన్ని పునర్నిర్మించి కొత్త పుంతలు తొక్కి స్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: వై.యస్.వి.యస్. మూర్తి

త్రివిధ మూర్తిత్వము

మనకీ, ఈ జగత్తు కంతటికీ ఆధారభూతమైన చైతన్యశక్తితో నీవు ఏకత్వ సంసర్గం కలిగినపుడు శ్రీమాత మూర్తిత్రయాన్ని గమనించగలవు. అందులో సర్వాతీతశక్తి ఆదిపరాశక్తిగా లోకాలకు పైన ఉండి సృష్టినంతటినీ పరమాత్మయొక్క అప్రకటిత నిగూఢతత్వంతో అనుసంధానం చేస్తూ ఉంటుంది. సార్వత్రిక మహా విశ్వశక్తిగా జీవకోటిని సృష్టిస్తూ వాటిని తనలోనే ఇముడ్చు కుంటూ తను వాటిలో ఇముడుతూ ఈ శతకోటి శక్తులనూ, ప్రక్రియలనూ పోషిస్తూ, పాలిస్తూ ఉంటుంది. అఖండత్వశక్తిగా మిగిలిన రెండు అస్తిత్వాల అపార విధానాల ప్రాభవాన్నీ తనలో మూర్తీభవించుకొని వాటిని ఉత్తేజితంగా మనకు దగ్గరగా తెచ్చి మానవ వ్యక్తిత్వానికి, దైవత్వానికీ మధ్య వారధిగా పనిచేస్తుంది.

అన్నిటికీ మూల అతీతశక్తి అమ్మ అన్ని లోకాలకు పైన నిలిచి ఉంటుంది. అనంతమైన ఆమె శాశ్వత చైతన్యంలో ఉన్న దంతా పరబ్రహ్మమే. ఆ పరబ్రహ్మశక్తికీ, వర్ణనాతీత ప్రత్యక్ష రూపానికీ తానే ఆశ్రయమవుతుంది. ఆవిష్కృతం కావలసిన పర మసత్యాలను పిలిచి, వాటి రహస్యస్థావరం నుంచి తన అనం

తచ్చైతన్యపు వెలుగులో దింపుతుంది. తన అపారశక్తి ప్రాపకంలో, నిరవధికమైన చైతన్యంలో వాటి శక్తికొక ఆకృతినీ, జగత్తులో ఒక రూపాన్నీ ప్రదానం చేస్తుంది. ఆ పరబ్రహ్మ శాశ్వత సచ్చిదానందంగా ఆమెలో అభివ్యక్తమై ఉంటాడు. అంతేకాక సమస్త లోకాల్లో, సమస్త భూమికల్లో, సమస్త దేవతారూపాల్లో వారి వారి సత్వాల్లో ఆమె తత్వంగానే ఉంటాడు. ఈ విధంగా తెలిసిన అన్ని లోకాల్లో, తెలియని లోకాల్లోనూ గూడా ఆమెలోనే గుర్తింపు పొందుతాడు. అంతా కూడా దైవంతో ఆమె నెరిపే లీలావిలాసమే. శాశ్వత లోకాలలో నిగూఢంగా ఉన్న అద్భుతాల వ్యక్తీకరణమే ఆమె. ఉన్నదంతా ఆమెయే. ఎందువల్లనంటే అంతా ఆ పరబ్రహ్మ చైతన్యశక్తి విభాగాలే. ఆమె నిర్ణయించి పరంధాముడు అనుమతించనిదంటూ ఏదీ ఎక్కడా ఉండబోదు. ఉండదు. ఆ పరబ్రహ్మ ప్రతిపాదిస్తే తాను గ్రహించి తన సృజనాత్మక ఆనందంలో దానికొక బీజరూపమిచ్చి ఆకృతి నేర్పరిస్తే తప్ప ఏదీ ఏర్పడదు. ఆ జగన్మాత, ఆ మహాశక్తి తన సర్వాతీత చైతన్యంతో పరబ్రహ్మ నుండి వెలువడిన చలనాలకు క్రియారూపమిచ్చి తను సృష్టించిన లోకాల్లో ప్రవేశిస్తుంది. ఆమె ఉనికే వాటికి దైవస్ఫూర్తినీ, వారికి ఆధారభూతమైన దైవశక్తినీ, దివ్య ఆనందాన్ని అందించి వారిని పోషించి పాలిస్తుంది; లేకపోతే వారికి అస్తిత్వమే ఉండదు. మనం పరాప్రకృతి అని వ్యవహరించేది అతి బాహ్యరూపమైన ఆమె కార్యనిర్వాహకరూపమే. ఆ పాత్రలో ఆమె తన శక్తులనన్నిటినీ సామరస్యమైన ఒక అమరికగా కూర్చి క్రమ పద్ధతిలో నడిపిస్తుంది. ఇంకా ప్రకృతి ప్రక్రియల నన్నిటినీ ప్రచోదనం చేస్తుంది. ఆ ప్రక్రియల్లో ప్రత్యక్షంగా ఉండేవాటిలో వ్యక్తంగానూ, కేవలం అనుభవమయే వాటిలోనూ జీవనసరళిలోనూ సంచరిస్తుంది. ఒక్కొక్క లోకమూ దానికై ఏర్పడిన ఆ మహాశక్తి ఏకైక కేళీవిలాసం తప్ప వేరు కాదు. లోకోత్తర జగన్మాత యొక్క ప్రత్యగాత్మగా, వ్యక్తిత్వంగా ఏర్పడినదే ఈ మహాశక్తి. ప్రతి ఒక్కటీ ఆమె దివ్యదృష్టిలో గోచరింప చేసుకొని, తన మనో

హార హృదయసీమలో ప్రోదిచేసి శక్తి నింపి ఆనందసీమలో సృష్టించినదే.

ఆమె సృష్టిలో ఎన్నో భూమికలు, ఎన్నో శ్రేణులు ఉన్నాయి. మనము నివసిస్తున్న ఈ లోకానికి చాలా పైన అపారమైన సత్. చిత్‌శక్తి, ఆనందములతో ఉన్న లోకాలెన్నో ఉన్నాయి. వీటన్నిటినీ చూస్తూ శ్రీమాత అనాచ్ఛాదిత శాశ్వత శక్తిరూపంగా పైన నిలిచి ఉంది. అక్కడుండే జీవులందరూ అనిర్వచనీయ పరిపూర్ణత్వంతో, సుస్థిరమైన ఐక్యతతోనూ నివసిస్తారు. దానికి కారణం ఆమె నిరంతరం వారిని కనిపెట్టి కాపాడుతూ ఉంటుంది. మనకి కొంచెం దగ్గరగా పరిపూర్ణ అతిమానససృష్టికి సంబంధించిన లోకాలున్నాయి. వాటిలో శ్రీమాత అతిమానసమహాశక్తిగా మూర్తీభవించి ఉంటుంది. అక్కడ ఆమె భగవంతుని సర్వజ్ఞపూర్వక సంకల్పశక్తిగా, సర్వపరిజ్ఞానశక్తిగా అమోఘమైన కార్యాచరణతో, పరిపూర్ణ ప్రక్రియలతో ప్రస్ఫుటంగా ఉంటుంది. అక్కడ జరిగే క్రియలన్నీ పరమసత్యపు చలనాలే, అక్కడి జీవులందరూ భగవంతుని వెలుగుతో నిండిన ఆత్మలూ, శక్తులూ, దేహాలు. అక్కడ జరిగే అనుభవాలన్నీ గూడా సాంద్రపరమ ఆనంద సంద్రాలు, కెరటాలు, తరంగాలు. కానీ ఇక్కడ మనముండే లోకాలు, అజ్ఞానపులోకాలు, మూలచైతన్యం నుంచి విడిపోయి మనోమయ, ప్రాణమయ, అన్నమయ లోకాలు; వీటన్నిటికీ కేంద్రమైన ఈ భూమికి పరిణామక్రమమనే కీలక ప్రక్రియ ఉంది. ఇక్కడంతా అవ్యక్త, సంఘర్షణ, అపరిపూర్ణతలతో గూడి ఉన్నప్పటికీ జగన్మాత సహాయం దీనికుంది. ఆ మహాశక్తి దీని రహస్యగమ్యం కోసం ప్రేరేపించి ముందుకు నడిపిస్తోంది.

శ్రీమాత ఆ మహాశక్తిగా ఈ త్రిగుణాత్మక అజ్ఞానమయ లోకానికి సాయంగా మనకీ అతిమానసలోకానికీ మధ్య స్థరంలో ఉంటుంది. ఆ అతిమానస ప్రకాశము, సత్యజీవనము, సత్యదృష్టి ఇక్కడికి రావలసియుండగా చైతన్యస్థరాల ఆరోహణ, అవరోహణలు ఒక ద్వంద్వ సోపానపంక్తిగా ఏర్పడడంవల్ల అజ్ఞానమయ పదార్థంలోకి జారిపడిపోతాయి. తిరిగి మనఃప్రాణజీవనాలు వికాసం

చెందడం ద్వారా అవి పరమాత్మ అనంతత్వంలో చేరిపోతాయి. ఇంకా ఆమె ఈ జగత్తులోనూ, భూమి పరిణామగతిలోనూ జరుగవలసినది తన దివ్యదృష్టితో చూసి, స్పందించిన ప్రకారం నిర్ణయించి వెలువరిస్తుంది. దేవతలందరికీ పైన ఉండి తన శక్తులను, విభూతులను రావించి కార్యనిర్వహణలో ఉంచుతుంది. ఇంకా వారి అంశలను ఈ అధోలోకాలలో నియోగిస్తుంది. అవి ఇక్కడకు వచ్చి వాటిని పరిపాలిస్తూ, యుద్ధాలు చేసి విజయాలు సాధిస్తూ వాటికి దారిచూపి నడిపిస్తూ, వాటి గతులను మారుస్తూ ఒక్కొక్కసారి మొత్తంగాగానీ, విడివిడిగా గానీ వాటి వాటి శ్రేణులను, శక్తులను నిర్వహిస్తాయి. యుగయుగాలుగా వివిధ రూపాలతో, పేర్లతో మానవుల పూజలందుకునే దేవతామూర్తులు, అమ్మవార్లు అన్నీ ఈ విభూతుల అంశలే. అంతేకాక ఈ శక్తులు, వాటి వాటి అంశల ద్వారా తన యొక్క విభూతులకు మనశ్శరీరాలనూ, ఇంకా పరమేశ్వర విభూతులకు కూడా మనశ్శరీరాలను సమకూరుస్తుంది. ఇవన్నీ కూడా భౌతికప్రపంచంలో తను మానవచైతన్యంతో అవతరించినప్పుడు కొంతగా తన శక్తి, స్వభావం, సముపస్థితి (తన స్థితి) నిలపటం కోసమే. భూమండలంలోని సంఘటనలన్నీ ఒక నాటకదృశ్యాలే. ఆమె స్వయంగా విశ్వదేవతల సహాయంతో రూపొందించి తనొక గుప్తపాత్రధారిణిగా నిర్వహిస్తుంది.

శ్రీమాత పైనుంచి పరిపాలన చేయడమే కాకుండా ఈ అల్ప త్రిగుణాత్మక జగత్తులోనికి స్వయంగా అవతరిస్తారు. యాదృచ్ఛికంగా ఇక్కడ జరిగేవన్నీ కూడా, చివరకు అజ్ఞానక్రియలు కూడా తెర మరుగుశక్తిగా ఉన్న ఆమె చర్యలే. ఇంకా తక్కువ సత్వముతో ఆమె తయారుచేసిన ప్రకృతిశక్తి, ప్రకృతి శరీరము. అవి అస్తిత్వం పొందటానికి కారణం పరబ్రహ్మచే నిర్దేశితములై ఈ అనంతత్వంలో ఉండే సంభావ్యతతో సాధించగలిగినది సాధించి చూపటానికే. దీని కోసమే ఆమె ఈ మహోన్నత త్యాగానికి సిద్ధపడి అజ్ఞానపూరిత ఆత్మ, శరీరములనే ముసుగులు ధరించడానికి సమ్మతించారు. అంతేకాక వ్యక్తిగతకారణాల వల్ల కూడా ఆమె ఇందుకు ఒడబడినారు. ఆమె ఈ అంధ

కారంలో దిగబడి దాన్ని వెలుగులోకి నడిపించాలనీ, అసత్యం, భ్రాంతి – వీటిలోకి వెళ్ళి వాటిని సత్యమార్గంలోకి మళ్ళించాలనీ, మృత్యువు దగ్గరకు వెళ్ళి దాన్ని దివ్యజీవంగా మార్చాలనీ, దుఃఖ మయ ప్రపంచంలోని బాధలను, వేదనలను పారవశ్యంతో అమం దానందంగా మార్చేయాలనీ ఈ మహాత్యాగానికి ఒడబడ్డారు. ఆమె తన బిడ్డలపైగల అపారప్రేమ వలన ఈ అజ్ఞానపు ముసుగు ధరించటానికీ, అంధకార, అసత్యవాద శక్తుల హింసాయుత భావాలనూ, తాకిడులనూ భరించడానికీ, జననమరణ వేదనలను అనుభవించడానికీ, ఇంకా సృష్టిలోని వ్యధలను, బాధలను, దుఃఖా లనన్నిటినీ మోయటానికీ ఒప్పుకున్నారు. ఈ విధంగా మాత్రమే వాటన్నిటినీ శాంతి, సంతోషము, సత్యము, శాశ్వత జీవితముల దగ్గరకు చేర్చటానికి వీలవుతుంది. ఇదే ఆ మహోన్నత త్యాగము, దీన్నే పరమపురుషుని త్యాగమని కూడా అంటారు. కానీ అంత కంటె కూడా ఇదొక ప్రకృతియజ్ఞము. శ్రీమాత నిర్వహించే మహా క్రతువు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

మన బలానికి వెనుక, దివ్య.శక్తి సదా ఉన్నదనే విశ్వాసం మనలో ఉండాలి. ఆ దివ్యశక్తి అభివ్యక్తమైనపుడు, మన బలం అజేయమూ, సంపూర్ణమూ అవుతుంది లేక వృద్ధి చెందుతుంది. చేతనావంతమైన మహాశక్తి, సర్వశక్తిమంత మైన ఆత్మశక్తిని ఆయుధంగా ధరించి అనాది కాలంనుంచి సమస్తాన్నీ సృజిస్తున్న విశ్వమహాదేవత అయిన ఆమెకు అసాధ్యమైందేమీ లేదు. సమస్త జ్ఞానం, సర్వసత్త్వాలూ, సమస్త విజయోత్సాహం, విజయం, సమస్త కౌశలమూ, కార్యాలూ ఆమె హస్తాల్లోనే వున్నాయి. ఆత్మ పెన్నిధులు, సమస్త పరిపూర్ణతలు, సిద్ధులు, ఆ దివ్యమాత హస్తాల నిండుగా ఉన్నాయి.

అనువాదం: కె. వి. రావు

మహేశ్వరి ఆలోచనామనస్సును వివేకంగా నిర్మలపరుస్తుంది.

మహారాజ్ఞి మహేశ్వరి ఆలోచనామనస్సుకు, ఇచ్ఛకు పైగా ఉన్న విశాలత్వంలో ఆసీనురాలై ఉన్నది; వాటిని వివేకంగా విస్తృతిగా నిర్మలం చేస్తుంది, మహనీయం చేస్తుంది; లేదా వాటికి అతీతంగా ఉన్న ఉజ్జ్వల వైభవాలతో వాటిని ముంచెత్తుతుంది.

శ్రీఅరవిందులు

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

వివేకం అంటే ఏమిటి?

మానవునిలో రెండు కలిసి ఉండే శక్తులున్నాయి. జ్ఞానము, వివేకము. జ్ఞానము సత్యసంబంధి ఎంతగానో. మనసు తడుముకుంటూ వస్తూండటంవల్ల వక్రంగా అది దర్శింపబడుతోంది. దివ్యదృష్టితో ఆత్మావలోకనం చేసేది వివేకం.

(శ్రీఅరవిందులు: తలపులు, సూక్తులు)

శ్రీమాత వ్యాఖ్యానం

"ఈ శక్తులు ఎందుకు కలిసి ఉన్నాయి?" అని నన్ను ఒకరు అడిగారు. నాకేమనిపిస్తుందంటే మనిషిలోని మూలపదార్థాలు ఒకదాని మధ్య ఒకటి పోట్లాడుకోవడమే మనం చాలామటుకు చూస్తుంటాం, అవి కలిసి ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కాని ఈ ఘర్షణలు పైపైన కనపడేవే. పై లోకాలనుంచి వచ్చే శక్తులన్నీ యదార్థానికి తప్పనిసరిగా మిత్రులే. అవి అజ్ఞానం మీద పోరాటం చేయటానికి ఒప్పుకున్నాయి, అందువల్ల అవి ఒకటయాయి. ఇంకా శ్రీఅరవిందులు అర్థం చేసుకోగలవారికి సుస్పష్టంగా చెప్పేదేమంటే, వీటిలో ఒక శక్తి మనస్సుకు సంబంధించినది. మరొకటి ఆత్మకు సంబంధించినది. ఈ గాఢసత్యాన్ని కచ్చితంగా శ్రీఅరవిందులు తన సూక్తిలో వెల్లడి చేయాలనుకున్నారు. మనస్సు గనక రెండవశక్తిని సంపాదించాలాని ప్రయత్నిస్తే అది

ఆ విధంగా చేయలేదు. ఎందుకంటే ఆ శక్తి ఆత్మకు సంబంధించి నది, అది మనిషిలో ఆధ్యాత్మిక చైతన్యంతో పాటుగా పైకెగసేది.

జ్ఞానమనేది మనస్సు ఎంతో ప్రయత్నం ద్వారా సంపాదించేది, అది సరైన జ్ఞానం కాకపోయినప్పటికి అది మానసిక దృక్పథానికి సంబంధించిన జ్ఞానం మాత్రమే. మరి వివేకమేమో ఏమాత్రం మానసికం కాదు. మనస్సు దానిని సంపాదించడంలో అసమర్థమైనది, నిజానికి అదేమిటో కూడా దానికి తెలియదు. నేను మళ్లీ చెప్పేదేమిటంటే, వివేకమనేది అత్యావశ్యకమైన ఆత్మ శక్తి. అది ఆధ్యాత్మిక చైతన్యంతో మాత్రమే పుట్టగలదు.

ఆసక్తికరమయిన ప్రశ్నను అడగాలనుకుంటే అది శ్రీఅరవిందులు చెప్తున్న 'సత్యం వక్రీకరించబడిన మాధ్యమంలో చూడబడటం ఏమిటనేది?' ముందు అసలు ఈ 'వక్రీకరించబడిన మాధ్యమం' లో సత్యం ఏమవుతుంది?

ఎప్పటిలాగే శ్రీఅరవిందులు చెప్పేవాటిలో పలుస్థాయిలకు చెందిన అర్థాలుండగలవు. వాటిలో ఒకటి నిర్దుష్టమైనది కాగా మరొకటి ఇంకా ఎక్కువ సాధారణమైనది. బాగా నిర్దుష్టమైన అర్థంలో, వక్రీకరించబడిన మాధ్యమం అంటే మానసికమాధ్యమం. అది అజ్ఞానంలో పనిచేస్తుంది, అందువలన అది సత్యాన్ని దాని స్వచ్ఛతలో వ్యక్తపరచలేదు. కాని జీవనమంతా అజ్ఞానమయంగానే జీవించబడుతుంది కాబట్టి వక్రీకరించబడిన మాధ్యమం కూడా భౌతికవాతావరణం అవడం మూలాన, దాని ద్వారా వ్యక్తపరచబడే సత్యాన్ని, అది వక్రీకరిస్తుంది.

అయితే, ఇక్కడే ఈ సూక్తిలో అత్యంత సూక్ష్మవిషయం ఉంది. మనస్సు తడుముకుంటూ దేని దగ్గరకు చేరగలుగుతుంది? అది ఎప్పుడూ తడుముకునేదేననేది మనకు తెలుసు. అది తెలుసుకోవాలని అన్వేషిస్తూ, తప్పులు చేస్తూ, చేసిన ప్రయత్నాలే తిరిగి మళ్లీచేస్తూ ఉంటుంది. దాని పురోగమనం చాలా మందగొడిగా ఉంటుంది. కాని సత్యాన్ని ఏమాత్రం గ్రహిస్తుంది? ఏదో కాస్తంత – ముక్కా, చెక్కగా – పాక్షికము, అసంపూర్ణము – గానా? అసలది ఏమాత్రం సత్యం కాకుండా ఉండేదా?

మనం ఎన్నోసార్లు చెప్పించుకుంటూనే ఉంటాం. బహుశా, మేము కూడా మళ్లీ మళ్లీ చాలాసార్లు చెప్పాం. మనం పొందగలిగేది పాక్షికమైన, అసంపూర్ణమైన, ఖండజ్ఞానం మాత్రమే. అందువలన అది సత్యజ్ఞానం కాజాలదు. ఈ దృక్పథం సర్వసాధారణం. ఏ కాస్తంత జీవితానుభవం ఉన్నా ఇది తెలుస్తుంది. అయినా శ్రీఅరవిందులు ఉద్దేశించిన 'వక్రీకరించబడిన మాధ్యమంలో చూడబడిన సత్యం' అనేది అంతకంటే చాలా ఆసక్తిదాయకమైనది.

సత్యము వెల్లడి అవటమే వేరుగా ఉంటుంది. ఈ మాధ్యమంలో ఇది ఏమాత్రం సత్యం కాదు, ఇది వక్రీకరించబడిన సత్యం. పర్యవసానంగా దానినుంచి అందుకోబడినది ఖండసత్యం కాదు, కాని అది ఒక దృక్పథం, కరిగిపోయిన సత్యపు కృత్రిమ రూపం.

నేను చెప్పేదేమిటో పూర్తిగా అర్థం కావటానికి ఒక ఊహాచిత్రం మీ ముందుంచుతాను. ఇది పూర్తిగా ఊహాచిత్రం మాత్రమే, దాన్ని యథాతథంగా తీసుకోవద్దు.

మనం అత్యంత ప్రధానమైన సత్యాన్ని కళ్లు మిరుమిట్లుగొలిపే ధవళకాంతి ఆకాశంతో పోల్చిచూస్తే మానసిక వాతావరణంలో ఈ పూర్ణధవళకాంతి వేలకువేల కాంతికిరణాలుగా పరివర్తన చెందుతుంది. ప్రతి కిరణానికి ఒక ప్రత్యేక రంగు ఉంటుంది. ఎందువల్లనంటే ప్రతీదీ ఒకదానితో మరొకటి విడివడి ఉంటుంది. ఈ మాధ్యమం ధవళకాంతిని వక్రీకరించి ఎన్నో అసంఖ్యాకమైన రంగులుగా కనపడేటట్లు చేస్తుంది; ఎరుపు, ఆకుపచ్చ, పసుపు, నీలం వగైరా, ఒక్కొక్కప్పుడు అవి పొందిక లేకుండా ఉంటాయి. మనస్సు ఆ ధవళాకాశంలోని ఏ కొంచెం ఖండధవళకాంతినీ పట్టుకోదు. కాని, అది పట్టుకునేది పెద్దవి, చిన్నవి స్వల్పకాంతి కలిగిన చాలా రంగులను మాత్రమే. వాటితో అది ధవళకాంతిని తిరిగి ఏర్పరచలేదు. అది అందువలన సత్యాన్ని చేరుకోదు. అది ఖండసత్యాలనూ పొందలేదు, కాని పొందేది చిందర

వందరైన సత్యాన్ని. అది ఒక రకంగా మూలపదార్థాలు విడివడిపోయిన పరిస్థితి (a state of decomposition)

సత్యం సంపూర్ణమైనది. మొత్తం అంతా అవసరమే. నువ్వు చూసే వక్రీకరించబడిన మాధ్యమం మానసిక వాతావరణం – దాని ప్రకటనకు లేదా అన్ని మూలపదార్థాల అవగాహనకైనా గాని సరిపోదు. శ్రేష్ఠమైనదానిని కోల్పోయామని మనం చెప్పవచ్చు. దానిని సత్యము అనలేము. మరేదో వేరొకదానికి చెందిన సత్యసారం, కాని మానసిక వాతావరణంలో ఏమాత్రం కాదు, అది అజ్ఞానం.

కాబట్టి, సారాంశంగా ఏమని చెప్తానంటే మానవ మనస్సు గ్రహించే జ్ఞానం ఏదయితే ఉందో, అది తప్పనిసరిగా అజ్ఞానభూయిష్టమయినది, ఇంచుమించుగా ఎవరైనా ఏమని చెప్పగలరంటే అది అజ్ఞానమయజ్ఞానమని.

వివేకమనేది సత్యసారాన్ని చూసే దృష్టి.

సత్యప్రకటనలో వినియోగపడేది.

*

ఎప్పుడు హేతువు చనిపోయిందో అప్పుడు వివేకం పుట్టిందని నాకు ఆలశ్యంగా తెలిసింది. ఆ విమోచనానికి ముందు నాకున్నది జ్ఞానం మాత్రమే.

(శ్రీఅరవిందులు: తలపులు, సూక్తులు)

శ్రీమాత వ్యాఖ్యానం

నేను మరొకమారు గట్టిగా మళ్ళీ చెప్పేదేమిటంటే మనస్సును కొద్దిగా ఆఘాతపరచి, మేలుకొలిపి అర్థం చేసుకోవటానికి ప్రయత్నించగలందులకై ఈ సూక్తులు కావాలనే విపరీతార్థాలతో పొందుపర్చి కూర్చబడినవి. దీనిని ఎవరూ కూడ యథాతథంగా తీసుకోగూడదు. వివేకవంతులవటానికి హేతువు మాయమయిపోవాలని చెప్పే ఆలోచన కొంతమందిని కలవరపర్చవచ్చు. అది అలా కానే కాదు.

హేతువే ఎంతమాత్రమూ పరాకాష్ఠ, అధిపతి కాకూడదు.

జీవితంలో ఒకరెవ్వరైనా ఏదైనా దివ్యజ్ఞానమనేదానిని పొందే దాకా, హేతువే అధిపతిగా ఉండక తప్పదు. అలా కాకపోతే అతడు అతని అనాలోచిత చర్యలకు, అతని వింతచేష్టలకు, అస్తవ్యస్త భావోద్వేగ కల్పనలకు ఆటవస్తువవుతాడు; అతడు వివేకహీనుడవటమేకాక, ఆమోదయోగ్యంగా ప్రవర్తించటానికి కావలసిన జ్ఞానానికి కూడ తనకు తానుగా దూరమవుతాడు. కాని ఒకరు సామాన్య మానవమేధస్సుకు శిఖరమైన హేతువు సహాయంతో నిమ్నభాగాలన్నింటినీ అదుపులోకి తేగలిగి, పిమ్మట అతను, ఆ స్థాయిని దాటిపోవాలనుకుంటే అతను సాధారణ ఆలోచనల నుంచి, సాధారణ విషయదృష్టి నుంచి, సాధారణ మానవ జీవితం నుంచి తాను విముక్తిపొందాలనుకుంటే, నేను ఏం చెప్తానంటే, అతను తప్పనిసరిగా హేతువుకు అతీతంగా నిలచి, దానిని ఏవగించుకుంటూ అణగద్రొక్కడం కాకుండా, దానిని ఇంకా మీదికి, అతీతంగా పురోగమనానికి ఉపయోగపడే మెట్టుగా చేసుకుంటూ, హేతువు యొక్క ఆజ్ఞలకు అధీనం కాకుండా, వాటితో అతి తక్కువగా తాను సంబంధం పెట్టుకునేదేదో ఒక స్థాయిని చేరాలి; ఊర్ధ్వకాంతితో ఇంకా ఏదో తనను తానుగా సహేతుకముకాని స్థితికి పోవాలి. ఎందుకంటే సహేతుకము కానిది సాధారణ (భౌతిక) జ్ఞానానికి ఆవలిస్థాయి. అది పైనుంచి, చాలా పైనుంచి దివ్యజ్ఞానం నుంచి స్ఫూర్తి పొందుతుంది.

దీని అర్థం అది.

ఇక్కడ శ్రీఅరవిందులు మాట్లాడే జ్ఞానం సాధారణ జ్ఞానం గురించి. అది తాదాత్మ్యతా దివ్యజ్ఞానం కాదు. అది సాధారణ పద్ధతుల ద్వారా, ఆలోచనలతో సంపాదించిన మేధోపరమైన జ్ఞానం.

ఏమైనా మనం తరువాత సూక్తి చదివేటప్పుడు దీనిని ప్రస్తావించక తప్పదు. కాని మళ్లీ మరోసారి చదివేటప్పుడు వెంటనే వివేకాన్ని చేరగలమనే ధృఢవిశ్వాసంతో హేతువును త్యజించడానికి తొందరపడవద్దు. ఎందుకంటే మీరు వివేకానికి

అర్హులు కావాలి. అలాకాక, హేతువును పరిత్యజిస్తే మీరు నిర్హే తుక పరిస్థితిలో పడిపోయే ప్రమాదం ఉంది.

చాలాసార్లు శ్రీఅరవిందులు తన రచనలలో ముఖ్యంగా, యోగసంయోజనంలో, కఠినమైన ఆత్మసంయమనం లేకుండానే, అన్ని రకాల ప్రేరణలకు తల ఒగ్గుతూ సాధన చేయవచ్చునని తలపోసేవారి గురించి హెచ్చరిస్తూ వచ్చారు. అది వారిలో సాధా రణ సంప్రదాయాలు, సాధారణ హేతువు నుంచి, విమోచనం అనే మిషతో, అణగద్రొక్కబడిన, దాగివున్న, గుప్తమైన కోరిక లను బయలుపరచి భయంకరమైన సమతులరాహిత్యానికి గురి చేస్తాయి.

ఎవ్వరైనా స్వేచ్ఛను పొందగలిగేది చాలా ఎత్తుకు ఎదిగిన ప్పుడు, మానవ తీవ్రభావాలను దాటి అతీతంగా ఉన్నతస్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే. ఉన్నతమైన ఆత్మస్వాతంత్ర్యాన్ని సాధించి కోరికలు, ప్రేరణలతో తెగతెంపులు చేసుకున్నవారికి స్వేచ్ఛను పొందే హక్కు ఉన్నది.

కాని, చాలా హేతుబద్ధంగా ఉండేవారు, సాధారణ సాంఘిక న్యాయసూత్రాల ప్రకారం చాలా నీతిమంతులు, తమకు తాము చాలా వివేకవంతులమనుకునేవారు కాదు. ఎందుకంటే వారి వివేకం ఉత్త భ్రమ. అది లోతైన సత్యంతో కూడి ఉండదు.

చట్టాన్ని వ్యతిక్రమించేవాడు చట్టానికి అతీతుడైనవాడు కావాలి. సంప్రదాయాలను పట్టించుకోనివాడు, సంప్రదాయాలకు అతీతుడై ఉండాలి. నియమాలను తృణీకరించేవాడు తప్పనిసరిగా వీటికి అతీతుడయి ఉండితీరాలి. ఈ రకమైన విముక్తి పొందా లనే ఉద్దేశం వ్యక్తిగతమైంది కాకూడదు, ఒక గాఢవాంఛను తీర్చుకోవటానికి, తన వ్యక్తిత్వాన్ని అతిశయపరచుకోవటానికి, తాను అధికుడననే భావన ద్వారాను, ఇతరుల మీద ఏవగింపు తోను తాను జనసమూహానికి, ఉన్నతంగా ఉంటూ వారిని కారు ణ్యభావంతో చూడటం కాకూడదు. నీవు ఇతరులకంటే అధికు డననే భావన వస్తే, వారిని హీనంగా చూస్తూ, నర్మగర్భంగా 'నేను మాత్రం ఆ మూసలో తయారుకాలేదు' అనే మాటయితే నీ జాగ్ర

త్తంలో ఉండు. అది నీవు దారితప్పుతున్నప్పుడే జరుగుతుంది. నిన్ను అది అగాధంలోకి కూలద్రోసే ప్రమాదపరిస్థితి.

ఎవరైనా ఒకరు వివేకాన్ని, నిజమైన వివేకాన్ని, ఇక్కడ శ్రీఅరవిందులు చెప్తున్నటువంటి వివేకాన్ని గనక పొందితే, అక్కడ ఎక్కువ తక్కువలు ఎంతమాత్రమూ ఉండవు, ఉండే దల్లా శక్తుల ఖేలనం మాత్రమే, అందులో ప్రతిదానికీ దాని ప్రత్యేకస్థానం, ప్రాముఖ్యం ఉంటాయి. ఒక వేళ ఏదయినా క్రమవ్యవస్థ గనక ఉంటే, అది పరమాత్ముని సమర్పణలో క్రమవ్యవస్థగా ఉంటుంది. అది క్రింది దానిమీద ఆధిపత్యంతో కూడిన క్రమవ్యవస్థ కాదు.

కాగా మానవ అవగాహనతో, మానవ హేతువాదంతో ఎవరూ ఈ క్రమవ్యవస్థను వివేచించి తెలుసుకోలేరు. ఒక జాగృత ఆత్మ మాత్రమే మరొక జాగృత ఆత్మను గుర్తించగలదు, అప్పుడు ఈ ఆధిపత్యం భావన పూర్తిగా మాయమయిపోతుంది.

అసలైన వివేకం అహంకారం మాయమయిపోయినప్పుడే వస్తుంది. అహంకారం ఎప్పుడు మాయమయిపోతుందంటే నిన్ను నీవు పూర్తిగా, ఎటువంటి వ్యక్తిగత ఉద్దేశం లేకుండా, ఎటువంటి లాభాన్ని ఆశించకుండా పరమేశ్వరునకు అధీనమయి ఉండేందుకు తయారుగా ఉన్నప్పుడే – ఎందుకంటే నీవిక మరో విధంగా చేయలేవు. అదే చేస్తావు.

*

మనుషులు జ్ఞానమని దేనిని అంటారంటే హేతుబద్ధంగా, ఆమోదయోగ్యమైన అసత్యరూపాలను. వివేకం ముసుగు వెనుకకు దృష్టి సారిస్తుంది, చూస్తుంది. హేతువు విభజిస్తుంది. వివరాలను నిర్ధారిస్తుంది. వాటి తారతమ్యాలని విచారిస్తుంది. వివేకం ఐక్యపరుస్తుంది, భేదాలన్నింటినీ సామరస్యంతో ఒకటిగా చేస్తుంది.

(శ్రీఅరవిందులు: తలపులు, సూక్తులు)

శ్రీమాత వ్యాఖ్యానం:

శ్రీఅరవిందుల రచనలలో జ్ఞానం, హేతువు, వివేకం మొదలైన వాటిగురించి చెప్పేదంతా మనలను సాంప్రదాయక ఆలోచ

నల గాడిలోనుంచి బయటపడేయటానికి. వీలయితే కనపడే రూపాల వెనుకనున్న నిజరూపాన్ని మనకు గోచరింపజేయడానికి.

సాధారణంగా జరిగేదేమిటంటే, కొన్ని చాలా అరుదైన మినహాయింపులతో, మనుషులు తమ చుట్టూ, అప్పుడప్పుడు తమ లోపల జరిగేవాటిని అన్నింటిని అంతో ఇంతో కచ్చితంగా పరిశీలించటంలో సంతృప్తి చెందుతుంటారు. అలా పరిశీలించినవాటి నన్నింటిని హేతువుకు సంబంధించిన పై పై నిస్సారమైన తర్క సిద్ధాంతాలతో ఏదో ఒకటిగానో మరొకటిగానో వర్గీకరిస్తూంటారు. అలా చేసిన సంవిధానాన్ని, సిద్ధాంతాలను 'జ్ఞానం' అని పిలుస్తూంటారు. వారు చూపేవి, స్పర్శించేవి, అనుభూతులు, అనుభవాలు అన్నీ కూడా కృత్రిమరూపాలు, నిజమైనవి కావు అనే విషయం వారికి ఎప్పుడూ తట్టదు. సరికదా! అలా గ్రహించే ఆలోచనే రాదు వారికి. 'కాని నేను చూస్తున్నాను, నేను స్పృశిస్తున్నాను, నేను అనుభూతికి లోనవుతున్నాను, కాబట్టి అది నిజం' ఇదే ఎప్పుడూ వారి సాధారణమైన వాదన.

దానికి వ్యతిరేకంగా తమకు తామే ఏం చెప్పుకోవాలంటే నేను చూస్తున్నాను, నేను స్పృశిస్తున్నాను, నేను అనుభూతికి లోనవుతున్నాను, కాబట్టి అది నిజం కాదు. మనం విభిన్న ధృవాల వైపుగా ఉన్నాం, పరస్పర అవగాహనకు రావడానికి మరే దారి లేదు.

కాని శ్రీఅరవిందుల పద్ధతిలో, అసలైన దివ్యజ్ఞానం సరిగ్గా తాదాత్మ్యజ్ఞానమే. వివేకస్థాయిని అందుకోవటం ఈ విధమైన జ్ఞానంలో ఉన్నప్పుడే ఎవరికేనా సాధ్యం. వారు ఇక్కడ చెప్పేది ముసుగు వెనకనున్న కృత్రిమరూపాలను వివేకం చూస్తుంది – వాటి వెనుకనున్న యదార్థాన్ని దర్శిస్తుంది. శ్రీఅరవిందులు నొక్కి చెప్పేదేమంటే – దేన్నైనా బాహ్యపరిజ్ఞానంతో విశదీకరించేటప్పుడు, అది ఎప్పుడూ మరొకదానికి వ్యతిరిక్తంగా ఉంటుంది. తాను చూచినది, భావించినది, స్పర్శించినది, ఎప్పుడూ తారత

మ్యాల విచారణా పద్ధతిలోనే వివరణ ఉంటుంది. ఇది అవగాహనా లోపం.

హేతువు ఎప్పుడూ ఒకదానిని మరొకదానికి ముఖాముఖిగా ఉంచుతుంది. వాటిలో దేనినో ఒక్కదానినే నీవు ఎంచుకోవలసి ఉంటుంది. సుస్పష్టమైన ఆలోచన, హేతువు ఉన్న మనుషులు విషయాల మధ్య వైవిధ్యాన్ని స్పష్టంగా దర్శించగలుగుతారు. తమాషా ఏమిటంటే, హేతువు విభేదాల ద్వారానే పని చేయగలుగుతుంది. అది ఎందువలనంటే ఒకరు దీనికి దానికి, ఈ పనికి ఆ పనికి, ఈ వస్తురూపానికి ఆ వస్తురూపానికి మధ్య భేదాన్ని గ్రహించగలుగుతారు. అపుడు నిర్ణయాలు తీసుకుంటారు. హేతువు అలా పనిచేస్తుంది.

కాని అసలు సిసలైన దివ్యజ్ఞానం, తాదాత్మ్యతాజ్ఞానం. దాని ఫలితమే వివేకం. వ్యతిరేక విషయాల నన్నింటినీ సామరస్యపరచబడే విధంగా, ఒకదాని నొకటి పూరిస్తూ, రెండింటికి పరిపూర్ణమైన పొంతనను కలుగచేస్తూ, సమృద్ధమైన సమన్వయంతో అఖండంగా ఎల్లప్పుడూ అసలు విషయాన్ని దర్శిస్తుంది. సహజంగానే అది అభిప్రాయాలను, గ్రహణశక్తిని, కర్మపరిణామాలను మారుస్తుంది.

కేవలం తప్పనిసరిగా చేయవలసిన మొట్టమొదటి పని ఏమిటంటే 'కనపడేవన్నీ అసత్యం' అనే మాటను, యాంత్రికంగా, నీవేం చెప్తున్నావో పూర్తిగా తెసులుకోకుండా మళ్లీ మళ్లీ తిరిగి చెప్పవద్దు. నీవెందుకు చెప్తావంటే శ్రీఅరవిందులు మనకు ఆ విధంగా చెప్పారు కాబట్టి. అంతేకాని దానిని నిజంగా అర్థం చేసుకుని చెప్పటం కాదు. అయినప్పటికీ కూడా నీవు ఏదైనా అర్థం చేసుకోవాలనుకుంటే నీవు దానిని అలా చూడు, పరిశీలించు, స్పృశించు, దాని రుచిని, అనుభూతిని పొందు. ఎందుకంటే పరిశీలించడానికి మరే ఇతర సాధనాలు లేవని నమ్మావు గనుక. ఇది నీవు ఎప్పుడు అర్థం చేసుకోగలుగుతావంటే, విపర్యయ చైతన్యానుభూతి నీవు పొందినపుడే. విషయాంతరాలలోకి వెళ్లి

భ్రమ కల్పించే తీరును కాక, వాటియొక్క అనుభూతిని, అనుభవాన్ని నిర్దుష్ట వాస్తవిక పద్ధతిలో పొందగలిగినపుడే...

*

బానిసత్వ అలవాటు తప్ప ఏది వ్యసనం? మానవ అభిప్రాయం తప్ప ఏది విశిష్టగుణం? దర్శించు దైవాన్ని; పాటించు ఆయన ఇచ్ఛను. ఆయన నీకై గుర్తించిన అడుగుజాడలలోనే సాగిపో.

(శ్రీఅరవిందులు: తలపులు, సూక్తులు)

శ్రీమాత వ్యాఖ్యానం:

ఇదీ పరిపూర్ణత! దైవం నీకై ఏది అభిలషిస్తాడో దానినే కోరుకోవటం, పొందటం నిజమైన దివ్యపురుషత్వం. నిజమైన వివేకం ఏదంటే ఆయనతో ఏకం కావటం, ఆ విధంగా నీకు ప్రస్ఫుటంగా ఆయన నీనుంచి నీ కోసం ఏమి కోరుకుంటున్నాడో తెలుస్తుంది. మిగతాదంతా మానవసంబంధమైన ఆచారం, సిద్ధాంతం తప్ప మరేమీ కాదు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ టి. ప్రసన్న కృష్ణ

కొన్ని తలపులు, సూక్తులు

హేతువు వెలుగులో నడుస్తున్నట్లు ప్రపంచమనుకుంటుంది. కాని వాస్తవానికి అది ప్రచోదించబడేది తన యొక్క విశ్వాసాల, అంతఃప్రేరణలతోనే.

*

హేతువు తనను తాను విశ్వాసానికి అనుకూలంగా మలుచుకోవటమో లేదా అంతఃప్రేరణల న్యాయనిబద్ధతను తర్కించడమో చేస్తుంది. కాని అది పొందే మానసికప్రేరణ అధోచైతన్యం నుంచే; కనుకనే మనుషులు తాము హేతువు ప్రకారం ప్రవర్తిస్తామనుకుంటారు.

*

కేవలం హేతువు చేసే పని ఏమిటంటే మనస్సు గ్రహించిన వాటిని క్రమబద్ధీకరించి విమర్శించడం. దాని దగ్గర దానిలో నిశ్చితమైన నిర్ణయమూ లేదు. కర్మను ఆజ్ఞాపించనూ లేదు. అది నేనే స్వతంత్రంగా ఆరంభిస్తున్నాననుకోవడమో లేదా ప్రేరేపించడమో చేసేటప్పుడు ఇతర కార్యనిర్వాహకసంస్థలను మరుగున పడేస్తుంది.

*

వివేకం నీకు వచ్చేదాకా హేతువును దైవకార్యాలకు వినియోగించు. విశ్వాసాన్ని, అంతఃప్రేరణలను నీ కోసం వాడుకో. ఎందుకు నీవే నీలోని (శారీరక) భాగాలను ఒకదానిపై ఒకటి తిరుగుబాటుకు ప్రేరేపించటం?

*

ఎప్పుడూ గ్రహిస్తూ పెంపు చేసుకున్న నీ గ్రహణశక్తి కాంతిలో పని చేస్తూ ఉండు. అంతేకాని మేధోపరమైన హేతువాదంతో కాదు. మేధ తనను అర్థం చేసుకోలేకపోతే దైవం హృదయంతో మాట్లాడుతాడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ టి. ప్రసన్న కృష్ణ

అనంత విశ్వతత్వం – మహేశ్వరి తోడ్పాటు

"చాలా శక్తివంతమైన, ఇంకా వివేచనతో కూడిన మహేశ్వరీ మాత అతిమానస అనంతాలకు, విశ్వవిశాలతకు మనం తెరుచుకుని ఉండేలా చేస్తుంది."

– శ్రీఅరవిందులు

ప్రశ్న: "విశ్వచైతన్యతత్వాన్ని పెంపొందించుకో" అంటారు. అదెలా సాధ్యం?

శ్రీమాత: వైశ్వానికానికా? ఇంతకు ముందు ఒకరు ఇలాంటి ప్రశ్నే వేసేరు. "విశ్వచైతన్యాన్ని పెంపొందించుకోమని పిల్లలకు ఎలా బోధించాలి?" అని. ముందు మీలో ఆ చైతన్యాన్ని పెంపొం

దిచుకోమని చెప్పాను. అది మీకెలా సాధ్యమవుతుంది? అసలు విశ్వచైతన్యమంటే ఏమిటో మీకు తెలుసా? అది తెలుసుకోవడం ముఖ్యం. మనిషి తాను అన్నిటికంటె ప్రత్యేకమైన వేర్పాటుజీవి అనుకునే బదులు బ్రహ్మాండమయిన ఈ సృష్టిలో తనూ ఒక భాగమనుకోవాలి. ఈ సృష్టి మొత్తంతో తనకు విడదీయరాని అనుబంధమున్నదని అనుకోవాలి. అన్నింటిలోగల ప్రేరణలు, స్పందనలు తాను స్వీకరించడం, తనలోని ప్రేరణలు, స్పందనలు యితరులకు అందించడం ద్వారా చైతన్యవంతం కావాలి. చైతన్యవంతమైన ఈ ప్రేరణలు మానసికమైన ఎటువంటి సంపర్కం లేకుండా ఉండిపోవు. ఈ శక్తులు ఒకరి నుంచి మరొకరికి ఇక్కడ ఒకర్ని అక్కడ ఒకర్ని స్పృశిస్తూ కదిలిపోతూ ఉంటాయి. ఇవి సంకీర్ణంగాను, బహుముఖంగాను ఉంటాయి. ఏది ఎక్కడ ఆరంభమవుతుందో, ఎక్కడ ముగుస్తుందో తెలియదు. చెప్పలేం. అపారమైన స్వయం సంపూర్ణమైనదేదో తనలోనే కదలాడుతున్నదనే కచ్చితమైన అభిప్రాయం కలుగుతుంది. అదేదో విశ్వచైతన్యం లాంటిదిలా ఉంటుంది.

కాబట్టి అన్నిటికంటె ముందు మీరిది ఆలోచించాలి. తెలుసుకోవాలి. ఈ సార్వత్రిక అనంతరాశిలో నువ్వొక బిందువు మాత్రమే. ఆ స్పృహ ఎల్లవేళలా ఉండాలి. విడిగా కాకుండా అందులో కలిసే ఉన్నావని కూడా గ్రహించాలి. అప్పుడు ఆత్మశోధనతో, ఆత్మపరిశీలనతో నిన్ను నీవు తెలుసుకునే అవకాశం వెంటనే నీకు కలుగుతుంది. నువ్వు గ్రహిస్తున్న, వివరిస్తున్న యీ స్పందనలన్నీ బయటినుంచి వచ్చి నీలోనే నీ ద్వారా సంచరిస్తాయి. కాని అది నీలో పుట్టినవి కావు అన్న విషయం నువ్వు త్వరగా తెలుసుకుంటావు. ఆ అవకాశం నీకుంటుంది. క్రమక్రమంగా శోధనతో, పరిశీలనతో వీటికి పరిమితి లేదనే విషయం గ్రహిస్తావు. ఈ విధంగా నువ్వు విశ్వచైతన్యాన్ని అలవరచుకోవటం ప్రారంభిస్తావు. వైశ్వానికము అన్నా, సార్వత్రికము అన్నా ఒకటే.

*

ప్రశ్న: అమ్మా: విశ్వచైతన్యం నుంచి, వ్యక్తిని వేరుచేసే అజ్ఞానమనే అడ్డుగోడ ఉన్నది అని ఇక్కడ రాసి ఉన్నది. ఆ అడ్డుగోడను పడగొట్టేదెలా?

శ్రీమాత: అజ్ఞానం నుంచి విముక్తి పొంది జ్ఞానాన్ని ఆశ్ర యించు. అన్నిటికంటె ముందు నువ్వు నే చెప్పినదానిని అర్థం చేసుకోవాలి. ఈ పరిపూర్ణమయినదానిలో నువ్వొక భాగమయితే, ఈ పరిపూర్ణత అంతకంటె మరింత పెద్దదైన సంపూర్ణతలో భాగము. అది దానికి మించిన ఇంకా ఇంకా పెద్దదైన సంపూర్ణ తలో భాగము. ఇలా చివరికి అన్నీ కలిసి ఒకే ఒక అనంతమైన పూర్ణత్వంగా తయారవుతుందని తెలుసుకోవాలి. నీకంటె అధికా ధికమైన సృష్టిలో నువ్వొక భాగమనే స్పృహలో నీ వెల్లప్పుడూ ఉంటే నీకు, సృష్టికి అభేదం అనే గ్రహింపు ప్రారంభమవుతుంది. ఇది కేవలం ఒక ఆరంభం మాత్రమే. ఇప్పుడసలు విషయానికి రావాలి. అదేమంటే ఈ భావం కేవలం మేధోపరమైనది కాదు. అనుభూతిపూర్వకంగా ఉండాలి. అంతకంటె అందులోనే జీవిం చాలి. అప్పుడే అజ్ఞానమనే అడ్డుగోడ కూలిపోతుంది. ఈ ఏక త్వాన్ని సర్వత్రా దర్శించగలగాలి. అప్పుడే వ్యక్తి తనకంటె అత్యంత అధికమయిన బ్రహ్మాండంలో తానొక సూక్ష్మాతిసూక్ష్మ భాగమని గ్రహించగలుగుతాడు. అదే విశ్వం. అప్పుడు ఇంతకు ముందు కంటె ఇంకా ఇతోధికంగా విశ్వచైతన్యం సంతరించుకో గలిగేందుకు ఆయత్తమవుతాడు.

ప్రశ్న: ప్రియజననీ! విశ్వచైతన్యంలోకి సమతలంగా (horizontally) తెరుచుకోవడం (ఉన్మీలనం) అంటే ఏమిటి?

శ్రీమాత: చూడు. సర్వోన్నత చైతన్య శిఖరారోహణ చెయ్యాలంటే సూటిగా (vertical) ఊర్ధ్వావరోహణ, విశ్వచైత న్యంలోకి (తెరుచుకోవాలంటే) సమతలంగా (horizontal) విస్తృతం కావాలనేది సాధారణ భావన.

సార్వత్రిక చైతన్యమంటే విశ్వంలో అభివ్యక్తమైన అన్ని శక్తులపట్ల అవగాహన కలిగి ఉండి, అభివ్యక్తం కాబడినవాటి లోను సార్వత్రిక చైతన్యం దర్శించగల్గటం. ఉదాహరణకి ఇక్కడ

చాలామంది ఉన్నారు. వీరంతా విశ్వానికి ప్రతినిధులనుకుందాం. వారితో నీవు ఐక్యత పొందాలనుకున్నావనుకో. వారందరికి సంబంధించి అందరినీ ఒక్కటిగా చేసే ఒక చైతన్యచలితచాలనము నీకూ కలుగుతుంది. ఆ చైతన్యస్పందనే సమతలంగా వ్యాపించడమంటే.

కాని క్రిందికి రావాలనుకునే అతిమానసశక్తితో ఐక్యత పొందాలని నీవు కోరుకుంటే నీ ఆకాంక్ష నంతటినీ కూడగట్టుకుని క్రిందికి దిగివచ్చే ఉన్నతశక్తుల వైపుగా, సూటిగా పైకెగసిపోవాలనే భావన నీకు కావాలి. విస్తృతమయి ఊర్ధ్వగమనానికి ఆరోహణ అది. అంతే.

*

(ఒక హెచ్చరిక) యోగులు ముచ్చటపడే సార్వత్రిక చైతన్యం దైవం కాదన్నది ముందు నువ్వు గుర్తుంచుకోవాలి.

నీకు నచ్చినట్లయిన నీ హద్దులు నువ్వు అడ్డంగా దాటెయ్యొచ్చు. కాని ఈ విశాలత్వభావన, విశ్వబాహుళ్యత ఇవే దివ్యత్వమనుకుంటే మాత్రం నీవు పప్పులో కాలేసినట్టే. ఈ విశ్వచలితచాలనములు సత్యాసత్యాల మేళవింపు. అందుచేత అక్కడితో ఆగిపోతే, అది అసమగ్రమే. శాశ్వతమైన దివ్యసత్యసందర్శన అసలెప్పుడూ సాధించకుండా కూడా నువ్వు విశ్వచైతన్యంలో భాగస్వామ్యం పొందవచ్చు.

ప్రశ్న: ప్రియమాతా! మేము చైతన్యాన్ని ఎలా విస్తృతపర్చుకోగలం?

అందుకు చాలా మార్గాలున్నాయి.

అన్నింటికంటె సులభమైనది సువిశాలమైన దానితో నిన్ను నీవు పోల్చుకో. ఉదాహరణకి నువ్వొక పూర్తి సంకుచిత, పరిమితమైన ఆలోచన, ఇచ్ఛ, చైతన్యంలో మూసుకుపోయి ఒక తొడుగులో ఉన్నట్టుగా భావించావనుకో. అప్పుడు నువ్వు అతివిశాలమైన దానినేదో ఒకదాని గురించి ఆలోచించడం మొదలుపెట్టు. ఎలాగంటే అనంతజలరాశితో నిండిన మహాసాగరం. అది అలా అలా ఎలా అన్ని వైపులకు, అనంతదూరాలకు, అవధులు లేని,

కనపడని అనంతతీరాలకు, కుడియెడమలకు, ముందువెనుకలకు సువిశాలంగా వ్యాపించిందో ఊహించగలుగుతూ, నీతో సరిపో ల్చుకుంటూ, ఆలోచించు. నువ్వు ఆ మహాసాగరంలో తేలుతూ కొట్టుకుపోతున్నావనుకో. దానికి హద్దులు వుండవు. ఇలా అను కుంటే చాలా తేలిక. అప్పుడు నువ్వు చైతన్యాన్ని కాస్త విస్తృ తపరుచుకోగలవు.

మరొక ఉదాహరణ. కొందరు ఆకాశం వైపు చూస్తూ ఉంటారు. నక్షత్రాల మధ్య ఖాళీ జాగాలను ఊహించుకుంటారు. అంటే అనంత నక్షత్రరాశి మధ్యగల ఖాళీ జాగాని ఊహిం చుకుంటే భూమి, వాటితో పోల్చినపుడు సూక్ష్మాతిసూక్ష్మంగా ఉంటుంది. అందులో నువ్వింకా సూక్ష్మాతిసూక్ష్మభాగానివి. చీమ కంటే కూడా సూక్ష్మమయిన భాగమన్న మాట. అటువంటి వాడివి ఆ అనంత నక్షత్రకోటి మధ్య తేలుతూ, పెరుగుతూ దూర దూరాలకు పోతున్నావనుకో. కొంతమంది ఇందులో విజయం పొందుతారు.

ఈ భూమ్మీదగల అన్ని వస్తువులతో తాదాత్మ్యతాభా వన పొందాలనుకుంటే దానికీ మార్గముకూడా ఉంది. నువ్వు అతిసంకుచిత దృష్టితో వున్నావని ఇతరులు వారి దృష్టి ప్రకారం అనుకుంటూ నిన్ను కష్టపెట్టేరనుకో. నువ్వు నీ చైతన్యాన్ని వారిలో ప్రవేశపెట్టి క్రమంగా తాదాత్మ్యతాభావంతో వివిధ పద్ధ తుల్లో వారి ఆలోచనలను నీవిగా అనుకో. ఇది కాస్త అతిశయోక్తి. వారి ఆలోచనల్లోకి నేనెలా ప్రవేశించగలను? అదెంత ప్రమాదం. ఒకడు తాను ఇతర ఆలోచనలతో ఇచ్ఛతో తాదాత్మ్యత చెందటం అంటే అసంఖ్యాకమైన తెలివితక్కువతనాలతో, దౌష్ట్యాలతో మమేకం కావటమే. దీని పరిణామాలు చాలా చెడుగా ఉంటవి. అయినా సరే కొంతమంది ఈ పని చాలా తేలిగ్గా చేసేస్తారు. ఉదాహరణకి వాళ్లకి ఎవరితో అయినా అభిప్రాయభేదం వస్తే వాళ్ళ చైతన్యాన్ని విశాలపరుచుకోవడానికి బదులు అవతలివారి స్థానంలోకి వీరు ప్రవేశించడానికి ప్రయత్నిస్తారు. వీరి దృష్టితో కాకుండా విషయాన్ని అవతలవారి దృష్టితో చూస్తారు. మొదట

చెప్పిన పద్ధతుల్లో ఉత్తమమయినది కాకపోయినా చైతన్యం వృద్ధిపరచే ప్రక్రియల్లో ఇది కూడా ఒకటి. కాని మొదటి పద్ధతులు చాలా మంచివి. ఎవరికీ ఎటువంటి హాని చేయనివి. అంతే కాకుండా ఎంతో మంచి చేస్తాయి. అవి నిన్ను ప్రశాంతంగా ఉంచుతాయి.

చైతన్యవికాసానికి తెలివైన మార్గాలెన్నో ఉన్నాయి. నా పుస్తకంలో అవి పూర్తిగా చర్చించబడ్డాయి. ఏ విషయంలోనైనా నీకు విసుగుపుట్టినా, బాధ కలిగినా, ఇష్టం లేకపోయినా శాశ్వతమైన కాలాన్ని, విశాల విశ్వాన్ని గురించి ఆలోచించడం ప్రారంభించు. గడచిపోయిన సమస్తాన్ని తరువాత రాబోయే భవిష్యత్తుని తలుచుకుంటే ఆ శాశ్వతకాలంలో ఈ క్షణం ఊపిరి పీల్చినంత క్షణికం. అలా అనుకుంటే ఈ వేదన, విసుగు ఇవన్నీ ఈ అనంతకాలంలో ఎంత హాస్యాస్పదమో అర్థం చేసుకోగలవు. మనం గుర్తించే లోపలే కాలం కరిగిపోతూ ఉంటుంది. వీటికి ఏ రకమైన స్థానంగాని, ప్రాముఖ్యతగాని లేదు. ఎందుకంటే అనంత కాలప్రవాహంలో ఈ క్షణం ఎంత? అనంత విశ్వంలో భూమి అతి చిన్నది. అందులో మనిషి ఇంకా ఎంత చిన్నవాడో గ్రహిస్తే అనంత కాలప్రవాహంలో క్షణమెంతో ఇదీ అంతే. ఈ విసుగు, వేదన, బాధ, సంతోషం ఇవన్నీ అసంఖ్యాకంగా నిరంతరం వచ్చిపోతూనే ఉంటాయి. ఇందులో ఏ ఒక్కదాని గురించయినా, అది జరిగిన పది సంవత్సరాల తరువాత తలుచుకుంటే నీకే నవ్వొస్తుంది. ఇంత చిన్న విషయానికి అంతలా నేనెందుకు బాధపడ్డాను? అని నీలో నువ్వే ఆశ్చర్యపోతావు. అందుచేత ఇటువంటివన్నీ పట్టించుకుని వాటిలోనే జీవించడమనేది ఎంత అవివేకమో ఒక్కసారి, ఒక్క మూడు నిమిషాలు ఆత్మావలోకనం చేస్తే ఎంత గొప్ప బాధయినా, అశాంతయినా తుడిచిపెట్టుకుపోతాయి. కాస్త ఏకాగ్రతతో ప్రయత్నిస్తే ఈ అనంతత్వములో, అపరిమితకాలంలో నిన్ను నీవు ప్రవేశపెట్టుకోగలవు. అన్నీ నీకు దూరమవుతాయి. అన్ని బంధాల నుంచి విముక్తి దొరుకుతుంది. గాఢమైన విచారం లాంటివేవీ నిన్ను కదిలించలేవు. సరియైన మార్గంలో సాధన

చేసినట్టయిన తప్పక తెలుసుకుంటావు. అదే నిన్ను అల్ప అహం నించి సత్వరంగా బయటపడేస్తుంది. అదే చేయవల్సినది.

సువిశాలమైన, అతిపరివ్యాప్తమైన చైతన్యంలో వ్యక్తి నిరంతరం జీవించాలి. (ఇది మీరెలా అర్థం చేసుకుంటారో మరి) కెరటం ఎంత ఉవ్వెత్తుగా లేస్తే దాని నీరు అంత నెమ్మదిగా, విశాలంగా పరుచుకుంటుంది. అలా ఉండాలి. ప్రాణికం అదే విధంగా ఉండాలి. అప్పుడే వ్యక్తి సార్వత్రికశక్తులను నిస్సంకోచంగా స్వాగతించగలడు. అప్పుడే వ్యక్తి స్వీయచైతన్యంతో ఈ సామర్థ్యం పొందుతాడు. నువ్వు వ్యాయామానికి నడుస్తూ పోయేవనుకో. ఒక అతివిశాలమైన మైదానంలోకో, సముద్రతీరానికో వచ్చేవనుకుందాం. లేదా ఒక పర్వతశిఖరాగ్రం చేరేవనుకుందాం. అక్కడ దిక్చక్రం అనంతమని అర్థమవుతుంది. ఈ రకమైన భౌతిక అనుభూతి అనుకోకుండా హఠాత్తుగా నిన్ను అంతటి అనంతత్వంలోకి మార్చేస్తుంది. నీకు నువ్వు అనంతంగా భావిస్తావు. ఆ భావనాబలంతో ఇంకా ఎక్కువగా కూడా అనుభూతిని పొందగలవు. అంతకంటె స్థిరంగా, అతిప్రశాంతంగా మారిపోతావు.

అది చాలు. నీకు ప్రకృతితో విడదీయరాని అనుబంధమేర్పడడానికి.

ఇంకా ఎన్నో మార్గాలున్నాయి. కాని అన్నింటిలో ఇది చాలా సహజమైనది. ఇంకా చెప్పాలంటే అందమయినదేదైనా చూచినప్పుడు కూడా ఇటువంటి అనుభూతినే పొందగలవు. ఒక విధమైన ఆత్మానందం, సార్వత్రిక శక్తులను స్వాగతించటం జరుగుతుంది. అందుచేత నీలో విశ్వతత్వం విశాలమై అదే సమయంలో పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది. ఎన్నో మర్గాలున్నాయి. కాని సాధారణంగా అవి ఎవరూ వినియోగించరు.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

అనంతాత్మ

నా చుట్టూ నిశ్శబ్దం మాటల కందని విశాలత్వం.
మహాసాగరతలంపై మొగ్గలు వేస్తూ, స్వేచ్ఛగా విహరిస్తున్న
శ్వేతవిహంగాలు
స్వరరహిత స్వర్గంలో నిశ్శబ్ద సాగరం
రెప్పవాల్చని మూగచూపులతో స్వచ్ఛ వినీలకాంతుల
వియత్పథం
అనంత నిశ్శబ్దమే తానైన
నాలోని దివ్య స్పృహ పరివ్యాప్తమై విశ్వంతో విలీనమయిన వేళ
అంతా అసలైన దేదీప్యమాన దివ్యస్వరూపంగా
దర్శనమిస్తున్నది
మహాశక్తివంతమయిన అనంతాత్మగా భాసిస్తున్నది.
నామరూపరహితుడైన చైతన్యమూర్తి ఒకడు
ఒంటరిగా దీర్ఘయోచనామగ్నుడైనాడు.
అమరము, అనంతము, మొత్తమంతటిని
స్థిరమైన శాశ్వతత్వములో మూటగట్టి
శాశ్వతంగా తన హృదయానికి చేర్చుకుంటాడు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: నడిమింటి విజయలక్ష్మి



The Mother handing out a Darshan message
24 April 1953

దయామయి మహేశ్వరి

మహేశ్వరి అన్నిటికీ అతీతురాలు. విశ్వంలో దేనికీ కట్టుబడని స్వతంత్రురాలు. నిస్సంగురాలు ఐనా ఆమె ఇతరులందరినీ మించిన విశ్వవిశాలహృదయ. ఆమె కరుణ అనంతం, అపారం. ఆమె దృష్టిలో సర్వులు ఆమె బిడ్డలే, పరాత్పరుని అంశలే.

శ్రీఅరవిందులు

శ్రీమాత భాషణము: మౌలికంగా దివ్యప్రేమలో, దివ్యకృప యొక్క జోక్యము నిరంతరంగా కలుగచేసుకుంటూ రూపాంతరీకరించేదేదో ఉంది – అదే ఏదో ఒక శక్తి, ఒక మాధుర్యం, ఓదార్పు లాంటి ఒక స్పందన పరివ్యాప్తమై అంతటా ఉంది.

*

దైవానుగ్రహం ముందు ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు? సర్వులూ ఆ ఒకే మాత బిడ్డలు. వారందరి పట్ల ఆమె ప్రేమ సమానంగా వర్షిస్తుంది. కాని ప్రతి ఒక్కరికి అతని స్వభావానన్నుసరించి, గ్రహణశక్తికి అనుగుణంగా ఆమె తన ప్రేమను అనుగ్రహిస్తుంది.

*

ఓ పరమాత్మా! నీ ఎదుట నిలిచి నిష్కపటంగా "నేనే తప్పు చేయలేదు" అని ఎవరు చెప్పగలరు? నిత్యమూ మీ కార్యానికి వ్యతిరేకంగా మేము ఎన్ని తప్పులు చేయడం లేదు? అలానే మీ అనుగ్రహం నిరంతరం ఎన్నిమార్లు వాటిని తొలగించడం లేదు?

మాతా! నీ అనుగ్రహ వీక్షణం లేకుండా విశ్వన్యాయశాసన దయారహిత ఖడ్గ ప్రహారణాల నుండి తరచుగా తప్పించుకోగల వాడెవడు?

ఇక్కడ ప్రతి ఒక్కరు ఏదో ఒక అపరిష్కృత కార్యక్రమ స్వీకర్తగానే ఉంటున్నారు. కాని నీ దివ్యానుగ్రహానికి అంతా సుసాధ్యమే. సమిష్టిగా కాని, వ్యష్టిగాకాని ఈ అసాధ్యాలను సుసాధ్యాలుగా రూపాంతరీకరణం గావించడం నీ దివ్యకార్యంగా ఉంటున్నది.

*

విశ్వమాతగా ప్రేమ ద్వారా నిశ్శబ్ద కార్యనిర్వహణం నాకు స్వాభావికంగా అత్యంత సహజసిద్ధమైనది.

*

ప్రతిదినం, అనుక్షణం మీకు నా ఆశీస్సులు ఉంటాయి.

*

కాని ఆమె కరుణ, ఆమె జ్ఞానాన్ని మరుగుపరచదు... లేదా ఆమె ఉద్దిష్ట కార్యక్రమ గమనాన్ని మరల్చదు. ఎందుకంటే విషయముల యొక్క వాస్తవం ఆమెకు సంబంధించినది. జ్ఞానం ఆమె శక్తికేంద్రం. మన ఆత్మోన్నతిని, మన స్వభావాన్ని, దివ్యసత్యంగా మలచడం ఆమె జీవితలక్ష్యము, ఆమె కృషి.

శ్రీఅరవిందులు

శ్రీమాత భాషణము: నా ప్రేమ, ఆశీస్సులు, మీతో ఉంటాయి. అవి ఉన్నతోన్నత ఆధ్యాత్మిక ఫలితాల కొరకేగాని, మానవాపేక్షలకు అనుగుణంగా ఉండవు.

*

నా ఆశీర్వాదాలు చాలా అపాయకరమైనవి. అవి ఎవరికో ఒకరికి అనుకూలంగానో, ఇంకొకరికి ప్రతికూలంగానో ఉండవు. అవి దైవసంకల్పం నెరవేరుట కొరకుగా, వేగం, బలం పుంజుకుని ఉంటాయి. అదెపుడూ విజయవంతంగానే ఉండదు. వైఫల్యం కూడా ఉండవచ్చు ... అదే దైవేచ్ఛ కనుక అయితే. ఆ సంకల్పం అంతరంగ అభివృద్ధి కొరకై వుంటుంది. కనుక ఏమి సంభవించినా అది ఉత్తమోత్తమైన దానికే అయి ఉంటుంది.

*

అనుగ్రహం నీవు పొందవలసిన గమ్యం వైపు నిన్ను ప్రచోదిస్తుంది. దాన్ని నీ బుద్ధితో విచారణ చేయకు. అలా చేస్తే నీవెటూ చేరలేవు. ఎందుకంటే ఆ అనుగ్రహం పొంద సాధ్యం కానిది; అనిర్వచనీయమైనది; అనుభూతికి అసాధ్యమైనది. అనుగ్రహం పనిచేసినపుడు ఫలితం ఆహ్లాదకరంగా ఉండనూవచ్చు, వుండకనూ పోవచ్చు. అది మానవ విలువలను పరిగణన లోనికి తీసుకోదు. సాధారణ మానవదృష్టికి అది ఒక్కొక్కప్పుడు మహో

పద్రవంగా కూడ వుండవచ్చు. కాని అది నీకు ఎల్లప్పుడు ఉత్తమ ఫలప్రదాతగానే ఉంటుంది. అది నీ అభివృద్ధి అధికాధికమయేలా దైవం పంపే ఊదరకొట్టే దెబ్బగా ఉంటుంది. నీవు దివ్య సాక్షాత్కారం సాధన దిశగా వేగంగా పురోగమించుటకు అనుగ్రహాం దోహదమవుతుంది.

*

శ్రీఅరవిందుల భాషణం: పరమోన్నత దివ్యానుగ్రహాం దివ్యసత్య కాంతులలోనే పనిచేస్తుంది. అసత్య, అజ్ఞానస్థానాల్లో అది పని చేయదు. ఎందుకంటే అసత్యంయొక్క కోర్కెలకు లొంగిపోతే అది తన ఉద్దేశాన్ని, తానే ఓటమిపాలు చేసినదవుతుంది.

అత్యున్నత దివ్యశక్తి అవతరణకు ప్రధాన నిబంధనలు వెలుగు, సత్యములే. పైనుండి అత్యున్నత అతిమానసశక్తి అవతరణము, క్రింది నుండి సాధకుని ఉన్మీలనము – ఇవే భౌతిక స్వభావాన్ని విజయవంతంగా నడిపి దాని కష్టాలను రూపుమాపును. సాధకుని వైపు నుండి కపటంలేని సమగ్ర సమర్పణము, దివ్యశక్తికి మాత్రమే చేయబడిన స్వీయ ఉన్మీలనము, పైనుంచి అవతరిస్తున్న సత్యాన్నే నిరంతరం ఎన్నుకొనుట, శారీరక ప్రాణిక మానసిక దోషాలను, పృథ్వీస్వభావాన్నింకనూ పాలిస్తూన్న రూపాలను నిరంతరాయంగా తిరస్కరించుట ఎంతేని అవసరం.

అనువాదం: బి. నరసింహాయ్య

రూపాంతరీకరణం జరిగే సమయంలో

ఈ రూపాంతరీకరణ జరుగుతున్నపుడు అహంకారానికి సంబంధించిన ఎట్టి వికారాలకు లోబడకుండా నిన్ను నీవు స్వేచ్ఛగా ఉంచుకోవడం ఎప్పటికంటే కూడా చాలా అవసరం. పరిశుద్ధత లేక ఆత్మార్పణ, త్యాగాలను మలినం చేయటానికి గట్టిగా పట్టుపట్టే అహంకరాధోరణి నీలో చోటుచేసుకోగూడదు. షరతులు విధించకూడదు. నిన్ను వశం చేసుకొనే దివ్య ఆధిపత్యాన్ని నీవు

వశం చేసుకోగూడదు. ఉపకరణం ద్వారా నీలో గర్వంగాని, న్యూనతాభావంగాని లేదా దురంహంకారంగాని ఉండగూడదు. నీ ద్వారా పనిచేస్తున్న శక్తుల మహనీయతను, తన స్వప్రయోజనం కోసం, లేదా వేరేవారి సంతృప్తికోసం ఉపయోగించడం, లేదా వాటినలా పట్టి వుంచి వికృతం చేయడం అనేది మనస్సు, ప్రాణికం, భౌతిక అంశాల్లో వేటిలో గూడా ఉండకూడదు. ఆకాంక్షకు సంబంధించి నంతవరకు నీ విశ్వాసం, నీ చిత్తశుద్ధి, నీ నైర్మల్యత పరిపూర్ణమై నీ అస్తిత్వపు అన్ని స్తరాల్లో, పొరల్లో వ్యాపించనివ్వు. అపుడు నిన్ను చికాకుపరచే అంశం, నీకు వికారం కలిగించే ప్రభావం, నీ స్వభావం నుండి క్రమంగా వెదొలగిపోతాయి.

*

...తన స్వీయ నిబంధనలు, ప్రమాణాలకు, సంకుచితవాదాలకు, పొరపాటు అభిప్రాయాలకు, ఆవేశపూరిత అంతులేని అజ్ఞానానికి, అల్పజ్ఞాన ఆత్మవిశ్వాసానికి అతీతంగా ఉన్న విషయాలను గూడా తన పరిధిలో బంధించకోరుకునే నీ అల్ప భౌతికమనస్సుతో దివ్యమాతను అర్థం చేసుకోవాలని, విమర్శించాలని ప్రయత్నించకుండా జాగ్రత్తపడు. తన మిడిమిడి జ్ఞానబంధంలో బందీయైన మానవమేధస్సు, దివ్యశక్తుల స్వేచ్ఛాయుత, బహువిధ గమనాలను అనుసరించలేదు. ఆమె దూరదృష్టి, కార్యాచరణ విధానానికి సంబంధించిన వేగం, సంక్లిష్టతలు, తడబడే మానవ మనస్సు అవగాహనకు మించి వుంటాయి. దివ్యమాత ఉద్యమం యొక్క పరిణామాలు మనసుకి తెలిసిన పరిణామంలోనివి గావు. ఆమె తన విభిన్నమైన అనేక మూర్తిత్వాలను, చాకచక్యంతో మార్చివేసే వేగాన్ని, లయగతులను కూర్చడం, భంగించడం, వేగాన్ని హెచ్చించడాలూ, మందగింపు జేయడాలు మానవ మనస్సు దిగ్భ్రాంతికి లోనవుతుంది. ఒక సమశ్యతో ఒక విధంగా, మరో సమశ్యతో మరో విధంగా ఒకసారి ఈ విధానాన్ని, మరోసారి ఆ విధానాన్ని స్వీకరించడం, వదలివేయడం, వాటన్నింటినీ కలిపి ఒకటిగా చేయడం చూసి మానవమనస్సు దిగ్భ్రాంతి చెందు

తుంది. అలా దిగ్భ్రాంతికి లోనైన మనస్సు సుడిగాలిలా సుళ్ళు తిరుగుతూ సర్వాన్ని తుడిచిపెట్టివేస్తూ, ఊర్ధ్వం వైపు అజ్ఞానపు అత్యంత సమస్యాత్మక క్షేత్రం గుండా లోకాతీత దివ్యప్రకాశం లోనికి ఎగసిపోయే విధానాన్ని అర్థం చేసుకోలేదు. మనస్సును గాక, నీ అంతరాత్మను ఆమెకై తెరచిపెట్టి, నీ చైత్యస్వభావంతో ఆమెను అనుభూతి చెంది, చైత్యదృష్టితో ఆమెను దర్శించి సంతృప్తి చెందు. అలా చేస్తేనే పరమసత్యానికి నీలో నుండి సరాసరి ప్రతిస్పందన ఉద్యమిస్తుంది. నీ మనస్సు, హృదయం, ప్రాణం, భౌతికాల చేతనలోని చైత్య అంశాల ద్వారా దివ్యమాత స్వయంగా వాటిలో వివేకం కలిగించి, వాటికి కూడా తన కార్య విధానాలను తన ప్రకృతిని తేటతెల్లం చేస్తుంది.

సర్వజ్ఞత్వం, సర్వశక్తిమంతం అంటే మనకుగల ప్రాథమిక పై పై అభిప్రాయాల కనుగుణంగా, దివ్యశక్తి పనిచేయాలని, మన అజ్ఞాన మనస్సు పొరపాటుగా కోరకుండా చూసుకోవాలి. ఎందుచేతనంటే ప్రతి మలుపులో అద్భుతశక్తి, అనాయాస విజ యాన్ని సాధించిపెట్టాలనీ, కనులు మిరుమిట్లుకొలిపే వైభవపు ముద్ర ఉండాలనీ మనస్సు తహతహలాడుతుంది. దివ్యమాత అజ్ఞానక్షేత్రాల్లో అజ్ఞానంతో వ్యవహరిస్తుంది. పూర్తిగా ఊర్ధ్వం లోనే ఆమె నిలిచిపోలేదు. అజ్ఞానక్షేత్రానికి కూడా అవతరించింది. ఆమె తన శక్తిని, జ్ఞానాన్ని, పాక్షికంగా తెరచాటు చేస్తుంది. పాక్షి కంగా తెర తొలగించి చూపుతుంది. తరచుగా ఆమె వాటిని, తాను ఉపయోగించు ఉపకరణాలకు, మూర్తిత్వాలకు అందకుండా చేసి, అన్వేషించే మనస్సు అన్వేషణా విధానాన్ని, ఆకాంక్షించే చైత్య ఆకాంక్ష విధానాన్ని, సంఘర్షించే ప్రాణిక విధానాన్ని, బందీయై బాధపడ్తున్న భౌతికస్వభావాన్ని రూపాంతరీకరించి అనుసరిస్తూ ఉంటుంది. రూపాంతరీకరణకు పరాత్పర సంకల్పంచే విధించ బడిన షరతులున్నాయి. విడదీయవలసిన చిక్కుముడులు చాలా ఉన్నాయి. వాటిని ఉన్నవాటిని ఉన్నట్లుగా విడదీయలేం. అసు రుడు రాక్షసుడు, పరిణమిస్తున్న ఈ పృథ్వీ ప్రకృతిని తమ గుప్పెట్లో బంధించి ఉంచుకొన్నారు. వాళ్లు ఏనాడో స్వంతం

చేసుకొన్న దేవుని మాన్యంలో, మానవక్షేత్రంపై, వాళ్ల నియమాల ననుసరించి దివ్యమాత వాళ్లతో తలపడాలి. మనలోని మానవీయత కత్యంత దూరంలోనున్న రూపంలోనికి ఆకస్మికంగా ఉద్ధరించడానికి వీలులేనంత బలహీనమైనది, అజ్ఞానమయమైనది మన ఈ మానవీయత. శ్రమించవలసిన పరిస్థితులకు తగినవిధంగా పని చేసేందుకు, దివ్యచేతన, దివ్యశక్తి అచట ఉండనే ఉన్నాయి. తమకు నిర్దేశించిన అడుగును, నిర్దేశించిన విధంగానే వేస్తాయి. అభివ్యక్తం కాబోయే పరిపూర్ణతను, ప్రస్తుత అపరిపూర్ణస్థితి మధ్య రూపొందించడానికి దివ్యచేతన, దివ్యశక్తి అచట ఉన్నాయి. కాని అతిమనస్సు నీ లోనికి అవతరించినపుడు మాత్రమే దివ్యమాత అతిమానస మహాశక్తిలా, అతిమానస స్వభావాలతో సరాసరి ఇచట వ్యవహరిస్తుంది. నీ మనస్సును అనుసరిస్తే, దివ్యమాత నీ ముందు అభివ్యక్తమైనా అది ఆమెను గుర్తించలేదు. ఆ సామర్థ్యం దానికి లేదు. నీ మనస్సును గాక, నీ అంతరాత్మను అనుసరించు, పరమసత్యానికి బదులు పిలిస్తే పలికే నీ అంతరాత్మను అనుసరించు. బాహ్య ఆకారాలను చూసి పైకెగసి పడే నీ మనస్సును అనుసరించవద్దు. దివ్యశక్తిపై ధృఢమైన నమ్మకముంచు, ఆమె నీ లోని దివ్యాంశాలకు స్వేచ్ఛ కల్పించి, అంతటినీ దివ్యప్రకృతి వ్యక్తం చేయగలిగేట్లు రూపొందిస్తుంది.

మూలం శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

సమాచారపత్రం

శ్రీఅరవిందు సొసైటీ వార్షిక సమావేశాలు బీచ్ ఆఫీసులో ఆగస్టు 2007, తేదీలు 13, 14 న జరిగాయి. ఈ క్రింది ఉపన్యాసాలు ఇవ్వ బడినవి. శ్రీ కైవల్య సార్ట్‌గారు 'దైవం' పైన, శ్రీ శ్రద్ధాలు రానడే గారు 'ముందున్న కార్యం' గురించి, ప్రొ. కిట్టురెడ్డిగారు 'శ్రీఅర విందుల వెలుగులో మానవ ఐక్యత' పైన, డా॥ అలోక్ పాండే గారు 'ప్రాచీన ఆధ్యాత్మికత, నూతన చైతన్యము' గురించి, డా॥ మంగేష్ నడ్కర్ణిగారు 'వామపక్షవాదులు సంప్రదాయవాదులు శ్రీఅరవిందులను ఏ విధంగా తక్కువచేయడానికి ప్రయత్నిం చారు' అన్న అంశంపైన ప్రసంగించారు. ప్రొ. మనోజ్‌దాస్‌గారు ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించారు. సొసైటీవారి వనితాశాఖ 'శ్రీఅరవిందుల సన్నిధికి మేల్కొనుట' అను కార్యక్రమాన్ని సమ ర్పించారు. తమిళనాడు నుండి వచ్చిన తమిళసభ్యులు, భక్తుల నుద్దేశించి శ్రీ సౌందరరాజన్‌గారు ఆగస్టు 15 వ తేదీన 'శ్రీఅర విందుల అతిమానసయోగం' గురించి ఉపన్యసించారు.


శ్రీఅరవిందుల 135 వ జయంతిని ఆగస్టు 15 న ఆశ్రమంలో జరుపుకున్నారు.

శ్రీఅరవిందుల 'గీతావ్యాసములు' పైన డా॥ మంగేష్ నడ్కర్ణిగారు బీచ్ ఆఫీస్ హాలులో ఆగస్టు 17 నుండి 26 వరకు స్వాధ్యాయ శిబిరము నిర్వహించారు. శ్రీ గోపాల్ భట్టాచార్జీగారు జూలై 22 నుండి ఆగస్టు 3 వ తేదీ వరకు చైనా, టిబెట్‌లను సంద ర్శించారు. వారు షాంఘైలో శ్రీఅరబిందో సొసైటీవారి మానవ ఐక్యతా కేంద్రాన్ని ప్రారంభించారు. పన్నెండు మంది చైనావారు ఆంగ్లపత్రికకు (AIM) సభ్యులుగా జేరారు. వారచ్చట ఉన్నంత కాలంలో షాంఘై, బైజింగ్, లాసా నగరాలు దర్శించారు.

కేంద్రాలనుండి వార్తలు

నోయిడా (ఉ.ప్ర) శాఖవారు, 'శాస్త్రీయ జీవనవిధానము, మాంత్రిక నివారణం' అను అంశంపై స్వామి విద్యానందజీ వారిచే జూన్ 2

Rs. 15



జీవితాన్వేషణకు కీలకం

అఖిల

అఖిల భారత పత్రిక

నవంబరు 2007

జీవితాన్వేషణకు కీలకం

విషయసూచిక

జీవితంలో మనం దేని కోసం అన్వేషిస్తున్నాం

జాగృతమైన మానవ ఆలోచనను ఆదినుంచీ ఆక్రమించిన వ్యాపకం ఒకటి ఉన్నది. అది అనివార్యమైన అంతిమభావన, అదే అతని చింతన. భావించగల మహోన్నతభావన కూడా. ఎందుచేతనంటే హేతువాదం బలంగా ఉన్న సుదీర్ఘకాలాల్లో నిషేధానికి గురైనా, అది తిరిగి బ్రతగ్గలిగింది. అది, భగవంతుని గురించిన భగవత్తత్వంగా, పరిపూర్ణత వైపు ప్రేరణగా, విశుద్ధ సత్వం, నిర్మలానందాన్వేషణగా, గుహ్యాఅమృతత్వ భావనగా తనను తానభివ్యక్తం చేసుకొంది. బాహ్యా భౌతికవిషయాల విశ్లేషణలో విజయం సాధించడంతో సంతృప్తిపడిన జాతినిగాక వెక్కసంకలిగేట్లు అనుభవిస్తున్న మానవజాతి నీ రోజు చూస్తున్నాం. వివేకవంతమై ఏ ప్రధమసూత్రమైతే ఉందో – భగవంతుడు, వెలుగు, స్వేచ్ఛ, అమృతత్వం – అదే తన చిట్టచివరి సూత్రం అని వాగ్దానం చేసింది.

*

మన ఆంతర ఆత్మలలో, మన సమస్త ప్రకృతిలో ఈ ఏకైకుని (The One) దర్శించడం, తెలుసుకోవడం, సార్ధకం చేసుకోవటమే నిగూఢ గమ్యంగా ఉంటుందెప్పుడూ. అదే అప్పుడు మన దైహికజీవనంలో, తెలుసుకొని జీవించి, సాధించవలసిన గమ్యమైంది. మన అస్తిత్వం యొక్క సర్వభాగాల్లోనూ, విభజించి చూసే మనస్సు మనకు బాహ్యామైనదన్నట్లు పరిగణించే సమస్తంలోనూ, సమంగా, ఆతని నెరుకపర్చుకోగల్గటం, వ్యక్తిగత చేతనకి పరమసిద్ధి. భగవంతునికి వశం గావడం, ఆతనిని మనలోనూ, సమస్తంలోనూ కలిగి ఉండటం, ఇహపర సర్వ సామ్రాజ్యాధిపత్యానికి అవసరం. నిష్క్రియత, సక్రియత, శాంతిసమయం, అధికార వినియోగ సమయం భేదాభేదస్థితులకు సంబంధించి సమస్త అనుభవంలో ఆతని ననుభవించటం కోసమే ఈ ప్రపంచంలో అభివ్యక్తమైన జీవుని పరమార్ధం.

మూలం: శ్రీఅరవిందులు

దివ్యజీవన ప్రధమావశ్యకత

అంతరంగ జీవనం లేకపోతే ఈ విషయాలను సాధించడం అసాధ్యం. ఎప్పుడూ ముఖ్యంగా బాహ్యంగానే చురుకుగా ఉండి, బాహ్యచేతనలో ఉండిపోతే దివ్యజీవనాన్ని సాధించలేం. వ్యక్తి తనను తాను తెలుసుకొని, తన యదార్ధ అస్తిత్వాన్ని కనుగొని, తనలోనికి తాను పోవుట ద్వారా, అంతరంగ జీవనం ద్వారా మాత్రమే తనను తాను కనుగొనగలడు. ఎందుచేతనంటే తనకు బాహ్యమైన చేతన నుండి లేదా ఆంతరిక ఆత్మనుండి వేరుపడిన జీవితం ఒక అజ్ఞాన క్షేత్రం. తన అంతరంగ అస్తిత్వం లోనికి జీవితంలోని విశాలత్వం లోనికి ఉన్మీలనం గావడం ద్వారా వ్యష్ఠి ఆంతరికంలో అభివృద్ధి చెందడం ద్వారా ఆంతరంలోని కదలిక ద్వారా, ఆంతరంలోని చర్య ద్వారా, స్వేచ్ఛగా ప్రభావవంతంగా వ్యష్ఠి తన అస్తిత్వం తనను తానధిగమించగలదు. అవిద్యను అధిగమించగలదు. దివ్యజీవనానికై అంతఃసత్తను, సక్రియ ప్రభావం చూపించే కేంద్రం, అత్యంత సన్నిహితమైన అస్తిత్వం, మన కర్మకు మూలం, ప్రస్తుతం ఉపరితలం మీదే ఉన్నది.... ఆ విధంగా మనం మనలోనికి చూడడం, మనలోనున్న దాన్ని దర్శిస్తూ లోనికి ప్రవేశించడం, అంతరంగంలో నివసించడం, దివ్యజీవనం కోసం మన స్వభావాన్ని రూపాంతరీకరించడం అనేది దివ్యజీవన ప్రధమావశ్యకత.

వాస్తవానికి అంతరంగం వైపు తిరగడం, ఉద్యమించడం అంటే వ్యక్తిగత ఆత్మలో బందీ గావడం కాదు. యదార్థమైన విశ్వజనీనత వైపు వేసే మొదటి అడుగు అది. అది మన ఆంతరిక అస్తిత్వాన్ని గురించిన యదార్థాన్ని తెలిపినంత బాగా బాహ్యా అస్తిత్వపు యదార్ధాన్ని మనకు తెలియజేస్తుంది. ఎందుచేతనంటే ఈ ఆంతర జీవనం తనను తాను విస్తృతం చేసుకొని, విశ్వజీవనాన్ని గూడా ఆలింగనం చేసుకోగలుగుతుంది. మన ఉపరితల చేతనలో సాధ్యంగావడమంటూ జరిగినా, దాని కన్న అత్యంత గొప్పదైన వాస్తవంతో, సక్రియశక్తితో, సర్వుల జీవననంతో సంప

ర్కం పెట్టుకోగలదు. ఆ జీవనంలోనికి చొచ్చుకుపోగలదు, దాని నాక్రమించివేయగలదు. మనం, ఎంతో ఎక్కువగా బాహ్యంగా సాధించామనుకొన్న, విశ్వజనీనత చాలా అల్పమైనది, కుంటినడ కల కృషి ఫలితమది – అది ఊహానిర్మిత మాయేగాని యదార్ధ విషయం కాదు. ఎందుచేతనంటే మన ఉపరితల చేతనలో ఇత రుల నుండి, చేతనకు సంబంధించినంతవరకు మనం వేర్పాటుత నంలో విడిపోయి వున్నాం. పైగా అహంకార సంకెళ్ళలో కట్టుబడి వున్నాం.

అచట తరచుగా మన నిస్వార్ధత సూక్ష్మరూపంలో స్వార్ధంగా తయారవుతుంది. కాకపోతే అహంకారాన్ని పెద్ద ఎత్తున ధృవీకరించుకొన్నట్లవుతుంది. లోకకళ్యాణం అంటూ సరిపెట్టుకొని, మనకు మనమే విస్తరింపజేసుకున్న మనం మన కక్ష్యలోనికి స్వీకరించినవారిపై, మన వ్యక్తిత్వాన్ని, మన అభిప్రా యాలను, మన మానసిక, ప్రాణికాలను విస్తృతాహంకారాన్ని ఆపాదించడానికి అవసరమైన ఒక తెర అని తెలుసుకోలేం. మనం ఇతరుల కోసం జీవించడంలో నిజంగా ఇంతవరకూ కొంతైనా కృతకృత్యులమై వుంటే అది ప్రేమకుగల ఆంతరిక ఆధ్యాత్మిక శక్తితో, సానుభూతితో సాధించినదే. కాని ఈ శక్తికిగల సామ ర్థ్యంగాని, ప్రభావంచూపగల క్షేత్రంగాని మనలో చాలా తక్కువ. దానిని ప్రోత్సహించే చైత్యకదలిక మనలో అసంపూర్ణం. తరచుగా దాని చర్య అజ్ఞానమయం. కారణం, దానికి మనస్సు, హృదయా లతో గల సంపర్కం. కాని మన అస్తిత్వం మనల్ని ఆలింగనం చేసుకొన్నట్లు, ఇతరుల అస్తిత్వాన్ని ఆలింగనం చేసుకోదు. ఇత రులతో బాహ్యంగా ఏకత్వం అనేది, అల్పమైన ఆంతరిక ఫలితా న్నిచ్చే బాహ్యజీవితాల బాహ్యమైన కలయిక, సహచరత్వంగానే ఉండిపోతుంది.,బాహ్యజీవితంలో మనం కలిసే, సామాన్యజీవ నంగల జీవులను మనస్సు, హృదయం తమ కదలికలతో బంధ మేర్పరుస్తాయి. కాని సామాన్యజీవితం మాత్రం తదుపరి నిర్మా ణానికి పునాదిగా ఉండిపోతుంది – ఆంతరం వైపు తిరగడానికి, కృతక సత్యం, ఐకమత్యం లేదా విభేదించే అహంకారాల పర

స్పర అజ్ఞానం, మనస్సుల వైరుధ్యం హృదయాల వైరుధ్యం, ప్రాణికప్రవృత్తుల వైరుధ్యం, అభిరుచుల వైరుధ్యం ఉన్నప్పటికీ, కృత్రిమ ఐకమత్యంతో ఎంతో కొంతైనా నిలిచివుండగలిగినా అది కూడా ఒక పాక్షిక అభద్రమైన పునాదిపై నిర్మించబడిన నిర్మాణమే అవుతుంది. ఆధ్యాత్మిక చేతన, ఆధ్యాత్మిక జీవనం, ఈ రకమైన నిర్మాణాత్మక సూత్రాన్ని తలక్రిందులు చేస్తుంది. ఆంతరికంలో కలిగిన అనుభవం మీద, మన అస్తిత్వం లోనికి ఇతరులను కలుపుకుపోవడం ద్వారా, ఆంతరికబుద్ధిపై, ఏకత్వపు వాస్తవికతపై, సామూహిక జీవనాన్ని, పునాదిగా చేసుకొని ఆధ్యాత్మిక జీవనచర్య ఉంటుంది. ఆధ్యాత్మిక వ్యక్తి ఆ విధమైన ఏకత్వపు బుద్ధితో పనిచేస్తాడు. దాని వల్ల అతనికి ఆత్మ మరొక ఆత్మపై చేసే వత్తిడి గురించి, జీవితం గురించి, మంచి చేయడం గురించి, ప్రేమ సానుభూతితో చేసే కర్మ యదార్థకర్మ గావడాన్ని గురించి, త్వరగా ప్రత్యక్ష అవగాహన కలుగుతుంది.

*

బాహ్యాచేతనకు, అంతఃసత్తకు మధ్యనున్న తెరను వైదొలగించటం యోగంలో అతిప్రధానమైన కదలికల్లో ఒకటి. యోగమంటే దైవంతో ఏకం కావటం. మొట్టమొదట నీ ఆంతరంలోనున్న ఆత్మను కనుగొనడం. తరువాత ఉత్తమమైన ఆత్మలోనికి మేల్కొనగలం. అంటే ఆంతరం వైపుగా ఉద్యమించడం, ఊర్ధ్వం వైపుకు ఉద్యమించడం వాస్తవానికి అంతఃసత్త మేలుకొని ముందుకు రావడం ద్వారానే, నీవు దైవంతో ఏకం కాగలవు. బాహ్యా భౌతిక మానవుడు కేవలం ఉపకరణాత్మక మూర్తియే. తనంత తానుగా ఈ ఏకత్వాన్నందుకోలేడు. అపుడపుడూ సంస్పర్శలను, మతపరమైన అనుభూతులను అపరిపూర్ణ సూచనలను మాత్రమే పొందగలడు. ఇవి కూడా బాహ్యాచేతననుండి గాక మన లోలోపలే ఉన్న దాని నుంచి లభిస్తాయి.

...బాహ్యావ్యక్తిత్వానికి నీవు బందీవైతే, భౌతిక మనస్సుకు, దాని అల్పచలనాలకు కట్టువడిపోతే నీ ఆకాంక్ష సిద్ధించదు. బాహ్యాస్వభావాన్ని దాని మానాన దాన్ని వదలివేస్తే దాని కసా

ధ్యమైనదేదైతే వుందో, దాని అడ్డుగోడ పడిపోయినపుడు అంతర ఆత్మ ముందుకు వచ్చినపుడు, అది పరిపూర్ణంగా సాధ్యమౌ తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కోనేరు వెంకటేశ్వర రావు

గుప్తచేతనను ఆవిష్కరించేదెలా?

నీలో చైత్యపురుష దివ్యాంశ ఉన్నది. అది శ్రీమాత అంశ. ఏ లోపమూ లేనిది. స్వచ్ఛమైనది. సాధారణ చైతన్యస్వభావాల తెర మరుగున గుప్తంగా ఉంచబడినది. బహిర్గతం కాబడినపుడు ముందుకు వస్తుంది. సత్వమును నిర్దేశిస్తుంది. సాధారణ చేతనను మార్పు చేస్తుంది. ఆసురిక శక్తులను బహిష్కరిస్తుంది. బాహ్యస్వ భావాన్ని పూర్తిగా మారుస్తుంది. అందుకనే గుప్తచేతనను తెరచి ఉంచేలా ఏకాగ్రత వహించమని సాధకులను మేము కోరేది. ఏకా గ్రతవల్ల, అనుభవాలవల్ల అంతరంగం తెరచుకుంటుంది. ఆంతర్యం అవగాహన అవుతుంది. నవ్యచేతన విచ్చుకుంటుంది. స్వభావము యెదుగుతుంది. వర్ధిల్లుతుంది.

*

అంతరంగ ఏకాగ్రతాసాధన ఈ క్రింది విషయాలు కలిగి ఉంటుంది.

1. హృదయంలో చైతన్యాన్ని సుస్థిరపర్చి, శ్రీమాతయొక్క నామ, రూప, భావాలపై ఏ ది సులువైతే దానిపై.. కేంద్రీకరణ.
2. హృదయంలో ఏకాగ్రత ద్వారా క్రమేపీ మనసులో నిశ్చ లత్వం.
3. హృదయంలో శ్రీమాత సాక్షాత్కారం, ఆమెచే మనో, ప్రాణిక క్రియాకలాపాల నిర్దేశకత్వం – ఇందుకొరకు ఆకాంక్ష.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

జీవితమొక అసత్యాభాస
దైవం దానికి కీలకం

చాలామంది జనులు తలుపులు మూసిన ఖైదులో ఉక్కిరిబిక్కిరయే ఖైదీలు. ఇది సహజం. తలుపులు తెరవటానికి తాళం వారి వద్దనే ఉన్నది. కాని దానిని వారు ఉపయోగించరు.

*

దైవాని కావల అంతా అసత్యము, భ్రమ; అంతా దుఃఖమయ అస్పష్టత. దైవములోనే జీవము, కాంతి, ఆనందము. దైవములోనే సర్వోత్కృష్ట శాంతి.

*

దైవము ఎక్కడో లేడు. ఆయన మనలోనే – లోలోపల, ఆలోచనలకి, భావాలకి ఎగువన – ఉన్నాడు. దైవముతోనే శాంతి, దృఢ విశ్వాసము, అన్ని సమస్యలకీ పరిష్కారము.

నీ సమస్యలన్నీ దైవానికి వప్పగించు. వాటి నుంచి నిన్ను ఆయన ఉద్ధరిస్తాడు.

*

నీవెన్నడూ ఏకాకివి కావనే విషయం మరువకు. దైవం నీతో ఉన్నాడు – నీకు సహాయంగా మార్గదర్శకుడుగా. నిన్నెన్నడూ విస్మరించడు. ఆయన నీకు స్నేహితుడు. ఆయన ప్రేమ నీకు ఉపశమనం కలిగిస్తుంది. బలం చేకూరుస్తుంది నమ్ము. సర్వమూ నీకు ఆయన సమకూరుస్తాడు.

*

దైవములోనే, దైవము చేతనే సమస్తమూ రూపాంతరీకరింపబడి మహిమాన్వితమవుతుంది. దైవములోనే సమస్త నిగూఢ రహస్యాలకు, శక్తులకు పరిష్కారము లభ్యమవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

పరమాత్మ నీతోనే ఉన్నాడు

నీ హృదయాన్ని తెరిచి చూడు. అక్కడ నేను సిద్ధంగా ఉండడం చూడగలవు.

*

భగవంతుడు నీలో ఉన్నాడని నమ్మినట్టయితే లేదా అలా నమ్మడానికి కనీసం ప్రారంభించినా ఆ క్షణంలో యేదో ఒక మార్గంలో ఆ తలంపు, అనుభూతి కలుగుతుంది. అప్పుడే నీ హృదయకవాటాలు తెరువబడి ఆ గుర్తింపు కొద్దిగా నెమ్మదిగా కలుగుతుంది. దానివల్ల ఆకాంక్ష మొదలవుతుంది. తెలుసుకోవాలనే తపన పెరుగుతుంది. ఆ తపన నీ మార్గాన్ని మరింత విశాలం చేస్తుంది. నువ్వందులోకి మెల్లగా అడుగుపెడతావు. ఈ విధంగా మనిషి యెప్పుడైతే ప్రవేశించగలిగాడో అప్పుడే తనను తాను గుర్తించడం నేర్చుకుంటాడు.

ఇదే మొట్టమొదట కావలసినది. పరమాత్మ కోసం ఆకాంక్ష. తరువాత ఆ దిశగా ప్రయత్నం. నిరంతరం ఆ స్పృహలోనే ఉండడం, అందులోనే జీవించడం. అలా నిరంతరం ఉండాలంటే ఏకాగ్రత కావాలి. త్రికరణశుద్ధిగా సంపూర్ణ సమర్పణ భావం, పరిపూర్ణ దృష్టితో భగవంతుడిపై ఏకాగ్రత సాధించాలి.

హృదయగతమైన ఏకాగ్రత కావాలి. హృదయంలో ప్రవేశించాలి. అలా లోలోపలకి ఎంత గాఢంగా, ఎంత దూరం వీలైతే అంత దూరం, నువ్వు వెళ్ళగలిగినంత వరకూ పోవాలి. అన్ని వైపులా విస్తరించివున్న నీ చైతన్యసూత్రాలన్నిటినీ పోగుచేసి చుట్టచుట్టి ఒక్క మునకవేసి అడుగువరకు మునుగు.

*

అక్కడ ఒక జ్వలితజ్వాల ఉంటుంది నీ హృదయపు లోతుల్లో. అదే నీలోని దివ్యత్వం. నీ నిజమైన ఆత్మ. దాని స్వరం విను. ఆ ఆదేశాలు అనుసరించు. రాత్రింబవళ్ళు అవి స్థిరంగా అక్కడే ఉంటవి. అది చాలు మౌనంగా నీ ఆంతర్యం వైపు తిరగడానికి. అప్పుడు దాన్ని పరిశోధిస్తాం.

దివ్యసాక్షాత్కారమే జీవితానికి సార్థకత. పరిపూర్ణ శాంతికి పర మానందానికి, సంపూర్ణ భద్రతకి సాక్షాత్కారమే మార్గం. ఆత్మ సాక్షాత్కారంతో నీ కష్టాలన్నీ మటుమాయమవుతాయి.

*

ఏ క్లిష్టపరిస్థితులలోనైనా దివ్యసన్నిధి మనకు ప్రశాంతతతో కూడిన బలాన్ని అచంచలమైన ఆనందాన్ని ప్రసాదిస్తుంది.

*

జీవాత్మ, విశ్వాత్మ అంతా ఒక్కటే. ప్రతి ప్రపంచంలోను, ప్రతి జీవిలోను, ప్రతి వస్తువులోను అణువణువునా దివ్యసాక్షాత్కారం పొంది ఆ అభివ్యక్తికి దోహదం చేయడమే మానవజీవిత పర మార్ధం.

జీవితం యొక్క అసలైన లక్ష్యం తన ఆంతర్యంలోగల ఆత్మసాక్షాత్కారం పొందడం. అదే గాఢమైన దివ్యసాక్షాత్కారం. ఆ దివ్యశక్తికి సర్వసమర్పణ చేసుకొని ఆ మార్గదర్శకత్వంలో మనసావాచాకర్మణా శారీరకధర్మాలను నిర్వర్తిస్తూ జీవించడం.

ప్రతి హృదయంలో దివ్యసాక్షాత్కారమే భవిష్యసంభావ్య పరిపూర్ణతలకు హామీ.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

మనం మనంగా అవాలి. మనము అంటే యదార్థంగా మన లోపల ఉన్నదేదో అదే. ఈ ఉన్నతోన్నత సత్త కోసం మన బాహ్య దేహాత్మను, బాహ్యజీవితాన్ని, మనస్సును అధిగమించాలనేది ఒక షరతు. ఈ ఉన్నతోన్నత సత్తయే మన యదార్థ దివ్యసత్త. ఇది తనను తాను వ్యక్తపరచుకోవాలి, సక్రియం గావాలి.

విశ్వమంతా దైవాభివ్యక్తీరణమే!

సృష్టి మొత్తం పరమాత్మచే, పరమాత్మ నుండే ఆవిర్భవించబడింది. ఈ సత్యాన్ని ఒక్క క్షణం కూడా మరువకూడదు. అణువణువునా అతడు దర్శనమివ్వడమే కాదు. అతడే ఆ సర్వమూ. భేదాలన్నీ భావంలోను, రూపంలోను మాత్రమే. ఇది మరిచిపోతే అంతా కోల్పోయినట్లే.

ప్రశ్న: ప్రతి వస్తువులోనూ భగవంతుడున్నాడంటారే ఆఖరికి చెత్తబుట్టలో కూడానా?

విశ్వమంతా పరమాత్మ స్వరూపం. కాని ఆ స్వరూపస్ప్రహకి మూలం అసలేమీ లేనట్టనిపించే నిశ్చైతన్య జడత్వం. అక్కడి నుండి కొద్ది కొద్దిగా, క్రమక్రమంగా చైతన్య దిశగా యెదుగుతుంది.

*

దివ్యసందర్శనం అన్ని కష్టాలను అధిగమింపజేస్తుంది. అన్ని కష్టాలను అధిగమించగలగడమే దివ్యసాక్షాత్కారమంటే.

*

బాహ్యస్వరూపాలను పైకి అగుపించే ఆకారాల కొరకైకాక లోతైన స్థిర వాస్తవ వ్యక్తీకరణలుగా దర్శించినపుడు – అవన్నీ కూడా – పరిస్థితులు, సన్నివేశాలతో సహా – ప్రచ్ఛన్న దివ్యశక్తి సందేశంగా స్వీయవ్యక్తీకరణకు దోహదపర్చేవే.

ఏ ఒక్క పరిస్థితి, రూపము, చర్య, కదలిక, మరింత లోతైన లేక ఉన్నతమైన, మరింత స్థిరమైన, అత్యావశ్యకమైన, యదార్థమైన వాస్తవాన్ని, ఒకానొక చైతన్యదిశలో, వ్యక్తీకరించకుండా ఉండదు.

*

సృష్టి సమస్తం దివ్యశక్తి గురించి చెప్తుంది, హృదయగతంగా వినగలిగే చెవులుంటే.

భౌతికస్థాయిలో సౌందర్యం ద్వారా, మానసికస్థాయిలో జ్ఞానం ద్వారా, ప్రాణికస్థాయిలో శక్తి ద్వారా, చైత్యపురుషస్థా

యిలో ప్రేమద్వారా తనకు తాను అభివ్యక్తం చేసుకుంటాడు పర మాత్మ.

తగినంత ఉన్నతస్థాయికి మనం యెదిగినప్పుడు, ఈ నాలుగు అంశాలు పరస్పరం ఏకమై ఒకే చైతన్యంలో శక్తివంత మైన సౌందర్యభరితమైన తేజస్సు కలిగిన పరిపూర్ణ ప్రేమగా, అంతటా నిండి, వ్యాపించి ఉండటం తెలుసుకుంటాం.

జగన్నాటకం రక్తి కట్టడానికి మాత్రమే యీ దివ్యచై తన్యం తనని తాను వివిధ మార్గాలుగా, వివిధ అంశాలుగా విభ జించుకొని అభివ్యక్తమవుతుంది.

*

అన్నీ పరిగణించి, ప్రపంచం మొత్తాన్ని యదాతథంగా చూచిన ట్టయితే అన్నీ అనివార్యంగానే కనిపిస్తాయి. ఈ సృష్టి, ప్రపంచం అంతా భగవంతుడు చేసిన పెద్ద పొరపాటుగా మానవమేధస్సు తీర్పు చెబుతుంది. ఇదంతా కోరికనించి జనించినదేనని అంటుంది. తనకి తాను అభివ్యక్తం కావాలని, తనని తెలుసుకోవాలని, ఆనం దించాలని యిలా వరుస కోరికల పర్యవసానమే ఈ జంజాటం. కాబట్టి ఆ కోరిక మొదట్లోనే త్రుంచేస్తే సరిపోతుంది. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఈ కోరికల సంకెళ్ల నించి వాటి విషమ పర్యవసానాల నుంచి విముక్తి పొందాలి అనుకుంటుంది.

కాని ఈ వినోదం యింకా పూర్తి కాలేదు. ఆఖరి ఘట్టం వరకు వేచి చూడండి. మీ అభిప్రాయం తప్పక మీరే మార్చు కుంటారు. అందులో ఏమాత్రం సందేహం లేదు అన్నదే పర మాత్మ సమాధానం.

మూలం శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

దైవాన్ని తమ హృదయాలలో పదిలపర్చుకున్న వారు సురక్షితులు.

సావిత్రి

దైవంపై సంపూర్ణ విశ్వాసం

సకల సమస్యలకు ఏకైక పరిష్కార మార్గం ఒకటుంది. అదేమంటే ఎలాంటి కష్టసమయాల్లోనైనా దైవంపై అచంచల విశ్వాసంతో దైవముపై పూర్తిగా ఆధారపడడమే. అన్నీ సవ్యంగా సాగిపోతోంటే దీనికంత ప్రాధాన్యత వుండదు. కనుక నీవు దైవంపై సమగ్రంగా ఆధారపడి నిశ్చలంగా వుంటే నిశ్చలతలో అభివృద్ధి నందగలవు.

*

అంతరాత్మ సమర్పణం యొక్క మూలం, దైవంపై అచంచల విశ్వాసమే. అలాంటి విశ్వాసం కలిగి ఉన్నవాని భావన ఇలా సాగుతుంది: "నాకు దైవమే కావాలి. మరేదీ వద్దు. నన్ను నేను ఆయనకే పూర్తిగా సమర్పించుకొంటాను. నా ఆకాంక్ష అదొక్కటే. కనుక దైవాన్ని సాక్షాత్కరించుకొంటాను. దాన్ని తప్ప నేనింకేమీ కోరను. ఆయన చర్య రహస్యమైనా, బహిరంగమైనా, అది నాలో నన్ను ఆయన వద్దకు చేర్చునట్లు పని చెయ్యాలి. నా ఇష్టప్రకారంగానే నేను ఆశించిన సమయానికే ఆ పని జరగాలని నేను కోరను. అదంతా దైవం తనకు ఇష్టమైన రీతిలో ఇష్టమైన సమయాన చేయనీ. ఆయన వెలుగు, ఉనికి, ఆనందం అన్ని కష్టసమయాల్లో పని చేయును. కనుక నేను ఆయన్ను నమ్ముతాను. ఆయన సంకల్పాన్ని అంగీకరిస్తాను. ఆయన పైనే ఆధారపడతాను. నేను నా ప్రయత్నాన్ని విడువను. నా మనస్సు నిశ్చలంగా వుండి ఆయన్నే నమ్మి యుండగా, దాన్ని ఆయన తన వెలుగులోనికి ఉన్మీలనం చెయ్యనీ. నా ప్రాణమయ సత్తా నిశ్చలంగా ఉండి ఆయన వైపే తిరిగి వుండగా ఆయన దాన్ని తన శాంత్యానందాల వైపు ఉన్మీలనం చెయ్యనీ. అంతా ఆయన కొరకే. నేనూ ఆయన కొరకే. ఏమి సంభవించినా సరే, నా ఈ ఆకాంక్షకు, ఆత్మ సమర్పణకు కట్టుబడి ఉంటాను. విశ్వాసంతో కొనసాగుతాను. అంతట నా ఆకాంక్ష నెరవేరి తీరుతుంది."

మనం ఎదగవలసింది ఈ భావనలోనే.

*

ఆ తర్వాత మనం అనుసరించవవలసిన పద్ధతి మనలను మనం దైవంతో సంబంధం కలిగివుండునట్లు వుంచుకొనడం, మరియు మన సత్తానంతా ఆయన సత్తా లోనికి రూపాంతరీకరణం కావించుకొనుటకై ఆయన్ను అర్థించటం. అంతట దైవం మనలో సాధనకు సాధకునిగను, యోగమునకు గురువుగను అవుతాడు. మన నిమ్నస్వభావం ఆయన చేత దివ్యరూపాంతరీకరణ కేంద్రంగాను, ఆయన పరిపూర్ణతకు సాధనంగాను ఉపయోగించబడుతుంది. దాని ఫలితంగా మనలోని దివ్యప్రకృతి, తన తపస్సుయొక్క ఒత్తిడి, చేతనాశక్తుల ద్వారా తన సాక్షాత్కారాన్ని కల్గించుకొంటుంది. సర్వజ్ఞుడు, సర్వశక్తిసమన్వితడు అయిన దైవం పరిమితమైన అజ్ఞానభూమికలలో అవతరించి ఆ నిమ్నప్రకృతిని కాంతివంతం చేసి, శక్తివంతం గావించి, నిమ్నస్థాయికి చెందిన మానవ కార్యాలకు ప్రత్యామ్నాయంగా పనిచేస్తాడు.

మానసికంగా ఈ పద్ధతి దైవానికి అహంకారాన్ని పరిపూర్ణంగా సమర్పించడం ద్వారా ఉంటుంది. కాని ఇది సంక్షిప్తమైన, సులభమైన సాధన మాత్రం కాబోదు. దీనికి బ్రహ్మాండమైన విశ్వాసము, ధైర్యసాహసాలు అవసరం. వీటన్నింటికీ మించి దృఢమైన సహనం యెంతేని అవసరం.

*

అచేతనతో కూడిన స్తబ్దతని నిజమైన సమర్పణగా తరచు పొరబాటుగా భావించబడుచున్నది. కాని అచేతనతో కూడిన స్తబ్దత ద్వారా సత్యమైనది, శక్తివంతమైనది యేదీ రాదు. భౌతిక ప్రకృతి యొక్క అచేతనా స్తబ్దతయే తనను ప్రతి ఆసురిక ప్రభావానికి లోబరుస్తుంది. దైవశక్తి కార్యం ఆనందప్రదమైన, బలోపేతమైన, సహకారయుతమైన సమర్పణని కోరుతుంది. అది సత్యప్రకాశాన్విత శిష్యునియొక్క విధేయతను, అజ్ఞాన అసత్యాలకు వ్యతిరేకంగా పోరాడే దైవవిశ్వాసపాత్రుని యొక్క అంతరయుద్ధ వీరత్వాన్ని కోరుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్యా

అప్రమేయ వరదుని అభయప్రదానం

కేవలం కంటికి కనిపించేదే సత్యము అనుకునే స్థితి నుంచి వేరే ఆత్మసత్యం, పరమసత్యం ఉన్నదనే స్థితికి చేరటమే గీతాయోగము. విభక్త చైతన్యానికుండే అనేక పరిమితులను, మనసుకు అనుబంధించిన రాగద్వేషాలు, అలజడులు, అనభిజ్ఞత, లఘుతర జ్ఞాన ప్రకాశములు, పాపపుణ్యాలు, అధఃప్రవృత్తుల ద్వంద్వప్రమాణాలు, ద్వంద్వన్యాయాలు మొదలైన వాటినన్నిటినీ వొదులుకుంటే ఈ యోగమార్గంలోకి ప్రవేశించగలరు. పరమగురువు గీతాచార్యుడు ఈ విధంగా చెప్పారు: "సర్వం నాకే నివేదన చేసుకుంటూ బుద్ధిపూర్వకంగా చేసే కర్మలను నాకే ఒదిలిపెట్టు. జ్ఞానయోగాన్ని అవలంబించి నీ హృదయంతో, చిత్తంతో నాతో ఏకత్వం పొందు, సర్వకాలసర్వావస్థల్లో ఇలా ఉండగలిగితే నా కటాక్షం నీకుండి, ఎటువంటి ప్రమాదపరిస్థితుల్లోనైనా బయటపడగలవు. అహం వల్ల నీవు వినిపించుకోకపోతే అధోగతి తప్పదు."

మానవజీవితానికి అవసరమైన న్యాయాలు, ధర్మసూక్ష్మాలు, యోగశాస్త్రసారాలు చెప్పి, ఆ తర్వాత మనిషి మార్పుకు కావలసిన ప్రధమ ఆధ్యాత్మిక రహస్యాలను బోధించిన తర్వాత, ఇవి ఇంకా లోతైన గుహ్యతరమైన రహశ్యాలు. ఆ తర్వాత ఇంకా రహశ్యమైన, పరమగుహ్యతమమైన పరమ వచనం వేరే ఉన్నదని చెప్పి దానిని కృష్ణభగవానుడు తన ప్రియశిష్యుడు, యోగ్యుడు అయిన అర్జునునకు బోధించాడు. ఈ మహాసత్యాన్ని తెలియజేసే శ్లోకాలు రెండు గీతలో చిట్టచివరకు కనిపిస్తాయి. వీటికి ఏ విధమైన చర్చా చేయకుండా వాటంతట అవే సూటిగా హృదయానికి హత్తుకొని, ఆత్మకి అంతరార్థం బోధపడేటట్లుగా వదిలేశారు. అలా ఆత్మానుభవం అంతకంతకు హెచ్చరిల్లుతూ అతి సాదా సీదాగా కనిపించే ఈ అమోఘ వాక్యాలు అనంతమైన అర్థాన్ని అందీయగలవు. అత్యంత భావగర్భితమైన ఈ మాటలను అర్థం చేసుకునేటంతగా శిష్యుని తయారుచేయటానికే మిగతా పాఠ్యాంశాన్నంతా చెప్పినట్లు మనకి అనిపిస్తుంది. ఆ మిగతా భాగమంతా

కాస్త బుద్ధివికాసం, జ్ఞానం కలిగించటానికి చేసే అభ్యాసం, శిక్షణ సిద్ధాంతం మాత్రమే. "నా మనస్కుడవు, నాకు ప్రేమికుడవు, నా అభిమానివి కమ్ము. నాకు వినమ్రుడవై యుండు. నన్నే చేరగలవు. నీకు హామీ ఇస్తున్నాను. నీవు నాకు ప్రేమపాత్రుడవు కాబట్టి ఇదంతా చెపుతున్నాను. 'సర్వధర్మాణి పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ....' అన్ని పాపముల నుంచి, అపరాధముల నుంచీ నిన్ను కాపాడుతాను. విచారించకు" ఇదే అన్నిటిలోకీ అతిగుహ్యతమ రహశ్యము. సర్వోత్కృష్టమైన ఈశ్వర సందేశము.

భగవద్గీత మొదట్నించీ సుస్థిరమైన యోగవిధానాన్ని గురించీ, విస్తృతంగా ఉండే సుస్పష్టమైన తత్వవ్యవస్థ గురించీ, స్వభావ స్వధర్మాల గురించీ, అన్ని గుణాలకంటే ఉత్తమమైనదీ, అమరమైనదీ అగు ఆధ్యాత్మిక ధర్మానికి దారితీసే అనేక విధివిధానాలు, సూత్రాలు గురించీ పట్టుపట్టి చెపుతున్నట్లుగా ఉండి హఠాత్తుగా వాటన్నిటినీ ఖండిస్తున్నట్లు మానవాళికి ఈ విధంగా సందేశమిచ్చింది. 'సర్వధర్మాణి పరిత్యజ్య...' అన్ని ధర్మాలు వదిలిపెట్టు. పైనా, కిందా, లోపలా, బయటా, సర్వత్రా ఉండే పరమాత్మకు నిన్ను నీవు సమర్పణ గావించుకో. నీవు చేయవలసింది ఇంత మాత్రమే. ఇదే అసలు సిసలు మార్గము, అసలైన విముక్తి" ఆ జగత్ప్రభువు దివ్యరధసారధిగా, కురుక్షేత్ర ఉపద్రష్టగా అనేకములైన సత్యాలను వెల్లడించారు. ఆత్మ పరమాత్మ, పరదైవతముల గురించీ, ప్రపంచ సంక్లిష్టత గురించీ, మానవుని మనస్సు, జీవితం, హృదయం, ఇంద్రియాలు మొదలైన వాటికి పరమాత్మతోగల సంబంధాన్ని గురించీ అనేక విషయాలు తెలియచేశారు. ఇంకా మానవుడు తన ఆధ్యాత్మిక క్రమశిక్షణ, స్వయంకృషితో మర్త్యత్వం లోనుంచి అమరత్వంలోకి, పరిమిత మనఃపరిధిని దాటి అనంత ఆధ్యాత్మిక అస్తిత్వంలోకీ ఎదగగల విజయమార్గాన్ని గూడా తెలియచేశారు.

ఆ తర్వాత మానవునిలోనూ సకల జీవరాసులలోనూ నెలవైయున్న చిదాత్మ. దైవతముగా అయి మాట్లాడుతూ ఇలా అన్నారు. "ఈ స్వయంకృషి ఏదీ కూడా చివరలో అక్కరలేదు.

నీవు నాకు సర్వసమర్పణ చేసుకొని నీలోనూ, అన్నిటిలోనూ, నెలకొని ఉన్న దైవత్వం, చిదాత్మపై భారం వేసి ఆయనే దారి చూపగలడన్న సంపూర్ణ విశ్వాసం ఏర్పరుచుకున్న రోజున నీకు ప్రతిబంధకాలుగా ఉండే అన్ని నీతినియమాలనూ వదిలిపెట్టవచ్చు. నీ మనసంతా నా వైపు మళ్ళించి నా ఆలోచనతో నా భావంతో నింపుకో. నీ హృదయమంతా నాతో నింపి నీవు చేసే పనులన్నిటినీ యజ్ఞభావంతో నాకు సమర్పణగా చేయి. ఆ విధంగా సమర్పించిన తర్వాత నీ జీవితాన్నీ, ఆత్మనూ, క్రియలను నా ఇచ్ఛాశక్తి ప్రకారం నడవనీ. నా వలన ఏం జరుగుతున్నప్పటికీ విచారించకు, కలవరపడకు. నీ హృదయం, నీ మనస్సు, నీ జీవితం, నీ చర్యలు మొదలైనవన్నీ ధర్మం, న్యాయం, తప్పుతున్నట్లు కనిపించినప్పటికీ అవన్నీ మానవుడు తన పరిమితబుద్ధినీ, సంకల్పాన్నీ నడపటానికి ఏర్పరచుకున్నవే కాబట్టి చింతించవద్దు. నేను ఆచరించేది సర్వం ఎరిగిన పరిపూర్ణ వివేకం, శక్తి, ప్రేమలతో కూడిన మార్గం. అది పరిపూర్ణ జ్ఞానమయమార్గం కాబట్టి, సమగ్ర పర్యవసాన ఫలితం కోసం కావలసిన పరికరాలను, చలనాలను చక్కగా సమ్మిళితం చేయగలదు. సమగ్ర పరిపూర్ణతకు కావలసిన అనేక సూత్రాలను అది పరిష్కరించి జతచేసి అల్లగలదు.

ఈ యుద్ధభూమిలో సర్వభూతేశ్వరునిగా అంతర్గతంగానూ, బాహ్యంగానూ నీకు దర్శనమిస్తూ నీకు తిరిగి అభయప్రదానం చేస్తున్నాను. అన్ని దుఃఖాలకు, దుర్నీతులకు అతీతంగా నిన్ను నడిపించి నా దరికి చేర్చుకుంటానని నీకు వాగ్దానం చేస్తున్నాను. నీకే కష్టాలొచ్చినా, బాధలొచ్చినా దీనిని మరవవద్దు. ఈ విశ్వంలో సంపూర్ణ దివ్యజీవనం కోసం సర్వాతీతపరబ్రహ్మలో అమరత్వం దిశగా నిన్ను నడిపించగలననీ హామీ ఇస్తున్నాను.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామశాస్త్రి

సర్వదా దైవాన్ని గుర్తుంచుకో

నీవే పని చేసినా దైవాన్ని సర్వదా గుర్తుంచుకో.

*

ఇచ్చి పుచ్చుకోవటంలో, పని చేసేటపుడు, నిశ్శబ్దంగా ఉన్నపుడు, ఎప్పుడూ నాకు నీ ఆనంద స్మృతియే.

*

అన్ని ఆలోచనలు, అన్ని భావాలు, అన్ని కర్మలు, అన్ని ఆశలు దైవం వైపుగా మరల్చబడనీ. ఏకీకృతం కాబడనీ. ఆయనే మన ఆశ, మనకు రక్ష.

*

మన ఆలోచనలు, భావావేశాలు – అన్నీ, నది సాగరం వైపు సాగి పోతూన్నట్లు, దైవం వైపుగానే సాగిపోవాలి.

*

ఉజ్వల దైవచింతనలో ఎంత ప్రశాంతతత! ఎంత ఉదాత్తత! ఎంత స్వచ్ఛత!

*

దైవాన్ని ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకో. అపుడు నీవు చేసేది ప్రతీదీ దివ్యసాక్షాత్కార వ్యక్తీకరణే.

*

ఒకే వృత్తి, ఒకే లక్ష్యం, ఒకే ఆనందం – అదియే దైవం.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

> “నిశ్శబ్ద మానసంలో సర్వాతీతశక్తి పనిచేస్తుంది.
> నిశ్శబ్ద హృదయం ఆ అపౌరుషేయవాక్కును
> వింటుంది.
> అపార శరణాగతే అతని ఏకైక శక్తి..”
>
> సావిత్రి

దైవానికి ఉన్మీలనమై దగ్గరగా ఉండటం

దైవం పట్ల సుముఖత కలిగి ఉండటం (దైవానికి హృదయాన్ని తెరిచి ఉంచడం) అంటే భగవంతుని శక్తినీ, ప్రభావాన్నీ అందు కోగల సంకల్పాన్నీ కల్గి ఉండటం. పురోగమనంలో దానిని విని యోగించుకోవడం. ఆ చైతన్యస్పర్శలో ఎప్పటికీ ఉండిపోవాలనే సుస్థిర ఆకాంక్షను కల్గి ఉండటం అని అర్థం. నిజానికి విశ్వాసమే శక్తీ, చెతన్యమూ. ఇవి ఎప్పుడూ నీతో, నీ చుట్టూ, నీ అంత రంగంలోనే ఉన్నాయి. నీవు చేయవసిందల్లా వాటిని పొందే మార్గంలో నీలో నీకేదీ అడ్డుతగలకుండా చేసుకోవడమే...

ప్రశ్న: శ్రీమాతకు ఉన్మీలనం పొంది (తెరుచుకోవడం) అయి ఉండటమెలా?

ఈ క్రింది పద్ధతులు ద్వారా –

1. 'మిమ్మల్ని' నిరంతరం లేదా నియమితకాలంలో జ్ఞప్తియందు ఉంచుకోవడం?

   మంచిదే....

2. మీ నామాన్ని జపించుతూ స్మరణ –

   సహకరిస్తుంది.

3. ధ్యానము సహాయంతో –

   ధ్యానము చేసే అలవాటు లేకపోతే కష్టం.

4. మీకే విధేయులై, మిమ్మల్ని ప్రేమించేవారితో సంభాషిస్తూ ఉంటుంటే....?

   ఇది చాలా అపాయకరం.... ఎంచేతంటే మాటలు మాట్లా డేప్పుడు అనవసరమైన మాటలూ, లేదా పనికిరాని ఊసులు రాగ లవు –

5. పోనీ మీ గ్రంథాలను చదవడం ద్వారా....

   మంచిది.

6. మీ గురించియే చింతన చేస్తుంటే...?

   చాలా మంచిది....

7. నిజమైన నిష్కల్మషమైన ప్రార్థనలతో....

మంచిది... తనను తాను పూర్తిగా సమర్పించుకొంటేనే తాను దైవానికి తెరుచుకొని ఉన్నట్లు.

సమచిత్తము, ప్రేమ, చైతన్యవృద్ధి జరుగుతూ ఉంటేనే దైవంతో మన సాన్నిహిత్యం పెరుగుతుంది. మనలోని అహంకార మాలిన్యాన్ని తొలగించుకొని మనల్ని మనం పరిశుద్ధం చేసుకొంటూ వికసిస్తున్నకొద్దీ దైవంతో మన సాహచర్యం ఇంకా ఇంకా విస్పష్టమౌతూ, సచేతనమౌతుంది.

*

దైవంతో ఉన్న అనుబంధం దైవాన్నే అల్లుకొని అచ్ఛాదితమై ఆతడినే అలంబనగా చేసుకొంటుంది. అది ఎప్పటికీ విడివడదని కచ్చితంగా చెప్పొచ్చు.

*

దైవం యెడల వాత్సల్యానుభూతి: ఇది మధురమైన విశ్వాసభరితమైన సున్నితభావన. ఈ భావన తనకు తానుగా తిరుగులేకుండా, షరతులు లేకుండా దైవానికి సమర్పితమౌతుంది.

*

దైవంతో అన్యోన్యత: ఎటువంటి నిర్బంధం లేకుండా పూర్తిగా దైవానికి, శరణాగతమవ్వడం. ఆయన దివ్యప్రభావానికి వ్యక్తిలోని అణువణువు లోనై దానిని పరిపూర్ణంగా స్వీకరించడం.

*

దైవంతో సర్వసమగ్రమైన అన్యోన్యస్థితి: వ్యక్తిలోని సర్వస్వం మరి దేనికీ కాక దైవస్పర్శకు మాత్రమే స్పందించి, అనుకంపన చెందడం.

మూలం: శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

నాకొక తియ్యని బుల్లి తల్లి ఉన్నది
ఆమె నా హృదయంలోనే వసిస్తుంది.
మేమెంతో కలిసిమెలసి ఆనందంగా ఉంటాం.
విడిపోము మేమెన్నటికీ....

శ్రీమాత సందేశాలు

28 మార్చి 1958

దైవానికి సంబంధించినదే ఆలోచించు.

29 మార్చి 1958

దైవం కొరకే జీవించు.

30 మార్చి 1958

దైవాన్నే కాంక్షించు.

1 ఏప్రిల్ 1958

దైవం కోసమే పనిచెయ్యి

2 ఏప్రిల్ 1958

దైవాన్నే సేవించు.

3 ఏప్రిల్ 1958

దైవాన్నే అంటిపెట్టుకొని ఉండు.

4 ఏప్రిల్ 1958

దైవమే కావాలని కోరుకో

5 ఏప్రిల్ 1958

దైవాన్నే అన్వేషించు.

6 ఏప్రిల్ 1958

దైవాన్నే ఆరాధించు.

7 ఏప్రిల్ 1958:

దైవమనే దొక్కటే నిజం, మిగిలినదంతా బూటకం. అయినా దేవుడే అంతటా మహాత్మునిలోనూ, పాపాత్మునిలోనూ ఉన్నాడు.

8 ఏప్రిల్ 1958

దైవం మాత్రమే వాస్తవం. తక్కినదంతా భ్రాంతి అయినా దైవమే అన్నింటా ఉన్నాడు. ఋషిసత్తముడిలో ఉన్నాడు. మూర్ఖుడిలోనూ ఉన్నాడు.

14 ఏప్రిల్ 1958

ప్రేమ అంటే కేవలం దైవమే – మిగిలినదంతా స్వార్థాన్ని ఆధారంగా చేసుకొన్న మోహారాగలంపటం. కానీ దైవ ప్రేమే సర్వం లోనూ, సర్వత్రా ఉన్నది.

22 మార్చి 1967

ఈ సమస్త సృష్టిలో దాగివున్న అసలు సత్యం ఎవ్వరికీ తెలియదు. కానీ ప్రతి ఒక్కడూ నాకు తెలుసు అనే అంటాడు. కాని అసలు వాస్తవం ఎవ్వరికీ తెలియదు. ఏదో ఒకనాటికి ఆ సత్యం రూపుదాల్చిందా – ఇక్కడున్నవాళ్లంతా – వీళ్లే కాదు – ఎక్కడున్న వాళ్లైయినా – వాళ్లలోని అంతులేని అజ్ఞానానికీ, వాళ్లు సత్యాన్ని గూర్చి చేసే బూటక వ్యాఖ్యలకి బెంబేలెత్తిపోతారు.

అందుకు నేనిచ్చే సలహా. ఇలా సత్యం గూర్చి తీర్పు నివ్వడం మానుకొని, చక్కగా ప్రశాంతంగా ఉంటే సరిపోతుంది. అదే శ్రేయస్కరం....

10 జూలై 1968

మనం ఉండాల్సిన నిజస్థితి ఏమిటంటే దైవాన్ని సంపూర్ణంగా ఆలింగనం చేసుకోగల సర్వసమర్పిత ప్రేమలో లీనమైపోవడమే.... ఇక దానిలో ఇది చేయాలి, ఇది కాదు..., వీళ్లని చూడాలి, వాళ్లని పట్టించుకోకూడదు... ఇదిగో ఇందతా అనవసరం. ఆ దివ్యప్రేమానుభవం. గనుక అయితే ఇక ఏమి జరుగుతున్నా దానిలో నిహితంగా ఉన్న దైవసంకల్పాన్ని గ్రహించి దానికి తేలిగ్గా విధేయుడై ఉంటాడు.

మూలం: శ్రీమాత

అనువాదం: సి. హార్షవర్ధన్

ఓ దైవమా! నీవు నాకు అంతుపట్టవు. అర్థము కావు. నా నిర్మలతమ నిశ్శబ్దభక్తిలో నిన్నే ఆరాధిస్తాను.

నిత్యజీవన సూత్రాలు

ఉదయం నిద్ర నుంచి లేస్తూనే హడావిడిగా పనులు ప్రారంభించకుండా... మనల్ని మనం కూడదీసుకుని ప్రశాంతంగా ఉండి దైవాన్ని ప్రార్థిస్తూ, ఆ రోజంతా చేయబోయే ప్రతి పనిని దైవాన్ని గుర్తుచేసుకుంటూ చేస్తానని తీర్మానించుకోవాలి. అది ఎట్టి పరిస్థితులలోనూ పాటిస్తానని వాగ్దానం చేసుకోవాలి.

అలాగే నిద్రపోయే ముందు కూడా నీ సర్వశక్తుల్ని ఏకం చేసుకుని ఏకాగ్రతతో కొంచెం సేపు నిశ్శబ్దంగా ఉండి, గడచిన రోజంతా నీవు చేసిన పనులన్నీ ఒక్కసారి తరచి చూసుకోవాలి. ఏయే సమయాల్లో నువ్వు దైవాన్ని మరచిపోయావో గమనించాలి. అలాంటి మరుపు మళ్లీ సంభవించకూడదని దైవాన్ని ప్రార్థించు.

*

జీవితంలోని ప్రతీ చర్య, ప్రతి చిన్నపని, ప్రతి కదలిక, ప్రతి ఆలోచన, ప్రతి ఉద్వేగం, ప్రతి భావన.. అత్యంత సామాన్యమైన చర్య కూడా నువ్వు దైవానికి సమర్పించుకొన్నప్పుడు, ఈ పని నేను దైవార్పణంగా చేశానా అని ప్రశ్నించుకున్నపుడు.... నీ దృక్పథమే మారిపోతుంది. అపుడు జీవితంలోని ప్రతీ చర్య, ప్రతీ కదలిక, ఆలోచన, ప్రతీ భావన, ప్రతీ సామాన్యవిషయం కూడా అత్యంత ప్రాధాన్యమైన విషయంగా కనిపిస్తుంది. అదే సాధన. ఆ విధంగా ప్రతీ కదలిక మనం పరిశీలించుకున్నప్పుడు మన దృక్పథంతో పాటు, అంతకు ముందు లేని ఒక వెలుగులో జీవితం ప్రకాశిస్తుంది.

*

శ్రీమాత ఎల్లప్పుడూ నీతోనే ఉందన్న విషయాన్ని జ్ఞాపకం పెట్టుకోవాలి. శ్రీమాతను సంబోధిస్తూ ఆమెను ఈ క్రింది విధంగా ప్రార్థించు. ఆమె నీ కష్టాలను తొలగిస్తుంది.

*

శ్రీమాతా!

నాలోని జ్ఞానప్రకాశానివి నీవే
నా ఆత్మపరిశుద్ధతవు నీవే
నా ప్రాణిక నిశ్చలశక్తి నీవే
నా శరీరంలోని పటుత్వం నీవే

నిన్నే నమ్ముకున్నాను. నీకే నన్ను నేను సంపూర్ణంగా అర్పించుకున్నాను. నీకు మాత్రమే చెందాలని ఆకాంక్షిస్తున్నాను. నా మార్గంలోని అవరోధాలను తొలగించు శ్రీమాతా!

*

నిజానికి మనం నిరంతరం ఆకాంక్షించే స్థితిలోనే ఉండాలి. అలా చేయలేనపుడు కేవలం పసిబిడ్డవలె నిర్మలంగా ప్రార్థన చేయాలి.

మూలం: శ్రీమాత
అనువాదం: డి. సత్యవాణి

ఉల్కలు – సిద్ధి

ప్రశ్న: శ్రీమాతా! ఉల్కలను చూచినప్పుడు ఎవరైనా ఆకాంక్షిస్తే అది ఒక సంవత్సరంలోగా సిద్ధిస్తుందంటారు. నిజమేనా?

అసలు దీని అర్థం ఏమిటో తెలుసా? ఆ ఉల్క నీ కంటబడినపుడు నీ ఆకాంక్ష సూత్రీకరింపబడి ఉండాలి. ఉల్క ఎంతో సేపు ఉండదు. అప్పటికే నీ ఆకాంక్ష రూపుదాల్చి ఉంటే, అది అంతకు ముందు ఎంతసేపటినుంచో నీ చైతన్యానికి అగ్రభాగాన ఉందన్న మాట. ఇది సాధారణ విషయాలకు వర్తించదు. ఆధ్యాత్మిక ఆకాంక్షలకే వర్తిస్తుంది. సరిగా అదే సమయంలో ఆధ్యాత్మిక ఆకాంక్షను రూపొందించుకోగలిగావంటే, దాని అర్థం అది అప్పటికే అక్కడ ఉందన్న మాట. అది నీ చైతన్యం యొక్క అధీనంలోనే ఉన్నది. నీ చైతన్య అధీనంలో ఉన్నదానిని త్వరితంగానే సంసిద్ధం చేసుకోగలగుతావు. ఈ ప్రయోగం చేసే అవకాశం నాకోసారి కలిగింది. సరిగ్గా ఉల్క కదిలిపోయే సమ

యాన నా చైతన్యం నుంచి తటాలున లేచింది. సరిగ్గా అదే క్షణంలో – (ఆకాంక్ష) – 'నా శరీరానికి దివ్యత్వ సంయోగసిద్ధి' సంవత్సరం దాటకుండానే అది సిద్ధించింది.

కాకపోతే – అది ఉల్క వల్ల కాదు. అది (ఆకాంక్ష) నా చైతన్యమంతా నిండి ఉంది. అది తప్ప నాకు మరో ఆలోచన లేదు. అదే అపేక్షించాను. ఆ ఆలోచనే నాకు. అందుకొరకే ప్రవర్తించాను. ఒక జీవితకాలం పట్టేది, ఒక్క సంవత్సరకాలంలోనే జరిగింది. (కనీసం 35 సం.లు పడుతుంది.)

ఇది ఎందువల్ల సిద్ధించిందంటే నా ఆలోచన అదే కాబట్టి. ఉల్క చలిస్తూ పోయే క్షణంలో అదే ఆలోచనలో ఉంటూ (ఆకాంక్ష) రూపొందించగలిగాను కాబట్టి. అదేమీ అస్పష్ట ముద్ర కాదు. స్పష్టమైన మాటలలో సూత్రబద్ధమైనది. 'To realize union with the Divine' – అంతరంగ దైవముతో సమైక్యత.

కాబట్టి ఇక్కడ ఉల్క ప్రధానం కాదు. ఉల్క కేవలం బాహ్యాప్రదర్శన. అంతే. నీ సత్యము తాలూకు ఇచ్ఛ సర్వమూ ఒకే అంశంపై కేంద్రీకరింపబడాలి. ఇదే ఇక్కడ కావల్సినది.

*

ప్రశ్న: మీ కొరకెవరేమి చేసినా, దానిని ప్రతి క్షణము ఎలా జ్ఞాపకముంచుకోవటం? ఒకరు ప్రత్యేకంగా అర్పణ కావించుకోవాలనుకుంటారు. ఇది దైవము కోసమేనని మరిచిపోకుండా ఎలా ముందుకు సాగిపోవటం?

ఇది సాధించటానికి పట్టువదలని ఇచ్ఛ, గొప్ప ఓరిమి కలిగి ఉండాలి. ఒక్కసారి నిర్ణయం తీసుకున్నపుడు నీకు అండగా, సహాయంగా, దైవం అక్కడ ఉంటుంది. ఇది అంతరంగ హృదయంలో అనుభావ్యమవుతుంది.

ప్రశ్న: దైవంసర్గంలో ఎప్పుడూ ఉండాలంటే ఏమి చేయాలి? ఈ సంసర్గమునుంచి ఎవ్వరూ, ఏదీ మళ్లించకుండా...

ఆకాంక్ష – చిత్తశుద్ధి

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

మనస్సును ప్రశాంతంగా ఉంచుకొనేది ఎలా?

(మనస్సును ప్రశాంతంగా ఉంచుకొనటంలో) సరైన ఫలితాన్ని కోరేవారు తప్పనిసరిగా చేయాల్సింది.. వారి మనస్సు నిశ్శబ్దంగా ఉండి తీరాలి. అప్పుడే చేతనను కేంద్రీకరించడాన్ని ఆశించ వచ్చు.

ముందుగా మనస్సు మరియు చేతన; ఈ రెంటి మధ్య ఉన్న భేదాన్ని అనుభవంలో గ్రహించాలి. అవి రెండు భిన్నమైన విషయాలు.

*

ప్రశ్న: అమ్మా! మనస్సు యొక్క జోక్యాన్ని నిరోధించటం ఎలా?

ఆహ్: ముందుగా దానిని గట్టిగా వాంఛించాలి. తర్వాత ఎవరైనా గట్టిగా అరుస్తున్నప్పుడు "ప్రశాంతంగా ఉండండి. అర వకండి. నిశ్శబ్దంగా ఉండండి!" అని చెప్పినట్లుగానే మనస్సు తన సలహాలతో జోక్యం చేసుకొనేందుకు ముందుకు రాగానే దానికి అలాగే చెప్పాలి. దానిని శాంతింపచేయాలి. దాని అల జడులను అరికట్టాలి. దానిని మౌనంగా ఉంచాలి. అందుకోసం ముందుగా దాని మాటలను వినటం మానుకోవాలి. చాలాసార్లు అది దాని పనిని ప్రారంభించగానే, అంటే దాని ఆలోచనలను నీవు వినగానే, వాటిని అవగాహన చేసుకొనేందుకు ప్రారంభించ గానే, అది ఈ (మానసిక) దుర్బలత్వాన్ని పసిగట్టి, నీవు దాని సూచనలపట్ల ఆసక్తిగొన్నట్లు అర్థం చేసుకొంటుంది. ఇంకేం! దాని పనిని అది నెమ్మదిగా కొనసాగిస్తుంది. అందుకే దానిని అసలు పట్టించుకోవద్దు. ఖాతరు చేయవద్దు.

ప్రశ్న: మనస్సులో సాగే చర్చలను ఆపడం ఎలా?

అందుకు ముందుగా చేయాల్సింది వీలైనంత తక్కువగా మాట్లాడటం. నీవేమి చేస్తున్నావో దానిని గురించే ఆలోచిం చటం. అంతే. చేసినదానిని గురించిగాని, చేయబోయే దానిని గురించిగాని ఆలోచించడం మానెయ్యాలి. జరిగిపోయినదాని

గురించి విచారించటంగానీ, జరుగబోయేదాని గురించి ఊహించ డంగానీ చేయకూడదు. నీకు సాధ్యమైనంతగా, నీ ఆలోచనలలో పొడచూపే నిరాశా నిస్పృహాలను గమనించి (నీకు నీవై) స్వచ్ఛం దంగా ఆశావహ దృక్పథం అలవరచుకోవాలి.

మీలో ప్రతి ఒక్కరికి నేను చెప్పదలచింది, మీరు తప్ప నిసరిగా ఇలా ప్రయత్నించండి – ఎక్కువగా అవసరం లేదు. ప్రతి రోజు ఒక గంట చాలు – ఎంతవరకు అవసరమో అంతవ రకే మాట్లాడండి. నిత్యజీవితంలో ఒక గంట సమయాన్ని ఎన్ను కోండి. అది కూడ మీకు బాగా అనుకూలమైన సమయాన్నే. ఆ సమయంలో మాత్రమే ఎంతవరకు అవసరమో, అంతవరకే మాట్లా డేలా నిన్ను నీవు నియంత్రించుకో. అయితే, అసలు సంగతేమి టంటే, తప్పనిసరిగా ఏది అవసరమో, ఏది కాదో తెలుసుకో వడమే చాలా కష్టం. నిన్ను నీవు, అర్థం చేసుకొనటం అనేది దానికదే ఒక అధ్యయనం. అయితే అలా చేస్తూ పోగాపోగా, అది నీకే బాగా అర్థం అవుతుంది. ఆ తరువాత మాట్లాడడం అనేది అంతగా అవసరంలేదని మాటలతో పనిలేకుండా మౌనంగా ఉండిపోవడం అనేది ఏమంత కష్టం కాదనీ తెలిసిపోతుంది. అలా కాక, నీవు మాట్లాడడం ప్రారంభించగానే, రెండు, మూడు లేదా పది, ఇరవై మాటలు అవసరం లేకున్నా వ్యర్థంగా మాట్లా డటం జరుగుతుంది.

*

ఏది ఏమైనా, ఇంకా పూర్తిగా నీపై నీకు అదుపు అనేది సాధ్యం కాకున్నా. (ఈ ప్రయత్నంలో) నీవు ఒక స్థాయికి చేరుకుంటావు. దీనిని నీ మెదడులోని (శ్రీమాత తన చేతిలో కనురెప్పల పైభా గాన్ని చూపుతున్నారు) కదలికలన్నింటినీ పారద్రోలి, ఏ స్పందనా లేని స్థితికి చేరుకుంటావు. మనస్సు ఉపరితలంలో చాలా సున్ని తంగా ఉంటుంది. నీవు చదివే పుస్తకంలో ఒక ఖాళీ పేజినీ చూస్తున్నంతగా అంతా ఖాళీగా ఉంటుంది. వ్యావహారికంగా కూడా నీవు పూర్తిగా ఏమి లేనంతగా (ఖాళీగా) అయిపోతావు.

నీవు ఇంటి దగ్గర ఉన్న సమయాలలో ఇలా ప్రయత్నించి చూడు – ఇది చాలా ఆసక్తిగొలిపే విషయం – అలా చేసాక నీ తలలో ఎక్కడో ఒక చోట చిన్న అంశం ఏదో నృత్యం చేస్తున్నట్లు అనిపిస్తుంది – తన ఆలోచనలతో ఏదో తనను వేధిస్తున్నట్లు చెప్పగా, శ్రీఅరవిందులు తన చేతితో ఆ నృత్యం చేసే భాగాన్ని, ఒక పురుగును ఏరి అవతల పారేసినట్లు తీసేయడం నేను చూసాను. (శ్రీమాత తన చేతివేళ్ళతో ఆ పని చేసినట్లు అభినయించి చూపారు) అంతే, అంతా ప్రశాంతం, ప్రకాశవంతం – అదంతా కంటికి కనిపించినంత స్పష్టంగా ఉంది. ఆయన ఏమీ మాట్లాడకుండా తీసి అవతల పారేసారు తెలుసా! అంతే, ఆ పని అయిపోయింది.

*

ప్రశ్న: మనస్సుయొక్క జోక్యాన్ని నిరోధించేందుకు ఏమి చేయాలంటారు?

మనస్సు మౌనంగా ఉండటం నేర్చుకోవాలి. ప్రశాంతంగా ఉండడం అలవాటు చేసుకోవాలి. ఏమాత్రం గొడవ చేయకుండా జాగ్రత్తగా ఉండాలి. నీవు నీ మనస్సును నిశ్శబ్దంగా ఉండిపోయేలా చేయాలనుకుని నీకై నీవు ప్రయత్నిస్తే అది చాలా కష్టమైన పనే. ఒక రకంగా అది అసాధ్యం కూడ. నిజానికి బాహ్యాతలంలోవున్న మనస్సు తన పనిని ఎన్నటికి మానుకోదు – రికార్డింగ్ మిషన్‌లాగ ఆగకుండా అది తన పనిని తాను చేస్తూనే ఉంటుంది. అది తాను రికార్డు చేసినదంతా తిరిగి తిరిగి వినిపిస్తూనే ఉంటుంది. దానిని ఆపే మీట ఉంటే తప్ప అది, అలా అక్కడ ఆగకుండా కొనసాగుతూనే ఉంటుంది. అయితే మరొక ప్రక్క నీవు నీ చేతనను మామూలు స్థాయినుండి ఉన్నత స్థరాలకు లేవనెత్తగలిగిన యెడల, ఉన్నతశ్రేణినుండి అవతరించే వెలుగు, నీ మనస్సును శాంతపరచి, దానిని ఇంకా తిరగకుండా చేసి, అలా అవతరించిన మౌనాన్ని స్థిరపడేలా చేయగలుగుతుంది. ఈ ఉన్నతస్థరంలోకి ఒక్కసారి గనక నీవు ప్రవేశించగలిగితే, ఇంక నీవు దానినుండి బయటపడలేవు. బాహ్యామనస్సు ఎప్ప

టికీ ప్రశాంతంగానే ఉంటుంది. ఒకే ఒక్క పరిష్కారం ఏమిటంటే ఉన్నతమైన ఆ వెలుగుకోసం ఆకాంక్షించడమే.

*

ధ్యానం ద్వారా పొందే మనో ప్రశాంతత కొద్దిసేపు మాత్రమే ఉంటుంది. నీవు ధ్యానములోంచి బయటకి రాగానే, అదే సమయంలో నీ మానసిక ప్రశాంతినుండి కూడ బయటపడడం జరుగుతుంది. నీ మనఃప్రాణశరీరాదులలో సుస్థిరమైన ప్రశాంతత నిన్ను నీవు దైవానికి నివేదన చేసుకొన్నపుడే పూర్తిగా సాధ్యపడుతుంది. నీవెపుడైతే, నేను – నాది అనేది ఏమాత్రం మిగలకుండా, ఈ భౌతికాన్ని, ఇంద్రియ సంవేదనలను, భావాలను, ఆలోచనలను – అన్నీ దైవపరం చేయగలిగావో, అపుడు దైవం నీ పూర్తి బాధ్యతను తానే స్వీకరిస్తాడు. ఇంక అపుడు నీవు దేనిని గురించీ చింతించాల్సిన పని లేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

నిరంతర దైవస్మరణ

(నిరంతరం) దైవస్మృతి లేదా స్మరణలో (పద్ధతి, లక్ష్యం గురించి) నీవెప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ఉపేక్ష కూడదు. విస్మృతిలోనే గుణాలు విజృంభించి వశపర్చుకుంటాయి. యోగి భ్రష్టుడవుతాడు. అస్థిరుడై పతనమవుతాడు. త్రోవ తప్పుతాడు. నీ యోగలక్ష్యాల స్మృతిని అన్ని విషయాలలోను, సంఘటనలలో నిరంతర దైవస్మరణగా మార్చుకోగలిగితే అప్రమత్తమనేదే ఉండదు. అదే గీతలోని నిత్య అనుస్మరణ.

*

(గీతా వ్యాసాల నుంచి)

దివ్యచైతన్యమును మొదట అద్భుతమైన గొప్ప క్షణాలలోను లేదా ప్రశాంతమైన ఉజ్జ్వలసమయాలలోను కనుగొన్నప్ప

టికి దానినంతా కలిపి ఒక్కసారిగా నిలబెట్టుకోలేము, లేదా ఇచ్ఛానుసారంగా వెనుకకు పిలవలేము. వ్యక్తిచైతన్యాన్ని దైవంలో నిలకడగా పట్టి ఉంచడానికి తరచుగా అశక్తతే కారణం అవుతుంది. ఆ దివ్యప్రకాశం నుంచి ఎన్నో దీర్ఘవియోగ రాత్రులు, గంటలు లేదా క్షణకాలాల తిరుగుబాటు, అపనమ్మకం లేదా ఓటమి ఉంటుంది. అయినా కాని, అభ్యాసంతో కూడిన సంయోగం వల్లను, అనుభవాన్ని నిరంతరం పునరావృతం చేసుకోవటం వల్లను, అత్యున్నత చైతన్యశక్తి సత్వంలో వృద్ధిపొందుతుంది. ప్రకృతిని శాశ్వతంగా కైవసం చేసుకుంటుంది. మానసిక సామర్థ్యం వల్లను, పట్టినపట్టు వీడకుండా బాహ్యంలోకి పోయే మానసికప్రవృత్తి వల్లను ఇది కూడా చాలా కష్టమైనదిగా కనిపిస్తున్నదా? అప్పుడు తేలికైనమార్గం, చేసే కర్మలన్నీ కర్మల అధిష్టానదైవం కోసమే చేయడం, అలా బాహ్యంలోకి పోయే మానసికప్రవృత్తిని అంతర్గత ఆధ్యాత్మిక సత్వంతో విలీనం చేయుటం, అంతటి గమనప్రవృత్తి సమయంలో కూడా శాశ్వతసత్యం వైపుకు వెనకకు రప్పించి దాని మూలంతో అనుసంధానించగలగడం. అప్పుడు పురుషోత్తముని ఉనికి సహజమానవుని మీద అతడు ఒక దేవతాశక్తిగా, ఒక అంతరాత్మశక్తిగా అయ్యేదాకా దానితో నింపబడి వృద్ధి అవుతూంటుంది; జీవితమంతా నిరంతరం దైవస్మరణగా ఉంటుంది, పరిపూర్ణత కూడా వృద్ధి అవుతుంది. మానవ అంతరాత్మ పూర్ణ అస్తిత్వం పరమాత్మ అస్తిత్వంలో ఏకమవుతుంది.

కాని ఈ నిరంతర దైవస్మృతి, ఆయన పరంగా మన కర్మల ఉద్ధారణ కూడా పరిమితమానస శక్తికి అసాధ్యం అనుకోవచ్చును. ఎందువల్లనంటే దాని మతిమరుపులో అది కర్మ వైపుకు, దాని బాహ్య అభ్యంతరంలోని వస్తువు వైపుకు మరలుతుంది. అంతరంగంలోకి దృష్టి మరల్చాలనే స్మృతినిగాని, ప్రతిగమనాన్ని దైవసాన్నిధ్యం చెంత ఉంచాలనిగాని అనుకోదు. అప్పుడు మార్గం ఏమిటంటే, కర్మలో నిమ్నజీవిని నియంత్రించి, ఫలితం ఆశించకుండా కర్మలను చేయడం. ఫలితాలన్నింటిని సన్యసించాలి. ఏదైతే కర్మను నిర్దేశిస్తుందో ఆ మహాశక్తికి వద

లివేయాలి. అయినా కాని ప్రకృతిమీద ఆ శక్తి విధించే కర్మను తప్పక ఆచరించాలి. దీని అర్థం ఏమిటంటే, అడ్డం క్రమంగా సన్న గిల్లుతుంది. తేలికగా మాయమవుతుంది. మనసుకు దైవాన్ని స్మరించే విముక్తి లభించి, దైవచైతన్యంలోని స్వతంత్రతలో తనను తాను స్థిరపరచగలుగుతుంది.

*

భౌతికచైతన్యంలోని ఒక రకమైన జడత్వం దానిని అది చేసే కర్మలోని గాడిలో బంధిస్తుంది, దాని వలన అది అందులో స్థిర పడి, యథేచ్ఛగా స్మరించలేదు.

*

నీవు పేర్కొనే అడ్డంకులన్నీ చాలా సహజమైనవి, సాధారణంగా చాలామందికి వచ్చేవే. పోల్చిచూస్తే, ఒకరికిది సులభం. ఒకరు ప్రశాంతంగా, ధ్యానంలో కూర్చున్నప్పుడు ఎరుకతో స్మరిస్తూ ఉండగలరు. కాని అదే వారు తీవ్రమైన పనిలో ఉండవలసివస్తే కష్టసాధ్యం. ఆ స్మృతి, కర్మలో, చైతన్యం అనేవి అంచెలంచె లుగా రావాలి. అవి అన్నీ నీకు ఒక్కసారిగా రావాలని ఆశిం చవద్దు. ఎవరూ ఆ విధంగా అన్నింటినీ ఒక్కసారిగా పొందలేరు. అది రెండు విధాలుగా వస్తుంది. మొదట, ఎవరైనా శ్రీమాతను జ్ఞాపకం ఉంచుకోవటానికి అభ్యాసం చేస్తూ, ప్రతి తడవ ఏదైనా చేసేటటువంటి కర్మను ఆమెకు అర్పించగలిగితే (పని చేస్తున్న సమయమంతటిలోనూ కాదు, కాని ఆరంభంలోను, గుర్తు చేసు కోగలిగిన ప్రతిసారి) అప్పుడు అది నెమ్మదిగా సులభంగా ప్రకృ తికి అలవాటుగా మారుతుంది. ఇక రెండవది, ధ్యానం వలన అంతరంగచైతన్యం వృద్ధి అవటం మొదలవుతుంది. కొంతకాలం తర్వాత, ఒక్కసారిగాను హఠాత్తుగాను కాకుండా, ఇంకా ఎక్కు వెక్కువగా దానంతటదే శాశ్వతమవుతుంది. ఆ చైతన్యం నుంచి బాహ్యంలోకి పనిచేసేదానిని మొదట ఎవరైనా భిన్నమైన చైత న్యంగా అనుభూతి పొందుతారు. మొదట ఈ ప్రత్యేకచైతన్యం కర్మలో ఉన్నప్పుడు అనుభూతిచెందరు. కాని కర్మ ముగిసిన తక్షణమే అది ఆ సమయమంతటిలో అక్కడే ఉండి వెనకనుంచి

అవలోకిస్తున్నట్లు వారు అనుభూతి పొందుతారు. దాని తరువాత కర్మ సమయంలో కూడా దాని అనుభూతిపొందటం మొదలవుతుంది. అది ఎటువంటిదంటే ఒకే అస్తిత్వానికి రెండుపార్శ్వాలున్నట్లు – ఒకటి అవలోకిస్తూ, వెనుకనుంచి దన్నుగా ఉంటూ శ్రీమాతను స్మరిస్తూ, అర్పిస్తూ ఉండగా, మరొకటి కర్మనాచరిస్తూ ఉంటుంది. ఇది జరిగినప్పుడు, నిజమైన చైతన్యంతో కర్మనాచరించడం ఎక్కువెక్కువగా సులభమవుతుంది.

ఈ మాదిరిగానే మిగిలినవన్నీను. అంతరంగ చైతన్యం పురోభివృద్ధితోనే నువ్వు చేస్తున్న విషయాలన్నీ సరి అవగలవు.

మూలం: శ్రీ అరవిందులు
అనువాదం: డా॥ టి. ప్రసన్నకష్ణ

అన్ని వస్తువులలో దైవాన్ని చూసెదను గాక

అన్నిటిలో ఉన్నది ఒకే ఆత్మ; అంతటా ఉన్నది ఒక దైవమే. అందరూ ఉన్నారు దైవంలో. అందరూ దైవమే. అంతకు మించి ఏదీలేదీ విశ్వంలో. ఈ ఆలోచన, ఈ నమ్మకము, ఈ స్థిర ఆంతరంగిక జ్ఞాపకమే, సాధకుని సర్వ చైతన్యాసారమయ్యే వరకూ – సాధకుని చైతన్యానికి ఒక సంపూర్ణ నేపథ్యం.

ఈ తరహా జ్ఞాపకము, ఒక స్వయంక్రియాత్మక ధ్యానము, తప్పనిసరిగా అంతరంగంలో – ఒక బృహత్తరమైన, నిరంతరాయమైన దర్శనంగా; ఒక విస్తృతమైన, సర్వాత్మకమైన – ఎల్లప్పుడూ శక్తివంతంగా జ్ఞాపకముంచుకొని స్థిరంగా ధ్యానించే – ఒక చైతన్యంగా మార్పు చెందుతుంది. ఎందుకంటే, ఈ చైతన్యం, అనుక్షణం, బలవంతంగా, సత్తా, దాని ఇచ్ఛ, చర్యలను, వాటి మూలాన్ని – ప్రశ్నింపజేస్తుంది. తక్షణమే, వేరు వేరు రూపాలు, దృశ్యాలతోను, వాని కాధారము, కారణము, అతీతము (అయిన దైవం) తోను, తాదాత్మ్యం కల్గుతుంది.

ఈ మార్గము – విశ్వాత్మ అంతటా చేసే పనులను భౌతికదృష్టితో చూసినంత స్పష్టంగా, సంపూర్ణంగా, సజీవంగా, చూపకుండా, దాని అంత్యమును చేరలేదు. ఈ మార్గము శిఖరాగ్రాల్లో – అతీతము, అతిమానసము సమక్షంలో – ఒక స్థిరజీవనము, ఆలోచన, ఇచ్ఛ, ఆచరణలుగా ఎదుగుతుంది.

మన ఎరుకతో ఏది చూసినా, విన్నా, స్పృశించినా, పనిగట్టినా – అంతే మనం పూజించి సేవించే, ఆ దైవంగానే తెల్సుకోబడాలి, అనుభవింపబడాలి. అంతా ఆ దైవపు ప్రతిబింబంగా మల్చబడాలి. అంతా ఆ కాలాతీత సర్వోపగతునిచే కప్పబడిన దైవశీర్షపు నివాసస్థానంగా గ్రహింపబడాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఎస్.వై. సోమయాజులు

అహంకి విముక్తి

ఎల్లప్పుడూ పనిచేసేది, నిజంగా ఊర్ధ్వదైవశక్తియే. మన వ్యక్తిగత కృషి, భావన, ఆకాంక్షలు, అపసవ్యంగా, దివ్యశక్తులను ఆకట్టుకునే ప్రయత్నంలో అహం యొక్క తాదాత్మ్యతా భావన యొక్క చలనములే.

ఈ ప్రపంచంలో మనము (దేహేంద్రియ మనోబుద్ధులకు పరిమితమైన) అహంభావంతో పనిచేస్తాము. మనలో పనిచేసే విశ్వశక్తులను మనవే అనుకుంటాం. ఆ సర్వాతీతుడు – దేహ, మనోప్రాణికముల ద్వారా ఎంపికచేయబడి, రూపొందించబడి, నిర్వహించబడే చర్యలన్నీ మన ఇచ్ఛ, జ్ఞానము, సద్గుణాల ఫలమే అనుకుంటాం.

దివ్యజ్ఞానానందాల పనిముట్లు అనే విషయం తెలుస్తుంది. ఈ ఉపకరణం 'నేను' తో కాకుండా సర్వాతీతునితో ఎల్లప్పుడు ఐక్యత పొంది, సమైక్య, సర్వోన్నత, జీవాత్మకు చెందుతుంది. అదే మనది అనే గ్రహింపు, అనుభూతి కలుగుతుంది.

ఎప్పుడైతే మానవాహంకారము – తన ఇచ్ఛే ఒక పని ముట్టు; తన జ్ఞానమే అజ్ఞానము, బాల్యచేష్ట; తన శక్తే, పసివాని తడుములాట; తన సద్గుణాలే, నటించే మాలిన్యాలని – తెల్సు కుంటుందో; తన కతీతమైన (దైవంపై) నమ్మకముంచడం నేర్చు కుంటుందో, అదే దానికి విముక్తి

మూలం శ్రీమాత

అనువాదం: ఎస్.వై. సోమయాజులు


ఈ రూపాంతరీకరణం భువి చెల్లించే బాకీ

కేవలుడు, పరిపూర్ణుడు, ఏకస్థుడు
నీరవతలోంచి పిలిచాడు సడిచెయ్యని
ఆత్మశక్తిని బయటకు రమ్మని
ఆమె అక్కడ రూపలావణ్యాలు లేక సద్దుమణిగి పడివుంది.
ఆమె తన మొద్దు నిద్దురతో కాపలా కాస్తోంది కాలమానం నుంచి
అతని ఏకాంతపు అనిర్వచనీయ శక్తిని.

ఆ కేవలుడు. ఆ పరిపూర్ణుడు, ఆ ఏకస్థుడు
ఆకాశంలోకి ప్రవేశించాడు తన నీరవతతో:
ఆ ఏకాత్మ యొక్క లెక్కలేని ఆకారాలను ఆయన మలచినాడు;
తన శక్తియొక్క కోటిరూపాలను ఆయన కూర్చినాడు;
తన విస్తృతి యందెవ్వ డేకాకృతి వెలిగెనో వాడె వసించు నందరి యందు;
తానే ఆకాశం. తాను మాత్రమే కాలమానం.

ఆ కేవలుడు, ఆ పరిపూర్ణుడు, అనాక్రాంతుడు,
ఎవ్వడు అంతరాత్మగా మనలో దాగెనో,
వాడె మన అపరిపక్వాత్మగా మనలో దాగెనో,
వాడే మన అపరిపక్వతా ముసుగును ధరించాడు,

ఈ మాంసపు గూడును తనదిగా చేసుకున్నాడు,
తన ప్రతిరూపాన్ని మానవ పరిమాణంలో పోతపోసినాడు
తన దివ్యప్రమాణం లోనికి మనం ఎదగవచ్చుని;
అప్పుడొక దివ్యరూపంలో
ఆ దివ్యస్రష్ట మనల్ని తిరిగి పోతపోసి బిగిస్తాడు
మర్త్యుడి మూసపై దివ్యత్వ ప్రణాళికా చక్రాన్ని
మన హద్దుల్లో బుద్ధుల్ని అనంతంలోని కెత్తి,
క్షణాన్ని శాశ్వతంతో స్ఫురింపచేస్తూ.
ఈ రూపాంతరీకరణం దివికి భువి చెల్లించే మూల్యం:
పరస్పరం బాకీపడేదొకటి దైవంతో మనిషిని కట్టిపెడుతుంది:
ఆయన ప్రకృతిని మనం వహించాలి మనదాయన ధరించినట్లే;
మనం దైవీపుత్రులం ఆయనలాగే ఉండాలి మరి:
ఆయన మానవాంశను మనం దివ్యత్వం లోనికి పెంచాలి.
మన జీవనమొక విరోధాభాసం దైవమే పరిష్కారంగా



మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: వై.యస్.వి.యస్. మూర్తి

శ్రీఅరవిందులిచ్చిన ప్రార్ధనా మంత్రము

ఓం శ్రీఅరబిందో మిరా
నా బుద్ధిని, నా హృదయాన్ని, నా జీవితాన్ని నీ
వెలుగుకు, నీ ప్రేమకు, నీ శక్తికీ ఉద్దీపన కావించు.
సర్వత్రా దైవాన్ని చూసెదును గాక.

శ్రీమాతతో ఉదార్ పింటో సంభాషణ

(ఒక స్మృతి)

శ్రీ ఉదార్ పింటో ఇలా అంటారు: నేను శ్రీఅరవింద ఆశ్రమంలో 1937 సం. లో చేరాను. అప్పటి నుంచి నా శక్తిమేరకి వారి యోగాన్ని అనుష్ఠిస్తున్నాను. వారి ఉత్కృష్ట గ్రంథాలను అధ్య యనం చేస్తున్నాను. ఇరువది అయిదు సంవత్సరాలు గడిచిపో యినై. నా పరిస్థితిలో ఏమాత్రం పురోగతి కనిపించదు. ఒక రోజు శ్రీమాతతో ఈ విషయం చెప్పాను. నేను యోగం సక్ర మంగా చేస్తున్నానా – అని అడిగాను. నా సక్రమ యోగాను ష్ఠానానికి ఆమె ఆశీస్సులు అపేక్షించాను. నీవు యోగం అపస వ్యంగా చేస్తున్నావని ఆమె అన్నారు. నేను దిగ్భ్రాంతి చెందాను. మరి నెనెలా చేయాలని ఆమె నడిగాను. ఆమె చిరునవ్వుతో, అడిగారు. "నీవు అపసవ్యంగా ఎందుకు యోగం చేయాలనుకుం టావు?" "మరైతే ఎలా?" అని అడిగాను. "నీ కోసం నీ యోగం నేను చేస్తాను" అన్నారు ఆమె. "నీవు చేసేది అంతా ఆపివేయి" నన్ను చేయనీ. ఈ భూమిపై నేను అవతరించినది మీకు సౌఖ్యం కలిగించటానికి. "నేనిక్కడ ఉండగా నీకెందుకు బాధ?" "మరైతే నా పని ఏమిటి?" అని అడిగాను. "నిన్ను నాకు అర్పించుకో, నీవు చేస్తున్నదంతా నాకోసం చెయ్యి". అందుకు వెంటనే అంగీ కరించాను. ఆమెతో కరచాలనం చేశాను. అలా ఆ రోజు ఆమెతో సంసర్గాన్ని పొందినట్లుగా.

శ్రీమాతకు అర్పించుకుంటానని చెప్పినంత సులువు కాదు చేయటం. అందుచేత ఆమె నడిగాను – 'ఎలాగ?' అని. ఆమె చెప్పారు. "నీవు ఉదయం నిద్ర లేవగానే ఏమి చేస్తావు?" "కాల కృత్యాలు తీర్చుకుంటాను. స్నానానికి సిద్ధం అవుతాను" ఇంకా వివరంగా చెప్పమన్నారు. దంతధావనతో ప్రారంభిస్తానన్నాను. "అప్పుడు నీవు పగటి కలల కంటూంటావా? లేక ఆలోచిస్తూ

ఉంటావా?" అని అడిగారు. ఇది సర్వసాధారణమైన విషయం. ఇక్కడ ఆలోచించటానికి, కలలు కనటానికి ఏమి ఉంటుందన్నాను. నేను కాలకృత్యాలు తీర్చుకునేటప్పుడు ఏమి చేయాలో ఆమె అప్పుడు చెప్పారు. "నీవదంతా నిశ్చైతన్యంగా చేస్తున్నావు. అలా కాకుండా, ఆ పనులు చేస్తూ, నన్ను తలుచుకుంటూ ఉండు. నేను చేస్తున్నాను, అనుకో. నేను నీతోనే ఉన్నానని భావించు. నీవు చేసే పని నాతో కూడా చేయించు. నాతో మాట్లాడు. నీవు చేసే ప్రతి పని ఎంత బాగా చేయాలో నాతో ముచ్చటించు. భోజనం చేస్తున్నప్పుడు తినే పదార్థాలు ఎంత రుచిగా ఉన్నాయో మనం తెలుసుకుంటాం. నాతో కలిసి తింటున్నప్పుడు పదార్థాలు ఎంత రుచిగా ఉంటాయో తెలుసుకుని ఆనందిస్తావు. నీవు నిద్రకు ఉపక్రమించినపుడు నా స్పృహలో ఉండటం చాలా ముఖ్యం. నిన్ను నేను నిద్రపుచ్చనీ. అపుడు నీకు సుఖశయనం సిద్ధిస్తుంది. మేల్కొన్నాక, రోజు సచైతన్యంగా సాగుతుంది.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఆంతరంగంలో వసించడం, అంతరంగ దివ్యమాతతో సదా కలసి వుంటూ అచటి నుండి పనిచేయడం నేర్చుకోవాలి. ఎల్లప్పుడూ సంపూర్ణంగా, అలా చేయడం మొదట్లో కష్టం గావచ్చు. కాని దానినే అంటిపెట్టుకొని వుంటే, చేయగలుగుతారు. ఆ కష్టాన్ని వెలగా చెల్లించి, దాన్ని చేయడం నేర్చుకొంటే యోగం సిద్ధిస్తుంది.

సమచారపత్రం

నవంబరు 17, 1973 సాయంత్రం 7 గం. 25 ని. లకి శ్రీమాత దేహం చాలించారు. అప్పటికామె వయసు 95 సం.లు. నవంబరు 20 న, ఆశ్రమప్రాంగణంలో ఆమె పార్థివ దేహాన్ని సమాధి చేశారు. ఆశ్రమంలోను, కేంద్రాలలోను, బ్రాంచీలలోను ఈ రెండు పవిత్ర దినములను, ప్రతి సంవత్సరము పాటిస్తారు. ప్రత్యేక ధ్యాన సమావేశాలు ఏర్పాటు చేస్తారు.

నవంబరు 24, 1926 న శ్రీఅరవిందుల వారిలో అధిమానసం అవంతరించింది. శ్రీమాత ఈ దినముల సిద్ధిదినముగా అభివర్ణించారు. నాల్గు దర్శన దినములలో ఇదొకటి. ఆశ్రమంలోను, కేంద్రాలలోను, బ్రాంచీలలోను ఈ రోజున ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయుబడుతవి. కృష్ణచైతన్యము భౌతికములోనికి దిగివచ్చిన రోజుగా శ్రీఅరవిందులు ప్రకటించారు. కృష్ణ అవరోహణము అధిమానస అవతరణమని, అధిమానస అవతరణము అతిమానసము కాదని శ్రీఅరవిందులు తెలియచేశారు. శ్రీఅరవిందులు ఏకాంతముగా గాఢతపస్సమాధిలోనికి వెళ్లిపోయారు.

సమర్పణమంతా తన్ను కించపరస్తూ, తన స్థాయిని తగ్గిస్తున్నదని అహంకారం భావిస్తుంది. కాని దైవానికి చేసికొన్న ఆత్మసమర్పణం మానవుని వృద్ధిపరుస్తూ, గొప్పవాణ్ణి చేస్తుంది.



కర్మయోగం

అఖిల

అఖిల భారత పత్రిక

డిశంబరు 2007

కర్మయోగం

విషయసూచిక

శ్రీఅరవిందులను అధ్యయనం చేసే విధానం

ఎప్పుడూ కొన్త కొన్త ఒక్కొక్క పర్యాయమే చదవమని సలహా. చదివేటపుడు మనసు వీలైనంత ప్రశాంతంగా ఉండాలి. అవగాహన కోసం తాపత్రయ పడవద్దు. కాని మనసును మాత్రం నిశ్శబ్దంగా ఉంచాలి. చదివే అంశంలోని శక్తి నీ లోనికి ప్రవేశించనీయాలి. నిశ్చలంగా నిశ్శబ్దంలో స్వీకరించే ఈ శక్తి కాంతిని ప్రసారం చేసే దాని పని అది చేస్తుంది. అవగాహనకు, మస్తిష్కంలో కావల్సిన జీవకణాలను ఉత్పత్తి చేస్తుంది. ఆ విధంగా అపుడు చదివిన దానిని తిరిగి మళ్లీ కొన్ని నెలల తర్వాత చదివినపుడు నీవు వ్యక్తీకరించిన ఆలోచన నీకు మరింత స్పష్టంగాను, పొందికగాను ఉండి ఒక్కొక్కప్పుడు పూర్తిగా చాలా వరకు సుపరిచితమైనదిగాను నీకు బోధపడుతుంది.

క్రమం తప్పకుండా ప్రతి నిత్యము కొద్ది కొద్దిగా అధ్యయనం చేయటం అభిలషనీయం; అదైనా అవకాశం ఉంటే ఒక నిర్ణీత సమయంలో. ఇది గ్రహణశక్తికి తోడ్పడుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

జీవితము – జీవన విధానము – ప్రాముఖ్యత

జీవనవిధానము కేవలం ఒక ప్రకృతి యంత్రాంగమే కాదు. క్షణిక లేక దీర్ఘకాలిక నియమానుశాశన చక్రభ్రమణంలో చిక్కుపడి ఉన్న జీవాత్మ కాదు. అంతరాత్మయొక్క స్థిరమైన ఒక అభివ్యక్తీకరణ.

విశ్వము భౌతికమైనది మాత్రమేగాక ఆధ్యాత్మిక సత్యము కూడా. జీవితము శక్తుల చలితచాలనహేల. మానసిక అనుభవము. అంత మాత్రమే కాదు. గుప్తంగా ఉన్న జీవాత్మకు పరిణామక్షేత్రము కూడా. ఈ సత్యాన్ని కనిపెట్టి, చేబట్టి, స్వాయత్తం

చేసుకొని, జీవనవిధానానికి ప్రేరణశక్తిగా కార్యసాధనమునకు తోడ్పడే సమర్థవంతమైన సాధనగా కనిపెట్టినపుడే మానవజీవితానికి సాఫల్యత. అపుడే జీవితానికి అతీతమైన రూపాంతరీకరణ.

*

జీవాత్మ పదార్థగతంగా అంతర్లయమై (involved) ఉన్నది. తనకు నచ్చని పదార్థంలో నుండే అభివ్యక్తమవాలని శ్రమిస్తోంది. ఆ అభివ్యక్తీకరణకు ఇక్కడ జీవితమంతా ఒక కార్యరంగమై ఉంది. పరిస్థితి కూడా ఉంది. ఇదే భౌతిక జీవనవిధాన రహశ్యమంతా.

ఈ విశ్వానికి సంబంధించి ఒక mystery గోప్యం ఉంది. అదే ఈ సువిశాల నిశ్శబ్ద అవివేక పదార్థ ప్రపంచంలో అగుపించి పెంపొందే చైతన్యం. ఆరంభంలో ఇది నిశ్చైతన్యంగా కనిపించి తప్పించుకున్న దివ్యచేతన. అదెప్పుడూ అక్కడ నిద్రాణంగా ముసుగులో దాగి ఉన్నదే. నిజానికి పదార్థములోని నిశ్చైతన్యము మరుగునపడి ఉన్న చైతన్యమే. దాని తాపత్రయమంతా – తనను తాను తెలుసుకోవటం – తన స్వీయ అంతర్గత పరిపూర్ణ సమగ్రతలను, శక్త్యానందకాంతులను, స్వేచ్ఛ, ఆధిపత్యం, సామరస్యాలను – తిరిగి పుంజుకోవటం. ఇది కాలవ్యవధిలో జరిగే అలౌకిక చర్య. అయినా కూడా ఇది స్వాభావికమైనది, సర్వవిదితమైనది. ఇంద్రియగ్రాహ్యమైనది. మనం దాని పరిశీలకులము. అందులో భాగస్వాములము. ఉపకరణములము. వాహికలము. ఇన్నీ ఏక కాలంలోనే అయి ఉంటాము.

*

సాధారణంగా మానవుడు జీవించే జీవనము – సగం ఘనీభూతరాశిగాను, సగం ద్రవీభూతరాశిగాను కూర్పబడినది. అపరిపూర్ణంగా నియంత్రితమయే ఆలోచనలు, గ్రహణశక్తులు, సంవేదనలు, ఆవేశములు, కోర్కెలు, ఆనందాలు, కార్యములు – ఇవన్నీ చాలా వరకు అలవాటు ప్రకారంగా సాగేవి. తమంత తామే పునరావృతమయేవి. కొంత గమనసీలంగాను, కొంత స్వయం వికాసం పొందే విగానూ ఉంటాయి. కాని మొత్తం మీద ఇనన్నీ పనికి మాలిన అహం కేంద్రంగా చుట్టి ఉంటాయి. ఈ క్రియాకలాపాల

సముదాయపు చలితచాలనాలు సమగ్ర అభివృద్ధి దిశగా కదులుతూ ఉంటాయి. కొంతవరకు ఈ జీవితకాలంలోనే దృశ్యమానమై కార్యరూపం దాలుస్తాయి. మరి కొంత, ఇక ముందు రాబోయే జీవనప్రగతికి బీజప్రాయంగా మిగిలి ఉంటాయి. ఈ చైతన్య సత్వముయొక్క పెరుగుదల, విస్తృతి, పెంపొసగే ఆత్మవ్యక్తీకరణ, శరీరభాగాల సమన్వయ సామరస్యపూర్వక క్రమాభివృద్ధి – ఇదే మొత్తం జీవితవిధాన సార్ధకత, సారము కూడా. ఈ సార్ధకమైన చైతన్యాభివృద్ధి కొరకు – ఆలోచన, ఇచ్ఛ, ఆవేశము, కోరిక, చర్య మరియు అనుభవము – పరమోన్నత దివ్య ఆత్మసాక్షాత్కార లక్ష్యంగా, చివరిదాకా నడిపించటానికి మనోమయపురుషుడుగా మనిషి భౌతిక దేహధారి అయ్యాడు.

*

ఆధ్యాత్మిక పరిణామం, పదార్ధగత చైతన్యపరిణామము, సంతత ఆత్మాభివృద్ధితో అంతరంగ జీవాత్మ రూపుదాల్చి ఆవిష్కృతమయ్యేదాకా – ఈ ఇహలోక సంబంధమైన మానవజీవిత సంవిధానానికి – ఇదే కీలక ప్రధాన, అర్ధవంతమైన ప్రేరణ.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

కర్మప్రాధాన్యత

పరిచయవాక్యాలు

నీవు ఏ పనీ చేయకపోతే, నీకు ఏ అనుభవమూ రాదు. జీవితమంతా ఒక అనుభవక్షేత్రం. నీ ప్రతి కదలికా, నీ ప్రతి ఆలోచనా, నీవు చేసే ప్రతి పనీ ఒక అనుభమవుతుంది. అయి తీరాలి. అందులో, ముఖ్యంగా పని అనేది సహజంగానే ఒక అనుభవక్షేత్రం. ఆంతరంలో అభివృద్ధి కోసమని సాగించే కృషికి సంబంధించి గడించిన అనుభవాన్నంతా ఉపయోగించేది కర్మక్షేత్రం.

పని చేయకుండా ధ్యానంలోనో, జపంలోనో ఉండిపోతే నీవు పురోగమించావో లేదో నీకు తెలియదు. పురోగమిస్తున్నాననే భ్రాంతిలో నీవు జీవిస్తుండడం జరుగుతుంది. అలాగాక నీవు పనిచేయ మొదలుపెడ్తే, నీ పనికి సంబంధించిన, పరిస్థితులన్నీ, అంటే ఇతరులతో సంబంధాలు, భౌతికంగా ఏదో ఒక వ్యాపకంలో మునిగిపోవడం, ఇదంతా కూడ అనుభవం కలిగించే క్షేత్రం అవుతుంది. నీలో, జరిగిన పురోగతినేగాక, ఇంకా నీవు సాధించవలసిన పురోగతిని గురించి నీకు తెలియచెయ్యబడుతుంది.

ఏ పనీ చేయకుండా నీలో నీవుండిపోతే నీవు పూర్తిగా వ్యక్తిగత భ్రాంతిలో జీవిస్తూ ఉండిపోతావు. అలాగాక, నీవు బాహ్యంలో పనిచేయడం మొదలుపెట్టిన క్షణం నుండీ అంటే ఇతరులతో, బాహ్యాపరిస్థితులతో, జీవన విషయాల్తో సంబంధం పెట్టుకోవడం మొదలుపెట్టిన క్షణంనుండీ, నీవేమైనా పురోగతి సాధించావా లేదా, ప్రశాంతంగా ఉంటున్నావా లేదా, అవగాహన బాగా పెరిగిందా లేదా, ఇదివరకటికంటె విశ్వాసం దృఢమైందా లేదా, నిస్వార్థత పెరిగిందా లేదా, కోరికలేమీ తలెత్తకుండా, యిష్టాలు, బలహీనతలు, అవిశ్వాసం తలెత్తకుండా ఉంటున్నాయా లేదా అనేవి సంపూర్ణ ఎరుక కలుగుతుంది. కర్మ చేయడంవల్ల, ఇదంతా నీకు తెలుస్తుంది, అపుడే నీవు తెలుసుకోగలుగుతావు.

*

స్వర్ణకారుని దాగలిపై సుత్తిదెబ్బలకి లోహం పదును తేలటానికి గురియైనట్లు నిత్యకృత్యాలు ముందుకు, వెనక్కి సాగాలి. అప్పుడే అవి పరిశుద్ధము, సంస్కారవంతము, సౌమ్యములై దివ్యప్రకాశాన్ని స్వీకరించటానికి పరిపక్వమవుతవి. సమగ్ర పురోగతి కోసం బాహ్యకర్మ అవసరం లేదు అన్పించేంతవరకు, ఒకదాని తర్వాత మరొకటిగా ఈ అంశాలన్నింటినీ కర్మక్షేత్రంలో అగ్నిపరీక్షకు గురిచేయాలి. ఈ అంశాలను అగ్నిపరీక్షకు గురిచేసి, నూతనరూపంలో పోతపోయడం, దివ్యప్రకాశం స్వీకరించేట్లు చేయడం అనేది ద్వివిధ కార్యానికి ఇతర చేతన కేంద్రాలను మేలుకొలుప, నిన్ను నీలోని భగవంతుని అభివ్యక్తం చేసేందుకు సాధనంగా

ఈ కార్యకలాపాన్ని మలచడం జరుగుతుంది. కాబట్టి, గర్వించడం, చేయవలసిందేమీ లేదని సంతృప్తిపడటం అనేవి అడ్డంకులన్నింటికన్న దారుణమైన అడ్డంకి. అసంఖ్యాకంగా ఉన్న అంశాల్లో కొన్నింటినైనా చిలికి, పరిశుద్ధంగా చేయడానికి, సౌమ్యంగా చేయడానికి, వ్యక్తిగతం కాకుండా వాటిని తయారుచేయడానికి, తనను తాను మరచిపోయేట్లు చేయడానికి, ఆత్మత్యాగం, భక్తి, దయ, మృధుస్వభావం గురించి వాటికి తెలియజేయడానికి మనకు లభించే ప్రతి చిన్న అవకాశాన్ని అణకువతో మనం మన ప్రయోజనం కోసం వినియోగించుకోవాలి.... గమ్యాన్ని సాధించాలంటే, అన్ని రకాలైన, అన్ని క్షణాల అసంఖ్యాక అనుభవాల అవసరాన్ని ఎవరూ తప్పించుకోలేరు.

*

ఉదాహరణకు, మనం వెనక్కు వెళ్ళి, ఋషుల బోధనలను గమనిస్తే, అక్కడ ప్రపంచం నుండి పలాయనం అనే భావన ఎక్కడా కన్పించదు. సంసిద్ధి అంటే వాళ్ళకు, భూమి మీదే, ఇహంలోనే (ఇహైవ) అనే భావం వుండేది. ఐహిక సిద్ధి పొందే బంగారు యుగాన్ని వాళ్ళు ఆనాడే దర్శించారు. కాని దేశానికి సంబంధించిన, ఆధ్యాత్మిక జీవితంలో, జవసత్త్వాలు ఓ రకంగా క్షీణించడం మొదలుపెట్టాక, బహుశా వేరెక్కడ నుండో ఈ పలాయనవాదం వచ్చి పడి ఉంటుంది. అదే దేశంయొక్క జవసత్త్వాలను, దానికి తెలియకుండానే క్షీణింపజేసింది.

*

తనను తాను తెలుసుకోవడం కోసం, తనను తాను సార్థకం చేసుకోవడం కోసం ఆత్మసంసిద్ధి కోసం కర్మగాని, దానివల్ల బాహ్యంగా పైకి కన్పించే, వర్తమానంలోగాని, భవిష్యత్తులోగాని లభించే సత్ఫలితాల కోసం కాదు.

మూలం శ్రీఅరవిందులు
అనువాదం: కె.వి. రావు

సక్రమ అంతరంగస్థితి అంటే

ప్రశ్న: ఏది సక్రమ అంతరంగస్థితి?

అది సందర్భాన్ని బట్టి వుంటుంది నాన్నా! తనను తాను పరిపూర్ణస్థితికి ఉద్ధరించుకోవాలనే సంకల్పం లేక ప్రశాంతంగా ఉండాలనుకునే సంకల్పం లేక... అది సందర్భం మీద ఆధార పడి ఉంటుంది. అదంతా ఆయా పరిస్థితులను బట్టి ఉంటుంది. ప్రతి సందర్భానికి ఒక సరైన భావన ఉంటుంది. నీకు ఉండవల సిన అంతరంగ మనోదృక్పథం సందర్భోచితంగా ఉంటుంది.

ఉదాహరణకు, భౌతికంగా నీవు సమతుల్యత కోల్పోతు న్నట్లు అనుకోగానే, అంతరంగికంగా ప్రశాంతంగా ఉండేందుకు దృష్టి కేంద్రీకరిస్తావు. దైవానుగ్రహం మీద పూర్తిగా ఆధారపడ తావు. మంచి ఆరోగ్యం కోరి, భౌతికంగా సమతుల్యతను నెలకొ ల్పేందుకు ప్రయత్నిస్తావు. ఇదంతా సరైన అంతరంగస్థితి క్రిందకే వస్తుంది. మరొక సందర్భంలో బాహ్యాపరిస్థితుల నుండి విడివడి వాటిని పట్టించుకొనకపోవడం ఊర్ధ్వముఖం నుండి వస్తున్న దివ్యసంకల్పానికి విధేయుడై దానినే అభివ్యక్తం చేయడం – ఇదే సరైన అంతరంగస్థితి అంటే. ప్రతి సందర్భంలోనూ అది అలాగే ఆయా పరిస్థితులకు అనుగుణంగా ఉంటుంది. అన్ని సందర్భా లలోనూ దైవాన్ని స్మరిస్తూ తనను తాను, ఆ సేవలోనే సమర్పిం చుకుంటూ, ఆ సంకల్పాన్నే తన సంకల్పంగా చేసుకోవాలనేది సహజంగా జరిగిపోతూ ఉంటే, అదే సరైన అంతరంగస్థితి అంటే.

ఒక సందర్భంలో నీవు ప్రశాంతతను వాంఛిస్తావు. మరొక సందర్భంలో నీవు శక్తిని కోరుకుంటావు. ఇంకొక సందర్భంలో మంచి ఆరోగ్యం, అలాగే మరోసారి బయటి వత్తిడులకు లోను గాకుండా ప్రశాంతంగా ఉండాలనుకుంటావు.

ఒక్కొక్కసారి రెండు, మూడు లేదా నాలుగు అవకాశాలు నీ ముందుకు వస్తాయి. ఏదో ఒకటి తేల్చుకోవాలసిన అవసరం వస్తుంది. నీవు సహజంగానే కలవరపాటుకు లోనౌతావు. ఏమి చేయాలో తేల్చుకోలేక సతమతమవుతావు. అలాంటి సందర్భాలలో

నీకు సాధ్యమైనంతవరకు నీలోని ఆ దివ్యసన్నిధికీ – ఆ చైత్యా పురుషుడి (సైకిక్ బీయింగ్) ముందు, ఆ సమస్యను నివేదించి, సరైన వెలుగుకోసం, సరైన నిర్ణయంకోసం అర్థించాలి, వేచి ఉండాలి. ఆ సంకల్పం, ఆ ప్రేరణ కోసం వేచి చూడాలి. (నీకు తప్పక పైనుండి పరిష్కారం అందుతుంది) దైవం నుంచి వచ్చే దివ్య ఆదేశాన్ని అభిలషించి, ఆలోకించాలి. ఏ సందర్భంలోనైనా ఇదే సక్రమమైన దృక్పథం.

*

జీవితంలోని నడక, పనులు, విషయాలు, పరిస్థితులు అన్నీ తాను వాటిని ఎదుర్కొనే దృక్పథం మీద వాటి ప్రభావం ఆధారపడి వుంటుందన్న విషయం అనుభవంలో గ్రహించే స్థితి ఒకనాటికి తప్పక వస్తుంది. ఏదీ కూడా మంచిది లేదా చెడ్డది కాదనే వాస్తవం గ్రహించే సమయం ఒకటి వస్తుంది. అది మనం దానిని చూసే చూపును బట్టి వుంటుంది. మన మీద వాటి ప్రభావం అనేది మనం వాటి పట్ల వ్యవహరించే దృక్పథం మీదనే ఆధారపడి ఉంటుంది. ఒకే రకమైన పరిస్థితులు, దానిని మనం దైవం యొక్క అనుగ్రహంగా, ప్రసాదంగా పూర్తి సంయమనంతో, సామరస్యంతో తీసుకొన్నపుడు మరింత సచేతనులం, మరింత శక్తివంతులమై మరింత వాస్తవికతతో వ్యవహరించేందుకు వీలు కల్పిస్తుంది. అలాకాక ఆ పరిస్థితులను మన ప్రారబ్ధమనీ, మన ఖర్మ ఫలితంగా మనల్ని ఏ అగాధంలోకో నెట్టేందుకు వచ్చాయనీ, దానినుండి తప్పించుకొనజాలమనీ అనుకొన్నప్పుడు అవి మరింత భారమూ, బాధాకరమూ అయి మన చేతననుండి, సామరస్యత నుండి, శక్తి నుండి మనల్ని దిగజార్చి నిజంగానే అగాధంలోనికి నెట్టివేస్తాయి. కానీ పరిస్థితులు మాత్రం అవే, సరిగ్గా ఒకేలా ఉండి మార్పులేకున్నవే. ఇలాంటి పరిస్థితులు మీకు తటస్థించినపుడు వాటిని అధిగమించి మిమ్మల్ని మీరు జయించే వారు కావాలని నేను వాంఛిస్తున్నాను. అంతేకాదు, మీ జీవన

పరిస్థితులను మీకు మీరే శాశించేవారు కావాలి. ఇదంతా మీ భావన మీద, మీ దృక్పథం మీద ఆధారపడి ఉంటుంది.

మూలం; శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

సక్రమ దృక్పథానికి ఉండే శక్తి

ఎప్పుడూ ఉత్తమోత్తమమైనదే జరుగుతుందా! జరుగవల్సినదే అంతా జరుగుతుందనేది స్పష్టం. మరొకలా జరుగదు. వైశ్వానిక నియతివాదం (universal determinism) ప్రకారమే జరుగుతుంది. ఈ మాట మనం జరుగవల్సినది జరిగిన తర్వాత అంటాము. అంతకు ముందు అనం. సమస్య ఎంత పెద్దదైనా అది వ్యక్తిగతం గానే ఉంటుంది. వ్యక్తి అంటే మనిషి కావచ్చు; లేదా దేశం కావచ్చు. వ్యక్తి దృక్పథంపై అంతా ఆధారపడి ఉంటుంది. రాబోయే పరిస్థితులను ఎదుర్కొనబోయే ముందు, వీలైనంత ఉన్నత దృక్ప థాన్ని నీవు అవలంబించి ఉన్నట్లైతే –అంటే – నీ చైతన్యాన్ని నీకు అందుబాటులో ఉన్న ఉన్నత చైతన్య సంసర్గంతో ఉంచగ లుగుతే, ఆ సందర్భంలో ఉత్తమోత్తమమైనదే నీకు జరుగుతుంది. ఇందులో సందేహం ఎంత మాత్రము లేదు. కాని వెంటనే నీవు ఈ చైతన్యం నుంచి నిమ్నచేతనకు దిగజారినావంటే, అప్పుడు స్పష్టంగా సర్వోత్తమమైనది జరుగదు. కారణం? సింపుల్. నీవు నీ ఉత్తమ చైతన్యంలో లేకపోవడం. నేనింకో విషయం కూడా నొక్కి చెప్తాను. ఒకరికొకరు పరస్పరం ప్రభావితులయ్యే పరిధిలో ఉన్నపుడు సక్రమ దృక్పథం సానుకూలంగా ప్రతీ పరిస్థితినీ మార్చటమే కాక, పూర్తిగా పరిస్థితి నంతటినీ తారుమారు చేయ గలదు. ఉదాహరణకు – నిన్ను ఒక వ్యక్తి చంపాలని వచ్చిన పుడు నీవు నీ సాధారణ చైతన్యస్థితిలో ఉండి, బాగా భయభ్రాం తుడవై ఉంటే ఆతను తాను వచ్చిన పని కానిచ్చుకుంటాడు. నీవు కాస్తంత భయపడినా, మరి కాస్త ఉన్నతంగా యెదిగి దైవ

సహాయాన్ని అభిలషిస్తే, నిన్ను చంపాలని వచ్చినవాడు నిన్ను కొంచెం గాయపర్చి వైదొలగుతాడు. ఇంకా కూడా, నీవు సక్రమ దృక్పథంలో కనుక ఉండగలిగి, అంతటా దివ్యచైతన్య సన్నిధిని సంభావిస్తూనే ఉంటే ఆతడు నిన్నసలు ఏమీ కూడా చేయలేడు.

రూపాంతరీకరణ సమస్యకంతటికీ కీలకము ఈ సత్యమే. సతతము దివ్యసంసర్గ చేతనలో దైవసన్నిధిని సాక్షాత్కరించుకో గలిగితే ఎప్పుడూ సర్వోత్తమమైనదే సంభవిస్తుంది. అంటే ప్రపంచం ఒక్కసారిగా మారిపోతుందని కాదు. కాని వీలైనంత వేగంగా పురోగమించగలదు.

మీరు చేయగలిగిదంతా మీరు చేయాలి. అపుడు పరస్పర సక్రమ సహకారమనేది ఉంటుంది. ఫలితం ఎంతగానో వేగవంతమవుతుంది. సక్రమమైన దృక్పథం యొక్క శక్తి గురించి లెక్కలేనన్ని దృష్టాంతాలు చెప్పగలను. ఒకే ఒక్క వ్యక్తి సరియైన దృక్పథం కలగి ఉన్నందువల్ల జనసమూహాలు విధ్వంసం నుంచి కాపాడబడటం నేను చూశాను. ఈ దృక్పథం ఎక్కడో పైన ఉన్న తస్థాయిలో ఉండకూడదు. అలా ఉండి, అంతా భగవంతుడే చూసుకుంటాడనుకుంటే చావవలసినవాడవు చచ్చిపోతావు. కారణం నీ శరీరం ఆసురికశక్తుల వశమై ఉంటుంది. భయంతో వణికిపోతూంటుంది. శరీరాన్ని చైతన్యవంతంగా ఉంచాలి. భయపడకూడదు. పూర్తిగా దివ్యప్రశాంతతతో ఉండాలి. అపుడే ఏ ప్రమాదమూ ఉండదు. మనుష్యుల నుంచేకాక, జంతువుల నుంచి వచ్చే ప్రమాదాలు కూడా దాటిపోతాయి. పంచభూతములు కూడా ప్రభావితమవుతవి. మీకో చిన్న ఉదాహరణ చెప్తాను. మీకు ఆ పెను తుఫాను రాత్రి గుర్తుండే ఉంటుంది. జోరు గాలివాన హోరు అంతటా. శ్రీఅరవిందుల గదికి వెళ్లి కిటికీ తలుపులు మూసివేసేందుకు సహకరించాలని అనుకున్నాను. వారి గది తలుపులు ఒకసారి అలా తెరిచాను. చూద్దును కదా... ఆయన ప్రశాంతంగా కూర్చుని వ్రాసుకుంటున్నారు. సుస్థిర ప్రశాంతత రాజ్యమేలుతోందక్కడ. బయట భయంకరమైన తుఫాను విజృంభించి ఉన్నదని

కలలో కూడా అనుకోలేని పరిస్థితి. కిటికీ తలుపులన్నీ బార్లా తెరిచే ఉన్నాయి. లోపల ఒక్క వర్షపు నీటిచుక్క కూడా లేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

వ్యాపారం ఒక కళంకిత వ్యవహారమా?

చేసిన కర్మ మతపరంగా సరైనదా కాదా అనేది కాదు, ఏ ఆంతరిక దృక్పథంతో ఆ కర్మ చేయబడిందో అది ప్రధానం. ఆ దృక్పథం చైత్యపరమైనది గాక, ప్రాణికసంబంధమైనదైతే, అపుడతడు ఆ పనిలో కూరుకుపోయి, ఆంతరిక సంబంధాన్ని కోల్పోతడు, చైత్యపరమైనదైతే ఆంతరిక సంబంధం నిలిచి ఉంటుంది, దివ్యక్రియాశక్తి తన కాధారంగా ఉన్నట్లు లేదా ఆ కార్యం చేస్తున్నట్లు అనుభూతి కలుగుతుంది, సాధన పురోగమిస్తుంది.

*

రాజకీయాలుగాని లేదా బీదలకు అన్నదానం చేయడంగాని లేదా అందమైన కవితలల్లడంగాని, సరాసరి వైకుంఠానికో లేక నిరపేక్షంలోనికో తీసుకుపోతుందని నేనెపుడూ అనుకోలేదు.... కర్మయోగసార మేమిటంటే, ఎటువంటి కర్మ అనేది కాక లేక కేవల కర్మనిర్వహణగాక, దాని వెనుక ఎటువంటి చేతన, భగవంతుని వైపు ఎంత తీవ్ర సంకల్పం ఉన్నదనేది ప్రధానం. కర్మాధికారియైన భగవంతునితో, ఏకత్వాన్ని సాధించడం కోసం అజ్ఞాన సంకల్పం, శక్తులను పరిశుద్ధ దివ్యసంకల్పం, దివ్యవెలుగుకు సంబంధించిన శక్తులుగా, ఉద్ధరించడాని కవసరమైన సాధన సామగ్రి మాత్రమే కర్మ అంటే.

*

అదేదో పాపకార్యమనీ, లేక కళంకం కలిగించేదనీ, నేను వ్యాపారాన్ని పరిగణించడం లేదని చెప్పదలచుకొన్నాను. ప్రాచీన ఆధ్యాత్మిక భారతదేశంలో కూడా దాన్నలా పరిగణించలేదు.... 'యక్స్'

యొక్క ఆధ్యాత్మిక వెలుగుకై అన్వేషణనూ, మిల్లుకు సంబంధిం చిన ఆతని కార్యకలాపాన్నీ ఎలా సమన్వయం చేయగలం? మిల్లును దాని మానానికి, దాన్ని వదలివేసి, ఆశ్రమానికి పోయి ధ్యానం చేసుకోమని చెప్పాలి కదూ అతనికి నేను? రాజకీ యాల్లో పనిచేయమని నాకు ఆదేశం వచ్చినట్లుగానే, వ్యాపారం చేయమని ఆదేశం వచ్చి ఉండినట్లయితే, నేనైనా ఏమాత్రం, ఆధ్యా త్మిక లేక నైతికక్లేశం లేకుండా ఆ పని చేసి ఉండేవాడిని. ఏ భావంతో ఒక పనిని నిర్వహిస్తున్నాం, ఏ సూత్రాల మీద ఆ భావాన్ని ఏర్పరుచుకున్నాం, ఏ ప్రయోజనాన్నాశించి చేస్తున్నాం అనేదాని మీద అంతా ఆధారపడి ఉంటుంది.

నేనూ రాజకీయాల్లో పనిచేసాను, అందునా చాలా తీవ్రవా దరాజకీయాల్లో పనిచేశాను, 'ఘోరకర్మ' అనిపించే కర్మ చేశాను. రాజకీయాలు ఎపుడూ, లేదా తరచుగా చాలా మంచి వ్యావృత్తి గాకపోయినా, యుద్ధమనేది ఒక ఆధ్యాత్మిక సరళి లోనిది గాక పోయినా, యుద్ధాన్ని బలపర్చాను, అందుకు మనుష్యుల్ని కూడా పంపించాను. అంతేకాక అత్యంత భయానకమైన యుద్ధం చేయ మని కృష్ణుడు అర్జునుడికి పిలుపు నిచ్చాడు. తననే ఉదాహర ణగా చూపుకొంటూ, మానవసంబంధమైన అన్ని కర్మలను, 'సర్వకర్మాణి' చేయమని ప్రోత్సహించాడు. కృష్ణుడు అనాధ్యా త్మికవ్యక్తి అనీ ఆయన అర్జుననకిచ్చిన సలహా పొరపాటు అనీ లేక సైద్ధాంతికంగా తప్పు అనీ అనగలవా? మనిషి ప్రాథమిక స్వభావం, మానసికప్రవృత్తి సామర్థ్యశక్తి, అతనికి ఏ పనిచేయ మని ఆదేశిస్తాయో దాని నతడు సరైన పద్ధతిలో సరైన మాన సికస్థితిలో, పనిచేసినట్లైతే, ఆతనికి, దానికి సంబంధించిన ధర్మా న్ననుసరించి, అది దైవం వైపు అతన్ని నడుపుతుంది అని కూడా కృష్ణుడు ప్రకటించాడు. బ్రాహ్మణ, క్షత్రియ కర్మను, ధర్మాన్ని ఎంతగా సమ్మతించి విలువ నిచ్చాడో అంతగా వైశ్యకర్మధర్మా లను గూడా సమ్మతించి విలువ నిచ్చాడు. ఆతని దృష్టిలో ఒక వ్యక్తి వ్యాపారం చేసి, ధనం సంపాదిస్తూ, లాభాలు గడిస్తూ కూడా ఆధ్యాత్మికవ్యక్తి గావచ్చు, యోగం ఆచరించవచ్చు, ఆంత

రిక జీవనం జీవించవచ్చు ఆధ్యాత్మిక విమోచనానికి కర్మలు సాధనాలని గీత సదా సమర్థిస్తూనే వస్తున్నది. అంతేగాక, కర్మ యోగాన్ని, భక్తి, జ్ఞానయోగాల సరసన జేరుస్తుంది. ఏమైనప్పటికీ, కృష్ణుడు మరో ఉన్నతతర ధర్మాన్ని కూడా కర్మసిద్ధాంతంపై మోపుతున్నాడు. అదేమిటంటే, ఫలితాన్నాశించకుండా, ఫలితంమీద రాగం లేకుండా, కోర్కె లేకుండా, ఏ విధమైన అహంకారిక ధోరణి లేదా ఉద్దేశ్యం లేకుండా, దైవానికి నివేదనగా లేదా, యజ్ఞంగా కర్మలను చేయడం. ఈ విషయాల మీద సాంప్రదాయక భారతీయుల ధోరణి ఇది. ధర్మాననుసరించి చేసేట్లయితే సర్వకర్మలను చేయవచ్చు. అంతేగాక, కర్మను సరైన విధంగా చేస్తే, దైవం వైపు నిన్ను వెళ్ళనీయకుండా లేదా ఆధ్యాత్మిక జ్ఞానం, ఆధ్యాత్మికజీవితం నీకు అందనీయకుండా చేయదది.

నిజమే, బైరాగి భావన కూడా ప్రాచీన భారతంలో ఉంది. అది చాలామందికి అవసరం. ఆధ్యాత్మిక విధానాల్లో దాని స్థానం దానికున్నది. ఏ మనిషైనా సరే ఆత్మసంయమనంగల జీవితాన్ని జీవించలేకపోతే లేదా కఠిన సన్యాసజీవితాన్ని జీవించలేకపోతే అతడు ఆధ్యాత్మికంగా సంపూర్ణుడు కాదని నేను సైతం చెప్తాను. ఆహారం మీద మితిమీరిన కోరిక లేదా ఏ ఇతర మితిమీరిన కోరికలైనా ఎలా వర్జనీయమో అలా ఐశ్వర్యం మీద, ధనం సంపాదించడం మీద అతని స్వభావంలో పేరాశ ఉండకూడదనేది స్పష్టమే. ఇటువంటి విషయాలపై ఆతని చేతనలోని సమస్త రాగాన్ని అతడు పరిత్యజించివేయాలి. కాని సన్యాసజీవితవిధానం ఆధ్యాత్మిక పరిపూర్ణతకు అనివార్యమని లేదా అదే ఆధ్యాత్మిక జీవితమనిగాని నేను పరిగణించలేదు. దైవం మన నుండి వాంఛించే, ఏ విధమైన కర్మనుగాని లేక సర్వవిధ కర్మల మధ్య, కార్యకలాపం సాగిస్తూ కూడా అహంకారం, కోరిక లేకుండా ఆధ్యాత్మిక ఆత్మనియంత్రణ విధానం, ఆత్మనివేదన, దైవసమర్పణ విధానం ఉన్నది. అలా లేకపోయి ఉన్నట్లైతే, గొప్ప ఆధ్యాత్మికవ్యక్తులైన జనకుడు, లేక విదురుడు, భారతదేశంలో ఉండి ఉండేవారు కాదు. అంతేకాదు, కృష్ణుడుగాని, లేదా బృందా

వన, మధుర, ద్వారకల ప్రభువైన కృష్ణుడు, లేదా ఒక యువ రాజు, యోధుడైన లేదా కురుక్షేత్రంలో రథసారథిగా సైతం ఉండి ఉండేవాడు గాదు, కేవలం ఒక గొప్ప సన్యాసి మాత్రమే అయి వుండి ఉండేవాడు. భారతీయ పవిత్రగ్రంథాలు, భారతీయ సంప్రదాయం, మహాభారతగాథ, మరితరాలు, పరివ్రాజక జీవితంగల ఆధ్యాత్మికతకు, ఆధ్యాత్మిక కర్మజీవనానికీ రెంటికీ చోటిచ్చాయి. ఒకటి మాత్రమే భారతీయ సంప్రదాయమనీ, జీవితాన్నీ, సర్వవిధ కర్మలను 'సర్వకర్మాణి' అంగీకరించడం, అభారతీయమనీ, ఐరోపీయమనీ లేదా పాశ్చాత్యమైనదనీ, అనాధ్యాత్మికమనీ చెప్ప తగదు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె.వి. రావు

అర్జునునికి శ్రీకృష్ణుని సమాధానం

భగవద్గీత మొదట కర్మ, జ్ఞానం – ఈ రెండింటికీ ఒక విశాలమైన ప్రాథమిక ప్రాతిపదికను ఆవిష్కరిస్తుంది. ఈ ప్రాతిపదికలో భక్తికి దారితీసే మూలాంశం ఉంది. మరింత మహనీయ జ్ఞానం కూడా అందులో ఉంది. అయితే సంపూర్ణంగా ఆ జ్ఞానాన్ని సూచించలేదు. గీతలోని మొదటి ఆరు అధ్యాయాలు ఆ ప్రాతిపదిక ఏమిటో మనకు వెల్లడిస్తాయి. ఒక మౌలిక సమస్యతో గీత ప్రారంభమవుతుంది. రక్తపాతం పట్ల విముఖత, దుఃఖం, పాపం కలుగుతాయి అన్న భావం, నిరామయ జీవితం నాకు వద్దు అన్న ఆలోచన, పాపకార్యానికి పాపఫలితం ఎదుర్కొనవలసి వస్తుందన్న భీతి – ఇవి అర్జునుని ఆత్మవిమర్శకు దారితీశాయి. అది అసలు సమస్య. ఈ ఆరు అధ్యాయాలు ఏ విధంగా ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపాయో మనం ఒకింత ఆలోచించవలసియున్నది. ఈ సమస్య అసలు సృష్టి అస్తిత్వం స్వభావమేమిటి అన్న ప్రశ్నకు దారితీయవలసిన అవసరం లేదు. మామూలు

జీవితం స్థానంలో ఆధ్యాత్మికజీవితం నెలకొల్పే ప్రశ్నకు కూడా తావివ్వడం లేదు. నైతికమైన లేదా వాస్తవమైన ప్రాతిపదికపైన ఈ సమస్యను చర్చించి ఉండవచ్చు. లేదా మేధాసంబంధమైన, లేదా ఆదర్శప్రదమైన ప్రాతిపదికపై లేదా ఈ అన్ని దృక్కోణాల ఆధారంగా పరిశీలించి ఉండవచ్చును. ఈ చిక్కు సమస్యను పరిష్కరించడంలో అదే నిజానికి ఒక ఆధునిక పరిష్కారపద్ధతి కూడా. ఈ దృక్కోణం లోనుంచి చూస్తే దీనికి నిరపేక్షమైన పరిష్కారం లేదని, ఇదే తక్షణ ఆచరణాత్మకమైన పరిష్కారం అని గీత గుర్తించింది. దీనిని అతడు (అర్జునుడు) ఆమోదించే స్థితిలో లేడు. ఆ ఉద్దేశమే లేదు. మరో దృక్పథానికి, మరో సమాధానానికి అది దారి తీస్తుంది. మన సహజమైన అస్తిత్వానికి, మనస్సుకు అతీతంగా, మానసిక, నైతిక సంక్షోభాల నుండి మరో అస్తిత్వ ధర్మతేజస్సుతో ప్రదీపించే మరో చైతన్యసత్వము లోకి, అందువల్ల కర్మాచారణకు సంబంధించిన మరో దృక్పథంలో మనం అధిరోహించడమే గీత చూపిన పరిష్కారం. అక్కడ వ్యక్తిగత కాంక్ష, ఉద్వేగాలు పనిచేయవు. అక్కడ ద్వంద్వాలు రాలిపోతాయి. అక్కడ కర్మాచరణ మనది కాదు. అక్కడ వ్యక్తిగత పాపపుణ్యాలను అధిగమించడం జరుగుతుంది. అక్కడ విశ్వపరివ్యాప్త, అమూర్త, దివ్యపరమాత్మ మన ద్వారా ప్రపంచమంతా తన లక్ష్యాన్ని నెరవేర్చుతూ పోతుంది. మనం ఒక దివ్య, వినూత్న జన్మ ద్వారా ఆ దివ్య అస్తిత్వంలో అస్తిత్వంగా, దివ్యచైతన్యంలో చైతన్యంగా, ఆ మహనీయ శక్తిలో శక్తిగా, ఆ దివ్యానందంలో ఆనందంగా, రూపాంతరం చెందుతాము. మనం ఇంక నిమ్నప్రకృతిలో ఏమాత్రం జీవించబోము. స్వకర్మాచరణ ఉండబోదు. వ్యక్తిగత లక్ష్యం అంటూ ఉండదు. దివ్యకర్మలను మాత్రం నిర్వర్తిస్తాము. మన బాహ్యాప్రకృతి ఉదాసీన ఉపకరణంగా ఉంటుంది. అసలు ఏ స్వీయ లక్ష్యాలుండవు. అది కారణం కాబోదు. లక్ష్యసిద్ధికి మనకు లభించే మహాశక్తి తన కర్మాచరణల ప్రభువు యొక్క సంకల్పం నుండి పొందుతాము.

మన అస్తిత్వ కేంద్రం ఊర్ధ్వభూమికలకు చేరడం, మన అస్తిత్వం, చైతన్యం పూర్తిగా పరివర్తన చెందడం, తత్ఫలితంగా మన ఆత్మలో, మన కర్మల లక్ష్యంలో మార్పు రావడం, బాహ్యా రూపాలలో మన కర్మాచరణ యథాతథంగా ఉండిపోవడం – ఇదే గీత బోధించే కర్మయోగసారం. నీ అస్తిత్వాన్ని మార్చుకో. ఆత్మలో పునర్జన్మించు. ఈ వినూత్న జన్మతో ఆ పరమాత్మ నిర్దేశించిన కార్యాచరణతో ముందుకు పురోగమించు. ఇది గీతా సందేశం. దీనికి మరింత ఆధ్యాత్మిక, ప్రగాఢ ప్రాభవాన్ని జత చేసి, మరోలా చెప్పాలంటే – ఇక్కడ నువ్వు చేయవలసిన కర్మాచరణను అంతర్గత ఆధ్యాత్మిక పునర్జన్మ సాధనగా మలుచుకో. అదే దివ్యజన్మగా పరిగణించు. దివ్యత్వంలోకి ఎదిగిన నీవు ప్రజల్ని నడిపించడానికి భగవంతుని ఉపకరణంగా దివ్యమహానీయ కార్యాలు నిర్వర్తించు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

ఆత్మార్పణా భావము

పనిలో సరైన స్ఫూర్తి

కర్మలలో సంపూర్ణమైన ఆత్మార్పణాభావం మొదటి ఆవశ్యకత. మొదట్లో నిరంతరమైన సంకల్పమై, ఆ తర్వాత అది మనిషిలో స్వాభావికంగా స్థిరమైన ఒక అవసరమైపోవాలి. చివరకు స్వయంచాలకంగా సజీవమైన సచైతన్యమైన అలవాటుగా అయిపోయి మనలోనూ, సర్వజగత్తు చర్యలలో, జీవరాసులలోనూ నిగూఢశక్తిగా ఉన్న ఆ దైవానికి తనంతతానుగా సమర్పణాభావంతో పనిచేయడం కావాలి. ఇటువంటి సమర్పణ చేయడానికి జీవితమే ఒక బలిపీఠము. పనులే మన నివేదనలు. మనం ప్రత్యక్షంగా దర్శించలేకపోయినా దాని అనుభూతిని పొందగల ఒక సర్వాతీత విశ్వశక్తి మనం చేసే ఈ కైంకర్యాలకి స్వీకర్తగా

ఉంటుంది. ఈ ఆత్మనివేదనలో రెండు పార్శ్వాలు ఉన్నాయి. కర్మాచరణ, రెండవది – కర్మ ఆచరణలో మానసికస్థితి – కర్మాధీసుని సమర్పనలో నీ దృష్టి, ఆలోచన, అనుభూతి.

*

అనుక్షణం మన సత్వములోని ప్రతి కదలిక నిరవధికంగా ఆ పరమాత్మకు సభక్తికమైన ఆత్మార్పణగా కృతనిశ్చయంతో జరుగుతూనే ఉండాలి. మనం చేసే పనులన్నీ, అవి ఘనతరమైనవీ, అసాధారణమైనవీ, గంభీరమైనటువంటివే కాక అత్యల్పమైనవీ, సర్వసాధారణమైనవీ, తక్కువ ఉపయోగపడేవీ కూడా సమర్పణాదృష్టితోనే చేయాలి. మన వ్యక్తిగత స్వభావము ఒకే చేతనలో అంతర్బాహ్యాచలితచాలనాలకి అంకితం కాబడి, నిరహంకారంగా ఉన్నతంగా ఉండాలి. మనం ఇచ్చే బహుమతి ఎటువంటిదైనా ఎవరికిస్తున్నా కూడా ఇచ్చేటప్పుడు మాత్రం అది అందరిలోనూ ఉన్న భగవంతునికే సమర్పిస్తున్నామన్న చైతన్యంతో ఇవ్వాలి. అతిసాదాసీదాగా ఉండే మన ప్రాపంచిక చర్యలు కూడా ఈ ఉదాత్తతను పొందాలి... భుజించేటప్పుడు ఆ ఆహారం మనలో ఉండే సర్వాంతర్యామి కోసమనీ, ఒక పవిత్ర దేవాలయంలో నివేదన చేస్తున్నామనే చైతన్యం మనలో ఉండాలి కానీ, కేవలం ఒక దేహావసరమనికానీ, మన సంతృప్తికోసమని కానీ తినకూడదు. ఒక గురుతర పరిశ్రమ గానీ, మహోన్నత వ్యవస్థాపనగానీ, ఒక గొప్పశిక్షణగానీ మన కోసమో, లేక ఇతరుల కోసమో లేక ఒక జాతి కోసమో పూనుకొని చేసేటప్పుడు మనమూ, ఇతరులూ అనే భావాన్ని రానీయకుండా దాన్నొక కర్మయజ్ఞంగా అర్పణ చేయాలి. ఆ చేసేదాన్ని సూటిగాగానీ, ఆ కర్తలు ద్వారా కానీ, ఆ పరమేశ్వరునికి సమర్పించాలి. ఆ సర్వాంతర్యామి వీరందరి మరుగునా ఉన్నప్పటికీ మన ఆత్మలో, మన మనస్సులో, మన భావనలో సదా నిలిచే ఉంటాడు. మన ఆకాంక్ష, మన శ్రమ మొదలైనవి ఆ లోకోత్తరుని వల్లనే ఫలిస్తాయనే భావం సర్వదా మనలో ఉంచుకొని మనం చేసే పనులను, వాటి ఫలితాలను ఆయన చేతుల్లో ఉంచాలి. అన్నీ ఆ పరమతత్వంలోనే జరుగుతాయి

కాబట్టి ప్రకృతి మన ఆకాంక్షలను, శ్రమలను తీసుకొని ఆయనకు సమర్పిస్తుంది. మనం నిమిత్తమాత్రంగా ఉండి కేవలం ప్రకృతి నిర్వహించే పనుల్లో కూడా మనం కర్తలము, సాక్షులమై సచైతన్యంగా అధిపతి పరదైవమేననే భావనతోనే ఉండాలి. మన ఉచ్ఛ్వాసనిశ్వాసాలు, మన హృదయస్పందనలు కూడా ఆ విశ్వయాగపు సజీవ లయవిన్యాసాలుగా చైతన్యం పొందాలి.

మొదట్లో అటువంటి భక్తి భావన లేకుండా ఇటువంటి క్రమశిక్షణ ప్రారంభమైనప్పటికీ అది తిన్నగా అత్యున్నత భక్తి తత్పరతకే చేరుస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

సర్వసంగపరిత్యాగము

కర్మసుకౌశలం (2)

మన పని ప్రాధమికంగా అజ్ఞానం నుండి యెంత గొప్ప వెలుగులోనికి పయనించగలుగుతామన్న అంశంతో నిర్ణయించబడుతుంది. దానినే మనం కర్తవ్యకర్మగా భావిస్తాం. అది మన కర్తవ్యభావనచేగాని లేక ఇతరుల మంచి కొరకు లేక ప్రపంచం మంచికొరకైన ఆశతోకాని లేదా మన గురువు లేదా సర్వకర్మాధీశుడైన దైవంయొక్క ప్రతినిధి సూచన ద్వారాగాని రూపుదిద్దుకొన్నప్పటికీ, వీటన్నింటి నియమిత సిద్ధాంతం ఒక్కటే. అక్కడ కర్మల పరిత్యాగం యొక్క ప్రాధాన్యత ఉండాలి. కర్మఫలితాలపై కోర్కెను దైవసమర్పణ చెయ్యాలి. కర్మఫలితాలపట్ల మనకుగల సర్వసంగాన్ని పరిత్యజించాలి. కర్మఫలితంపై మనకు ఆసక్తి లేదా సంగం ఉన్నంతవరకు మన త్యాగం దైవానికిగాక మన అహంకారానికి చేసినదే అవుతుంది. మనం మరోవిధంగా ఆ త్యాగాన్ని పవిత్రత్యాగంగా భావిస్తే అది మనల్ని మనమే మోసపుచ్చుకొన్నవాళ్లమవుతాం. అలాంటి పట్ల దైవాన్ని గూర్చిన మన భావన,

మన కర్తవ్యభావన, తోటిమానవాళిపట్ల, ప్రపంచంపట్ల మన భావన, మన గురువుపట్ల మన విధేయతాభావన, – ఇవన్నీ కూడ మన అహంకారతృప్తి కోసమైన మేల్ముసుగే అవుతుంది. ఇంకను అది మన ఇచ్ఛల తృప్తి కొరకైన మారువేషంగా, మన స్వభావం నుండి మన కోర్కెలను సమూలంగా నిర్మూలిస్తున్నామనుకొంటున్న కృత్రిమ రక్షణగానే అవుతుంది. అంతేగాని అది యదార్ధ సర్వసంగపరిత్యాగం మాత్రం కానేరదు.

ఇలాంటి కోర్కె, ఇలాంటి అహంకారం మనకు శత్రువు. ఈ శత్రువు పట్ల మనం నిరంతరం కంటికునుకు లేకుండా మిక్కిలి మెలకువ వహించాలి. ఈ అహంకారం యొక్క అన్ని విధాలైన మేల్ముసుగులను జాగ్రత్తగా కనిపెడుతూ ఉండాలి. దాని ప్రభావానికి లోనుగాకుండ దాన్ని తరుమగొడుతూ ఉండాలి. ఈ సందర్భంగా "*కర్మణ్యేనాధికారస్తే, మా ఫలేషు కదాచన*" అన్న గీతా వాక్యం చిరస్మరణీయమైనది. కర్మఫలం సర్వకర్మాధీశ్వరుడైన దైవానికి చెందుతుంది. మన పని, భగవంతునికి నివేదించుట కొరకై సకల కర్మలను మెలకువతో, కుశలతతో విజయవంతంగా నిర్వహించడమే. ఫలాపేక్ష త్యజించిన తర్వాత మనం కర్మల పట్ల సంగాన్ని కూడ త్యజించాలి. ఏ క్షణంలోనైనా అవసరమైతే కర్మను మార్చడానికి సిద్ధపడి ఉండాలి లేదా దైవనిర్దేశితమైతే సకల కర్మలను పరిత్యజించగలగాలి. అలా కానిచో, మనం కర్మలను దైవం కోసంగాక మన తృప్తికోసం ఆనందం కోసం చేసినట్లే అవుతుంది. లేదా అది చలించే ప్రకృతికి అవసరమైన కర్మ కోసం లేదా మన స్వభావ సంతృప్తి కోసం చేసినట్లవుతుంది. ఇవన్నీ కూడా అంహాకారస్థానములు, దానికి శరణాలయములు. మన సాధారణ జీవితానికి అవి యెంతో అవసరములైనను, ఆధ్యాత్మిక చేతనాభివృద్ధిలో అవన్నీ తొలగించబడక తప్పదు. వాటి స్థానంలో దైవాన్ని ప్రతిష్ఠించాలి. అపుడు ఆనందం, దివ్యానందం, ప్రాణికపరమైన ఆనందాన్ని, తృప్తిని పారద్రోలుతాయి. అంత మనోగతవాసనలు అవసరములు కాబడవు. వాటి బదులుగా స్వతంత్ర ఆత్మయొక్క శక్తివంతమైన సత్యం

ద్వారా దైవసంకల్పం నెరవేరుతుంది. చివరగా హృదయంలో కర్మ ఫలం పట్ల, కర్మపట్ల సంగం తొలగిపోగా, మనమే కర్మలకు కర్తలమన్న బంధం సహా తొలగిపోగా, దైవశక్తియే మన లోపల సత్యమైన ఏకైక కర్తగా పనిచేస్తున్న అనుభూతిని మనం పొందాలి.

మూలము: శ్రీఅరవిందులు

అనువాదము: బి. నరసింహయ్య

అహంకార నిర్మూలన

కోర్కె నిర్మూలనకి పడే శ్రమకి ముందు సంపూర్ణ సమగ్రత, సాఫల్యంతో ఆత్మసమత్వ విజయం సాధించగలగాలి. అదే ఆధ్యాత్మిక స్పందనకి కీలకమైన పూర్తి మలుపు కావాలి. అది అహంకార ప్రవృత్తి నిర్మూలనకి దారి తీస్తుంది. ఈ మార్పుకి అతి ముఖ్యమైన అంశం సాధకుడి కర్మకి సంబంధించిన అహంకార పరిత్యాగం. ఫలితాన్ని, ఫలితం మీద ఆశని విడిచిపెట్టడం త్యాగానికి పరాకాష్టగా భావించడం రాజసికమైన కోరిక. ఇంకా మనలో అహం మిగిలే ఉందనడానికి నిదర్శనం. మనమే ఇదంతా చేస్తున్నామన్న అహంకారం. మన ద్వారా మనమే దాతలం అనే భావన. ఇప్పటికీ అది 'నేను' చేసిన నిర్ణయం అని నిర్ధారించడం, ఇంకా 'నేను' సత్ఫలితానికి కాని దుష్ఫలితానికి కాని బాధ్యత వహించడం. ఈ వేర్పాటు ధోరణితో వున్న అహంకార ప్రవృత్తిని సమూలంగా కూకటివేళ్ళతో పెకలించివెయ్యడం యోగసాధనకి అత్యవసరం. ఎక్కడైనా, ఏ మూలైనా కాస్త మిగిలుంటే అది తనని తానే గుర్తించి తనంతట తానే శుద్ధచైతన్యదర్శనం లేదా నిర్మాణం జరిగిన మరుక్షణం మాయమయిపోతుంది. ఆ శుద్ధచైతన్యకేంద్రం దేదీప్యమానమైన తేజోమూర్తి. పరిశుద్ధమైన మార్గం తన ఉనికిని సూచించే సాధనం. విశ్వశక్తికి, వ్యక్తిత్వవికాసానికి ఒక ఆధారం. అది క్రమంగా మనలో ఉండే అసలు వ్యక్తిని బయటపెడుతుంది. అదే మన ఆంతర్యంలో ఉండే శాశ్వత జీవాత్మ.

అమృతత్వ పరమాత్మ. అది దివ్యశక్తిలో ఒక భాగము. అత్యంత శక్తివంతమైనది.

ఒక పని ప్రేరణలో, పనిచేస్తున్న క్షణంలో మొత్తంగా అన్ని స్థాయిలలో సాధకుడి ఆలోచనలోగాని, అనుభూతిలోగాని, చూసే దృష్టిలోగాని వాస్తవంగా, గాఢంగా నమ్మవలసినది పరమాత్మే తన ద్వారా ఆ పని చేస్తున్నాడని. సాధకుడెపుడూ ఆ దివ్యశక్తి స్పృహలోనే ఉండాలి. ఆ సన్నిధిని అనుభూతిలో పొందాలి. భగవదేచ్ఛ తన స్వభావం ద్వారా పనిచేస్తున్నదనుకోవాలి. ఈ సందర్భంలోనే తనకి తెలియకుండానే తనలో ఉన్న అహంకారం తనని సంశయంలో పడేస్తుంది. లేదా పరమాత్మ వెనుక పొంచి వున్న క్షుద్రశక్తులు భగవదాదేశంగా భ్రమింపజేసి, ఆ స్థానంలో తమ కోరికలు ప్రవేశపెడతాయి. సాధకుడు సర్వసాధారణంగా ఇటువంటి క్షుద్రశక్తుల మాయలో పడవచ్చు. దాని వలన అంత వరకూ నమ్ముతూవచ్చిన సమర్పణభావం, అతిశయించిన, అదుపు తప్పిన కోరికలతో తన ఆత్మసంకల్పం, కోరికలు, లాలస మొదలైనవాటితో కలిసి వికృతరూపం దాలుస్తుంది. అది ఒక నెపంగా మిగిలిపోతుంది. ఆ సమయంలో ఒక మహత్తర చిత్తశుద్ధి చైతన్యం మీద పనిచేయించడమే కాదు. గుప్తస్పందనలతో నిండిన మన అవచేతన భాగం ప్రభావితం కావాలి. అవచేతన ప్రాణిక స్వభావంలో ఒక భ్రష్టవైద్యుడు, నటుడు పొంచివున్నారని ప్రత్యేకంగా గుర్తించాలి. కోరికని నిరాకరించడంలో సాధకుడు అగ్రస్థానంలో ఉండాలి. ప్రప్రథమంగా అధిగమించవలసినదదే. అతడు అంతరాత్మ వైపు సూటిగా, దృఢంగా దృష్టి నిలపాలి. అన్ని పనులు, ఆ పనుల బరువుబాధ్యతలు దైవపరం చేయాలి. ప్రతి క్షణం, మోసం, అహంకారంపై అప్రమత్తమైన దృష్టితో ముందుకు సాగాలి. తప్పుదోవ పట్టించడానికి చీకటిలో పొంచివున్న శక్తులు ఎప్పటికప్పుడు తమకి తామే దివ్యతేజస్సు, దివ్యమార్గం చూపే మార్గదర్శకులుగా నటిస్తూ, దైవరూపాలుగా కపటవేషాలతో మోసగిస్తాయి. సాధకుడు అంతరాత్మని కనుగొనే సమయంలో ఇవన్నీ ఎదుర్కొనవలసి ఉంటుంది.

సాధకుడిలో అహం మాయమయినా, దాని స్థానంలో దానికి సంబంధించిన మరొక సాధనం మారువేషంలో ప్రవేశించి కొన సాగుతుంది. ప్రాపంచిక జీవితమంతా ఈ రకమైన అహంకార పూరిత సంఘటనలతోనే నిండి ఉంటుంది. మిగిలినవాటి కంటె ఇవే అత్యధికంగా, అతి విస్తృతంగా ఉంటాయి.

మన స్వభావం నిమ్నస్థాయిలో లేదా రాజసిక, సాత్త్విక స్పందనలతో నిండినవాటితోకాక, విశ్వశక్తి నిలయం కావాలి. సార్వత్రిక సంకల్పాన్ని మన్నించి అది నిర్నిబంధజ్ఞానదీప్తితో నిండాలి. మనలోగల దైవాంశ గొప్పతనంయొక్క చైతన్యస్పృహ పూర్తిగా మనలో ఉన్నా, ఏ రకమైన అహంకారం భగవత్పరికర మైన మన దృక్పథంలో తలెత్తకూడదు. తెలిసినా, తెలియకపో యినా ప్రతి వ్యక్తి సార్వత్రికశక్తి యొక్క పరికరమే. దివ్యాంశతో నిండిన మన ఆంతర్య సన్నిధి వేరుగా ఉందని ఒక పనికి, మరొక పనికి ఒక సాధనంగా ఒకసారి పనిచెయ్యడం మరొక సాధనంగా మరొకసారి పనిచెయ్యడంలాంటి తేడాలు అక్కడ ఉండవు. ఉండకూడదు. అలా ఉందనుకోడం అహంకారం, గర్వంతో కూడిన నిర్ణయం. జ్ఞానానికి, అజ్ఞానికీ మధ్య తేడా భగవత్కృపే. దివ్యశక్తి ఊపిరి యెక్కడ సోకుతుందో అక్కడ ఆ వాక్కు లేదా శక్తి తన చిట్టాలో చేర్చబడుతుంది. ఇవాళ ఒకటి రేపు మరొకటి. కుమ్మరి ఒక కుండకంటె మరొక కుండ చక్కటి నైపుణ్యంతో చేసేడంటే ఆ గొప్పతనం కుండని తయా రుచేసిన కుమ్మరిదే కాని కుండది కాదు. ఇది *'నా గొప్పతనం'* అన్న ఆలోచన మన మనసులోకి రాకూడదు. భగవంతుడు తన శక్తిని నాలో ప్రవేశపెట్టాడు అనుకోవాలి. పరమాత్మ ఇచ్చే మనిషి బుద్ధిలోను, శరీరంలోను పనిచేస్తుంది. మనుషులందరిలోను, జంతు వుల్లోను, మొక్కల్లోను పనిచేస్తుంది. అంతేకాదు. జీవనిర్జీవ పదా ర్థాలన్నిటిలోను ఉన్న ఆత్మ ఒక్కటే. విశ్వమంతటా పరమాత్మ ప్రక్రియాసాధనమే పని చేస్తున్నది అనే పరిజ్ఞానం క్రమంగా స్వయంవ్యక్తమవుతుంది. అదే మన మొత్తం అనుభవంగా మారి నట్టయితే, మన రాజసిక అహంకారాన్ని తొలగించుకోడానికి

సహాయపడుతుంది. దానితోపాటు సాత్వికాహంకార ప్రవృత్తి కూడా మన స్వభావం నుంచి నిష్క్రమించడం మొదలవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు
భావానువాదం: యన్. విజయలక్ష్మి

దివ్యపరిపూర్ణతయే లక్ష్యం కావలె

పనిలో సరియైన తీరు (5)

సాధనంగా ఉన్న అహంకారాన్ని దైవీశక్తికి సమర్పణ చేశాక ఇంతకంటె మరొక గొప్ప అడుగు వెయ్యవలసి యున్నది. ఈ దిగువ ప్రకృతికి అతీతంగా ఉన్న ఆమె బలంయొక్క సత్యం లోని దైవీశక్తికి మనం తెరచుకొని యునప్పుడే మనం ఆమె యొక్క శక్తిజ్ఞానములకు సమగ్రమైన సాధనములు కాగలము. ముక్తి మాత్రమేకాక పరిపూర్ణత కూడా దివ్యమైన కర్మయోగానికి లక్ష్యము కావలె. ఆ దైవం మన ప్రకృతి ద్వారా దాని నైజానికి అనుగుణంగా పనిచేస్తుంది. మన స్వభావం అపరిపూర్ణంగా ఉంటే పని కూడా అపరిపూర్ణంగాను, కలగాపులగంగాను, అయోగ్యం గాను ఉంటుంది. పెద్ద పెద్ద దోషాలతో, అసత్యాలతో, నైతికబల హీనతలతో, పెడదారి పట్టించే ప్రభావాలతో అది చెడగొట్టబ డనూవచ్చు. అయినా అప్పుడు కూడా దైవకార్యం మనలో జరు గుతూనే ఉంటుంది. అయితే అది మన బలహీనతల ననుసరిం చియేకాని దాని మూలస్థానంయొక్క బలస్వచ్ఛతల ననుసరించి కాదు. నిశ్చలమైన పరమాత్మతత్త్వమేకాక, దైవీప్రకృతిలోని గతు లను కూడ మనం దైవసాక్షాత్కారానికి లక్ష్యంగా చేసుకుంటాం. ఆ దైవంయొక్క సన్నిధిని శక్తిని మనం వేసే ప్రతి అడుగులోను, గమనంలోను, మన కార్యాచరణల రూపులోను, మన అభీష్టం యొక్క ప్రతి మలుపులోను, ప్రతి ఆలోచనలోను, అనుభూతి లోను, మానసిక ప్రేరణలోను కూడా అనుభవించేవరకు మొత్తం మీద ఇదేమీ కుదరదు. అజ్ఞాన ప్రకృతి నైజంలో కూడా ఒక

విధంగా దీని అనుభవాన్ని నిస్సంశయంగా పొందవచ్చు. అయితే అది ప్రచ్ఛన్నంగా ఉన్న దివ్యశక్తి, దివ్యసన్నిధి, తగ్గినది, హీనా కృతి కలది. మనకంటె ఇంతకంటె అధికమైన అపేక్ష. మన నైజం దివ్యసత్యంలోని దివ్యశక్తి కావలె. దివ్యప్రకాశంలో, నిత్య మైన ఆత్మసాక్షియైన దైవేచ్ఛలో, శాశ్వతమైన దివ్యజ్ఞానంయొక్క విశాలత్వంలో దైవం యొక్క శక్తిగా మన నైజం కావలె.

అహంకారంయొక్క ముసుగును తొలగించాక, దివ్యప్రకృతి మరియు ఆమె మనః ప్రాణశరీరాలను పాలించే అల్పత్వరీతుల ముసుగును తొలగించాక... ఇంక ఎంతమాత్రం మనం సేవించేది అహంకారం కాని, అహంకారబలంకాని కాదు. దివ్యుడైన లోకే శ్వరునికి, ఆయన యొక్క పరిణామప్రేరణకి మనం విధేయులం. సంస్కృత శ్లోకం చెప్పినట్లు మనం వేసే ప్రతి అడుగులో "*నా హృదయవాసియైన నీవు నన్ను ఏమి ఆదేశిస్తావో ఓ దివ్యప్రభూ నేనలాగే చేస్తాను*" అని మనం అంటాం. అయినప్పటికి ఈ చర్య ఇంకా రెండు వేర్వేరు రకాలుగా ఉండవచ్చు. ఒకటి ప్రకాశవం తమైనది మాత్రమే. వేరొకటి పరివర్తన పొంది గొప్పదైన అద్భు తప్రకృతి లోనికి ఉద్ధరించబడినది. మనం మన స్వభావం సమ ర్థిస్తూ ఉన్న, అనుసరిస్తూ ఉన్న పద్ధతిలోనే ఉంటూ ఉండవచ్చు. అప్పుడు ఆమె వలనగాని ఆమె అహంభావమాయాజాలం వలన గాని మనం "*యంత్రం మీద కూర్చోబెట్టి త్రిప్పబడినట్లు*" గా జరుగుతుంది. అయితే ఇప్పుడో దానిబిసయొక్క సంపూర్ణమైన అవగాహన కలుగుతుంది. దానియొక్క ఉపయోగము ఆ దివ్య కర్మాధికారియొక్క లోకోద్ధరణకే జరుగుతోందని అర్థమవుతుంది. ఆయనే వెనుకనున్నట్లూ మనకు అనుభవం కలుగుతుంది. ఆధ్యా త్మీకరించబడిన మనస్సు స్థాయిలలో పెక్కుమంది దివ్యయోగులు ఇంతవరకు చేరేరన్నది వాస్తవమే. అయితే అది సర్వత్రా అలాగే ఉండనవసరం లేదు. ఏమంటే అంతకంటె గొప్పదైన అతిమాన సికత సంభవమే. ఆధ్యాత్మీకరించబడిన మనస్సును దాటి పైకి పోవడం సాధ్యమే. పరమోచ్ఛ దివ్యమాత యొక్క మౌలికమైన దివ్యసత్యసత్వ సజీవ సన్నిధిలో స్వతఃగా పనిచేయడం సాధ్యమే.

మన కదలిక ఆమె కదలికతో నొకటియై దానితో కలిసిపోడం, మన ఇచ్ఛ ఆమె ఇచ్ఛతో మమేకమవడం, మన శక్తి ఆమె శక్తిలో విముక్తమవడం, ఆ దైవం పరమోచ్ఛ దివ్యజ్ఞానశక్తిగా అవతరించి మనలో పనిచేస్తూన్నట్లుండడం మనకు అనుభవమవుతుంది. రూపాంతరీకరించబడిన మనఃప్రాణశరీరాలు వాటిని మించియున్న పరమోచ్ఛదివ్యప్రకాశబలాల వాహికలు మాత్రమేనని మనకు గ్రహింపు కలుగుతుంది. తన జ్ఞానం సంపూర్ణము, విశ్వాతీతము కావున తాము వేసే అడుగు తడబడదు. ఈ దివ్యబలప్రకాశాలకు మనం కేవలం గ్రహీతలు, వాహికలు, సాధనాలు మాత్రమే కాక అత్యుత్తమంగా ఉద్ధరింపబడిన స్థిరమైన అనుభవంలో మనం అంతర్భాగమవుతాం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: వై.యస్.వి,.యస్. మూర్తి

పనులయొక్క ఎంపిక

ఆచరణాత్మక మార్గదర్శకత్వం (1)

ప్రతి వ్యక్తి తన ఆకాంక్షను, చైతన్యాన్ని, లోతైన విషయ పరిజ్ఞానాన్ని వృద్ధిచేసుకొనగల కార్యరంగాలను ఎన్నుకొనాలి. దీనికి విరుద్ధంగా అతనిని యాంత్రికపరచే మరియు మరల మరల అతనిని పూర్తిగా భౌతికవిషయాలతో అనుబంధాన్ని పెంచే విధంగా ఉండకూడదు.

దీనిని ఒక సాధారణ నియమం చేయడం అసాధ్యం....

వాస్తవానికి, పనికంటె పనిని ఏ విధంగా నిర్వహించామ న్నది ముఖ్యం.

ఉదాహరణకు – నీవు గది నేలను తుడుస్తూ, ఆ గది లోని దుమ్మును దులుపుతూ శుభ్రపరచడము వంటి అతి మామూలు పనిని తీసుకుంటే – ఆ పనిని, పరిపూర్ణత కోసం,

పురోగతి కోసం, నీవు నిర్దుష్టమైన భావనతో చేసినట్లైన, అది నిన్ను, గంభీరమైన చైతన్యదిశగా నడిపిస్తుంది. కాని ఉన్నత తర గతికి చెందిన విజ్ఞానశాస్త్ర అధ్యయనము, వాజ్మయము, సాహి త్యము, కళాత్మకమైన పనులను కీర్తి నార్జించుటకు, అహంను తృప్తిపరచుటకు లేదా ధనార్జనకు, ఫలాపేక్షకు చేసినట్లైన అది నీ ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడదు. ఇది ఒక శ్రేణికి సంబంధిం చినది. ఇది బాహ్యాప్రకృతికి చెందిన వాస్తవము కంటే అంతరం గవైఖరి మీద ఆధారపడి ఉంది. కాని ఈ విభజన సమస్త విష యాలకూ వర్తింపచేయవచ్చు.

నిజానికి వేరొక విధమైన పని కూడా ఉంది. కేవలం ఆర్థిక పరిపుష్టికి, వ్యక్తిగత కారణాలతో కూడిన వేరొక విధమైన కృషి. కేవలం బ్రతకటానికి చేసేది. ఈ వైఖరి తడిసిన కట్టెలకు అగ్గిముట్టించినపుడు ఏ విధముగా మంట పైకి లేవదో సరిగ్గా అటువంటిదే అంటారు శ్రీఅరవిందులు. ఇది భారంగా, నిరుత్సా హంగా, నిస్తేజంగా ఉంటుంది. మనము మాత్రమే నిర్వహించ వలసిన కార్యము, ఆక్రమించవలసిన స్థానము, నెరవేర్చవలసిన కార్యభారము మనకు ఉంటాయి. కాని పని అంతరంగసత్వము యొక్క బాహ్యావ్యక్తీకరణ. దాని నిర్దుష్ట రూపముపట్ల మనము ఎప్పుడు చైతన్యవంతమవుతామంటే, అంతరంగ లోతులలో మనము చైతన్యవంతులమైనపుడే.

అన్నిటికన్నా ప్రధానం – మనం ఏ పని చేసినా, మన పంతం నెగ్గించుకోవాలని చేయకూడదు. కీర్తిప్రతిష్ఠలకు బంధితు లమైనా, సంకుచిత, ఆధిపత్యభావాలను కలిగివున్నా వాటికి మనము మనపై అధికారము ఇచ్చినవారమవుతాము. స్వాతిశయం కోసం మనము ఏమి కామో అదే మనము కావాలనే తాపత్ర యం సులువుగా కలుగుతుంది. ఇది మన అంతరంగ ఆదర్శాన్ని అస్పష్టపరుస్తుంది.

పరోక్షముగా లేక, బహిరంగంగా నేను గొప్ప వ్యక్తిని కావాలి అని, ఏ వృత్తివ్యాపారాలు నన్ను గొప్ప వ్యక్తిని చేస్తాయి అని మనము ఎప్పుడూ తలచకూడదు. దానికి బదులుగా, నిస్సం

దేహముగా ఇతరలుకంటె నేను తప్పక శ్రేష్ఠతరముగా పనిచేయగలను అని భావించాలి.

ఒక్కటే అయిన దివ్యశక్తి యొక్క అభివ్యక్తముతో అనేకము అయిన మనమందరము వ్యక్తిగతముగా ప్రత్యేక ఆకృతులను సంతరించుకున్నాము. అందరిలో నున్నది ఆ దివ్యశక్తేనని మనము తప్పక అనుకోవాలి.

వినయవిధేయతలు కలిగి ఉన్నా, నన్ను నేను తప్పక దైవానికి సమర్పించుకోవాలి అనే భావాన్ని తెలుసుకొనుటకు, మన ఇష్టాలను, అభిప్రాయాలను, ఎంపికలను, గర్వముతో అతి వినయముతో కాక – వాటిని సహజసుందరంగా పుష్పాలు సువాసనలు వెదజల్లినట్లుగా – అలా తప్పక మరొకలా చేయలేమన్నట్లు చేయాలి

మన అహంకారపూరిత కోరికలను, వ్యక్తిగత, స్వార్థపూరిత కామనలను అంతరంగానికి సమర్పించినట్లైన, ఈ ఆకాంక్ష అభివృద్ధిపర్చే సజీవవిశ్వశక్తులతో మనలను అనుసంధానపరచుటకు వీలుకలిగిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రివేణి

పని చాకచక్యంగా, త్వరగా ఎలా చేయాలి?

చాలా ఆసక్తికరమైన విషయం ఇది. ఏదో ఒకనాడు దీనిని గురించి వివరంగా మీతో ముచ్చటించాలనుకున్నాను. హడావిడిగా ఉన్నపుడు, మనుష్యులు పనిని అసంపూర్ణంగానో, అధ్వాన్నంగానో చేసేస్తారు. అయితే దీనికి మరో మార్గం ఉంది. అదే ... ఏకాగ్రతను తీవ్రతరం చేయటం. అది చేస్తే నీకు సగం సమయం కలిసొస్తుంది – అది స్వల్పకాలంలో చేయవల్సినదే అయినదే కావచ్చు. ఒక మామూలు ఉదాహరణ. స్నానం చేయటం, దుస్తులు ధరించడం. ఇందుకు పట్టే సమయం మనిషికి మనిషికి

మారుతుంది; కదా! అయితే – మాటకి – ఒక అరగంట పడు తుందనుకుందాం – నిదానంగా చేస్తే. అదే నీవు హడావిడిగా చేస్తే – నువ్వు సరిగ్గా స్నానం చేయకపోవటమో లేదా చక్కగా బట్టలు ధరించకపోవటమో – రెండింటిలో ఏదో ఒకటి జరుగుతుంది. పోతే మరొక మార్గం ఉంది – మనసును, శక్తిని లగ్నం చేయటం, పనిచేసేటపడు మరొక ఆలోచన లేకుండా ఉండటం. నీ కదలికలు సక్రమంగా, సరిగ్గా ఉంచటం. ఇదొక అనుభవం. చేసి చూడవల్సినదే. దృఢంగా చెప్పగలను. ఇంతకు ముందు అరగంటలో చేసే పని పదిహేను నిమిషాలలో చేయగలుగుతావు. అంతకన్నా బాగా చేస్తావు – ఏదీ కూడా మర్చిపోవు. కేవలం ఏకాగ్రతవల్లే ఇది.

"ఓ! ఏ పనైనా బాగా చేయాలంటే, సమయం ఉండాలి" అని చెప్పేవాళ్లకిది సరైన సమాధానం. వాళ్లు అనే దాంట్లో నిజం లేదు. నీవేది చెయ్యి – చదువు, ఆట, పని – ఒకటే పరిష్కారం. ఏకాగ్రతాశక్తిని పెంపొందించుకోవటమే. ఈ ఏకాగ్రతను నీవు వశం చేసుకున్నపుడు శ్రమ అనేది ఇక ఉండదు. సహజంగానే మొదట్లో కొంత ఉద్రేకం కలిగిస్తుంది ఇది. అలవాటుపడితే ఆ ఉద్రేకం సడలుతుంది. నీకు అలసట కలిగించేది, ఏకాగ్రత వలన కాక, చేసే పనిలో దృష్టి ఉంచకుండా, వేర్వేరు విషయాలపై మరలినపుడే – అని నీకు తెలిసొచ్చే క్షణం వస్తుంది. ఈ విధంగా నీ పురోగమనానికి కర్మను ఒక సాధనంగా వినియోగపర్చుకోగల్గుతావు. అలా లేకుంటే నీకు 'పని' అంటే అనాసక్తంగా జరిపేది అనే అస్పష్టభావన కలిగి ఉంటావు. అనాసక్తతని ఉదాసీనతగా పొరబడే గొప్ప ప్రమాదం ఉంది ఇక్కడ.

*

నీవు ఏదైనాకాని, ఏ పనైనాకాని – అడే ఒక ఆట, రచన, పెయింటింగు, సంగీతం, పరుగుపందెం – ఏదైనాసరే నీవు సక్రమంగా చేయాలనుకున్నపుడు చేసే పనితో మమేకం కావాలి. నిన్ను నీవు గమనించుకుంటూ ఉండే అల్పమైన వ్యక్తిగా ఉండకూడదు. పనిచేస్తూ తనను తాను పరిశీలించుకుంటూ కనుక

ఉంటే, నీవు నీ అహంతో తోడుదొంగవు అవుతావు. తనంతట తానుగా తానుచేసే పనే, తానైయితే (తాదాత్మ్యత) అది గొప్ప పురోగతి. కనీసం స్వల్పవివరాలలో కూడా ఇది తెలుసుకోవాలి. ఒక తమాషా అయిన దృష్టాంతం తీసుకో. ఒక సీసాలోని ద్రవాన్ని మరొక సీసాలోనికి నింపాలనుకుంటావు. ఏకాగ్రత పాటించు. ఇది ఒక క్రమశిక్షణగా, శారీరకవ్యాయామంగా ప్రయత్నించు. నింపే సీసా, నింపబడే సీసా, నింపే కార్యము, ఈ ప్రక్రియ సర్వమూ నీవే అయినపుడు అంతా సక్రమంగా సాగుతుంది. దుర దృష్టవశాత్తూ, "ఆహా! బాగానే జరుగుతోంది. సక్రమంగానే నిర్వ హిస్తున్నాను" అని ఏదో క్షణంలో అనుకున్నావనుకో, మరుక్ష ణంలో అది తొణుకుతుంది. దేనికైన ఇలానే జరుగుతుంది. అందుకే చేసే పని మంచిక్రమశిక్షణకి మార్గమవుతుంది. నీవు సక్రమంగా పనిచేయాలనుకుంటే, పనితో తాదాత్మ్యం పొందాలి. పని నుంచి వేరై ఉండకూడదు. అలా ఉంటే ఎప్పుడూ బాగా చేయలేవు. వేరే వ్యక్తియొక్క పనిచేస్తున్నట్లుగా కనుక నీవు ఉంటే, దానికి తోడు, పనిలో నీ ఆలోచన్లు చక్కర్లు కొడుతుంటే, ఆ పని ధ్వంసం కావటం నిశ్చయం. గాజుసామాను అయితే పగు లుతుంది. వండుతున్న వంట మాడిపోతుంది. ఆటలో బంతులు నీకు అందవు. ఇలాంటి సందర్భాలలోనే పని గొప్ప క్రమశిక్షణ అవుతుంది నీకు. నీవు సక్రమంగా పనిచేయాలనుకుంటే మరి ఇదే దారి.

ఉదాహరణకి ఒక రచయితని తీసుకో – రచన చేసేట పుడు రచయిత ఎంతసేపూ తనను గురించే తాను తలుచుకుంటూ ఉంటే ఆ రచన ఎంత అధ్వాన్నంగా ఉంటుందో వేరే చెప్పన క్కర్లేదు. అల్పమైన వ్యక్తిత్వపు వాసనలతో ఆ రచన నిండి ఉంటుంది. దానికి విలువ ఉండదు. చిత్రం గీసే చిత్రకారుడు పాపం తన్ను తాను పరిశీలించుకుంటూ ఉంటే, ఆ చిత్రం చిత్ర కారుని వ్యక్తిత్వప్రతిరూపకల్పనగా ముందుకు వస్తుంది. అది సజీవంగా ఉండదు. శక్తివంతంగా ఉండదు. సుందరంగా ఉండదు. కాని అలా కాక తన చిత్రలేఖనంలో తాదాత్మ్యతాభావం పొంది

తానే చిత్రం, చిత్రకారుడు, బ్రష్, రంగు, పటం సర్వమూ తానే అయి ఉన్నప్పుడు – ఆ చిత్రం జీవకళతో ఉట్టిపడుతుంది. అదొక అపూరూపకళాఖండమవుతుంది.

ఆత్మన్యూనతాభావం, అల్పత్వం, బలహీనత, పరిమితత్వం – ఈ భావాలెప్పుడూ అల్పాతిఅల్పమైన అహం చట్రంలో బిగుసుకునిపోయి ఉన్నందువల్ల, కలుగుతాయి. వ్యక్తి విశాలమవాలి. లోకవాటాలు తెరవబడాలి. నీవు చేసే పనిమీద ఏకాగ్రత వహించాలేకాని నీ వక్తిత్వం మీద కాదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నాకిది కావాలని అనుకోకు

నాకిది కావాలని అనుకోకుండా ఉండటం, నిష్కామంగా పనులు చేయుటం చాలా కష్టం. ఈ కష్టమే సత్యచేతనను, ఆత్మసంయమనాన్ని అభివృద్ధిపర్చుకోవటానికి మౌలికమైన ఇబ్బంది. ఈ పరిజ్ఞానంతో కర్మలను ఎంపిక చేసుకోవటం, వాస్తవాన్ని గ్రహించి ఆచరణలో చూపించటమే జరగాలి. ఆ విధంగా ప్రతి విషయాన్ని, చర్యని, వ్యక్తిని, పరిస్థితిని నిష్పక్షపాతంగా ఎంపికచేయటం సాధారణ మానవజీవునికి కష్టతరమైనది. అయినా కూడా, ఆకర్షణలకి, ఇష్టాలకి అతీతంగా దివ్యసత్యమార్గదర్శకత్వంలో మాత్రమే పనిచేసేటట్లు తప్పనిసరిగా చూచుకోవాలి. దివ్యసత్వము ప్రాతిపదికగా అవసరమైన కర్మను ఎన్నుకొని నిష్కామంగా నిర్వర్తించాలి.

నీవు శ్రద్ధగా కనుక గమనిస్తే ఒక చర్య తీసుకునే ముందు నిన్ను ముందుకు ప్రచోదించే అంతర్ప్రేరణ ఏదో నీకు కావలసి ఉంటుందని తెలుసుకుంటావు. సామాన్యమానవునిలో కోరిక ప్రచోదనగా పనిచేస్తుంది. ఈ కోరిక స్థానంలో మనకలేని స్పష్ట

మైన నిరంతర దివ్యసత్యదృష్టి – vision of the Truth ప్రతిష్ఠింపబడాలి.

ఏదైనా ఒక విషయం మీద నీవు కోరిక, మొగ్గు, మోజు, ఇష్టం పెంచుకున్నట్లైతే ఇవన్నీ దివ్యసత్యమును కప్పిపుచ్చి నీకు కనపడనీయవు. అందుచేత మొట్టమొదటగా నీవు చేయవలసినది నీ చైతన్యచలితచాలనాలను నీ స్వాధీనంలో ఉంచుకొని, నిర్దేశించి, క్రమబద్ధీకరించుకోవాలి. మార్చలేని వాటిని పూర్తిగా వైదొలగించాలి. ఈ దివ్యసత్యము పరిపూర్ణంగాను, శాశ్వతంగాను వ్యక్తీకరింపబడేవరకు ఈ ప్రక్రియ జరగాలి.

నీకు ఆవశ్యకమైనది నిరంతరాయంగా జ్వలించే ఆకాంక్ష. ఒక కోరిక, ఆకర్షణ, మోజు నీలో మొలకెత్తిన ప్రతిసారీ దానిని ఆ మంటకి ఆహుతి చేయాలి. ఈ పని క్రమం తప్పకుండా చేస్తూంటే, నీ సాధారణ చేతనలో సత్యచేతన చిరుకిరణోదయాన్ని దర్శిస్తావు. మొదట ఇది నీ ఇష్టాల, మోహాల, ఆకర్షణల కోలాహలం వెనుక ఎక్కడో దూరంగా మందకొడిగా ఉంటుంది. అయితే నువ్వు వీటినన్నిటినీ అధిగమించి చాటున ఉన్న నిశ్చల, నిశ్శబ్ద, ప్రశాంత, సత్యచేతనను కనుగొనాలి.

విమర్శించటం ఆపి, విజ్ఞానం తన స్వంతం అనుకుని ముందుకు సాగే మనసు నిశ్శబ్దమైనపుడు జీవితసమస్యకి పరిష్కారం మొదలవుతుంది. విమర్శించటం తప్పనిసరిగా నిగ్రహించుకోవాలి. కార్యాచరణకు మాత్రమే మనసు ఉపకరణం. సత్యజ్ఞానానికి కాదు. సత్యజ్ఞానం వేరేచోటు నుంచి వస్తుంది.

విమర్శించటం మానుకుంటే, దివ్యసత్యమును గురించిన సమ్యగవగాహన మరింతగా లభ్యమవుతుంది. ప్రపంచంలో దైన్యస్థితి చాలావరకు అదృశ్యమవుతుంది.

*

ఏదైనా ఒక పని వికృతమై పాడయ్యేది దాని పరిణామాలపట్ల కలిగే ఆందోళనవల్ల. పరిపూర్ణయుక్తాయుక్తజ్ఞానం కావాలంటే, నిష్కామంగా కర్మలు చేయటం ఎలాగో తెలుసుకోవటం తప్పనిసరి. అలా చేయగలిగేది వేయిమందిలో ఏ ఒక్కరో మాత్రమే.

ఫలితం గురించి, ఫలితం పొందాలని ఆందోళనే – అందరికీ. (కర్మ) ఫలం గురించి నీవు ఆందోళనపడకూడదు. చేయవలసినది చెయ్యి – అది నీవు తప్పక చేయవలసినదే కాబట్టి. "ఇది నాచే చేయబడవలసినది కాబట్టి చేస్తున్నాను. ఫలితం నాకు అనవసరం – అని నీకు నీవు చెప్పుకో.

స్పష్టంగా ఇదీ ఆదర్శం. నీవు ఈ ఆదర్శాన్నందుకునే దాకా నీ కర్మలు కలగాపులగంగానే ఉంటాయి. నీవు చేయవలసిన కర్మ నీవు చేయాలి – అనే నియమం నీవు తప్పక పాటించాలి. చేయబడవలసినదీ మరి అదే – మరొకటి కాదు – అనేది దివ్యసత్యప్రచోదనతో నీవు కర్మానుష్ఠానం కావించాలి.

*

నీవు దివ్యశాసనాన్ని పాటించటానికి సిద్ధమైనపుడు నీకివ్వబడిన ఏ కర్మనైనా నిర్వర్తించాలి – అదెంత అత్యాశ్చర్యకర అద్భుత కర్మ అయినా కానీ, దానిని ఎంత ప్రశాంతతో చేబట్టావో అదే స్థితిలో వదిలివేయగలగాలి. బాధ్యత నాదే – అనే భావన రానీయకూడదు. వస్తువుపైనగాని, జీవనవిధానంపైనగానీ, వ్యామోహం ఉండకూడదు. పూర్తి స్వేచ్ఛ కలిగి ఉండాలి. యోగదృక్పథం పాటించాలంటే దైవం నిర్దేశిత ప్రతి కర్మని అంగీకరించాలి. ఏ రకమైన తొట్రుబాటు, బాధ లేకుండా కొనసాగించాలి.

*

ప్రశ్న: నాకిది కావాలనుకోకపోవటం – అనేది మేమెలా అర్థం చేసుకోవాలి? అక్రమపద్ధతి బదులు క్రమపద్ధతిని, అశుచికి బదులు, శుచిత్వాన్ని కావాలనుకోకూడదా?

ఇది మాటల గారడీ! కావాలి – అని మీరు అనుకోవటాన్ని నేను ఎంపిక చేసుకోవటం – అంటాను. జీవితంలో నిత్యము అనుక్షణము ఎంపిక చేయవలసిన పరిస్థితి నీకు ఉంటుంది. కృంగతీసేది, పైకి లేవనెత్తేది, అభివృద్ధికి దోహద పడేది, అభివృద్ధిని నిరోధించేది, – ఈ రెండింటిలో ఒకదానిని ఎంపికచేసుకోవటం అనేది ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. దీనిని కావాలి అనుకోవటం అనను. దీనిని ఎంపికచేసుకోవటం

అంటాను. అనుక్షణం ఎంపిక (choice) అనేది ఉండనే ఉంటుంది. అది అనివార్యం, నిరంతరాయం. నైతిక, శారీరక సంబంధిత మంచిచెడుల మధ్య ఎంపిక సాగుతూనే ఉంటుంది. ఒక్కసారితో అయిపోయేది కాదు. ఎంపిక అనేది ఎప్పటికీ నీ ముందు ఉండేదే. ఒక అడుగు పైకి లేదా క్రిందికి, ముందుకి లేదా వెనుకకి – ఈ ఎంపిక చేయవలసివచ్చే పరిస్థితి నిరంతరము, నిత్యము. ఇక్కడ నీకు విస్తృతి ఉండదు. దీనిని నేను having preferences అనను preferences – this means precisely not choosing. కావాలని కోరటం. కచ్చితంగా ఎంపిక అవదు. నీకు ఒక విషయం పట్ల సానుభూతి, అయిష్టత, ఆకర్షణ, వికర్షణ ఉంటుంది. కారణం లేకుండానే గుడ్డిగా మోహితుడవు అవుతావు. లేదా నీవొక సమస్యను పరిష్కరించవలసివచ్చినపుడు, కష్టాన్ని ఎదుర్కోవలసివచ్చినపుడు, పరిష్కారం కనుగొనటంలో, ఒకవైపు మొగ్గుచూపుతావు. ఇది ఎంతమాత్రము ఎంపిక choosing అవదు. చూడు! సత్యము ఎప్పుడూ ప్రశ్నింపబడదు. What the truest thing is, doesn't come into questioning, it is a matter of having a preference. ఈ మాటకి అర్థం నాకు స్పష్టమే. కావాలి అని అనుకోవటం (preference) గుడ్డిగా జరిగేది. ఇదొక ప్రచో దన (an impulse) అసంకల్పచర్య. an attachment మోహం. సాధారణంగా ఇది పట్టినపట్టు వదలదు.

Choice means a decision and an action. ఎంపిక ఒక నిర్ణయం. ఒక చర్య. Preference is a desire. ఇది కావాలని అనుకోవడం, కామన. ఎంపిక చేయబడుతుంది; చేయబడవలె. నిజమైన ఎంపిక పరిణామాల జోలికి పోదు. ఫలితాల నపేక్షిం చదు. నీవు ఎంచుకుంటావు. ఆ నీ ఎంపిక నీ అంతర్గత సత్య మునకు ఉన్నతోన్నత చైతన్యమునకు నిబద్ధమై ఉంటుంది. ఏమి జరిగినా నీకు పట్టదు. ఎంపిక చేశావు. అది సవ్యమైనది. ఫలిత ముతో నీకు సంబంధము ఉండదు. దానికి విరుద్ధంగా నీకు ఇది కావాలనుకుంటే, నీవు మోజుపడి అదో ఇదో ఎన్నుకుంటావు. నీ ఎంపిక వికృతమవుతుంది. అంటే ఇది బేరీజు వేసుకుని బేర

మాడటం. ఇది ఇలా తప్పనిసరిగా జరగాలని దీనిని నీవు prefer చేశావు. అంతేకానిది సక్రమము, సత్యము అని కాదు. కావాలని చేసేది, ఫలితాన్ని దృష్టిలో ఉంచుకుని చేసేది. ఇలా జరగాలని కోరి చేసేది. కోరిక తీర్చుకునేది. అందుచేత ఇది రకరకాలైన అంశాలకి ద్వారాలు తెరుస్తుంది. ఎంపిక ఫలితానికి అతీతం. క్షణక్షణం నీవు ఎంపిక చేసుకోవలసిన ఆవశ్యకత ఉంటూనే ఉంటుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

వికాసశీలమైన పరిపూర్ణతకై నీ కృషి

నీవేపని చేసినా అది ఎంత పరిపూర్ణంగా చేయగలవో అంత పరిపూర్ణంగా చెయ్యి. అదే మనిషిలోని దైవానికి చేసే అత్యుత్తమ సేవ.

*

నీవు చేసే పనిలో పరిపూర్ణత్వాన్ని సాధించటంలో ఏమాత్రం లోటు ఉండకూడదనేది నీ ఆదర్శం కావాలి. అప్పుడే నీవు దైవానికి తప్పక ఉపకరణం కాగలవు.

*

వ్యక్తిగతప్రయోజనము నీ లక్ష్యము కాకూడదు. ఇది మొట్టమొదటి నియమం. ధైర్యం, సాహసం, తదేకదీక్ష ముందుగా కావల్సిన లక్షణాలు.

మరి తర్వాత నీవు తెల్సుకోవల్సిన దానితో పోల్చినపుడు నీకు తెలిసినది ఏమీ కాదు, చేయవలసినదానితో పోల్చుకొంటే నీవు చేయగల్గేది చేస్తున్నట్లే కాదని, అసలు ఎలా ఉండాల్సివుందో దానితో పోల్చుకొంటే ఉంటున్నది, ఉంటున్నట్లే కాదన్న విషయాన్ని సచేతనంగా అవగతం చేసుకొంటూ ఉండాలి.

నీ స్వభావంలో లోపించినదానిని సముపార్జించేందుకు, ఇంకా తెల్సుకోనిదానిని తెల్సుకొనేందుకు, చేయలేకపోయినదానిని చేయగల్గేందుకై దృఢసంకల్పుడవు కావాలి. వ్యక్తి తన సుస్థిర మైన ప్రగతిని శాంతిలోను, ప్రకాశంలోను పొందాలి. ఆ శాంతి ప్రకాశాలు ఏ వ్యక్తిగతమైన కోర్కెలకూ తావీయనప్పుడే అతడి లోకి దిగివస్తాయి.

'ఉత్తమంగా, ఇంకా ఉత్తమంగా.... ముందుకు మున్ముం దుకు... ఇదిగో ఈ భావననే నిత్యకార్యక్రమంగా ఉండాలి.... ఒకే ఒక్క లక్ష్యం దైవాన్ని అభివ్యక్తపర్చే నిమిత్తం దైవాన్ని తెల్సుకో వడం, సాక్షాత్కరింపజేసుకోవడమే ఆ లక్ష్యం.

మూలం: శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

గెలుపుస్థితి

ఆచరణాత్మక సహకారము

నీ నిజమానసిక ఆధ్యాత్మికవాతావరణంలో – నీవు సతతమూ సరైన దృక్పథంలో ఉండడం, మరియు శ్రీమాత శక్తి ద్వారా పని చేయటాని కనుమతించడం – ఇది నీవు తెలుసుకోవాలి.

పనిని గూర్చి శ్రీమాత ప్రోత్సాహాన్ని మరీ ఎక్కువగా ఊహించుకొని – నీ సొంత ఆలోచనలు, ప్రణాళికలు, మాటలు – వీటికే ముందు ప్రాధాన్యతనిస్తున్నావు. – ఇది నేను నీ ఉత్త రాలవల్ల విచారణ చేయగలిగినది. నిజమే – నీ ప్రయత్నం లేకుండానే దివ్యశక్తిసఫలత కాగలదు. కాని పనికి కావల్సింది నీ ప్రయత్నం కాదు – నీ సత్వముయొక్క ఆమోదం.

*

ఔను – యోగంలో ఆలోచన అదే. సరైన సహనంవల్ల తన పరి మిత ఆత్మకంటె ఉన్నతమైనదాంట్లోకి తాను తెరుచుకుంటాడు. ఈ స్థితి పొందడానికే ప్రయత్నం. సాధారణజీవితంలో కూడ

వ్యక్తి, విశ్వశక్తి చేతిలో, ఒక పనిముట్టు మాత్రమే. అయినా, పొందినా ఫలితమంతా అహంకారం తీసుకుంటుంది.

*

ఇంటివద్దనే పనిచేస్తూ, సాధన చేయుటం సాధ్యమే, కచ్చితంగా – చాలమంది అలానే చేస్తారు. ప్రారంభంలో కావల్సిందేమంటే, ఎంత ఎక్కువ వీలైతే అంత ఎక్కువగా, శ్రీమాతను జ్ఞప్తికి తెచ్చుకోవడం.. ప్రతి రోజు కొంతకాలం హృదయంలో ఆమెను నిలుపుకొని ఆమెపై దృష్టి కేంద్రీకరిస్తూ ఆమెను దివ్యమాతగా మననం చేయడం. నీలో అక్కడ ఆమె అనుభూతిని ఆకాంక్షించడం; నీ పనులు ఆమెకు సమర్పించడం; మరియు లోపలినుండే ఆమె నీకు సహకారం, పోషణ అందించుగాక అని ప్రార్థించడం.

ఇది తరచు దీర్ఘకాలం తీసుకునే ఒక ప్రాధమిక దశ. దీని గుండా, మనస్ఫూర్తిగా, చురుకుగాపోతే, బుద్ధిస్వభావం కొద్దికొద్దిగా మార నారంభిస్తుంది. సాధకునిలో ఒక కొత్త చైతన్యం తెరుచుకుంటుంది. ఈ చైతన్యానికి – నీలో శ్రీమాత ఉనికి ప్రకృతిలోను, జీవితంలోను, ఆమె పనితీరు, లేదా, మోక్షం వైపు ద్వారా తెరిచే వేరే ఏదైనా ఆధ్యాత్మిక అనుభవం – వీటియొక్క ఎరుక – క్రమక్రమంగా అధికమవుతుంది.

*

దైవశక్తిని స్వీకరించగల్గుటకు, దానిని బాహ్యజీవితంలో నీ ద్వారా పనిచేయనీయడానికి కావలసిన షరతులు మూడున్నాయి:

1. ప్రశాంతత – సమత: ఏది జరిగినా ఆందోళన చెందక, బుద్ధి నిశ్చలంగా ధృఢంగా ఉంచుకుంటూ తాను ప్రశాంతంగా ఉంటూ శక్తిలీలలను గమనిస్తూండటం

2 పరిపూర్ణ విశ్వాసము.. ఉత్తమమైనదేదో అదే జరుగుననే విశ్వాసం. అంతేకాకుండా, తనను తాను నిజంగా ఒక పనిముట్టుగా తీర్చిదిద్దుకోగల్గితే, కర్తవ్య కర్మగా – దివ్యకాంతి వెలుగులో విధిగా సఫలమవుతుంది.

3 స్వీకరణ సామర్ధ్యం – దివ్యశక్తిని స్వీకరించే సామర్ధ్యం, దాని ఉనికి, దానిలో శ్రీమాత ఉనికి – అనుభూతి పొందడం.. మరియు,

మన దృష్టి, ఇచ్ఛ చర్యలకు సహకరిస్తూ, దానిని పనిచేయనీయడం;

ఈ సామర్థ్యాన్ని, దాని ఉనికిని, అనుభూతిని పొందగల్గితే, – ఈ మృధుస్వభావాన్ని పనిలో చైతన్యపు అలవాటుగా చేస్తే – దివ్యశక్తికి మాత్రమే చెందిన ఈ మృదుస్వభావం, ఏ ఇతర బాహ్యామూలకాన్ని తీసుకురాకుంటే – తద్వారా వచ్చే ఫలితం నిశ్చయంగా ఉంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్.వై. సోమయాజులు

పూర్ణయోగంలో కర్మకు అర్థం

కర్మకు నేను చెప్పే అర్థం అహంకారం, అజ్ఞానంలో చేసేది, అహంకార సంతృప్తికోసం రజోగుణకామనా ప్రవృత్తులు చేసేదీ కాదు. అజ్ఞానముద్రలైన అహంకారం, రజోగుణం కోరిక అనే వాటిని వదిలించుకోవాలనే ఇచ్ఛ లేకుండా కర్మయోగం ఉండబోదు.

కర్మల నిగూఢసత్యాలకు ప్రత్యామ్నాయంగా మానవమనస్సు అనుసరించే దాతృత్వం లేదా మానవసేవ లేదా నైతికపరంగా, ఆదర్శపరంగా ఎంచుకునే తక్కినవేవయినాగాని వాటిని కూడా నేను కర్మలుగా పేర్కొనడం లేదు.

కర్మ అనేది దాని అర్థంలో నేను చేప్పేది దైవం కోసం చేసే పని, ఇంకా ఇంకా దైవంతో అనుసంధానంలో దైవం కోసం మాత్రమే చేసేదేకాని మరొకటి కాదు. సహజంగానే అది మొదట్లో తేలిక కాదు.... కాని... దానిని స్థైన స్ఫూర్తితో, వైఖరితో,. నీలోని స్థైన ఇచ్ఛతో మొదలుపెట్టబడాలి, దాని తర్వాత మిగతాదంతా వస్తుంది.

ఒక వ్యక్తి అనవరతం తన పూర్తి ఇచ్ఛను, కర్మలను దైవానికి నివేదిస్తూ ఉంటే ప్రేమ, భక్తి వృద్ధిపొందుతాయి.. చైత్యపు

రుమడు ముందుకు వస్తాడు. అలా పైనున్న దివ్యశక్తికి నివే దిస్తూ ఉంటే, దానిని మనం అనుభూతి పొందగలుగుతాం. దాని అవరోహణతోపాటు, ఇంకా వృద్ధి అయ్యే చైతన్యజ్ఞానాలకు ఉన్ము ఖులమవగలం. చిట్టచివరగల, కర్మభక్తిజ్ఞానాలు కలిసి నడు స్తాయి. ఆత్మపరిపూర్ణత సాధ్యమవుతుంది. మేము చెప్పే ప్రకృతి పరివర్తన అదే...

ఈ కర్మయోగమే గీతలో పేర్కొనబడింది. దానినే నేను పూర్ణ ఆధ్యాత్మికజీవితానికి అనుగుణంగా తీర్చిదిద్దాను... అది ధ్యానాన్ని బహిష్కరించదు. కచ్చితంగా భక్తి లేకుండా లేదు. ఎందుకంటే దైవానికి తనను తాను సమర్పించుకోవటంలో, తనను తాను పూర్తిగా దైవానికి పవిత్రంగా అర్పించుకోవటం అనేది ఈ కర్మయోగసారం కాబట్టి అది ప్రధానంగా భక్తితో కూడినదే. కాని జీవితంనుంచి తప్పించుకుపోయే ప్రత్యేక ధ్యానాన్ని లేదా ఆవేశపూరితభక్తితో తనను తాను మరచి అంతరంగంలో స్వాప్నికలోకంలో విహరిస్తూ దానినే మొత్తం యోగమార్గంగా అనుకునేదానిని మాత్రమే అది బహిష్కరిస్తుంది. ఒక వ్యక్తి గంట లకొలది విశుద్ధమైన ధ్యానసమాధిని కలిగి ఉండవచ్చు, లేదా అంతరంగంలో కదలికలేని ఆరాధన, పారవశ్యం కలిగి ఉండ వచ్చు. కాని అవే పూర్తి పూర్ణయోగం కావు.

*

సాధకుడు తాను చేసే కర్మను తానే నిర్ధారించుకుని దానిని దైవా నికి అర్పించడమనేది సాధారణ కర్మయోగం కిందికి వస్తుంది. అది అతను తన మానసిక లేదా హృదయపు లేదా ప్రాణికప్రేర ణల వల్ల పొందినా ఒక విశ్వశక్తి ఉందనే అనుభూతిని లేదా ఆ ప్రేరణల వెనక వైశ్వానిక దివ్యశక్తి ఉందనే అనుభూతిని పొందు తాడు. ఆ విధంగా తనలోనూ అందరిలోనూ ఒక విశ్వధ్యేయంతో కర్మలన్నిటి వెనక పనిచేసే ఏకైక దివ్యశక్తిని దర్శించే అభ్యాసం పొందే ప్రయత్నం చేస్తాడు.

ఒకసారి గనుక సూటిగా సమర్పణ అనే ధ్యేయం కలిగితే, అతను సూటిగా తనను కదిలించే లేదా మార్గం చూపించేదాని

కోసం చూడవలసి ఉంటుంది; అందువలననే తన నుంచి, విశ్వ ప్రకృతి నుంచి వచ్చే మానసిక, ప్రాణిక లేదా భౌతికప్రేరణలను చూసి వాటిని తిరస్కరిస్తాడు. సహజంగానే, సమర్పణయొక్క పూర్తి ప్రాముఖ్యత అతను అందుకు తయారుగా ఉన్నప్పుడు మాత్రమే బహిర్గతమవుతుంది.

*

ఒకరెవ్వరైనా తోటిమానవులు దగ్గరగాను, దైవం దూరంగాను ఉన్నట్లు అనుభూతి పొందుతూ, దైవాన్ని సూటిగా దైవసేవ, భక్తి ద్వారా కాక, మానవసేవ ద్వారాను, ప్రేమ ద్వారాను పొందా లనుకుంటే వారు అనుసరించే విధానం తప్పయినది. ఎందువల్ల నంటే అది మానసిక, ప్రాణిక, నైతికసూత్రాలదే అవుతుంది కాని ఆధ్యాత్మికజీవనం కాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ప్రసన్నకృష్ణ

శ్రమలో ఆనందం

నీవు చేసే కర్మలలో ఈ మూడు ఎప్పుడూ ఉంటాయి –యజ మాని, కర్త, ఉపకరణము. వీటి గురించి స్పష్టమైన అవగాహన కలిగి ఉండటమే కర్మయోగరహశ్యం. అదే ఆనందం కూడా.

ముందు నీవు భగవంతుని ఉపకరణమని తెలుసుకో. దైవం నీ యజమానిగా అంగీకరించు. 'నేను' అనుకునే బాహ్యస్వరూ పమే ఉపకరణం. ఇది ఒక మానసిక నమూనా. It is a mould of mind. ప్రచోదనశక్తి. ఎన్నో సాధనములతో, భాగాలతో, బిగింపులతో, కదలికలతో కూడిన యంత్రం. యంత్రం పనివాడు కాదు. యజమానీ కాదు. నిన్ను నీవు ఒక దివ్యోపకరణంగా సగర్వంగా, సంతోషంగా, సవిధేయంగా, సవినయంగా అంగీకరించు. పరిపూర్ణమైన దైవోపకరణంగా భాసించడంకంటె ఉత్కృష్టవైభవ మేముంటుంది!

ముందు పరిపూర్ణమైన విధేయత నలవర్చుకో. కత్తి తానెక్కడ వేటువేయాలో ముందు నిర్ణయించుకోదు. బాణం నా గురి ఎక్కడని అడగదు. యాంత్రికశక్తి తానుత్పత్తి చేయవలసిన వస్తు సముదాయాన్ని ముందు నిర్ణయించదు. వీటికి స్వీయప్రాకృతిక ధర్మాలు, లక్షణాలు ఉంటవి. వీటి కనుగుణంగా వీటి కర్మలు నిశ్చయింపబడుతవి. ఉపకరణం సచేతనమై స్వచ్ఛమైన స్వీయ ప్రాకృతిక ధర్మాలకు విధేయంగా కర్మాచరణ కావించనపుడు అది పరిపూర్ణంగా లోపరహితంగా భాసిస్తుంది. చికాకుతో కూడిన ప్రేరణశక్తితో అహంకారయుతంగా భౌతికమానసిక ఉపకరణాల తిరుగుబాటుతో చేసే కర్మలు భ్రష్టమవుతాయి.

దైవమే ఊపిరిగా కొనసాగిపో. తుఫానులో చిక్కుపడిన ఆకువై ఉండు. దెబ్బకొట్టే కరవాలమై, లక్ష్యాన్ని ఛేదించే బాణమై దూసుకుపో. నీకు నీవుగా సర్వేశ్వరుని హస్తాలలో సమర్పణగా ఒదిగిపో. నీ బుద్ధినియంత్రంలోని ఉత్పాదకశక్తిగా పనిచేయనీ. నీలోని తీవ్రత వేగవంతమైన ముసలకం కానీ. ఉక్కును సాన బట్టి ఆకృతి కల్పించటానికి కదిలించే పని నీది. అలానే ఉండు. స్వర్ణకారునివలె, యంత్రఘోషవలె, దైవశక్తిని ప్రకటీకృతం చేసేందుకు బాకాధ్వనివలె నీ వాక్కు ప్రాంతమంతటా విస్తృతం కానీ. నీకు స్వాభావికమైనది, స్వధర్మమైనది అయినదానిని నిర్వహించే ఉపకరణంగా వర్తించు.

కత్తికి కదనలీల ఆనందం. బుసకొడుతూ లక్ష్యదిశగా దూసుకుపోవటం బాణానికి ఆనందం. శూన్యంలో అమిత ఆనందపారవశ్యంలో భూమి పరిభ్రమిస్తుంది. ఉజ్వలవైభవోపేతంగా ఠీవిగా బ్రహ్మాండంగా పారవశ్యంతో సూర్యుడు వెలుగొందుతాడు. ఆత్మచైతన్యంతో కూడిన దివ్యోపకరణానివి నీవు. నీ కర్తవ్య నిర్వహణంలో నీవెంత హర్షాతిరేకంతో పులకించిపోవలె!

కత్తి తన రూపాన్నది కోరదు. తనను వినియోగించేవారిని తాను నిరోధించదు. తాను ముక్కలైతే విచారపడదు. తానొక రూపుదాల్చి వినియోగపడినందుకు ఆనందిస్తుంది. నిరుపయో

గంగా ప్రక్కని పెట్టబడినా, ముక్కలు కాబడినా పట్టించుకోదు. నీ కర్తవ్యనిర్వహణలో పొందే ఆనందంలో సమతను కనిపెట్టు.

ఉపకరణమును పొరపాటుగా యజమాని అని అనుకుంటున్నావు. ఇది నీ అజ్ఞానం. నీ పరిస్థితికి నీవే బాధ్యుడవు. నీవు కోరుకుంటున్నది ఇది. అలాగే నీ లబ్ధిని, ప్రయోజనాన్ని నీవు కోరుకుంటావు. అందుకే నీకీ వ్యధ, బాధ. పలుమార్లు నరకాగ్నికూపంలో నెట్టబడుతూంటావు. మళ్లీ పుడుతూంటావు. రూపం దాలుస్తూంటావు. ప్రభావితడవు కాబడతావు. మానవీయంగా నీవు యెదిగేవరకు నీకీ పునరపి జననం పునరపి మరణం తప్పదు.

ఇదంతా నీ అపరిపక్వ స్వభావానికి అనుబంధమైనది. దివ్యప్రకృతి కర్త – చేసే పని ఏమిటి? ముడిసరుకు అయిన మనోప్రాణికదేహాలను చైతన్యసత్వముగా మలచటం.

*

ఆ తర్వాతే నీవు దివ్యకర్తవు అని తెలుసుకో. కర్తృత్వం వహించేది నీ ప్రకృతి. నీ స్వీయప్రకృతి, సర్వవిశ్వప్రకృతిలోనిది. సర్వమూ నీవే అని అవగాహన చేసుకో.

ఈ ప్రకృత్యాత్మ (nature-self) నీ స్వంతం కాదు. పరిమితమూ కాదు. సూర్యుడు, సౌరవ్యవస్థలు, భూమి, ఆమె జీవరాసులు, నీవు, నీది సంబంధించిన సర్వము, నీ గ్రహణశక్తి, నీ అనంతప్రకృతియొక్క రూపకల్పనయే. ఇది నీ స్నేహితుడు. నీ శత్రువు. నిన్ను పుట్టించేది. గిట్టించేది. ప్రేమించేది. బాధించేది. నీకు సహోదరాత్మ. నీకు విరుద్ధమైనది. విదేశీయమైనది. నీ ఆనందం. నీ దుఃఖం. నీ పాపం. నీ పుణ్యం. నీ బలం. నీ బలహీనత. నీ జ్ఞానం. నీ అజ్ఞానం. అయినా వీటన్నిటికీ అతీతమైనది. ఇవన్నీ అపరిపూర్ణ ప్రతిరూపాలు, ప్రయత్నాలు. వీటన్నిటికీ అతీతంగా మౌలికంగా ఆత్మజ్ఞానం, అనంతశక్తి మరియు అసంఖ్యాక గుణశ్రేష్ఠ క్రమం ఉన్నవి.

కాని నీలో ఒక ప్రత్యేక గమనమున్నది. క్రమబద్ధమైన ప్రకృతి ఉన్నది. వ్యక్తిగతశక్తి ఉన్నది. అది నిన్ను అపారమైన మూలస్థానమునకు నడిపించేవరకు, -సముద్రమును సంగమించేం

దుకు పరుచుకుంటూ – సాగే నదివలె నీవు సాగిపో. తెలుసుకో. నీ శరీరం (దివ్య) భౌతికపదార్థంలో ఒక చిక్కుముడి. మనసు వైశ్వానికి మనసులో చుట్టు తిరిగుడు. నీ జీవితం ఒక నిరంతర సుడిగుండం. నీ శక్తి, సర్వసత్తాశక్తి, నీ జ్ఞానం ఒక అస్పష్టమైన వెలుగు. అది దివ్యకాంతికి చెందినది. అది ఏ ఒక్కరికీ చెందనిది. నీ కర్తవ్యకర్మలు నీకొరకే చేయబడేవి. నీ అనియమిత వ్యక్తిత్వం నుంచి ప్రభవింపబడేవి.

అలా జరిగినపుడు నీ నిజసత్వంలో నీవు స్వేచ్ఛాయుత ఆనందాన్ని పొందుతావు. నీ బల, వైభవ, సౌందర్య, జ్ఞానాల లోనూ అలాగే ఉంటావు. వీటిని తిరస్కరించవలసివచ్చినా నీకు ఆనందమే. ఎందుచేతనంటే ఇదంతా పురుషోత్తముడు నాటకీయంగా వేసుకునే మేల్ముసుగు. దివ్యశిల్పి పరమాత్మ – యొక్క ప్రతిరూపం జీవాత్మ.

నిన్ను నీవెందుకు పరిమితం చేసుకుంటావు? నిన్ను ఛేదించే కరవాలంలోను, కౌగిలించుకునే బాహువులలోను నిన్ను సంభావించుకో. అలాగే మండేసూర్యునిలో, భూమినృత్యాహేలలో, గరుడపక్షి ఆకాశగమనంలో, కోవెలపాటలో; భూతభవిష్యద్వర్తమానాలన్నిటా, నేను ఉన్నానని భావించు. నీవు అనంతుడవు. ఈ ఆనందమంతా నీదేకాగల అవకాశమున్నది.

దివ్యప్రేమికురాలు తన ప్రేమికునికై చేసే పనులలో దివ్యానందం పొందుతుంది. సర్వేశ్వరుని దివ్యచేతన ఆమె. ఆయన శక్తి, జ్ఞానము ఆమెయే. ఏకత్వము, అనేకత్వము కూడా. పరిమితత్వము, అపరిమితత్వము కూడా – ఇవన్నీ నీవేనని తెలుసుకో. దివ్యప్రేమికుని దివ్యానందమూ నీవే.

కొంతమంది ఉంటారు. తమను తామొక కర్మాగారంగానో, ఉపకరణంగానో, పనిచేసే వస్తువుగానో భావిస్తారు. కర్తను యజమానిగా పొరబడతారు. ఇది తప్పు. ఆమె స్వచ్ఛ ఉన్నత పరిపూర్ణ క్రియాస్థాయికి ఈ పొరపాటువల్ల యెదగలేరు.

వ్యక్తి రూపుదాల్చిన ఉపకరణం. అశాశ్వతం. అయితే కర్తృత్వధోరణిలో ఉండే కర్త శాశ్వతం. అయితే వీరిద్దరిలో ఏ

ఒక్కరూ యజమాని కాదు. ఎందుకంటే ఏ ఒక్కరూ (దివ్య) పురుషుడు కాదు కాబట్టి.

*

చివరకు మాత్రం నీవే యజమానివి. తెలుసుకో. కాని జీవాత్మకు రూపాన్ని ఆపాదించకు. గుణాత్మకంగా నిర్వచనం అన్వేషించకు. నీ సత్వంలోని 'తత్' (That) తో ఏకమవు. నీ చైతన్యంలోని 'తత్' తో ఆంతరంగికంగా మాట్లాడు. Obey that in thy force. 'తత్' కి నిధేయంగా ఉండు. దానికే అధీనమై ఉండు. దాని పరిష్వంగంలో ఆనందం పొందు. శారీరక, మానసిక, ప్రాణికములలో 'తత్' ను సఫలం చేసుకో. నీ లోపలి అంతర్ చక్షువు తెరుచుకునేలోగా. ఆ ఏకైక దివ్యసత్యపురుషుడు ఆవిష్కరింపబడతాడు. నీ జీవాత్మతోబాటు, నీ కర్మల కధిష్ఠానదైవము, దివ్యోపభోగి, కర్తృత్వానికి, ఉపకరణానికి దివ్యయజమాని, మహోత్సాహి, విశ్వతాండవ నృత్యంలో రుద్రుడు బహిర్గతమవుతాడు. ఆ తర్వాత నీ నిశ్శబ్ద ఆత్మాంతరంగంలో సద్దుచేయక నీతో ఉండే ఏకైకుడు ఆయన.

దివ్యయజమానిని పొందిన ఆనందం నీకు దక్కినపుడు నీవిక పొందవల్సినదేముంటుంది! నీకు ఆయన వశమై ఉంటాడు. అపుడు నీకు ఆయన సర్వము ఇస్తాడు. తాదాత్మ్యతా భావం నీకు కలుగచేస్తాడు.

సర్వేతరులూ, నీ తోటే, నీలో ఉంటారు. నీకు, ఇతరులకీ అతీతంగా నీవు ఉంటావు. కర్మయోగంలో ఇదే పరాకాష్ఠ.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం:: కర్రా వెంకటేశ్వర్లు

దివ్యకర్త

సమచిత్తంలో నేనెదుర్కొంటాను పృథ్వీసంఘటనలను;
అందరిలో నీ పదధ్వనులు వినబడతాయి. కంటపడని
నీ అడుగులు నా ముందున్న దైవీమార్గాన నడుస్తాయి. పరిపూ
ర్ణమై
ముగిసిన అద్భుతావహ జీవిత చింతనాత్మక తత్వమీవు.

ఏ ప్రమాదమూ నా ఆత్మశాంతిని కలవరపర్చలేదు:
నీవే నా కర్మలన్నీ; నీ పనులు చేస్తాను వైదొలగుతాను;
అపజయం ఊయలలూగుతుంది నీ అమృతహస్తాలలో
విజయం అదృష్టదేవత అద్దంలో ప్రతిబింబించి నిష్క్రమించే నీ
ప్రతిరూపం

మనిషి విధితో చేసే మొరటుపోరాటంలో నా బలం హృదయం
లోని నీ మందహాసం;
శ్రమించేది నాలోని శక్తి ఆర్భాటంతో కూడిన ప్రణాళికపట్ల,
ఉదాసీనంగా ఉంటుంది ముందుకుసాగే సుదీర్ఘకాల సర్పం పట్ల,

ఏ శక్తీ నీలో వశించి ఉన్న నా ఆత్మను నాశనం చేయలేదు.
నీ అస్తిత్వము నాకు అమృతత్వము.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నీవు కర్మయోగివి కాదల్చుకుంటే

నీవు చేసే పనులు దివ్యంగా భాసించాలంటే నీవు కోర్కెలకు అతీతంగా ఉండాలి. నిరహంకారివి కావాలి. జీవితమంతా సర్వో న్నతునికి సమర్పితం కావాలి. సేవించటానికి, స్వీకరించటానికి, నెరవేర్చటానికి, పరిణతి పొందటానికి దివ్యశక్తి కార్యక్రమంలో ఉపకరణంగా అభివ్యక్తం కావటమే నీ లక్ష్యం కావాలి. దివ్య చేతనలో నీవు యెదగాలి. ఆమె ఇచ్ఛయే నీ ఇచ్ఛ కావాలి. నీలో ఆమె ప్రచోదనే తప్ప నీ ప్రేరణ అనేది ఉండకూడదు. ఆమె చైతన్యంలోనే ప్రతి కర్మా అనుష్ఠింపబడాలి తప్ప నీ ప్రయోజ కత్వం వలన కాకూడదు.

గమనసీలంగా తాదాత్మ్యతా భావం పొందగలిగే వరకు నీ సర్వకర్మలు ఆమె కొరకు ఆమె సేవగా సమర్పణ కావించు కునేందుకు సృష్టింపబడినవాడివిగా భావించు. ప్రత్యేక కర్తృత్వ భావం బలంగా నీలో ఉన్నా, నేనే చేస్తున్నానని నీవు అను కున్నా, ఆమె కోసమే సర్వకర్మలు నిర్వహింపబడాలి. స్వప్రయో జనములపట్ల, అత్యాశ, స్వార్ధబుద్ధి, అహంకారయుతంగా నాకిది కావాలని కోరుకోవటం – ఇవన్నీ నీ స్వభావం నుంచి పెకి లించివేయబడాలి. ప్రతిఫలాపేక్ష ఉండకూడదు. నీవు కోరవ ల్సిన ఫలితం దివ్యమాతయొక్క సాధనలో ఆమె సంతృప్తియే. కర్మ ఆచరణ ద్వారా అంతరంగ పురోగతి. నిస్వార్ధంగా కర్మా చరణ నాచరించే నీకిదే పారితోషికం. నీవు కేవలం ఉపకరణమే కాని కర్తవు కావు అనే భావన అంతకంతకు నీలో కలుగుతుంది. ఎందుకంటే నీ భక్తి భావనాబలంతో నీ సంసర్గం దగ్గరవుతుంది. అందుచేత సర్వవేళలా ఏకాగ్రచిత్తుడవు కాగలుగుతావు. ఆమెకు సమర్పితుడవు ఆవుతావు. ఆమె మార్గదర్శకత్వం నీకు ఉంటుంది. చేయవల్సిన కర్మ, అందుకు మార్గము, ఫలితము నీకు లభి స్తాయి. దివ్యశక్తి నిన్ను ప్రోత్సహించి నిర్దేశిస్తుంది. అంతేకాదు. నీ కర్మలన్నిటినీ నీచే ప్రారంభింపజేసి, కొనసాగింపచేస్తుంది. నీలో ప్రతి కదలిక ఆమెనుంచే ఉత్పన్నమవుతుంది. నీ శక్తు

లన్నీ ఆమెవే. నీ మనోప్రాణికశరీరాలు ఆమె చైతన్యంతో ఆహ్లా దకర కర్మోపకరణాలుగా, లీలాసాధనాలుగా, భౌతికవిశ్వంలో ఆమెయొక్క అభివ్యక్తీకరణ సూచికలుగా భాసిస్తాయి. ఈ సంయో గము, పారతంత్ర్యతాభావనకు మించిన హర్షాతిరేకస్థితి ఉండదు. ఈ పరిణామచర్యలు నిన్ను నీ జీవనక్లేశము, ఒత్తిడి, అజ్ఞానంలో పడే వ్యధలకు సంబంధించిన సరిహద్దును దాటించి ఆధ్యాత్మిక సత్వము, లోతైన ప్రశాంతతలతో కూడిన అత్యధిక దివ్యానంద ములోనికి మరల్చి తీసుకుపోతవి.

ఈ రూపాంతరీకరణము జరిగేటపుడు అహంకారయుత మాలిన్యాలకు, వికారాలకు ఎప్పుడూ లోబడి ఉండకూడదు. మచ్చలేని స్వచ్ఛమైన ఆత్మార్పణభావం, త్యాగబుద్ధి ఉండాలి. నీలో కోర్కెలు చొరబడకుండా చూసుకోవాలి. చేసే కర్మపైనా, కర్మఫలంపైన వ్యామోహం ఉండకూడదు. షరతులు ఉండకూ డదు. దివ్యశక్తికే వశమై నీవు ఉండాలి కాని, అది నీకు స్వాధీ నమై, దానికి నీవు హక్కుదారుడవు కావాలని అనుకోకూడదు. గర్వం, ఆడంబరం, అహంభావం ఉండకూడదు. నీ మనో, ప్రాణిక, శారీరకశక్తులు ప్రత్యేకంగా నీ వ్యక్తిగత సంతృప్తికోసం ప్రవర్తిం చేవిగా దిగజారకూడదు. అలాగైతే నీ ద్వారా ప్రవర్తించే ఉన్నత శక్తులు వాటి ఔన్నత్యాన్ని కోల్పోతాయి. నీ నమ్మకము, చిత్త శుద్ధి, స్వచ్ఛమైన నీ ఆకాంక్ష పరిపూర్ణంగా ఉండాలి. అవి నీ సత్వములో సర్వత్రా అన్ని స్తరములలోను, భాగాలలోను, పరి వ్యాప్తమై ఉండాలి. అపుడు నీలో ఉండే వక్రత, వ్యాకులత క్రమక్రమంగా సమూలంగా నీ నుంచి జారుకుంటవి.

నీవు శ్రీమాతతో పూర్తిగా తాదాత్మ్యం పొందుతావు. నీ పరిపూర్ణతకు నీకిదే పరాకాష్ఠ. నీవు పరాయివానిగా భావించవు. వేర్పాటు సత్వము ఉండదు. నీవు ఉపకరణమని అనుకోవు. కర్తృత్వభావన కూడా ఉండదు. శ్రీమాత బిడ్డవై ఆమె నిత్యచైత న్యశక్తిలో భాగస్వామివై ఉంటావు. ఆమెలో నీవు, నీలో ఆమెగా ఎప్పుడూ ఉంటావు. నీయొక్క ఆలోచన, దృష్టి, చర్య, ఊపిరి, ప్రతి కదలిక ఆమెనుంచి, ఆమెదే అనే సహజసాధారణ అనుభూ

తితోనే నీవెప్పుడూ ఉంటావు. ఆమె నుంచి, ఆమెచేత రూపొం దింపబడినవాడవని తెలుసుకుంటావు, భావిస్తావు. దర్శిస్తావు. ఆమె క్రీడావినోదంలో నియోగింపబడినవాడవై సురక్షితంగా ఉంటావు. ఆమె చైతన్యంలో చైతన్యమై, శక్తిలో శక్తివై, సత్వ ములో సత్వమై ఆనందంలో ఆనందమై ఉంటావు. ఈ పరిస్థితి పరిపూర్ణమై, ఆమెయొక్క అతిమానసశక్తులు నిన్ను నిరాటంకంగా కదిలిస్తూన్నప్పుడు నీవు దివ్యకార్యక్రమములలో పరిపూర్ణత సాధిస్తావు. ఇచ్ఛ, జ్ఞాన, కర్మలు, సాధారణము, ప్రకాశవంతము, సహజసిద్ధము, లోపరహితములు – అయి, పరమోన్నతుని నుంచి పొంగిపొరలివచ్చే దివ్యశాశ్వత చలితచాలనములై ప్రకాశిస్తవి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఆశ్రమంలోను, కేంద్రాలలోను చేసే పని

ఒక సందర్శకునికి

నీవు వ్రాసినదానినిబట్టి చూస్తే ఇక్కడ చేసే పని గురించి నీకు సరియైన అవగాహన లేనట్లు తెలుస్తోంది. ఆశ్రమంలో పని అంటే మానవసేవ కాదు. ఉల్లాసభరితమైన సాంఘికజీవనమూ కాదు. ప్రాణికస్థాయిలో కొందరు లేక అందరు కలసిమెలసి పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటమూ కాదు. పని అంటే దేవతార్చనగా చేసేది. అంతరంగంలో దైవానికి తెరుచుకుని ఉండటానికి తగిన కర్మ క్షేత్రం. సాధారణ ప్రాణికచలితచాలనాలను నిరాకరిస్తూ, నిరం హంకారంగా, దైవానికి మాత్రమే దాసోహమై ఉండటం. నిస్వా ర్థము, విధేయత కలిగి ఉండటం. ప్రాణికమానసికస్థాయిలలో పరిమితవ్యక్తిత్వంయొక్క పట్టుసాధించాలనే ధోరణిని త్యజించటం. చైత్యపురుష ఉన్నతికి శిక్షణ పొందటం. తను పట్టినపట్టు నెగ్గిం చుకోవాలనేది లక్ష్యం కాదు. సామూహికంగా ప్రాణికస్థాయిలో అహం రూపొందించటం కూడా లక్ష్యం కాదు. అల్పమైన అహాన్ని

దైవంతో విలీనం చేసి, పరిశుద్ధత, అర్పణ కలిగి ఉండటం. వ్యక్తిగత అజ్ఞానభావావేశాలు ఆధారంగా తనను తానే నిర్దేశించుకునే బదులు ప్రత్యామ్నాయంగా స్వీయ ఇచ్ఛను దైవేచ్ఛకి అర్పించి దైవనిర్దేశకత్వానికి వశమై ఉండటమే కర్మయోగానికి లక్ష్యం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సమాచారపత్రం

డిశంబరు 5, 1950 ఉదయం గం 1.26 ని.లకు శ్రీఅరవిందులు దేహాంచాలించారు. డా॥ ప్రభాత్ సన్యాల్‌ను నవంబరు 29, 1950 న టెలిగ్రాం ఇచ్చి రప్పించడం జరిగింది. శ్రీఅరవిందులు దేహ పరిత్యాగానికి మూగసాక్షి ఆయన. వారు తమ నోట్సులో ఇలా వ్రాశారు.

డిశంబరు 6 – తెల్లవారకముందే శ్రీఅరవిందుల గదిలోనికి అడుగుపెట్టాను. శ్రీమాత, నేను వారిని దర్శించాం. ఏమి ఆశ్చర్యం! బంగారువన్నెలో వారెంత సుందరంగా అగుపిస్తునారు! నేను చదువుకున్న (వైద్య) శాస్త్రవిజ్ఞానం ప్రకారం కనిపించవలసిన మృత్యుచిహ్నాలు ఎక్కడా కనిపడడం లేదు. ఏమాత్రం వన్నె తగ్గటం, లేదా వాడిపోవడంలాటి చిహ్నాలు ఎక్కడా లేవు. వినీ వినపడనట్లుగా శ్రీమాత అన్నారు – "అతిమానసదివ్యతేజము నిష్క్రమించేవరకు శరీరం సుష్కించే చిహ్నాలు ఉండవు. ఇలా ఒకటి రెండు రోజులు, లేదా, ఎన్ని రోజులైనా ఉండవచ్చు." నేను ఆమె చెవిలో నెమ్మదిగా అన్నాను – "మీరు చెప్పిన తేజస్సు ఎక్కడమ్మా? నేను చూడలేనా?" అని శ్రీమాత పాదాలచెంత, శ్రీఅరవిందులు శయనించిన చోటు దగ్గర మోకరిల్లాను. శ్రీమాత చిరునవ్వు నవ్వారు. అపరిమితమైన అనురాగంతో నా శిరస్సుపై ఆమె హస్తాన్ని ఉంచారు. ఆ! ఆయన అక్కడ ఉన్నారు – చుట్టూ బంగారు నీలంపుఛాయ ఆచ్ఛాదనంలో!

సూర్యోదయం అవుతూంటే దివ్యప్రభువు చివరి దర్శనం కోసం ప్రజలు బారులు తీర్చి ఉన్నారు. శ్రీమాత నాతో అన్నారు – ప్రపంచానికి వారెంత అద్భుతమైన పరిత్యాగం చేశారో ప్రజలకు తెలియదు. దాదాపు ఒక సంవత్సరంక్రితం మాటల సందర్భంగా దేహాన్ని విడిచిపెట్టాలనుకుంటున్నాను అన్నాను. ఆయన అందుకు చాలా దృఢంగా అన్నారు – కాదు. "అలా ఎన్నటికీ జరగటానికి వీలేదు. అవసరమైతే, ఈ రూపాంతరీకరణ కోసం నేను గతించవచ్చు. అతిమానస అవరోహణ మరియు రూపాంతరీకరణ యోగసిద్ధి, నీవల్ల నిర్వర్తింపబడాలి."

శ్రీఅరవిందుల సమాధి మీద రాతిఫలకంపై చెక్కబడిన మాటలతో శ్రీమాత మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నారు:

"మీకు, భౌతిక ఆచ్ఛాదనలో ఉంటూన్న మా దివ్యప్రభువైన మీకు, మా అంతులేని కృతజ్ఞత. మా కోసం ఎంతో చేసి, పనిచేసి, పోరాడి, బాధపడి, ఆశించి, ఎంతో ఓర్చుకొని, మాకోసం అంతాసంకల్పించి, ప్రయత్నించి, సంసిద్ధులై సాధించిన మీకు మీముందు తలవంచి వేడుకుంటున్నాం. – ఎంతగా మీకు ఋణపడి ఉన్నామో, ఒక్క క్షణం కూడా ఎన్నడూ మరిచిపోలేం."

డిశంబరు 9 న ఆశ్రమప్రాంగణంలో శ్రీఅరవిందుల భౌతిక కాయం సమాధి కావింపబడింది. ఈ రెండు రోజులూ, భారతదేశంలో, దేశాంతరాలలో ఉన్న శ్రీఅరవింద కేంద్రాలు, బ్రాంచీలు వర్ధంతి దినములుగా పాటిస్తారు.

*

నూరేళ్ల క్రితం, జాతీయ కాంగ్రెసు సభ డిశంబరు 26, 1907 న సూరతులో (గుజరాతు) జరిగింది. అంతకు ముందు 1906 లో కాంగ్రెసు సభ కలకత్తాలో జరిగింది. జాతీయవాదులు, మితవాదులు కలిసి ఏకగ్రీవంగా స్వరాజ్యం లక్ష్యంగా తీర్మానించారు. ఇంకా కొన్ని అంశాలపై – స్వదేశీ, బహిష్కరణ, జాతీయవిద్య – తీర్మానాలు చేశారు. అయితే సూరతు కాంగ్రెసు (1907) లో మితవాదులు, రాజకీయ సిద్ధాంతాలు, పద్ధతులకు సంబంధించి పాతవైఖరినే అనుసరించాలనుకున్నారు. (ప్రార్థన, అభ్యర్థన, అసమ్మతి)

చివరికి కాంగ్రెసు ముక్కలైంది. ఆ సంఘటన భారత్ స్వాతంత్ర్య పురోగమనాన్ని మౌలికంగా మార్చివేసింది.

The Daily News (London) పత్రికా విలేఖరి, రచయిత, (Henry W Nevison, తన రెండో రోజు రిపోర్టులో అంటాడు – అకస్మాత్తుగా పైకి గాలిలో ఏదో ఎగిరింది. ఒక చెప్పు (shoe) భారతజాతీయ కాంగ్రెసు గందరగోళం మధ్య విడిపోయిన దృశ్యం నాకంట పడింది. Valmy యుద్ధానంతరం జర్మనుకవి Goethe అన్న మాటలు నేనూ అనగలను – "ఈ రోజు ఒక కొత్త శకానికి నాంది పలికింది. దానికి నీవు సాక్షివి."

నిజానికిది ఒక నూతన శకానికి ఆరంభం అయింది. రెండవ రోజు సమావేశాలు రెండూ వేర్వేరుగా జరిగాయి. జాతీయవాదులు వాళ్ల సమావేశాన్ని ఒక విస్తృత ప్రాంగణంలో నిర్వహించుకున్నారు. Nevinson పరిశీలించి చెప్పిన మాటలు – గంభీరంగా, నిశ్శబ్దంగా. ఒక్క మాటకూడా మాట్లాడకుండా, Mr. అరవింద ఘోష్, నిశ్చలంగా, భవిష్యత్తును దర్శిస్తూన్నట్లు ఎక్కడికో చూస్తూ అధ్యక్షస్థానంలో కూర్చుని ఉన్నారు. వాగ్ధాటి, గాఢావేశం లేకుండా నెమ్మదిగా చిన్నవాక్యాలలో తిలక్ మాట్లాడారు. ఇంతలో చీకట్లు ముసురుకున్నాయి. దీపం వెలిగించి ప్రక్కన పెట్టారు ఎవరో"

అవును. పూర్ణస్వరాజ్యమే భారతరాజకీయ ప్రేరణ కావాలని బాహాటంగా ప్రకటించిన ప్రప్రథమ నాయకుడు శ్రీఅరవిందులు. చాలాకాలం తర్వాత ఒక అనుయాయి అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రీఅరవిందులు అన్నారు – తెర వెనుక నుండి తీసుకున్న నిశ్చయాత్మక నిర్ణయాలు గురించి చాలా అరుదుగా చరిత్ర నమోదు చేస్తుంది. తెర ముందు బాహాటంగా కనపడిన వాటినే అది గుర్తిస్తుంది. కొత్త తరహా మితవాద సమావేశానికి హాజరవటానికి నిరాకరించిన కాంగ్రెసు చీలిపోవటానికి దారి తీసిన ఉత్తరవులు ఇచ్చినది (తిలక్‌తో సంప్రదించకుండా) నేనేనని చాలా తక్కువమందికి తెలుసు. ఈ రెండూ సూరతులో జరిగిన ప్రముఖ సంఘటనలు.

కాంగ్రెసు ప్రతినిధులతో (Nevinson) కూడా రైల్లో తిరుగుప్రయాణం చేశారు. ప్రతి స్టేషను, Down with the Moderate Leaders నినాదంతో మారుమ్రోగినట్లు ఆయన record చేశారు. నవయుగ వైతాళికులుగా శ్రీఅరవిందు. తిలక్‌లు ప్రశంసింపబడినారు. వారు అందించిన ఆదర్శారు దేశం కోసం ఎంతకైనా తెగించి పోరాడవల్సినవే. యువ అరవిందుడు ప్రజలకి ఆకర్షణీయుడు, ఆరాధనీయుడు అయినాడు. శ్రీఅరవిందులు అందుకున్నన్ని సన్మానాలు చరిత్రలో మరెవ్వరైనా అందుకున్నారా. అసలు వారికి అలాటిది ఎప్పుడైనా తెలుసా అనేది సందేహామే. ఒక సంవత్సరం తర్వాత ఆలీపూరు విచారణ సందర్భంగా సాక్షులుగా వచ్చిన పోలీసులు, శ్రీఅరవిందుల వాహనాన్ని వారి అభిమానులు ఎలా ముందుకు లాగుకొని తీసుకునివెళ్లారో వర్ణించి చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది Norton శ్రీఅరవిందులకు వ్యతిరేకంగా తీర్పుకావాలని కోరుకున్నాయన చెప్పేరు. – అరబిందు ఎక్కడికి వెడితే అక్కడ ఒక రాజ్యాధిపతి పొందే గౌరవాన్ని పొందారు. నిజానికీయన ఒక్క వంగదేశానికే నాయకుడుకాక, యావద్భారతదేశ నాయకుడుగా పరిగణింపబడినారు.

(ఆధారం: శ్రీ మనోజ్‌దాస్ రచన – "Sri Aurobindo in the Firsr Decade of the 20th Century". ఇది అత్యంత విలువైన మొట్టమొదటి పరిశోధనాత్మక రచన. మరి కొన్ని విషయాలు తెలుసుకోకోరేవారు ఈ గ్రంధాన్ని సంద్రించగలరు.)

– సంపాదకుడు

*

(శ్రీఅరవిందులు. తమ "వందేమాతరం" పత్రిక, 13-12-1907 సంచికలో సూరతు సమావేశ ప్రాముఖ్యతను గురించి ఇలా ప్రస్తావించారు. కొన్ని భాగాలు.)

(జాతీయవాదులు) సూరత్ తప్పనిసరిగా అత్యధిక సంఖ్యలో వెళ్లాలి. కాంగ్రెసుపై పూర్తి ఆధిపత్యం పొందలేకపోవచ్చు. సర్. పిరోజ్‌షా మెహతా భారతదేశంలో ఏ మూల ఎక్కడ ఎంత దూరంలో తలదాచుకోటానికి పోయినా జాతీయవాదుల

ఉనికి నుంచి తప్పించుకోలేరు... కష్టాలు తుడిచేయటానికి, భారతీయ నిఘంటువు నుంచి, అసాధ్యము అనేమాట కొట్టివేయటానికి మన పార్టీ పైకి లేచింది... మాతృభూమి పట్ల మనకు ఉన్న ప్రేమయే మన సంపదగా, లక్ష్యసాధకులుగా మనం వెళ్లాలి – 1907 సంవత్సరం మన భవితవ్యానికి ఒక మలుపు. ఇది నిశ్చయం. గత సమావేశాల లాటిది కాదు సూరతు సమావేశం. హాజరు కాకపోతే మనం ఒక అవకాశాన్ని కోల్పోయే వాళ్లమని భయపడాలి. అమ్మ భవిష్యదావాసానికి స్వరాజ్య సౌధనిర్మాణంలో ఒక పునాదిరాయి వేసే అవకాశం కోల్పోయేవాళ్లం.

– సంపాదకుడు

నవంబరు సంచికకు సవరణ

1. పేజీ 24 .. లైను 15 'సత్యము' బదులుగా – 'సత్వము' – అని ఉండాలి.

2. పేజీ 33 – శీర్షిక – ఈ రూపాంతరీకరణం దిగి భువి చెల్లించే బాకీ బదులుగా – ఈ రూపాంతరీకరణం దివికి భువి చెల్లించే బాకీ – అని ఉండాలి.

సంపాదకుడు